ఈనాడు

విజయవాడ 15-11-2025 శనివారం సిటీ సంపుటి 52 . సంచిక 95

THE LARGEST CIRCULATED TELUGU DAILY

రూ. 6-50 పేజీలు 18

www.eenadu.net

Vijayawada, Visakhapatnam, Hyderabad, Tirupati, Ananthapuramu, Karimnagar, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru



ఈతరం

youthpage@eenadu.in

ఏది టాక్సిక్?

కొంచెం కూడా ఖాళీ లేకుండా గాలి ఊదిన బెలూన్ ఎప్పుడు పేలిపోతుందో తెలీదు.

కొంచెమైనా స్పేస్ లేని అనుబంధాలూ ఇలాంటి బెలూన్ లాంటివే..

పరస్పర నమ్మకం, గౌరవం లేక ఎప్పుడు గాడితప్పుతాయో తెలీదు!

రిలేషన్‌షిప్‌లో ఉన్న వ్యక్తుల ప్రవర్తన ఇందుకు కారణమవుతుంది.

ఎదుటివారిని ఇబ్బంది పెట్టే బిహేవియర్‌ను టాక్సిక్ అంటున్నాం.

మరి మన రిలేషన్‌లో మనం బాగానే ఉన్నామా..
టాక్సిక్‌గా ప్రవర్తిస్తున్నామా..
ఓసారి చెక్ చేసుకుందామా..?

ఇటీవల విడుదలైన 'ది గర్ల్‌ఫ్రెండ్' సినిమాతో టాక్సిక్ రిలేషన్‌షిప్స్ మీద యూత్‌లో ప్రస్తుతం చర్చ జరుగుతోంది. ఏది ఇబ్బందికరమైన ప్రవర్తన, ఎంతవరకూ దాన్ని సహించవచ్చు, ఎలా ఎదుర్కోవాలి, ఎలాంటి సమయంలో బయటకు రావాలి, ఇలా చాలా ఆలోచనలు కుర్రకారు బుర్రలో తిరుగుతున్నాయి. అయితే ప్రతి బంధంలోనూ కొన్ని పరిమితులు ఉంటాయని, అలా అని అవన్నీ టాక్సిక్ కాదని అంటారు సైకాలజిస్ట్ క్రాంతికార్. అలాగే ఎటువంటి కండిషన్లూ లేని ప్రేమను పొందడం కూడా కొంచెం కష్టమే అంటారాయన.



నిజానికి ఇలా టాక్సిక్‌గా ప్రవర్తించే వారు అనుబంధంలో ఎప్పుడూ ఆత్మవిశ్వాసంతో ఉండలేరు. అభద్రతా భావాన్ని ప్రదర్శిస్తూ ఉంటారు. కంట్రోల్ చేయడం, పెత్తనం చెలాయించడం వంటివి చేస్తుంటారు. వీరిలా కావడానికి చిన్నప్పుడు ఎదుర్కొన్న సంఘటనలు, చూసిన మనుషులు, పెరిగిన వాతావరణం కొంతవరకూ కారణమవుతుంది. తక్కువ సెల్ఫ్‌ఎస్టీమ్ కలిగి, ఎమోషన్స్‌ని కంట్రోల్‌లో ఉంచుకోవడంలో ఇబ్బంది పడతారు.



యువతలో..

చిరు అలకలు, కోపతాపాలు అనేవి ప్రేమికులు, యువ జంటల మధ్య అత్యంత సహజం. కానీ వాటిని ఎలా ప్రదర్శిస్తున్నాం అనేది అత్యంత కీలకం. ఏ విషయాన్ని అయినా తెలియజేసే మోటివ్, టోన్ ముఖ్య పాత్ర పోషిస్తాయి. ఒక విషయాన్ని ఎందుకు చెబుతున్నాం, ఎలా చెబుతున్నాం అనే దానిని బట్టే ప్రవర్తనను అంచనా వేసుకోవచ్చు. టాక్సిక్ మనుషులు అవతలి వారిని పూర్తిగా తీసిపడేసినట్టు, వారికేం తెలియదు అన్నట్టు మాట్లాడతారు. వారిని కూడా అలాగే నమ్మిస్తారు. వారిని తమ హక్కులు భావిస్తారు. స్వేచ్ఛ ఇవ్వరు, పూర్తిగా తమపై ఆధారపడేలా చేసుకోవాలని ప్రయత్నిస్తారు. మాట నెగ్గించుకోవడం కోసం ఏడవడం, ఏడిపించడం, సైలెంట్ ట్రీట్‌మెంట్ ఇవ్వడం, తిరస్కరణ అంటే భయపడటం, అసూయ చెందడం, ఫోన్లు చెక్ చేయడం, ట్రాక్ చేయడం వంటివి సాధారణమైపోతుంది.

అందరూ..

వాస్తవానికి ప్రేమానుబంధంలో ఒకరిపై ఒకరికి హక్కు, బాధ్యతలు ఉంటాయి. ఒకప్పుడు వరకూ అందరూ ఎప్పుడు స్నాప్, ఎవరితో ఉన్నావ్ వంటి విషయాలు అడుగుతూ ఉంటారు. ప్రేమ కొద్దీ, గౌరవప్రదంగా అడిగి తెలుసుకోవడంలో తప్పులేదు. కానీ కావాలని నిఘా పెట్టడం మాత్రం సరికాదు. అడిగే విధానంలోనే అంతా ఉంటుంది అంటారు నిపుణులు. ప్రేమతో కూడిన ప్రశ్నల్లో, గౌరవానికి భంగం కలిగించని వాటితో ఇబ్బంది లేదు. కానీ మన ప్రవర్తన ఎదుటివారిని ఇబ్బంది పెడుతుందంటే, వారి మనసు బాధ పడుతుందంటే అని తెలిసీ మార్చుకోకపోవడం తప్పు.

ఎలా మార్చుకోవాలి?

- ఎదుటి వారి మానసిక, శారీరక పరిమితులను గౌరవించాలి.
- పొరపు ఉన్నా దానికి హద్దులు ఉండాలి.
- విషయం చెప్పడం కోసం అరుపులు, కేకలు, హింసను ఆశ్రయించకూడదు.
- మనోభావాలు పంచుకోవాలి కానీ.. మాట్లాడకుండా అవతలి వారిని ఇబ్బంది పెట్టకూడదు.

ఎదుటివారు ఏదైనా చెప్తే కూడదు అనుకుంటే.. మౌనంగా ఉండే స్వేచ్ఛ ఇవ్వగలగాలి.

బయటపడటమెలా..

- టాక్సిక్ బిహేవియర్ ఉన్నవారిని ఎదుర్కోవడంలో 'నో' చెప్పడం నేర్చుకోవడం మొదటి పాఠం. మొహమాటాన్ని వీడాలి.
- లోలోపల కుమిలిపోకూడదు. ప్రతి సమస్యకూ పరిష్కారం ఉంటుందనే విషయాన్ని నమ్మాలి.
- మాట్లాడేటప్పుడు స్థిరంగా, నెమ్మదిగా చెప్పాలి. అవతలివారిని రెచ్చగొట్టేలా ఉండకూడదు.
- వారి ప్రవర్తనను అంచనా వేయాలి. దాన్ని బట్టి విషయాన్ని ఎలా తెలియజేయాలనే ఆలోచన ఉండాలి.
- అవసరం అయితే కౌన్సెలింగ్ ఇప్పించాలి.

ఒక రిలేషన్‌షిప్‌లో ఎంట్రీ, ఎగ్జిట్ రెండూ మన చేతుల్లోనే ఉండాలి. ఆ ఎమోషనల్ కంట్రోల్ మనపై మనకు రావాలి. మనమూ టాక్సిక్‌గా బిహేవ్ చేయకూడదు, వేరే వాళ్లు చేస్తున్నప్పుడు భరించాల్సిన అవసరం లేదు. మొత్తానికి ఇదీ మ్యాటర్!

జీతం పడ్డాక..



ఉద్యోగం చేసే కుర్రాళ్లకు జీతం పడితే చాలు.. వెంటనే అంబానీలా ఫీల్ అయిపోతారు. రిచీ రిచ్‌లా తెగ ఖర్చు పెడుతుంటారు. అది కేవలం మొదటి వారం వరకే! రెండో వారానికి వచ్చేసరికి వేడి తగ్గుతుంది. మూడో వారం అయిపోయాక ఫ్రెండ్‌కి కాల్ చేసి.. 'అరేయ్ మామా ఒక 500 ఉంటే సెండ్ చెయ్‌రా' అని అడుగుతుంటారు. ఇలా కాకుండా ఉండాలంటే స్ట్రిక్ట్‌గా ఓ రూల్ పాటించాలి అంటున్నారు ఫైనాన్షియల్ గురూలు.

50% మన దగ్గర ఉన్న డబ్బులో 50 శాతం కచ్చితమైన అవసరాలకు, రవాణాకోసం, రూమ్ ఖర్చుల కోసం వాడుకోవాలి.

30% కొత్త వస్తువుల కొనుగోళ్లు, సరదాలు, జిమ్, రెస్టారెంట్స్ కోసం ఉపయోగించుకోవచ్చు.

20% సేవింగ్స్ చేయాలి. జీతం పడగానే ముందు ఈ సేవింగ్స్‌లోనే డబ్బు జమ చేయాలట. అప్పుడిక మన డబ్బు బండి సాఫీగా సాగిపోతుందట.

వయసు 17.. పతకాలు 250

నిండా పదిహేడేళ్లంటే నూనూగుమీసాల వయసు. కానీ ఈ కుర్రాడు అంతర్జాతీయస్థాయిలో దేశం మీసం తిప్పుతున్నాడు! ఎక్కడ ఈత పోటీలు జరిగినా మెరుపులాంటి వేగంతో తళుక్కుమంటున్నాడు. సుహాస్ చేస్తున్న ఈ స్ఫూర్తి ప్రయాణం గురించి తెలుసుకుందాం.



చిరుత వేగంతో..

హైదరాబాద్‌కు చెందిన సుహాస్ ప్రీతమ్ ఇంటర్ చదువుతున్నాడు. చిన్నప్పుడు తాతయ్యతో కలిసి పెన్నానదిలో సరదాగా ఈత కొట్టేవాడు. అది కాస్తా కొన్నాళ్లకు ఇష్టంగా మారింది. ఏడేళ్లకు పూర్తిగా స్విమ్మింగ్‌పై పట్టు వచ్చింది. అప్పటినుంచే పోటీల్లో పాల్గొనడం ప్రారంభించాడు. కేవలం పోటీలకు వెళ్లడమే కాదు.. పతకాలు కూడా కొల్లగొడుతూ వచ్చాడు. అతడి ఆసక్తి గమనించిన అమ్మానాన్నలు ప్రత్యూష మెర్సీ, సుమన్ ప్రీతమ్.. మరింతగా సుహాస్‌ను ప్రోత్సహించారు. కాంపిటేషన్స్ జరిగే చోటుకు పిల్లాడ్ని ఒక్కడ్నే పంపడం ఇష్టం లేక.. తన గేమ్‌కు సాయంగా ఉండటం కోసం తల్లి తన సాఫ్ట్‌వేర్ ఉద్యోగాన్ని సైతం వదిలేశారు.

★ 2022లో 100 మీటర్ల బ్యాక్‌స్ట్రోక్ ఒక నిమిషంలో, 2023లో 50 మీటర్ల బ్యాక్‌స్ట్రోక్ 27 సెకన్లలో పూర్తి చేసి రికార్డు సృష్టించాడు. 13 ఏళ్ల వయసులోనే ఖేలో ఇండియాలో ఛాంపియన్‌గా నిలిచి ఇప్పటివరకూ నాలుగు బంగారుపతకాలు గెలుపొందాడు.

అలా ఏడేళ్ల వయసు నుంచి సుహాస్ పోటీల్లో పతకాలు నెగ్గుతూ వచ్చాడు. గత పదేళ్లలో 250 పతకాలు సాధించాడు. అంతర్జాతీయస్థాయిలో రెండు బంగారు పతకాలు, జాతీయ స్థాయిలో బ్యాక్‌స్ట్రోక్‌లో రెండు రికార్డులు, జూనియర్ నేషనల్స్, స్కూల్ గేమ్స్‌లో అనేక పతకాలు గెలిచాడు.

★ ఇటీవల బహ్రెయిన్‌లోని మనామాలో నిర్వహించిన 3వ ఆసియా యూత్ పోటీల్లో భారతదేశానికి ప్రాతినిధ్యం వహించి టీమ్ మెడ్లీ రిలేలో ఏడో స్థానం సంపాదించాడు. ప్రభుత్వం నిర్వహించే 'నేషనల్ టాలెంట్ ప్రోగ్రామ్' ద్వారా టాప్ అథ్లెట్స్‌లో ఒకడిగా ఎంపికయ్యాడు. దీని ద్వారా ఎత్తైన ప్రదేశాలు, సముద్ర తీర ప్రాంతాల్లో స్విమ్ చేయటానికి విదేశాలకు వెళ్లే అవకాశం దక్కించుకున్నాడు. రోజుకు ఆరు గంటలు స్విమ్మింగ్ చేస్తాడు మనోడు! మానసికంగా, శారీరకంగా ఫిట్‌గా ఉండేందుకు కఠిన నియమాలు పాటిస్తాడు. ప్రతిరోజూ ఎందుకలా అంటే.. 'ఒలింపిక్స్‌లో భారత్‌కు బంగారు పతకం తేవాలిగా' అంటూ నవ్వేస్తాడు. మరి ఈ టీనేజర్ కృషిని మనమూ అభినందిద్దామా..

– చింతలపాటి రామాంజనేయులు, హైదరాబాద్

మాకు తెలుగు మాటలే ఇష్టం




కార్పొరేట్ కంపెనీల్లో ఉద్యోగాల కోసం.. సొసైటీలో ఫిట్ అవ్వడం కోసం.. ఇతర భాషలతో తిప్పలు పడుతుంటాం కానీ, ఎమోషన్ తెలియజెప్పాలంటే అమ్మభాషే కావాలి మనకి. అందులోనూ పంచ్ డైలాగులు, మీమ్ లాంగ్వేజ్ అంటే మరీ ఇష్టపడిపోతాం కదా! అందుకే ఈ ట్రెండింగ్ తెలుగు డైలాగులతో టీషర్టులు తెగ వైరల్ అయిపోతున్నాయి. ఇవి మాత్రమే కాదు.. 'రేయ్ ఎవర్రా మీరంతా', 'ఎవడ్రా నువ్వు, ఇంత టాలెంటెడ్‌గా ఉన్నావు', 'ఉచిత సలహాలు ఇవ్వకు', 'పక్కకెళ్లి ఆడుకో', 'ఎవడు అడిగాడ్రా నిన్ను?', 'నా సావు నేను సస్తా, నీకెందుకు', 'తెలుగు రాదా?', 'అమ్మ ఆవకాయ్ అమృతం', 'మీనింగ్‌లెస్‌గా మాట్లాడకు', 'మీరు మారిపోయారు సార్'.. ఇలా బోలెడన్ని ఫేమస్ డైలాగ్స్‌తో టీషర్టులు మార్కెట్‌లో ట్రెండింగ్‌లో ఉన్నాయి. మరి మీకు నచ్చింది చూసి ఆర్డర్ పెట్టేయండి!



వందశాతం

గత వారం చీటింగ్‌కి సంబంధించి 'జాన్వీకపూర్ సమాధానంపై మీ అభిప్రాయం తెలపండి' అంటూ అడిగిన ప్రశ్నకు మన మిత్రులు స్పందించారు. ఫిజికల్, ఎమోషనల్ చీటింగ్స్. రెండూ సరికాదు అంటూ తీర్పునిచ్చారు. వాటిని సహించబోమని వందశాతం వెల్లడించారు.

కొంటె కొటేషన్



1. అంతర్జాలమో పంజరం.. చిక్కితే మిగిలేది అస్థిపంజరం
– లియోవిజయ్, మలకపల్లి

2. కంప్యూటరే ఆస్తి.. చివరికి మిగిలేది అస్థి
– రాళ్లబండి సంగంనాయుడు

3. మనుషులకు నిన్ను చూస్తే వణుకు.. తీస్తున్నావా సిస్టమ్ ముందు కునుకు
– విష్ణువర్ధన్‌రెడ్డి

4. బాస్ ఇచ్చిన పని చేస్తూ అయిపోయింది జన్మ.. మళ్లీ పుడితే ఫినిష్ చేస్తాలేమ్మా..
– పవిత్ర జలసూత్రం, శాన్‌ఫ్రాన్సిస్కో

5. ఆఫీసులో వర్క్ ప్రెజర్.. అస్థిపంజరం అయ్యాడు మన బ్రదర్
– ప్రణీత్‌చంద్ర, హిందూపురం

6. లాప్‌ట్యాప్ పైనే ఫైటు.. తీసుకోకుండా ఉండి ఉంటాడు డైటు
– పరికూటి రవికుమార్, జూలూరుపాడు

7. పని కోసం చస్తాం.. చస్తూ అయినా పని చేస్తాం
– బి.ప్రశాంత్‌కుమార్, హైదరాబాద్



ఈ ఫొటోకి చక్కని వ్యాఖ్య రాసి పంపండి. బాగున్నవి ప్రచురిస్తాం.

ఆవిష్కరణల రాజా


రోడ్ల పక్కనో, డివైడర్లపైనో.. పెద్ద పెద్ద బ్యానర్లు పెడుతుంటారు కొందరు. అవి ఎండి, తడిసి రహదారులపై పడి ప్రమాదాలకు కారణమవుతుంటాయి. దీన్ని నియంత్రించడమెలా?

బయటకు వెళ్లినప్పుడు కొన్నిసార్లు ఫోన్ ఛార్జ్ అయిపోతుంటుంది. వెంటనే ఛార్జింగ్ పెట్టే వీలుంటే బాగుంటుంది కదా!

రైల్వేస్టేషన్‌లో ఒక ప్లాట్‌ఫాం నుంచి మరొక దానికి పట్టాలు దాటుతూ ప్రయాణికులు ప్రమాదాలకు గురవుతుంటారు. దాన్ని అరికట్టడం ఎలా?

...ఇలాంటి సమస్యలకు తన సృజనతో పరిష్కారాలు కనిపెట్టాడు అనంతపురానికి చెందిన 28 ఏళ్ల రాజాసురేష్. ఇతడి తండ్రి టీవీ మెకానిక్ కావడంతో చిన్ననాటి నుంచి ఎలక్ట్రానిక్స్‌పై ఆసక్తి పెంచుకున్నాడు. పాఠశాల స్థాయిలోనే సోలార్ కూలర్‌ను రూపొందించి జాతీయస్థాయిలో అవార్డు పొందాడు. ఆ ఆసక్తితోనే జేఎన్‌టీయూ-అనంతపురంలో ఎంటెక్ చేశాడు. అనంతరం ఉద్యోగం కోసం తిరుపతికి వెళ్లి పరిశోధనలు, ఆవిష్కరణలు చేస్తూ సత్తా చాటుతున్నాడు.

★ ఫోన్ ఛార్జింగ్ కోసం రూపొందించిన సోలార్ మొబైల్ జాకెట్ ఇది. దీనికి ఒక గంట సూర్యరశ్మి తగిలితే సోలార్ ప్యానల్ ద్వారా ఛార్జింగ్ పెట్టుకోవచ్చు. అలాగే బ్యానర్‌లతో చోటుచేసుకునే ప్రమాదాలను నియంత్రించడానికి తయారుచేసిన సోలార్ ఈ-బ్యానర్‌లో ఎల్‌ఈడీ స్క్రీన్ ఉంటుంది. దీన్ని ఫోన్‌తోనూ ఆపరేట్ చేసుకోవచ్చు. రైల్వే ప్రయాణికులు పట్టాలు దాటకుండా ప్లాట్‌ఫామ్ అంతటా రెండడుగుల ఎత్తులో గేట్లు ఉండేలా రూపొందించిన రైల్వే ట్రాక్ క్రాసింగ్ ప్రొటెక్షన్ నమూనాకు సైతం మంచి పేరొచ్చింది. ప్రస్తుతం ప్రయోగదశలో ఉంది. ప్రత్యేకంగా అమర్చిన ట్రాకింగ్ సెన్సార్ల ద్వారా రైలు అర కిలోమీటరు దూరంలో ఉండగానే ప్రయాణికులు పట్టాలు దాటకుండా ఆటోమేటిగ్గా గేట్లు కిందకు దిగుతాయి. ట్రైన్ వెళ్లగానే అవి యథాస్థితికి చేరుకుంటాయి.



తన పరిశోధనలకు రూపు ఇవ్వడం కోసం.. తొలుత రూ.5 వేలతో 2019లో 'ఏకలవ్య ఇన్నోవేటివ్ సొల్యూషన్స్' అనే అంకుర సంస్థను ప్రారంభించాడు. ఆ తర్వాత కేంద్ర ప్రభుత్వ పథకమైన 'నిధి' కింద రూ.4 లక్షలు, తిరుపతి శ్రీపద్మావతి మహిళా వర్సిటీలో టీబీఐ నుంచి రూ.15 లక్షల గ్రాంట్ పొంది.. తను కొత్తగా ఆలోచించడంతోపాటు.. తనలాంటి వారికి చేయూత అందిస్తున్నాడు.



● రెండు తెలుగు రాష్ట్రాల్లోని 35 కళాశాలలతో ఒప్పందం చేసుకుని 'రిసెర్చ్ కాన్ఫరెన్స్' పేరిట కొత్త ఆవిష్కరణలు తీసుకొచ్చేందుకు పీహెచ్‌డీ, పీజీ, యూజీ, అకడమిక్ స్కాలర్స్, ఇండస్ట్రీ నిపుణులతో కార్యక్రమాలు నిర్వహిస్తున్నాడు. అందులో వచ్చిన ఉత్తమ ఆలోచనలను ఎంపిక చేసి, ఓ జర్నల్‌లో నమోదు చేయిస్తున్నాడు. దాంతోపాటు పలు సంస్థలకు రిసెర్చ్ ప్రాజెక్టులు, ఐవోటీ, ఎలక్ట్రానిక్స్ స్ట్రక్చర్ డిజైనింగ్‌లు, యాప్‌లు, వివిధ ప్రాజెక్టులు చేస్తూ ఏటా రూ.25 లక్షల టర్నోవర్ చేస్తున్నాడు. మరోవైపు యువత పారిశ్రామికవేత్తలుగా రాణించడానికి సలహాలు అందిస్తూ ఐదు పుస్తకాలూ రాశాడు. జాతీయస్థాయిలో పలు పురస్కారాలు సైతం అందుకున్నాడు. పలు ఆవిష్కరణలను ముఖ్యమంత్రి చంద్రబాబు, విద్యాశాఖ మంత్రి లోకేశ్ దృష్టికి తీసుకెళ్లి ప్రశంసలు అందుకున్నాడు.

– వేల్పూరి గంగాధర శర్మ, తిరుపతి

మెయిల్ పంపండి

ఈతరం పేజీలో వస్తున్న కథనాలు, శీర్షికలపై మీ విలువైన సలహాలు, సూచనలు మాకు రాసి పంపండి. మా మెయిల్ అడ్రస్ youthpage@eenadu.in

ట్రావెల్ దోస్త్

పర్యటనలో తోడుగా.. మడిచే షూ



పర్యటనల్లో ఎంత మంచి షూస్ ఉంటే.. ప్రయాణం అంత సులభంగా ఉంటుంది. పైగా ఇప్పుడు కొత్త కొత్తగా వెరైటీలు అందుబాటులోకి వచ్చేస్తున్నాయి. అలా వచ్చిన వాటిలో.. బ్యాగ్‌లో ఈజీగా మడత పెట్టేలా డిజైన్ చేసిన ఫోల్డబుల్ షూస్ చూద్దామా..

సాధారణంగా ఫార్మల్ షూస్‌లో అయితే మడమ భాగం కాస్త ఎత్తుగా ఉండి.. ముందు భాగం కంటే దళసరిగా కనిపిస్తుంది. కానీ ఈ షూను నేలపై ఉంచితే.. ఎక్కడా ఎత్తుగా, వంపుగా లేకుండా ఉంటాయి. ఈ ఫోల్డబుల్ షూస్‌నే బేర్‌ఫుట్ షూస్ అని కూడా అంటున్నారు. వీటిలో ఇంకా కొన్ని వెరైటీలున్నాయి.

జీరోడ్రాప్: మడమ, పాదం ముందు భాగం నేలకు సమానంగా ఒకే ఎత్తులో ఉంటాయి. నార్మల్ షూస్‌లో ఉండే హీల్ ఇందులో ఉండదు.

అల్ట్రాథిన్, ఫ్లెక్సిబుల్: సోల్ అడుగుభాగం చాలా పలుచగా ఉంటుంది. ఇందులో ఎటువంటి స్ట్రక్చర్ ఉండదు. అందుకే సులభంగా నడవడానికి వీలవుతుంది.

వెడల్పాటి టో బాక్స్: పాదాల వేళ్లు ఉండే ముందుభాగం వెడల్పుగా ఉంటుంది. ఇది వేళ్లు సహజంగా కదలడానికి వీలు కల్పిస్తుంది. దీనివల్ల నడక ఫ్రీగా ఉంటుంది.



తేలిగ్గా..: వీటి పైభాగాన్ని సాగే గుణమున్న, తేలికైన ముడి పదార్థాలతో తయారుచేస్తున్నారు. కాబట్టి ఈజీగా మడత పెట్టేయొచ్చు. అంతేకాకుండా మిగతా షూస్‌తో పోలిస్తే బరువు చాలా తక్కువ. బీచ్‌కి వెళ్లినా.. వర్షంలో తడిచినా త్వరగా ఆరిపోతాయి. ప్రయాణాల్లోనూ, వాకింగ్, క్యాజువల్ అవుటింగ్‌కి.. వ్యాయామానికి అనుకూలంగా ఉంటాయి. ఎక్కువ దూరం నడిచినా, నిలబడినా పాదాల మీద ఒత్తిడి పడదు. వీటిని వేసుకున్నా నేలమీద నడుస్తున్న ఫీలింగ్ కలుగుతుంది. ట్రావెల్ బ్యాగ్‌లో సులభంగా పట్టేస్తాయి. అయితే వాతావరణం అంత అనుకూలంగా లేని చోట వాడకూడదు. మరి మీకూ నచ్చాయా!

తెలుసా?

మనం బ్రేకప్‌లో ఉన్నాం. ఆ బాధ నుంచి కోలుకోవాలి అనుకుంటున్నాం. ఒంటరితనం భరించలేకుండా ఉన్నాం. ఆ సమయంలో ఎవరిదైనా సహాయం తీసుకుంటే, ఓ కొత్త రిలేషన్‌లోకి... వెళ్తే దాన్నే 'రీబౌండ్ రిలేషన్‌షిప్' అంటారు. నిజానికి ఇందులో పాత ప్రేమను మర్చిపోవడం అంత వేగంగా జరగదు. కానీ ఆ ప్రక్రియలో మరొకరి సాయం తీసుకుంటారు. ఇలాంటివి అప్పటికప్పుడు ప్రేమల్లా కనిపించినా.. వాస్తవానికి ఎక్కువ రోజులు మన్నవట. పాత ప్రేమను మర్చిపోయి మూవ్‌ఆన్ అవ్వడం మొదలు పెట్టాక.. ఇందులోనూ ఉండటానికి ఇష్టపడరట!


నేనే లీడర్



సాధారణంగా మనకు ఆఫీస్‌లోనే కొద్ది మందితో మాత్రమే పరిచయం ఉంటుంది. అలాంటిది ఇక బయట వ్యక్తులు తెలియడమంటే మరీ కష్టం. కానీ ప్రొఫెషనల్స్ చెప్పే మాట ఏంటంటే.. ఆఫీస్‌తోపాటు మన రంగంలో ఇతరులు, నిపుణులతోనూ పరిచయాలు ఉండటం అవసరమట. అప్పుడే కొత్త అవకాశాలు అందిపుచ్చుకోవడంతోపాటు ఇంకా పైకి ఎదిగేందుకు వీలుంటుందట. అందుకే 'నెట్‌వర్కింగ్'ను అస్సలు తక్కువ అంచనా వేయకూడదు అంటున్నారు కెరియర్ గురూలు!

ఎలా స్పందిస్తావ్?

మనసులో మాట



చిన్నప్పటి నుంచి గర్ల్స్ హాస్టల్స్‌లోనే ఉంటూ చదవడం వల్ల అబ్బాయిలతో మాట్లాడటం తెలియదు. డిగ్రీ అయిపోగానే హైదరాబాద్‌లో పీజీ సీట్ వచ్చింది. కానీ అక్కడ వాతావరణం ఎందుకో నాకు నచ్చలేదు. ఎవరితో మాట్లాడాలన్నా భయం. అప్పుడే పరిచయం అయ్యాడు వీరూ. నేను ఒంటరిగా ఉండటం చూసి.. 'ఎందుకు నందూ ఎప్పుడు ఒక్కదానివే ఉంటావ్?' అంటూ మాటలు కలిపాడు. చలాకీగా, ఎంతో సరదాగా ఉంటాడు తను. నాతోనూ అలాగే మాట్లాడేవాడు. నేను డల్‌గా ఉన్నప్పుడు నా దగ్గరికి వచ్చి నవ్వించాలని కవితలు చెప్పేవాడు. 'మగువ ముఖంలో నవ్వు ముఖ్యం. నీ సొగసైన నవ్వు చూస్తూ మురిసిపోనా.. నీ నవ్వుల అలల్లో మాయమవనా.. ఆ సుడిగుండంలో చిక్కుకుపోనా..' అంటూ ఎక్స్‌ప్రెషన్‌తో సహా చెబుతూ నవ్వించేవాడు. మెల్లగా నాలో ఉన్న బిడియాన్ని పోగొట్టాడు. అప్పుడు మొదలైన మా స్నేహ ప్రయాణం ఆ సంవత్సరం అంతా హుషారుగా సాగిపోయింది.

ఓరోజు మా జూనియర్ ఒక అమ్మాయి నా ముందే వీరూకి ప్రపోజ్ చేసింది. ఎందుకో అప్పుడు నాకు ఏం అనిపించలేదు. చుట్టూ ఉన్న స్నేహితులంతా 'కమాన్ వీరూ..' అని ఎంకరేజ్ చేస్తుంటే నేను క్లాప్స్ కొట్టాను. ఇక అప్పటినుంచి తను నాతో ఉన్నదే లేదు. క్లాస్‌కి సరిగ్గా రావడం మానేశాడు. పరీక్షలు ఉంటే రాసి, కలవకుండానే వెళ్లిపోయేవాడు. మళ్లీ నా ఒంటరితనమే నాకు దగ్గరైంది. అప్పటికి కానీ నాకు అర్థంకాలేదు, నేను వీరూని ప్రేమిస్తున్నానని! ఇప్పుడు ఈ విషయం ఎలా చెప్పాలి? 'తను వేరే ఆమెతో ప్రేమలో ఉన్నాడని ఆగిపోనా, లేక చెప్పనా? ఇదంతా కాదు, ముందు వీరూని చూడాలి' అనుకుని అతణ్ని కలవాలని ఫోన్ చేశాను. ఎంత ప్రయత్నించినా దొరకలేదు. ఎవరిని అడిగినా తెలియలేదు. చివరికి ఆ జూనియర్ అమ్మాయిని అడిగాను. 'నాకేం తెలుసు?' అంటూ చాలా చిరాగ్గా సమాధానం చెప్పింది. నెల తర్వాత అతను ఉన్న హాస్టల్‌కి వెళ్తే.. గ్రౌండ్‌లో కనిపించాడు. చాలా మారిపోయాడు! నన్ను నవ్వించిన తన మొహంలో నవ్వేలేదు. దగ్గరికి వెళ్లి అడిగితే విషయం చెప్పాడు. ఆ జూనియర్ అమ్మాయి వాళ్ల క్లాస్‌మేట్స్ బెట్టింగ్ వల్ల అలా అందరి ముందు ప్రపోజ్ చేసిందే తప్ప.. తనను నిజంగా ప్రేమించలేదంటూ కన్నీళ్ళు పెట్టుకున్నాడు. ఆ సమయంలో నాకు తను ఏడుస్తున్నాడని బాధ అనిపించినా.. మనసు మాత్రం లోపల డ్యాన్స్ చేసింది! వెంటనే వీరూకి నా ప్రేమ విషయం చెప్పాలనుకున్నా. కానీ నేను చెప్పాక 'నువ్వూ తనలా నాతో ఆడుకుంటున్నావా?' అని అంటే తట్టుకోగలనా? ఇప్పుడు చెబితే తను ఎలా స్పందిస్తాడో అర్థం కావడం లేదు. వీరూ.. మెల్లగా అయినా నా ప్రేమను అర్థం చేసుకుంటావ్ కదూ!

– నందు

ఈనాడు
విజయవాడ 15-11-2025 శనివారం సిటీ సంపుటి 52 . సంచిక 95
THE LARGEST CIRCULATED TELUGU DAILY
రూ. 6-50 పేజీలు 18
www.eenadu.net
Vijayawada, Visakhapatnam, Hyderabad, Tirupati, Ananthapuramu, Karimnagar, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru



భారత్, ఏపీలో పెట్టుబడులకు

ఇదే సరైన సమయం

త్వరలో మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా మారనున్నాం

గతంలో చంద్రబాబు కృషికి హైదరాబాద్ నిదర్శనం

ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్

8లో

భూములున్నాయి.. వనరులున్నాయి..

మా రాష్ట్రానికి రండి

పెట్టుబడులు పెట్టండి • పరస్పర సహకారంతోనే అభివృద్ధి

రాష్ట్రంలో 50 వేల ఎకరాల ల్యాండ్ బ్యాంక్ సిద్ధం

భాగస్వామ్య సదస్సు మొదటి ప్లీనరీలో సీఎం చంద్రబాబు

పోటెత్తిన పెట్టుబడులు


విశాఖ భాగస్వామ్య సదస్సుకు తరలివచ్చిన దిగ్గజ పారిశ్రామికవేత్తలు

- జాతీయ, అంతర్జాతీయ కంపెనీల ప్రతినిధుల రాకతో కళకళ
- ఉపరాష్ట్రపతి రాధాకృష్ణన్, పీయూష్ గోయల్ సహా పలువురు కేంద్ర మంత్రుల హాజరు
- తొలి రోజుకే రూ.11.92 లక్షల కోట్ల ఒప్పందాలు • తద్వారా 13.32 లక్షల మందికి ఉపాధి అవకాశాలు
- 1,000 మెగావాట్ల సామర్థ్యంతో రిలయన్స్ డేటా సెంటర్ • రూ.2.16 లక్షల కోట్ల పెట్టుబడులకు బ్రూక్‌ఫీల్డ్ ఒప్పందం

డ్రోన్ సిటీ, స్పేస్ సిటీలకు సీఎం చంద్రబాబు శంకుస్థాపన

విశాఖపట్నం నుంచి
ఈనాడు ప్రత్యేక ప్రతినిధి


సాగరతీరం విశాఖ నగరంలో పెట్టుబడులు పోటెత్తాయి. జీఎంఆర్ నుంచి రిలయన్స్ వరకు దేశీయ అగ్రగామి వ్యాపార, పారిశ్రామిక సంస్థలు.. బ్రూక్‌ఫీల్డ్ వంటి అంతర్జాతీయ కంపెనీలు తరలివచ్చాయి. ప్రపంచంలోని ప్రసిద్ధ పరిశ్రమలు ఏపీలో తమ సంస్థల ఏర్పాటుకు ముందుకొచ్చాయి. రూ.లక్షల కోట్ల పెట్టుబడుల ఒప్పందాలపై సంతకాలు చేశాయి. రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న సీఐఐ భాగస్వామ్య సదస్సు ఇందుకు వేదికయింది. విశాఖపట్నంలోని ఆంధ్రా ఇంజినీరింగ్ కళాశాల ప్రాంగణంలో శుక్రవారం ప్రారంభమైన సదస్సుకు జాతీయ, అంతర్జాతీయ దిగ్గజ పారిశ్రామిక, వాణిజ్య సంస్థల నుంచి అంచనాలకు మించిన స్పందన లభించింది. (మిగతా 8లో)



ఏపీలో పుట్టిన ప్రతి బిడ్డకూ ఉజ్వల భవిష్యత్తు

కేంద్ర మంత్రి పీయూష్ గోయల్

8లో



దేశానికి గ్రోత్ ఇంజిన్‌గా ఏపీ.. ఏపీకి గ్రోత్ కారిడార్‌గా విశాఖ

మంత్రి లోకేశ్

అత్యధిక పెట్టుబడులు వచ్చిన రంగాలివీ..	
పరిశ్రమలు, వాణిజ్యం	రూ.4.23 లక్షల కోట్లు
ఐటీ, ఎలక్ట్రానిక్స్	రూ.2.56 లక్షల కోట్లు
విద్యుత్తు	రూ.2.45 లక్షల కోట్లు
విమానయాన అభివృద్ధి	రూ.1.91 లక్షల కోట్లు



బిహార్‌లో ఎన్డీయే గెలిచిందని సీఐఐ వేదికపై కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్ చెబుతుండడంతో చప్పట్లు కొడుతున్న నేతలు, ప్రముఖులు


ఎన్డీయే ప్రభంజనం

బిహార్‌లో చరిత్రాత్మక విజయం

202 స్థానాల్లో జయభేరి

- నీతీశ్‌కే పట్టం కట్టిన బిహారీ
- తుడిచిపెట్టుకుపోయిన మహాగఠ్‌బంధన్
- రాఘోపుర్‌లో గెలిచిన తేజస్వీ
- ఎన్డీయే ఎం-వై సక్సెస్.. ఆర్జేడీ ఎం-వై ఫెయిల్

పట్నా: బిహార్ అసెంబ్లీ ఎన్నికల్లో ఎన్డీయే ప్రభంజనం సృష్టించింది. నీతీశ్, మోదీల జోడి సూపర్‌హిట్ కొట్టింది. ఆ కూటమే ఊహించనంతగా.. ఎగ్జిట్ పోల్స్‌కూ అందనంతగా అప్రతిహత విజయాన్ని సాధించి చరిత్ర సృష్టించింది. నీతీశ్ కుమార్ నేతృత్వంలోని ఎన్డీయే 202 సీట్లతో అందనంత ఎత్తున నిలిచింది. ఆర్జేడీ నేతృత్వంలోని మహాగఠ్‌బంధన్ ఘోర పరాజయం పాలయ్యింది. చావుతప్పి కన్నులొట్టపోయినట్లుగా కేవలం 34 సీట్లతో ప్రతిపక్ష హోదాకు అర్హత సాధించగలిగింది. సంచలనం సృష్టిస్తానని మొత్తం 243 సీట్లలో పోటీ చేసిన ప్రశాంత్ కిశోర్ పార్టీ జన్ సురాజ్ అసలు ఖాతానే తెరవలేదు. గతంలో మాదిరిగానే ఎంఐఎం మళ్లీ 5 చోట్ల గెలిచి పట్టు నిలబెట్టుకుంది. సమన్వయం, అభివృద్ధి హామీలు, మహిళలకు నగదు బదిలీవంటి వాటితో ఎన్డీయే అద్భుత ఫలితాలను సాధించగా.. అంతర్గత కలహాలు, సీట్ల సర్దుబాటులో (మిగతా 12లో)



దిల్లీలో భాజపా ప్రధాన కార్యాలయం వద్ద విజయానందంతో కండువా తిప్పుతున్న ప్రధాని మోదీ



నీతీశ్ కుమార్

ఈ ఎన్నికల్లో అతి పెద్ద పార్టీగా భాజపా అవతరించింది. ఆ పార్టీ 101 సీట్లలో పోటీ చేసి 89 చోట్ల గెలుపొందింది. దాని స్ట్రైక్‌రేట్ 88శాతంగా ఉంది. 101 సీట్లలోనే పోటీ చేసిన జేడీయూ 85 చోట్ల విజయం సాధించింది. ఆ పార్టీ స్ట్రైక్‌రేట్ 84శాతం. ఎన్డీయే కూటమిలోనే ఉన్న లోక్ జనశక్తి (రాంవిలాస్) పార్టీ 28 చోట్ల పోటీ చేసి 19 చోట్ల గెలిచింది. (ఒకచోట ఆ పార్టీ అభ్యర్థి నామినేషన్ తిరస్కరణకు గురైంది.) గత ఎన్నికల్లో 43 సీట్లతో సరిపెట్టుకున్న జేడీయూ ఈసారి ఆ సంఖ్యను 85కు పెంచుకుని సత్తా చాటింది.

అతి పెద్ద పార్టీగా భాజపా

ఎవరికెన్ని?	ఎన్డీయే	మహాగఠ్‌బంధన్	ఎంఐఎం	ఇతరులు
మొత్తం సీట్లు: 243	202	34	5	2

మరోసారి జంగిల్ రాజ్ రావొద్దని బిహార్ యువత నిర్ణయించుకున్నారు. ప్రజానుకూల ప్రభుత్వానికి పట్టం కట్టారు. ఇక పశ్చిమ బెంగాల్‌లో జంగిల్ రాజ్‌ను నేలకూల్చాలి. భాజపా విజయపరంపర బిహార్ నుంచి బెంగాల్ వరకూ గంగా ప్రవాహంలా కొనసాగుతుంది. దేశంలోని పలు రాష్ట్రాల్లో కొనసాగుతున్న ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) కార్యక్రమంలో అన్ని రాజకీయ పార్టీలు పాల్గొనాలి. తద్వారా జాబితాల సవరణ కార్యక్రమానికి అంతా సహకరించాలి.

\- ప్రధాని మోదీ

మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్ నీతీశ్

జంగిల్‌రాజ్‌ను తుడిచిపెట్టిన నేతగా గుర్తింపు

ఇక...బెంగాల్, తమిళనాడుపై గురి!

బిహార్ ఘన విజయంతో త్వరలో ఎన్నికలు జరిగే రాష్ట్రాల్లో భాజపా అనుకూల పరిస్థితులు

లోపలి పేజీల్లో

జూబ్లీహిల్స్ ‘హస్త’గతం

- ఉప ఎన్నికలో కాంగ్రెస్‌కు పట్టం కట్టిన ఓటర్లు

24,729 ఓట్ల ఆధిక్యంతో విజేతగా నిలిచిన నవీన్‌యాదవ్

- సిటింగ్ స్థానాన్ని నిలబెట్టుకోలేకపోయిన భారాస
- డిపాజిట్ కోల్పోయిన భాజపా



నవీన్‌యాదవ్

ఈనాడు, హైదరాబాద్: తెలంగాణలో అత్యంత ప్రతిష్ఠాత్మకంగా జరిగిన జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో కాంగ్రెస్ ఘన విజయం సాధించింది. తెలుగు రాష్ట్రాల్లో ఈ ఉప ఎన్నిక ఎంతో ఉత్కంఠకు తెరదీయగా ఫలితం తొలి రౌండ్ నుంచి ఏకపక్షంగా సాగింది. ముందస్తు సర్వేలు, ఎగ్జిట్‌పోల్స్ ఫలితాలకు అందనంతగా తిరుగులేని ఆధిక్యం సాధించింది. (మిగతా 12లో)



మృతుడు సతీశ్‌కుమార్

పరకామణి కేసు ఫిర్యాదుదారు సతీష్ అనుమానాస్పద మృతి

- తాడిపత్రి సమీపంలో రైలు పట్టాల పక్కన మృతదేహం
- ఆయనది హత్యేనని పోలీసుల ప్రాథమిక అంచనా
- తల వెనకభాగంలో పదునైన ఆయుధంతో కొట్టిన గాయాలు
- నిజాలు బయటపెడతారనే హత్య: కుటుంబసభ్యులు
- మృతుడు సతీష్‌కుమార్ రైల్వేలో సీఐ, తితిదే మాజీ ఏవీఎస్‌వో



పట్టాల పక్కన సతీశ్‌కుమార్ మృతదేహం

ఈనాడు - అనంతపురం, న్యూస్‌టుడే- తాడిపత్రి, పెద్దపప్పూరు: తిరుమల పరకామణిలో చోరీకి పాల్పడ్డ కేసులో ఫిర్యాదుదారైన అప్పటి అసిస్టెంట్ విజిలెన్స్ సెక్యూరిటీ ఆఫీసర్ (ఏవీఎస్‌వో) వై.సతీష్‌కుమార్ అనుమానాస్పద స్థితిలో మృతిచెందారు. ఈ కేసులో తిరుపతిలో సీఐడీ ఎదుట విచారణకు హాజరయ్యేందుకు రైలులో బయలుదేరిన ఆయన శవమై తేలారు. ప్రస్తుతం గుంతకల్లు రైల్వేలో సీఐగా ఉన్న సతీష్‌కుమార్ గతంలో తితిదే ఏవీఎస్‌వోగా పనిచేశారు. పరకామణి కేసులో ఈ నెల 6న సీఐడీ ఎదుట విచారణకు హాజరయ్యారు. శుక్రవారం మళ్లీ విచారణకు హాజరయ్యేందుకు గురువారం అర్ధరాత్రి గుంతకల్లు నుంచి తిరుపతికి రైలులో బయలుదేరారు. తాడిపత్రి మండలం కోమలి రైల్వేస్టేషన్ సమీపంలో పట్టాల పక్కన శుక్రవారం ఉదయం విగతజీవిగా కనిపించారు. ఆయనది హత్యేనని పోలీసులు (మిగతా 16లో)



మద్యం కుంభకోణం కేసులో

ముంబయి వ్యాపారి అనిల్ చోఖ్రా అరెస్టు

- వైకాపా ముఠా కోసం డొల్ల కంపెనీలు ఏర్పాటు చేసింది ఈయనే

ఈనాడు, అమరావతి: వైకాపా హయాంలో జరిగిన రూ.వేల కోట్ల మద్యం కుంభకోణం కేసులో ముంబయికి చెందిన వ్యాపారి అనిల్ చోఖ్రా (ఏ-49)ను సిట్ అధికారులు శుక్రవారం అరెస్టు చేశారు. ఠాణెలోని బెలాపుర్ కోర్టులో ఆయన్ను ప్రవేశపెట్టి ట్రాన్సిట్ వారంట్‌పై విజయవాడకు తీసుకొస్తున్నారు. శనివారం ఇక్కడి ఏసీబీ న్యాయస్థానంలో హాజరుపరుస్తారు. గత ప్రభుత్వంలో అత్యధికంగా మద్యం సరఫరా ఆర్డర్లు దక్కించుకున్న కంపెనీలు నాటి ప్రభుత్వ పెద్దలకు నగదు రూపంలో ముడుపుల సొమ్ము చెల్లించేందుకు డొల్ల కంపెనీల ద్వారా నిధులు మళ్లించడంలో అనిల్ చోఖ్రా కీలకంగా వ్యవహరించారని సిట్ గుర్తించింది. వైకాపా ముఠా కొల్లగొట్టిన ముడుపుల సొమ్ము రూటింగ్, మనీ లాండరింగ్ కోసం అనిల్ పెద్ద ఎత్తున డొల్ల కంపెనీలు ఏర్పాటు చేసినట్లు తేల్చింది. ఈ క్రమంలోనే ఆయన్ను అరెస్టు చేసింది.

అదాన్, లీలా, ఎస్పీవై నుంచి రూ.77 కోట్లు

గత ప్రభుత్వంలో అత్యధికంగా మద్యం సరఫరా ఆర్డర్లు దక్కించుకున్న అదాన్ డిస్టిలరీస్, ఎస్పీవై ఆగ్రో ఇండస్ట్రీస్, లీలా డిస్టిలరీస్ సంస్థలు రాజ్ కెసిరెడ్డి(ఏ-1), ముప్పిడి అవినాష్‌రెడ్డి (ఏ-7)ల నియంత్రణ, పర్యవేక్షణలో ఉండేవి. ఈ మూడు సంస్థలు కలిపి మొత్తం రూ.77.55 కోట్లను ముంబయికి చెందిన ఓల్విక్ మల్టీవెంచర్స్ ప్రైవేట్ లిమిటెడ్ (ఏ-11), క్రిపటి ఎంటర్‌ప్రైజెస్ ప్రైవేట్ లిమిటెడ్ (ఏ-12), నైస్నా మల్టీ వెంచర్స్ ప్రైవేట్ లిమిటెడ్ (ఏ-13), విశాల్ ఎంటర్‌ప్రైజెస్ (ఏ-19) వంటి డొల్ల కంపెనీల ఖాతాల్లోకి మళ్లించాయి. ఈ సంస్థలన్నీ అనిల్ చోఖ్రా నిర్వహిస్తున్నవే. రెండో దశలో ఆ నిధులు మరో 32 డొల్ల కంపెనీల ఖాతాల్లోకి మళ్లించేవారు. అక్కడి నుంచి వివిధ రూపాల్లో ఆ సొత్తు వైకాపా ముఠాకు చేర్చేవారు. ఎక్కడా ఆడిట్‌కు దొరక్కుండా, నేరం గుట్టు బయటపడకుండా బహుళ అంచెల్లో నిధుల మళ్లింపునకు పాల్పడినట్లు సిట్ గుర్తించింది.

35 డొల్ల కంపెనీలు నిర్వహిస్తూ..

అనిల్ చోఖ్రా నియంత్రణలో (మిగతా 8లో)

ఇదీ సంగతి!



కేసులు తేలేదాకా... ఆస్తులు విడుదల చేయొద్దు

- రేవన్ ఇన్‌ఫ్రా జగన్‌కు సంబంధించినదే
- జగన్ అక్రమాస్తుల కేసులో హైకోర్టుకు నివేదించిన సీబీఐ



ఈనాడు, హైదరాబాద్: జగన్ అక్రమాస్తుల కేసు దర్యాప్తులో భాగంగా సీబీఐ స్తంభింపజేసిన జగతి పబ్లికేషన్స్, ఇందిరా టెలివిజన్ కరెంట్ ఖాతాల నిర్వహణ నిమిత్తం హామీగా సమర్పించిన ఆస్తులను సీబీఐ కోర్టులో కేసులు తేలేదాకా విడుదల చేయరాదంటూ శుక్రవారం హైకోర్టుకు సీబీఐ నివేదించింది. ఒకసారి తీర్పు వెలువరించాక అందులో ఏవైనా అంకెలు, ఇతర క్లరికల్ తప్పులు ఉంటే తప్ప ఎలాంటి సవరణా చేయరాదంది. 2021లో తుది ఉత్తర్వులివ్వగా... ఇప్పుడు వాటిపై దాఖలు చేసిన మధ్యంతర పిటిషన్ విచారణార్హం కాదని కొట్టివేయాలంది. ఆర్థిక నేరంలో జప్తు చేసిన ఆస్తులకు సంబంధించి సుప్రీంకోర్టు వెలువరించిన తీర్పులను పరిగణనలోకి తీసుకోవాలంది.

కరెంట్ ఖాతాల నిర్వహణలో భాగంగా.. 2012లో కోర్టు ఆదేశానుసారం హామీగా సమర్పించిన మూడు స్థిరాస్తులను (మిగతా 8లో)



చింతపల్లిలో దట్టంగా కురుస్తున్న పొగమంచు

జి.మాడుగులలో 6 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత

ఈనాడు, విశాఖపట్నం: రాష్ట్రంలో కనిష్ఠ ఉష్ణోగ్రతలు గణనీయంగా తగ్గుతున్నాయి. గురువారం రాత్రి అల్లూరి సీతారామరాజు జిల్లా జి.మాడుగులలో 6 డిగ్రీల అత్యల్ప ఉష్ణోగ్రత నమోదైంది. ఈ సీజన్‌లో ఇదే అత్యల్పం కావడం గమనార్హం. ఏజెన్సీతో పాటు మైదాన (మిగతా 8లో)

ప్రభుత్వోద్యోగాల్లో ట్రాన్స్‌జెండర్లకు రిజర్వేషన్లు కల్పించండి

- వివక్షతో వారు వివిధ రంగాలకు దూరమయ్యారు
- రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశిస్తూ హైకోర్టు తీర్పు



ఈనాడు, అమరావతి: ప్రభుత్వ ఉద్యోగాల్లో ట్రాన్స్‌జెండర్లకు రిజర్వేషన్లు కల్పించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశిస్తూ హైకోర్టు కీలక తీర్పు ఇచ్చింది. తీర్పు ప్రతి అందిన ఆరు నెలల్లో ఈ ప్రక్రియను పూర్తి చేయాలని స్పష్టం చేసింది. పిటిషనర్‌ను స్కూల్ అసిస్టెంట్ పోస్టులో నియమించే వ్యవహారాన్ని పరిగణనలోకి తీసుకోవాలని పేర్కొంది. హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎన్.విజయ్ ఇటీవల ఈ తీర్పు ఇచ్చారు. మెగా డీఎస్సీలో ట్రాన్స్‌జెండర్లకు రిజర్వేషన్ కల్పించకపోవడాన్ని సవాలు చేస్తూ ఏలూరు జిల్లా జంగారెడ్డిగూడేనికి చెందిన ట్రాన్స్‌జెండర్ (ఉమన్) కె.రేఖ హైకోర్టులో వ్యాజ్యం వేశారు. ట్రాన్స్‌జెండర్లకు పోస్టులు నోటిఫై చేయకపోవడంతో అధికారులు తనను ఉద్యోగానికి ఎంపిక చేయలేదన్నారు. పోస్టులు కేటాయించకపోవడం సుప్రీంకోర్టు తీర్పునకు విరుద్ధమన్నారు. పిటిషనర్ తరఫున న్యాయవాది ఎం.సాల్మన్‌రాజు (మిగతా 8లో)

తితిదే అన్నప్రసాదం ట్రస్టుకు రూ.కోటి విరాళం


తితిదే ఛైర్మన్ బీఆర్ నాయుడికి విరాళం డీడీ అందిస్తున్న దాత ప్రతినిధి భూషణ్

తిరుమల, న్యూస్‌టుడే: తితిదే శ్రీవేంకటేశ్వర అన్నప్రసాదం ట్రస్టుకు విజయవాడకు చెందిన భక్తుడు మోనిష్ వెంకట సత్యప్రకాశ్ రూ.కోటి విరాళం అందజేశారు. తితిదే క్యాంపు కార్యాలయంలో దాత ప్రతినిధి భూషణ్ తితిదే ఛైర్మన్ బీఆర్ నాయుడికి శుక్రవారం విరాళం డీడీ అందజేశారు.

విజయనగరం జిల్లాలో స్టీల్‌ప్లాంట్‌కు 1,085 ఎకరాలు

రూ.8,570 కోట్లతో ఏర్పాటుచేయనున్న సూపర్ స్మెల్టర్స్

ఈనాడు, అమరావతి: విజయనగరం జిల్లా గుర్ల మండలం కెల్ల గ్రామంలో గ్రీన్‌ఫీల్డ్ ఇంటిగ్రేటెడ్ స్టీల్‌ప్లాంట్‌ను ఏర్పాటు చేసేందుకు వీలుగా సూపర్ స్మెల్టర్స్ లిమిటెడ్‌కు 1,085 ఎకరాలు కేటాయిస్తూ ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు జారీచేసింది. ఈ సంస్థ రూ.8,570.50 కోట్లతో ఏడాదికి 2 మిలియన్ టన్నుల సామర్థ్యంతో స్టీల్‌ప్లాంట్ ఏర్పాటు చేస్తుంది. దీనిద్వారా 750 మందికి ఉపాధి కలగనుంది. టౌన్‌షిప్ ఏర్పాటుకు మరో 97.04 ఎకరాలు, రైల్వే సైడింగ్‌కు 53.35 ఎకరాలు కూడా కేటాయించనున్నారు. రెండు దశల్లో స్టీల్ ప్లాంట్‌ను ఏర్పాటు చేయనున్నారు.

గ్రహం అనుగ్రహం

15-11-2025 శనివారం

శ్రీ విశ్వావసు నామ సంవత్సరం; దక్షిణాయనం; శరదృతువు, కార్తిక మాసం, బహుళపక్షం

ఏకాదశి: తె. 4-06 తదుపరి ద్వాదశి; **ఉత్తర:** రా. 2-01 తదుపరి హస్త **వర్జ్యం:** ఉ. 8-28 నుంచి 10-08 వరకు; **అమృత ఘడియలు:** సా.6-30 నుంచి 8-10 వరకు; **దుర్ముహూర్తం:** ఉ. 6-08 నుంచి 7-37 వరకు **రాహుకాలం:** ఉ. 9-00 నుంచి 10-30 వరకు; **సూర్యోదయం:** ఉ. 6.08 సూర్యాస్తమయం: సా.5.21; సర్వ ఏకాదశి

చలి పులి

ప్రాంతం	కనిష్ఠ	గరిష్ఠ
ఆదిలాబాద్	10.2	29.3
హైదరాబాద్	13.4	29.4
శ్రీకాకుళం	18.0	30.0
విశాఖపట్నం	18.6	30.0
విజయనగరం	19.0	29.0
కడప	19.0	30.0
అనంతపురం	19.0	32.7
రాజమహేంద్రవరం	19.0	34.5
కర్నూలు	19.2	32.5
విజయవాడ	19.4	29.2
నరసాపురం	19.4	31.5
గుంటూరు	22.0	29.0
ఒంగోలు	22.0	31.2
తిరుపతి	23.5	30.7
తాడేపల్లిగూడెం	28.0	30.0

పోలీసు సిబ్బంది.. పదేపదే అదే తీరు!

- నిందితుడు విజయభాస్కర్‌రెడ్డితో కలిసి అల్పాహారం
- ఐదుగురి సస్పెన్షన్

ఈనాడు-అమరావతి, ఈనాడు డిజిటల్-మచిలీపట్నం, న్యూస్‌టుడే-పెనమలూరు: సామాజిక మాధ్యమాల్లో తీవ్ర అభ్యంతరకర పోస్టులతో రెచ్చిపోయిన ఎన్ఆర్ఐ, వైకాపా సోషల్ మీడియా కార్యకర్త మాలపాటి విజయభాస్కర్‌రెడ్డికి రక్షణగా వెళ్లిన పోలీసు సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరించారు. నిబంధనలు, ఉన్నతాధికారుల ఆదేశాలను గాలికొదిలేసి మార్గం మధ్యలో నిందితుడితో కలిసి ఓ హోటల్‌లో అల్పాహారం చేశారు. కోర్టు అనుమతి మేరకు నెల్లూరు కారాగారం నుంచి నిందితుడిని అతడి తండ్రి కర్మకాండ కోసం స్వగ్రామం తీసుకెళ్తుండగా ఇది జరిగింది. గతంలో బోరుగడ్డ అనిల్, కరుడుగట్టిన నేరస్థుడు బత్తుల ప్రభాకర్ విషయంలో ఇలానే నిర్లక్ష్యంగా వ్యవహరించిన ఎస్కార్ట్ సిబ్బందిపై వేటు పడిన విషయం తెలిసిందే. అప్పట్లో హోటల్ వద్ద అల్పాహారం కోసం ఆగిన సమయంలో ప్రభాకర్ తప్పించుకుని పారిపోయాడు. ఈ నేపథ్యంలో నిందితులకు రక్షణగా వెళ్తున్న సిబ్బంది ఎక్కడా వాహనాలను ఆపొద్దని స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు.

నిబంధనలు బేఖాతరు: తండ్రి కర్మకాండకు హాజరయ్యేందుకు మధ్యంతర బెయిల్ ఇవ్వాలని ఇటీవల నిందితుడు కోర్టులో పిటిషన్ దాఖలు చేసుకున్నాడు. దాంతో ఈ నెల 13న శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాలోని స్వగ్రామం లింగపల్లికి వెళ్లేందుకు ఒక రోజు బెయిల్ మంజూరు చేసింది. ఈ నేపథ్యంలో నెల్లూరు కారాగారంలో ఉన్న నిందితుడిని గురువారం ఉదయం పోలీసులు అదుపులోకి తీసుకుని వాహనంలో లింగపల్లికి బయలుదేరారు. 10 గంటల సమయంలో డీసీ పాలెం వద్ద ఉన్న హోటల్ వద్ద అల్పాహారం కోసం ఎస్కార్ట్ సిబ్బంది వాహనాన్ని ఆపారు. కారాగారంలోనే నిందితుడు అల్పాహారం చేశాడు. పోలీసు సిబ్బంది చేయకపోవడంతో అక్కడ ఆగారు. వీరితో పాటు నిందితుడు కూడా హోటల్‌లో టిఫిన్ చేశాడు.

ఆధారాలతో పట్టుకున్న స్పెషల్ బ్రాంచి సిబ్బంది: నిందితుడితో కలిసి అల్పాహారం చేసిన విషయాన్ని వారిని అనుసరిస్తున్న ఇద్దరు ఎస్‌బీ (స్పెషల్ బ్రాంచి) సిబ్బంది కృష్ణా ఎస్పీ విద్యాసాగర్ నాయుడుకు చెప్పారు. ఫొటోలతో సహా ఎస్పీకి వారు ఆధారాలు అందజేశారు. దాంతో ఏఆర్ హెడ్ కానిస్టేబుల్ ఎం.ప్రసాద్, ఏఆర్ కానిస్టేబుళ్లు శివప్రసాద్, సాయికిరణ్‌తో పాటు పెనమలూరు స్టేషన్ కానిస్టేబుల్ ఎ.సురేష్‌ను సస్పెండ్ చేస్తూ ఎస్పీ ఉత్తర్వులు ఇచ్చారు. పెనమలూరు ఏఎస్సై ఆర్.శ్రీనివాసరావు సస్పెన్షన్ కోసం ఏలూరు రేంజి ఐజీకి నివేదిక పంపారు. దీనికి ఆమోదముద్ర వేయడంతో మొత్తం ఐదుగురు సస్పెండ్ అయ్యారు.

క్షేత్రస్థాయి పరిస్థితిపై 'క్యాన్సర్ అట్లాస్'

- త్వరలో సీఎంకు సమగ్ర నివేదిక
- ప్రభుత్వ సలహాదారు డాక్టర్ నోరి దత్తాత్రేయుడు


సమావేశంలో మాట్లాడుతున్న క్యాన్సర్ వ్యాధి నిపుణుడు డాక్టర్ నోరి దత్తాత్రేయుడు, చిత్రంలో ఎన్టీఆర్ వైద్యసేవ ట్రస్ట్ సీఈవో దినేష్‌కుమార్, సెకండరీ హెల్త్ డైరెక్టర్ చక్రధర్‌బాబు

ఈనాడు, అమరావతి: రాష్ట్ర వ్యాప్తంగా క్యాన్సర్ కేసులు, మరణాలు ఇతర వివరాలతో కూడిన క్యాన్సర్ అట్లాస్ రూపొందిస్తున్నామని ప్రముఖ క్యాన్సర్ వ్యాధి నిపుణుడు, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు డాక్టర్ నోరి దత్తాత్రేయుడు తెలిపారు. ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుపత్రులతోపాటు ఎన్‌సీడీ 4.0 సర్వే ద్వారా సేకరించిన సమాచారం, ఎన్టీఆర్ వైద్యసేవ ట్రస్ట్ ద్వారా చికిత్స పొందిన వారి వివరాలన్నీ క్రోడీకరించి అట్లాస్ తయారుచేస్తున్నట్లు వివరించారు. సమగ్ర నివేదికను వీలైనంత త్వరలో ముఖ్యమంత్రి చంద్రబాబుకు అందిస్తామని వెల్లడించారు. మంగళగిరిలోని ఆరోగ్య- కుటుంబ సంక్షేమ శాఖ ప్రధాన కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన క్యాన్సర్ డిసీజ్ బర్డెన్ ఐదో సలహా సంఘ సమావేశంలో దత్తాత్రేయుడు మాట్లాడారు. ప్రాంతాల వారీగా ముందస్తు ప్రణాళికలకు ఈ నివేదిక ఉపకరిస్తుందన్నారు. ఎన్‌సీడీ 4.0 సర్వే ద్వారా క్యాన్సర్ కేసుల స్క్రీనింగ్ సంతృప్తికరంగా సాగుతోందని, గుర్తించిన కేసులను రిఫర్ చేయడంలో జాప్యం లేకుండా చూడాలని సూచించారు. బోధనాసుపత్రుల్లో ఏర్పాటు చేసిన ప్రివెంటివ్ ఆంకాలజీ యూనిట్లపై ప్రజల్లో అవగాహన పెంచాలని నిర్దేశించారు. ఎన్టీఆర్ వైద్యసేవ ట్రస్ట్ సీఈవో దినేష్ కుమార్ మాట్లాడుతూ ట్రస్ట్ ఆవిర్భావం నుంచి ఇప్పటి వరకు 3.29 లక్షల మంది క్యాన్సర్ పీడితుల చికిత్స కోసం ప్రభుత్వం రూ.4,616 కోట్లు ఖర్చు చేసిందన్నారు. పట్టణాల్లోనే క్యాన్సర్ కేసులు ఎక్కువగా నమోదవుతున్నట్లు చెప్పారు. రాష్ట్రంలోని జిల్లా ఆసుపత్రుల్లో తొమ్మిది డే కేర్ కీమోథెరపీ సెంటర్లు ఉన్నాయని, ఈ సంఖ్య పెంచేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని సెకండరీ హెల్త్ సంచాలకులు కె.వి.ఎన్.చక్రధర్‌బాబు చెప్పారు. క్యాన్సర్ చికిత్స అందించే ప్రైవేటు వైద్యులతో త్వరలో ఓ సదస్సు నిర్వహించనున్నట్లు ఆరోగ్య- కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ వీరపాండియన్ తెలిపారు.

రూ.548 కోట్ల ఆర్థిక సంఘం నిధుల విడుదల

ఈనాడు, అమరావతి: స్థానిక సంస్థలకు రూ.548.28 కోట్ల 15వ ఆర్థిక సంఘం నిధుల విడుదలకు ప్రభుత్వం ఉత్తర్వులిచ్చింది. 2025-26 సంవత్సరానికి టైడ్ గ్రాంట్ కింద జిల్లా, మండల పరిషత్‌లు, గ్రామ పంచాయతీలకు కేటాయించింది. ఈ మేరకు తదుపరి చర్యలు తీసుకోవాలని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్‌ను ఆదేశిస్తూ ఆ శాఖ ముఖ్య కార్యదర్శి శశిభూషణ్‌కుమార్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు.

అంతర్జాతీయ విపణిని అందిపుచ్చుకుందాం

ప్రపంచ సుగంధ ద్రవ్యాల సంస్థ ఛైర్మన్ రామ్‌కుమార్

ఈనాడు, అమరావతి: సుగంధ ద్రవ్యాలకు ప్రపంచ విపణిలో డిమాండ్ ఉన్న దృష్ట్యా దేశంలో వాటి ఉత్పాదకత పెంచేలా చర్యలు తీసుకోవాలని ప్రపంచ సుగంధ ద్రవ్యాల సంస్థ (డబ్ల్యూఎస్‌వో) ఛైర్మన్ రామ్‌కుమార్ సూచించారు. డబ్ల్యూఎస్‌వో ఆధ్వర్యంలో గుంటూరులోని ఐటీసీ వెల్కమ్ హోటల్‌లో 4వ జాతీయ సుగంధ ద్రవ్యాల సదస్సు శుక్రవారం ప్రారంభమైంది. సుగంధ ద్రవ్యాల సాగు విస్తరణ, ఉత్పత్తి పెంచడం, నాణ్యత ప్రమాణాలు పాటించడం, ఎగుమతుల్లో ఎదురవుతున్న ఇబ్బందులపై చర్చించారు. రామ్‌కుమార్ మాట్లాడుతూ.. మనదేశం నుంచి మిర్చి ఎగుమతులు ఎక్కువగా ఉన్నందున సాగులో మెలకువలు పాటించడం, పురుగుమందుల నియంత్రణ, శుద్ధి చేయడంలో నాణ్యత పాటించడం వంటి అంశాలపై రైతులు, ఉత్పత్తిదారుల సంఘాలకు అవగాహన కల్పిస్తామన్నారు. సుగంధ ద్రవ్యాల బోర్డు సంచాలకులు ఏబీ రెమాశ్రీ, ఎఫ్ఎస్ఎస్ఏఐ సైంటిఫిక్ ప్యానల్ ఆన్ పెస్టిసైడ్ రెసిడ్యూస్ ఛైర్మన్ పరేష్ షాలు మాట్లాడారు. శాస్త్రవేత్తలు, రైతులు, ఎఫ్‌పీవోలు, ఎగుమతిదారులు, శుద్ధి యూనిట్ల తయారీ కంపెనీల ప్రతినిధులు, వ్యాపారులు పాల్గొన్నారు.


సదస్సులో మాట్లాడుతున్న రామ్‌కుమార్

రేపు విజయవాడకు సీజేఐ జస్టిస్ గవాయ్ రాక

భారత రాజ్యాంగంపై ప్రసంగం

ఈనాడు, అమరావతి: సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్ ఆదివారం విజయవాడకు రానున్నారు. ఉదయం 11 గంటలకు మంగళగిరిలోని సీకే కన్వెన్షన్‌లో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో పాల్గొని 'ఇండియా అండ్ ది లివింగ్ ఇండియన్ కాన్‌స్టిట్యూషన్ ఎట్ 75 ఇయర్స్' అనే అంశంపై ప్రసంగిస్తారు. భారత రాజ్యాంగం అమల్లోకి వచ్చి 75 ఏళ్లు పూర్తయిన సందర్భంగా ఏపీ హైకోర్టు న్యాయవాదుల సంఘం ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఇందులో ముఖ్యమంత్రి చంద్రబాబు కూడా పాల్గొననున్నారు. హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకుర్, హైకోర్టు న్యాయమూర్తులు, అడ్వొకేట్ జనరల్ దమ్మాలపాటి శ్రీనివాస్, పలువురు న్యాయవాదులు పాల్గొంటారు. హైకోర్టు న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు కె.చిదంబరం, ప్రధాన కార్యదర్శి సుబోధ్, కార్యవర్గం శుక్రవారం ఈ మేరకు ఓ ప్రకటన విడుదల చేశారు.

నేటి నుంచి విజయవాడ-సింగపూర్ విమాన సర్వీసు

గన్నవరం గ్రామీణం, న్యూస్‌టుడే: ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న విజయవాడ -సింగపూర్ అంతర్జాతీయ విమాన సర్వీసు శనివారం నుంచి ప్రారంభం కానుంది. ఇండిగో విమానయాన సంస్థ ఈ సర్వీసును నడిపేందుకు ముందుకొచ్చిన సంగతి తెలిసిందే. ఈ సర్వీసును గన్నవరం విమానాశ్రయ అభివృద్ధి కమిటీ ఛైర్మన్, ఎంపీ వల్లభనేని బాలశౌరి, ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావులు ప్రారంభించనున్నారు. ప్రతి మంగళ, గురు, శనివారాల్లో ఈ సర్వీసు నడుస్తుందని విమానాశ్రయ డైరెక్టర్ ఎం.లక్ష్మీకాంతరెడ్డి తెలిపారు.

అమరరాజాకు అంతర్జాతీయ స్థాయి పురస్కారాలు


జాతీయ జెండాతో అమరరాజా ఉద్యోగులు

రేణిగుంట, న్యూస్‌టుడే: అమరరాజా సంస్థకు అంతర్జాతీయ స్థాయిలో పలు అవార్డులు దక్కినట్లు 'అమరరాజా ఎనర్జీ, మొబిలిటీ లిమిటెడ్' ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ హర్షవర్ధన్ గౌరినేని తెలిపారు. తిరుపతి జిల్లా కరకంబాడి కార్యాలయంలో శుక్రవారం ఆయన మాట్లాడారు. ఇటీవల తైవాన్ దేశంలో నిర్వహించిన 50వ అంతర్జాతీయ క్వాలిటీ కంట్రోల్ సర్కిల్ కన్వెన్షన్ వేడుకల్లో.. తమ సంస్థ అసాధారణ విజయాలతో 13 గోల్డెన్ అవార్డులను గెలుచుకుందని చెప్పారు. 14 దేశాల నుంచి 884 బృందాలు ఈ పోటీల్లో పాల్గొన్నాయని, తమ ఉద్యోగుల క్రమశిక్షణ, కృషి, నిబద్ధతలకు ఈ అవార్డులు నిదర్శనమన్నారు. అవార్డులు సాధించిన ఉద్యోగ బృందాలకు అమరరాజా ఛైర్మన్ గల్లా జయదేవ్ శుభాకాంక్షలు తెలిపారు.

GOVERNMENT OF ANDHRA PRADESH
HEALTH, MEDICAL & FAMILY WELFARE DEPARTMENT
ANDHRA PRADESH MEDICAL SERVICES RECRUITMENT BOARD

NOTIFICATION NO.10 OF 2025, DATED: 14-11-2025

Applications are invited from the eligible candidates for recruitment post of **Hospital Administrator (Managers)** in the State of Andhra Pradesh under the control of the Director of Medical Education, A.P., Vijayawada **on Contract basis. The total number of vacancies are (8) Eight only. The Eligibility criteria, details of vacancies, and guidelines for submission of applications** are available on the follwing websites 1. **http://apmsrb.ap.gov.in/msrb/ 2. https://hmfw.ap.gov.in 3. https://ayush.ap.gov.in**

Sl. No.	Name of the Post	No. of Vacancies	Mode of Recruitment
1	Hospital Administrator (Managers)	08	Contract Basis with Consolidated payment
	Total	**08**	

Interested candidates are requested to apply through online from **17-11-2025 to 30-11-2025 upto 11.59 pm.**

Dated: 14-11-2025 **Sd/- M.V.Suryakala, Member Secretary, APMS Recruitment Board, Mangalagiri**

DIPR No. 4573PP/CL/Advt/1/1/2021-22


ఈనాడు

ఎదురులేని ఎన్డీయే!

యావద్దేశమంతా అమితాసక్తితో ఎదురుచూసిన బిహార్ ఎన్నికల ఫలితాలు ఎన్డీయే శ్రేణులను అపురూపానంద సాగరంలో ముంచేశాయి. ఎగ్జిట్‌పోల్స్ అంచనాలకు సైతం అందని స్థాయిలో బిహారీలు ఎన్డీయేకు ఏకపక్షంగా విజయతిలకం దిద్దడంతో 'మహా గఠ్‌బంధన్' పార్టీలు మూకుమ్మడిగా చావుదెబ్బ తిన్నాయి. పాతికేళ్ల క్రితం మొదటిసారి ముఖ్యమంత్రి అయిన వారం రోజులకే తప్పక పదవిలోంచి దిగిపోయిన నీతీశ్‌కుమార్- మధ్యలో కొన్నాళ్లు మినహా 2005 నుంచి సీఎం కుర్చీని అంటిపెట్టుకునే ఉన్నారు. అయినా ఎక్కడా ప్రభుత్వ వ్యతిరేకత తలెత్తకుండా చూసుకుని 'సుశాసన్‌బాబు'గా తన ప్రతిష్ఠను ఇప్పుడు మరింత పెంచుకున్నారు. పురుషుల కంటే చాలా ఎక్కువగా పోలింగ్ బూత్‌ల ముందు బారులుతీరి ఓట్లేసిన నారీజన మద్దతుతో సొంతపార్టీ జేడీయూకు గతానికన్నా మిన్నగా సీట్లు సాధించిపెట్టారు. అటువంటి నీతీశ్‌తో చెలిమి కలిమి కావడంతో పాటు సాటిలేని సంస్థాగత బలం, ప్రధాని మోదీ ఛరిష్మాలతో కమల రథం దూసుకుపోయింది. 2020 ఎలక్షన్లలో ఒకే ఒక్క స్థానంలో గెలిచిన చిరాగ్ పాసవాన్ లోక్‌జనశక్తి పార్టీ ఈసారి అంతకు ఇరవై రెట్ల స్థాయిలో విజయదుందుభి మోగించింది. వ్యక్తిగతంగా పోటీ నుంచి ముందే పలాయనం చిత్తగించిన ప్రశాంత్ కిశోర్ చివరికి వట్టి చేతులతో మిగిలిపోయారు. ఆ స్వయంప్రకటిత వ్యూహకర్త రాజకీయ ఆశాసౌధాలను బిహారీలు నిష్కర్షగా నేలకూల్చేశారు!

సీట్ల పంపిణీ నుంచి ఓట్ల బదిలీ వరకు ఎన్డీయే పక్షాలు ఆద్యంతం ఏకతాటిపై నిలిస్తే- స్నేహపూర్వక పోటీల పేరిట 'మహా గఠ్‌బంధన్' పార్టీలు పలు స్థానాల్లో అనైక్యమయ్యాయి. అభివృద్ధి, సంక్షేమం జమిలిగా జేడీయూ, భాజపా ప్రచార వ్యూహాన్ని పదునుతేల్చి బిహార్ ప్రజల ముందు ఉంచితే- ప్రతిపక్షాలేమో తాత్కాలిక వరదానాలూ పసలేని విమర్శలనే ఎక్కువగా నమ్ముకున్నాయి. ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ముఖ్యమంత్రి మహిళా రోజ్‌గార్ యోజన ప్రకటించి దాదాపు 1.21 కోట్ల మంది స్త్రీల ఖాతాల్లోకి రూ.10వేల చొప్పున వేయడం నీతీశ్‌కు బాగా లాభించింది. ఇలాంటి పథకాల ముందు తేజస్వీ యాదవ్ 'ఇంటికో ప్రభుత్వోద్యోగం' హామీ తేలిపోయింది. ఆచరణ సాధ్యంకాని ఆపదమొక్కుగానే దాన్ని బిహారీ ప్రజానీకం భావించింది. లాలూ, రబ్రీదేవిల ఏలుబడి నాటి 'జంగిల్‌రాజ్' చేదుజ్ఞాపకాలు ఇప్పటికీ వెంటాడుతుంటే తగుదునమ్మా అంటూ మద్యనిషేధాన్ని తేజస్వీ తూలనాడటం, తాము అధికారంలోకి వస్తే దాన్ని సమీక్షిస్తామనడం మహిళలను 'మహా గఠ్‌బంధన్'కు ఇంకా దూరం చేసింది. తాజా దారుణ ఓటమి ఆర్జేడీ భవిష్యత్తును, ముఖ్యంగా తేజస్వీ నాయకత్వాన్ని ప్రశ్నార్థకంగా మార్చేసింది!

కాంగ్రెస్ 'ఆశ లావు పీక సన్నం' రాజకీయాలు పోయినసారే 'మహా గఠ్‌బంధన్' పుట్టిముంచాయి. 2020లో 70 స్థానాల్లో పోటీకి దిగిన హస్తం పార్టీ పందొమ్మిది చోట్లే గెలవగలిగింది. బిహార్‌లో తన ప్రజాకర్షక శక్తి ఉడిగిపోయిన సంగతిని అర్థం చేసుకోకుండా ఈ తడవ 61 సీట్లు తీసుకుని వేళ్లపై లెక్కబెట్టగలిగిన స్థానాలనే చేజిక్కించుకోగలిగింది! ప్రజల ఆలోచనలూ వాస్తవ సమస్యలను పట్టించుకోకుండా ఒకటి రెండు అంశాలపైనే పదేపదే మాట్లాడుతున్న అధినాయకుల విపరీత ధోరణే కాంగ్రెస్‌కు శాపమవుతోంది. 'ఓట్ల చోరీ' ఆరోపణలపై జనంలో స్పందన రావట్లేదని, ప్రచారాంశాలను మార్చుకోకపోతే దెబ్బతింటామని తాము మొత్తుకున్నా రాహుల్ గాంధీ బృందం ఆలకించలేదని ఆ పార్టీ వర్గాలే నెత్తీనోరూ కొట్టుకుంటున్నాయి. ప్రజావసరాలను తీర్చేందుకు తామెలాంటి ప్రత్యామ్నాయ రాజకీయాలను అనుసరిస్తామో బలంగా చెప్పకుండా ప్రధానిని విమర్శించడం ద్వారానే జనవిశ్వాసాన్ని గెలుచుకోగలమని రాహుల్ భావిస్తే అది కల్లే అవుతుంది. జూబ్లీహిల్స్ ఉపఎన్నికలో సీఎం రేవంత్‌రెడ్డి సారథ్యంలో తెలంగాణ కాంగ్రెస్ సాధించిన గెలుపే ఆ పార్టీకి ఇప్పుడు కాస్త ఉపశమనం కాగలదు!



కక్షిదారులను లీగల్ పేషెంట్లుగా అనుకోవచ్చు. ఏదో ఒక అన్యాయంతో బాధపడడం వల్లే వాళ్లు కోర్టు దాకా వస్తారు. రోగిని ఆలస్యంగా వచ్చావని చికిత్స చేయకుండా పంపించివేయం కదా. అలాగే వీళ్లకీ వాళ్ల అన్యాయాల గాయాలకు న్యాయమనే చికిత్స చేసి పంపాలి.

– జస్టిస్ వి.ఆర్.కృష్ణయ్యర్

అమరత్వం

మరణం లేని స్థితి పొందడమే అమరత్వం. పురాణాల్లో, ఇతిహాసాల్లో, తత్వశాస్త్రాల్లో, మతపరమైన సంప్రదాయాల్లో ప్రముఖంగా కనిపించే విషయం ఇది. శరీరం నశించినా ఆత్మ నశించదని ఆధ్యాత్మిక సాధకుల నమ్మకం. 'నా జాయతే మ్రియతే వా కదాచిత్ నాయం భూత్వా భవితా వా న భూయః' ఆత్మ జనన మరణాలకు, భావ వికారాలకు అతీతమైందని భగవద్గీత చెబుతుంది.

పుట్టిన ప్రతి జీవికీ మరణం అనివార్యం. హిందూ ధర్మంలో ఆత్మ ఒక శరీరాన్ని విడిచి మరో శరీరంలోకి ప్రవేశిస్తుందని చెబుతారు. ఈ ప్రక్రియలో జన్మ పరంపరలు ముగిసిపోయాక మోక్షం సిద్ధిస్తుందని విశ్వసిస్తారు. ఈ క్రమంలో ఒక వ్యక్తి గడిపే ధార్మిక జీవనం, చేసే సత్కర్మలు మరణానంతర జీవితంపై ప్రభావం చూపుతాయని ఆధ్యాత్మిక సాధకుల నమ్మకం. ఇది మరణ భయాన్ని నియంత్రిస్తుంది. అప్పుడు మరణం శరీరానికే కానీ ఆత్మకు కాదనే అవగాహన ఏర్పడుతుంది.

అమరత్వం అనేది మానవజాతికి అనాదిగా ఉన్న కల. కానీ, భౌతికంగా అమరత్వం పొందడం అసాధ్యం. ఎందుకంటే మానవ శరీరం వ్యాధులు, బాధలు, ప్రమాదాలు, వృద్ధాప్యం, మరణం వంటి వాటి నుంచి తప్పించుకోలేదు. అయినప్పటికీ భౌతిక అమరత్వం కోసం తపించడం మానవకోరిక పోవడంలేదు. మనిషి జీవశాస్త్ర పరంగా అమరత్వం పొందినవిగా భావించే కొన్ని జీవులను చూసి తానూ ఆశలు పెంచుకుంటున్నాడు. ఉదాహరణకు జెల్లీఫిష్ తన జీవిత చక్రాన్ని వెనక్కి తిప్పుకోగలదు. మనుషుల్లో దీన్ని సాధించడానికే వృద్ధాప్యాన్ని నిలువరించడం, కణాల పునరుత్పత్తి, వ్యాధుల నివారణ వంటి అంశాలపైన పరిశోధనలు జరుగుతున్నాయి.



ఇలాంటి ఆలోచన లేకపోయినా కొంతమంది చిరంజీవులుగా అమరత్వం పొందుతారు. గౌతమ బుద్ధుడు, శంకర భగవత్పాదులు, ఏసు క్రీస్తు లాంటివారు నేటికీ ఆధ్యాత్మికంగా ఎంతో మందికి మార్గదర్శనం చేస్తున్నారు. మరికొంత మంది తమ రచనలు, కళల ద్వారా ఇప్పటికీ ప్రపంచాన్ని ప్రభావితం చేస్తున్నారు. స్వాతంత్ర్యం కోసం నిస్వార్థంగా పోరాడిన జాతీయ నాయకులను నేటికీ స్మరించుకుంటున్నాం. పురాణ పురుషులైన అశ్వత్థామ, మహాబలి, వ్యాసుడు, హనుమంతుడు, విభీషణుడు, కృపాచార్యుడు, పరశురాముడు తమ తపస్సు, ధర్మ నిష్ఠల ద్వారా కలియుగాంతం వరకూ చిరంజీవులుగానే ఉంటారని నమ్మకం ప్రజలలో ఉంది.

అమరత్వం కేవలం భౌతిక జీవితానికి సంబంధించింది మాత్రమే కాదు. ఆధ్యాత్మిక సాధనతో మోక్షం లేదా ఆత్మ సాక్షాత్కారం పొందడాన్ని ఇది సూచిస్తుంది. దాని సంగతి అలా ఉంచితే- చరిత్రలో చిరంజీవులుగా మిగలాలంటే మానవత్వంతో సాటి వారికి, సమాజానికి ఉపయోగపడే పనులు చెయ్యాలి. తమ అనుభవాలను, జ్ఞానాన్ని, నైపుణ్యాలను ఇతరులకు పంచాలి. సృజనాత్మక కళల ద్వారా చిరస్మరణీయులు కావడం కూడా అమరత్వ సాధనే అవుతుంది. సద్గుణాలతో సత్కార్యాలు చేసేవారే ప్రజల మనసుల్లో నిత్యం సజీవులై ఉంటారు.

అంతర్యామి

– ఎం.వెంకటేశ్వర రావు



ఎవరికి ప్రమాదం?

కృత్రిమ మేధ(ఏఐ) అనేక రంగాల్లో విప్లవాత్మక మార్పులు తెస్తోంది. అమెరికాలోని చాలా సంస్థలు పెద్దగా నైపుణ్యం అక్కర్లేని, సాధారణ పనులను ఏఐతో పూర్తిచేసేస్తున్నాయి. దాంతో ఆ పనులు చేసే ఉద్యోగుల తొలగింపు తప్పనిసరి అవుతోంది. ఇలాంటి పరిస్థితి ప్రస్తుతం భారత్‌లో పెద్దగా కనిపించకపోయినా... సమీప భవిష్యత్తులో ప్రపంచవ్యాప్తంగా ఈ ధోరణి విస్తరించకమానదు. ఇలాంటి పరిస్థితుల్లో ఉన్న ఉద్యోగాలు ఊడిపోతాయా? ఈ ముప్పును ఎదుర్కోవడమెలా? కొత్త కొలువులను ఒడిసిపట్టడమెలా?

బహుళజాతి సంస్థ అమెజాన్ ఇటీవల 14వేల మంది ఉద్యోగులకు ఉద్వాసన పలికింది. కృత్రిమ మేధ(ఏఐ) వల్ల ఉద్యోగాల్లో కోత తప్పకపోవచ్చని ఆ సంస్థ సీఈవో ఆండ్రూ జస్సీ అంతకు కొద్దిరోజుల ముందు వ్యాఖ్యానించారు. అమెజాన్‌లో 15లక్షల మందికి పైగా పనిచేస్తున్నారు. అంతమందిలో 14వేల మందిని తొలగించడం ఆ సంస్థకు పెద్ద విషయం కాకపోవచ్చు. కానీ, ఆ ఉద్యోగులకు వ్యక్తిగతంగా అది పెద్ద దెబ్బే. ఏఐ రూపంలో ముంచుకొస్తున్న ముప్పునకు ఇదో సంకేతం! తాజా పరిణామాల నేపథ్యంలో ఏఐ ద్వారా ఎలాంటి ప్రయోజనాలు ఉంటాయనే దానిపై కార్పొరేట్ సంస్థల్లోనూ, తొలగింపు ముప్పును ఎలా ఎదుర్కోవాలనే దానిపై ఉద్యోగుల్లోనూ చర్చ జరుగుతోంది.

ఎలాంటి ఉద్యోగాలకు ఇబ్బంది?

ఇప్పుడు ప్రతి ఒక్కరూ నేనేం పని చేస్తున్నాను? దీనికి ఎంత నైపుణ్యం అవసరం? అనేది ప్రశ్నించుకోవాలి. ఎందుకంటే, కృత్రిమ మేధ వల్ల కోల్పోయే ఉద్యోగాల్లో పెద్దగా నైపుణ్యం అవసరం లేనివే ఎక్కువ. డేటా ఎంట్రీ, కాల్ సెంటర్, కస్టమర్ సర్వీస్-సపోర్ట్, కోడింగ్‌తో పాటు సాధారణ పరిపాలన, ఊహా చిత్రాలు గీయడం, అనువాదం వంటి పనులను ఏఐతో కంప్యూటర్లు సులభంగా చేసేస్తాయి. రొటీన్‌గా చేసే ఇలాంటి పనులన్నింటినీ కృత్రిమ మేధ చక్కబెడుతుంది. ఇలాంటి ఉద్యోగుల స్థానంలోని ఏఐ డెవలపర్లు, ఇంజినీర్లు, మెషీన్ లెర్నింగ్ నిపుణులు, డేటా అనలిస్టులు, శాస్త్రవేత్తలు వస్తారు. అదేవిధంగా న్యాయశాస్త్రం, వైద్యం, ఫైనాన్స్, సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్ విభాగాల్లోనూ ఏఐ పాత్ర విస్తరిస్తోంది. వీటిలో పనిచేసే నిపుణులు ఆలోచించడానికీ, పర్యవేక్షించడానికీ, ఏఐని సమర్థంగా వినియోగించడానికే ఎక్కువగా పరిమితమవుతారు. మనుషులు సృష్టించిన కంప్యూటర్లూ, రోబోలూ చేయలేని పనులు చేసేవారికి మాత్రం ఉద్యోగాలు పోతాయన్న భయమేమీ అక్కర్లేదు. కళలు, సాహిత్యంతో పాటు విచక్షణ, వివేచన, భావావేశం, భావుకత, ఊహాశక్తి, మానవ తెలివితేటలతో చేయాల్సిన పనులు కొన్ని ఉంటాయి. వీటిని 'ఏఐ-ప్రూఫ్' ఉద్యోగాలు అంటారు. నర్సులు, ఫిజియో థెరపిస్టులు, హెచ్‌ఆర్ మేనేజర్లు, టీచర్లు చేసే పనులను పూర్తిగా ఏఐ సాంకేతికతతో చేపట్టడం సాధ్యం కాదు. కాబట్టి ఇలాంటి వారికి పెద్దగా ఇబ్బంది ఉండకపోవచ్చు.



మార్పు తప్పనిసరి...

ఇంతకాలం ఉద్యోగం కోసం ఇంటర్వ్యూకు వెళ్లిన అభ్యర్థికి- నువ్వేం చదివావు? ఏం నేర్చుకున్నావు? మా సంస్థకు ఏవిధంగా ఉపయోగపడగలవు? ఇలాంటి పనులు నువ్వు చేయగలవా?... ఈ తరహా ప్రశ్నలే ఎదురయ్యేవి. ఇక నుంచి 'ఏఐని ఎంత సమర్థంగా వాడగలవు? ఏఐ టూల్స్‌ను ఎంతవరకూ నేర్చుకున్నావు...' అనే ప్రశ్నలే ఎదురవుతాయి. ఏఐని సరైన ప్రశ్నలు అడిగి సమాధానాలు రాబట్టే వారికి ఉద్యోగ అవకాశాలు ఎక్కువగా ఉంటాయని గుర్తుపెట్టుకోవాలి. ఇలా ప్రశ్నలు వేయడాన్ని 'ఏఐ ప్రాంప్ట్' అంటారు. మన అవసరమేంటో, మనకు ఏం కావాలో బాగా అర్థం చేసుకుని... తదనుగుణంగా ఏఐని అత్యంత స్పష్టంగా అడగడమన్న మాట. ఒక విధంగా, ఏఐ తగిన సమాధానాన్ని సిద్ధం చేయడానికి అవసరమైన ఇన్‌పుట్ ఇవ్వడమే ప్రాంప్టింగ్. భవిష్యత్తులో ప్రతి ఉద్యోగానికీ ఏఐను వినియోగించే సామర్థ్యం(ఏఐ లిటరసీ) తప్పనిసరి అవుతుంది. అర్హత, అనుభవానికి తోడు ఏఐ టూల్స్‌ను ఎంత సమర్థంగా వినియోగిస్తారనేది ఉద్యోగాల్లో ఎదుగుదలకూ కీలకమవుతుంది.

ఏఐ వల్ల భవిష్యత్తులో డేటా ఎంట్రీ వంటి సాధారణ ఉద్యోగాలు ఉండవు. అదే సమయంలో ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాలూ, కార్పొరేట్ సంస్థల పాలనా వ్యవహారాల్లో సమూలంగా మార్పులు వస్తాయి. విధివిధానాల రూపకల్పన, కార్యాచరణ, ఉత్పత్తి, పరిశోధనలు అనేక మార్పులకు లోనవుతాయి. ఫ్యాక్టరీల్లో ఆటోమేషన్ పెరిగిపోతుంది. అక్కడ మనుషుల స్థానంలో రోబోటిక్ యంత్రాలు నిరంతరాయంగా పనిచేస్తూనే ఉంటాయి. కాబట్టి, వస్తూత్పత్తికి, సేవలు అందించడానికి మనుషులపై పెద్దగా ఆధారపడాల్సిన పని ఉండదు. పైగా ఇవి చాలా వేగంగా పూర్తవుతాయి. కొన్ని పనులను ఏఐ చేయలేకపోయినా, వాటిని చేసే ఉద్యోగులకు సహాయకారిగా నిలుస్తుంది. వ్యవసాయ రంగంలోనూ పొలాలకు నీరు పెట్టడం, ఎరువులూ పురుగుమందులు చల్లటం వంటి పనులకూ ఏఐ సాయపడుతుంది.

నైపుణ్యాలు ఉంటేనే...

'ఏఐతో ఉద్యోగాలు వస్తాయా, పోతాయా' అనే ప్రశ్నకు రెండూ జరుగుతాయనే సమాధానం చెప్పాలి. ఉద్యోగాలు పోతాయనే భయం కొంతవరకు నిజమే కానీ, అదే సమయంలో పెద్దసంఖ్యలో కొత్త తరహా కొలువులు పుట్టుకొస్తాయన్నదీ గుర్తించాలి. భవిష్యత్తులో పనులు అయితే ఉంటాయి కానీ, వాటిని ఇప్పటిలా కాకుండా ఏఐ సాయంతో పూర్తిచేయాల్సి ఉంటుంది. దాదాపు మూడు దశాబ్దాల క్రితం కంప్యూటర్లు విస్తృతంగా అందుబాటులోకి వచ్చినప్పుడు ఉద్యోగాలు పోతాయనీ, కంప్యూటరీకరణ వద్దనే ఆందోళనలు తలెత్తాయి. కానీ ఆ తరవాత పెద్దసంఖ్యలో ఉద్యోగాలు పుట్టుకొచ్చాయి. కంప్యూటరీకరణ వల్ల సేవల్లో వేగం, నాణ్యత పెరిగాయి. ఏఐతోనూ ఇటువంటి మార్పులే వస్తాయని నిస్సందేహంగా చెప్పవచ్చు. ఏఐ వల్ల నష్టపోయే కొలువుల కంటే కూడా అధిక సంఖ్యలో కొత్త ఉద్యోగాలు అందుబాటులోకి వస్తాయి. కాకపోతే చిన్న, మధ్యస్థాయి ఉద్యోగాలు తగ్గిపోయి నైపుణ్యం, అనుభవం అవసరమైనవి పెరుగుతాయి. ఈ మార్పులను అంగీకరించి, ఆహ్వానించి, ఏఐ నైపుణ్యాలపై పట్టు సాధించనివారికి నష్టం తప్పదు. పక్కకు తప్పుకొని కొత్తవారికి అవకాశం ఇవ్వాల్సి వస్తుంది. 'ఏఐ రెడీ'గా తమను తాము తీర్చిదిద్దుకునేవారే నిలబడగలుగుతారు.



ఎల్.మారుతీ శంకర్

డిజిటల్ సాంకేతిక రంగ నిపుణులు

నా ఫ్రెండ్ కొడుకు హోటల్ మేనేజ్‌మెంట్‌లో డిగ్రీ చేశాడు. ఈమధ్య ఓ పెద్ద హోటల్లో అసిస్టెంట్ షెఫ్ పోస్టు కోసం దరఖాస్తు చేశాడు. మాకు తెలిసిన అబ్బాయని కాదు కానీ నిజంగానే అతడికి వంటల్లో మంచి ప్రావీణ్యం ఉంది. అందుకే వాళ్లింట్లో పార్టీ అంటే అందరం ఇష్టంగా వెళ్తాం. ఒక్క మెతుకు వృథా చేయకుండా తినేస్తాం. అలాంటి కుర్రాడికి ఉద్యోగం రాకుండా ఉంటుందా? వచ్చే ఉంటుంది, మరోసారి పార్టీ చేసుకోవచ్చని ఫోన్ చేశాను. అటునుంచి వచ్చిన స్పందన నన్ను ఆలోచనలో పడేసింది. అతడేం చెప్పాడంటే...

అసలు రహస్యం




తనతోపాటు మరో ముగ్గురు ఫైనల్‌గా ఇంటర్వ్యూకి వచ్చారు. నలుగురినీ ఒకేసారి లోపలికి పిలిచి 'సార్ రావడానికి కాస్త టైమ్ పడుతుంది, ఈలోపల స్నాక్స్ తీసుకో'మన్నారట. సర్వర్ నలుగురికీ సూప్ అందించాడు. ఆ తరవాత ప్లేటు నిండా పకోడీ తెచ్చిచ్చాడు. అర్ధగంట గడిచాక ఓ పెద్దాయన నవ్వుతూ అందరినీ విష్‌చేస్తూ లోపలికొచ్చారు. ఆయన వస్తూనే ప్రతి ఒక్కరి ఆహార్యాన్ని, తిని పక్కన పెట్టిన ప్లేట్లను నిశితంగా పరిశీలించారు. నా స్నేహితుడి కొడుకును ఎగాదిగా చూసి 'బాబూ.. నీకు మా హోటల్లో ఉద్యోగం ఇవ్వలేం.. నువ్వెళ్లిపోవచ్చు' అని చెప్పడంతో ఎందుకలా చెప్పాడో అర్థంకాక, అవమానంగానూ ఫీలై బయటికి వచ్చేశాడు. అప్పుడు సర్వర్ ఎదురొచ్చి 'సారీ సర్..' అన్నాడు. 'అసలేం జరిగింది? ఇంటర్వ్యూ చేయకుండానే నన్నిలా బయటికి గెంటేశారెందుకు?' అని కోపంగా అడిగాడు. అప్పుడు సర్వర్ 'బాబూ.. మీరు సూప్ పూర్తిగా తాగారా?' అని అడిగాడట. లేదని తల అడ్డంగా ఊపాడు. 'పోనీ పకోడీలన్నా మొత్తం తిన్నారా?' అన్న ప్రశ్నకు 'నాలుగు తిని వదిలేశా..' అని చెప్పాడు. అప్పుడా సర్వర్ 'అదీ అసలు సంగతి. ఆహార పదార్థాలను ఎవరైనా వృథా చేస్తే మా బాస్‌కు అస్సలు నచ్చదు. మీకే ఉద్యోగమిస్తే రేపట్నుంచి కిచెన్‌లో ఎంత సరకు వృథా చేస్తారోనని భయపడ్డారు. సూప్, పకోడీ మీకిష్టం లేకపోతే ముందే వద్దని చెప్పాల్సింది. తీసుకుని వృథా చేయడం బహుశా ఆయనకు నచ్చి ఉండదు...' అని అసలు రహస్యం చెప్పాడట. కాబట్టి సబ్జెక్టులో ఎక్స్‌పర్ట్‌లమని విర్రవీగితే సరిపోదు, ఇంటర్వ్యూకి వెళ్లినప్పుడు మిగతా విషయాలమీదా దృష్టిపెట్టాలన్నమాట.

ఇంటర్వ్యూకు వెళ్లినప్పుడు అభ్యర్థి డిగ్రీలు, సర్టిఫికెట్లనే కాదు నైపుణ్యాలనూ తరచి చూస్తారు. గుణగణాల్నీ, ప్రవర్తనను బేరీజు వేస్తారు. ఒకోసారి ఇంటర్వ్యూ చేసేవాళ్లు తలాతోకా లేని ప్రశ్నలు వేసి విసిగించనూ వచ్చు. అది మనం భావోద్వేగాలను ఎంతవరకు నియంత్రించుకోగలమో పరీక్షించడానికి కావచ్చు. అందుకే సంయమనం కోల్పోకుండా వ్యవహరించాలి. ముఖం మీద చిరునవ్వు చెదరకూడదు. అవతలి వ్యక్తులు నవ్వుతూ మాట్లాడితే దాన్ని అలుసుగానూ తీసుకోకూడదు. డ్రెస్సింగ్‌లో, బాడీ లాంగ్వేజ్‌లో, భాషలో ఆత్మవిశ్వాసం చెక్కుచెదరకూడదు. అప్పుడే విజయం మన తలుపు తడుతుంది!

– చెన్నాప్రగడ వీఎన్నెస్ శర్మ

శరీరమే బరువై...

ప్రపంచవ్యాప్తంగా చాలామంది పసివాళ్లు సరైన పోషకాహారం లేక గిడసబారిపోతున్నారు. మరోవైపు జంక్‌ఫుడ్ వినియోగం పెరగడం, వ్యాయామ లేమి తదితరాల వల్ల చిన్నారులు, కౌమారుల్లో స్థూలకాయం సమస్య తలెత్తుతోంది. అయితే గడిచిన రెండు దశాబ్దాల్లో ప్రపంచవ్యాప్తంగా 0-4 ఏళ్ల వయసు పిల్లల్లో ఒబెసిటి తగ్గింది. 2000 సంవత్సరంలో అలాంటి వారు కోటి మంది ఉంటే, 2024 నాటికి వారి సంఖ్య 80 లక్షలకు తగ్గింది. అయితే, 5-19 మధ్య వయసు వారిలో స్థూలకాయుల సంఖ్య బాగా పెరిగింది. 2000, 2022లో విశ్వవ్యాప్తంగా ఆయా వయోవర్గాల పరంగా స్థూలకాయులు... (కోట్లలో)



(ఆధారం: యునిసెఫ్ నివేదిక)

ఆదివాసుల ఆత్మగౌరవ పతాకం

నేడు బిర్సా ముండా 150వ జయంతి. పట్టుమని పాతికేళ్లయినా రాకముందే ఆంగ్లేయులపై పిడికిలి బిగించిన ఆయన ధైర్య సాహసాలను స్మరించుకుంటూ భారత ప్రభుత్వం నవంబరు 15వ తేదీని 'జన్‌జాతీయ గౌరవ్ దివస్'గా ప్రకటించింది. ఆయనలాంటి ఎంతోమంది గిరిజన వీరుల గాథలను వెలుగులోకి తెచ్చేందుకూ, సమాజానికి ఆదివాసులు అందించిన సేవలను గుర్తుచేసేందుకూ నేడు పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.



సమాజంలో ఆధునిక వ్యవస్థలు ఏర్పడకముందే, ఎన్నో సవాళ్లకు ఎదురొడ్డి ఈ భూమినీ ప్రకృతినీ రక్షించిన ఆదివాసీ వీరులు నేటి తరానికి స్ఫూర్తి ప్రదాతలు. అనేక శతాబ్దాలపాటు ఆదివాసులు ధైర్య సాహసాలను ప్రదర్శిస్తూ న్యాయానికీ, స్వేచ్ఛకూ పరిరక్షకులుగా నిలిచారు. తెలుగు రాష్ట్రాలతో పాటు దేశవ్యాప్తంగా అనేక చోట్ల గిరిజన వీరులు స్వాతంత్ర్యం కోసం, తమ సంప్రదాయాల పరిరక్షణ కోసం పోరాడారు. ఆ పోరుబాటలోనే కొమురం భీం, అల్లూరి సీతారామరాజు, కుడుముల పెదబయన్న చెంచు, హనుమంతప్ప చెంచు, మల్లు దొర, గంతం దొర వంటివారు తమ ప్రాణాలను సైతం పణంగా పెట్టారు. అయినప్పటికీ, కొందరి త్యాగాలకు చరిత్రలో సరైన స్థానం దక్కలేదు. 16వ శతాబ్దంలో గోండ్ తెగకు చెందిన రాణి దుర్గావతి తన రాజ్యాన్ని రక్షించుకోవడానికి మరణాన్నే ఎంచుకున్నారు. జెలియాంగ్‌రాంగ్ నాగా తెగకు చెందిన రాణి గైడిన్‌ల్యూ పదహారేళ్ల వయసులోనే బ్రిటిష్ పాలనను ఎదిరించి జైలు జీవితం గడిపారు.

అణచివేతపై తిరుగుబావుటా...

ఝార్ఖండ్ ప్రాంతంలోని ఉలిహాటు గ్రామంలో 1875, నవంబరు 15న జన్మించారు బిర్సా ముండా. వేరే గ్రామంలోని జర్మన్ మిషన్ స్కూలులో చేరిన ఆయన పాశ్చాత్య దేశాల చరిత్రను చదివి బ్రిటిష్ పాలకుల అణచివేత, దోపిడీ గురించి తెలుసుకున్నారు. బడి నుంచి బయటికి వచ్చి 1894లో ఆంగ్లేయులు, దోపిడీదారులకు వ్యతిరేకంగా ఉద్యమం ప్రారంభించారు. 'ముండా ఉల్గులాన్'గా అదెంతో ప్రసిద్ధి చెందింది. తన ప్రజలకు బిర్సా మత నాయకుడు కూడా అయ్యారు. ఆ క్రమంలోనే 1899లో ఆయన సాయుధ పోరాట పంథాను ఎంచుకుని అనుచరులతో కలిసి ఠాణాలను, భూస్వాముల ఇళ్లను, ఆంగ్లేయుల ఆస్తులను ధ్వంసం చేశారు. బ్రిటిష్ పాలకులకు సింహస్వప్నమయ్యారు. ఆ క్రమంలోనే పోలీసులు బిర్సాను అరెస్టు చేయగా, 1900 జూన్ 9న జైలులోనే తుదిశ్వాస విడిచారాయన. బ్రిటిష్ వారి విష ప్రయోగం వల్లే బిర్సా చనిపోయినట్లు చెబుతారు.

ఉల్గులాన్ ఉద్యమంలో పర్మి, సాలీ, మకి వంటి మహిళలు ధైర్యంగా పోరాడారు. ఆ స్ఫూర్తి తరవాత కూడా కొనసాగింది. సంథాల్ హూల్ తిరుగుబాటులో మాండా మాంఝీ, సంకీ మాంఝీ, ఫులో ముర్ము, ఝానో ముర్ము వంటి మహిళలు ఎంతగానో ధైర్యసాహసాలను ప్రదర్శించారు. తొలి ఆదివాసీ తిరుగుబాట్లలో తిల్కా మాంఝీకి, కోల్ తిరుగుబాటులో బుద్ధు భగత్‌కు మహిళా యోధులు అండగా నిలబడ్డారు. 1930 నాటి జంగిల్ సత్యాగ్రహం, క్విట్ ఇండియా ఉద్యమంలో ఎంతోమంది నాయకులు జైలులో ఉన్నప్పుడు గిరిజన మహిళలు పోరాటాన్ని కొనసాగించారు. ఆదివాసులు ప్రాచీన గిరిజన సంస్కృతి, కళలు, భాషలు, పాటలు, వైద్యం, ఆచార వ్యవహారాలకు పరిరక్షకులు కూడా. కేరళలోని కనీ తెగ సంప్రదాయ జ్ఞానంతో రూపొందిన 'జీవని' అనే హెర్బల్ ఔషధానికి పేటెంట్ లభించడాన్ని ఇక్కడ ప్రస్తావించాలి. కళారంగంలోనూ ఆదివాసులు విశిష్టమైన ముద్ర వేశారు. భూరి బాయి(భిల్) 'పితోరా' కళను; జోధైయా బాయి 'బైగా' కళను జాతీయ స్థాయిలో నిలబెట్టారు. 'మిల్లెట్ విమన్ ఆఫ్ ఇండియా'గా పేరుగాంచిన లహరి బాయి 150కు పైగా దేశీయ వంగడాలను సంరక్షించారు. ఇలాంటి వారెందరూ జాతికి ఆదర్శప్రాయులే.

భావితరాలకు అందించాలి


దేశానికి ప్రాచీన జ్ఞానాన్నీ సేవలనూ అందించినప్పటికీ ఆదివాసీ సమాజాలు మాత్రం నేటికీ అభివృద్ధికి దూరంగానే ఉండిపోతున్నాయి. విద్య, వైద్యం, ఉపాధి, మౌలిక వసతులు, భూ హక్కులు వంటి విషయాల్లో గిరిజనులు అనేక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. ఇటువంటి పరిస్థితుల్లోనూ స్వయం సహాయక బృందాలు, సుస్థిర వ్యవసాయం, అటవీ సంరక్షణ, సంప్రదాయ కళలను సజీవంగా ఉంచడం వంటి కార్యకలాపాల్లో వారు ముందుకు సాగుతున్నారు. 'జన్‌జాతీయ గౌరవ్ దివస్' కేవలం ఒక రోజు వేడుక కాదు, ఆదివాసీ సమాజాల సమగ్ర అభివృద్ధికి దోహదపడే ఒక బాధ్యత. స్మారక చిహ్నాలలో కాకుండా, జ్ఞాపకాలలో నిలిచే బిర్సా ముండా వంటి ఆదివాసీ వీరుల గాథలు పాఠ్యాంశాల్లో భాగం కావాలి. తద్వారా నేలలో, విత్తనాల్లో, పాటల్లో, నైపుణ్యాల్లో వారు భద్రపరిచిన ప్రాచీన జ్ఞానాన్ని భావితరాలకు అందించాలి. ఆదివాసులు కేవలం మూలవాసులు కాదు, దేశ వారసత్వానికి జీవనాడి అని గుర్తించినప్పుడే జన్‌జాతీయ గౌరవ్ దివస్ స్ఫూర్తి సార్థకమవుతుంది.

– డాక్టర్ రమేష్ బుద్ధారం

సహాయ ఆచార్యులు, ఇందిరాగాంధీ జాతీయ ట్రైబల్ యూనివర్సిటీ, మధ్యప్రదేశ్

అసలైన మిత్రుడు!

ఓ అడవిలో ఎలుగుబంటి, కుందేలు స్నేహంగా ఉండేవి. ఎలుగుకు బద్ధకం చాలా ఎక్కువ. ఒక్కోసారి ఆహారం తెచ్చుకోవడానికి కూడా వెళ్లేది కాదు. అలాగే పస్తులుండేది. కానీ కుందేలు మాత్రం చాలా చలాకీగా అడవి అంతా తిరుగుతూ ఉండేది. దానికి కావాల్సిన ఆహారాన్ని అదే తెచ్చుకునేది. ఎలుగు అలా బద్ధకంగా ఉండటం కుందేలుకు అస్సలు నచ్చేది కాదు. 'మిత్రమా! నువ్వు అలా బద్ధకంగా ఉండకు. అది నీ ఆరోగ్యానికి మంచిది కాదు. అటూఇటూ తిరుగుతూ ఉంటేనే బాగుంటావు' అని చెబుతుండేది. కానీ ఎలుగు అస్సలు వినిపించుకునేది కాదు. అది నీరసించిపోవడం చూడలేక ఒక్కోసారి కుందేలే.. ఎలుగుకు ఆహారం తెచ్చి పెట్టేది. కానీ దానికి అది



ఏమాత్రం సరిపోయేది కాదు. ఎలాగైనా ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూడాలి అనుకుంది కుందేలు. ఒకరోజు ఎప్పటిలా చెట్టు కింద కూర్చుని ఉంది ఎలుగు. ఉన్నట్టుండి పెద్దగా సింహగర్జన వినిపించింది. అంతే.. అక్కడి నుంచి లేచి ఒకటే పరుగులు పెట్టిందది. పరిగెత్తి పరిగెత్తి చాలా అలసిపోయింది. దాంతో దానికి ఆకలి వేసింది. అప్పుడు ఆహారం కోసం వెతుక్కోవడం మొదలుపెట్టింది. వెతగ్గా వెతగ్గా.. ఒకచోట దానికి కావాల్సిన ఆహారం దొరికింది. గబగబా తినేసింది. 'ఆహారం వెతుక్కోవడం ఎంత కష్టమో! పాపం నా కోసం ఇన్ని రోజులు కుందేలు కష్టపడి తీసుకొచ్చింది. ఇక నుంచి నా ఆహారం నేనే వెతుక్కుంటాను' అనుకుంది ఎలుగు. అప్పటి నుంచి దాని ఆహారం అదే వెతుక్కోసాగింది. అప్పుడప్పుడు కుందేలు కోసం కూడా తీసుకొచ్చేది. మిత్రుడిలో మార్పు కోసం సింహంతో కలిసి వేసిన ప్లాన్ ఫలించినందుకు కుందేలు చాలా సంతోషించింది.

హాయ్! బుజ్జీ!!

– యలమర్తి అనూరాధ

రాయగలరా?

ఇక్కడ కొన్ని పదాలు గజిబిజిగా ఉన్నాయి. సరైన వాటిని కలిపి రాయండి చూద్దాం.

ఇటుక	బొమ్మ	ముద్ర	తీగ
బడి	గాలి	ఎర్ర	పచ్చి
తేనె	గిరి	బట్టి	పలుకు
వడ	పట్టు	వేలు	దేవ
గడ్డి	కీలు	మట్టి	మల్లె

వసుంధర

vasundhara@eenadu.in



మధురిమ

ఒకప్పుడు ఇంట్లో చిన్నపిల్లలు ఉంటే... అమ్మమ్మలు నానమ్మలు ఎన్నెన్ని గేయాలు నేర్పేవారో! ఇప్పుడందరిదీ యూట్యూబ్ బాటే. నేర్పేదీ ఇంగ్లిష్ రైమ్‌లే. మన పరిస్థితే ఇలా ఉంటే ఇక విదేశాల్లో స్థిరపడిన వాళ్ల సంగతేంటి? పిల్లలు తెలుగు మర్చిపోవాల్సిందేగా! తన బాబుకి ఆ పరిస్థితి రావొద్దు అనుకున్నారు **మధురిమ పరిగి**. అందుకే అమెరికాలో తెలుగు గేయాల పుస్తకాలను అందిస్తున్నారామె. 'వసుంధర'తో ఆ ప్రయాణాన్ని పంచుకున్నారు...

చుక్ చుక్ రైలు... అమెరికాలోనూ!

మాది వైజాగ్. నాన్న మదన్‌మోహన్ సాఫ్ట్‌వేర్ ఇంజినీర్. అమ్మ మీనాక్షి బ్యాంకు వైస్‌ప్రెసిడెంట్. అమెరికాలో స్థిరపడ్డా... పిల్లలు భారత్‌లోనే పుట్టాలనుకున్నారు. కాన్పు కోసం ప్రత్యేకంగా అమ్మని ఇండియా తీసుకొచ్చారట నాన్న. ఇంట్లో తెలుగే మాట్లాడాలనేవారు. రాయడం, చదవడం దగ్గరుండి నేర్పించారు. ఫ్యామిలీ ఫ్రెండ్స్ పిల్లలకీ ప్రతి ఆదివారం తెలుగు పాఠాలు చెప్పేవారు. అలా నాకూ మాతృభాషంటే మమకారం. మా నాన్నలా నేనూ నా పిల్లలకు నేర్పాలి అనుకునేదాన్ని. బయోమెడికల్ ఇంజినీరింగ్‌లో మాస్టర్స్ చేసి, ఒక మెడికల్ డివైజ్ సంస్థలో ప్రోగ్రామ్ మేనేజర్‌గా చేస్తున్నా. నాకు రెండేళ్ల బాబున్నాడు. మావారేమో పంజాబీ. మా ఇద్దరి ఉమ్మడి భాష ఇంగ్లిషే. అలాంటప్పుడు ఇక బాబుకి మాత్రం తెలుగెలా వస్తుంది? ఈ బెంగే పట్టుకుంది నాకు. కేవలం నేనే మాట్లాడితే సరిపోదు. అందుకని పుస్తకాలూ చదివి వినిపించాలనుకున్నా. కానీ బోర్డు బుక్స్ లాంటివి ఇంత చిన్నపిల్లలకి తెలుగులో కనిపించలేదు. నాన్న మాకోసం చందమామ తెప్పించేవారు. ఆ కథలు అర్థం చేసుకునే వయసు బాబుది కాదు. అందుకే నేనే తేవాలనుకున్నా.

మా కుటుంబంలోనే ఉంది

మా తాతగారు రచయిత. నాన్న కూడా మాకోసం తెలుగు పుస్తకాలు రాశారు. వాళ్ల స్ఫూర్తితో నేను 'చిట్టి చిలకమ్మ, చుక్ చుక్ రైలు' వంటి



గేయాల్ని బోర్డు పుస్తకాల్లో తీసుకొచ్చా. వీటి కోసం అందమైన బొమ్మలూ వేయించా. ఎవరైనా చదివి వినిపించగలిగేలా ఆంగ్ల అక్షరాల్లో తెలుగు పదాలను రాయించా. అవి బాబుకి బాగా నచ్చాయి. పదే పదే చదవమంటాడు. ఆ సంగతుల్ని ఇన్‌స్టాలో పెడితే చాలామంది మాకూ కావాలి, చేసిమ్మని అడిగేవారు. వాళ్లకి చేసివ్వడం మొదలుపెట్టా. అప్పుడే మన తెలుగు పాటలు, కథల పుస్తకాలకు డిమాండ్ ఉందని అర్థమైంది. అలా 'బాలూ బుక్స్' ప్రారంభించా. ఇక్కడ మాలాగే తెలుగు- ఇంగ్లిష్, తెలుగు- ఇతర భారతీయ భాషలతో కూడిన మిక్స్‌డ్ కుటుంబాలే ఎక్కువ. అలాంటి వాళ్లందరికీ మా పుస్తకాలు చేరువయ్యాయి. గేయాలు, కథలే కాదు... లేవడం, నడవడం, కూర్చోవడం వంటి బేసిక్ పదాలతోనూ పుస్తకాలు చేయించాం. తమ భార్య లేదా భర్తకోసం తెలుగు నేర్చుకోవాలి, ఆ సంప్రదాయాలు తెలియాలి అనుకునేవాళ్లూ కొనుక్కుంటున్నారు. అసలు ఇంత ఆదరణ ఉంటుందని మేమూ ఊహించలేదు.

ఒక్కదానిగా మొదలై...

మొదట్లో గేయాల ఎంపిక నుంచి మార్కెటింగ్ వరకు అన్నీ నేనే చూసుకునేదాన్ని. ఏడాది తరవాత శ్రావ్య మార్కెటింగ్‌లో సాయం చేస్తానంది. నేనూ సరేనన్నా. నిజానికి తనూ నా పుస్తకాన్ని కొనుక్కుని నచ్చి, చేతులు కలిపింది. బొమ్మలు మాత్రం ఓ గ్రీకు అమ్మాయితో వేయిస్తున్నా. మా చిన్నప్పటి పుస్తకాల్లో ఉన్న వైబ్రెంట్ కలర్స్, ఎక్స్‌ప్రెషన్స్ గీయగల వారి కోసం చాలా వెతికా. తనవి నా ఆలోచనలకు దగ్గరగా ఉన్నాయని ఎంచుకున్నా. చీర, బొట్టు ఇలా ప్రతిదానికీ రిఫరెన్స్ చూపిస్తాం. నచ్చాకే అచ్చు వేయిస్తా. ఉద్యోగం చేస్తూనే వ్యాపారం చేస్తున్నా. అలాగని బాబుని నిర్లక్ష్యం చేయను. సృజనకు ప్రాధాన్యమిస్తా కదా... అందుకే అమ్మ, ఉద్యోగిని, వ్యాపారవేత్త మూడు బాధ్యతల్నీ ఆస్వాదిస్తున్నా. తీరిక దొరికినప్పుడల్లా భారత్ వస్తుంటాం. వచ్చిన ప్రతిసారీ ఇది నా ఇల్లు అనిపిస్తుంది. నా బాబుకీ అలాంటి భావనే కలగాలన్నది నా తాపత్రయం. అది మిగతావారికీ ఉపయోగపడుతోంది. మా పుస్తకాలు ఇతర దేశాలకూ వెళ్తున్నాయి. ఈ స్ఫూర్తితో కొత్త ప్రయోగాలు చేయాలనుకుంటున్నా. యూఎస్‌లో తెలుగు పబ్లిషర్స్ లేరు. ఇక్కడ రాయాలన్న ఆసక్తి ఉన్నవారికి పబ్లిషింగ్‌లో సాయపడాలి అనుకుంటున్నా. ఇప్పుడా ప్రణాళికలోనే ఉన్నా.

కఫనాశక ముద్ర



చేసే విధానం: మ్యాట్‌పైన పద్మాసనం, వజ్రాసనం లేదా సుఖాసనంలో కూర్చోండి. ఇప్పుడు నిదానంగా అరచేతిని తెరచి ఉంగరం, చిటికెన వేళ్లను మడిచి వాటిపైన బొటనవేలును ఉంచండి. మిగిలిన రెండు (మధ్య, చూపుడు) వేళ్లను తిన్నగా పెట్టండి. రెండో చేత్తోనూ అలానే చేయండి. ఆపై రెండు చేతులనూ మోకాళ్లపైన ఆన్చి పెట్టండి. నడుమును నిటారుగా పెట్టి, కళ్లను ప్రశాంతంగా మూసి... శ్వాసమీద ధ్యాస నిలపండి. ఇలా 20 నిమిషాల వరకూ ఉండొచ్చు. సాధనతో క్రమంగా సమయాన్ని పెంచుకోవచ్చు.

ఉపయోగాలు: కిడ్నీ సమస్యలకు ఈ ముద్ర ఎంతగానో ఉపయోగపడుతుంది. శ్వాస సమస్యలనూ, కఫ దోషాలనూ తగ్గిస్తుంది. హైపో థైరాయిడ్ సమస్యలకూ పనిచేస్తుంది.

జాగ్రత్తలు: వేడి చేసినప్పుడు ఈ ముద్ర వేయరాదు.

ఆహారం: మూత్రపిండాలు ఆరోగ్యంగా ఉండాలంటే... తగిన మోతాదులో నీళ్లు తాగాలి. ఆపిల్, రేగు పండ్లు, పైనాపిల్ తీసుకోవాలి. మిరియాలు, వెల్లుల్లి, ఆలివ్‌నూనెలనూ తగినంతగా ఆహారంలో చేర్చుకోండి.

- శిరీష, యోగ గురు



ఇంటిపెద్ద మరణం కుటుంబాన్ని కుంగదీసింది. ఆయన బాధ్యతలు తలకెత్తుకుంది పెద్ద కూతురు **కట్టా అక్షిత**. తండ్రి వృత్తినే ఆసరాగా మలుచుకుంది. ఈ క్రమంలో ఎన్నో ఒడుదొడుకుల్ని ఎదుర్కొంది. వాటిని దాటి... వ్యాపారానికి సాంకేతికతను జోడించి దానిలో రాణిస్తోంది

రుణం ఇవ్వడానికే ఆలోచించారు..!

మాది ఖమ్మం జిల్లాలోని కూసుమంచి మండలం, పాలేరు. నాన్న రమణయ్య, అమ్మ మమత. బాతుల పెంపకమే మా జీవనాధారం. అది చేస్తూనే నాన్న నన్నూ, చెల్లినీ, తమ్ముడినీ చదివించారు. నేను హార్టీకల్చర్‌లో పీజీ చేశా. నా చదువై, ఆయనకు చేదోడుగా ఉందామనుకునే సమయానికి నాన్న చనిపోయారు. అప్పటికి తమ్ముడూ, చెల్లీ ఇంకా చదువుతూనే ఉన్నారు. ఎంతకష్టమైనా వాళ్లని విద్యకు దూరం చేయకూడదు అనుకుని... కుటుంబ బాధ్యతలు తీసుకున్నా. ప్రభుత్వ ఉద్యోగాల కోసం ప్రయత్నిస్తే అన్నీ విఫలయత్నాలే. ప్రైవేట్‌గా దొరికింది కానీ, అరకొర జీతమే. స్థిర ఆదాయం కోసం అందులో చేరిపోయా. కానీ, నెలాఖరికి ప్రతి రూపాయికీ వెతుక్కోవాల్సి వచ్చేది. అందుకే బాతుల పెంపకాన్ని చేపట్టాలనుకున్నా. సంప్రదాయ పద్ధతుల్లో కాకుండా సాంకేతికత జోడిస్తే బాగుంటుంది అనిపించింది. అప్పుడే ఇంక్యుబేటర్లలో గుడ్లు పొదిగించే విధానం గురించి తెలుసుకున్నా. ఇదేం కొత్త పద్ధతి కాదు. ఇప్పటికే హైదరాబాద్, విశాఖ, విజయవాడ... వంటి చాలా నగరాల్లో ఉంది. కానీ మేమున్న ప్రాంతంలో అందుబాటులో లేదు. అందుకే హైదరాబాద్ వెళ్లి... కొన్ని రోజులు దీనిపై శిక్షణ తీసుకున్నా.

ఒక్కరూ ముందుకు రాలేదు...

తీరా యంత్రాలు కొనడానికి రుణం కోసం చాలా చోట్ల ప్రయత్నించా. ఏ బ్యాంకుకు వెళ్లినా ష్యూరిటీ అడిగేవారు. దాంతో ఎక్కే మెట్టు, దిగే మెట్టు అయ్యింది పరిస్థితి. బయట రుణం కోసం ప్రయత్నిస్తే... 'ఆడపిల్ల తీరుస్తుందో లేదో? ఎందుకొచ్చిన రిస్క్' అని నిరాకరించేవారు. ఈ అడ్డంకులన్నీ నా లక్ష్యం మీద పట్టుదలను పెంచాయి. ఉద్యోగం చేస్తూ దాచిన కొంత మొత్తం, చీటీల డబ్బులు... రూ.3లక్షలతో ఒక ఇంక్యుబేటర్‌ని కొనుగోలు చేశా. కానీ, అనుభవం లేక చాలా ఇబ్బందులు పడ్డా. బాతుల పెంపకానికి ఆరు నెలలు మాత్రమే సీజన్. మిగతా సమయంలో వాటికి ఆహారం అందించడం కష్టమయ్యేది. అలా అని వాటిని పొలాల్లోకి వదిలే అవకాశమూ ఉండేది కాదు. దీనికి తోడు వాతావరణ మార్పులు తదితర కారణాలతో కొన్ని చనిపోతుండేవి. ఇలా దాదాపు ఐదేళ్లు పడుతూ లేస్తూ... సమస్యల్ని సోపానాలుగా మలుచుకుని ఇప్పటికి నిలదొక్కుకున్నా. ప్రస్తుతం ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర, ఝార్ఖండ్, ఒడిశా... వంటి రాష్ట్రాలకు బాతు పిల్లల్ని సరఫరా చేస్తున్నా. పెట్టుబడిపోనూ రూ.3లక్షల దాకా ఆదాయం సమకూరుతోంది. తాజాగా రెండో యంత్రాన్ని కూడా కొనుగోలు చేశా. ఇప్పుడు చెల్లి, తమ్ముడు సహాయం కూడా తోడైంది. పది మందికి ఉపాధినీ కల్పిస్తున్నా. వ్యాపారాన్ని ఇంకా విస్తరించి... ఇంకొంతమందికి ఉపాధి కల్పించాలనేదే నా కోరిక.

– కంది శివప్రసాద్, అబ్దుల్ రజాక్, ఖమ్మం

మనసు... మాట... ఒక్కటయ్యేనా?!



రేణుక, కార్తీక్‌లకు ఐదేళ్ల క్రితం పెళ్లైంది. ఇద్దరూ ఒకే ఆఫీసులో ఉద్యోగం చేస్తారు. కలిసే ఆఫీసుకి వెళ్లి వస్తారు. వాళ్ల మధ్య ఎలాంటి వాదనలూ, గొడవలూ లేవు. ఇంటి పనులు, బాధ్యతలు కలిసే పంచుకుంటారు. అన్నీ సరిగ్గానే ఉన్నట్లు అనిపిస్తున్నా ఏదో తెలియని నిశ్శబ్దం. ఇద్దరూ పక్కపక్కనే ఉన్నా తెలియని దూరం. దీన్నే 'ఫంక్షనల్ లోన్లీనెస్' అంటున్నారు నిపుణులు. దాంపత్యంలో కొన్ని రోజుల తర్వాత భావోద్వేగ సంబంధాలు కొరవడటంతోనే ఇది ఏర్పడుతుందట. మరి ఇద్దరిమధ్యా ఈ తెరలు తొలగిపోవాలంటే కలిసి బాధ్యతల్నే కాదు, భావోద్వేగాలనూ పంచుకోవాలని చెబుతున్నారు నిపుణులు. ఇందుకు ఏంచేయాలంటే... రోజులో ఓ పది నిమిషాలు మీకోసం సమయాన్ని కేటాయించుకోవాలి. ఆ టైమ్‌లో మీ ఇద్దరికీ సంబంధించిన విషయాలు తప్ప వేరే వాటికి చోటివ్వొద్దు.

- ఆ పది నిమిషాలు మీ జీవితంలో జరిగిన చిన్నచిన్న ఆనందాలను ఒకసారి గుర్తుచేసుకోండి. ఇద్దరూ కలిసి మాట్లాడుకున్న మొదటి మాట, మొదటి ప్రయాణం ఈ బిజీ లైఫ్‌లో పడి వాటిని మరిచిపోతున్నామే కానీ, తరచి చూస్తే ప్రతి ఒక్కరి జీవితంలో ఇలాంటి జ్ఞాపకాలు ఎన్ని ఉండవు చెప్పండి.
- రొటీన్‌గా లైఫ్‌ని గడిపేయకుండా వీకెండ్‌ని కాస్త కొత్తగా ప్లాన్ చేసుకోండి. సరదాగా బయటికెళ్లండి. ఫోన్లు పక్కన పెట్టి పదినిమిషాలు మనసువిప్పి మీ జీవిత భాగస్వామితో మాట్లాడండి. ఒకరి భావాలను మరొకరు పంచుకుంటే మనసు తేలికపడి, ఇద్దరిలో ఏర్పడిన ఒంటరితనం ఇట్టే మాయం అయిపోతుంది.
- మనసులో మాట చెప్పుకొనేందుకు సమయం కేటాయించాలి. ఇరువురి భావాలు, ఆలోచనలు, సరదాలు, సంతోషాలు ఒకరికొకరు పంచుకోండి. మొత్తంగా మనసూ, మాట ఒక్కటైతే ఎలాంటి సమస్యలూ ఉండవు.

తీపి తినాలనిపిస్తోందా?



ఆఫీసు పనిలో తలమునకలై ఉన్న శ్వేతకు... అకస్మాత్తుగా స్వీటు తినాలన్న కోరిక. అలాగని తీపి తినడమేమీ తన బలహీనత కాదు. కానీ, ఆ భావనను తను ఎంతగా అదుపు చేసుకోవాలన్నా చేసుకోలేదట. తనే కాదు... ప్రపంచ వ్యాప్తంగా 70 శాతంమంది మహిళలు ప్రతినెలా హార్మోన్లు, గట్‌బ్యాక్టీరియా, నిద్రలేమి... తదితర కారణాలతో షుగర్ క్రేవింగ్స్‌ని ఫీలవుతారట. మరి అవేంటో తెలుసుకుని పరిష్కారానికి ప్రయత్నించి చూడండి. బరువు నియంత్రణలోనే కాదు... ఆరోగ్యమూ మీ చేతిలో ఉంటుంది.

- మహిళల్లో ల్యూటియల్ దశ తర్వాత ప్రొజెస్టరాన్ పెరిగి ఈస్ట్రోజన్ తగ్గుతుంది. ఇది ఇన్సులిన్ రెసిస్టెన్స్‌ను పెంచి సెరటోనిన్‌ను తగ్గిస్తుంది. ఈ మార్పులు ఆకలితో పాటు చక్కెర తినాలన్న కోరికనూ పెంచుతాయట. 50 శాతంమంది మహిళలకు పీరియడ్స్‌కి ముందు వారంలో షుగర్ క్రేవింగ్ తీవ్రంగా ఉంటుందని చెబుతున్నాయి అధ్యయనాలు.
- ఏ పూట అయినా తినడం మానేస్తే రక్తంలో చక్కెర నిల్వలు తగ్గిపోతాయి. దాంతో శరీరం... తక్షణ శక్తి వనరుల్ని కోరుకుంటుంది. దీంతో స్వీట్ తినాలన్న కోరిక పెరుగుతుంది. ఆ పరిస్థితి రాకుండా ప్రతి నాలుగు గంటలకోసారి ఏదైనా తింటే సరి.
- స్త్రీలు మగవారికంటే రెండింతలు ఎక్కువగా ఆందోళనకు గురవుతారట. ఒత్తిడి ఒంట్లో కార్టిసాల్ స్థాయుల్ని పెంచుతుంది. రక్తంలో చక్కెర, ఇన్సులిన్ లెవల్స్‌ని ప్రభావితం చేస్తుంది. దీంతో తీపి పదార్థాలు తినాలన్న కోరిక పెరుగుతుంది. అంతేకాదు, షుగర్ తాత్కాలికంగా డోపమైన్, సెరటోనిన్‌లను పెంచి మూడ్ మెరుగుపరుస్తుంది. ఒత్తిడి సెరటోనిన్‌ను తగ్గించి షుగర్ క్రేవింగ్స్‌ని పెంచుతుందట. యోగా, ధ్యానం వంటివాటితో స్ట్రెస్ నుంచి బయటపడొచ్చు. ప్రయత్నించి చూడండి.
- స్త్రీలకు నిద్రలేమి సమస్య ఎక్కువ. నిద్ర తక్కువైనప్పుడు గ్రెలిన్(ఆకలి హార్మోన్) పెరిగి లెప్టిన్(తృప్తి) తగ్గుతుంది. దీంతో చక్కెర తినాలన్న కోరిక ఎక్కువవుతుంది. అలానే మెగ్నీషియం, ఐరన్... వంటి కొన్ని పోషకలోపాలు కూడా తీపి పదార్థాలను ఇష్టంగా తినేందుకు తోడ్పడతాయి. ఇలాంటప్పుడు స్వీట్‌కి బదులు డార్క్ చాక్లెట్ తింటే సరి. చక్కటి నిద్రా పడుతుంది.
- ఆకలి, తీపి తినాలన్న ఆసక్తికి... డీహైడ్రేషన్ కూడా కారణం కావొచ్చు. ఈ సమయంలో శరీరం లిక్విడ్స్ అవసరాన్ని సూచిస్తుంది. కానీ, మనసు మాత్రం తీపి తినమని కోరుకుంటుంది. అలాగని డైట్ సోడాలు తాగితే ఆకలి పెరగడమే కాదు... తీపి తినాలనీ అనిపిస్తుంది. బదులుగా కాసిని మంచినీళ్లో, నిమ్మరసమో తాగితే మీ సమస్య రెండు విధాలా పరిష్కారమవుతుంది.



మిగిలిన పని పూర్తిచేయడానికో సెలవు..!

టార్గెట్లు తీసుకుంటూ, టాస్కుల మీద టాస్కులు పూర్తిచేస్తూ అలసిపోతున్న ఉద్యోగినులు నానాటికీ పెరిగిపోతున్నారు. ఇంత కష్టపడినా కొత్త ప్రాజెక్టులు, సమావేశాలు, నివేదికలు... వంటివి వచ్చి పడుతూ పనిని రెండుమూడింతలు పెంచుతున్నాయి. రోజువారీ పనినే పూర్తిచేయాలో... అదనంగా వచ్చి పడుతున్న వీటిని చేయాలో తెలియక ఒత్తిడిలో కొట్టుమిట్టాడుతున్న వాళ్లూ లేకపోలేదు. పైగా 'అదనపు పని నావల్ల కాదు'... అని వదిలేయడానికీ లేదు. అలా చేస్తే మన శక్తిసామర్థ్యాల్ని ప్రశ్నించడానికి పైన చాలామంది కాచుకుని కూర్చుంటారు. అందుకే సమయం ఉన్నప్పుడల్లా ఆ రోజులో మిగిలిపోయిన, అదనంగా వచ్చి చేరిన పనిని పూర్తి చేయాలి అనుకుంటున్నారు ఉద్యోగినులు. అయినా అది పూర్తికాకపోతే... సెలవు పెట్టి మరీ దాన్ని పూర్తిచేస్తున్నారట. దీన్నే 'వర్క్ ఫ్రమ్ లీవ్' అంటోందీ తరం. సాధారణంగా ఇంట్లో ఫంక్షన్లకో, విందులూ-వినోదాలకో, పిల్లల స్కూల్ సమావేశాలకు హాజరవ్వాలనో సెలవులు పెడతాం కదా. కానీ ఇప్పుడు పెండింగ్ పనిని పూర్తిచేయడానికి సెలవు పెడుతున్నారట. ఎంఎన్‌సీల్లో ఇప్పటికే ఈ వర్క్ కల్చర్ ఎక్కువవుతోంది. మీడియా, సృజనాత్మక రంగాల్లోనూ ఉద్యోగినులు ఈ బాటే పడుతున్నారట. వీటికి సంబంధించిన వీడియోలు ఈ మధ్య సామాజిక మాధ్యమాల్లో బాగా వైరల్ అవుతున్నాయి కూడా. వీటికి 'అవసరమా ఇంత ఒత్తిడి' అని కొందరు స్పందిస్తుంటే... 'పని రాక్షసులు' అని ఇంకొందరు కామెంట్లు చేస్తున్నారు. ఏదేమైనా అవసరమా ఇంత ఒత్తిడి?

ఆహ్వానం

వసుంధర పేజీపై మీ అభిప్రాయాలు, సలహాలు, నిపుణులకు ప్రశ్నలు... ఇలా మాతో ఏది పంచుకోవాలన్నా 9154091911కు వాట్సాప్ ద్వారా పంపవచ్చు.

బంగారం - వెండి



14న ముగింపు

	బంగారం (24క్యా)	ఆర్నమెంట్ (22క్యా)	వెండి (కిలో)
హైదరాబాద్	1,26,180	1,17,600	1,58,000
విజయవాడ	1,26,205	1,17,200	1,66,100
ప్రొద్దుటూరు	1,27,000	1,16,840	1,64,500
రాజమహేంద్రవరం	1,27,040	1,16,450	1,83,100
విశాఖపట్నం	1,27,400	1,17,200	1,70,000
తమిళనాడు	-----	1,17,400	1,80,000


'చార్మ్' చేసేయండి!

తనకంటూ ఓ ప్రత్యేకత ఉండాలి... ప్రతి ఒక్కరిలో ఈ ఆలోచన తప్పనిసరే! అమ్మాయిల విషయానికొచ్చేసరికి అది వ్యక్తిత్వానికే సరిపోదు. వాడే వస్తువుల దగ్గర్నుంచి యాక్సెసరీల వరకూ ప్రతిదీ తమ స్టైల్‌ని సూచించాలి అనుకుంటారు. మీరూ ఆ జాబితాలో ఉంటే... వీటినో లుక్కేయాల్సిందే మరి!





మొబైల్‌కి నగ!





ఫోన్ కేసులతో మనం చేసే ప్రయోగాలు తక్కువా? అందమైన పూలు, కార్టూన్లు, రాళ్లు, పెయింటింగ్‌లు... చెప్పాలే కానీ జాబితా పెద్దదే! ఈసారి టాజిల్స్ వంతు వచ్చింది. చీరైనా... చున్నీ అయినా టాజిల్స్ జోడిస్తే వచ్చే అందమే వేరు. మొబైల్ కేసుకీ చేరిస్తే బాగుంటుందనుకున్నారేమో... ఇలా చెయిన్ల రూపంలో చార్మ్స్‌ని తీసుకొచ్చారు. వేడుకలకి వాటినీ ముస్తాబు చేసినట్టు లేదూ?

అందంగా గుర్తుంటాయి



ఉదయం లేవగానే మొబైల్. చదువైనా పనైనా కంప్యూటర్ల ముందే! ఇక ఆ కళ్లేంటాయా? మసకలు, సైట్ పెరగడం సరేసరి. సమస్య నుంచి బయట పడాలంటే కళ్లజోడు తగిలించాల్సిందే. కానీ దాన్ని అస్తమానూ ఎక్కడో చోట పెట్టి మర్చిపోతుంటాం. తరవాత వెతుక్కోవడం పెద్ద పని. అంతేనా? కళ్లజోడు అందాన్ని తగ్గించేస్తుందన్న బాధా చాలామందిలో ఉంటుంది. ఈ రెండు సమస్యలూ తీరుస్తాయీ స్పెక్టకల్ చెయిన్స్. సన్నటి చెయిన్స్, సెమీ ప్రిషియస్ రాళ్లు, ముత్యాలు జోడించుకుని వస్తున్నాయి. కళ్లజోడుకి అదనపు అందాన్ని తెస్తాయి. తీసినా మెడలో నగలా అలరిస్తాయి. మొత్తంగా స్టైలిష్ లుక్‌ని తెచ్చేస్తూ భలేగున్నాయి కదూ!

వాచ్ లుక్ మార్చేయొచ్చు



ఎంత టెక్నాలజీ రానీ... అమ్మాయిల తప్పనిసరి యాక్సెసరీలలో వాచ్‌లు ఉండాల్సిందే. ఇప్పుడసలే స్మార్ట్ వాచ్‌లదే హవా! ఆరోగ్య స్పృహ, స్టైలిష్ లుక్ కోసమూ వీటిని ఆశ్రయిస్తున్న యువత ఎక్కువే. మరీ ఈ స్ట్రాప్‌లను సాదాసీదాగా చూసి బోర్ కొడుతుంది అనుకున్నారేమో బోలెడు చార్మ్స్‌ని తెచ్చేశారు. నల్లపూసలు, ముత్యాలు, సన్నటి చెయిన్స్ స్ట్రాప్స్‌కే తగిలించొచ్చు. కొన్ని పిన్స్‌లా మరికొన్ని బ్యాండ్‌ల్లా వస్తున్నాయి. లేదంటే వాచ్‌కి ఇరువైపులా బ్రేస్‌లెట్‌ని జతచేసినట్లుగానూ పెడుతున్నారు. ఆప్షన్లు బోలెడు. మీ స్టైల్‌కి నప్పేలా ఏది ఎంచుకోవాలన్నది మీ వంతు.



హస్త కళలతో ఆకట్టుకుంటోంది!

'కాదేదీ కళకనర్హం' అన్నది అరవైమూడేళ్ల **రత్న ముందాకి** సరిగ్గా సరిపోతుంది. దాదాపు పాతికేళ్లుగా ధాన్యం పొట్టు, వెదురుతో ఆకర్షణీయ విగ్రహాలను తయారుచేస్తున్నారు. దీన్ని స్థానిక మహిళలకీ నేర్పిస్తూ ఉపాధి కల్పిస్తున్నారు.






మనలోని సృజనాత్మకత వెలికి తీయాలేకానీ, ప్రకృతిలోనూ కళాకృతులు దాగుంటాయంటారు రత్న. పర్యావరణానికి చేటు చేయకుండా తన హస్తకళలకు సంస్కృతీ సంప్రదాయాన్ని జోడిస్తూ గృహాలంకరణ వస్తువులు, దేవతల బొమ్మలను తయారుచేస్తున్నారీమె. ఒడిశాలోని నవరంగపూర్ రత్నది. కటక్‌లో ఏటా జరిగే బాలి యాత్రలో ఆమె దుకాణం ముందు పర్యాటకులు తప్పక ఆగాల్సిందే. అవి అంతగా మంత్రముగ్ధుల్ని చేస్తాయి మరి. 'ఇంట్లో ఖాళీగా కూర్చుంటే ఏం వస్తుంది? అందుకే ముప్పైఏళ్ల క్రితం మా మామగారి దగ్గర ఈ కళను నేర్చుకున్నా. దాన్నే వ్యాపకంగా మార్చుకున్నా. ఇప్పుడు అదే నా జీవనాధారమైంది. వీటి తయారీ వస్తువులు... ధాన్యం పొట్టు, వెదురు, ఫెవికాల్‌కి అయ్యే ఖర్చు తక్కువే. కానీ చేయాడానికి ఓపిక చాలా అవసరం. ఒక విగ్రహాన్ని చేయడానికి దాదాపు పది గంటలు పడుతుంది. నా కష్టానికి నా కుటుంబం కూడా తోడయ్యింది. దాంతో ఎక్కువ మొత్తంలో వీటిని తయారుచేయగలుగుతున్నా. ప్రస్తుతం మార్కెట్‌లో మా బొమ్మలకు మంచి ధర పలుకుతుంది. దేశంలో ఎక్కడ ఎగ్జిబిషన్లు, స్టాల్స్ నిర్వహించినా అక్కడ మా దుకాణాలు ఏర్పాటు చేస్తాం. మొదట్లో ఒక్కదాన్నే చేసినా ఇప్పుడు 30మంది మహిళలకు ఈ క్రాఫ్ట్‌లో శిక్షణిస్తున్నా. వాళ్లంతా ఇంటివద్దే ఉండి ఉపాధి పొందుతున్నారు. ఈ హస్తకళల్ని మేము ఇంటి అందాన్ని పెంచడానికి మాత్రమే కాదు, పాజిటివ్ ఎనర్జీని తీసుకొస్తాయనీ నమ్ముతాం' అంటారీమె.

ఈటీవీ భారత్



సీఐఐ భాగస్వామ్య సదస్సు ప్రారంభ వేదికపై శోభన కామినేని, అమిత్ కారె, సుదర్శన్ వేణు, అమిత్ కళ్యాణీ, చంద్రజీత్ బెనర్జీ, సుచిత్ర ఎల్ల, మంత్రి టి.జి.భరత్, రాజీవ్ మేమాని, కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్, గవర్నర్ అబ్దుల్‌నజీర్, కేంద్ర మంత్రులు కె.రామ్మోహన్‌నాయుడు, భూపతిరాజు శ్రీనివాసవర్మ, రాష్ట్ర మంత్రులు లోకేశ్, నాదెండ్ల మనోహర్, సంజీవ్ బజాజ్, గ్రంధి మల్లికార్జునరావు, కరణ్ అదానీ, ఎం.ఎ.యూసుఫ్ అలీ.

భోగాపురం విమానాశ్రయంలో ఎంఆర్‌వో కేంద్రం



– జీఎంఆర్ సంస్థల ఛైర్మన్ గ్రంధి మల్లికార్జునరావు

తూర్పు భారతానికి గేట్‌వేగా భోగాపురంలో అంతర్జాతీయ విమానాశ్రయాన్ని నిర్మిస్తున్నామని, అక్కడ ప్రపంచంలోనే అతిపెద్ద మెయింటెనెన్స్, రిపేర్స్, ఓవర్‌హాలింగ్(ఎంఆర్‌వో) కేంద్రం ఏర్పాటు చేయబోతున్నామని జీఎంఆర్ సంస్థల ఛైర్మన్ గ్రంధి మల్లికార్జునరావు ప్రకటించారు. సీఐఐ భాగస్వామ్య సదస్సు ప్రారంభోత్సవంలో ఆయన మాట్లాడారు.

సింగపూర్ కంపెనీలకు అవకాశాలు



– సుదర్శన్ వేణు, ఛైర్మన్, ఎండీ, టీవీఎస్ మోటార్స్

భౌగోళిక అనుకూలతల కారణంగా పెట్టుబడులకు ఏపీ కీలకంగా మారింది. సీఎం చంద్రబాబు.. 2047 నాటికి స్వర్ణాంధ్రను సాకారం చేయాలనే లక్ష్యంతో ఉన్నారు. ఈ విజన్‌లో భాగస్వామ్యం కావడానికి సింగపూర్ కంపెనీలకు ఎల్లప్పుడూ అవకాశాలున్నాయి. భవిష్యత్తులో ఇది సాకారమవుతుంది. మా సంస్థ తరపున పరిశ్రమలు పెడతాం.

యువతకు నైపుణ్యాలు కల్పిస్తాం



– సంజీవ్ బజాజ్, ఛైర్మన్, ఎండీ, బజాజ్ ఫిన్‌సర్వ్

దేశానికి గ్రోత్ ఇంజిన్‌లా ఏపీ పనిచేస్తోంది. ట్రేడ్, టెక్నాలజీ, ఆవిష్కరణలకు గేట్‌వేగా మారుతోంది. యువతకు నైపుణ్యాలు కల్పించేందుకు కృషి చేస్తున్నాం. అమరావతి, విజయవాడ, విశాఖపట్నం, రాజమహేంద్రవరం, శ్రీసిటీ, తిరుపతి తదితర ప్రాంతాల్లో రాహుల్ బజాజ్ పేరిట నైపుణ్య కేంద్రాలు, కెరియర్ కౌన్సెలింగ్ కేంద్రాలను ఏర్పాటుచేస్తాం.

రాబోయే పదేళ్లలో లక్ష కోట్ల పెట్టుబడులు



– కరణ్ అదానీ, ఎండీ, అదానీ పోర్ట్స్ అండ్ సెజ్

రాష్ట్రంలో పోర్టులు, లాజిస్టిక్స్, పునరుత్పాదక విద్యుత్తు రంగాల్లో అదానీ సంస్థ రూ.40 వేల కోట్ల పెట్టుబడి పెట్టింది. లక్ష ఉద్యోగాలు కల్పించాం. రాబోయే పదేళ్లలో పోర్టులు, డేటా సెంటర్, సిమెంట్ రంగాల్లో మరో లక్ష కోట్ల పెట్టుబడి పెట్టాలని భావిస్తున్నాం. గూగుల్ సంస్థతో కలిసి అతిపెద్ద డేటా సెంటర్‌ను నిర్మించబోతున్నాం.

ఏపీ ముందుండి నడిపిస్తోంది



– రాజీవ్ మేమాని, సీఐఐ అధ్యక్షుడు

పలు రంగాలను ఏపీ ముందుండి నడిపిస్తోంది. భారత్‌లో ప్రతి వారం రెండు కొత్త గ్లోబల్ కేపబిలిటీ సెంటర్లను ప్రపంచసంస్థలు ఏర్పాటు చేస్తున్నాయి. రాబోయే రెండు దశాబ్దాల్లో సాధించగల పెట్టుబడులు, ఉద్యోగాలపై చంద్రబాబుకు స్పష్టమైన విజన్ ఉంది. పాలసీలను సమస్యలు లేకుండా అమలు చేస్తున్నారు.

గ్రీన్ ఎనర్జీలో స్వయంప్రతిపత్తి



– సుచిత్ర ఎల్ల, సీఐఐ ఉపాధ్యక్షురాలు, భారత్ బయోటెక్ సహ వ్యవస్థాపకులు

గ్రీన్ ఎనర్జీ ఉత్పత్తిలో స్వయంప్రతిపత్తి సాధించేలా దేశం ముందడుగు వేస్తోంది. కొవిడ్ విపత్తు సమయంలో ప్రపంచానికి వ్యాక్సిన్ అందించాం. చంద్రబాబు ఉమ్మడి ఏపీ సీఎంగా ఉన్నప్పుడు హైదరాబాద్‌లో జినోమ్ వ్యాలీని ఏర్పాటుచేశారు. ఆ జినోమ్ వ్యాలీలో భారత్ బయోటెక్ సంస్థ.. కొవిడ్ టీకాను తయారు చేసి, ప్రపంచానికి అందించింది.

నాణ్యమైన వైద్య సేవలు అందుతున్నాయి



– శోభన కామినేని, ప్రమోటర్ డైరెక్టర్, అపోలో హాస్పిటల్స్

ఇతర రాష్ట్రాలతో ఏపీ పోటీ పడటమే కాదు.. పునరుత్పాదక విద్యుత్తు, ఐటీ, హెల్త్‌కేర్, మ్యాను ఫ్యాక్చరింగ్ రంగాల్లో దూసుకెళ్తోంది. ఎన్టీఆర్ వైద్యసేవ, టెలీ మెడిసిన్ ద్వారా నాణ్యమైన వైద్య సేవలందుతున్నాయి. అపోలో ప్రపంచస్థాయి వైద్య సదుపాయాల్ని అందిస్తోంది. రాష్ట్రంలో ఆసుపత్రులతోపాటు హెల్త్‌కేర్ ఎకో సిస్టంను తీర్చిదిద్దుతున్నాం.

ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు పెడుతున్నాం



– యూసుఫ్ అలీ, ఛైర్మన్, ఎండీ, లులు గ్రూప్

రాష్ట్రంలోని వేర్వేరు ప్రాంతాల్లో అత్యాధునిక మాల్స్‌తోపాటు ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పాటుచేస్తున్నాం. ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల ద్వారా రైతులకు మేలు జరుగుతుంది. ఇక్కడి ప్రజలు, సీఎం చంద్రబాబు కలలకు అనుగుణంగా ఈ ప్రాంతం అభివృద్ధి చెందుతోంది.



డ్రోన్, స్పేస్‌సిటీలు సాధారణ ప్రాజెక్టులు కావు

- ఏపీ అభివృద్ధిలో గొప్ప మార్పు తెచ్చేవి
- కేంద్ర మంత్రి పీయూష్ గోయల్

ఈనాడు–అమరావతి: దేశ ఐటీ రంగానికి.. హైదరాబాద్‌లోని హైటెక్ సిటీ సంకేతంగా నిలిచిందని కేంద్రమంత్రి పీయూష్ గోయల్ అన్నారు. ఉమ్మడి ఏపీ సీఎంగా చంద్రబాబు హైటెక్ సిటీ నిర్మాణానికి ఎంతో కృషి చేశారని కొనియాడారు. స్పేస్‌సిటీ, డ్రోన్‌సిటీ శంకుస్థాపన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. 'దేశంలో మొదటిగా ఏర్పాటవుతున్న డ్రోన్, స్పేస్ సిటీలు సాధారణ ప్రాజెక్టులు కావు. ఏపీ అభివృద్ధిలో గొప్ప మార్పు తీసుకొచ్చే నిర్ణయాలు' అని కొనియాడారు. 'రక్షణ రంగంలో డ్రోన్లకు డిమాండు పెరుగుతోంది. ఆపరేషన్ సిందూర్‌లో డ్రోన్ల ప్రాధాన్యం ఏమిటో మనమంతా చూశాం. కర్నూలు డ్రోన్‌సిటీని కేంద్రం, రాష్ట్రం అభివృద్ధి చేస్తాయి' అని చెప్పారు. 'ప్రతి భారతీయుడూ చేతిలో స్మార్ట్‌ఫోన్, ప్రతి రైతు పొలంలో డ్రోన్, ప్రతి ఇంటికీ అభివృద్ధి అనేది మోదీ కల. మోదీ, చంద్రబాబు ఇద్దరూ అన్నదమ్ములు లాంటి వారు. ఆంధ్రప్రదేశ్‌లో పుట్టే ప్రతి బిడ్డకు మంచి భవిష్యత్తుకు హామీ ఉంటుంది' అని కొనియాడారు.

ఎనిమిదోసారి ఆతిథ్యం



సీఐఐ భాగస్వామ్య సదస్సుకు వరుసగా ఎనిమిదోసారి రాష్ట్రం ఆతిథ్యమిస్తోంది. దేశవిదేశాలకు చెందిన ప్రతినిధులు హాజరైన ఈ సదస్సు ప్రపంచ వాణిజ్యాన్ని ప్రతిబింబిస్తోంది. ఫ్యూచర్ రెడీ ఇన్నోవేషన్ రాష్ట్రంగా ఏపీని సీఎం చంద్రబాబు తీర్చిదిద్దుతున్నారు. ఈ పెట్టుబడి భవిష్యత్తు తరాలకు సంపదగా మారాలి.

–ఎస్.అబ్దుల్ నజీర్, రాష్ట్ర గవర్నర్

మరో ఏడు విమానాశ్రయాలు



మోదీ, చంద్రబాబు వంటి దార్శనిక నాయకుల నేతృత్వంలో భారత్, ఏపీ అభివృద్ధి దిశగా ముందడుగు వేస్తున్నాయి. ఏరోస్పేస్, ఎయిర్‌క్రాఫ్ట్ తయారీని ఏపీకి తీసుకొస్తాం. ప్రస్తుతం రాష్ట్రంలో ఏడు విమానాశ్రయాలు ఉండగా.. భవిష్యత్తులో మరో ఏడింటిని నిర్మిస్తాం.

–కె.రామ్మోహన్‌నాయుడు, కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి

సదుపాయాలు కల్పిస్తున్నాం



ఫార్మా సిటీ నుంచి ఫిన్‌టెక్ వరకు, వ్యవసాయం నుంచి ఏరోస్పేస్ వరకు రాష్ట్రంలో అన్ని రంగాల్లో పరిశ్రమల స్థాపనకు అవసరమైన సదుపాయాలు కల్పిస్తున్నాం. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఒకే విజన్‌తో ముందుకెళ్తున్నాయి. రాష్ట్రంలో విశాఖను పారిశ్రామిక, ఫిన్‌టెక్ నగరంగా, అనంతపురాన్ని ఆటో మొబైల్ హబ్‌గా, తిరుపతిని ఎలక్ట్రానిక్స్, మొబైల్ మాన్యుఫ్యాక్చరింగ్ హబ్‌గా తీర్చిదిద్దేందుకు సీఎం చంద్రబాబు కృషి చేస్తున్నారు.

–పెమ్మసాని చంద్రశేఖర్, కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్ శాఖల సహాయ మంత్రి

వికసిత్ భారత్.. ఏపీ కీలకం



వికసిత్ భారత్‌ను సాకారం చేసేందుకు ఆంధ్రప్రదేశ్ కీలకంగా వ్యవహరిస్తుంది. రాష్ట్రంలో ముఖ్యమైన పాలసీలను తీసుకురావడంలో ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేశ్ కీలకంగా వ్యవహరిస్తున్నారు. గత 18 నెలల్లో కేంద్ర ప్రభుత్వం పలు కీలక ప్రాజెక్టులను రాష్ట్రానికి మంజూరు చేసింది. రాష్ట్రాల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం కృషి చేస్తోంది.

–భూపతిరాజు శ్రీనివాసవర్మ, కేంద్ర ఉక్కు శాఖ సహాయ మంత్రి

ఏపీ పారిశ్రామిక దశాబ్దం



ఏపీలో సీబీఎన్ బ్రాండ్‌తో ప్రగతి పరుగులు పెడుతోంది. ఇది ఏపీ పారిశ్రామిక దశాబ్దం. పెట్టుబడులతో ఎవరు ముందుకొచ్చినా మద్దతుగా నిలిచేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఎల్లప్పుడూ ముందుంటుంది. రాష్ట్రంలో 550 పారిశ్రామిక పార్కులు పెట్టుబడుల కోసం సిద్ధంగా ఉన్నాయి.

–టీజీ భరత్, రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి

పరిశ్రమలకు సానుకూలం




రాష్ట్రంలో పరిశ్రమల స్థాపనకు సానుకూల వాతావరణం కల్పిస్తున్నాం. పారిశ్రామికవేత్తలకు కూటమి ప్రభుత్వం అన్నివిధాలా సహకారం అందిస్తోంది. రాష్ట్రంలో ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు కీలక రంగాల్లో ఆవిష్కరణలు చేస్తున్నారు. దేశంలోని యువత ఆవిష్కరణలు చేసేలా ప్రతి ఒక్కరూ ప్రోత్సహించాలి.

– మనోహర్, రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి

రిలయన్స్, బ్రూక్‌ఫీల్డ్.. విశాఖలో మరో రెండు డేటా సెంటర్లు

- వీటితో రూ.2.20 లక్షల కోట్ల పెట్టుబడులు
- ఇప్పటికే వస్తున్న గూగుల్‌కు ఇవి అదనం
- పునరుత్పాదక ప్రాజెక్టుల్లోనూ బ్రూక్‌ఫీల్డ్ భారీ పెట్టుబడులు



ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి లోకేశ్ సమక్షంలో బ్రూక్‌ఫీల్డ్ కంపెనీ ప్రతినిధులతో అవగాహన ఒప్పందం కుదుర్చుకున్న రాష్ట్ర ప్రభుత్వ అధికారులు

విశాఖపట్నం నుంచి ఈనాడు ప్రత్యేక ప్రతినిధి

డేటా సెంటర్ల చరిత్రలో విశాఖపట్నం దేశానికే తలమానికంగా నిలుస్తోంది. సువర్ణాధ్యాయం లిఖిస్తోంది. వెయ్యి మెగావాట్ల సామర్థ్యంతో రూ.1.33 లక్షల కోట్లతో ఏఐ డేటా సెంటర్ ఏర్పాటుకు దిగ్గజ సంస్థ గూగుల్ ఇప్పటికే ఒప్పందం చేసుకోగా.. తాజాగా మరో రెండు సెంటర్ల ఏర్పాటుకు ప్రముఖ సంస్థలు ముందుకొచ్చాయి. రూ.1.10 లక్షల కోట్లతో డేటాసెంటర్ ఏర్పాటుకు తామూ సిద్ధమని రిలయన్స్ ప్రకటించింది. మరో దిగ్గజ సంస్థ బ్రూక్‌ఫీల్డ్ కూడా విశాఖకు వచ్చేందుకు సిద్ధమని ప్రకటించింది. విశాఖలో వెయ్యి మెగావాట్ల సామర్థ్యంతో డేటా సెంటర్‌తో పాటు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో రూ.1.06 లక్షల కోట్ల పెట్టుబడులతో పునరుత్పాదక విద్యుత్ ప్రాజెక్టులు ఏర్పాటుచేయనుంది. రిలయన్స్, బ్రూక్‌ఫీల్డ్ సంస్థలు రెండూ శుక్రవారం సీఎం చంద్రబాబు సమక్షంలో ప్రభుత్వంతో ఒప్పందాలు చేసుకున్నాయి.



రిలయన్స్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ బోర్డు మెంబర్, డైరెక్టర్ పి.ఎం.ఎస్.ప్రసాద్‌తో చర్చిస్తున్న చంద్రబాబు

మూడు ప్రముఖ సంస్థలు రావడంతో విశాఖకు అంతర్జాతీయ గుర్తింపు రానుంది. డేటా సెంటర్ల ద్వారా రూ.3.53 లక్షల కోట్ల పెట్టుబడులు వెల్లువెత్తనున్నాయి.

విశాఖలో రిలయన్స్

విశాఖలో రిలయన్స్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ రూ.1.10 లక్షల కోట్ల పెట్టుబడితో వెయ్యి మెగావాట్ల డేటా సెంటర్ ఏర్పాటు చేస్తోంది. పూర్తిగా మాడ్యులర్, భవిష్యత్తు సాంకేతికతల గ్రాఫిక్ ప్రాసెసింగ్ యూనిట్ (జీపీయూ), టెన్సర్ ప్రాసెసింగ్ యూనిట్ (టీపీయూ) ఏఐ ప్రాసెసర్ల ద్వారా డేటా నిల్వచేసే సాంకేతికతతో అత్యాధునిక డేటా సెంటర్ ఏర్పాటుచేయనుంది. గుజరాత్‌లోని జామ్‌నగర్‌లో ఉన్న వెయ్యి మెగావాట్ల డేటా సెంటర్‌కు అనుబంధంగా ఇది పనిచేస్తుంది. ఆసియాలో అత్యంత శక్తిమంతమైన ఏఐ మౌలిక సదుపాయాలున్న నెట్‌వర్క్‌లలో ఒకటిగా ఈ డేటా సెంటర్ నిలుస్తుంది. విశాఖలో నిర్వహిస్తున్న భాగస్వామ్య సదస్సులో పెట్టుబడుల ప్రతిపాదనపై రాష్ట్ర ప్రభుత్వంతో సంస్థ ఎంవోయూ కుదుర్చుకుంది. రిలయన్స్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ కార్యనిర్వాహక డైరెక్టర్, బోర్డు సభ్యుడు పి.ఎం.ఎస్. ప్రసాద్, రిలయన్స్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ మెంటార్ (సౌత్) పి.వి.ఎల్. మాధవరావు ముఖ్యమంత్రి చంద్రబాబును కలిశారు. రాయలసీమలో ఇంటిగ్రేటెడ్ ఫుడ్‌పార్కును రిలయన్స్ సంస్థ అభివృద్ధి చేయనుంది. దీనిద్వారా వేల మందికి ప్రత్యక్ష, పరోక్ష ఉపాధి అవకాశాలు రానున్నాయి.

విశాఖలో రిలయన్స్ సంస్థ పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు రావడం సంతోషకరమని సీఎం చంద్రబాబు ఎక్స్‌లో పోస్టు చేశారు. ఏపీలో పెట్టుబడులు పెట్టేందుకు ప్రకటన చేసిన రిలయన్స్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ ఛైర్మన్ ముకేశ్ అంబానీకి ధన్యవాదాలు. ఇది ఆవిష్కరణ, క్లీన్ ఎనర్జీ, సమగ్ర అభివృద్ధి దిశగా ఏపీ ప్రయాణంలో కొత్త మైలురాయిగా నిలుస్తుంది' అని సీఎం పేర్కొన్నారు.

రూ.1.10 లక్షల కోట్లతో బ్రూక్‌ఫీల్డ్

ప్రపంచ దిగ్గజ సంస్థ బ్రూక్‌ఫీల్డ్ డేటా సెంటర్, పునరుత్పాదక ప్రాజెక్టుల ఏర్పాటు ద్వారా రూ.2.16 లక్షల కోట్ల పెట్టుబడులు పెట్టేందుకు ప్రభుత్వంతో ఒప్పందాలు కుదుర్చుకుంది. విశాఖలో బ్రూక్‌ఫీల్డ్ వెయ్యి మెగావాట్ల డేటా సెంటర్ ఏర్పాటుచేయనుంది. దీనిద్వారా సుమారు రూ.1.10 లక్షల కోట్ల పెట్టుబడులు పెట్టనుంది. విశాఖ పెట్టుబడుల సదస్సులో సంస్థ ప్రతినిధులు శుక్రవారం సాయంత్రం సీఎం చంద్రబాబుతో సమావేశమయ్యారు. సంస్థ దక్షిణాసియా, మధ్యప్రాచ్య దేశాల హెడ్ నావల్ సైని, ఇతర ప్రతినిధులు విశాఖలో సీఎం సమక్షంలో ఎంవోయూలపై సంతకాలు చేశారు. డేటా సెంటర్ ఏర్పాటుకు బ్రూక్‌ఫీల్డ్ ఎంవోయూ కుదుర్చుకుందని ఐటీ శాఖ కార్యదర్శి భాస్కర్ కాటమనేని తెలిపారు. దీంతోపాటు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో రూ.1.06 లక్షల కోట్ల పెట్టుబడులతో పునరుత్పాదక విద్యుత్ ప్రాజెక్టుల ఏర్పాటుకు మరో ఎంవోయూను సీఎం సమక్షంలో బ్రూక్‌ఫీల్డ్ కుదుర్చుకుంది.

రాష్ట్రాన్ని సెమీకండక్టర్ల హబ్‌గా మార్చడమే లక్ష్యం

- ఎంవోయూలు కుదుర్చుకున్న కంపెనీలు ఆరు నెలల్లో గ్రౌండ్ అవ్వాలి
- పారిశ్రామికవేత్తల ఓపెన్ మైక్ సెషన్‌లో మంత్రి నారా లోకేశ్
- 17 సంస్థలతో రూ.27 వేల కోట్ల పెట్టుబడులకు ఒప్పందాలు



పారిశ్రామికవేత్తలతో మంత్రి లోకేశ్. చిత్రంలో డిక్సన్ టెక్నాలజీస్ అధ్యక్షుడు పంకజ్ శర్మ, ఐటీ శాఖ కార్యదర్శి కాటమనేని భాస్కర్, ఎంజీఎస్ టెక్నాలజీస్ లిమిటెడ్ ఎండీ జస్బీర్ గుజ్రాల్, హిందాల్కో పరిశ్రమల జాయింట్ ప్రెసిడెంట్ దీపక్ దేశ్‌ముఖ్, ఎసిప్ టెక్నాలజీస్ సీఈవో వెంకట సింహాద్రి, నియోలింక్ సీఈవో రూబెన్ షైబెల్

ఈనాడు, విశాఖపట్నం: అవగాహనా ఒప్పందాలు(ఎంవోయూ)లు కుదుర్చుకున్న కంపెనీలు ఆరు నెలల్లోగా గ్రౌండ్ అవ్వాలని మంత్రి నారా లోకేశ్ కోరారు. అలా చేస్తామని ముందుకొచ్చే వాటితోనే ఎంవోయూలు జరుపుతున్నట్లు స్పష్టం చేశారు. ఏపీని సెమీ కండక్టర్ల హబ్‌గా రూపొందించి.. 2030 నాటికి ప్రధాన భాగస్వామిగా నిలుపుతామని, ప్రపంచానికి ఇక్కడి నుంచే ఎగుమతులు చేసే స్థాయికి ఎదుగుతామని వివరించారు. 2014-19 మధ్య తిరుపతిలో ఏర్పాటు చేసిన ఎలక్ట్రానిక్స్ తయారీ క్లస్టర్ గత ప్రభుత్వంలో చతికిలపడిందని, ఇప్పుడు దాన్ని పూర్తిస్థాయిలో పునరుద్ధరించి పెట్టుబడుల ఆకర్షణే లక్ష్యంగా ముందుకెళ్తున్నట్లు తెలిపారు. శుక్రవారం సీఐఐ భాగస్వామ్య సదస్సులో 'వృద్ధి అవకాశాలు, సహకారంపై పెట్టుబడిదారుల దృష్టికోణం' అనే అంశం మీద నిర్వహించిన ఓపెన్ మైక్ సెషన్‌లో మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 'దేశంలో తయారయ్యే ఏసీల్లో 60 శాతం ఏపీలోనే ఉత్పత్తి అవుతున్నాయి. దీన్ని మరింత ముందుకు తీసుకెళ్తాం' అని లోకేశ్ పేర్కొన్నారు.

అధికారులే స్వాగతం పలికి..

ఈ కార్యక్రమంలో పాల్గొన్న పారిశ్రామికవేత్తలు వారి అభిప్రాయాలు పంచుకున్నారు. డిక్సన్ టెక్నాలజీస్ అధ్యక్షుడు పంకజ్ శర్మ మాట్లాడుతూ 'ఉత్తర భారతదేశంలో కాకుండా మొదటిసారి పరిశ్రమ ఏర్పాటు చేయాలనుకున్నప్పుడు ఏపీని ఎంచుకున్నాం. పెట్టుబడి పెట్టాలని ఆసక్తి ఉన్నట్లు ప్రభుత్వానికి తెలియజేశాం. మేం తిరుపతి విమానాశ్రయంలో దిగిన వెంటనే అధికారులే వచ్చి సాదర స్వాగతం పలికారు. అప్పుడే ఈ ప్రభుత్వంపై సదాభిప్రాయం కలిగింది. మానవవనరుల లభ్యత కోసం సమీప గ్రామాల్లోకి తీసుకువెళ్లి వారితో మాట్లాడించారు. ఆ తర్వాత అనుమతుల కోసం ఇప్పటివరకు ఏ ప్రభుత్వ కార్యాలయం గడపా తొక్కలేదు. ఉత్తరప్రత్యుత్తరాలన్నీ ఆన్‌లైన్‌లోనే చేసుకున్నాం. వాటన్నింటికీ గడువులోగా అనుమతులు మంజూరు చేశారు. ఇవన్నీ ప్రభుత్వ చిత్తశుద్ధికి నిదర్శనం. మా ప్లాంటులో ఎక్కువమంది యువతకు ఉపాధి కల్పిస్తుండగా వారిలో మహిళలే అధికం. సీసీ కెమెరాలు, ఎల్‌ఈడీ టీవీలు, వాషింగ్ మెషీన్ బోర్డుల తయారీలోనూ అడుగు పెట్టాం' అని తెలిపారు.

విశాఖలో సెమీకండక్టర్ల పరిశ్రమ

విశాఖలో సెమీకండక్టర్ల పరిశ్రమ ఏర్పాటు చేస్తున్నట్లు ఎసిప్ టెక్నాలజీస్ సీఈవో వెంకట సింహాద్రి తెలిపారు. 'ఈ రంగానికి సంబంధించి దేశంలో ప్రముఖంగా 20 కంపెనీలుంటే అందులో సెమీకండక్టర్లను స్వతహాగా తయారు చేసేవి రెండు మూడే ఉన్నాయి. ఆ తర్వాత మేమే పోటీలో నిలుస్తాం. త్వరలోనే విశాఖలో సెమీకండక్టర్ల పరిశ్రమను నెలకొల్పుతాం. అందుకు అవసరమైన భూములు కేటాయించాల్సి ఉంది. కేంద్రం ఈ రంగంపై పూర్తిస్థాయిలో దృష్టిసారించింది. భవిష్యత్తు గేమ్‌ఛేంజర్‌గా సెమీకండక్టర్ల రంగం మారబోతుంది' అని వెంకట సింహాద్రి వెల్లడించారు. సదస్సులో ఎంజీఎస్ టెక్నాలజీస్ లిమిటెడ్ ఎండీ జస్బీర్ గుజ్రాల్ మాట్లాడుతూ.. దక్షిణ భారతదేశంలో ఏపీలోనే తమ పరిశ్రమను ఏర్పాటు చేశామని, రాష్ట్ర ప్రభుత్వం అందించిన సహకారాన్ని మరువలేమన్నారు. 'కుప్పం కేంద్రంగా మొబైల్ ఫోన్ల బాడీ తయారీ యూనిట్‌ను ఏర్పాటు చేస్తున్నాం. ఇక్కడి వనరుల ఆధారంగా ఏపీని పెట్టుబడుల కోసం ఎంచుకున్నాము' అని హిందాల్కో పరిశ్రమల జాయింట్ ప్రెసిడెంట్ దీపక్ దేశ్‌ముఖ్ తెలిపారు. ఇందులో నియోలింక్ సీఈవో రూబెన్ షైబెల్ తన అనుభవాలు పంచుకున్నారు.

- ప్రభుత్వం తరపున ఐటీ శాఖ కార్యదర్శి కాటమనేని భాస్కర్ రూ.27,909 కోట్ల పెట్టుబడులకు 17 సంస్థలతో అవగాహనా ఒప్పందాలు కుదుర్చుకున్నారు.

విశాఖలో మాల్, రాయలసీమలో లాజిస్టిక్ కేంద్రం

లులు గ్రూప్‌తో రాష్ట్ర ప్రభుత్వం ఎంవోయూ

ఈనాడు, విశాఖపట్నం: రాష్ట్రంలో చేపట్టే వివిధ ప్రాజెక్టులకు సంబంధించి లులు ఇంటర్నేషనల్ గ్రూప్ సంస్థ రాష్ట్ర ప్రభుత్వంతో ఒప్పందం చేసుకుంది. సీఐఐ భాగస్వామ్య సదస్సులో సీఎం చంద్రబాబు, లులు గ్రూప్ ఛైర్మన్, ఎండీ యూసుఫ్ అలీ సమక్షంలో రాష్ట్ర ప్రభుత్వ అధికారులు, ఆ సంస్థ ప్రతినిధులు అంగీకార పత్రాలు మార్చుకున్నారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు మాట్లాడుతూ.. గత పాలకులు నిలిపేసిన ఈ ప్రాజెక్టును ఎట్టకేలకు రాష్ట్రానికి తిరిగి తీసుకొచ్చామన్నారు. మూడేళ్లలోగా మాల్ నిర్మాణం పూర్తి చేయాలని స్పష్టం చేశారు. లులు మాల్ కేవలం షాపింగ్ మాల్ మాత్రమే కాదని, విశాఖ పర్యాటకానికి దోహదపడుతుందని చెప్పారు. ప్రపంచ వ్యాప్తంగా 300కు పైగా మాల్స్ నిర్వహిస్తోన్న లులు సంస్థ వ్యవసాయ ఉత్పత్తులను రాష్ట్రంలోని రైతుల నుంచి కొనాలని కోరారు.

వచ్చే జనవరి నుంచి ఎగుమతులు..

ఫుడ్ ప్రాసెసింగ్ రంగంలోనూ లులుతో పలు ఒప్పందాలు జరిగాయి. మామిడి, జామ పల్ప్‌తో పాటు మసాలా దినుసులు రాష్ట్రం నుంచి సేకరించి ఎగుమతి చేస్తామని లులు సంస్థ వెల్లడించింది. వచ్చే జనవరి నుంచి ఏపీ నుంచి ఎగుమతులు ప్రారంభిస్తామని తెలిపింది. త్వరలోనే లాజిస్టిక్ ప్రొక్యూర్‌మెంట్ ఎక్స్‌పోర్ట్ కేంద్రాన్ని రాయలసీమలో ఏర్పాటు చేయనున్నట్లు లులు గ్రూప్ ఛైర్మన్ యూసుఫ్ అలీ ప్రకటించారు. విశాఖ నగరంలో లులు సంస్థ 13.83 ఎకరాల్లో (13.5 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో) రూ.1,066 కోట్లతో నిర్మించే ఇంటిగ్రేటెడ్ వరల్డ్ క్లాస్ మాల్‌తో 5 వేల మందికి ఉద్యోగాలు దక్కనున్నాయి.



సీఐఐ భాగస్వామ్య సదస్సు ప్రారంభం సందర్భంగా కళాకారుల సంప్రదాయ డప్పు నృత్యం

'ఉక్కు' రంగంపై జపాన్ కంపెనీల ఆసక్తి

సీఎంతో భేటీలో ఆ దేశ రాయబారి ఓనోకేయిచి

రాష్ట్రంలో ఉక్కు రంగంలో పెట్టుబడులు పెట్టేందుకు జపాన్ ఆసక్తిగా ఉందని, ఆ దేశ రాయబారి ఓనోకేయిచి తెలిపారు. భాగస్వామ్య సదస్సులో భాగంగా సీఎం చంద్రబాబుతో ఆయన భేటీ అయ్యారు. రాష్ట్రంలో పెట్టుబడుల అవకాశాలపై ఇద్దరూ చర్చించారు. స్టీలు రంగంలో పెట్టుబడులు పెట్టేందుకు తమ దేశ పారిశ్రామికవేత్తలు ఆసక్తిగా ఉన్నారని ఓనోకేయిచి వివరించారు. జపాన్ ఫార్మా రాజధాని కొయమా మాదిరిగా ఏపీని ఔషధ రంగంలో అగ్రగామిగా నిలిపేందుకు సహకారం అవసరమని సీఎం అన్నారు. సదస్సులో జపాన్‌కు చెందిన 20కి పైగా కంపెనీలు పాల్గొనడంపై ఆనందం వ్యక్తంచేశారు. శ్రీసిటీలో ఇప్పటికే జపాన్‌కు చెందిన అనేక కంపెనీలు కార్యకలాపాలు నిర్వహిస్తున్నాయని ఓనోకేయిచి చెప్పారు.

రాష్ట్రంలో ఏఎం గ్రూప్ రూ.54 వేల కోట్ల పెట్టుబడులు

రాష్ట్రంలో రూ.54 వేల కోట్ల పెట్టుబడులు పెట్టేందుకు ఏఎం గ్రీన్ సంస్థ ఒప్పందం చేసుకుంది. కాకినాడ జిల్లాలోని ఉప్పాడ వద్ద 10 లక్షల టన్నుల వార్షిక ఉత్పత్తి సామర్థ్యంతో రెండు దశల్లో గ్రీన్ అల్యూమినియం కాంప్లెక్స్‌ని అభివృద్ధి చేయనుంది. ఈ ప్రాజెక్టుపై రూ.44వేల కోట్లు వెచ్చిస్తుంది. శ్రీకాకుళం, విజయనగరం, అనకాపల్లిలో రూ.10వేల కోట్లతో పలు 2జి ఇథనాల్ బయో రిఫైనరీలు, 180 కేటీపీఏ సామర్థ్యంతో విమాన ఇంధన ఉత్పత్తి ప్రాజెక్టు నెలకొల్పనుంది. ఇది బయో ఇంధనాలకు ఉత్తరాంధ్రను గ్లోబల్ డెస్టినేషన్‌గా మార్చేందుకు దోహదం చేస్తుందని ఆ సంస్థ పేర్కొంది. చంద్రబాబు, పీయూష్ గోయల్‌ల సమక్షంలో ఒప్పందం జరిగింది.

మెరైన్ పరికరాల తయారీకి ఏపీ అనుకూలం

ఈనాడు, విశాఖపట్నం: అత్యాధునిక మెరైన్ తయారీ పరికరాల యూనిట్ నెలకొల్పేందుకు సుదీర్ఘ సాగర తీరం ఉన్న ఆంధ్రప్రదేశ్ అత్యంత అనుకూలమని మంత్రి నారా లోకేశ్ చెప్పారు. సంబంధిత యూనిట్‌ను రాష్ట్రంలో ఏర్పాటు చేయాల్సిందిగా సాగర్ డిఫెన్స్ సంస్థ ప్రతినిధుల్ని కోరారు. విశాఖ సదస్సులో లోకేశ్ వారితో సమావేశమయ్యారు. ఏఐ ఐఓటీ, స్వయం ప్రతిపత్తి వ్యవస్థలపై దృష్టి సారించాలని సూచించారు. భారత్‌ను మెరైన్ రోబోటిక్స్, డిఫెన్స్ ఇన్నోవేషన్‌లలో అగ్రగామిగా నిలపడమే లక్ష్యమని సంస్థ ప్రతినిధులు వివరించారు. ఈ రంగంలో దిగుమతుల్ని తగ్గించేందుకు స్వదేశీ సాంకేతికతను అభివృద్ధి చేస్తున్నట్లు.. మెరైన్ రోబోటిక్స్, నావిగేషన్ వ్యవస్థల్లో తమకు పేటెంట్లు ఉన్నట్లు తెలిపారు. డిఫెన్స్ సొల్యూషన్స్, మానవ రహిత సముద్ర వ్యవస్థలు, అటానమస్ వెసల్స్ తయారీలో సాగర్ సంస్థ పేరు పొందింది.



లోకేశ్‌తో కలిసి ఎంఓయూ చూపుతున్న సాగర్ డిఫెన్స్ సంస్థ ప్రతినిధి

వైజాగ్‌కు చంద్రబాబు కొత్త నిర్వచనం

వి – విజన్ (దార్శనికత)
ఐ – ఇన్నోవేషన్ (ఆవిష్కరణ)
జడ్ – జీల్ (ఉత్సాహం),
ఏ – యాస్పిరేషన్ (ఆశయం),
జీ – గ్రోత్ (వృద్ధి)

అంటూ వైజాగ్‌ను సరికొత్తగా నిర్వచిస్తూ, భాగస్వామ్య సదస్సుకు వస్తున్న అతిథులకు ఆహ్వానం పలుకుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు ఎక్స్‌లో పెట్టిన పోస్టు ఆసక్తికరంగా మారింది. పెట్టుబడులకు ఏపీ సరైన వేదిక అనే అంశాన్ని ప్రతిబింబించేలా, స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ విధానం అందరికీ అర్థమయ్యేలా, ఏపీలో ఉన్న అపార అవకాశాలను వివరించేలా, అందరి సహకారాన్ని, అభివృద్ధిని కాంక్షిస్తూ రెండు రోజులపాటు సదస్సు నిర్వహిస్తున్నట్లు సీఎం ఆ పోస్టులో పేర్కొన్నారు.

– ఈనాడు, విశాఖపట్నం

అమరావతిలో డిస్‌ప్లే ఎలక్ట్రానిక్స్ తయారీ కేంద్రం

విశాఖపట్నం నుంచి ఈనాడు ప్రత్యేక ప్రతినిధి: అమరావతిలో ఆధునిక డిస్‌ప్లే ఎలక్ట్రానిక్స్ ఉత్పత్తి తయారీ కేంద్రాన్ని రూ.250 కోట్లతో ఏర్పాటు చేసేందుకు ఏపీ ఆర్థికాభివృద్ధి మండలితో టైటన్ ఇంటెక్ ఒప్పందం కుదుర్చుకుంది. ఈ ఒప్పందంలో భాగంగా హైవాల్యూ డిస్‌ప్లే కంట్రోలర్లు, ఇంటెలిజెంట్ డ్రైవర్ సిస్టమ్స్, 2డీ, 3డీ రెండరింగ్ ఇంజిన్లు, మైక్రో ఎల్ఈడీ మాడ్యూల్ ఇంటిగ్రేషన్ సాంకేతికను అభివృద్ధి చేస్తుంది. దీంతో ప్రత్యక్షంగా 200, పరోక్షంగా 300 ఉద్యోగాలు రానున్నాయి. ఏపీలో పారిశ్రామికాభివృద్ధి, నైపుణ్యాభివృద్ధికి ఈ ఒప్పందం ఉపయోగపడనుంది. ఎలక్ట్రానిక్స్ తయారీ క్లస్టర్‌లో 20 ఎకరాల్లో దీన్ని అభివృద్ధి చేస్తారు.

■ అల్యూనియం ప్యాకేజింగ్‌లో ప్రపంచ అగ్రగామిగా ఉన్న బాల్ కార్పొరేషన్ శ్రీసిటీలో ఉత్పత్తి కేంద్రాన్ని ఏర్పాటుచేయనున్నట్లు ప్రకటించింది. మహారాష్ట్రలో 2024లో 55 మిలియన్ డాలర్ల పెట్టుబడి తర్వాత ఇప్పుడు శ్రీసిటీలో 55 మిలియన్ డాలర్ల పెట్టుబడి పెట్టబోతోంది.

స్పేస్‌సిటీ, డ్రోన్‌సిటీలకు శంకుస్థాపన

వర్చువల్‌గా చేసిన చంద్రబాబు, పీయూష్ గోయల్

డ్రోన్లకూ ఏటీసీ తరహా వ్యవస్థ అవసరం: సీఎం



విశాఖ సీఐఐ భాగస్వామ్య సదస్సు నుంచి కేంద్ర మంత్రి పీయూష్ గోయల్‌తో కలిసి డ్రోన్ సిటీ, స్పేస్ సిటీలకు వర్చువల్‌గా శంకుస్థాపన చేస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు. చిత్రంలో మంత్రులు టీజీ భరత్, జనార్దన్‌రెడ్డి తదితరులు

విశాఖపట్నం నుంచి 'ఈనాడు' ప్రతినిధి: విమానాల రాకపోకలకు ఏటీసీ (ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్) ఎలా ఉంటుందో డ్రోన్లకు కూడా అలాంటి వ్యవస్థ అవసరమని ముఖ్యమంత్రి చంద్రబాబు పేర్కొన్నారు. తిరుపతి, శ్రీసత్యసాయి జిల్లాల్లో స్పేస్‌సిటీ, కర్నూలు జిల్లా ఓర్వకల్లులో డ్రోన్‌సిటీ ద్వారా పారిశ్రామికవేత్తలకు ఎన్నో అవకాశాలు లభిస్తాయని ముఖ్యమంత్రి చంద్రబాబు చెప్పారు. స్పేస్‌సిటీ ద్వారా జాతీయ, అంతర్జాతీయ అవసరాలకు ఉపయోగపడేలా ఉపగ్రహాల తయారీ, ప్రయోగాలు చేపట్టవచ్చని పేర్కొన్నారు. భారత వైమానిక, అంతరిక్ష రంగాల్లో కొత్త శకం మొదలవుతుందని వివరించారు. సీఐఐ భాగస్వామ్య సదస్సులో భాగంగా శుక్రవారం విశాఖపట్నం నుంచి కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్‌తో కలిసి వర్చువల్‌గా డ్రోన్‌సిటీ, స్పేస్‌సిటీలకు శంకుస్థాపన చేశారు. చంద్రబాబు ప్రసంగంలో ముఖ్యాంశాలివీ..

స్పేస్‌సిటీలో 35 వేలు.. డ్రోన్‌సిటీలో 25 వేల మందికి ఉపాధి

స్పేస్ సిటీలో ఉపగ్రహ ప్రోటోటైప్ తయారీ, స్పేస్‌టెక్ స్టార్టప్ ఇంక్యుబేషన్, ఉపగ్రహ విభాగాల తయారీ, లాంచ్ వెహికల్స్ లాజిస్టిక్స్‌కు అవసరమైన మద్దతు అందిస్తాం. వచ్చే పదేళ్లలో రూ.25 వేల కోట్ల పెట్టుబడులు, 35 వేల మందికి ఉద్యోగావకాశాలు లభిస్తాయి. ఓర్వకల్లులో 300 ఎకరాల్లో ఏర్పాటు చేసే డ్రోన్‌సిటీలో అధునాతన తయారీ పార్కులు, టెస్టింగ్, సర్టిఫికేషన్ ద్వారా 25 వేల మందికి శిక్షణ అందించనున్నాం. ప్రత్యక్షంగా, పరోక్షంగా 40 వేల మందికి ఉపాధి లభిస్తుంది. రాష్ట్రవ్యాప్తంగా 50 సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లు ఏర్పాటు చేస్తున్నాం. డ్రోన్‌సిటీలో 20 శాతం క్యాపిటల్ సబ్సిడీతోపాటు 100 శాతం జీఎస్టీ రాయితీ తదితర ప్రోత్సాహకాలు అందిస్తున్నాం.

మోదీ ప్రకటించడమే ఆలస్యం.. అమలు చేస్తున్న ఆంధ్రప్రదేశ్

ప్రధాని మోదీ క్వాంటం మిషన్ ప్రకటించారు. దాన్ని అందిపుచ్చుకుని ఏపీలో క్వాంటం వ్యాలీ ప్రారంభించాం. గ్రీన్ హైడ్రోజన్ మిషన్‌ను కేంద్రం ప్రకటిస్తే.. ఏపీలో గ్రీన్ హైడ్రోజన్ వ్యాలీ చేపట్టాం. డేటా కేంద్రాలు, ఏఐ సెంటర్లు వస్తున్నాయి. అంతరిక్ష రంగంలోనూ కేంద్ర ప్రోత్సాహకాల్ని అందిపుచ్చుకుని ముందడుగు వేస్తున్నాం. ప్రపంచవ్యాప్తంగా జనాభా తగ్గుదల పెద్ద సమస్యగా తయారైంది. అందువల్ల రోబోటిక్స్ ప్రాధాన్యం పెరుగుతోంది. భారత్ నుంచి ప్రజల్ని తమ దేశానికి పంపాలని తైవాన్ దేశస్థులు కోరారు' అని చంద్రబాబు వెల్లడించారు. ఈ సందర్భంగా స్పేస్‌సిటీకి సంబంధించి ఎథర్నల్ ఎక్స్‌ప్లోరేషన్, గిల్డ్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థలతో చంద్రబాబు, పీయూష్ గోయల్ సమక్షంలో ఒప్పందాలు జరిగాయి. డ్రోన్‌సిటీలో ఆల్గోబోటిక్స్ ప్రైవేట్ లిమిటెడ్, అకిన్ ఎనలిటిక్స్, సెన్సెల్మేజ్, ఏర్వోస్ తదితర సంస్థలు ఒప్పందం చేసుకున్నాయి.

రెండేళ్లలో రాష్ట్రంలో డ్రోన్ ట్యాక్సీలు

ఈనాడు, విశాఖపట్నం: 'రాష్ట్రంలో పారిశ్రామికవేత్తలకు ప్రోత్సాహకాలు అందించేందుకు ప్రభుత్వం తరఫున ప్రత్యేకంగా 'ఎస్క్రో' ఖాతాలు తెరుస్తాం. దేశంలో తొలిసారిగా ఏపీలోనే ఈ విధానం ప్రారంభిస్తున్నాం. మీరు పెట్టుబడులపై నిర్ణయం తీసుకుంటే ఖాతాలు తెరిచినరోజే ప్రోత్సాహకాలు జమవుతాయి. అవసరమైతే వాటికి సావరీన్ గ్యారంటీ అమలుచేస్తాం" అని ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించారు. రెండేళ్లలోగా రాష్ట్రంలో డ్రోన్ ట్యాక్సీలను ప్రారంభిస్తామని తెలిపారు. భారత పరిశ్రమల సమాఖ్య (సీఐఐ) ఆధ్వర్యంలో విశాఖలో రెండు రోజుల పాటు జరుగుతున్న 30వ భాగస్వామ్య సదస్సు ప్రారంభోత్సవంలో ఆయన మాట్లాడారు. "ప్రధాని నరేంద్ర మోదీ సారథ్యంలో దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి దిశగా అడుగులు వేస్తోంది. పది సూత్రాల ఆధారంగా రాష్ట్రంలో పెట్టుబడులను ప్రోత్సహిస్తున్నాం. ఒక్కసారి ఒప్పందం జరిగాక.. దాన్ని మా ప్రాజెక్టుగా భావించి, రియల్ టైంలో అనుమతులు ఇస్తున్నాం. మీరు వెళ్లే ముందు మాతో ఎంఓయూ చేసుకోండి. మేం మీకు అండగా ఉంటాం. బలమైన ఆర్థిక వ్యవస్థలను నిర్మించడంతో పాటు సంపద సృష్టించేందుకు కలసి పనిచేద్దాం" అని పారిశ్రామికవేత్తలను ఆహ్వానించారు. "డీప్ టెక్నాలజీ రంగంలోనూ ఏపీలో విస్తృత అవకాశాలున్నాయి. ఇప్పటివరకు పెట్టుబడులకు అనుకూలమైన 25 పాలసీలు తీసుకొచ్చాం" అని వివరించారు. "కేంద్రమంత్రి పీయూష్ గోయల్ సూచన మేరకు ప్రపంచస్థాయి కన్వెన్షన్ సెంటర్ ఏర్పాటుకు విశాఖలో కొండపై సముద్రానికి అభిముఖంగా స్థలం కేటాయిస్తాం" అని పేర్కొన్నారు. "ఇప్పటివరకు సీఐఐ ఆధ్వర్యంలో 30 భాగస్వామ్య సదస్సులు జరగగా.. అందులో ఏడింటికి ఏపీ ఆతిథ్యమిచ్చింది" అన్నారు.

> 17 నెలల్లో రూ.1,77,400 కోట్ల పెట్టుబడులు రాష్ట్రానికి వచ్చాయి. 20 లక్షల ఉద్యోగాలు కూడా రానున్నాయి. రాబోయే మూడేళ్లలో రూ.44,35,200 కోట్ల పెట్టుబడులు, 50 లక్షల ఉద్యోగాల కల్పన లక్ష్యం. వచ్చే పదేళ్లలో రూ.88.70 లక్షల కోట్ల పెట్టుబడులను ఆకర్షిస్తామనే విశ్వాసముంది.
>
> - చంద్రబాబు



నేను ఏటా సీఐఐ సమ్మిట్‌లకు వస్తాను. ఈ సమ్మిట్ నేను చూసిన అన్నింటిలో కంటే పెద్దది. ఇది ఏపీకే కాదు. భారత్‌కు, ప్రపంచ వ్యాపారాలకు గొప్ప వేదికగా నిలుస్తుంది.

– ఎడిత్ ఎన్.నోర్డ్‌మాన్

ఈ సదస్సు గొప్ప వేదిక

ఈనాడు, అమరావతి: ఆంధ్రప్రదేశ్‌లో జరుగుతున్న సీఐఐ భాగస్వామ్య సదస్సు ప్రపంచ వ్యాపారులకు గొప్ప వేదికగా అని **నెదర్లాండ్స్ ఇండియా ఛాంబర్ ఆఫ్ కామర్స్, ట్రేడ్ చైర్మన్ ఎడిత్ ఎన్.నోర్డ్‌మాన్** అన్నారు. విశాఖపట్నంలో సీఐఐ భాగస్వామ్య సదస్సుకు హాజరైన ఆమె 'ఈనాడు'తో ప్రత్యేకంగా మాట్లాడారు. 'నెదర్లాండ్స్ వ్యవసాయ కంపెనీలు భారత్‌లో శీతల గిడ్డంగులు, పంట నిల్వ, విలువ జోడింపునకు సహకారాన్ని అందిస్తున్నాయి. ఉల్లి నిల్వకు నెదర్లాండ్స్‌లో ఒక సృజనాత్మక పద్ధతిని తీసుకొచ్చారు. ఉల్లిపాయ పొడవైన కాడను 10 సెంటీమీటర్లు ఉంచి తీస్తారు. కాడ పాడైనా ఉల్లిపాయ మాత్రం ఎక్కువ నిల్వ ఉంటుంది. ఇలాంటి సృజనాత్మక విధానాలను పాటిస్తే ఏపీలో రైతులకు నష్టాలు తగ్గుతాయి. సీజన్‌లో మంచి ధరకు అమ్ముకునే అవకాశం ఉంటుంది' అని తెలిపారు. 'నెదర్లాండ్స్‌లో గ్రీన్ హైడ్రోజన్ వ్యాలీ ఉంది. ఏపీ సైతం పునరుత్పాదక ఇంధన రంగంలో చాలా బలంగా ఉంది. ఈ రంగంలో ఇరు పక్షాల మధ్య చర్చలు జరుగుతున్నాయి' అని తెలిపారు.



ఇప్పుడు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంతో ఒప్పందం చేసుకున్నాం. ఓర్వకల్లు డ్రోన్ సిటీలోని 300 ఎకరాల్లో ఏ డ్రోన్ ఎగిరినా అవి ఒకదానికి మరోటి తగలవు. కళ్లుమూసుకుని ఎగరేసినా క్రాష్ కావు. అలాంటి వ్యవస్థను ఏర్పాటుచేస్తాం. డ్రోన్‌సిటీలో అధిక సంఖ్యలో డ్రోన్లు ఎగరేసి.. వాటికి కారిడార్ ఏర్పాటుచేస్తాం. రెండు డ్రోన్లు కూడా ఎగరేయలేని స్థలంలో మేం 50 డ్రోన్లు సురక్షితంగా ఎగరేస్తాం.

- ధవళసాయి

వందల డ్రోన్లు ఎగిరినా.. క్రాష్ కావు

'ఈనాడు'తో ఆల్గోబాటిక్స్ సహ వ్యవస్థాపకులు ధవళసాయి

విశాఖపట్నం నుంచి ఈనాడు ప్రత్యేక ప్రతినిధి: డ్రోన్లకూ ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్ (ఏటీసీ) వ్యవస్థ రూపకల్పనపై తాము విస్తృత పరిశోధనలు చేస్తున్నామని బెంగళూరు కేంద్రంగా పనిచేసే ఆల్గోబాటిక్స్ సహ వ్యవస్థాపకులు, విజయవాడకు చెందిన ధవళసాయి వివరించారు. ఒక్కసారిగా వందల డ్రోన్లు ఎగరేసినా క్రాష్‌కు అవకాశం లేని విధానం అభివృద్ధి చేస్తున్నామని వివరించారు. విశాఖపట్నంలో ఏపీ ప్రభుత్వం, ఆల్గోబాటిక్స్ మధ్య అవగాహన ఒప్పందం కుదిరింది. ఏరోస్పేస్ రంగంలో మూడు దశాబ్దాల అనుభవం కలిగిన ప్రొఫెసర్ దేబాశిష్ ఘోష్, ఓంకార్ చోప్రాతో కలిసి 2023లో ఆల్గోబాటిక్స్ సంస్థ ప్రారంభించామని చెప్పారు. ఈ సందర్భంగా ధవళసాయి 'ఈనాడు'తో మాట్లాడారు. 'ఎలాంటి డ్రోన్ అయినా, దాన్ని ఏ కంపెనీ తయారుచేసినా.. అన్ని డ్రోన్లకూ మేం ఒకే సాఫ్ట్‌వేర్ తయారు చేస్తాం. ఒక డ్రోన్‌కు సమీపంలో మరో డ్రోన్ వస్తే అనుసంధానమై పనిచేస్తాయి. వాటికి మేం కారిడర్ ఏర్పాటుచేస్తాం. దాన్ని దాటి డ్రోన్ బయటకు వెళ్లదు' అని అన్నారు.



సదస్సు ప్రాంగణంలో గిరిజన కళాకారులతో నృత్యం చేస్తున్న మంత్రులు సవిత, గుమ్మిడి సంధ్యారాణి



మూడో ప్లాంట్ ఏర్పాటుకు డైకిన్ మొదట గుజరాత్, మహారాష్ట్రలను పరిశీలించింది. ఏపీ ప్రభుత్వ ప్రోత్సాహంతో ఇక్కడే ఏర్పాటు చేయాలనే నిర్ణయం తీసుకుంది.

- నిమ్మగడ్డ కుటుంబరావు

శ్రీసిటీలో ఏడాదికి 50 లక్షల డైకిన్ ఏసీలు

విశాఖ నుంచి ఈనాడు ప్రత్యేక ప్రతినిధి: తిరుపతి జిల్లా శ్రీసిటీలో డైకిన్ మూడో ప్లాంట్ నిర్మాణంతో ఏడాదికి 50 లక్షల ఏసీలను ఉత్పత్తి చేయనున్నామని ***డైకిన్ సంస్థ దక్షిణ ప్రాంత వైస్ ప్రెసిడెంట్ నిమ్మగడ్డ కుటుంబరావు*** తెలిపారు. ఏపీలో ఇప్పటికే రెండు ప్లాంట్లను ఏర్పాటు చేయగా.. ఇప్పుడు మూడోది ఏర్పాటు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వంతో డైకిన్ సంస్థ ఒప్పందం కుదుర్చుకుంది. ఈ సందర్భంగా ఆయన 'ఈనాడు'తో మాట్లాడుతూ.. 'మూడో ప్లాంట్ నిర్మాణంలో భాగంగా రూ.2,500 కోట్ల పెట్టుబడులు పెడుతున్నాం. ఏపీ యువతకు 5 వేల ఉద్యోగాలు కల్పిస్తాం. మూడు ప్లాంట్లతో కలిపి ఏటా 50 లక్షల ఏసీలను ఉత్పత్తి చేస్తాం. వీటిల్లో 15 నుంచి 20 లక్షల ఏసీలను విదేశాలకు ఎగుమతి చేస్తాం. రాష్ట్రంలోని ఐటీఐ, పాలిటెక్నిక్, ఇంజినీరింగ్ విద్యార్థులకు శిక్షణ ఇచ్చి, ఉద్యోగాల్లోకి తీసుకుంటాం. కొత్తగా శిక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నాం. తడ చుట్టుపక్కల ఉన్న మహిళలకు శిక్షణ ఇచ్చి, ఉద్యోగాల్లోకి తీసుకుంటున్నాం. సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్‌లపై ఉన్న నమ్మకం, కంపెనీలకు అందిస్తున్న ప్రోత్సాహకాలతో ఇక్కడ పెట్టుబడులు పెట్టేందుకు ఆసక్తి చూపిస్తున్నాం' అని వెల్లడించారు.

ఏపీలో వ్యాక్సిన్ తయారీ యూనిట్ నెలకొల్పాలి

● భారత్ బయోటెక్ ఎండీ సుచిత్రా ఎల్ల, సీడీవో రేచస్ ఎల్లకు మంత్రి లోకేశ్ విజ్ఞప్తి



భారత్ బయోటెక్ ఎండీ సుచిత్రా ఎల్ల, ఆ సంస్థ సీడీవో రేచస్ ఎల్లతో చర్చిస్తున్న మంత్రి లోకేశ్

విశాఖ నుంచి ఈనాడు ప్రత్యేక ప్రతినిధి: అన్నివిధాలా అనుకూలతలు కలిగిన ఆంధ్రప్రదేశ్‌లో వ్యాక్సిన్ తయారీ యూనిట్‌ను నెలకొల్పాలని.. ప్రపంచ మానవాళిని కొవిడ్ మహమ్మారి నుంచి కాపాడిన అంతర్జాతీయ స్థాయి వ్యాక్సిన్ తయారీ సంస్థ భారత్ బయోటెక్ మేనేజింగ్ డైరెక్టర్ సుచిత్రా ఎల్ల, చీఫ్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ (సీడీవో) రేచస్ ఎల్లను మంత్రి లోకేశ్ కోరారు. భాగస్వామ్య సదస్సులో భాగంగా వారిని కలిసిన మంత్రి.. రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు ఉన్న అవకాశాలు, ప్రభుత్వం అందిస్తున్న సహకారం, ప్రోత్సాహకాలు తదితర విషయాలను వివరించారు. 'ప్రస్తుతం మలేరియా, గన్యా, జికా వైరస్ వంటి పాండమిక్ వ్యాధులకు వ్యాక్సిన్ల తయారీపై పరిశోధనలు చేస్తున్నాం. ఏపీ ప్రభుత్వ ప్రతిపాదనలు పరిశీలిస్తాం' అని రేచస్ ఎల్ల మంత్రితో అన్నారు. భారత్ బయోటెక్ సంస్థ కోవాక్సిన్ (కొవిడ్-19), రోటావాక్ (రోటా వైరస్), టైప్ బార్ టీసీవీ (టైఫాయిడ్ వ్యాక్సిన్), జెన్వాక్ (జపనీస్ ఎన్‌కెఫలైటిస్) వంటి వ్యాక్సిన్లు తయారు చేసి ప్రపంచ వ్యాప్తంగా 80 దేశాలకు సరఫరా చేస్తోంది. సుమారు రూ.3 వేల కోట్ల వార్షికాదాయం కలిగి వ్యాక్సిన్ల తయారీలో భారత్‌లో టాప్-3లో ఒకటిగా ఉంది. ఆఫ్రికా, సౌత్ ఈస్ట్ ఆసియా, లాటిన్ అమెరికా వంటి దేశాలకు వ్యాక్సిన్లను ప్రధానంగా ఎగుమతి చేస్తోంది.

మన ఆయుఃప్రమాణం పదేళ్లు పెరగొచ్చు

జన్యుశాస్త్ర అత్యాధునిక పరిశోధనలు సఫలమైతే ఇది సాధ్యమే

భారత్ బయోటెక్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ చీఫ్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ రేచస్ ఎల్ల

విశాఖపట్నం నుంచి 'ఈనాడు' ప్రత్యేక ప్రతినిధి: జన్యుశాస్త్రంలో జరుగుతున్న అత్యాధునిక పరిశోధనలు మనిషి ఆయుఃప్రమాణాన్ని గణనీయంగా పెంచేందుకు దోహదం చేయనున్నట్లు భారత్ బయోటెక్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ చీఫ్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ రేచస్ ఎల్ల పేర్కొన్నారు. ఈ పరిశోధనలతో ఒక దశాబ్ద కాలం ఎక్కువగా జీవించే అవకాశం కలుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. దీంతో దీర్ఘాయువు అనేది ఒక ప్రధాన అంశంగా మారబోతోందన్నారు. విశాఖలో జరుగుతున్న సీఐఐ భాగస్వామ్య సదస్సులో 'వైద్యశాస్త్రంలో ఏఐ, జన్యుశాస్త్ర అనుసంధానం'పై నిర్వహించిన కార్యక్రమంలో శుక్రవారం ఆయన మాట్లాడారు. 'మేం చాలా ఏళ్లుగా బయోఫార్మాస్యూటికల్ రంగంలో పనిచేస్తున్నాం. మా వ్యాక్సిన్లు చాలా ఇన్నోవేటివ్ మాలిక్యూల్స్. వాటిలో దాదాపు ఐదింటిని పూర్తిగా మేమే అభివృద్ధి చేశాం. ఇప్పటికే బయో ఫార్మా రంగంలో దేశం సృజనాత్మకంగా ముందుకెళుతోంది. కొత్త మాలిక్యూల్స్‌ను అభివృద్ధి చేయడంలో మేం చాలా ముందున్నాం. జన్యుశాస్త్రం విషయానికొస్తే అమెరికాలో మొదటి దశ క్లినికల్ ట్రయల్స్‌లో సుమారు పది మంది రోగులపై చేసిన జీన్ థెరపీ.. ఇన్సులిన్ అవసరాన్ని 30 శాతం వరకు తగ్గించింది. మన దేశంలో క్లినికల్ ట్రయల్స్‌పై నియంత్రణ విధానాలు చాలా పాత పద్ధతుల్లో సాగుతున్నాయి. పరిశోధనల స్థాయి నుంచి మొదటిసారి మనుషులపై ప్రయోగాల దశకు త్వరగా తీసుకువెళ్తే అదొక పెద్ద ముందడుగే. చైనా ప్రస్తుతం అదే చేస్తోంది. మాలిక్యూల్‌ను కనుగొని నియంత్రణా అడ్డంకులు లేకుండా వేగంగా మానవ పరీక్షలకు పంపుతోంది' అని పేర్కొన్నారు. ఈ సమావేశంలో వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కార్యదర్శి సౌరభ్‌గౌర్ తదితరులు పాల్గొన్నారు.



వాట్సప్ ద్వారా వెయ్యి రకాల సేవలను అందుబాటులోకి తెచ్చాం. దేశంలో అతిపెద్ద విదేశీ పెట్టుబడులను రాష్ట్రం సాధించింది. క్వాంటమ్ కంప్యూటర్‌లోనూ ముందున్నాం.

- లోకేశ్

చర్చాగోష్ఠిలో మాట్లాడుతున్న మంత్రి లోకేశ్. చిత్రంలో సీఐఐ ఏపీ ఛైర్మన్ మురళీకృష్ణ, సౌదీ ఇన్వెస్ట్‌మెంట్ ప్రమోషన్ అథారిటీ సీఈఓ ఖలేదా అల్కహతఫ్

సౌదీతో పనిచేయడానికి సిద్ధం

● ఐటీ మంత్రి నారా లోకేశ్

ఈనాడు, విశాఖపట్నం: దేశంలో సాంకేతిక ఆవిష్కరణల పరంగా ఆంధ్రప్రదేశ్ ముఖ్యభూమిక పోషించనుందని ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్ పేర్కొన్నారు. విశాఖలో జరిగిన సీఐఐ భాగస్వామ్య సదస్సులో 'సమగ్ర, సుస్థిర ఆవిష్కరణలను వేగవంతం చేయడం' అనే అంశంపై నిర్వహించిన చర్చాగోష్ఠిలో ఆయన మాట్లాడారు. సౌదీ అరేబియాలో ఈ-గవర్నెన్స్ చక్కగా అమలుచేస్తుంటారని, వారితో పరస్పర పెట్టుబడులు, సాంకేతిక సహకారం కొనసాగించడానికి సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. కార్యక్రమంలో అమెరికాలోని వద్వానీ ఏఐ సెంటర్ సీనియర్ అడ్వైజర్ గ్రెగరీ సి ఎలెన్, ఏపీ సీఐఐ ఛైర్మన్ జి.మురళీకృష్ణ పాల్గొన్నారు.

> 'వేగంగా డిజిటలీకరణ చెందుతున్న దేశాల్లో సౌదీ అరేబియా ఒకటి. 2028 నాటికి ప్రపంచ డేటా పరిమాణం 395 జిటా బైట్స్‌కు చేరుకుంటుంది. మా దేశంలో 2030 నాటికి జీడీపీలో ఏఐ వాటా 12% ఉంటుందని అంచనా. పెట్టుబడులకు ఏపీ సురక్షితమని భావిస్తున్నాం.' –ఖలేదా అల్కహతఫ్, సౌదీ ఇన్వెస్ట్‌మెంట్ ప్రమోషన్ అథారిటీ సీఈఓ

> 'ప్రపంచవ్యాప్తంగా పరిశోధన, ఆవిష్కరణల్లో వేగం, కచ్చితత్వం ఏఐ ద్వారానే సాధ్యం. భారత్, సింగపూర్ మధ్య ఏఐ రంగంలో భారీ అవకాశాలు అందుబాటులోకి రానున్నాయి.'
> – డా.మోహన్ కంకణహళ్లి, డైరెక్టర్, నేషనల్ యూనివర్సిటీ ఆఫ్ సింగపూర్

25 సంస్థలతో పురపాలక శాఖ ఒప్పందాలు

విశాఖపట్నం నుంచి ఈనాడు ప్రత్యేక ప్రతినిధి: భాగస్వామ్య సదస్సు మొదటిరోజు పురపాలక శాఖ మంత్రి నారాయణ సమక్షంలో 25 సంస్థలతో అధికారులు ఒప్పందాలు చేసుకున్నారు. ఇందులో 18 సంస్థలు సీఆర్డీఏలో పెట్టుబడులు పెట్టనున్నాయి. మరో 6 సంస్థలు స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ద్వారా పెట్టుబడులు పెడతాయి. ఇప్పటి వరకు పురపాలక శాఖ 32 ఒప్పందాలు చేసుకుంది. సీఆర్డీఏలో రూ.36,648 కోట్లు, డైరెక్టరేట్ నుంచి రూ.1,800 కోట్లు, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ద్వారా రూ.1,680 కోట్ల పెట్టుబడులకు ఎంఓయూలు కుదిరాయి. ప్రత్యక్షంగా, పరోక్షంగా 1,57,510 మందికి ఉద్యోగాలు వచ్చే అవకాశం ఉంది.

ఆంధ్రా రుచులతో అదిరేలా!

భాగస్వామ్య సదస్సులో ఆంధ్రా వంటకాలతో రాష్ట్ర ప్రభుత్వం అదిరిపోయే విందు ఇచ్చింది. ఓ వైపు ఎంఓయూలతో పెట్టుబడులు వెల్లువెత్తుతుంటే, మరోవైపు ఆంధ్రా రుచుల ఘుమఘుమలు దేశ, విదేశీ ప్రతినిధులకు పరిచయమయ్యాయి. సుమారు 3 వేల మందికి 20 రకాలకు పైగా వంటకాలతో భోజనాలు అందించారు.

- ఈనాడు-విశాఖపట్నం, వన్‌టౌన్-న్యూస్‌టుడే

ఏయూ మైదానంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక హాల్‌లో మూడు చోట్ల వేర్వేరుగా భోజనాలు ఏర్పాటు చేసి ఒకే మెనూ పాటించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, పారిశ్రామిక దిగ్గజాలు, కేంద్ర, రాష్ట్ర మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, సీనియర్ ఐఏఎస్ అధికారులు, కేంద్ర ప్రభుత్వ అధికారులకు ప్రత్యేకంగా ఏర్పాట్లు చేశారు. సలాడ్స్‌తో మొదలుపెట్టి మెయిన్ కోర్స్‌లో గుంటూరు మిరపకాయ కోడి కూర, గ్రిల్డ్ ఫిష్, హైదరాబాదీ మటన్ ధమ్ బిర్యానీ, పులావ్, పులిహోర, దద్దోజనం, అరికెల కిచిడి ఏర్పాటు చేశారు. రోటీ, నాన్స్, స్టీమ్డ్ రైస్‌తోపాటు గుత్తి వంకాయ, ఆవకాయ పప్పు, దాల్ తడకా, సాంబారు, రసం, పెరుగు ఉంచారు. వీటికి తోడుగా మజ్జిగ పులుసు, ఉలవచారు, గోంగూర ఉల్లి పచ్చడి, బీరకాయ, టమాటా రోటి పచ్చడి, పప్పులపొడి-నెయ్యి, అప్పడాలు, మామిడికాయ పచ్చడి వడ్డించారు.

లైవ్ కౌంటర్ ఏర్పాటు చేసి

విదేశీ ప్రతినిధుల కోసం ప్రత్యేకంగా లైవ్ కౌంటర్ ఏర్పాటు చేశారు. డెజర్ట్స్‌గా ఫ్రూట్ సలాడ్‌తోపాటు నాలుగు రకాల ఐస్‌క్రీంలు పెట్టారు. ఇక్కడే ప్రత్యేకంగా ఆంధ్ర డెజర్ట్ కౌంటర్ పేరుతో.. అరిసెలు, పూతరేకులు, కాకినాడ కాజా, సున్నుండలు, పప్పుండలు అందుబాటులో ఉంచారు. ఎక్కువ మంది విదేశీయులు ఐస్‌క్రీంలు కంటే ఆంధ్ర డెజర్ట్‌కు మొగ్గు చూపారు. జిల్లా సంయుక్త కలెక్టర్ మయూర్ అశోక్ పర్యవేక్షణలో డీసీఎస్ఓ భాస్కర్‌రావు, ఇతర అధికారులు భోజనాల ప్రక్రియను పర్యవేక్షించారు. అతిథులకు ఉదయం నుంచి సాయంత్రం వరకు టీ, కాఫీలను అందించారు. విశాఖలో 2023లో ఏర్పాటు చేసిన పెట్టుబడి సదస్సులో భోజనాల వద్ద కొందరు ప్రతినిధులు కుర్చీలు విరగ్గొట్టి, టెంట్లు చించివేశారు. దీంతో గత సదస్సులా కాకుండా ప్రతి విషయంలో యంత్రాంగం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంది.



అరకు కాఫీ స్టాల్ వద్ద పర్యాటకశాఖ మంత్రి కందుల దుర్గేష్, ఉన్నతాధికారులు



ఏయూ మైదానంలో ఏర్పాటు చేసిన హాల్‌లో భోజనం చేస్తున్న ప్రతినిధులు

భారత్, ఏపీలో పెట్టుబడులకు ఇదే సరైన సమయం

● ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్

ఈనాడు విశాఖపట్నం: "ప్రపంచంలోనే అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థ గల భారత్‌తో పాటు పెట్టుబడులకు అనుకూల వాతావరణం కల్పిస్తున్న ఆంధ్రప్రదేశ్‌లో పెట్టుబడులు పెట్టేందుకు ఇదే సరైన సమయం. మీరు సరైన ప్రాంతానికి వచ్చారు. సరైన సమయంలో నిర్ణయం తీసుకుంటేనే ఫలితం వస్తుంది" అని వివిధ దేశాల ప్రతినిధులకు ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్ సూచించారు. విశాఖలో సీఐఐ ఆధ్వర్యంలో రెండు రోజులపాటు జరుగుతున్న 30వ భాగస్వామ్య సదస్సును శుక్రవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. "కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలసికట్టుగా ఎదగడానికి కృషి చేస్తున్నాయి. ఫుడ్ ప్రాసెసింగ్, బ్లూ, గ్రీన్ ఎకానమీ.. ఇలా అన్ని రంగాల్లో పెట్టుబడులు ఆహ్వానిస్తున్నాం. ఇప్పటికే ప్రపంచంలో మూడో అతి పెద్ద స్టార్టప్ ఎకోసిస్టమ్ ఉన్న భారత్.. మరో ఏడాది లేదా రెండేళ్లలో మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఎదగనుంది. క్లీన్ టెక్నాలజీ ఎగుమతుల్లో గ్లోబల్ హబ్‌గా ఎదగబోతున్నాం. మేం ఏ దేశాన్నీ ఇలా చేయాలని ఆజ్ఞాపించం, ఎవరి ఆజ్ఞలూ వినడానికి సిద్ధంగా లేము. కలసి ఎదగడానికి ప్రాధాన్యం ఇస్తాం. ఇది భారత్ అనుసరిస్తున్న గొప్ప విధానం.

అప్పుడు.. ఇప్పుడూ అదే ఉత్సాహం

పరిశ్రమల స్థాపన, పెట్టుబడులకు మెరుగైన గమ్యస్థానాల్లో ఏపీ ఒకటి. దేశంలో మెరుగైన ఐటీ హబ్‌గా హైదరాబాద్ ఎదిగింది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా చంద్రబాబు చేసిన కృషికి నిదర్శనమది. రాష్ట్రం రెండుగా విడిపోవడంతో ఆయన కష్టమంతా తెలంగాణకు వెళ్లిపోయింది. ఆయన మళ్లీ మొదటి నుంచి ప్రారంభించారు. మూడు దశాబ్దాల క్రితం ఎలా పనిచేశారో.. ఇప్పటికీ అదే ఉత్సాహంతో ముందుకెళ్తున్నారు. చంద్రబాబు విజయాలను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలి. ఆధునిక సాంకేతికతను వినియోగించుకుని ఆర్థిక ప్రగతి ఎలా సాధించగలమో చూపిస్తున్నారు. అతి తక్కువ సమయంలో ప్రపంచదేశాల నుంచి పెద్దఎత్తున పెట్టుబడులు ఆకర్షించారు. ప్రతి అభివృద్ధి చెందిన దేశం, పెద్ద సంస్థలు ఇక్కడ పెట్టుబడులు పెట్టాలని ఆసక్తి కనబరుస్తున్నాయి. దీనంతటికీ చంద్రబాబే కారణం. పారిశ్రామికవేత్తలకు సురక్షిత వాతావరణాన్ని కల్పిస్తున్నారు. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ విధానం కాగితాలకే పరిమితం కాకుండా ఏపీలో అమల్లో ఉందని వారు విశ్వసిస్తున్నారు. ఇది సీఎం సామర్థ్యం" అని కొనియాడారు.

భూములున్నాయి.. వనరులున్నాయి.. మా రాష్ట్రానికి రండి

● భాగస్వామ్య సదస్సు మొదటి ప్లీనరీలో సీఎం చంద్రబాబు

విశాఖపట్నం నుంచి 'ఈనాడు' ప్రత్యేక ప్రతినిధి



ఉపరాష్ట్రపతి సి.పి.రాధాకృష్ణన్‌ను సత్కరిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు. చిత్రంలో గవర్నర్ అబ్దుల్ నజీర్, కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు

రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు వచ్చే వారి కోసం 50 వేల ఎకరాల భూ నిధి (ల్యాండ్ బ్యాంక్) సిద్ధంగా ఉంచామని సీఎం చంద్రబాబు వెల్లడించారు. ఎవరైనా కంపెనీ ప్రారంభిస్తే.. వారికి శిక్షణతో పాటు ఇతర సదుపాయాలను ప్రభుత్వం కల్పిస్తుందని పారిశ్రామికవేత్తలకు భరోసా ఇచ్చారు. రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టాలని వారికి పిలుపునిచ్చారు. విశాఖలో నిర్వహిస్తున్న భాగస్వామ్య సదస్సు మొదటి ప్లీనరీలో సీఎం మాట్లాడారు. 'పరిశ్రమలకు అవసరమైతే ప్లగ్ అండ్ ప్లే విధానంలోనూ అవకాశాలు కల్పిస్తాం. సాంకేతికత విస్తృతమవుతున్న తరుణంలో నాలెడ్జ్ ఎకానమీ కంపెనీ ఏర్పాటుకు దూరం అనేది అడ్డంకి కాదు. నాయకత్వ లక్షణాలుంటే ప్రపంచంలో మారుమూల ప్రాంతంలో ఉండి కూడా కంపెనీ ఏర్పాటు చేయొచ్చు. ఇది కేవలం పెట్టుబడుల సదస్సు కాదు. నెట్‌వర్కింగ్, మేధోపరమైన చర్చల కోసం రెండు రోజుల్లో సుమారు 46 సెషన్లు నిర్వహిస్తున్నాం. పలువురు అంతర్జాతీయ నిపుణులు వివిధ అంశాలపై చర్చిస్తారు. ప్రపంచవ్యాప్తంగా వచ్చే మార్పులను గమనించేందుకు ఏటా దావోస్‌లో నిర్వహించే ప్రపంచ దేశాల ఆర్థిక సదస్సుకు తప్పనిసరిగా వెళుతుంటా' అని పేర్కొన్నారు. చంద్రబాబు ప్రసంగంలో కీలకాంశాలివీ..

● గ్రీన్ ఎనర్జీ రంగంలో ఏపీకి ప్రత్యేక గుర్తింపు ఉంది. మైక్రోగ్రిడ్‌లను కూడా మేం ఏర్పాటు చేస్తున్నాం. ఇప్పుడు గ్రీన్ హైడ్రోజన్, అమ్మోనియా వంటి రంగాల్లో రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు అవకాశం ఉంది.

● ఖనిజాలు, రేర్ ఎర్త్ మినరల్స్‌కు సంబంధించి కొత్త టెక్నాలజీలు, వినూత్న ఆలోచనలతో వచ్చే సంస్థలతో కలిసి పనిచేసేందుకు ఏపీ సిద్ధం.

● సదస్సుకు 62 దేశాల నుంచి ప్రతినిధులు హాజరయ్యారు. మీలో ఎక్కువ మందికి భారత్‌తో వ్యాపార సంబంధాలున్నాయి. భారత్‌కు చెందిన పారిశ్రామికవేత్తలు వివిధ దేశాల్లో పెట్టుబడులు పెట్టారు. ఒకరినొకరు అర్థం చేసుకుని, ఒకరి అభిప్రాయాలు ఒకరు గౌరవించుకోవడానికి సదస్సు ద్వారా ఒక అవకాశం ఏర్పడుతుంది. పరస్పర పెట్టుబడుల భాగస్వామ్యంతోనే అభివృద్ధి సాధ్యం.

● సింగపూర్, దుబాయ్ దేశాల జనాభా చాలా తక్కువ. అత్యుత్తమ విధానాలతో వారు గొప్ప విజయాలు సాధించారు. దుబాయ్ ఏడాదిలో డ్రోన్ ట్యాక్సీలు తీసుకువచ్చింది. సింగపూర్ వంటి చిన్న దేశం కూడా ఏపీ అభివృద్ధికి సహకరిస్తుంది. వివిధ దేశాల్లో అనుసరిస్తున్న అత్యుత్తమ విధానాలు అందిపుచ్చుకోవడం ద్వారా అందరికీ లబ్ధి చేకూరుతుంది.

ఉపాధిలో ఏఐ కోత పెడితే.. పర్యాటకం ఉపాధి కల్పిస్తుంది

ఏఐ సాంకేతికత వల్ల ఉపాధి కోల్పోవాల్సి వస్తుందన్న ప్రచారం ఉంది. అక్కడ కోల్పోయే ఉపాధి అవకాశాలను పర్యాటక రంగం ద్వారా భర్తీ చేసుకోవచ్చు.

● ఏపీకి ఉన్న సుదీర్ఘ సముద్ర తీరం, గండికోట, అరకు లాంటి ప్రకృతి అందాలతో పర్యాటక రంగంలో విస్తృతాభివృద్ధికి అవకాశాలున్నాయి.

●ప్రతి ప్రాంతంలో భిన్నమైన రుచులతో పాటు టెంపుల్ సర్క్యూట్, ఇక్కడి సంస్కృతి, సంప్రదాయాలు పర్యాటకులను ఆకర్షిస్తాయి. హోం స్టే విధానాన్ని పెద్ద ఎత్తున ప్రోత్సహిస్తున్నాం.

● ఆర్గానిక్ విధానంలో పండించిన అరకు కాఫీ గ్లోబల్ బ్రాండ్‌గా ఎదిగింది. వచ్చే ఏడాది సదస్సు జరిగే సమయంలో ఒకరోజు అరకు ప్రాంతానికి తీసుకెళ్లి.. గిరిజన ప్రాంతాల్లో ఉన్న కాఫీ గార్డెన్స్‌లో గడిపేలా కార్యక్రమాన్ని రూపొందిస్తాం.

● ఆక్వా, ఉద్యాన రంగాల్లో ఏపీ అగ్రస్థానంలో ఉంది. ఎవరైనా ప్రకృతి వ్యవసాయం గురించి తెలుసుకోవాలంటే ఏపీకి రండి.

● చేతివృత్తులను ప్రోత్సహించేందుకు ఎక్స్‌పీరియన్స్ సెంటర్లు ఏర్పాటు చేస్తాం' అని పేర్కొన్నారు.

ప్రసంగం మధ్య బిహార్ ఫలితాల ప్రస్తావన

'బిహార్ అసెంబ్లీ ఎన్నికల్లో ఎన్డీయే 200కు పైగా స్థానాల్లో గెలుస్తుందని కేంద్ర మంత్రి పీయూష్ గోయల్‌కు చెప్పా. వేదికపైన ఉన్న ఆయన ఇప్పుడు అదే చెబుతున్నారు' అని సీఎం పేర్కొన్నారు. ప్లీనరీలో మాట్లాడుతున్న చంద్రబాబుతో పీయూష్ బిహార్ ఫలితాల గురించి ప్రస్తావించడంతో.. 'సుస్థిర ప్రభుత్వం ఉంటే వచ్చే ప్రయోజనాల గురించి ఉదయమే మాట్లాడుకున్నాం. సుస్థిర సర్కారు.. స్థిరమైన నిర్ణయాలు తీసుకునే అవకాశం ఇస్తుంది. ఏపీ ప్రజలకూ నేను అదే విజ్ఞప్తి చేస్తున్నా. మోదీ ఒక్కరే ప్రపంచం ఆమోదించిన నాయకుడు. ఒక బలమైన నేత' అని సీఎం అన్నారు.

పోటెత్తిన పెట్టుబడులు

(మొదటి పేజీ తరువాయి)

ఉప రాష్ట్రపతి రాధాకృష్ణన్, ముఖ్యమంత్రి చంద్రబాబు, కేంద్ర మంత్రులు పీయూష్ గోయల్, రామ్మోహన్‌నాయుడు, పెమ్మసాని చంద్రశేఖర్, శ్రీనివాస వర్మ తదితరుల సమక్షంలో సదస్సు ఘనంగా ప్రారంభమైంది. అయితే సదస్సు నేపథ్యంలో గురువారం నుంచే పెట్టుబడి ఒప్పందాలు వెల్లువెత్తాయి. మొత్తంగా రెండు రోజుల్లో రూ.11.92 లక్షల కోట్ల పెట్టుబడులకు సంబంధించి 400 అవగాహన ఒప్పందాలు కుదిరాయని.. వీటి ద్వారా మొత్తం 13.32 లక్షల మందికి ఉపాధి లభిస్తుందని ప్రభుత్వం ప్రకటించింది. సదస్సుకు వివిధ దేశాల మంత్రులు, రాయబారులతోపాటు పారిశ్రామికవేత్తలు భారీగా తరలి వచ్చారు.

రిలయన్స్, బ్రూక్‌ఫీల్డ్ మెగా డేటా సెంటర్లు

రూ.1.10 లక్షల కోట్లతో 1,000 మెగావాట్ల డేటా సెంటర్ ఏర్పాటుకు దిగ్గజ పారిశ్రామిక సంస్థ రిలయన్స్ ఒప్పందం కుదుర్చుకుంది. బ్రూక్‌ఫీల్డ్ సంస్థ రూ.1.06 లక్షల కోట్లతో 1,000 మెగావాట్ల సామర్థ్యంతో కూడిన డేటా సెంటర్‌తోపాటు రూ.1.10 లక్షల కోట్లతో పునరుత్పాదక ఇంధన ప్రాజెక్టు ఏర్పాటుకు ముందుకొచ్చింది. రెండు సంస్థలు సీఎం చంద్రబాబు సమక్షంలో ఒప్పందాలు చేసుకున్నాయి. డేటా, స్పేస్‌సిటీలకు సీఎం చంద్రబాబు, కేంద్ర మంత్రి పీయూష్ గోయల్ శంకుస్థాపనలు చేశారు. లులు సంస్థ సహా వివిధ జాతీయ, అంతర్జాతీయ సంస్థలు సీఎం చంద్రబాబు సమక్షంలో ఒప్పందం చేసుకున్నాయి. శుక్రవారం ఒక్కరోజే రూ.8.26 లక్షల కోట్ల పెట్టుబడులకు ఒప్పందాలు జరిగాయి.

ఎటుచూసినా ఉత్సాహం: సదస్సుకు హాజరైన దేశ, విదేశీ పారిశ్రామికవేత్తలకు గిరిజన సంప్రదాయంలో ఘన స్వాగతం పలికారు. వివిధ దేశాలు, సంస్థల నుంచి వచ్చిన ప్రముఖులతో విశాఖ నగరమంతా సందడిగా కనిపించింది. సదస్సు ప్రాంగణంలో ఎటు చూసినా ఉత్సాహభరిత వాతావరణం కనిపించింది. వచ్చినవారు భాగస్వామ్య సదస్సు బోర్డుల వద్ద ఉత్సాహంగా ఫొటోలు దిగారు. ఏపీ పెవిలియన్ లోపలికి అడుగుపెట్టగానే అదో ఎలక్ట్రానిక్ లోకంలోకి ప్రవేశించిన అనుభూతిని కలిగించింది.

ఏపీలో పుట్టిన ప్రతి బిడ్డకూ ఉజ్వల భవిష్యత్తు

● ప్రపంచ వాణిజ్యానికి గేట్‌వేగా విశాఖ ప్రాంతం

● సీఐఐ సదస్సు ప్రారంభోత్సవంలో కేంద్ర మంత్రి పీయూష్ గోయల్

ఈనాడు, విశాఖపట్నం: ఆంధ్రప్రదేశ్‌లో పుట్టిన ప్రతి బిడ్డకు ఉజ్వలమైన, సురక్షితమైన భవిష్యత్తు ఉంటుందని కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్ అభిప్రాయపడ్డారు. శుక్రవారం ఆయన విశాఖపట్నంలో సీఐఐ భాగస్వామ్య సదస్సు ప్రారంభోత్సవంలో మాట్లాడారు. "సీఐఐ సదస్సు ద్వారా ప్రపంచ వాణిజ్యానికి విశాఖ ప్రాంతం గేట్‌వేగా నిలిచింది. ఉక్కు ఉత్పత్తి, ఆక్వా రంగాల్లో ఈ ప్రాంతం ప్రసిద్ధి చెందింది. ప్రధాని మోదీ నాయకత్వంలో 2047 నాటికి వికసిత్ భారత్ సాకారం చేయాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్నాం. దేశంలో ప్రతి రాష్ట్రం అభివృద్ధి చెందుతోంది. 170 కోట్ల మంది పౌరులకు సేవలు అందించేలా ప్రపంచస్థాయి డిజిటల్ ప్రజా మౌలిక సదుపాయాలను కేంద్రం నిర్మించింది. దేశంలో అమలు చేస్తున్న యూపీఐ రియల్‌టైమ్ చెల్లింపుల వ్యవస్థను స్వీకరించడానికి అనేక దేశాలు ఆసక్తి కనబరుస్తున్నాయి. ప్రస్తుతం వంద కోట్ల మంది భారతీయులు ఇంటర్నెట్‌ను వినియోగిస్తున్నారు. ప్రపంచవ్యాప్తంగా చాట్ జీపీటీకి రెండో అతి పెద్ద వినియోగదారుగా దేశం మారింది. దేశంలో శక్తిమంతమైన సెమీకండక్టర్ ఎకోసిస్టమ్‌ను అభివృద్ధి చేస్తున్నాం. రాబోయే ఐదేళ్లలో క్లీన్ ఎనర్జీ సామర్థ్యాన్ని 500 గిగావాట్లకు చేర్చాలని భావిస్తున్నాం. పొరుగు దేశాలకు మార్కెట్‌తోపాటు పరస్పర వృద్ధి కోసం సహకారం అందిస్తున్నాం" అని చెప్పారు.


స్వర్ణాంధ్ర సాకారానికి చంద్రబాబు కృషి..

2047 నాటికి స్వర్ణాంధ్ర నిర్మాణానికి ముఖ్యమంత్రి చంద్రబాబు కృషి చేస్తున్నారని పీయూష్ గోయల్ తెలిపారు. సీఎం నాయకత్వంలో రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని, ఏపీతోపాటు దేశాభివృద్ధి కోసమూ ఆయన ఆలోచిస్తారని కొనియాడారు. దిల్లీలోని భారత్ మండపం మాదిరిగా రాష్ట్రంలో పెద్ద ఎత్తున సమావేశాలు, ప్రదర్శనలు, శిఖరాగ్ర సమావేశాలు నిర్వహించడానికి శాశ్వత సౌకర్యం నిర్మించాలని సూచించారు. ఈ ప్రపంచ స్థాయి కన్వెన్షన్ సెంటర్‌కు 'ఆంధ్ర మండపం' అనే పేరును ప్రతిపాదించారు. భాగస్వామ్య సదస్సు ద్వారా దేశ అభివృద్ధిని ముందుకు తీసుకెళ్లడంలో ప్రభుత్వం, పరిశ్రమల భాగస్వామ్యాన్ని బలోపేతం చేయడానికి కృషి చేసిన సీఐఐ అధ్యక్షుడు రాజీవ్ మేమాని, సెక్రటరీ జనరల్ చంద్రజీత్ బెనర్జీలను ఈ సందర్భంగా కేంద్ర మంత్రి ప్రశంసించారు.


బిహార్ ఎన్నికల్లో ఎన్డీయే ఘనవిజయం సాధించడంతో మిఠాయిలు తినిపించుకుంటున్న ముఖ్యమంత్రి చంద్రబాబు, కేంద్ర మంత్రులు పీయూష్ గోయల్, రామ్మోహన్‌నాయుడు, శ్రీనివాసవర్మ, భాజపా రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్

దేశానికి గ్రోత్ ఇంజిన్‌గా ఏపీ.. ఏపీకి గ్రోత్ కారిడార్‌గా విశాఖ: లోకేశ్

ఈనాడు, విశాఖపట్నం: దేశానికి గ్రోత్ ఇంజిన్‌గా ఏపీ.. ఏపీకి గ్రోత్ కారిడార్‌గా విశాఖ తయారవుతున్నాయని రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ వ్యాఖ్యానించారు. శుక్రవారం ఆయన విశాఖపట్నంలో సీఐఐ భాగస్వామ్య సదస్సు ప్రారంభోత్సవంలో మాట్లాడారు. అమరావతి నిర్మాణంతోపాటు విశాఖను సీఎం చంద్రబాబు వేగంగా అభివృద్ధి చేస్తున్నారన్నారు. రాష్ట్రానికి వచ్చే పెట్టుబడులకు భూములు కేటాయించి, త్వరితగతిన ఉత్పత్తి దశకు చేరుకునేలా చేయూతనిస్తున్నట్లు చెప్పారు. "ప్రపంచ ఆర్థిక వృద్ధికి భారత్ ఇంజిన్‌గా నిలుస్తున్న సమయంలో సీఐఐ సదస్సుకు ఏపీ ఆతిథ్యమిస్తుండడం గర్వకారణం. పెట్టుబడుల గమ్యస్థానంగా ఏపీని ఎందుకు ఎంచుకోవాలని చాలామంది అడుగుతున్నారు. అనుభవం, దార్శనికత గల నాయకత్వమున్న సీఎం చంద్రబాబు ఉండడం, స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ దానికి కారణం" అని తెలిపారు.



అందరూ వేగం గురించే..: మార్కెట్లు, సాంకేతికత నిరంతరం మారుతున్న ఈ వేగవంతమైన ప్రపంచంలో వేగం చాలా ముఖ్యమని లోకేశ్ తెలిపారు. "ఏడాదిలో వేల మంది పెట్టుబడిదారులు, కార్పొరేట్లను కలిశాను. వారందరూ వేగం గురించి మాట్లాడారు. కంపెనీ ఎంత వేగంగా అడుగులు వేస్తుందో.. ప్రభుత్వాలు అంతే వేగంగా స్పందించాలని వారు కోరుకుంటున్నారు. భూ కేటాయింపుల నుంచి అనుమతులు, ఆమోదాలు, ప్రోత్సాహకాలు ఇవన్నీ ప్రాజెక్టు ప్రారంభమయ్యేలోగా మంజూరు చేయాలి. రాష్ట్రంలో మీ కంపెనీ వేగాన్ని మించి మేం పనిచేస్తాం. సీఎం చంద్రబాబు మార్గదర్శకత్వంలో ఒకసారి మాతో చేతులు కలిపిన తర్వాత అది మీ ప్రాజెక్టు కాదు.. మా ప్రాజెక్టు అవుతుంది. వ్యాపారాన్ని విజయవంతం చేయడంతోపాటు అవసరమైన సంస్కరణలు, విధాన మార్పులను తీసుకురావడానికి కేంద్ర ప్రభుత్వంతో కలిసి పనిచేసేందుకు సిద్ధంగా ఉన్నాం. వికసిత్ భారత్ లక్ష్య సాధనలో భాగంగా ఏపీని 2.4 ట్రిలియన్ డాలర్ల (సుమారు రూ.213 లక్షల కోట్లు) ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దుతాం' ' అని చెప్పారు.

కమీషన్లు దండుకోవడం తప్ప జగన్ చేసిందేం లేదు: మంత్రి సత్యకుమార్

ఈనాడు, అమరావతి: గ్రామీణ ప్రాంతాల పేదల కోసం ప్రధాని మోదీ లక్షల ఇళ్లు మంజూరు చేస్తే.. జగనన్న కాలనీలు అని సొంత పేర్లు పెట్టుకుని రూ.వేల కోట్ల కమీషన్లు దండుకోవడం తప్ప మాజీ సీఎం జగన్ చేసింది శూన్యమని వైద్యారోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ గురువారం ఓ ప్రకటనలో విమర్శించారు. కేంద్రం మంజూరు చేసిన 21.40 లక్షల ఇళ్లకు రాష్ట్ర వాటా ఇవ్వకపోగా వాటిల్లో 1.87 లక్షల ఇళ్లు వద్దని కేంద్రానికి లేఖ రాసిన విషయం ఎందుకు గోప్యంగా ఉంచారని జగన్‌ను ప్రశ్నించారు.

బిహార్ ఎన్నికల్లో ఎన్డీయే ప్రభంజనం

బిహార్ ఎన్నికల్లో ఎన్డీయే ప్రభంజనం సృష్టించడం పట్ల వైద్యారోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ హర్షం వ్యక్తంచేశారు.

ఆధ్యాత్మిక పర్యాటక కేంద్రంగా పిఠాపురం: పవన్‌కల్యాణ్

ఈనాడు, అమరావతి: పిఠాపురాన్ని ఆధ్యాత్మిక పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతామని, శ్రీపురుహూతిక అమ్మవారు, శ్రీకుక్కుటేశ్వర స్వామి, శ్రీపాద వల్లభ స్వామివారి ఆలయాలను రూ.8 కోట్లతో అభివృద్ధి చేస్తున్నామని ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ చెప్పారు. అలాగే నియోజకవర్గంలో జీర్ణావస్థకు చేరిన ఆలయాలకు పునరుజ్జీవం కల్పించేందుకు అవసరమైన నిధులను దేవాదాయశాఖ సమకూరుస్తోందని పేర్కొన్నారు. మొత్తం 19 ఆలయాల అభివృద్ధికి కామన్ గుడ్ ఫండ్(సీజీఎఫ్) నుంచి రూ.20 కోట్లు ఇచ్చేందుకు దేవాదాయశాఖ అంగీకరించిందని తెలిపారు.

ప్రభుత్వోద్యోగాల్లో ట్రాన్స్‌జెండర్లకు రిజర్వేషన్లు కల్పించండి

(మొదటి పేజీ తరువాయి)

వాదనలు వినిపించారు. ఈ వాదనలను పరిగణనలోకి తీసుకున్న న్యాయమూర్తి.. రిజర్వేషన్లు కల్పించాలని తీర్పు ఇచ్చారు. 'కుటుంబం, సమాజం నుంచి ఎదురవుతున్న వివక్ష కారణంగా ట్రాన్స్‌జెండర్లు సాంఘిక, ఆర్థిక, సాంస్కృతిక, రాజకీయ రంగాలకు దూరమయ్యారు. వారిని తిరిగి జనజీవనంతో మిళితం చేయాలి. వారికి ప్రభుత్వ ఉద్యోగాల్లో, అన్ని రంగాల్లో అవకాశం కల్పించడానికి సమగ్ర విధానం అవసరం' అని న్యాయమూర్తి అభిప్రాయపడ్డారు. కేంద్ర ప్రభుత్వం ట్రాన్స్‌జెండర్ల హక్కుల పరిరక్షణ చట్టం-2019 తీసుకొచ్చింది. ఈ చట్టాన్ని అనుసరించి రాష్ట్ర ప్రభుత్వాలు ట్రాన్స్‌జెండర్లకు విద్య, ఉద్యోగ అవకాశాల్లో రిజర్వేషన్లు కల్పించాలి' అని జస్టిస్ ఎన్.విజయ్ తీర్పులో పేర్కొన్నారు.

కేసులు తేలేదాకా.. ఆస్తులు విడుదల చేయొద్దు

(మొదటి పేజీ తరువాయి)

విడుదల చేయాలంటూ జగతి పబ్లికేషన్స్, జనని ఇన్‌ఫ్రా, ఇందిరా టెలివిజన్‌లు పిటిషన్‌లు దాఖలు చేశాయి. వీటిపై జస్టిస్ జె.శ్రీనివాసరావు విచారణ చేపట్టారు. సీబీఐ ప్రత్యేక న్యాయవాది శ్రీనివాస్ కపాటియా వాదనలు వినిపిస్తూ.. జగన్ కేసు దర్యాప్తు సందర్భంగా జగతికి చెందిన సుమారు రూ.46.82 లక్షలున్న కరెంట్ ఖాతాలను స్తంభింపజేసిందన్నారు. మీడియా నిర్వహణ, ఉద్యోగులను పరిగణనలోకి తీసుకుని ఖాతాల నిర్వహణకు షరతులతో హైకోర్టు అనుమతించిందన్నారు. ఇందులో భాగంగా రూ.23.42 లక్షలకు బ్యాంకు గ్యారంటీ, రేవన్ ఇన్‌ఫ్రాకు బెంగళూరు సమీపంలోని నల్లూరులో రూ.6.30 కోట్ల విలువైన 9 ఎకరాలకు చెందిన మూడు ఆస్తులను హామీగా సమర్పించాయన్నారు. కేసు విచారణ పూర్తయ్యేదాకా ఇది అమల్లో ఉంటుందన్నారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ నమోదు చేసిన కేసులో మొదట రేవన్ ఇన్‌ఫ్రాకు చెందిన ఆస్తులను జప్తు చేసిందని, తర్వాత ట్రైబ్యునల్ జప్తు చెల్లదనడంతో ఈడీ హైకోర్టును ఆశ్రయించిందన్నారు. బ్యాంకు గ్యారంటీతో దాన్ని విడుదల చేయాలని హామీ ఇచ్చినప్పటికీ ప్రధాన పిటిషన్ ఇంకా పెండింగ్‌లోనే ఉందన్నారు. అది తేలేదాకా రేవన్ ఇన్‌ఫ్రా ఆస్తుల విషయంలో నిర్ణయం తీసుకోరాదన్నారు. సండూర్ నుంచి క్లాసిక్ రియాల్టీకి, క్లాసిక్ రియాల్టీ ద్వారా రేవన్ ఇన్‌ఫ్రాలోకి నిధుల మళ్లింపు జరిగిందన్నారు. ఇది నేరపూరిత సొమ్మేనని తెలిపారు. జగతి, జనని, ఇందిరా టెలివిజన్‌లతోపాటు రేవన్ ఇన్‌ఫ్రా కూడా జగన్‌కు చెందినదేనని పేర్కొన్నారు. అందువల్ల ఈ పిటిషన్‌లను కొట్టివేయాలని కోరారు.

మరోరకంగా హామీ... పిటిషనర్ల తరఫు న్యాయవాది జి.అశోక్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ... రేవన్ ఇన్‌ఫ్రాకు జగతి, జనని, ఇందిరా టెలివిజన్‌లతో సంబంధంలేదని తెలిపారు. ఇదే విషయాన్ని ఈడీ ట్రైబ్యునల్ స్పష్టం చేసిందన్నారు. రేవన్ ఇన్‌ఫ్రా కేవలం హామీగానే ఆస్తుల పత్రాలను ఇచ్చిందన్నారు. ప్రస్తుతం హామీ నుంచి రేవన్ ఇన్‌ఫ్రా వైదొలగుతుండటంతో మరో రకంగా హామీ సమర్పిస్తామన్నారు. బ్యాంకు గ్యారంటీ. . లేదంటే ఫిక్స్‌డ్ డిపాజిట్ చెల్లించడానికి సిద్ధంగా ఉన్నామన్నారు. స్తంభింపజేసిన బ్యాంకు కరెంట్ ఖాతాల నిర్వహణకు అనుమతిస్తూ తాత్కాలిక ప్రాతిపదికన ఉత్తర్వులు జారీ చేస్తున్నామని, ఆచరణలో ఇబ్బందులుంటే సవరణకోసం కోర్టుకు రావచ్చంటూ ఇదే హైకోర్టు పేర్కొన్న విషయాన్ని పరిగణనలోకి తీసుకోవాలన్నారు. ఇతర కంపెనీ ఆస్తులను విడుదల చేయాలని మాత్రమే కోరుతున్నామని, ప్రత్యామ్నాయంగా బ్యాంకు గ్యారంటీ సమర్పిస్తున్నామని తెలిపారు. ఇరుపక్షాల వాదనలను విన్న న్యాయమూర్తి విచారణను సోమవారానికి వాయిదా వేశారు.

మద్యం కుంభకోణం కేసులో ముంబయి వ్యాపారి అనిల్ చోఖ్రా అరెస్టు

(మొదటి పేజీ తరువాయి)

మొత్తం 35 డొల్ల కంపెనీలు ఉన్నట్లు సిట్ గుర్తించింది. నకిలీ పేర్లు, డమ్మీ డైరెక్టర్లతో వీటన్నింటినీ ఆయనే ఏర్పాటు చేసి నిర్వహిస్తున్నట్లు తేల్చింది. తప్పుడు పత్రాలు తయారు చేసి, మోసపూరిత బులియన్ ట్రేడ్ లావాదేవీల ద్వారా మనీ లాండరింగ్‌కు పాల్పడినట్లు గుర్తించింది. గత 13 రోజులుగా ముంబయిలోని వివిధ ప్రాంతాల్లో సోదాలు నిర్వహిస్తున్న సిట్ బృందాలు కీలక ఆధారాలు సేకరించి అనిల్ చోఖ్రాను అదుపులోకి తీసుకున్నాయి. మనీ లాండరింగ్ నిరోధక చట్టం కింద అతనిపై అనేక కేసులున్నాయి. గతంలో ఆయన్ను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) రెండు సార్లు అరెస్టు చేసింది. హవాలా ఏజెంట్లు, నిధుల రూటింగ్, లేయరింగ్‌లో ఆరితేరిన వారిని అడ్డం పెట్టుకుని డొల్ల కంపెనీల ద్వారా మనీ లాండరింగ్‌కు పాల్పడిన వైకాపా ముఠా.. దర్యాప్తు సంస్థల నిఘా, పర్యవేక్షణ నుంచి తప్పించుకోవటానికి అనేక సంక్లిష్ట లావాదేవీలను నిర్వహించినట్లు సిట్ గుర్తించింది. ఇలా కొల్లగొట్టిన సొత్తులో ఎక్కువ భాగం విదేశాల్లోని ఖాతాలకు తరలించినట్లు భావిస్తోంది. ఈ నేపథ్యంలో అనిల్ చోఖ్రా విచారణలో ఆ గుట్టు బయటపడే అవకాశముంది.

జి.మాడుగులలో 6 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత

(మొదటి పేజీ తరువాయి)

ప్రాంతాల్లోనూ చలి తీవ్రత పెరుగుతోంది. అల్లూరి సీతారామరాజు, పార్వతీపురం మన్యం, అనకాపల్లి, విజయనగరం, కర్నూలు, శ్రీకాకుళం, ఎన్టీఆర్, ఏలూరు, విశాఖపట్నం, కాకినాడ, తూర్పుగోదావరి, కృష్ణా, కర్నూలు జిల్లాల్లో ఉష్ణోగ్రతలు 6 నుంచి 16 డిగ్రీలలోపు నమోదవుతున్నాయి. మరోవైపు చిత్తూరు, ఏలూరు, ప్రకాశం, పశ్చిమగోదావరి, నంద్యాల తదితర జిల్లాల్లో గరిష్ఠ ఉష్ణోగ్రతలు 35 డిగ్రీలకు పైగా నమోదు కావడం గమనార్హం.

ఏపీలో మ్యాజిక్ డ్రెయిన్లు అద్భుతం

● ఛత్తీస్‌గఢ్ అధికారుల బృందం కితాబు

● రాష్ట్రంలో 'ఉపాధి హామీ' పనులపై పరిశీలన

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం అమలు తీరును ఛత్తీస్‌గఢ్‌కు చెందిన 19 మంది అధికారుల బృందం పరిశీలించింది. క్షేత్రస్థాయి పరిశీలనలో భాగంగా రెండు రోజులుగా అన్నమయ్య జిల్లాలోని పలు గ్రామ పంచాయతీల్లో పర్యటించింది. అనంతరం రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ కమిషనర్ కృష్ణతేజను తాడేపల్లిలోని కార్యాలయంలో శుక్రవారం కలిసి, అధికారులతో సమావేశమైంది. 'ఏపీలో ఉపాధి హామీ పథకం అమలు ఆదర్శనీయంగా ఉంది. మ్యాజిక్ డ్రెయిన్ విధానం అద్భుతం. దీన్ని దేశమంతా అమలు చేస్తే స్వచ్ఛ గ్రామాలు ఏర్పడతాయి. వర్షపు నీరు భూమిలో ఇంకడంతో పాటు దోమలు లేని ఆరోగ్యకరమైన గ్రామాలను చూడగలుగుతాం. ఛత్తీస్‌గఢ్‌లోనూ అమలు చేయడానికి ప్రణాళికలు సిద్ధం చేసి ప్రభుత్వానికి పంపుతాం' అని ఆ రాష్ట్ర గ్రామీణాభివృద్ధిశాఖ సంయుక్త కమిషనర్ రామ్‌ధన్ శ్రీవాస్ అన్నారు. సమావేశంలో రాష్ట్ర గ్రామీణాభివృద్ధి శాఖ సంచాలకులు షణ్ముఖకుమార్, అదనపు కమిషనర్ శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఆన్‌లైన్ చేసినా.. ఆఫ్‌లైన్ వసూళ్లు

● ఎసెస్‌మెంట్లకు ఫోన్ నంబర్ల మ్యాపింగ్‌లో నిర్లక్ష్యం

● ఆస్తిపన్ను విషయంలో మారని పంచాయతీ కార్యదర్శుల తీరు

● ఇద్దరి సస్పెన్షన్

ఈనాడు, అమరావతి: పంచాయతీల్లో ఆస్తిపన్ను నగదు రహిత వసూళ్ల విధానానికి కొందరు కార్యదర్శులు తూట్లు పొడుస్తున్నారు. ఆన్‌లైన్‌కు బదులు ఆఫ్‌లైన్‌లో వసూలు చేస్తున్నారు. కార్యదర్శుల నిర్లక్ష్యాన్ని ప్రభుత్వం అత్యంత తీవ్రంగా పరిగణించి నాలుగు రోజుల వ్యవధిలో ఇద్దరు కార్యదర్శులను సస్పెండ్ చేసింది. మరికొందరిపై విచారణ సాగుతోంది. ఆస్తిపన్ను వసూళ్లలో అక్రమాలను నిరోధించేందుకు స్వర్ణ పంచాయతీ పోర్టల్‌ను ప్రభుత్వం ప్రారంభించింది. పన్ను మొత్తాలను ప్రజలు ఆన్‌లైన్‌లో చెల్లించేలా ఏర్పాట్లు చేసింది. పలు పంచాయతీల్లో క్యూఆర్ కోడ్ స్కాన్ సిస్టమ్‌నూ ప్రవేశపెట్టారు. ప్రజల నుంచి నగదు వసూలు చేయొద్దని కార్యదర్శులకు అధికారులు స్పష్టమైన ఆదేశాలిచ్చారు. పన్ను మొత్తాలను సొంత అవసరాలకు వాడుకునే కార్యదర్శులకు.. ప్రభుత్వం తెచ్చిన ఆన్‌లైన్ చెల్లింపుల విధానం మింగుడుపడటం లేదు. యథావిధిగా నగదు రూపంలోనే వసూలు చేస్తున్నారు. ఈ విషయమై రెండు రోజుల క్రితం అన్నమయ్య జిల్లా మదనపల్లె మండలం కోళ్లబైలు పంచాయతీ కార్యదర్శి మంజులను పంచాయతీరాజ్ శాఖ కమిషనర్ కృష్ణతేజ సస్పెండ్ చేశారు. ప్రజల నుంచి ఆమె నగదు రూపంలో పన్ను వసూలు చేసి రసీదులిచ్చారు. ఎన్టీఆర్ జిల్లా నందిగామ నియోజకవర్గంలో కంచికచర్ల పంచాయతీ ఇన్‌ఛార్జి కార్యదర్శి సుబ్రహ్మణ్యాన్నీ కమిషనర్ సస్పెండ్ చేశారు. స్వర్ణ పంచాయతీ పోర్టల్‌లో ఆస్తిపన్ను ఎసెస్‌మెంట్లకు ఫోన్ నంబర్లను మ్యాపింగ్ చేయడంలో ఆయన అత్యంత నిర్లక్ష్యంగా వ్యవహరించినట్లు అధికారులు గుర్తించారు.

డీపీవో, డీఎల్‌పీవోలపై చర్యలేవీ?

ప్రభుత్వ ఆదేశాలకు విరుద్ధంగా గ్రామ కార్యదర్శులు వ్యవహరించడం వెనుక జిల్లా, డివిజనల్ పంచాయతీ అధికారుల(డీపీవో, డీఎల్‌పీవో) పర్యవేక్షణ లోపం, వైఫల్యం స్పష్టంగా కనిపిస్తున్నా పంచాయతీరాజ్ శాఖ ఉన్నతాధికారులు వారిని ఎందుకు బాధ్యులను చేయడం లేదన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. నెలవారీగా, తనిఖీల సమయంలో కార్యదర్శులిచ్చే కాసులకు కొందరు డీపీవో, డీఎల్‌పీవోలు కక్కుర్తి పడుతున్నారు. దీంతో పలువురు కార్యదర్శులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. కార్యదర్శులు ఆస్తిపన్నుకు నగదు వసూలు చేస్తున్నా డీపీవో, డీఎల్‌పీవోలకు ఎందుకు పట్టడం లేదు? ఇది నిర్లక్ష్యం కాదా? వీరి పాత్రపైనా ఉన్నతాధికారులు విచారణ చేయించి చర్యలు తీసుకోవాలనే అభిప్రాయం ప్రజల్లో వ్యక్తమవుతోంది.

ఈనాడు అమరావతి

ఎన్టీఆర్




నేడు 'ఈటీవీ' కార్తీక దీపోత్సవం

పరమేశ్వరుడు ఇద్దరికీ ఎంతో ప్రీతికరమైన కార్తీక మాసం. ఎంతో సమున్నతమైన మాసం. గంగతో సమానమైన తీర్థం లేదని పురాణోక్తి. విశిష్ట పుణ్య సంపదను ప్రసాదించే ఈ మాసంలో దీపారాధనకు ఉన్న ప్రాధాన్యం అసమానమైనది. 'ఈటీవీ ఆంధ్రప్రదేశ్, ఈటీవీ తెలంగాణ, ఈటీవీ లైఫ్' ఛానళ్ల ఆధ్వర్యంలో కార్తీక దీపోత్సవం నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొనే మహిళలకు పూజ సామగ్రి నిర్వాహకులే సమకూరుస్తారు. చిన్నపిల్లలకు అనుమతి లేదు. నేలపై కూర్చోగలిగే వారు మాత్రమే హాజరు కావాలని నిర్వాహకులు కోరుతున్నారు.

ఈ ఛానళ్లలో ప్రత్యక్ష ప్రసారం 15న సాయంత్రం ఆరు గంటల నుంచి ఎనిమిది గంటల వరకు.

సమయం: ఈ నెల 15న (శనివారం) సాయంత్రం 5.30 గంటలకు
స్థలం: జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల, గన్నవరం
- గన్నవరం గ్రామీణం, న్యూస్‌టుడే



దివ్యమైన సాయం.. అందుకో నేస్తం..

స్వయంఉపాధి పొందుతున్న దివ్యాంగులతోపాటు వారిలో ఉన్నత విద్యను అభ్యసిస్తున్న వారికి కూటమి ప్రభుత్వం మూడు చక్రాల మోటారు సైకిళ్లను ఉచితంగా అందించనుంది. రెండు కాళ్లు సహకరించక అలాంటి వాళ్లు పడుతున్న ఇబ్బందులను తొలగించేందుకు ప్రభుత్వం దరఖాస్తులను ఆహ్వానిస్తోంది. ఈ నెల 25వ తేదీలోగా www.apdascac.ap.gov.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు
- ఇబ్రహీంపట్నంగ్రామీణం, గుంటుపల్లి, న్యూస్‌టుడే

అర్హతలు: 70 శాతం వైకల్యం ఉన్నవారు. రెండు చేతులు బలంగా ఉండి 18 నుంచి 45 ఏళ్ల వయసు మధ్య ఉన్న వారు, తెల్లరేషన్ కార్డు ఉండి ఏడాదికి రూ.3 లక్షలు కుటుంబ ఆదాయం మించని వాళ్లు, రవాణాశాఖ నిబంధనల మేరకు డ్రైవింగు లైసెన్సు పొందిన వారు, గతంలో మూడు చక్రాల మోటారు సైకిళ్లను పొందనివారు.

సమర్పించాల్సిన పత్రాలు: పదో తరగతి మార్కుల జాబిత, ఆధార్‌కార్డు, సదరం, కుల, ఆదాయ ధ్రువపత్రాలు, పింఛను పుస్తకం, స్వయం ఉపాధి లేదా ప్రైవేటు ఉద్యోగానికి సంబంధించిన అనుభవపత్రం, వైకల్యం ఫొటో, వెబ్‌సైట్‌లో పేర్కొన్న స్వీయ ధ్రువీకరణ పత్రాలు.

70%


జిల్లాలో 70 శాతం పైబడిన వైకల్యం కలిగిన వారు 35,159 మంది, డిగ్రీ ఆపైన చదువుతున్న వారు: 1680 మంది ఉన్నట్లు సంక్షేమ శాఖ గణాంకాలు వెల్లడిస్తున్నాయి. అర్హులైన విభిన్న ప్రతిభావంతులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని నియోజకవర్గాల వారీగా ఎంపిక ప్రక్రియ జరుగుతుందని విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల సంక్షేమశాఖ అధికారి వి.కామరాజు సూచించారు.

ఉందో వ్యూహం.. కావాలి లౌక్యం!

ట్రాఫిక్ చక్కదిద్దే ప్రత్యామ్నాయ మార్గాలు పుష్కలం ✦ దారుల విస్తరణపై ఉమ్మడిగా కదిలితేనే ఫలితం...

ఈనాడు, అమరావతి

నగర ట్రాఫిక్‌ను తగ్గించేందుకు ఉపయోగపడే పలు ప్రత్యామ్నాయ రహదారులు ఉన్నా పోలీసులు దృష్టి సారించడం లేదు. దీంతో రద్దీ సమయాల్లో ముఖ్య కూడళ్లు పద్మవ్యూహాన్ని తలపిస్తున్నాయి. ప్రత్యామ్నాయ మార్గాలపై వాహనదారులకు అవగాహన కల్పించ లేకపోతున్నారు. తూతూమంత్రంగా సూచిక బోర్డులు ఏర్పాటు చేసి వదిలేశారు. దీంతో సమస్య అపరిష్కృతంగా ఉండిపోతోంది. నగరపాలిక, సీఆర్‌డీఏ, ట్రాఫిక్ పోలీసుల మధ్య సమన్వయ లేమే ఇందుకు కారణం. ఉమ్మడిగా సర్వే చేసి, పరిష్కార మార్గాలు వెతికితేనే ఫలితం ఉంటుంది.



మహాత్మాగాంధీ రోడ్డులో..

నగరానికి నిత్యం వాహన తాకిడి ఇలా..

హైదరాబాద్	8,500
గుంటూరు	14,000
ఏలూరు	12,000
మచిలీపట్నం	7,500

సహనానికి పరీక్ష.. మహానాడు కూడలి

నోవాటెల్ హోటల్ వద్ద పైవంతెన ముగుస్తోంది. దీంతో ఫకీరుగూడెం వద్ద వంతెన ఎక్కుతున్న వాహనాలు మహానాడు జంక్షన్ వద్ద బారులు తీరుతున్నాయి. వెరసి నాలుగు వైపులా వాహనాలు పెద్దఎత్తున ఆగిపోతున్నాయి. తద్వారా ఈ కూడలి దాటాలంటే కనీసం 15 నిమిషాలు వేచి చూడాల్సి వస్తోంది. ఉదయం, సాయంత్రం రద్దీ వేళల్లో సహనానికి పరీక్షే. మహానాడు సర్కిల్‌పై ఒత్తిడి తగ్గించే ప్రత్యామ్నాయ దారులున్నాయి. వాటిపై ట్రాఫిక్ పోలీసులు అవగాహన కల్పించి, అటు వాహనాలను మళ్లిస్తేనే ఉపశమనం. ఇక్కడి నుంచి ఎనికేపాడు వరకు మరో వంతెన ప్రతిపాదన ఉన్నా ఎన్‌హెచ్‌ఏఐ ఉపసంహరించుకుంది. దీంతో ప్రత్యామ్నాయ మార్గాలపై దృష్టి సారించాల్సిందే.

అమ్మ కల్యాణ మండపం నుంచి ఈఎస్‌ఐ మీదుగా గుణదల వరకు సువిశాల దారి ఉంది. దీనిని రెండు వరుసలుగా విస్తరించారు. ఈ మార్గాన్ని వాడేవారు తక్కువే. ఈ రోడ్డులో వస్తే.. నేరుగా గుణదల మీదుగా రామవరప్పాడు కూడలి వద్ద ఫ్రీలెఫ్ట్ తీసుకుని జాతీయ రహదారి ఎక్కే వీలుంది.

నిర్లక్ష్యమేల?

నగర శివారులో రహదారుల విస్తరణను సీఆర్‌డీఏ ప్రారంభించాలి. అప్పటి వరకుజాతీయ రహదారికి ఇరువైపులా విశాలమైన రోడ్లను గరిష్ఠంగా వినియోగించుకోవాలి. తద్వారా మహానాడు కూడలికి వాహనాలు రాకుండా నేరుగా వెళ్లే వీలుంది. నగరంలో అంతర్గత దారుల నుంచి గన్నవరం వైపు, బెంజి సర్కిల్ వైపు వచ్చి వెళ్లే వారికి ఉపయోగపడతాయి.

అనుసంధానిస్తే ఎంతో మేలు...

పటమట నుంచి వెళ్లేవారు బెంజిసర్కిల్ వచ్చి జాతీయ రహదారిపైకి వెళ్లకుండా.. ప్రత్యామ్నాయంగా హైటెన్షన్ రోడ్డు ఉపయోగపడుతుంది. ఇది పూర్తి విస్తరణకు నోచుకోలేదు. ఇక్కడి నుంచి బల్లెంవారి వీధి వరకు రోడ్డును పూర్తి చేసి అనుసంధానిస్తే మేలు. ఇవి పూర్తయితే బెంజి సర్కిల్ నుంచి రామవరప్పాడు వరకూ ప్రత్యామ్నాయమే.

ఇవ్వమనీ అడిగితే.. గట్టిగా బదులిచ్చేద్దాం..

ఈనాడు డిజిటల్, మచిలీపట్నం

టోల్ ఫ్రీ: 1064
డీఎస్పీ 94404 46164, 94404 46167 సీఐ



జిల్లాలోని ప్రభుత్వ కార్యాలయాల్లో కొందరు అధికారులు, ఉద్యోగులు ప్రతి చిన్న పనికి తమకేంటని చేయి తడపనిదే దస్త్రాలు ముట్టుకోవట్లేదు. చాలా మంది వారి చుట్టూ తిరగలేక విసిగిపోయి ఎంతోకొంత ముట్టజెబుతున్నారు. మరికొందరు బాధ్యతగా అవినీతి నిరోధక శాఖ (అనిశా)ను ఆశ్రయించి అవినీతి అధికారుల పనిపడుతున్నారు. ఇలా ప్రజలంతా అవగాహన పెంచుకొని ముందుకొస్తే వారి వివరాలు గోప్యంగా ఉంచి అవినీతిపరులపై కఠిన చర్యలు తీసుకుంటామని అనిశా డీఎస్పీ సుబ్బారావు 'ఈనాడు'తో మాట్లాడారు.

ఈ శాఖల్లో: రెవెన్యూ, మున్సిపాలిటీ, విద్యుత్తు పంపిణీ, రిజిస్ట్రేషన్, ట్రెజరీ, ఇరిగేషన్ కార్యాలయాల ఉద్యోగులపై ఎక్కువగా ఫిర్యాదులు వస్తున్నాయి.

7 కేసుల నమోదు..

కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాల్లో ఈ ఏడాది ఇప్పటికే ఏడు కేసులు నమోదవగా.. కొత్తగా ఇబ్రహీంపట్నం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ సోదాల్లో కొన్ని అవకతవకలు తేలాయి. విచారణ పూర్తయితే మరికొన్ని కేసులు నమోదవుతాయి. మచిలీపట్నంలో డిప్యూటీ ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్, ఆర్డీవో కార్యాలయంలో సీసీ త్రినాథ్, గుడివాడ డ్రైనేజీ కార్యాలయంలో జి.శ్రీనివాస్, కంచికచర్ల తహసీల్దార్, నందిగామలో మున్సిపల్ అధికారి, విజయవాడలో వాణిజ్య పన్నుల శాఖలో అటెండర్, గిరిజన సంక్షేమ శాఖ ఈఎన్‌సీ అబ్బవరపు శ్రీనివాస్.. ఇలా ఏడుగురిపై కేసులు నమోదు చేశాం.

మహాసేనా.. ఆయుధాలిక్కడే



మచిలీపట్నం నుంచి పోర్చుగీసు, డచ్, ఫ్రెంచ్, బ్రిటీష్ తదితర దేశాలకు చెందిన పాలనతో పాటు వర్తక వ్యాపారాలు చేశారు. డచ్ దేశస్థుల ఆయుధాగారం.. బందరుకోట ప్రాంగణంలో పిరమిడ్ ఆకారంలో ఉంది. అప్పట్లో ఇలాంటివి చాలా ఉండేవట. ప్రస్తుతం ఒక మందుగుండు కొట్టు ఇప్పటికీ ఆనాటి చరిత్రను నేటి తరానికి తెలియజేస్తూ కనిపిస్తోంది. వీటిలో ఆయుధాలు నిల్వ చేసి సైనికులు కాపలా ఉండేవారు. డచ్, ఫ్రెంచ్ తదితర దేశస్థులు కూడా వీటిల్లోనే వాటిని ఉంచేవారు. ఇక్కడుండే సైనికులు సుదూరంలోని చర్యలను గమనిస్తుండేవారు. ఆయుధాగారం ప్రధాన గేటు వద్ద ఆ దేశపు జెండా ఎగురుతుండేది. దాని పక్కన ఓ లాంతరు వేలాడదీసేవారు. అది సముద్రంలో లంగరు వేసిన ఓడలకు కనిపిస్తూ ఉండేదట. - మచిలీపట్నం కార్పొరేషన్



ఒంపుల వారధి.. సొగసుల తీరిది..

మలుపులు తిరుగుతూ నిర్మించిన కనకదుర్గమ్మ పైవంతెన ఒకవైపు.. మరో వైపు పరవళ్లు తొక్కే కృష్ణమ్మ.. మధ్యలో భవానీద్వీపం, లంక భూముల అందాలతో ప్రకృతి ప్రేమికులను కనువిందు చేస్తున్నాయి. వీటితో పాటు కనకదుర్గమ్మ ఆలయం, గాంధీ కొండ, విజయవాడ రైల్వేస్టేషన్, ప్రకాశం బ్యారేజీ, కాంక్రీట్ వనంలా కొండ దిగువన భవనాలు.. ఇవన్నీ నగరానికి మరింత అందాన్ని అద్దినట్లు కనిపిస్తున్నాయి. విజయవాడ నగరానికి చెందిన పలువురు యూట్యూబ్, ఇన్‌స్టాగ్రామ్ ఇన్‌ఫ్లూయన్సర్లకు నగర అందాన్ని చిత్రీకరిస్తూ వందలాది వీడియోలు చేస్తున్నారు. వీటన్నింటినీ చిత్రీకరిస్తూ వారి పేజీల్లో పోస్టు చేస్తున్నారు. వారు పోస్టు చేసే వీడియోలకు వీక్షకుల సంఖ్య కూడా ఎక్కువగానే ఉంటుంది. డ్రోన్ కెమెరాల సాయంతో కృష్ణానదిని, కొండ ప్రాంతాన్ని, బ్యారేజీ పరిసరాలు, వారధి తదితర ప్రాంతాలు చిత్రీకరిస్తున్నారు. విజయవాడ అంటే కృష్ణమ్మ, ప్రకాశం బ్యారేజీ అన్నట్లుగా వీడియోలు ఉంటున్నాయి. - భవానీపురం, న్యూస్‌టుడే

అక్రమం అంతెత్తు.. అడగరు వీసమెత్తు..!

ఆదాయ వనరుగా అనుమతి లేని భవన నిర్మాణాలు ● ఓ ఎమ్మెల్యే పేరు చెప్పి వ్యాపారి వసూళ్లు

విజయవాడ నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే

అక్రమ కట్టడాలను అడ్డు పెట్టుకుని కొందరు అడ్డగోలుగా దోచుకుంటున్నారు. మధ్య నియోజకవర్గంలో ఇటుకల వ్యాపారి ఒకరు.. ఓ శాసనసభ్యుడి పేరుచెప్పి కొంతకాలంగా చెలరేగిపోతున్నాడు. మధ్య నియోజకవర్గంతో పాటు, పలు ప్రాంతాల్లో అక్రమ కట్టడాల యజమానుల నుంచి ఇతను రూ.లక్షల్లో దండుకుంటున్నాడు. ఇతడు అధికారులపై ఒత్తిడి తెచ్చి అనుమతి లేని అదనపు ఫ్లోర్లు ఎడాపెడా వేయిస్తున్నాడు. ఇతనికి తెలియకుండా, చెప్పకుండా ఎవరైనా అక్రమ కట్టడాలను చేపడితే వాటిని కూల్చి వేయించి, ఆపై అతడే కాసులు దండుకుని వాటిని పునర్నిర్మింపజేసేలా అధికారులపై ఒత్తిడి తెస్తున్నాడు. ❖ ఇతడు నియోజకవర్గంతో పాటు, పలు ప్రాంతాల్లో తిరుగుతూ ఎక్కడ అక్రమ కట్టడం కనిపించినా.. ఇటుక, కంకర, ఇసుక తానే సరఫరా చేస్తానంటూ ఒత్తిడి తెస్తున్నాడు. ఒప్పుకోకపోతే ఆయా నిర్మాణాలను కూల్చి వేయిస్తున్నాడు. ఓ ప్రజాప్రతినిధి పేరిట భవన యజమానుల నుంచి రూ.లక్షల్లో దండుకుంటున్న ఇతడు.. తన అవినీతి సామ్రాజ్యాన్ని విస్తరించాడు. ఇతనిపై తీవ్ర ఆరోపణలు ఉన్నా ఆ ప్రజాప్రతినిధి కిమ్మనడం లేదు.



అధికారులను బెదిరించి నిర్మిస్తున్న అక్రమ కట్టడం

❖ నక్కలరోడ్డులో వైకాపాకు చెందిన ఓ కో- ఆప్షన్ సభ్యుడితో ఇతడు జతకట్టి 6 అంతస్తుల భారీ అక్రమ నిర్మాణాన్ని చేపట్టాడు. అక్రమంగా అంతస్తులు వేయించినందున ఇతడు రూ.లక్షల్లో దండుకున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ❖ పశ్చిమంలోని భవానీపురానికి చెందిన ఓ వ్యక్తి అనుమతి లేకుండా పెంట్‌హౌస్ నిర్మించేందుకు యత్నించగా, ఇతడిని బెదిరించి రూ.3 లక్షలు దండుకున్నాడు.

అక్రమాలపై నివేదిక పంపుతాం..

నిజమే, ఓ వ్యాపారి మా అధికారులను కూడా బెదిరిస్తున్నాడని చెబుతున్నారు. అక్రమాలు, అక్రమ కట్టడాలపై ప్రభుత్వ ఉన్నతాధికారులు, టౌన్ అండ్ కంట్రీ ప్లానింగ్ డైరెక్టర్‌కు ఇప్పటికే పలు ఫిర్యాదులు వెళ్లడంతో పూర్తి వివరాలు పంపాలని కమిషనర్‌ను వారు ఆదేశించారు. క్షేత్రస్థాయి పరిశీలించి, వివరాలతో ప్రభుత్వ అధికారులు, డైరెక్టర్‌కు కమిషనర్ నివేదిక పంపనున్నారు.
- సంజయ్ రత్నకుమార్, చీఫ్ సిటీ ప్లానర్

అరెస్టు భయంతోనే అజ్ఞాతంలోకి రంగయ్య

సిట్ కస్టడీలో వెల్లడించిన చెక్కా సతీష్

ఈనాడు - అమరావతి: 'నకిలీ మద్యం కేసులో అరెస్టు భయంతోనే తన బంధువైన తలారి రంగయ్య అలియాస్ రాజు అజ్ఞాతంలోకి వెళ్లాడు. ఎక్కడ ఉన్నాడో నాకు తెలియదని' నిందితుడు చెక్కా సతీస్ (ఏ17) కస్టడీలో చెప్పాడు. రెండో రోజైన శుక్రవారం సిట్, ఎక్సైజ్ అధికారులు నిందితుడిని విజయవాడ జైలు నుంచి అదుపులోకి తీసుకుని వైద్య పరీక్షలు నిర్వహించి తూర్పు ఎక్సైజ్ స్టేషన్‌కు తరలించారు. అక్కడ లేబుళ్ల డిజైన్, ప్రింటింగ్‌కు సంబంధించి ప్రశ్నలు అడిగి సమాధానాలు రాబట్టారు. దిల్‌సుఖ్‌నగర్‌లోని కోణార్క్ థియేటర్ ఎదురు దుకాణం అద్దెకు తీసుకుని తలారి రంగయ్య.. ఆర్‌జే డిజైన్స్ అండ్ ప్రింటింగ్ ప్రెస్‌ను నడుపుతున్నాడని, కొన్నేళ్ల కిందట ఈ వ్యాపారంలో భాగస్వామిగా చేరానని చెప్పాడు. ఇక్కడ లేబుళ్లను డిజైన్ చేయించి.. దుర్గానగర్ కాలనీలోని ఐ కార్డ్స్ అనే ప్రెస్‌లో ముద్రించినట్లు విచారణలో చెప్పినట్లు తెలిసింది. మే, 2023లో 'ఆంధ్రగోల్డ్ విస్కీ' పేరుతో 600 లేబుళ్లను ప్రింట్ చేయించామన్నాడు. దీనికిగాను సాధారణ ధరనే చెల్లించామన్నాడు. రంగయ్యను ఈ కేసులో నిందితుడిగా చేర్చారని తెలిసిన తర్వాత షాపు మూసి పారిపోయాడని కస్టడీలో తెలిపాడు. విచారణ అనంతరం వైద్య పరీక్షలు చేయించి విజయవాడ కారాగారంలో అప్పగించారు.

క్యూ వద్దు.. క్యూఆర్ కోడ్ ముద్దు



అత్యవసరంగా రైలు ప్రయాణం చేయాల్సి వచ్చి జనరల్ బోగీ టికెట్ తీసుకోవాల్సిన సమయంలో క్యూలో నిలబడితే రైలు వెళ్లిపోయే సందర్భాలు ఉంటాయి. రైల్వేస్టేషన్‌లో జనరల్ టికెట్ ఇచ్చే ప్రదేశంలో క్యూఆర్ కోడ్ ద్వారా టికెట్ పొందేందుకు అవసరమైన బోర్డులను ఏర్పాటు చేశారు. ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేసి యూటీఎస్ యాప్ డౌన్‌లోడ్ చేసుకుంటే జనరల్ టికెట్‌ను ఎక్కడి నుంచైనా పొందవచ్చు. -ఈనాడు, అమరావతి

అడ్డంగా పారేసి.. ఆరోగ్యానికి పాతరేసి..



విజయవాడ కొత్త ప్రభుత్వ ఆస్పత్రి సూపర్‌స్పెషాలిటీ విభాగం భవనం వెనుక కుప్పలుగా పేరుకుపోయిన బయో మెడికల్ వ్యర్థాల మూటలివి. శస్త్ర చికిత్సలకు ఉపయోగించిన కాటన్, సిరంజీలు, రక్త పరీక్షల నమూనాలు ఈ మూటల నుంచి బయటకు వచ్చి అందరూ నడిచే దారిలో ఉన్నాయి. కుక్కలు ఈ మూటల్లోకి దూరి చిందరవందర చేస్తున్నాయి. బయో వ్యర్థాలను ఇలాగే పడేస్తే కొత్త రోగాలు పుట్టుకొచ్చే ప్రమాదం ఉంది. -ఈనాడు అమరావతి





చైతన్య రథం.. యువతకు సందేశం

హరియాణా రాష్ట్రం పానిపట్‌కి చెందిన ఈ యువకుడి పేరు దీపక్‌శర్మ. సేవాభావం, ఐక్యత, దేశభక్తి, పర్యావరణం, ఆరోగ్యం, సామాజిక అంశాలపై యువతకు అవగాహన కల్పిస్తూ 'ఆపరేషన్ సిందూర్-సంకల్ప వికసిత్ భారత్ చార్‌ధామ్ పేరిట సైకిల్ యాత్ర' చేస్తూ విజయవాడకు చేరుకున్నారు. మే 25న ప్రారంభించిన యాత్ర ఇప్పటివరకు 7వేల కి.మీ పూర్తి అయ్యింది. గుజరాత్, తమిళనాడు రాష్ట్రాల్లో ప్రధాన దేవాలయాల సందర్శనతో పాటు మార్గమధ్యలో విద్యార్థులు, యువతను కలిసి సందేశం ఇస్తూ పూరిలోని జగన్నాథుడి వైపు కదిలారు. ఈ యాత్ర వచ్చే ఏడాది మే 25 వరకు కొనసాగుతుందని దీపక్‌శర్మ తెలిపారు. -ఈనాడు, అమరావతి

విజయోత్సవం..



బీహార్ అసెంబ్లీ ఎన్నికల్లో ఎన్డీఏ కూటమి అభ్యర్థులు గెలిచిన సందర్భంగా భాజపా శ్రేణులు సంబరాలు చేసుకున్నాయి. విజయవాడలోని ఆ పార్టీ రాష్ట్ర కార్యాలయం ఎదుట బాణసంచా కాల్చి ..మిఠాయిలు పంచారు. - ఈనాడు, అమరావతి

ఆరుతడితో సరి.. అన్ని నీళ్లు లేవు మరి!

కృష్ణా డెల్టాలో రబీకి నీటి సరఫరా కష్టమే



'కృష్ణా డెల్టాలో ఈ రబీ పంటలకు నీటి సరఫరా అసాధ్యంగా కనిపిస్తోంది. ప్రస్తుత నీటి నిల్వలను ఖరీఫ్.. తాగునీటి అవసరాలకు వాడాల్సిన నేపథ్యంలో రబీలో కేవలం ఆరుతడి పంటలు మాత్రమే సాగు చేయాలని జలవనరుల శాఖ అధికారులు సూచిస్తున్నారు. ఈ పరిస్థితుల్లో రైతులు రబీలో ప్రత్యామ్నాయ పంటల వైపు దృష్టి సారించేలా ప్రణాళికలు సిద్ధం చేయాల్సిన అవసరం ఉంది.' - ఈనాడు, అమరావతి

ఖరీఫ్‌కే అంతంత మాత్రం... శ్రీశైలం, నాగార్జునసాగర్, పట్టిసీమ, ప్రకాశం బ్యారేజీ పరిధిలోని కృష్ణా డెల్టాలో ఖరీఫ్ పంటలకు ఇప్పటికి 222 టీఎంసీల నీరిచ్చారు. ఇంకా 208 టీఎంసీలు సరఫరా చేయాలి. ★ దీంతోపాటు అదనంగా 2026 మే నెలాఖరు వరకు తాగునీటి అవసరాలకు 20 టీఎంసీల నీరు అవసరం. ★ తెలంగాణ ప్రభుత్వం.. వరదల వేళ వచ్చిన నీటిని సైతం రాష్ట్ర వాటాగా లెక్కించడం.. వరదల నేపథ్యంలో ఆ నీరు కడలి పాలవగా.. ప్రస్తుతం శ్రీశైలం, నాగార్జున సాగర్‌లో రాష్ట్ర వాటా 118 టీఎంసీలే మిగిలింది. పులిచింతలలో 40 టీఎంసీల నీరుంది. మొత్తంగా 158 టీఎంసీలే అందుబాటులో ఉంది. ఇంకా 50 టీఎంసీల లోటుంది. దీన్ని రాబోయే రోజుల్లో నదికి వచ్చే నీటి ప్రవాహం ద్వారా భర్తీ చేసుకోవాలి.

కృష్ణా డెల్టా ఇలా...

జిల్లా	ఆయకట్టు (లక్షల ఎకరాల్లో)
కృష్ణా	6.79
గుంటూరు	4.99
ప్రకాశం	0.72
పశ్చిమగోదావరి	0.58

నీటి నిల్వల కొరత...

ఉమ్మడి కృష్ణా, గుంటూరు, ప్రకాశం, పశ్చిమగోదావరి జిల్లాల్లో 13.8 లక్షల ఎకరాల ఆయకట్టు ఉంది. ఇప్పటి వరకు ఉన్న నీటి లభ్యత, తాగునీటి అవసరాలు, ఖరీఫ్‌కు కావలసిన నీటి అవసరం, కృష్ణా నదిలో నీటి ప్రవాహం తగ్గడం వంటి పరిణామాలతో కృష్ణా డెల్టా పరిధిలో ఈ రబీకి అవసరమైన నీరిచ్చే అవకాశం లేదు. దీంతో రైతులు ఆరుతడి పంటలు వేసుకోవాలని కృష్ణా డెల్టా సిస్టమ్ చీఫ్ ఇంజినీర్ రాంబాబు తెలిపారు.

కాగిత కళ.. కలిసొచ్చెనిలా..





సాధారణంగా చదివేసిన వార్తా పత్రికలను ఏం చేస్తారు. మహా అయితే తూకానికి అమ్మేస్తారు. విజయవాడలోని ప్రసాదంపాడుకు చెందిన **ముత్యాల వరలక్ష్మి** మాత్రం అద్భుతాలను ఆవిష్కరిస్తున్నారు. విభిన్న బొమ్మలు చేసి రాష్ట్రం నలుమూలలకు అమ్ముతున్నారు. వీటితో పాటు మట్టి ప్రతిమలు, రాఖీలు తయారు చేసి మార్కెటింగ్ చేస్తున్నారు.

మనసుంటే మార్గముంది: వరలక్ష్మికి చిన్నతనం నుంచి హస్తకళలంటే చాలా ఇష్టం. చిన్నప్పుడు వినాయక చవితికి ఇంట్లో పూజ చేయడానికి మట్టి విగ్రహాలు తయారు చేసుకోవడం..బంధువులకు చేసి ఇవ్వడంతో వారి నుంచి మన్ననలు వచ్చేవి. వివాహం అయ్యాక వినాయక చవితికి ముందే అడుగు నుంచి 3 అడుగుల విగ్రహాలు తయారు చేసి తెలిసిన వారికి అమ్మడం మొదలు పెట్టారు. ఇప్పుడు ఒక్కో పండగకు 100 నుంచి 200 వరకు మట్టి విగ్రహాలు అమ్ముతున్నారు. ఏటా వందల సంఖ్యలో రాఖీలు విక్రయిస్తున్నారు.

కాగితాలతో అద్భుతాలు.. వరలక్ష్మి ఓ సారి యూట్యూబులో వృథా పేపర్లతో బొమ్మల తయారీ వీడియోలు చూశారు. భర్త ఆనంద్‌బాబు ప్రోత్సాహం, డీఆర్‌డీఏ అధికారుల ప్రోద్బలంతో తనే బొమ్మలు చేసి బంధువులకు బహుమతులుగా ఇచ్చేవారు. అవి చూసిన వారంతా తమకూ కావాలనడంతో వ్యాపారంలా మొదలుపెట్టారు. ఆఫ్రికన్ డాల్, వెంకటేశ్వరస్వామి, శ్రీకృష్ణుడు, శివలింగాలు, ఇంట్లో వాడే ట్రేలు, పూజ బుట్టలు తదితర బొమ్మలు చేస్తారు. కొండపల్లి, ఏటికొప్పాక బొమ్మల్లా వీటిలో జీవం ఉట్టిపడుతుంది. ఆమెకు రూ.50వేలు, మరో ఆరుగురు మహిళలకు ఒక్కొక్కరికి నెలకు రూ.10వేల ఆదాయం వచ్చే మార్గం చూపించారు. - ఈనాడు, అమరావతి

జీఎస్టీ 2.0తో వ్యాపార, పారిశ్రామిక రంగాలకు ఉపయుక్తం



మాట్లాడుతున్న మలినేని రాజయ్య

మొగల్రాజపురం (విజయవాడ సిటీ): నూతనంగా తీసుకొచ్చిన జీఎస్టీ 2.0 వ్యాపార, పారిశ్రామిక రంగాలకు ఉపయుక్తంగా ఉంటుందని ఆంధ్ర ఛాంబర్ ఆఫ్ కామర్స్ విజయవాడ ఛైర్మన్ మలినేని రాజయ్య అన్నారు. ఆంధ్ర ఛాంబర్ ఆఫ్ కామర్స్ విజయవాడ ఆధ్వర్యంలో జీఎస్టీ 2.0పై అవగాహన కార్యక్రమాన్ని శుక్రవారం మొగల్రాజపురంలో ఛాంబర్ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా రాజయ్య మాట్లాడుతూ దేశ చరిత్రలోనే అత్యంత పరివర్తన కలిగించే పన్ను సంస్కరణల్లో ఇది ఒకటని, వ్యాపార, పారిశ్రామిక రంగంలో ఒక ముఖ్యమైన మార్పును సూచిస్తుందన్నారు. ఈ సంస్కరణలు వ్యాపార, పారిశ్రామిక రంగాలకు ఏమేర ఉపయోగపడుతున్నాయో వివరించారు. వ్యాపార, పారిశ్రామికవేత్తల సందేహాలను నివృత్తి చేశారు.

పరిశోధనలకు ఏఐ ఊతం

మాచవరం: భవిష్యత్తు పరిశోధనలకు ఏఐ, ఎంఎల్ మరింత దోహదపడతాయని కృష్ణా విశ్వవిద్యాలయం రెక్టార్ ఎంవీ బసవేశ్వరరావు పేర్కొన్నారు. ఎస్సారార్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రెండు రోజుల పాటు జరిగే ఏఐ(ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్), ఎంఎల్ (మెషీన్ లెర్నింగ్ ఇన్ లైఫ్ సైన్సెస్) జాతీయ సదస్సును శుక్రవారం ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులు, పరిశోధకులు ఏఐ, ఎంఎల్‌ను వినియోగించుకోవాల్సిన దిశలను వివరించారు. కళాశాల ప్రిన్సిపల్ కె. భాగ్యలక్ష్మి సదస్సు ప్రాముఖ్యత తెలిపారు. సదస్సులో వక్తలు మాజేటి నరసింహ వరప్రసాద్, ఎస్. సుధీర్ మంగళంపల్లి, నాగప్రసాద్ పువ్వాడ పాల్గొని పలు అంశాలపై ప్రసంగించారు.


శోభాయమానం


స్వాముల శరణుఘోష


అభిషేకం

హరిహరసుతనే.. శరణం అయ్యప్ప

మాచవరం: ఎస్సారార్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో శుక్రవారం శ్రీ చైతన్య విద్యాసంస్థల డైరెక్టర్ టి. నాగేంద్రకుమార్ ఆధ్వర్యంలో 36వ అయ్యప్ప పడి పూజ కార్యక్రమం అంగరంగ వైభవంగా జరిగింది. గుంటుపల్లి శ్రీనివాసరావు, రాజా గురుస్వాముల సారథ్యంలో సాయంత్రం 7 గంటలకు ప్రారంభమైన పూజ ఆద్యంతం ఎంతో భక్తిశ్రద్ధలతో సాగింది. నగరంలోని పలు ప్రాంతాల నుంచి వేలాది మంది స్వాములు తరలివచ్చి పూజలో పాల్గొన్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా శ్రీచైతన్య విద్యాసంస్థల డైరెక్టర్లు యలమంచిలి శ్రీధర్, సుష్మ దంపతులు, బొప్పన ఝాన్సీ లక్ష్మీబాయి, సీమాలు హాజరై పూజ నిర్వహించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్, వైకాపా జిల్లా అధ్యక్షుడు దేవినేని అవినాష్, నగర మాజీ మేయర్ కోనేరు శ్రీధర్ దంపతులు, మాజీ డిప్యూటీ మేయర్ చెరుకూరి కృష్ణకుమార్, కార్పొరేటర్ వల్లభనేని రాజేశ్వరి, బొప్పన భవకుమార్, బొండా రవితేజ, బొండా సిద్ధార్థ, వల్లభనేని సతీష్, పువ్వాడ బాలమురళీకృష్ణ పాల్గొన్నారు. మాలధారులతోపాటు అయ్యప్ప భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. విచ్చేసిన భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు.

ఫిర్యాదుదారుడు ఎవరో నాకు తెలియదు!

ఉద్యోగాలిప్పిస్తానని ఎవరి నుంచి డబ్బులు తీసుకోలేదు

వైకాపాలో తిరిగినందునే కేసుల్లో ఇరికించారు : అరుణ


అరుణను కోర్టుకు తీసుకెళుతున్న పోలీసులు

ఈనాడు - అమరావతి, న్యూస్‌టుడే - విజయవాడ నేరవార్తలు : ఫిర్యాదుదారు రమేష్ ఎవరో తనకు తెలియదనీ.. ఉద్యోగాల పేరుతో డబ్బులు తీసుకోలేదని పోలీసు కస్టడీలో నెల్లూరుకు చెందిన కిలేడీ నిడిగుంట అరుణ చెప్పింది. తాను గతంలో వైకాపా పని చేసిన కారణంగానే అక్రమ కేసులు పెట్టి బయటకు రాకుండా చేస్తున్నారని సమాధానమిచ్చినట్లు తెలిసింది. ఎస్.ఐ, అంగన్‌వాడీ ఉద్యోగాలు ఇప్పిస్తామని డబ్బులు తీసుకుని మోసం చేసిన కేసులో అరుణను విజయవాడలోని ఎస్ఆర్ పేట పోలీసులు రెండు రోజుల కస్టడీకి తీసుకుని విచారించారు. శుక్రవారం పూర్తి స్థాయిలో విచారణ సాగింది. ఉద్యోగాలు ఇప్పిస్తానని వృద్ధుడిని రూ. 24.50 లక్షలకు మోసం చేసిందని అరుణతోపాటు మరికొందరిపై ఇటీవల ఎస్ఆర్‌పేట స్టేషన్‌లో కేసు నమోదైన సంగతి తెలిసిందే. నిందితురాలిని సీసీఎస్ స్టేషన్‌లో ఉంచి విచారించారు. న్యాయవాదుల సమక్షంలో కేసు గురించి ప్రశ్నలు సంధించారు. అనంతరం ప్రభుత్వాసుపత్రికి తరలించి వైద్యపరీక్షలు చేయించారు. తర్వాత న్యాయాధికారి ఎదుట హాజరుపర్చారు.

విచారణలో పోలీసుల ప్రశ్నలు, అరుణ జవాబులు ఇవీ..

పోలీసులు : 2022లో విజయవాడలో రమేష్ నుంచి ఉద్యోగాలిప్పిస్తానని డబ్బులు తీసుకున్నారా?

అరుణ: నేను ఎవరి నుంచి డబ్బులు తీసుకోలేదు. ఆయనెవరో నాకు తెలీదు.

పోలీసులు: హోటల్ వద్దకు రమ్మని పిలిచి.. అక్కడ విడతల వారీగా రూ. 24.50 లక్షలు తీసుకున్నారా?

అరుణ: అవన్నీ అబద్ధాలే.

పోలీసులు: మాట్లాడుకుందామని ఫిర్యాదుదారుడిని నెల్లూరు రమ్మని పిలిచి బెదిరించారా?

అరుణ: నెల్లూరుకు పిలిపించలేదు. ఈ కేసుతో నాకు సంబంధం లేదు.

పోలీసులు: బంగారి ఎవరో మీకు తెలుసా? అతనితో కలిసి మోసాలకు పాల్పడుతున్నారా?

అరుణ: నాకు తెలియదు.

త్వరగా బయటకు తీసుకురండి.. శ్రీకాంత్‌ను పెళ్లి చేసుకోవాలి : 'శ్రీకాంత్‌ను నేను ప్రేమించా. పెరోల్‌పై తెచ్చి పెళ్లి చేసుకుందామనుకున్నా. నిశ్చితార్థం కూడా అయింది. ఈ దశలో నన్ను అనవసరంగా కేసుల్లో ఇరికించి బయటకు రాకుండా కుట్రపన్నారు. నాపై నెల్లూరు జిల్లాలో పలు కేసులు నమోదు చేశారు.' విచారణ సందర్భంగా నిడిగుంట అరుణ పోలీసులతో చెప్పినట్లు తెలిసింది. తాను గతంలో వైకాపాలో తిరిగాననీ, అందుకే కక్షతో కేసుల్లో ఇరికిస్తున్నారని అన్నట్లు సమాచారం. త్వరగా బెయిల్‌పై బయటకు తీసుకురావాలనీ.. శ్రీకాంత్‌తో పెళ్లి చేసుకోవాలని.. తన లాయర్లతో ఆమె పదే పదే అన్నట్లు సమాచారం.

28 వరకు రిమాండ్ పొడిగింపు...: ఉదయం నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు పోలీసులు ఆమెను విచారించారు. అనంతరం ఆమెను ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ వైద్యపరీక్షలు చేయించారు. ఆసుపత్రిలో వైద్య పరీక్షల అనంతరం ఆమెను ఆసుపత్రి వెనుక గేటు నుంచి తరలించారు. న్యాయస్థానం వద్ద కూడా ఇదే హైడ్రామా నడిచింది. సాయంత్రం 1వ అదనపు జ్యుడిషియల్ మేజిస్ట్రేట్ కోర్టులో హాజరుపరిచారు. విచారణ తర్వాత నిడిగుంట అరుణకు ఈనెల 28 వరకు రిమాండ్ విధిస్తూ న్యాయాధికారి దేవిక ఆదేశాలిచ్చారు. అనంతరం ఆమెను రైలులో నెల్లూరుకు తరలించారు.

బ్రాయిలర్ ధరలు (కిలో/ల రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -111 రిటైల్ ధర 138 చికెన్ విత్ స్కిన్ - 200, చికెన్ స్కిన్‌లెస్ - 228. అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 190, 199, 150చికెన్ విత్ స్కిన్ - 250 చికెన్ స్కిన్‌లెస్ - 260.

నెక్ సూచించిన కోడిగ్రుడ్లు ధర

ఈరోజు నెక్ విజయవాడ జోన్ సూచించే ప్లాస్టిక్ ట్రే ఫారం- గేటు గుడ్డు ధర 100 గుడ్లకు రూ. 625 (వాణిజ్యం & పరిశ్రమల సమాచారం కోసం) ★ నెక్ విజయవాడ ఈరోజు ఫారం కోడి ధర కిలో రూ.93/-.

నగరంలో శిక్షణ ఐఏఎస్‌ల బృందం పర్యటన


అన్న క్యాంటీన్‌లో భోజనం చేస్తూ...

విజయవాడ నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే : ప్రస్తుతం ముస్సోరీలో శిక్షణ పొందుతున్న ఐఏఎస్‌ల శిక్షణ బృందం నగరంలో స్వచ్ఛతా కార్యక్రమాల్లో పాల్గొని చెత్తా చెదారాన్ని తొలగించి శ్రమదానం చేసింది. ప్రధానంగా తూర్పు పరిధిలోని పటమట రెల్లీస్ కాలనీలోని రహదారులను వారు ఊడ్చి శుభ్రం చేశారు. ఆపై సింగ్‌నగర్‌లోని వ్యర్థాల నిర్వహణ ప్లాంటు, అక్కడి ఆర్ఆర్ఆర్ పార్కును సందర్శించి వ్యర్థాల రీసైక్లింగ్, రీయూజ్, రెడ్యూస్‌పై వివరాలు తెలుసుకున్నారు. నగర పరిశీలనకు వచ్చిన ఐఏఎస్ బృందాన్ని ఇన్‌ఛార్జి కమిషనర్ డి. చంద్రశేఖర్ సన్మానించి.. జ్ఞాపికలు అందించారు.

అన్న క్యాంటీన్‌లో భోజనం : పటమటలోని అన్న క్యాంటీన్‌ను శిక్షణ ఐఏఎస్‌ల బృందం సందర్శించి భోజనం చేసింది. ప్రభుత్వం రాయితీతో పేదలకు అందిస్తున్న అల్పాహారం, భోజనం వివరాలు తెలుసుకుని ప్రశంసించారు. ఆహారం చాలా రుచిగా ఉందని మెచ్చుకున్నారు. అధికారులు కె. అర్జునరావు, పి. సత్యకుమారి, ప్రభుదాస్, పి. వెంకటనారాయణ, బి. సోమశేఖర్‌రెడ్డి, బాబూ శ్రీనివాస్, గోపాలకృష్ణనాయక్, చంద్రశేఖర్, సిబ్బంది పాల్గొన్నారు.

ట్రాక్టర్ ట్రక్కు కింద పడి యువకుడి దుర్మరణం

న్యాయం చేయాలని బంధువుల ఆందోళన


బైపాస్‌పై పోలీసులతో వాదన

మైలవరం, న్యూస్‌టుడే: ముందు వెళ్తున్న ట్రాక్టర్ ట్రక్కు కింద పడి ఓ యువకుడు మృతి చెందిన సంఘటన మైలవరంలో తీవ్ర ఉద్రిక్తతకు దారితీసింది. వివరాల్లోకి వెళితే.. ఎన్టీఆర్ జిల్లా జి. కొండూరు మండలం కె. కండ్రికకు చెందిన మిక్కిలి సమీర్ (20), అదే గ్రామానికి చెందిన పాపారావు అనే యువకుడితో కలిసి పనుల నిమిత్తం శుక్రవారం గణపవరం మీదుగా ద్విచక్ర వాహనంపై ఏలూరు జిల్లా ఆగిరిపల్లికి బయలుదేరారు. గణపవరం దాటాక గణపతి గట్టు సమీపంలో పశువుల ఎరువుల లోడుతో చంద్రాల నుంచి వెళ్తున్న ట్రాక్టర్ ట్రక్కు యువకుల వాహనానికి తగిలింది. ఈ క్రమంలో బైకు వెనుక కూర్చున్న సమీర్ ట్రక్కు చక్రాల కింద పడగా అక్కడికక్కడే ప్రాణాలు విడిచాడు. వాహనం నడుపుతున్న పాపారావు మరోవైపు పడడంతో స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. ఎస్సై కె. సుధాకర్ సంఘటనా స్థలానికి చేరుకుని, మృతదేహాన్ని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అయితే మృతుడిది పేద కుటుంబం కావడంతో, ప్రమాదానికి కారణమైన ట్రాక్టర్ యజమాని నుంచి ఆర్థికంగా సాయం చేయాలని మృతుడి తరపు బంధువులు అడగ్గా.. రెండు గ్రామాల నాయకుల సమక్షంలో ఇరువర్గాలు సర్కిల్ కార్యాలయం వద్ద చర్చించినా రాజీ కుదరలేదు. దీంతో వారంతా ఎల్‌హెచ్ఆర్ స్కూల్ సర్కిల్‌లో మూడు వైపులా రహదారులపై కంప ఉంచి ఆందోళన చేశారు. ఉదయం ప్రమాదం జరిగితే అందుకు కారణమైన డ్రైవర్‌ను తీసుకురాలేదని, ఆరోపించారు. ఆందోళన విరమిస్తే వెంటనే తీసుకొస్తామని సీఐ చంద్రశేఖర్ వారికి చెప్పడంతో ధర్నా విరమించారు.

విజయ్‌భాస్కర్‌రెడ్డి కస్టడీ పిటిషన్ వాయిదా

ఈనాడు డిజిటల్, మచిలీపట్నం: సామాజిక మాధ్యమాల్లో న్యాయమూర్తులు, కూటమి నేతలు.. మహిళలే లక్ష్యంగా తీవ్ర అసభ్య పోస్టులు పెట్టి అరెస్టయి రిమాండ్‌లో ఉన్న మాలపాటి విజయ్‌భాస్కర్‌రెడ్డి కేసులో మరింత లోతైన విచారణ చేసేందుకు అతడిని కస్టడీకి ఇవ్వాలని పోలీసులు దాఖలు చేసిన పిటిషన్‌పై నిందితుడి తరఫు న్యాయవాది కౌంటర్ దాఖలు చేశారు. నిందితుడి బెయిల్ మంజూరు చేయాలని దాఖలైన పిటిషన్‌పై ప్రాసిక్యూషన్ శుక్రవారం కౌంటర్ వేసింది. ఈ రెండు పిటిషన్లపై విచారణను ఈ నెల 17కు న్యాయాధికారి వాయిదా వేశారు.

చివరి మజిలీకి ఈదాల్సిందే..

తిరువూరు టౌన్, న్యూస్‌టుడే : మండలంలోని రోలుపడిలో ఎస్సీలు బంధువుల అంత్యక్రియలకు అవస్థలు పడుతున్నారు. కాలం చేసే వారి అంత్యక్రియల కోసం ఊరికి అనుకుని ప్రవహించే, కట్టలేరు వాగును దాటాల్సి వస్తోంది. గ్రామంలో గురువారం కవ్వాల గాబ్రియేలు కుమారుడు మల్లేశ్వరావు(25) అనారోగ్య కారణాలతో మరణిస్తే వాగవతల ఉన్న శ్మశానవాటికకు నీటి ప్రవాహంలో దిగి, మృతదేహాన్ని తరలించాల్సి వచ్చిందని స్థానికులు వాపోయారు. ప్రతిసారీ, ఇలాగే అవస్థలు పడుతున్న వైనాన్ని పదే పదే ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్తున్నా ఇబ్బందులు తీర్చడంలేదని చెబుతున్నారు. ఇటీవల వర్షాలకు, వాగులో భారీగా నీరు ప్రవహిస్తుంటే, నడుములోతు నీటిలో కిలోమీటరు దూరం మోసుకుంటూ వెళ్లాల్సిన రావడం కష్టంగా మారిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా శాశ్వత పరిష్కారం చూపాలని కోరుతున్నారు.

హత్య కేసులో భర్త అరెస్టు

సూర్యారావుపేట: అనుమానం పెనుభూతమై భార్యను కిరాతకంగా నడిరోడ్డుపై పొడిచి హత్య చేసిన కేసులో కిరాతక భర్త దీపాల విజయ్‌ను సూర్యారావుపేట పోలీసులు అరెస్టు చేశారు. భార్య సరస్వతి నడవడికపై అనుమానంతో గురువారం మధ్యాహ్నం ఆమె పనిచేస్తున్న ఆసుపత్రి సమీపంలోనే భర్త విజయ్ నడిరోడ్డుపై కత్తితో పొడిచి హత్య చేసిన సంగతి తెలిసిందే. ఈమేరకు నమోదైన కేసులో విజయ్‌ను పోలీసులు అరెస్టు చేశారు. నిందితుడికి ప్రభుత్వాసుపత్రిలో వైద్యపరీక్షలు నిర్వహించారు. అనంతరం రాత్రి 9 గంటల సమయంలో న్యాయమూర్తి ఇంటి వద్దకు తీసుకువెళ్లారు. సరస్వతి మృతదేహానికి పంచనామా నిర్వహించిన అనంతరం తల్లి, ఇతర బంధువులకు అప్పగించారు.

తిరువూరు

• తిరువూరు • మైలవరం

విద్యుత్తు చౌర్యం నేరం

తిరువూరు టౌన్, న్యూస్‌టుడే: విద్యుత్తు చౌర్యానికి పాల్పడితే కఠిన చర్యలు తప్పవని డీఈఈ సత్యనారాయణ హెచ్చరించారు. మండలంలోని గ్రామాల పరిధిలో విద్యుత్తు శాఖ ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసిందన్నారు. అనధికారంగా మీటర్లు చెడగొట్టడం, నేరుగా లైన్ల నుంచి కరెంటు వినియోగించడం వంటి ఘటనలు పెరుగుతున్న నేపథ్యంలో శుక్రవారం 40 బృందాలతో తనిఖీలు నిర్వహించామన్నారు. తనిఖీల్లో సుమారు 2,571 సర్వీసులను పరిశీలించి రూ.లక్ష అపరాధ రుసుం విధించామని తెలిపారు. 191 అదనపు లోడు వినియోగంపై రూ.5,58,000 జరిమానాలు విధించామన్నారు. ప్రత్యేక విజిలెన్స్ అధికారి పి.నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా శత దీపాలంకరణ సేవ



సేవలో అర్చకులు

నెమలి(గంపలగూడెం), న్యూస్‌టుడే: మండలంలోని నెమలి వేణుగోపాలస్వామి ఆలయంలో శుక్రవారం రాత్రి అష్టోత్తర శత దీపాలంకరణ సేవ అర్చకులు గోపాలాచార్యుల ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా నిర్వహించారు. రుక్మిణి, సత్యభామా సమేత వేణుగోపాలస్వామి ఉత్సవమూర్తులకు అద్దాల మండపం వద్ద పవళింపు వేడుక నిర్వహించగా భక్తులు పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

తిరువూరు: 98853 28820 మైలవరం: 80085 74705

? రాఘవాపురం గ్రామంలోని తారురోడ్డు వెంట ఉన్న డ్రెయినేజీలో పిచిమొక్కలు పెరిగి మురుగు సక్రమంగా పారడం లేదు. **- రమేష్, స్థానికుడు**

✔ పరిశీలించి సమస్య పరిష్కరిస్తాం. **- ఎస్.రామారావు, పంచాయతీ కార్యదర్శి** – న్యూస్‌టుడే, రెడ్డిగూడెం

? గొల్లపూడి సాయిపురంకాలనీలో కుక్కల బెడద ఎక్కువగా ఉంది. రాత్రి సమయంలో ఇంటికి వెళ్లాలంటే ఇబ్బందిగా ఉంటుంది. **- ప్రదీప్, గొల్లపూడి**

✔ కుక్కల సమస్య పరిష్కరించేందుకు చర్యలు చేపడతాం **- కుమార్, శానిటరీ ఇన్‌స్పెక్టర్**

? గొల్లపూడి మౌలానగర్‌లో డ్రెయినేజీ వ్యవస్థ అధ్వానంగా ఉంది. మురుగునీరు ముందుకు కదలని పరిస్థితి ఏర్పడింది. **- నారాయణ, రామరాజ్యనగర్**

✔ సిబ్బందిని పంపి డ్రెయినేజీ వ్యవస్థ మెరుగు పరుస్తాం. **- స్వరూపారాణి, శానిటరీ ఇన్‌స్పెక్టర్**

స్పందనకు వందనం

◆ గొల్లపూడి రామరాజ్యనగర్ ప్రాంతంలో వీధిదీపాలు వెలగడం లేదని పంచాయతీ అధికారులకు తెలుపగా స్పందించి ఏర్పాటు చేయించారు.

◆ వస్త్రలతకాలనీలో చెత్త తీసుకువెళ్లేందుకు పారిశుద్ధ్య సిబ్బంది రావడం లేదని అధికారులకు తెలుపగా పంపించి వీధులను శుభ్రం చేయించారు.

◆ బైపాస్ రహదారి వెంబడి మందుబాబుల ఆగడాలు ఎక్కువగా ఉన్నాయని భవానీపురం పోలీసుల దృష్టికి తీసుకెళ్లగా స్పందించారు. సిబ్బందిని పంపి మందుబాబులను స్టేషన్‌కు తీసుకువెళ్లి కౌన్సెలింగ్ ఇచ్చారు. – న్యూస్‌టుడే, గొల్లపూడి

◆ కొండపల్లి ఎస్టీ కాలనీ రైల్వే తూము వద్ద మురుగు కాలువ స్తంభించిపోయిందని మేమున్నాం..మీకు తోడుగాకు స్థానికులు సమస్యను తెలిపారు. స్పందించిన మున్సిపల్ సిబ్బంది శుక్రవారం ఆ ప్రాంతమంతా పారిశుద్ధ్య పనులు నిర్వహించారు. తూము లోపలికి వెళ్లి అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మలను తొలగించి మురుగు నీటిని దిగువకు తరలించారు. **– న్యూస్‌టుడే, కొండపల్లి**

దళారులకు ధాన్యం అమ్మాల్సిన అవసరం లేదు..

రెడ్డిగూడెం, న్యూస్‌టుడే: ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం అమ్మకాలు చేసి లబ్ధి పొందాలని రెడ్డిగూడెం మండల వ్యవసాయ అధికారి డి.శ్రీనివాసరావు రైతులకు సూచించారు. శుక్రవారం రెడ్డిగూడెం రైతు సేవాకేంద్రంలో వ్యవసాయ శాఖ సిబ్బందికి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సిబ్బంది గ్రామాల్లో తిరిగి కొనుగోలు కేంద్రాల వల్ల కలిగే ప్రయోజనాలు తెలియజేయాలని సూచించారు. ధాన్యం అమ్మకాలు జరిగిన 48 గంటల్లో రైతుల ఖాతాలకు డబ్బులు జమ చేస్తారని పేర్కొన్నారు. ధాన్యం అమ్మకాలపై సమస్యలు ఉంటే రైతు సేవా కేంద్రాల్లో సంప్రదించాలని చెప్పారు. దళారులకు ధాన్యం అమ్ముకోవాల్సిన అవసరం లేదని తెలిపారు.

సదుపాయాలున్నాయ్.. పీహెచ్‌సీకి రండి

కొండపల్లి, న్యూస్‌టుడే



డయల్ యువర్ డాక్టర్ కార్యక్రమంలో వైద్యులు రాథోడ్

వ్యాధులపై అవగాహన కలిగి అప్రమత్తంగా ఉంటే పొంచి ఉన్న వ్యాధులు దరిచేరవని కొండపల్లి పీహెచ్‌సీ వైద్యుడు రాథోడ్ అన్నారు. అన్ని సదుపాయాలు అందుబాటులో ఉన్నాయని.. వైద్య సేవలు అందిస్తామని తెలిపారు. శుక్రవారం ఈనాడు ఆధ్వర్యంలో నిర్వహించిన డయల్ యువర్ డాక్టర్ కార్యక్రమానికి ప్రజలు స్పందించి అడిగిన ప్రశ్నలు, సమస్యలకు సమాధానమిచ్చారు.

ప్రశ్న: కొండపల్లి కొత్తగేటు వద్ద కొన్ని రోజులుగా తాగునీటి కుళాయిల్లో నీళ్లు బూడిద రంగులో వస్తున్నాయి. ఆ సమయంలో వాటర్ ప్లాంట్ల వద్ద కొనుగోలు చేసుకుంటున్నాం. ఇతర ప్రాంతాలకు వెళ్లినప్పుడు అనుకోకుండా బూడిద రంగులో ఉన్న నీటిని తాగేస్తున్నాం. ప్రమాదం ఉందా.. **- సత్యనారాయణ, కొండపల్లి**

సమా: బూడిద అవశేషాలు కలిగిన నీటిని తాగునీరుగా తీసుకొంటే జీర్ణ వ్యవస్థలో ఇబ్బందులు ఎదురవుతాయి. జీర్ణం కాకుండా నిల్వ ఉండి పేగుల్లో అనారోగ్య సమస్యలను తెచ్చిపెడతాయి. ఇబ్బందిగా ఉంటే పీహెచ్‌సీని సందర్శించండి.

? జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల పక్కన కోటయ్యనగర్‌లో తెల్లవారుజామున మంచుతో పాటు బూడిద పడుతుంది. వారం నుంచి మా పిల్లలకు దగ్గు వస్తోంది. గాలి కాలుష్యం ప్రభావమా..? **-విజయ్‌కుమార్, కొండపల్లి**

✔ చలికాలం ప్రారంభమైంది. అన్నిచోట్లా జలుబు, దగ్గు కేసులు ఉన్నాయి. వాతావరణ మార్పు తప్ప, గాలి కాలుష్యం వల్ల జలుబు ఉండదు. వాడుతున్న మందుల కోర్స్ పూర్తయిన తర్వాత తగ్గకపోతే ఆసుపత్రికి తీసుకురండి.

? ఇబ్రహీంపట్నం కొత్తూరులో నడిచి వెళ్తుంటే చేతిలో ఉన్న సంచులు చూసి కోతి కరిచింది. దానికి ఎటువంటి చికిత్స చేయలేదు. ప్రమాదం ఏమైనా ఉందా..? **-పి.శంకరరావు, ఇబ్రహీంపట్నం**

✔ కుక్క, కోతి ఏది కరిచినా ఏఆర్‌బీ (యాంటీ రేబిస్ వ్యాక్సిన్) వేయించుకోవాలి. స్థానిక పీహెచ్‌సీల్లో వీటిని ఉచితంగా ఇస్తున్నారు.

? వికలాంగ పింఛను దరఖాస్తు కోసం వెళ్తే సదరం సర్టిఫికెట్ అడిగారు. ప్రభుత్వ వైద్యులు ఇస్తారని చెప్పారు. మన పీహెచ్‌సీలో ఇస్తారా..? **- ప్రమీలా, కొండపల్లి**

✔ వికలాంగులకు ఇచ్చే సదరం సర్టిఫికెట్‌కు ఒక కమిటీ ఉంటుంది. విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రిలో ఉన్న కమిటీ నిర్ధారణ చేస్తుంది. 40 శాతం కన్నా అధికంగా అంగవైకల్యం ఉన్న వారికే ఇస్తారు.

ఈనాడు మీతోడు

? మా అమ్మాయి గర్భిణి. ప్రస్తుతం ఏడో నెల. ఏఎన్ఎం ఆధ్వర్యంలోనే సలహాలు తీసుకుంటున్నాం. కొండపల్లి ఆసుపత్రిలో ప్రసవం చేసే వైద్య సదుపాయాలు, మహిళా వైద్యులు అందుబాటులో ఉంటారా..?

✔ ఒక మహిళా వైద్యురాలు ఉన్నారు. ప్రసవానికి సంబంధించిన అన్ని సౌకర్యాలు ఆసుపత్రిలో ఉన్నాయి. అనుభవం కలిగిన సిబ్బంది ఉన్నారు. నిస్సందేహంగా ప్రసవం చేయించుకోవచ్చు. ఏడాదికి 30 వరకూ ప్రసవాలు ఇక్కడే జరుగుతున్నాయి.

? నా వయసు 59 ఏళ్లు. మధుమేహం, రక్తపోటులు ఉన్నాయి. రెండు రోజులుగా పెరిగిన చలి వల్ల తీవ్రమైన నిస్సత్తువుగా ఉంది. చలికాలంలో దీర్ఘకాలిక వ్యాధులు అధికమవుతాయా..?

✔ వృద్ధాప్యానికి చేరుకుంటున్న వారికి నిద్రలేమి సమస్యలు సహజం. వాటిని ధ్యానం చేసి తొలగించుకోవాలి. చలి పెరిగిన సందర్భంలో నిద్రలో ఇబ్బంది కలిగి మెలకువ వస్తుంది. దీని వల్ల చెక్కర వ్యాధిలో మార్పులు వచ్చే అవకాశం ఉంది. చలికాలానికి దీర్ఘకాలిక వ్యాధులకు నేరుగా సంబంధం లేకపోయినా ఇటువంటి సమస్యల పట్ల అవగాహనతో ఉండాలి.

పుస్తక పఠనం ఉత్తమ లక్షణం



నెహ్రూ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ప్రజాప్రతినిధులు, విద్యార్థులు

కొండపల్లి, న్యూస్‌టుడే: పుస్తక పఠనం ఉత్తముల లక్షణమని పురపాలిక ఛైర్మన్ చిట్టిబాబు అన్నారు. గ్రంథాలయ వారోత్సవాలను కొండపల్లి పట్టణ శాఖా గ్రంథాలయంలో ప్రారంభించి మాట్లాడారు. గ్రంథాలయాధికారిణి విజయ కృష్ణ మాట్లాడుతూ.. మండల పాఠశాలల్లోని విద్యార్థులకు పలు రకాల పోటీలను నిర్వహించి విజేతలకు 20వ తేదీన బహుమతులు అందజేస్తామన్నారు. నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు అర్పించారు. కార్యక్రమంలో వైస్ ఛైర్మన్ శ్రీను, గ్రంథాలయాధికారి చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

జి.కొండూరు, న్యూస్‌టుడే: గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకుని జ్ఞాన సముపార్జన చేస్తూ విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదగాలని ఎంపీపీ వేములకొండ లక్ష్మీతిరుపతమ్మ కోరారు. స్థానిక శాఖ గ్రంథాలయంలో శుక్రవారం 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను ఆమె ప్రారంభించి మాట్లాడారు.



గంపలగూడెంలో గ్రంథాలయ వారోత్సవంలో ప్రజాప్రతినిధులు, సిబ్బంది

గంపలగూడెం, న్యూస్‌టుడే: మండలంలోని గంపలగూడెం, పెనుగొలనులో గ్రంథాలయ ప్రాధాన్యతను వక్తలు వివరించారు. తొలి రోజు పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ చిత్రపటానికి నివాళులర్పించారు. సర్పంచి కె.పుల్లమ్మ, గ్రంథాలయ నిర్వాహకులు వి.జ్యోతిర్మయి, టి.వెంకటేశ్వరరావు, గ్రామస్తులు పాల్గొన్నారు.

అప్రమత్తతతో మధుమేహం దూరం



అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న వైద్యులు మురళీ వెంకటేశ్వరరావు

కొండపల్లి, న్యూస్‌టుడే: ప్రపంచవ్యాప్తంగా అత్యధికమందిని పట్టి పీడిస్తున్నది మధుమేహం వ్యాధేనని నిమ్రా జనరల్ మెడిసన్ హెచ్‌వోడీ మురళీ వెంకటేశ్వరరావు అన్నారు. ప్రపంచ చక్కెర వ్యాధి దినం సందర్భంగా వ్యాధి జాగ్రత్తలపై అవగాహన కార్యక్రమాన్ని కొండపల్లి పీహెచ్‌సీలో నిమ్రా విద్యా సంస్థ శుక్రవారం నిర్వహించింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రపంచానికి ఈ వ్యాధి ఓ మహమ్మారిలా మారిందన్నారు. అయితే గతంలో కన్నా ప్రస్తుతం వ్యాధి నియంత్రణకు అనేక మందులు అందుబాటులో ఉన్నాయన్నారు. వ్యాధిగ్రస్తులు మందులతో పాటు ఆరోగ్య నియమాలను పాటించగలిగితే వ్యాధి ఉన్నా దీర్ఘకాలిక ఇబ్బందులు రావన్నారు. పీహెచ్‌సీ వైద్యులు రాథోడ్ మాట్లాడుతూ జీవనశైలిని క్రమబద్ధంగా ఉంచుకోగలిగితే చక్కెర వ్యాధి దుష్ప్రభావాలు ఉండవని చెప్పారు. డాక్టర్లు వినయ్‌బాబు, కుమార్, నిమ్రా వైద్య విద్యార్థులు, ఎంఎల్‌హెచ్‌పీలు పాల్గొన్నారు. ◆ లయన్స్ క్లబ్ ఆఫ్ వీఆర్‌కే నగర మహిళా ఆధ్వర్యంలో కొండపల్లి క్రాంతి పాఠశాలలో డయాబెటిక్ డేను నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యులు విజయవాణి, జయగుణ ఇలు విద్యార్థులనుద్దేశించి మాట్లాడారు. చిన్న వయసులోనే డయాబెటిక్ కేసులు వస్తున్నాయన్నారు. వీటిని నివారించాలంటే విద్యార్థులు ఆహార అలవాట్లు, జీవన శైలిలో నిర్దిష్టమైన విధానాన్ని పాటించాలన్నారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ అమ్మాజీ తదితరులు పాల్గొన్నారు.



తిరువూరులో వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో ప్రదర్శన

తిరువూరు, గంపలగూడెం, న్యూస్‌టుడే: తిరువూరు పట్టణంలో శుక్రవారం వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో ప్రపంచ డయాబెటిక్ డే నిర్వహించారు. వ్యాధి లక్షణాలు, ఆరోగ్య జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ ప్రదర్శన చేశారు. టి.రామకోటేశ్వరరావు కశ్యప్, పి.వెంకటేశ్వరరావు, ఎం.కిషోర్‌బాబు, ఎస్సై కె.సత్యనారాయణ పాల్గొన్నారు.

ఎన్డీఏ విజయంతో సంబరాలు



మిఠాయిలు పంచుకుంటున్న భాజపా నాయకులు

ఇబ్రహీంపట్నం, న్యూస్‌టుడే: బిహార్‌లో ఎన్నికల విజయాన్ని పురస్కరించుకొని ఇబ్రహీంపట్నం రింగుకూడలిలో భాజపా నాయకులు రఘునాథరెడ్డి ఆధ్వర్యంలో ఆ పార్టీ నాయకులు శుక్రవారం మిఠాయిలు పంచిపెట్టారు. కార్యక్రమంలో బాలకోటేశ్వరరావు, మాధురి, యుగంధర్, భవానీ, కృష్ణకుమారి, పండు తదితరులు పాల్గొన్నారు.

స్పందించారు..గుంతలు పూడ్చారు..

ఈనాడు కథనానికి స్పందన



వీనపాక శివారు విద్యానగరం సమీపంలో జాతీయరహదారి-30పై గుంతలు ఏర్పడి అధ్వానంగా తయారై స్థానికులు రాకపోకలకు అవస్థలు పడుతున్నారనే సమస్యపై ఈ నెల 7వ తేదీన 'జాతీయ రహదారి..చూడకుంటే పడతారు జారి' శీర్షికన చిత్ర వార్త ప్రచురితమైంది. దీంతో స్పందించిన ర.భ అధికారులు సిబ్బందితో మరమ్మతులు చేపట్టి గుంతలను పూడ్పించారు. సమస్య పరిష్కారం కావడంతో వాహనదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. **– న్యూస్‌టుడే, జి.కొండూరు,**

పరిశ్రమల స్థాపనకు ప్రోత్సాహం



మాట్లాడుతున్న ప్రియాంక

మైలవరం, న్యూస్‌టుడే: చిన్న, మధ్యతరహా పరిశ్రమలు స్థాపించాలనుకునే వారికి అనేక ప్రోత్సాహకాలు లభిస్తాయని జడ్ఈడీ జిల్లా కోఆర్డినేటర్ ప్రియాంక పేర్కొన్నారు. స్థానిక వెలుగు కార్యాలయంలో శుక్రవారం ర్యాంప్ జడ్ అవగాహన కార్యశాలను ఏజడ్ క్వాలిటీ డెవలప్‌మెంట్ కంపెనీ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా పరిశ్రమల అభివృద్ధికి సంబంధించిన అంశాలను ఏపీఓ రవికుమార్ వివరించారు. ఎంఎస్ఎంఈ తయారీ యూనిట్లకు జెడ్ సర్టిఫికెట్ల ప్రయోజనాలను వివరించారు. కార్యక్రమంలో ఏపీఎం శామ్యూల్ తదితరులు పాల్గొన్నారు.

అంకితభావంతో పనిచేద్దాం..

గుంటుపల్లి(ఇబ్రహీంపట్నం(గ్రామీణం), న్యూస్‌టుడే: అధికారులు, కార్మికుల ప్రతిభతో ఎన్నో అవార్డులు రివార్డులు సాధించిన గుంటుపల్లి వ్యాగన్ వర్క్‌షాపు దేశంలోనే అత్యుత్తమ వర్క్‌షాపుగా నిలిచిందని ముఖ్య ఇంజినీరు ఎం.శ్రీనివాస్ పేర్కొన్నారు. గుంటుపల్లి వ్యాగన్ వర్క్‌షాపు స్వర్ణోత్సవాలను ఆయన శుక్రవారం గుంటుపల్లి రైల్వే స్టేడియంలో లోగోను ఆవిష్కరించి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. అందరూ ఇదే స్ఫూర్తి, అంకిత భావంతో విధులు నిర్వహించి ఆదర్శమైన వర్క్‌షాపుగా తీర్చిదిద్దాలని కోరారు. ఈ వేడుకల్లో భాగంగా వర్క్‌షాపులో విధులు నిర్వహించి ఉద్యోగ విరమణ, బదిలీ అయిన అధికారులు కార్మికులను కూడా సత్కరించనున్నట్లు వివరించారు. కార్యక్రమంలో డిప్యూటీ సీఎంఈ హనుమానాయక్, ఉత్పాదక ఇంజినీరు అఖిల్ పల్లివార్, ఉన్నతాధికారులు, వివిధ కార్మికసంఘాలు, అసోసియేషన్లకు చెందిన నాయకులు పాల్గొన్నారు.



సంబరాలు చేసుకుంటున్న ఉన్నతాధికారులు, కార్మిక సంఘాల నాయకులు

ఆట పాటల సందడి



గుంటుపల్లి డాన్‌బాస్కో స్కూల్లో విద్యార్థుల నృత్యాలు

తిరువూరు, మైలవరం నియోజకవర్గాల్లోని ప్రభుత్వ, ప్రైవేటు, కార్పొరేటు పాఠశాలల్లో శుక్రవారం మాజీ ప్రధాని పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ జయంతి పురస్కరించుకొని జాతీయ బాలల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ముందుగా చిన్నారులు, ఉపాధ్యాయులు చాచా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. విద్యార్థుల వేషధారణలు ఆకట్టుకున్నాయి. చిన్నారులకు పలు పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. **- న్యూస్‌టుడే బృందం**



కొండపల్లి: క్విజ్ పోటీల్లో విజేతలతో ఉపాధ్యాయులు



తిరువూరు అంబేడ్కర్ బాలుర పాఠశాలలో..



నరసాపురం గురుకులంలో..



కాచవరం పాఠశాలలో కేకు కోస్తూ..



మైలవరం ప్రభుత్వాస్పత్రిలో రోగులకు ఫలాలు అందజేసిన లీలావతి పాఠశాల విద్యార్థులు



చంద్రగూడెం పాఠశాలలో నివాళులర్పిస్తూ..



చెవుటూరులో..



తిరువూరు: చింతలపాడు బడిలో..

బూడిద నీటి నుంచి ప్రజలను కాపాడాలి



సంతకాలు సేకరిస్తున్న సీపీఎం నాయకులు

కొండపల్లి: బూడిద, బూడిద నీటి నుంచి ప్రజలను కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని సీపీఎం నాయకులు అన్నారు. తాగునీటి పథకంలో బూడిద కలవడంపై తక్షణ చర్యలు తీసుకోవాలంటూ పార్టీ ఆధ్వర్యంలో సంతకాల సేకరణను కొండపల్లిలో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రక్షిత పథకంలోకి ఎన్టీటీపీఎస్ బూడిద నీరు కలుస్తుందన్నారు. దీనిపై సంస్థ అధికారులు కాదని చెబుతున్నా ఇది వాస్తవమన్నారు. ఈ కలుషితం వల్ల ప్రజలకు రోగాలు వచ్చి తీవ్ర ఇబ్బందులకు గురవుతారన్నారు. ఇప్పటికే వాయు కాలుష్యం వల్ల అనేక వ్యాధులతో ఈ ప్రాంత వాసులు అవస్థలు పడుతూనే ఉన్నారన్నారు. నీటి కాలుష్యాన్ని యుద్ధ ప్రాతిపదికన సరిచేయకపోతే సీపీఎం ఆధ్వర్యంలో పోరాటాలు చేస్తామన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచి కొల్లి వెంకటేశ్వరరావు, మహేష్, విఠలరావు, బాషా, కొండలరావు, వెంకటేశ్వరరావు, పార్వతి, బేబీ సరోజని తదితరులు పాల్గొన్నారు.

చంద్రమౌళీశ్వరుడికి విశేష పూజలు



గంపలగూడెం, తిరువూరు, న్యూస్‌టుడే: కార్తికమాసం సందర్భంగా శుక్రవారం తిరువూరు పట్టణంలో చంద్రమౌళీశ్వరస్వామి ఆలయంలో విశేష పూజలు నిర్వహించారు. అర్చకులు శివలింగానికి అభిషేకాలు, అర్చనలు, గవ్వలతో అలంకరణ చేయగా భక్తులు దర్శించుకుని పూజలు చేశారు.

ఈ పంట నమోదు ముసాయిదా జాబితా విడుదల

విస్సన్నపేట, న్యూస్‌టుడే : ఖరీఫ్ సీజన్ 2025లో పంటలు వేసి ఈ పంట నమోదు చేయించుకున్న రైతుల ముసాయిదా జాబితాను అన్ని రైతు సేవా కేంద్రాలలో 14 నుంచి 17వ తేదీ వరకు ప్రదర్శనకు ఉంచుతారని ఏవో షేక్ టిప్పుసుల్తాన్ తెలియజేశారు. శుక్రవారం విస్సన్నపేటలో ఏఈవో ఉషారాణి, స్థానిక రైతులతో కలిసి ఆయన ముసాయిదా జాబితాను విడుదల చేశారు.

ఎస్టీయూ జిల్లా కార్యదర్శి నియామకం

విస్సన్నపేట: రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం జిల్లా కార్యదర్శిగా స్థానిక చంద్రుపట్ల ప్రాథమిక పాఠశాల(ఎల్.టి) ప్రధానోపాధ్యాయులు గుగులోతు భల్యా నియమితులైనట్లు విస్సన్నపేట మండల అధ్యక్షుడు పి.చంద్రశేఖర్ తెలిపారు. జిల్లా ఆర్థిక కమిటీ సభ్యుడిగా వి.ఆంజనేయులు, జిల్లా కౌన్సిలర్‌గా ఎస్.రామ కోటయ్యలు నియమితులయ్యారు. ఇటీవల జగ్గయ్యపేటలో జరిగిన రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం కౌన్సిల్ సమావేశంలో నూతన కార్యవర్గం ఎన్నుకున్నారన్నారు.

పీఏసీఎస్‌లో వారోత్సవాలు ప్రారంభం

తిరువూరు, గంపలగూడెం, న్యూస్‌టుడే: తిరువూరు మండలం లక్ష్మీపురం పీఏసీఎస్‌లో శుక్రవారం 72వ అఖిల భారత సహకార వారోత్సవాలను ప్రారంభించారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు సహకార సంఘాలు అత్యుత్తమైన సేవలు అందిస్తున్నట్లు వక్తలు తెలిపారు. పీఏసీఎస్ ఛైర్‌పర్సన్ ఎన్.ప్రమీల, సీఈవో బి.రఘురామ్, సభ్యులు ఎం.నరసింహారావు, కె.పుల్లయ్య పాల్గొన్నారు.

రసాయన ఎరువుల వాడకం తగ్గించాలి



రైతులకు సూచనలిస్తున్న శ్రీనివాసరావు, సూరిబాబు తదితరులు

జి.కొండూరు, న్యూస్‌టుడే: రసాయన ఎరువులు, పురుగుమందులు వాడకం తగ్గించాలని మైలవరం ఏడీఏ ఎం శ్రీనివాసరావు రైతులకు సూచించారు. కుంటముక్కలలో వరి పొలాలను పొలంబడిలో భాగంగా శుక్రవారం పరిశీలించి మాట్లాడారు. పంటలపై ఎరువులు, పురుగుమందులు వాడే సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. మండల వ్యవసాయాధికారి సూరిబాబు, వీఏఏలు, తెదేపా నాయకులు సుఖవాసి శ్రీహరి, లంకా రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మళ్లీ సింగపూర్-ఆంధ్రప్రదేశ్ అనుబంధం

- కీలక ఒప్పందంపై రెండు దేశాల సంతకాలు
- ప్రభుత్వోద్యోగులు, మానవ వనరులకు సింగపూర్ శిక్షణ

విశాఖపట్నం నుంచి ఈనాడు ప్రత్యేక ప్రతినిధి

వివిధ రంగాల్లో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంతో కలిసి పనిచేసేందుకు, రాష్ట్రంలో పెట్టుబడుల్ని ప్రోత్సహించేందుకు సింగపూర్ ప్రభుత్వం కీలక ఒప్పందం చేసుకుంది. సుస్థిర పట్టణాభివృద్ధి, డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్, ఆర్టీజీ, రియల్‌టైమ్ ఎకనమిక్ గవర్నెన్స్, మానవ వనరుల అభివృద్ధి అంశాల్లో ఏపీకి సింగపూర్ ప్రభుత్వం సహకరిస్తుంది. విశాఖలో నిర్వహిస్తున్న పెట్టుబడిదారుల సదస్సులో ముఖ్యమంత్రి చంద్రబాబు, సింగపూర్ హోంమంత్రి కె.షణ్ముగం సమక్షంలో విద్య, ఐటీ, ఆర్టీజీ శాఖల మంత్రి లోకేశ్... సింగపూర్ వాణిజ్యం, విదేశీ వ్యవహారాలశాఖ మంత్రి గాన్ సో హాంగ్ ఒప్పందపత్రాల్ని శుక్రవారం ఇచ్చిపుచ్చుకున్నారు. ఈ ఒప్పందంలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వోద్యోగులకు సింగపూర్ ప్రభుత్వం శిక్షణ ఇస్తుంది. ఒప్పందం అమలు పర్యవేక్షణకు ఏర్పాటుచేసిన స్టీరింగ్ కమిటీకి లోకేశ్, గాన్ సో హాంగ్ సారథ్యం వహిస్తారు. చంద్రబాబు, షణ్ముగం సలహాదారులుగా ఉంటారు. 2014-19 మధ్య రాజధాని అమరావతిలో స్టార్టప్ ఏరియా ప్రాజెక్టు చేపట్టిన సింగపూర్ కన్సార్షియంను జగన్ ప్రభుత్వం తీవ్రంగా వేధించి రాష్ట్రం నుంచి తరిమేసింది. అప్పట్లో సింగపూర్‌కి ఎదురైన చేదు అనుభవాన్ని బట్టి ఆ దేశం మరోసారి ఏపీవైపు చూస్తుందని ఎవరూ అనుకోలేదు. కానీ చంద్రబాబుపై భరోసాతో... ఏపీ ప్రభుత్వంతో కలిసి పని చేసేందుకు సింగపూర్ సిద్ధమైంది. పెట్టుబడిదారుల సదస్సుకు రెండో పెద్ద బృందం సింగపూర్ నుంచే వచ్చింది.



సీఎం చంద్రబాబు, సింగపూర్ మంత్రి షణ్ముగం సమక్షంలో ఏపీ-సింగపూర్ మధ్య ఎంఓయూ పత్రాలు మార్చుకుంటున్న మంత్రి లోకేశ్, సింగపూర్ మంత్రి గాన్ సో హాంగ్

సింగపూర్ వస్తోంది
సీఎం చంద్రబాబు

'సింగపూర్ ప్రభుత్వం మళ్లీ వస్తోంది. వారితో ఎంఓయూ కుదుర్చుకుంటున్నాం. ప్రపంచ బ్యాంకు ద్వారా వారు మళ్లీ వస్తున్నారు. వారు అమరావతికి సాయం చేయడానికే కాదు.. రాష్ట్రం మొత్తానికి మార్గదర్శకంగా ఉంటారు. సామర్థ్య నిర్మాణం, ఉత్తమ పాలనా విధానాలపై వారు మార్గదర్శనం చేస్తారు' అని జాతీయ పత్రికలు ఎకనమిక్ టైమ్స్, బిజినెస్ స్టాండర్డ్‌లకు ఇచ్చిన ఇంటర్వ్యూల్లో చంద్రబాబు చెప్పారు.

జూబ్లీహిల్స్ 'హస్త'గతం

(మొదటి పేజీ తరువాయి)

కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్ 24,729 ఆధిక్యంతో భారాస అభ్యర్థి మాగంటి సునీత గోపీనాథ్‌పై ఘన విజయం సాధించారు. దాదాపు 12 శాతం ఓట్ల ఆధిక్యం లభించింది. ద్వితీయ స్థానంలో భారాస నిలవగా.. భాజపాకు డిపాజిట్ గల్లంతైంది. శుక్రవారం యూసుఫ్‌గూడలోని కోట్ల విజయభాస్కర్‌రెడ్డి ఇండోర్ స్టేడియంలో ఓట్ల లెక్కింపు జరిగింది. మధ్యాహ్నానికే పూర్తి ఫలితం వెల్లడైంది. ఈ ఎన్నికలో నోటాతో కలిపి 59 మంది అభ్యర్థులు పోటీ పడ్డారు.


జూబ్లీహిల్స్‌లో గెలుపొందిన నవీన్‌యాదవ్‌ను సన్మానిస్తున్న తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి, మహేశ్‌కుమార్‌గౌడ్. చిత్రంలో భట్టి, పొన్నం తదితరులు

తొలిరౌండ్ నుంచి పైచేయి'

జూబ్లీహిల్స్ నియోజకవర్గంలోని ఏడు డివిజన్లలో 407 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. ఎన్నికల సంఘం ఓట్ల లెక్కింపునకు సరికొత్తగా 42 టేబుళ్లను ఏర్పాటు చేసింది. సాధారణంగా అసెంబ్లీ ఎన్నికల్లో 14 టేబుళ్లను ఏర్పాటు చేస్తారు. 42 టేబుళ్లను ఏర్పాటు చేయడంతో పది రౌండ్లలో లెక్కింపు పూర్తయింది. తుది ఫలితం వెల్లడయ్యే సరికి 24,729 ఓట్ల ఆధిక్యం వచ్చింది. సిటింగ్ స్థానాన్ని భారాస కోల్పోయింది. గతంలో సికింద్రాబాద్ కంటోన్మెంట్ నియోజకవర్గాన్ని కూడా భారాస ఉప ఎన్నికలో కోల్పోయింది.

పోరాడి ఓడిన భారాస

జూబ్లీహిల్స్‌లో భారాసకు మంచి పట్టు ఉంది. ఇది సిటింగ్ స్థానం. 2009లో ఆవిర్భవించిన నియోజకవర్గంలో మొదట కాంగ్రెస్ విజయం సాధించింది. 2014లో తెదేపా తరఫున మాగంటి గోపీనాథ్ విజయం సాధించి భారాసలో చేరారు. తర్వాత 2018, 2023లలో గెలిచి హ్యాట్రిక్ సొంతం చేసుకున్నారు. జీహెచ్ఎంసీ ఎన్నికల్లోనూ పార్టీ తిరుగులేని ఆధిపత్యం సాధించింది. ఏడు డివిజన్లలో అయిదు భారాస, రెండు ఎంఐఎం గెలిచాయి. ఉప ఎన్నికలో సానుభూతి పవనాలు ఉంటాయని పార్టీ ఆశించింది. ప్రభుత్వ వ్యతిరేక ఓటు, భారాస సంప్రదాయ ఓటు, మైనార్టీల ఓట్లు, కాంగ్రెస్ ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు అమలు చేయకపోవడం కలిసి వస్తాయని అంచనా వేసింది. ముందస్తు సర్వేల్లో భారాసకు తిరుగులేని ఆధిపత్యం ఉందని తేలినట్లు ప్రచారం జరిగింది. నిఘా వర్గాల సర్వేలలోనూ ఇదే వెల్లడైంది. పోలింగ్ తేదీ సమీపిస్తున్న కొద్దీ భారాస గ్రాఫ్ పడిపోయినట్లు రాజకీయ విశ్లేషకుల అభిప్రాయంగా ఉంది. భారాస తరఫున కేటీఆర్ అన్నీ తానై ప్రచారం చేశారు. ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, మాజీ మంత్రులు ప్రచారంలో పాల్గొన్నారు. హరీశ్‌రావుకు పితృవియోగంతో ప్రచారానికి దూరంగా ఉండటం, పార్టీ అధినేత కేసీఆర్ ప్రచారానికి రాకపోవడం కొంత లోపంగా విశ్లేషకులు అంచనా వేస్తున్నారు.

భారాస, కాంగ్రెస్‌లకు ప్రత్యామ్నాయం భాజపానే అని ప్రచారం వేసినా...

గత ఎన్నికల్లో పోటీచేసిన లంకల దీపక్‌రెడ్డి భాజపా నుంచి మరోసారి రంగంలోకి దిగారు. దీపక్‌రెడ్డి తరఫున కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి ప్రచార బాధ్యతలను తీసుకుని విస్తృతంగా ప్రచారం చేశారు. పార్టీ అధ్యక్షుడు రామచందర్‌రావు, చివర్లో బండి సంజయ్ కూడా పాల్గొన్నారు. తమ పార్టీ.. భారాస, కాంగ్రెస్‌లకు ప్రత్యామ్నాయమని భాజపా నేతలు ప్రచారం చేశారు. కానీ కేవలం 17,061ఓట్లు మాత్రమే వచ్చాయి. గత లోక్‌సభ ఎన్నికల్లో ఈ నియోజకవర్గంలో దాదాపు 40,552 ఓట్లు వచ్చాయి. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో ఇదే అభ్యర్థికి 25,866 ఓట్లు వచ్చాయి. ప్రస్తుతం రూ.10వేల డిపాజిట్ గల్లంతైంది.

ఈ గెలుపు... బాధ్యతను మరింత పెంచింది: తెలంగాణ సీఎం

జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో గెలుపు కాంగ్రెస్ పార్టీ బాధ్యతను మరింత పెంచిందని, రాష్ట్రాభివృద్ధికి మరింత కృషి చేస్తామని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. రెండేళ్లుగా ప్రజా ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు ఆశీర్వాదం లభించడంతో కాంగ్రెస్‌కు 51% ఓట్లు వచ్చాయన్నారు.

జూబ్లీహిల్స్‌లో ఎవరికి ఎన్ని ఓట్లు వచ్చాయంటే...

మొత్తం ఓట్లు	:	4,01,365	
ఈవీఎంలలో పోలైనవి	:	1,94,631	(48.49శాతం)
పోస్టల్ ఓట్లు	:	101	
ఇందులో చెల్లనివి		5	
కాంగ్రెస్	:	98,988	(50.83%)
భారాస	:	74,259	38.13%
భాజపా	:	17,061	8.76%
స్వతంత్రులు		1,608	0.83%
నోటా	:	924	0.47%
ప్రజాస్వామ్య పార్టీల కూటమి	:	232	0.12%
ఇతరులు	:	1,655	0.85%

ఎన్డీయే ప్రభంజనం

(మొదటి పేజీ తరువాయి)

అయోమయం, నేతల మధ్య సమన్వయ లోపంవల్ల విపక్ష కూటమి చతికిలపడింది. లోక్‌సభ ఎన్నికల్లో కొంత వెనుకంజ తర్వాత హరియాణా, మహారాష్ట్ర, దిల్లీల్లో ప్రభంజనం.. తాజాగా బిహార్‌లో ఘన విజయం ఎన్డీయేకు సరికొత్త ఉత్సాహాన్నిచ్చినట్లయింది.

- బిహార్‌లోని 9 రీజియన్లలోనూ ఎన్డీయే కూటమి భారీ విజయాలను నమోదు చేసింది. ముస్లింల ప్రాబల్యమున్న సీమాంచల్‌లాంటి ప్రాంతాల్లోనూ ఆర్జేడీని మట్టికరిపించింది. ముస్లిం-యాదవ్‌ల సమీకరణాన్ని నమ్ముకున్న మహాగఠ్‌బంధన్ ఆ వర్గాలకు పట్టున్న చోట్లా పాగా వేయలేకపోయింది.
- ఈ ఎన్నికల్లో ఎన్డీయే తలకెత్తుకున్న మహిళ-యువత (ఎం-వై) సూపర్‌హిట్‌కాగా.. ఆర్జేడీ ఫార్ములా ముస్లిం-యాదవ్ (ఎం-వై) అట్టర్ ఫ్లాప్ అయింది.
- ఎన్డీయే విజయంతో బిహార్‌లోని పట్నాలో, దేశ రాజధాని దిల్లీలో ఆయా పార్టీల సంబరాలు అంబరాన్నంటాయి. నీతీశ్ నివాసంవద్ద 'టైగర్ అభీ జిందా హై' అనే పోస్టర్లు దర్శనమిచ్చాయి. ఆయన ఇంకా అలసిపోలేదని, పాలించే సత్తా ఇంకా ఉందని కార్యకర్తలు వ్యాఖ్యానించారు.
- 32 సీట్లలో పోటీ చేసిన ఒవైసీ నేతృత్వంలోని ఎంఐఎం 5 సీట్లు గెలుచుకుంది. ఈ పార్టీ ముస్లిం ప్రాబల్య ప్రాంతాల్లో ఆర్జేడీని దెబ్బతీసినట్లు తెలుస్తోంది.

ఆర్జేడీ అతి పేలవ ప్రదర్శన

పలు సర్వేల్లో ముఖ్యమంత్రి అభ్యర్థిగా ముందున్న ఆర్జేడీ నేత తేజస్వీ యాదవ్.. పార్టీని గెలిపించడం మాట అటుంచి తానే సొంతంగా సాధారణ మెజారిటీతో గెలిచారు. రాఘోపుర్‌లో ఎన్డీయే నేత తొలుత ఆయనను ఓడించినంత పని చేశారు. 141 సీట్లలో పోటీ చేసిన ఆర్జేడీ కేవలం 25 చోట్ల గెలిచి పార్టీ చరిత్రలోనే అత్యంత పేలవ ప్రదర్శన చేసింది. 61 చోట్ల పోటీ చేసిన కాంగ్రెస్ మరీ ఘోరంగా 6 చోట్లే గెలిచింది. 20 చోట్ల పోటీ చేసిన లెఫ్ట్ పార్టీలు 3 చోట్ల విజయం సాధించాయి. 12 చోట్ల పోటీ చేసిన వికాస్‌శీల్ ఇన్సాన్ పార్టీ ఒక్కచోటా గెలవలేదు.

- కాంగ్రెస్ పార్టీ రాష్ట్రశాఖ అధ్యక్షుడు రాజేశ్ కుమార్ తాను పోటీ చేసిన కుతుంబ సీట్లో ఓటమి పాలయ్యారు. ప్రస్తుత అసెంబ్లీలో పార్టీ పక్ష నేత షకీల్ అహ్మద్.. జేడీయూ అభ్యర్థి దులాల్ చంద్ర గోస్వామి చేతిలో ఓడిపోయారు.

గెలిచిన ఎన్డీయే ప్రముఖులు

సామ్రాట్ చౌధరి, విజయ్ కుమార్ సిన్హా, ప్రేమ్ కుమార్, మహేశ్వరీ హజారీ, సంజయ్ సారోగి, మైథిలీ ఠాకుర్.

గెలిచిన మహాగఠ్‌బంధన్ ప్రముఖులు

తేజస్వీ యాదవ్, ఒసామా షాహబ్, సందీప్ సౌరవ్.

పార్టీల వారీగా గెలుపొందిన సీట్లు

భాజపా:	89 (20.08%)
జేడీయూ:	85 (19.25%)
ఆర్జేడీ:	25 (23%)
ఎల్జేపీ:	19 (4.97%)
కాంగ్రెస్:	6 (8.71%)
ఎంఐఎం:	5 ((1.85%)
హెచ్ఏఎం:	5 (--)
ఆర్ఎల్ఎం:	4 (--)
సీపీఐ (ఎంఎల్)(లిబరేషన్):	2 (2.84%)
ఇండియన్ ఇంక్లూసివ్ పార్టీ:	1 (--)
సీపీఎం:	1 (0.60%)
బహుజన్ సమాజ్‌పార్టీ:	1 (1.62%)
నోటా:	(1.81%)



పట్నాలో భాజపా మద్దతుదారుల విజయోత్సాహం ★ పట్నాలో విజయ సంకేతం చూపుతున్న లోక్ జనశక్తి పార్టీ (రాం విలాస్) అధినేత చిరాగ్ పాస్వాన్

- జన్ సురాజ్ పార్టీ నేత హత్య కేసులో ప్రమేయముందనే ఆరోపణలతో జైలుపాలైన అనంత్ సింగ్.. ఆర్జేడీ నేత సూరజ్‌భాన్ సింగ్ సతీమణి వీణాదేవిని ఓడించారు.

మహిళలే ఆయువుపట్టు

ఎన్డీయే ప్రభంజనానికి మహిళలే ఆయువుపట్టుగా నిలిచారు. రాష్ట్రంలో పురుషుల కంటే 10 శాతం అధికంగా మహిళలు ఓటేశారు. వీరంతా ఎన్డీయేకే పట్టం కట్టినట్లు తెలుస్తోంది.

- 125 యూనిట్ల ఉచిత విద్యుత్తు, సామాజిక పింఛన్ల పెంపు, ముఖ్యమంత్రి రోజ్‌గార్ యోజన పేరుతో దాదాపు కోటి మంది మహిళల ఖాతాల్లో 10,000 జమ వంటివి ఎన్డీయే విజయానికి దోహదం చేశాయి.
- దీంతోపాటు ఆర్జేడీ వస్తే జంగిల్‌రాజ్ మళ్లీ వస్తుందని మోదీ ప్రచారం చేయడం కలిసివచ్చింది.
- ఆశా, అంగన్‌వాడీ జీవికలతోపాటు అసంఘటిత రంగంలో కార్మికులకు స్టైపెండ్ రెట్టింపు చేస్తామని ఇచ్చిన హామీ ఫలితాలనిచ్చింది.
- హామీలు ఇవ్వడంలో ఆర్జేడీ వెనుకబడిపోయింది. ఎన్డీయే కొన్నింటిని అమలు చేయడంతోపాటు మరికొన్నింటిని అమలు చేస్తామని చెప్పిన తర్వాత తేజస్వీ మేలుకున్నారు. అప్పటికే నష్టం జరిగిపోయింది. ఇంటికో ఉద్యోగం ఇస్తామన్న ఆయన హామీని ఆర్జేడీ కార్యకర్తలే నమ్మలేదు.
- మద్య నిషేధం కూడా ఎన్డీయేకు కలిసివచ్చింది. రాష్ట్రంలో దాదాపు 20శాతం దాకా ఉన్న దళితుల ఓట్లను సాధించేందుకు పాస్వాన్, మాంఝీలను ఎన్డీయేలో భాజపా చేర్చుకుంది. అది విజయవంతమైంది.

బిహార్‌లో ఎన్డీయే విజయం చరిత్రాత్మకం: చంద్రబాబు

ఈనాడు, అమరావతి: బిహార్‌లో ఎన్డీయే ఘనవిజయం చరిత్రాత్మకమని ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు. ప్రధాని మోదీ నేతృత్వంలోని ప్రగతిశీల పాలనా సామర్థ్యంపై ప్రజలకున్న నమ్మకానికి ఇది నిదర్శనమని 'ఎక్స్' వేదికగా కొనియాడారు.

మోదీపై ప్రజా విశ్వాసం రుజువైంది: పవన్‌కల్యాణ్

మోదీ నాయకత్వంలోనే భారతదేశ సమగ్రాభివృద్ధి, సుస్థిర పాలన సాధ్యమని ప్రజలు విశ్వసిస్తున్నారని.. ఈ విషయం బిహార్ అసెంబ్లీ ఎన్నికల్లో మరోసారి రుజువైందని ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ తెలిపారు.

మోదీ నాయకత్వంపై ప్రజావిశ్వాసం: లోకేశ్

ప్రధాని మోదీ నాయకత్వంపై ఉన్న ప్రజా విశ్వాసానికి బిహార్‌లో ఎన్డీయే గెలుపు నిదర్శనమని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ తెలిపారు. ముఖ్యమంత్రి నీతీశ్‌కుమార్‌కు 'ఎక్స్' వేదికగా శుభాకాంక్షలు తెలిపారు.

రైల్వే డీసీఎం బాధ్యతల స్వీకరణ

విజయవాడ (రైల్వేస్టేషన్), న్యూస్‌టుడే: విజయవాడ డివిజనల్ కమర్షియల్ మేనేజరు(డీసీఎం)గా కె.కమలాకరబాబు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. గుంటూరులో డీసీఎంగా పని చేస్తూ ఇక్కడికి బదిలీపై వచ్చారు. గతంలో విజయవాడ ఏసీఎంగా పని చేశారు. ఈ సందర్భంగా కార్యాలయ సిబ్బంది ఆయనకు అభినందనలు తెలియజేశారు.


కమలాకరబాబు

సంజయ్‌కు రిమాండ్ పొడిగింపు

ఈనాడు - అమరావతి: ఐపీఎస్ అధికారి సంజయ్‌కు ఏసీబీ కోర్టు రిమాండ్ పొడిగించింది. శుక్రవారంతో రిమాండ్ ముగియనుండడంతో అనిశా అధికారులు సంజయ్‌ను న్యాయాధికారి ఎదుట హాజరుపరిచారు. ఈనెల 24 వరకు పొడిగిస్తూ ఏసీబీ కోర్టు న్యాయాధికారి భాస్కరరావు ఆదేశాలు ఇచ్చారు. తర్వాత విజయవాడలోని జిల్లా కారాగారానికి తరలించారు. సీఐడీ, అగ్నిమాపక శాఖలో పనిచేసిన సమయంలో అక్రమాలకు పాల్పడిన కేసులో ఐపీఎస్ అధికారి సంజయ్ ఆగస్టు, 26న ఏసీబీ కోర్టులో లొంగిపోయిన సంగతి తెలిసిందే. అప్పటి నుంచి జ్యుడీషియల్ రిమాండ్‌లో ఉన్నారు.

బాలాజీ గోవిందప్ప బెయిల్ షరతుల సడలింపు పిటిషన్‌పై విచారణ వాయిదా

ఈనాడు - అమరావతి: మద్యం కేసులో తన బెయిల్ షరతులను సడలించాలని నిందితుడు బాలాజీ గోవిందప్ప వేసిన పిటిషన్‌పై విచారణ వాయిదా పడింది. ఈ పిటిషన్ శుక్రవారం విజయవాడలోని ఏసీబీ కోర్టులో విచారణకు వచ్చింది. ప్రాసిక్యూషన్ కౌంటర్ వేసేందుకు ఈనెల 19వ తేదీకి వాయిదా పడింది. సిట్ అధికారులు సీజ్ చేసిన కారు తమ సంస్థకు చెందిందనీ.. సత్యం ఇస్పాత్ ప్రైవేట్ లిమిటెడ్ పిటిషన్ వేసింది. దీనిపై కౌంటర్ దాఖలు చేయాలని సిట్‌ను ఆదేశిస్తూ విచారణను 19కి కోర్టు వాయిదా వేసింది.

ఆన్‌లైన్ సర్టిఫికెట్ కోర్సులకు దరఖాస్తుల ఆహ్వానం

జిల్లాపరిషత్తు(గుంటూరు), న్యూస్‌టుడే: ఆచార్య ఎన్.జి.రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం 2025, డిసెంబరులో ప్రారంభించనున్న ఆన్‌లైన్ సర్టిఫికెట్ కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని వర్సిటీ రిజిస్ట్రార్ ఎం.వి.రమణ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. తేనెటీగల పెంపకం, సేంద్రియ వ్యవసాయం కోర్సుల్లో ప్రవేశాలకు ఆసక్తి గల అభ్యర్థులు నవంబరు 30 లోపు రూ.1,500 చొప్పున ఫీజు చెల్లించి పేరు నమోదు చేసుకోవాలన్నారు. పూర్తి వివరాలకు www.angrau.ac.in వెబ్‌సైట్‌ని చూడాలన్నారు. 90632 19959, 80960 85560 నంబర్లలో ఉదయం 9 నుంచి రాత్రి 7 గంటల్లోపు సంప్రదించాలని సూచించారు.

దుర్గమ్మ దర్శనానికి పోటెత్తిన భక్తులు

ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే: కార్తికమాసాన్ని పురస్కరించుకొని ఇంద్రకీలాద్రి దుర్గమ్మ దర్శనానికి భక్తులు పోటెత్తారు. వేకువ జాము నుంచి భక్తులు తరలి రావడంతో క్యూలైన్లు కిటకిటలాడాయి. ఘాట్ రోడ్డు, కనకదుర్గానగర్ మెట్ల మార్గాల్లో భక్తుల వాహనాలు నిండిపోయాయి. దీంతో భక్తులు కెనాల్ రోడ్డులో వాహనాలు నిలిపి కనకదుర్గానగర్ లిఫ్టు మార్గంలో అమ్మవారి దర్శనం చేసుకున్నారు. దర్శనానికి 60 వేల మంది భక్తులు వచ్చారని అధికారులు భావిస్తున్నారు. మధ్యాహ్నం అమ్మవారికి 12.15 గంటలకు నివేదన సమర్పించిన తర్వాత 2.30 గంటల వరకు వీఐపీ టికెట్ల విక్రయాలు భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకొని నిలిపివేశారు. భక్తుల రద్దీ తగ్గిన తర్వాత అనుమతించారు.


క్యూలైన్లో దర్శనానికి బారులు

8వ వేతన సంఘంపై ఉద్యోగుల అసంతృప్తి
ఏఐఆర్ఎఫ్ జాతీయ ప్రధాన కార్యదర్శి శివగోపాల్ మిశ్రా



సమావేశంలో శివగోపాల్ మిశ్రా, శంకరరావు, శ్రీనివాసరావు, గుప్తా తదితరులు

విజయవాడ (రైల్వేస్టేషన్), న్యూస్‌టుడే: 8వ వేతన సంఘం విషయంలో కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన టర్మ్ ఆఫ్ రిఫరెన్స్ నిబంధనలపై రైల్వే ఉద్యోగులు తీవ్ర అసంతృప్తితో ఉన్నారని ఏఐఆర్ఎఫ్ జాతీయ ప్రధాన కార్యదర్శి శివగోపాల్ మిశ్రా పేర్కొన్నారు. శుక్రవారం యూనియన్ కార్యాలయంలో నిర్వహించిన దక్షిణ మధ్య రైల్వే మజ్దూర్ యూనియన్ 55వ జనరల్ కౌన్సిల్ సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. నాన్ కంట్రిబ్యూటరీ, ఫండెడ్ వంటి పదాలను ఉపయోగించడం ద్వారా పింఛనును ఉద్యోగి హక్కుగా కాకుండా ప్రభుత్వంపై ఏర్పడే భారంగా దృష్టితో చూసే పరిస్థితి ఉందని ఇది ఉద్యోగ విరమణ చేసిన వారిలో ఆందోళన కలిగిస్తుందని చెప్పారు. 8వ వేతన సంఘాన్ని ఈ ఏడాది 2025 జనవరిలో ఏర్పాటు చేసినప్పటికీ నియమ, నిబంధనలను మాత్రం 11 నెలల తరువాత ప్రకటించడం విచారకరమన్నారు. తుది నివేదికతో సంబంధం లేకుండా వేతనాలు, అలవెన్సులు 2026 జనవరి 1 నుంచి అమల్లోకి తేవాలని కోరారు. రాష్ట్ర పునర్విభజన బిల్లు ప్రకారం దక్షిణ కోస్తా రైల్వే జోన్‌ను మంజూరు చేసినా ఐదేళ్లు ఆలస్యం జరిగిందని క్యాబినెట్ ఆమోదం పొందినప్పటికీ ఇప్పటి వరకు గెజిట్ నోటిఫికేషన్ జారీ కాలేదని చెప్పారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ దృష్టి పెట్టాలని కోరారు. ఖాళీలు భర్తీ చేయకపోవడంతో ఉన్న సిబ్బందిపై అదనపు భారం పడుతుందని వందేభారత్ చెప్పారు. మజ్దూర్ యూనియన్ ప్రధాన కార్యదర్శి సి.హెచ్.శంకరరావు మాట్లాడుతూ.. ట్రాక్ మెయింటెనర్, పాయింట్స్ మెన్ క్యాడర్‌లకు రూ.4200 గ్రేడ్ పే మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో యూనియన్ డివిజనల్ కార్యదర్శి లీల, రామగుప్తా, జి.ఎన్.శ్రీనివాసరావు, జి.ఉదయ్‌భాస్కర్, టి.మహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీలో పదోన్నతుల తికమక!

ఖాళీలు చూపకపోవడంపై సంఘాల్లో కినుక

ఈనాడు - అమరావతి

ఆరేళ్లుగా ఎదురుచూస్తున్న ఆర్టీసీ ఉద్యోగులకు కూటమి సర్కారు పదోన్నతుల వరమిచ్చింది. అయితే.. .. క్షేత్రంలో పదోన్నతుల ప్రక్రియ విషయంలో ఉద్యోగులు, ఉద్యోగ సంఘాలు అసంతృప్తిగా ఉన్నాయి. పదోన్నతుల వల్ల కింది స్థాయి కేడర్లలో ఖాళీ అయిన స్థానాల భర్తీపై స్పష్టత కొరవడటంతో సమస్య ఉత్పన్నమైంది. కేంద్ర కార్యాలయం ఖాళీ చూపమని ఆదేశించినా.. జిల్లా అధికారులు తమకు ఆదేశాలు రాలేదని దాటేస్తున్నారని సంఘాల సభ్యులు పెదవి విరుస్తున్నారు.

ప్రమోషన్లకు అనాసక్తి...

ఉమ్మడి జిల్లాలో ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ (టీఐ3) నుంచి ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్(టీఐ2)కి పదోన్నతి రావడంతో 12 టీఐ3 పోస్టులు ఖాళీ అవుతున్నాయి. పదోన్నతులతో సంబంధం లేకుండా గతం నుంచి 22 పోస్టులు ఖాళీ ఉన్నాయి. మొత్తంగా 34 పోస్టులు ఖాళీ అవుతున్నాయి. అలాగే టీఐ2 నుంచి ఎస్‌టీఐగా జిల్లాలో 10 మంది పదోన్నతి పొందారు. ఈ స్థానాల భర్తీపై అస్పష్టత ఉంది. పదోన్నతి వచ్చిన ఉద్యోగుల ఖాళీలు చూపక పోవడంతో ఖాళీలపై స్పష్టత లేక.. ఒకవేళ పదోన్నతిపై బదిలీ అయితే ఎంత దూరం వెళ్లాలో తెలియక చాలా మంది ప్రమోషన్లకు సైతం అన్ విల్లింగ్ ఇచ్చారు.

విధులకు ఇబ్బంది...

- జగ్గయ్యపేట డిపోలో ముగ్గురు టీఐ3 ఉద్యోగులు ఉండగా తాజాగా వారిలో ముగ్గురికి టీఐ2గా పదోన్నతులు వచ్చాయి.
- విజయవాడ బస్టాండ్‌లో ఇదే స్థాయి ఉద్యోగులు ఐదుగురు ఉంటే పదోన్నతుల తర్వాత రెండు ఖాళీలు వచ్చాయి.
- టీఐలు డిపోల్లో ఎర్నింగ్స్, ఆదాయం బ్యాంకుల్లో జమ, బస్సుల ఆయిల్ నిర్వహణ, ఉద్యోగుల సెలవులను బట్టి డ్యూటీ చార్ట్ తయారీ వంటి బాధ్యతలు నిర్వహిస్తారు. ఈ పోస్టులు ఖాళీ అయినా భర్తీపై స్పష్టత లేక విధులకు ఇబ్బంది కలుగుతుందనేది సంఘాల నాయకుల మాట.
- తాత్కాలిక బాధ్యతలు ఎవరికైనా అప్పగించినా పూర్తిగా ఆ విధులకు న్యాయం జరగదని వాపోతున్నారు.
- ఈ అంశంపై ఆర్టీసీ అధికారులను వివరణ అడిగేందుకు చరవాణిలో ప్రయత్నించగా అందుబాటులోకి రాలేదు.

గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలు

విజయవాడ(గవర్నర్‌పేట), న్యూస్‌టుడే: గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలని సినీనటుడు ఆర్.నారాయణమూర్తి పేర్కొన్నారు. జాతీయ పుస్తక వారోత్సవాల సందర్భంగా శుక్రవారం విజయవాడ పుస్తక మహోత్సవ గ్రంథాలయంలో ఏర్పాటు చేసిన పుస్తక ప్రదర్శనను నారాయణమూర్తి ప్రారంభించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన కృష్ణాజిల్లా పూర్వపు కలెక్టర్ ఎ.ఎం.డి.ఇంతియాజ్ మాట్లాడుతూ తెలుగు సాహిత్యానికి విజయవాడ పుస్తక మహోత్సవ కమిటీ పెద్ద పీట వేస్తోందని, జాతీయ పుస్తక వారోత్సవాల్లో పిల్లలు, పెద్దలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. పుస్తక మహోత్సవ కమిటీ అధ్యక్షుడు మనోహర్‌నాయుడు మాట్లాడుతూ ఈనెల 14 నుంచి 20 వరకు గ్రంథాలయంలో పుస్తక ప్రదర్శన నిర్వహిస్తామని తెలిపారు. పిల్లలు, పెద్దలకు కావాల్సిన అన్నిరకాల పుస్తకాలు లభ్యమవుతాయని, ఈ సందర్భంగా అన్ని పుస్తక దుకాణాల్లో 10 శాతం తగ్గింపు ఇస్తామని తెలిపారు. కార్యక్రమంలో కమిటీ ఉపాధ్యక్షుడు జె.ప్రసాద్, సహాయ కార్యదర్శి ఎ.బి.ఎస్.సాయిరామ్, కోశాధికారి కె.రవి, సభ్యులు గోళ్ల నారాయణరావు, వి.శ్రీనివాస్, బి.రవి తదితరులు పాల్గొన్నారు.


పుస్తక ప్రదర్శనలో నారాయణమూర్తి, ఇంతియాజ్, మనోహర్‌నాయుడు తదితరులు


మాట్లాడుతున్న ఛైర్మన్ ఆంజనేయులు

అఖిలభారత సహకార వారోత్సవాలు ప్రారంభం

చిట్టినగర్: సమష్టి కృషి, పారదర్శకత, పరస్పర నమ్మకం విలువలతోనే సహకార వ్యవస్థ బలపడుతుందని కృష్ణామిల్క్ యూనియన్ ఛైర్మన్ చలసాని ఆంజనేయులు అన్నారు. విజయ డెయిరీలో 72వ అఖిల భారత సహకార వారోత్సవాలను శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న సహకారంతో ఈ వ్యవస్థలు మరింత బలోపేతం అవుతాయని చెప్పారు. సహకార భారతి రాష్ట్ర అధ్యక్షుడు యడ్లపాటి రఘునాథబాబు మాట్లాడుతూ.. నిజమైన సహకార భావాలతో నడిచే సంస్థ విజయ డెయిరీలో ఈ వారోత్సవాలు ప్రారంభించడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. ఈనెల 14 నుంచి 20వ తేదీ వరకు ఈ వారోత్సవాలు జరుగుతాయని వివరించారు. కార్యక్రమంలో విజయ డెయిరీ ఎం.డి. కొల్లి ఈశ్వరబాబు, అఖిల భారత సహ సంపర్క్ ప్రముఖ్ అడ్డూరి శ్రీనివాసరావు, సహకార భారతి రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎస్. శ్రీనివాసరావు, సమన్వయకర్త నరసయ్య పాల్గొన్నారు.

పేదల ఉసురు తీసిన ప్రహరీ
ఇద్దరు మృతి.. మరొకరికి తీవ్ర గాయాలు

పెనుగంచిప్రోలు, న్యూస్‌టుడే: ఇంటి ముందున్న సిమెంటు రోడ్డుపై కూర్చున్న నిరుపేదలపై ప్రహరీ పడడంతో ఇద్దరు మృతి చెందగా.. మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. పెనుగంచిప్రోలు మండలం గుమ్మడిదురు ఎస్సీ కాలనీలో శుక్రవారం మధ్యాహ్నం ఈ దుర్ఘటన జరిగింది. ఎస్సీ కాలనీలో డ్రెయిన్ నిర్మాణానికి జిల్లా పరిషత్ నిధులు రూ.5 లక్షలు మంజూరయ్యాయి. దీంతో సిమెంటు రోడ్డు పక్కన డ్రెయిన్ నిర్మించేందుకు గుత్తేదారుడు గురువారం జేసీబీతో బారుగా గుంత తవ్వించారు. కాలనీకి చెందిన కోట చంటి హైదరాబాద్‌లో ఉంటారు. ఆయన ఇంటి ప్రహరీ పక్కన కూడా జేసీబీతో తవ్వి మట్టి తొలగించారు. గోడకు భూమిలో పునాది లేకపోవడంతో పట్టు లేదు. గ్రామంలోనే వేరే ప్రాంతంలో ఉంటున్న కలపాల స్వరాజ్యం(65) కుమార్తె మేరీమాత ఇంటికి వచ్చారు. స్వరాజ్యం.. అదే కాలనీకి చెందిన ఆకుల ఏసు (46), పోయల తిరుపతమ్మలతో కలిసి చంటి ఇంటి ఎదురుగా సిమెంటు రోడ్డుపై కూర్చుని మాట్లాడుకుంటున్నారు. ఆ సమయంలో ఒక్కసారిగా గోడ కూలి వారిపై పడింది. వెంటనే స్థానికులు గోడ శిథిలాల కింద ఉన్నవారిని బయటికి తీశారు. అప్పటికే స్వరాజ్యం మృతి చెందారు. తీవ్ర గాయాలైన ఏసును గ్రామ సర్పంచి నక్కా మేరీ కమలమ్మ భర్త సుధాకర్ కారులో నంది గామ వైద్యశాలకు తీసుకెళ్లగా.. చికిత్స పొందుతూ మృతి చెందారు. తిరుపతమ్మకు గాయాలవ్వగా తొలుత నందిగామ ప్రభుత్వ వైద్యశాలకు.. అనంతరం విజయవాడలో ఆసుపత్రికి తీసుకెళ్లారు. ఘటనా స్థలాన్ని సీఐ వెంకటేశ్వర్లు, ఎస్ఐ అర్జున్, తహసీల్దారు శాంతలక్ష్మి, ఎంపీడీవో శ్రీను పరిశీలించారు. మృతదేహాలను నందిగామ శవాగారానికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


కూలిన గోడ


మృతుడు ఏసు


స్వరాజ్యం (పాతచిత్రం)

ఎస్సీ కాలనీలో విషాదం : రోజువారీ కూలి పనులతో జీవనం సాగిస్తున్న కుటుంబాల్లో జరిగిన ఈ ప్రమాదంతో కాలనీలో విషాదం అలుముకుంది. స్వరాజ్యం, ఏసులు పనికి వెళ్తేనే ఇల్లు గడుస్తుంది. స్వరాజ్యానికి ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. పిల్లలందరికీ వివాహాలయ్యాయి. కుమార్తె, కుమారుడు గుమ్మడిదురులోనే ఉంటున్నారు. వీరిలో కుమార్తె మేరీమాత దివ్యాంగురాలు. మరో ఇద్దరు ఖమ్మంలో ఉంటారు. కుమార్తె ఇంటికి వచ్చిన కాసేపటికే గోడ కూలి మృతి చెందడంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. గ్రామానికి చెందిన ఏసుకు భార్య లక్ష్మి, కుమార్తె, కుమారుడు ఉన్నారు. పిల్లలకు వివాహాలు అయ్యాయి. వీరంతా రోజువారీ కూలి పనులకు వెళ్లి జీవనం సాగిస్తున్నారు. ఆయన మృతితో కుటుంబ సభ్యులు గుండెలవిసేలా రోదిస్తున్నారు.

ఏపీ ప్రభుత్వ వైద్యుల నూతన సంఘ ఎన్నిక

విజయవాడ వైద్యం, న్యూస్‌టుడే: ఏపీ ప్రభుత్వ వైద్యుల నూతన సంఘ ఎన్నిక శుక్రవారం సిద్ధార్థ వైద్య కళాశాల ఆవరణలో నిర్వహించారు. సంఘ అధ్యక్షురాలిగా డా.ఎస్.జ్వాలిత, తొమ్మిది మంది సభ్యులతో కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారిగా డా.జగన్మోహన్‌రావు వ్యవహరించారు.


బుమ్రా 5/27

16 టెస్టుల్లో బుమ్రా ఓ ఇన్నింగ్స్‌లో 5 వికెట్లు తీసిన సందర్భాలు. భారత తరఫున అత్యధికసార్లు ఈ ఘనత సాధించిన బౌలర్ల జాబితాలో అయిదో స్థానంలో ఉన్న ఎస్.చంద్రశేఖర్‌ను బుమ్రా సమం చేశాడు.

ఛాంపియన్

గత నెల వెస్టిండీస్‌ను చిత్తు చిత్తుగా ఓడించినప్పటికీ.. నిరుడు సొంతగడ్డపై న్యూజిలాండ్ చేతిలో ఎదురైన పరాభవం తాలూకు గాయాలు పచ్చిగానే ఉన్నాయి! ఇప్పుడు ఆడబోయే ప్రత్యర్థి ప్రపంచ టెస్టు ఛాంపియన్ దక్షిణాఫ్రికా కావడంతో టీమ్‌ఇండియాకు సవాలు తప్పదనే అనుకున్నారంతా! కానీ సొంతగడ్డపై ఒక పూర్తి ఆధిపత్యాన్ని చాటుతూ సఫారీలతో టెస్టు సిరీస్‌ను ఘనంగా మొదలుపెట్టింది భారత్. ఈడెన్ గార్డెన్స్‌లో జస్‌ప్రీత్ బుమ్రా పదునైన పేస్‌తో చెలరేగిన వేళ.. ప్రపంచ ఛాంపియన్ కేవలం 55 ఓవర్లలో, 159 పరుగులకే కుప్పకూలింది. రెండో రోజు బ్యాటర్లు అంచనాలకు తగ్గట్లు రాణిస్తే.. మ్యాచ్‌పై పట్టు చిక్కినట్లే.

బూమ్ బూమ్ బుమ్రా

- 5 వికెట్లతో అదరగొట్టిన పేసర్
- 159 పరుగులకే కుప్పకూలిన దక్షిణాఫ్రికా
- తొలి టెస్టులో భారత్ 37/1

కోల్‌కతా

ఇంగ్లాండ్ పర్యటనలో, ఆ తర్వాత సొంతగడ్డపై వెస్టిండీస్ సిరీస్‌లో అంచనాలకు తగ్గట్లు రాణించలేకపోయిన టీమ్‌ఇండియా ఫాస్ట్‌బౌలర్ జస్‌ప్రీత్ బుమ్రా.. దక్షిణాఫ్రికాతో రెండు టెస్టుల సిరీస్ తొలి మ్యాచ్‌లో అదరగొట్టాడు. పేసుకు సహకరించిన ఈడెన్ పిచ్‌ను పూర్తిగా సద్వినియోగం చేసుకున్న అతడు.. పర్యాటక జట్టును బెంబేలెత్తించాడు. శుక్రవారం తొలుత బ్యాటింగ్ చేసిన దక్షిణాఫ్రికా.. బుమ్రా (5/27) ధాటికి 159 పరుగులకే కుప్పకూలింది. కుల్‌దీప్ (2/36), మహ్మద్ సిరాజ్ (2/47), అక్షర్ పటేల్ (1/21) కూడా ప్రత్యర్థి పతనంలో తమ వంతు పాత్ర పోషించారు. 31 పరుగులు చేసిన ఓపెనర్ మార్‌క్రమ్ సఫారీ జట్టులో టాప్‌స్కోరర్. అనంతరం బ్యాటింగ్ ఆరంభించిన భారత్.. ఆట చివరికి 20 ఓవర్లలో వికెట్ నష్టానికి 37 పరుగులు చేసింది. యశస్వి (12).. యాన్సెన్ బౌలింగ్‌లో బౌల్డయ్యాడు. ఆట చివరికి కేఎల్ రాహుల్ (13), వాషింగ్టన్ సుందర్ (6) క్రీజులో ఉన్నారు. 9 వికెట్లు చేతిలో ఉన్న భారత్ ఇంకా 122 పరుగులు వెనుకబడి ఉంది.


కుల్‌దీప్ 2/36

ఆశాజనకంగా మొదలై..: ఉదయం దక్షిణాఫ్రికా ఇన్నింగ్స్‌ను ఆరంభించిన తీరు చూస్తే.. సాయంత్రానికి భారత్ బ్యాటింగ్ చేస్తుందని ఎవరూ ఊహించి ఉండరు. ఓపెనర్లు మార్‌క్రమ్, రికెల్టన్ (23) నిలకడగా ఆడుతూ జట్టుకు మంచి పునాదే వేశారు. తొలి పది ఓవర్లలో ఆ జట్టు వికెట్ కోల్పోలేదు. బుమ్రా ఎంతో కట్టుదిట్టంగా బౌలింగ్ చేస్తూ సఫారీ ఓపెనర్లను పరీక్షించినప్పటికీ.. సిరాజ్‌ను ఆ ఇద్దరూ అలవోకగా ఎదుర్కొన్నారు. చేంజ్ బౌలర్‌గా వచ్చిన స్పిన్నర్ అక్షర్ కూడా పెద్దగా ఇబ్బంది పెట్టలేకపోయాడు. తొలి వికెట్‌కు అర్ధశతక భాగస్వామ్యం నమోదైంది. అయితే తొలి 5 ఓవర్లలో 9 పరుగులే ఇచ్చిన బుమ్రా.. తన స్పెల్‌ను కొనసాగించి దక్షిణాఫ్రికాకు డబుల్ షాక్ ఇచ్చాడు. ముందుగా రికెల్టన్‌ను బౌల్డ్ చేసిన అతడు.. తర్వాత మార్‌క్రమ్‌నూ వికెట్ కీపర్ క్యాచ్‌తో పెవిలియన్ చేర్చాడు. కెప్టెన్ బవుమా (3) అలా వచ్చి ఇలా వెళ్లిపోయాడు. అతను కుల్‌దీప్ వికెట్ సమర్పించుకున్నాడు. 14 పరుగుల వ్యవధిలో 3 వికెట్లు కోల్పోయిన దక్షిణాఫ్రికా 71/3తో కష్టాల్లో పడింది. ఈ దశలో ముల్డర్ (24), టోనీ డి జోర్జి (24) పోరాడడంతో లంచ్ సమయానికి ఆ జట్టు 105/3తో కాస్త పుంజుకుంది. విరామం తర్వాత సఫారీ జట్టు ఏమాత్రం నిలవలేకపోయింది. ముల్డర్‌ను కుల్‌దీప్, జోర్జిని బుమ్రా వికెట్ల ముందు దొరకబుచ్చుకుని దక్షిణాఫ్రికాను గట్టి దెబ్బ తీశారు. తర్వాత సిరాజ్ ఒకే ఓవర్లో వెరీన్ (16), యాన్సెన్ (0)లను ఔట్ చేయడంతో సఫారీ జట్టు వణికిపోయింది. ఓ ఎండ్‌లో స్టబ్స్ (15 నాటౌట్) నిలిచినా.. అవతల వికెట్ల పతనం ఆగలేదు. కార్బిన్ బోష్ (3)ను అక్షర్ పెవిలియన్ చేర్చగా.. హార్మర్ (5), కేశవ్ (0)లను ఔట్ చేసిన బుమ్రా 5 వికెట్ల ప్రదర్శన పూర్తి చేయడంతో పాటు దక్షిణాఫ్రికా ఇన్నింగ్స్‌కు తెరదించాడు.

గాయంతో రబాడ ఔట్: భారత్‌తో తొలి టెస్టు ముంగిట దక్షిణాఫ్రికాకు గట్టి ఎదురు దెబ్బ తగిలింది. ప్రాక్టీస్‌లో భాగంగా పక్కటెముకకు గాయం కావడంతో ఆ జట్టు ప్రధాన పేసర్ రబాడ ఈడెన్ టెస్టుకు దూరమయ్యాడు. అతడి స్థానంలోకి పేస్ ఆల్‌రౌండర్ కార్బిన్ బోష్ వచ్చాడు. రబాడ రెండో టెస్టులోనూ ఆడడం అనుమానమే.

దక్షిణాఫ్రికా తొలి ఇన్నింగ్స్: మార్‌క్రమ్ (సి) పంత్ (బి) బుమ్రా 31; రికెల్టన్ (బి) బుమ్రా 23; ముల్డర్ ఎల్బీ (బి) కుల్‌దీప్ 24; బవుమా (సి) జురెల్ (బి) కుల్‌దీప్ 3; జోర్జి ఎల్బీ (బి) బుమ్రా 24; స్టబ్స్ నాటౌట్ 15; వెరీన్ ఎల్బీ (బి) సిరాజ్ 16; యాన్సెన్ (బి) సిరాజ్ 0; బోష్ ఎల్బీ (బి) అక్షర్ 3; హార్మర్ (బి) బుమ్రా 5; కేశవ్ ఎల్బీ (బి) బుమ్రా 0; ఎక్స్‌ట్రాలు 15; **మొత్తం:** (55 ఓవర్లలో ఆలౌట్) **159**

వికెట్ల పతనం: 1-57, 2-62, 3-71, 4-114, 5-120, 6-146, 7-147, 8-154, 9-159; **బౌలింగ్:** బుమ్రా 14-5-27-5; సిరాజ్ 12-0-47-2; అక్షర్ పటేల్ 6-2-21-1; కుల్‌దీప్ 14-1-36-2; జడేజా 8-1-13-0; సుందర్ 1-0-3-0

భారత్ తొలి ఇన్నింగ్స్: యశస్వి (బి) యాన్సెన్ 12; రాహుల్ బ్యాటింగ్ 13; సుందర్ బ్యాటింగ్ 6; ఎక్స్‌ట్రాలు 6 **మొత్తం:** (20 ఓవర్లలో వికెట్ నష్టానికి) **37**; **వికెట్ల పతనం:** 1-18

బౌలింగ్: యాన్సెన్ 6-2-11-1; ముల్డర్ 5-1-15-0; కేశవ్ మహరాజ్ 5-1-8-0; కార్బిన్ బోష్ 3-2-1-0; హార్మర్ 1-1-0-0

ఆరుగురితో అరుదైన కూర్పు


గిల్ గంభీర్

ఈ మ్యాచ్‌కు తుది జట్టు విషయంలో ఆశ్చర్యకర నిర్ణయాలు తీసుకుంది. టెస్టుల్లో ఎప్పుడూ అయిదుగురు బౌలర్లతోనే బరిలోకి దిగే భారత్.. ఈ మ్యాచ్‌కు మాత్రం అదనంగా ఇంకో బౌలర్‌ను తీసుకుంది. అయితే ఆరుగురు బౌలర్లలో పేసర్లు ఇద్దరే. అనుకున్నట్లే బుమ్రా, సిరాజ్ కొత్త బంతిని పంచుకున్నారు. మిగతా నలుగురు బౌలర్లూ స్పిన్నర్లే కావడం విశేషం. జడేజా, కుల్‌దీప్, వాషింగ్టన్ సుందర్‌లకు తోడుగా అక్షర్ పటేల్‌నూ తుది జట్టులోకి తీసుకున్నారు. కుల్‌దీప్ మినహా మిగతా ముగ్గురూ బ్యాటింగ్ చేయగల వాళ్లే కావడంతో ఒక స్పెషలిస్టు బ్యాటర్‌ను తగ్గించుకుంది భారత్. గత మ్యాచ్‌లో మూడో స్థానంలో ఆడిన సాయి సుదర్శన్‌ను పక్కన పెట్టగా.. అదే స్థానంలో స్పిన్ ఆల్‌రౌండర్ సుందర్‌ను ఆడించడం గమనార్హం. ఈ నిర్ణయంపై విమర్శలు కూడా వచ్చాయి. మరోవైపు తుది జట్టులో ఇద్దరు వికెట్ కీపర్ బ్యాటర్లకు చోటు దక్కింది. గాయం నుంచి కోలుకున్న పంత్ పునరాగమనం చేయగా.. గత నెల వెస్టిండీస్‌తో టెస్టులో సెంచరీ చేయడమే కాక, ఇటీవల దక్షిణాఫ్రికా-ఎతో నాలుగు రోజుల మ్యాచ్‌లో రెండు ఇన్నింగ్స్‌ల్లోనూ శతకాలు బాదిన ధ్రువ్ జురెల్‌కు కూడా అవకాశం దక్కింది.

బవుమాను మరగుజ్జు అంటూ..


బవుమా

దక్షిణాఫ్రికా కెప్టెన్ బవుమాను ఉద్దేశించి భారత పేసర్ బుమ్రా, వికెట్ కీపర్ పంత్ చేసిన వ్యాఖ్యలు వివాదాస్పదం అయ్యాయి. తొలి టెస్టు తొలి రోజు ఆటలో 13వ ఓవర్లో బుమ్రా బంతి.. బవుమా ప్యాడ్లకు తాకింది. ఎల్బీ కోసం అప్పీల్ చేస్తే అంపైర్ ఔటివ్వలేదు. సమీక్ష కోరాలా వద్దా అన్న సంశయంలో పంత్ దగ్గరికి వచ్చిన బుమ్రా.. బవుమా గురించి ప్రస్తావిస్తూ అతను మరగుజ్జు కదా అన్నాడు. బదులుగా పంత్ కూడా అతను పొట్టివాడైనప్పటికీ బంతి.. స్టంప్స్ కంటే ఎత్తులోనే అతడిని తాకింది అన్నట్లు మాట్లాడాడు. తర్వాత బుమ్రా ఒక బూతు మాట కూడా వాడాడు. ఈ సంభాషణ అంతా స్టంప్ కెమెరాలో రికార్డయి లైవ్‌లో వినిపించింది. బవుమా ఎత్తు గురించి అవమానకర వ్యాఖ్యలు చేశారంటూ సామాజిక మాధ్యమాల్లో బుమ్రా, పంత్‌లపై దక్షిణాఫ్రికా అభిమానులు ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఇంకొక్క ఓవర్ ప్లీజ్..


సిరాజ్ 2/47

దక్షిణాఫ్రికా తొలి ఇన్నింగ్స్‌లో 2 వికెట్లతో ఆ జట్టు పతనంలో తనవంతు పాత్ర పోషించాడు మహ్మద్ సిరాజ్. అయితే ఉదయం అతడికి లయ కుదరక ఇబ్బంది పడ్డాడు. వికెట్ తీయలేకపోయిన అతను.. ఎక్కువ పరుగులూ ఇచ్చేశాడు. మూడో స్పెల్‌లో 3 ఓవర్లలో పెద్దగా ప్రభావం చూపకపోవడంతో కెప్టెన్ శుభ్‌మన్.. అతడిని తప్పించాలనుకున్నాడు. కానీ సిరాజ్.. ఇంకొక్క ఓవర్ వేస్తానంటూ కెప్టెన్‌ను అడిగి మరీ బౌలింగ్‌ను కొనసాగించాడు. అది మంచి ఫలితాన్నే ఇచ్చింది. ఒకే ఓవర్లో వెరీన్, యాన్సెన్‌లను ఔట్ చేసిన సిరాజ్.. సఫారీల పతనాన్ని వేగవంతం చేశాడు.

దిగింది పసిడి బాణం

- స్వర్ణాలతో అదరగొట్టిన ధీరజ్, అంకిత
- టీమ్‌లో భారత్‌కు అగ్రస్థానం
- ఆసియా ఆర్చరీ ఛాంపియన్‌షిప్


ధీరజ్, అంకిత

ఢాకా: ఆసియా ఆర్చరీ ఛాంపియన్‌షిప్‌లో భారత్ అదరగొట్టింది. కాంపౌండ్‌లో ఇప్పటికే దేశ ఆర్చర్లు 3 స్వర్ణాలతో సత్తా చాటగా.. ఇప్పుడు రికర్వ్ క్రీడాకారులు వారి బాటలో నడిచారు. వ్యక్తిగత విభాగంలో రెండు, టీమ్‌లో ఒక స్వర్ణాన్ని సొంతం చేసుకున్నారు. పురుషుల వ్యక్తిగత విభాగం ఫైనల్లో తెలుగు తేజం ధీరజ్ బొమ్మదేవర 6-2తో జాంగ్ చావాన్ (కొరియా)ను ఓడించాడు. తొలి సెట్‌లో ఓడినా.. ధీరజ్ గొప్పగా పుంజుకున్నాడు. రెండు, మూడు సెట్లను ఖాతాలో వేసుకుని 4-2తో ఆధిక్యంలో నిలిచాడు. నాలుగో సెట్లో వరుసగా మూడు పర్‌ఫెక్ట్ టెన్‌లతో స్వర్ణాన్ని ఎగరేసుకుపోయాడు. మహిళల వ్యక్తిగత విభాగం తుదిపోరులో అంకిత బాకత్ 7-3తో నమ్ సుయెన్ (కొరియా)పై నెగ్గింది. ఫైనల్లో ఆరంభం నుంచి ఆధిపత్యం ప్రదర్శించిన అంకిత.. 5-3తో నిలిచింది. అదే జోరుతో వరుసగా మూడు సెట్లను కైవసం చేసుకుని స్వర్ణాన్ని గెలుచుకుంది. వెటరన్ స్టార్ దీపిక కుమారికి చుక్కెదురైంది. కాంస్య పోరులో మరో భారత ఆర్చర్ సంగీత 6-5తో దీపికను ఓడించింది.

18 ఏళ్ల తర్వాత: పురుషుల టీమ్ విభాగంలో భారత్ స్వర్ణంతో మెరిసింది. అతాను దాస్, రాహుల్, యశ్‌దీప్‌లతో కూడిన భారత బృందం ఫైనల్లో 5-4తో కొరియా (సియో మింగి, కయెచాన్, జంగ్ జిహో)ను ఓడించింది. ఈ పోరులో 2-4తో వెనుకబడిన స్థితి నుంచి పుంజుకుని భారత్ గెలిచింది. ఫైనల్లో భారత్, కొరియా చెరో నాలుగు సెట్ పాయింట్లు గెలుచుకోవడంతో షూటాఫ్ తప్పని సరైంది. షూటాఫ్‌లోనూ 29-29తో స్కోర్లు సమమయ్యాయి. భారత ఆటగాళ్లలో చివరిగా అతాను దాస్ వేసిన బాణం మధ్య వృత్తానికి సమీపంగా దిగడంతో భారత్ విజేతగా నిలిచింది. 18 ఏళ్ల సుదీర్ఘ విరామం తర్వాత రికర్వ్ టీమ్ విభాగంలో భారత్‌కు పసిడి దక్కింది. చివరిగా 2009లో ఈ విభాగంలో మన దేశం విజేతగా నిలిచింది. అప్పుడు గెలిచిన జట్టులో సభ్యుడైన రాహుల్ బెనర్జీ.. ప్రస్తుత జట్టుకు కోచ్ కావడం విశేషం. 6 స్వర్ణాలు, 3 రజతాలు, 1 కాంస్యంతో భారత్ అగ్రస్థానంతో ఈ టోర్నీని ముగించింది. దక్షిణ కొరియా కూడా 10 (2 స్వర్ణాలు, 4 రజతాలు, 4 కాంస్యాలు) పతకాలు గెలిచినా.. అత్యధిక స్వర్ణాలతో భారత్ ముందంజలో నిలిచింది.

ఇషా గురి అదిరె

- 25 మీటర్ల పిస్టల్‌లో కాంస్యం సొంతం
- షూటింగ్ ప్రపంచ ఛాంపియన్‌షిప్


ఇషా

కైరో: హైదరాబాదీ అమ్మాయి ఇషా సింగ్ సత్తా చాటింది. ప్రపంచ షూటింగ్ ఛాంపియన్‌షిప్‌లో కాంస్యంతో మెరిసింది. శుక్రవారం మహిళల 25 మీటర్ల ర్యాపిడ్ పిస్టల్ విభాగం ఫైనల్లో ఇషా 30 పాయింట్లు స్కోరు చేసి మూడో స్థానంలో నిలిచింది. క్వాలిఫికేషన్లో 587 పాయింట్లు సాధించి అయిదో స్థానంతో ఫైనల్‌కు వచ్చిన ఇషా.. తుదిపోరులో మెరుగైన ప్రదర్శనతో పోడియంపై నిలిచింది. ఈ ఛాంపియన్‌షిప్‌లో ఇషాకు ఇదే తొలి వ్యక్తిగత పతకం. ఈ ఏడాది ప్రపంచకప్ స్టేజ్ టోర్నీలో ఆమె స్వర్ణం, రజతం సాధించింది. మరోవైపు డబుల్ ఒలింపిక్ పతక విజేత మను బాకర్ నిరాశ పరిచింది. క్వాలిఫికేషన్లో 586 పాయింట్లతో ఆరో స్థానంలో నిలిచి ఫైనల్ చేరిన మను.. తుది పోరులో 23 పాయింట్లే స్కోరు చేసి అయిదో స్థానంతో సరిపెట్టుకుంది. ఒలింపిక్ ఛాంపియన్ యంగ్ జిన్ (కొరియా, 40 పాయింట్లు) స్వర్ణం.. యావో కియాన్‌గ్జున్ (చైనా, 38) రజతం గెలుచుకున్నారు. టీమ్ విభాగంలో ఇషా, మను, రాహి సర్నోబత్‌తో కూడిన భారత బృందం 1745 పాయింట్లతో నాలుగో స్థానంలో నిలిచింది.

సెమీస్‌లో లక్ష్యసేన్


లక్ష్యసేన్

కుమామోటో (జపాన్): జపాన్ ఓపెన్ ప్రపంచ టూర్ సూపర్ 500 బ్యాడ్మింటన్ టోర్నీలో భారత స్టార్ షట్లర్ లక్ష్యసేన్‌కు ఎదురే లేదు. మంచి ఫామ్‌లో ఉన్న అతడు.. ఈ టోర్నీలో సెమీఫైనల్లోకి దూసుకెళ్లాడు. శుక్రవారం పురుషుల సింగిల్స్ తొలి రౌండ్లో లక్ష్యసేన్ 21-13, 21-17తో లో కీన్ యూ (సింగపూర్)పై విజయం సాధించాడు. 40 నిమిషాల్లో ప్రత్యర్థిని మట్టికరిపించిన లక్ష్యసేన్.. అతనిపై తన గెలుపోటముల రికార్డును 7-3తో మెరుగుపరుచుకున్నాడు. శనివారం సెమీస్‌లో కెంటా నిషిమోటో (జపాన్)తో లక్ష్యసేన్ పోటీపడతాడు.


వైభవ్ సూర్యవంశీ 144

వామ్మో వైభవ్!

- 42 బంతుల్లోనే 144
- ఆసియా కప్ రైజింగ్ స్టార్స్‌లో విధ్వంసం
- భారత్-ఎ చేతిలో యూఏఈ చిత్తు

దోహా: 14 ఏళ్ల వయసులోనే ఐపీఎల్‌లో అరంగేట్రం చేసి విధ్వంసక ఇన్నింగ్స్‌లతో క్రికెట్ ప్రపంచాన్ని సంభ్రమాశ్చర్యాలకు గురి చేసిన వైభవ్ సూర్యవంశీ.. ఆ తర్వాత కూడా తన దూకుడును కొనసాగిస్తున్నాడు. తాజాగా అతను ఆసియా కప్ రైజింగ్ స్టార్స్ టీ20 టోర్నీలో యూఏఈపై రెచ్చిపోయాడు. ప్రత్యర్థి బౌలింగ్‌ను ఊచకోత కోసిన వైభవ్.. కేవలం 42 బంతుల్లోనే 144 పరుగులు చేశాడు. అందులో 11 ఫోర్లు, 15 సిక్సర్లు ఉండడం విశేషం. ఈ మ్యాచ్‌లో భారత్-ఎ ఏకంగా 148 పరుగుల తేడాతో విజయం సాధించి, టోర్నీని ఘనంగా ఆరంభించింది. వైభవ్ ధాటికి మొదట భారత్-ఎ 4 వికెట్లకు 297 పరుగుల భారీ స్కోరు సాధించింది. ఓపెనర్ ప్రియాంశ్ ఆర్య (10) త్వరగా ఔటైనప్పటికీ.. రెండో వికెట్‌కు నమన్ ధీర్ (34)తో 57 బంతుల్లోనే 163 పరుగులు జోడించాడు వైభవ్. 17 బంతుల్లోనే అర్ధశతకం సాధించిన అతను.. 32 బంతులకే శతకాన్నందుకున్నాడు. వైభవ్ ఊపు చూస్తే టీ20ల్లో తొలి డబుల్ సెంచరీ కూడా నమోదవుతుందేమో అనిపించింది. కానీ 13వ ఓవర్లో అతను ఔటైపోయాడు. తర్వాతి ఓవర్లోనే స్కోరు 200 దాటింది. వైభవ్ ఔటయ్యాక జితేశ్ శర్మ (83; 32 బంతుల్లో 8×4, 6×6) చెలరేగి ఆడి స్కోరును 300కు చేరువ చేశాడు. యూఏఈ బౌలర్లలో ఫరాజుద్దీన్, జవాదుల్లా 4 ఓవర్లలో 64 పరుగుల చొప్పున సమర్పించుకోవడం గమనార్హం. అనంతరం గుర్జన్‌ప్రీత్ (3/18), హర్ష్ దూబె (2/12)ల ధాటికి యూఏఈ నిర్ణీత ఓవర్లలో 7 వికెట్లకు 149 పరుగులే చేయగలిగింది. షోయబ్ ఖాన్ (63; 41 బంతుల్లో 3×4, 6×6) టాప్‌స్కోరర్. భారత్-ఎ ఆదివారం తన తర్వాతి మ్యాచ్‌లో పాకిస్థాన్ షహీన్స్‌ను ఢీకొంటుంది.

అర్జున్, హరి గేమ్‌లు డ్రా


అర్జున్ ఇరిగేశి

పంజిమ్: చెస్ ప్రపంచకప్ ప్రిక్వార్టర్స్‌ను అర్జున్ ఇరిగేశి, పెంటేల హరికృష్ణ డ్రాలతో ఆరంభించారు. శుక్రవారం లెవోన్ ఆరోనియన్ (అమెరికా)తో తొలి గేమ్‌లో తెల్ల పావులతో ఆడిన అర్జున్.. క్లిష్టమైన మేళవింపులతో ఒత్తిడి పెంచేందుకు ప్రయత్నించాడు. కానీ అనుభవజ్ఞుడైన ఆరోనియన్.. అర్జున్ ఎత్తులకు పడలేదు. దీంతో ఈ గేమ్ 41 ఎత్తుల్లో డ్రాగా ముగిసింది. మరోవైపు జోస్ అల్కంటారా (పెరూ)తో హరికృష్ణ పాయింట్ పంచుకున్నాడు. నల్ల పావులతో తలపడిన హరి.. ఇటాలియన్ ఓపెనింగ్‌తో ప్రత్యర్థిని ఇబ్బంది పెట్టాడు. అయితే పుంజుకున్న జోస్.. గేమ్‌ను డ్రా దిశగా మళ్లించాడు. ఈ పోరు 41 ఎత్తుల్లో డ్రా అయింది. ఇతర ప్రిక్వార్టర్స్ తొలి గేమ్‌లలో డానియల్ దబోవ్ (రష్యా)తో సామ్ షంక్‌లాండ్ (అమెరికా), లీమ్ క్వాంగ్ (వియత్నాం)తో అలెగ్జాండర్ డాన్‌చెంకో (జర్మనీ), నొదిర్‌బెక్ (ఉజ్బెకిస్థాన్)తో సార్‌గిసియన్ (ఆర్మేనియా) డ్రా చేసుకున్నారు.

మ్యాక్సీని వదిలేసిన పంజాబ్


మ్యాక్స్‌వెల్

లఖ్‌నవూ: ఆస్ట్రేలియా ఆల్‌రౌండర్ గ్లెన్ మ్యాక్స్‌వెల్‌ను పంజాబ్ కింగ్స్ వదిలి పెట్టింది. అతడితో పాటు ఆసీస్ ఆల్‌రౌండర్ ఆరోన్ హార్డీ, కుల్‌దీప్ సేన్, విష్ణు వినోద్‌లను కూడా ఆ జట్టు విడుదల చేసింది. వచ్చే నెల ఐపీఎల్ మినీ వేలం ఉన్న నేపథ్యంలో పంజాబ్ ఈ నిర్ణయం తీసుకుంది. ఈ ఏడాది ఐపీఎల్‌లో 7 మ్యాచ్‌లు ఆడిన మ్యాక్స్‌వెల్ కేవలం 48 పరుగులే చేశాడు. 4 వికెట్లు తీశాడు. రూ.1.25 కోట్లతో హార్డీని దక్కించుకున్న పంజాబ్.. అతడిని ఒక్క మ్యాచ్ ఆడించలేదు. కుల్‌దీప్ సేన్, విష్ణు వినోద్ కూడా ఈ సీజన్లో డగౌట్‌కే పరిమితమయ్యారు.

తెలంగాణకు టైటిల్

జాతీయ పికిల్‌బాల్


తెలంగాణ ఆటగాళ్లు

ఈనాడు, బెంగళూరు: జాతీయ పికిల్‌బాల్ ఛాంపియన్‌షిప్‌లో తెలంగాణకు టైటిల్ దక్కింది. ఆరోగ్యకర జీవనశైలి ఉత్పత్తుల సంస్థ ప్రియా 'సబల మిల్లెట్స్' టైటిల్ స్పాన్సర్‌గా వ్యవహరిస్తున్న ఈ పోటీల్లో శుక్రవారం పురుషుల 40+ విభాగంలో తెలంగాణ జోడీ విజేతగా నిలిచింది. కర్ణాటక జట్టును ఓడించి తెలంగాణ ద్వయం టైటిల్ అందుకుంది. మహిళల సింగిల్స్‌లో మహారాష్ట్రకు, అండర్ 14 బాలుర విభాగంలో గుజరాత్‌కు ట్రోఫీలు దక్కాయి. 30 ఏళ్ల మహిళల విభాగంలో కర్ణాటక జోడీ విజేతగా నిలిచింది. విజేతలకు భారత పికిల్‌బాల్ సమాఖ్య (ఐపీఏ) అధ్యక్షుడు సూర్యవీర్ సింగ్ పతకాలు అందజేశారు.

'సబల'తో సమతుల ఆరోగ్యం: జాతీయ పికిల్‌బాల్ టోర్నీకి స్పాన్సర్‌గా వ్యవహరిస్తున్న 'సబల మిల్లెట్స్'కు సంబంధించిన ఉత్పత్తులు క్రీడాకారులతో పాటు ప్రేక్షకుల దృష్టిని ఆకర్షించాయి. 'సబల' స్టాల్ వద్ద సందడి నెలకొంది. ఈ టోర్నీకి అతిథిగా హాజరైన కర్ణాటక రెజ్లింగ్ సమాఖ్య అధ్యక్షుడు గుణరంజన్ శెట్టి మాట్లాడుతూ.. శరీరానికి సమతుల ఆరోగ్యం అందించేందుకు సబల ఉత్పత్తులు దోహదం చేస్తాయన్నారు.


సబల స్టాల్ వద్ద కొనుగోలుదారులు

రొనాల్డోకు తొలి 'రెడ్'


రొనాల్డో

జెనీవా: పోర్చుగల్ ఫుట్‌బాల్ సూపర్‌స్టార్ క్రిస్టియానో రొనాల్డో అంతర్జాతీయ కెరీర్‌లో తొలిసారి రెడ్‌కార్డు అందుకున్నాడు. పోర్చుగల్, ఐర్లాండ్ మధ్య ప్రపంచకప్ క్వాలిఫయర్స్ మ్యాచ్‌లో 61వ నిమిషంలో ప్రత్యర్థి డిఫెండర్ దారాను మోచేతితో బలంగా నెట్టినందుకు క్రిస్టియానోకు రిఫరీ రెడ్ కార్డు చూపించాడు. పోర్చుగల్ తరఫున 226 మ్యాచ్‌లు ఆడిన రొనాల్డోపై ఫిఫా కనీసం రెండు మ్యాచ్‌ల నిషేధం విధించేందుకు ఆస్కారముంది. ఆదివారం అర్మేనియాతో మ్యాచ్‌కు అతడు దూరం అవుతాడు. అంతే కాకుండా 2026 ఫుట్‌బాల్ ప్రపంచకప్‌నకు పోర్చుగల్ అర్హత సాధిస్తే.. ఆ జట్టు ఆడే తొలి మ్యాచ్‌లో రొనాల్డో బరిలో దిగే అవకాశం లేదు. ఐర్లాండ్ చేతిలో పోర్చుగల్ 0-2తో ఓడడం.. రాబోయే మ్యాచ్‌లో రొనాల్డో దూరం కాబోతుండడంతో ఆ జట్టు అభిమానులు తీవ్ర నిరాశకు గురయ్యారు.

భారత జట్టు కెప్టెన్‌గా రోహిత్


జూనియర్ హాకీ ప్రపంచకప్

దిల్లీ: జూనియర్ హాకీ ప్రపంచకప్‌లో పాల్గొనే భారత జట్టుకు డ్రాగ్‌ఫ్లికర్ రోహిత్ కెప్టెన్‌గా వ్యవహరించనున్నాడు. ఈనెల 28న చెన్నై, మధురై వేదికగా ఆరంభం కాబోతున్న ఈ మెగా టోర్నీలో పాల్గొనే 18 మంది సభ్యుల భారత జట్టును సెలక్టర్లు శుక్రవారం ప్రకటించారు. దిగ్గజ గోల్‌కీపర్ పీఆర్ శ్రీజేశ్ జట్టుకు కోచ్‌గా ఉన్నాడు. ఈ టోర్నీలో పూల్-బిలో చిలీ, స్విట్జర్లాండ్, ఒమన్‌లతో భారత్ ఆడనుంది. ఈ కప్‌లో 24 జట్లు 6 గ్రూప్‌లుగా విడిపోయి తలపడుతున్నాయి.

భారత జట్టు: రోహిత్ (కెప్టెన్), అమీర్ అలీ, అన్మోల్ ఎక్కా, తలెమ్, సునీల్ బెన్నూర్, శ్రద్ధానంద్, అంకిత్ పాల్, అద్రోహిత్, లువాంగ్, మన్‌మీత్ సింగ్, రోసన్ కుజుర్, గుర్‌జ్యోత్ సింగ్, సౌరభ్ ఆనంద్, అర్ష్‌దీప్ సింగ్, అజీత్ యాదవ్, దిల్‌రాజ్ సింగ్, విక్రమ్‌జిత్ సింగ్, ప్రిన్స్‌దీప్ సింగ్


కోచ్: పీఆర్ శ్రీజేశ్

అల్కరాస్‌దే నంబర్‌వన్


అల్కరాస్

ట్యూరిన్: స్పెయిన్ టెన్నిస్ స్టార్ కార్లోస్ అల్కరాస్ ఈ ఏడాదిని నంబర్‌వన్‌గా ముగించనున్నాడు. ఏటీపీ ఫైనల్స్ టోర్నీలో వరుసగా మూడో విజయం సాధించడం ద్వారా గ్రూప్‌లో అగ్రస్థానంలో నిలిచిన అల్కరాస్ (11650 పాయింట్లు).. యానిక్ సినర్ (10,400)ను వెనక్కి నెట్టి నంబర్‌వన్ ర్యాంకునూ ఖరారు చేసుకున్నాడు. చివరి లీగ్ మ్యాచ్‌లో అతడు 6-4, 6-1తో లొరెంజో ముసెటి (ఇటలీ)ని ఓడించాడు. ఏడాదిని నంబర్‌వన్‌తో ముగించడం 22 ఏళ్ల అల్కరాస్‌కు కెరీర్‌లో ఇది రెండోసారి.

లఖ్‌నవూకు షమి బదిలీ


మహ్మద్ షమి


దిల్లీ: 2026 ఐపీఎల్ సీజన్‌లో లఖ్‌నవూ సూపర్ జెయింట్స్ తరఫున భారత పేసర్ మహ్మద్ షమి బరిలో దిగనున్నాడు. ఆటగాళ్ల బదిలీలో భాగంగా సన్‌రైజర్స్ హైదరాబాద్ నుంచి అతడిని తీసుకునేందుకు లఖ్‌నవూ అంగీకరించిందని బీసీసీఐ వర్గాలు తెలిపాయి. నిరుడు వేలంలో 35 ఏళ్ల షమిని రూ.10 కోట్లకు సన్‌రైజర్స్ కొనుక్కుంది.

కేకేఆర్ బౌలింగ్ కోచ్‌గా సౌథీ: ఐపీఎల్‌లో కోల్‌కతా నైట్‌రైడర్స్ (కేకేఆర్)కు న్యూజిలాండ్ దిగ్గజం టిమ్ సౌథీ బౌలింగ్ కోచ్‌గా ఎంపికయ్యాడు. 2021, 2022, 2023 సీజన్‌లలో కేకేఆర్ తరఫున సౌథీ ఐపీఎల్ ఆడాడు.

మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్ నీతీశ్

- జంగిల్‌రాజ్‌ను తుడిచిపెట్టిన నేతగా గుర్తింపు

నీరేంద్ర దేవ్



మరోసారి బిహారీల పట్టం

కలలు కనేవారిదే చరిత్ర అనే నానుడి ఉంది. దానిని బిహార్ ముఖ్యమంత్రి, జేడీయూ అధినేత నీతీశ్ కుమార్ మార్చినట్లే కనిపిస్తోంది. ఆ రాష్ట్రంలో ఇప్పుడు కలలనేవి చరిత్రగా మిగిలిపోయాయి.

జంగిల్‌రాజ్ నుంచి రాష్ట్రాన్ని రక్షిస్తానని చెప్పి 2005లో నీతీశ్ తొలిసారి అధికారంలోకి వచ్చారు. రెండు దశాబ్దాలు గడిచాయి. ఇప్పటికీ ఆయన రాజకీయంగా బలంగానే ఉన్నారు. భాజపా, ఆర్జేడీలతో కలిసి గతంలో అధికారాన్ని పంచుకున్నారు. అయినా ఆయన ప్రభ ఏ మాత్రం తగ్గలేదు. విజయోత్సవాలు జరుపుకొంటున్న భాజపా.. అభివృద్ధికే గుర్తింపు ఉంటుందని, జంగిల్‌రాజ్‌కు కాదని అంటోంది. ప్రత్యర్థి ఆర్జేడీ.. నీతీశ్‌ను పాల్తూ రామ్‌గా (తరచూ కూటములు మార్చే నేత) అభివర్ణించింది. అయినా బిహారీలు మరోసారి ఆయనకు పట్టం కట్టారు. ఆయనపై విశ్వాసం ఉంచారు. 2005 నుంచి తీసుకొచ్చిన సుపరిపాలన, కొత్తగా చేపట్టిన అభివృద్ధి ఎజెండాను నమ్మారు. దీంతో 75ఏళ్ల నీతీశ్.. దాదాపుగా తన చివరి ఎన్నికలుగా భావిస్తున్న ఈ పోరులో ప్రభంజనం సృష్టించి మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్‌గా నిలిచారు.

2024 లోక్‌సభ ఎన్నికల్లో మోదీ-అమిత్ షాల ద్వయాన్ని బిహారీలు పెద్దగా ఆదరించలేదు. ఆ ఎన్నికల్లో లాలూ ప్రసాద్ కుమారుడైన తేజస్వీపై ప్రేమ చూపించారు. కానీ అసెంబ్లీ ఎన్నికలకు వచ్చే సరికి మళ్లీ నీతీశ్ నేతృత్వంలోని కూటమివైపే మొగ్గారు. ఆర్జేడీకి అనుకూలిస్తాయనుకున్న కులాల సమీకరణాలు విచిత్రంగా ఎన్డీయే కూటమికి పట్టం కట్టడం విశేషం. దళిత నేతగా ఉన్న లోక్ జన్‌శక్తి పార్టీ (రామ్‌విలాస్) నేత చిరాగ్ పాస్వాన్.. ఈ ఎన్నికల ద్వారా బహుజన నేతగా గుర్తింపు సాధించారు. రాష్ట్రంలో 6శాతం ఉన్న కుర్మీ వర్గానికి చెందిన నీతీశ్.. తాను అన్ని కులాలకు ప్రతినిధినని చెబుతుంటారు. వాస్తవానికి తేజస్వీ యాదవ్ వర్గానికి చెందిన యాదవ్‌లు 14శాతం ఉంటారు. అయినా ఎన్నికల ఫలితాలను బట్టి చూస్తే కులాల సమీకరణాల్లో ఎన్డీయేనే విజయం సాధించినట్లు అర్థమవుతోంది.

11నే తేలిపోయిందా..

బిహార్‌లో రెండో విడత పోలింగ్ కాగానే.. కాంగ్రెస్ పార్టీలో ఉన్న ప్రముఖ ముస్లిం నేత షకీల్ అహ్మద్.. ఆ పార్టీకి రాజీనామా చేశారు. దీంతో అప్పుడే నీతీశ్ ప్రభంజనం ఖాయమైపోయిందనే అంచనాలు వెలువడ్డాయి. 61 సీట్లలో పోటీ చేసిన కాంగ్రెస్ దారుణ ఫలితాలను చవిచూసింది. మోదీ, నీతీశ్‌లాంటి నేతలు లేకపోవడం ఆ పార్టీకి పెద్ద బలహీనత. దీంతోపాటు వారసత్వ రాజకీయాలనూ ప్రజలు తిరస్కరించినట్లయింది. మరో విషయం.. పోల్ మేనేజ్‌మెంట్‌లో కాంగ్రెస్, ఆర్జేడీ విఫలం కావడం దారుణ పరాజయానికి కారణంగా కనిపిస్తోంది. బిహార్ ఎన్నికలను సీరియస్‌గా తీసుకోకుండా హరియాణాలో ఓట్ల చోరీ గురించి, సర్ గురించి రాహుల్ గాంధీ మాట్లాడటం జనానికి నచ్చలేదు. స్థానిక సమస్యలను ఆ పార్టీ విస్మరించింది. అంతేకాకుండా ఎన్నికలకు ముందు ప్రచారాన్ని వదిలేసి రాహుల్ కొలంబియాకు వెళ్లడం మరింత నష్టం చేకూర్చింది.

ఇండియా కూటమిలో కుదుపు?

బిహార్ తీర్పు.. ఇండియా కూటమిలో కుదుపులకు కారణమయ్యే అవకాశముంది. వారు ఇలాగే కొనసాగుతారా.. రాహుల్ గాంధీ ఓట్ల చోరీ ప్రచారం నుంచి పక్కకు మళ్లుతారా అనేది తేలనుంది.

కఠిన పరీక్షల ముందు ఉత్తేజం

రానున్న రోజుల్లో కఠిన పరీక్షలు ఎదురుకానున్న సమయంలో బిహార్ విజయం భాజపాకు కొత్త శక్తినిచ్చింది. తదుపరి అస్సాం, పశ్చిమ బెంగాల్‌లలో ఆ పార్టీ గట్టి పోటీని ఎదుర్కోబోతోంది. అస్సాంలో గౌరవ్ గొగొయ్ నేతృత్వంలో కాంగ్రెస్ పార్టీ పునర్వైభవ ప్రయాణాన్ని ప్రారంభించింది. ఈ రాష్ట్రంలో అధికార భాజపా ప్రస్తుతం రక్షణాత్మక ధోరణిలో ఉంది. అమిత్ షా అధికంగా విశ్వసించే హిమంత బిశ్వ శర్మే ఇప్పుడు ఆ పార్టీకి గుదిబండగా మారారు.

పశ్చిమ బెంగాల్‌లోనూ మమతా బెనర్జీని భాజపా ఢీకొంటోంది. అయితే అక్కడ నీతీశ్ లాగా మమత జనాకర్షక నేతగా ఉన్నారు. మరోవైపు కమలం పార్టీలో గ్రూపుల కొట్లాటలు ఇబ్బందిగా మారాయి.



దిల్లీలోని భాజపా ప్రధాన కార్యాలయంలో ప్రధాని మోదీని సత్కరించిన కేంద్ర మంత్రులు రాజ్‌నాథ్, నడ్డా, అమిత్ షా

జంగిల్‌రాజ్ వద్దన్న బిహార్ యువత

- సరికొత్త మహిళా, యూత్(ఎంవై) సూత్రంపై ఎన్డీయే విజయం
- కాంగ్రెస్‌లో చీలిక రావొచ్చు
- భాజపా విజయోత్సవ సభలో ప్రధాని మోదీ

దిల్లీ: బిహార్ ప్రజలు ఎన్డీయేకు ప్రచండ విజయం అందించారని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. ఫిర్ ఏక్ బార్.. ఎన్డీయే సర్కార్ అంటూ నినదిస్తూ మరోసారి అభివృద్ధికే పట్టం కట్టారన్నారు. బిహార్ అసెంబ్లీ ఎన్నికల్లో ఎన్డీయే ప్రభంజనం సృష్టించిన నేపథ్యంలో దిల్లీలోని భాజపా ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన విజయోత్సవ సభలో ప్రధాని ప్రసంగించారు. ఈ సందర్భంగా జయప్రకాశ్ నారాయణ్, కర్పూరి ఠాకూర్‌కు నివాళులర్పించారు. తాజా విజయం బిహార్‌ను కొత్త శిఖరాలకు తీసుకెళ్లేందుకు తమలో ఉత్సాహాన్ని నింపిందని మోదీ అన్నారు. కొన్ని పార్టీలు 'ముస్లిం-యాదవ్'(ఎంవై) అనే బుజ్జగింపు సూత్రాన్ని రూపొందించినప్పటికీ..

సరికొత్త 'మహిళా, యూత్'(ఎంవై) సూత్రం మీద ఎన్డీయే విజయం సాధించిందని పేర్కొన్నారు. బిహార్‌లో విజయం కోసం అద్భుతంగా కృషిచేసిన ఎన్డీయే నేతలు, సీఎం నీతీశ్ కుమార్ నాయకత్వాన్ని ప్రధాని అభినందించారు.

కాంగ్రెస్‌లో తీవ్ర అసంతృప్తి

కాంగ్రెస్ వ్యవహార సరళిపై ఆ పార్టీలోనే తీవ్ర నిరాశ, కోపం గూడుకట్టుకుని ఉన్నాయని, త్వరలో హస్తం పార్టీలో భారీ చీలిక వచ్చే అవకాశం ఉందని ప్రధాని మోదీ పేర్కొన్నారు. ఆ పార్టీ ముస్లింలీగి మావోడి కాంగ్రెస్(ఎంఎంసీ)గా మారిపోయిందని, ప్రస్తుతం దాని ఎజెండా అంతా ఆ ప్రకారమే నడుస్తోందని వ్యాఖ్యానించారు.


ప్రధానిపై అచంచల విశ్వాసం: నడ్డా



బిహార్ ప్రజలు అభివృద్ధికి ఓటు వేశారు. ఈ ఎన్నికల్లో ఎన్డీయే కూటమికి అపూర్వ విజయాన్ని అందిస్తూ ఇచ్చిన తమ తీర్పుతో 'జంగిల్ రాజ్'కు బిహార్‌లో ప్రవేశం లేదనే బోర్డు పెట్టారు. హరియాణా, మహారాష్ట్ర, దిల్లీ.. ఇప్పుడు బిహార్ వంటి వరుస ఎన్నికల్లో ప్రజలు మోదీపై అచంచలమైన విశ్వాసాన్ని చూపించారు.

– భాజపా అధ్యక్షుడు జె.పి.నడ్డా

అభివృద్ధికే బిహార్ ప్రజలు పట్టం కట్టారు



అభివృద్ధి చెందిన బిహార్‌ను విశ్వసించే ప్రతి బిహారీకి ఈ విజయం చెందుతుంది. ఆటవిక పాలన, బుజ్జగింపు రాజకీయాలు చేసేవారికి ఇక రాష్ట్రాన్ని దోచుకునే అవకాశం ఉండదు. ప్రజలు ఇప్పుడు పనితీరు ఆధారంగా మాత్రమే తీర్పు ఇస్తున్నారు. ఎన్డీయే సర్కార్ ఇకపై బిహార్ అభివృద్ధికి మరింత అంకిత భావంతో పనిచేస్తుంది.

–కేంద్ర హోం మంత్రి అమిత్ షా

అపూర్వ విజయం అందించారు

అపూర్వమైన విజయాన్ని మాకు అందించిన బిహార్ ప్రజలకు కృతజ్ఞతలు. ప్రభుత్వంపై సంపూర్ణ విశ్వాసాన్ని వారు వ్యక్తంచేసి కనీవినీ ఎరుగని గెలుపును ఇచ్చారు. ఓటర్లకు శిరసు వంచి ప్రణమిల్లుతున్నా. రాష్ట్ర సర్కారుకు ప్రధాని మోదీ నిరంతర మద్దతు ఇస్తున్నందుకు ధన్యవాదాలు. కూటమి నేతలైన చిరాగ్ పాస్వాన్, జితన్‌రామ్ మాంఝీ, ఉపేంద్ర కుశ్వాహాలకు ధన్యవాదాలు.

– 'ఎక్స్'లో బిహార్ సీఎం నీతీశ్ కుమార్

నిజంగా ఆశ్చర్యకరం



బిహార్ ఫలితాలు నిజంగా ఆశ్చర్యకరం. ప్రారంభం నుంచి ధర్మబద్ధంగా జరగని ఈ ఎన్నికల్లో మేం విజయం సాధించలేకపోయాం. ఫలితాలపై క్షుణ్నంగా అంతర్గత సమీక్షను భాగస్వామ్య పక్షాలతో కూడా నిర్వహిస్తాం.

– లోక్‌సభ విపక్ష నేత రాహుల్ గాంధీ

మహా ఫట్‌బంధన్!

- బిహార్‌లో చతికిలపడిన విపక్ష కూటమి
- మొదటినుంచీ లుకలుకలే
- ఆకట్టుకోలేకపోయిన మ్యానిఫెస్టో
- ఆర్జేడీ, కాంగ్రెస్ ఆశలపై నీళ్లు



ఇంటికో ప్రభుత్వ ఉద్యోగం ఇస్తామన్నారు.. నిరుద్యోగులు నమ్మలేదు..

పాత పింఛను పథకాన్ని పునరుద్ధరిస్తామని చెప్పారు.. ఉద్యోగులు విశ్వసించలేదు..

మహిళలకు నెలనెలా రూ.2,500 చొప్పున ఇస్తామన్నారు.. అతివల చెవిన పడలేదు..

వక్ఫ్ సవరణ చట్టం అమలును ఆపేస్తామన్నారు.. ముస్లింలను ఆకట్టుకోలేకపోయారు..

నెలకు 200 యూనిట్ల వరకు విద్యుత్తు ఉచితమేనన్నారు.. మధ్యతరగతిని మెప్పించలేకపోయారు.

ఫలితం.. మహాగఠ్‌బంధన్‌కు ఘోర పరాజయం

బిహార్‌లో ఈసారి అధికారం పొందగలిగితే కొంతలో కొంత జవసత్వాలు సమకూర్చుకోవచ్చని కాంగ్రెస్ ఆశపడినా అది అడియాసే అయింది. ప్రధాన భాగస్వామిగా ఉన్న రాష్ట్రీయ జనతా దళ్ (ఆర్జేడీ) మళ్లీ అధికారంలోకి వస్తే మునుపటి ఆటవిక రాజ్యం (జంగిల్ రాజ్) రావడం ఖాయమని ఎన్డీయే గట్టిగా చేసిన ప్రచారం ఫలించిందో, అధికార కూటమి మ్యానిఫెస్టోలోని అంశాలు నచ్చాయో గానీ మహాగఠ్‌బంధన్ దారుణంగా ఓడిపోయింది.. మొత్తం ఇండియా కూటమిని నైరాశ్యంలో ముంచింది. ఎగ్జిట్ పోల్స్ కూడా అంచనా వేయలేనంతగా కూటమి దెబ్బతింది.

అన్నింటా ఎన్డీయేకు ఆమడ దూరం

ఈసారి ఎన్నికల్లో ఒకవేళ ఎన్డీయే గెలిచినా ముఖ్యమంత్రిగా నీతీశ్‌కు అవకాశం ఇవ్వరని, అందుకే ఆయన్ని సీఎం అభ్యర్థిగా చెప్పడం లేదని విపక్షాలు పెద్దఎత్తున ప్రచారం చేశాయి. దీనిని తిప్పికొట్టేందుకు ఎన్డీయే నేతలు తాము నీతీశ్ నాయకత్వంలోనే ఎన్నికలకు వెళ్తున్నామని పదేపదే చెబుతూ వచ్చారు. నీతీశ్ వయోభారం రీత్యా ఇబ్బందులు వస్తున్నాయని, ప్రచార సభలకు అందుకే రావడం లేదని విపక్షం పలుమార్లు ప్రస్తావించింది. వీటిని పక్కనపెట్టి స్పష్టమైన వ్యూహంతో ఎన్డీయే అడుగులు వేసింది. 'మోదీ, నీతీశ్ కలయిక.. అభివృద్ధి + ప్రశాంతత' అనే నినాదాన్ని, డబుల్ ఇంజిన్ సర్కారే మేలు అనే సందేశాన్ని బలంగా ప్రజల్లోకి తీసుకెళ్లింది. జంగిల్ రాజ్‌ను ప్రతిచోటా చెప్పి, తమ పాలనతో సరిపోల్చింది. ప్రచారంలో పూర్తి ఐక్యతను ప్రదర్శించింది. 'తేజస్వీ ప్రణ్' పేరుతో ఇచ్చిన మ్యానిఫెస్టో అమలు చేయాలంటే అవసరమయ్యే మొత్తం.. బిహార్ రాష్ట్ర బడ్జెట్ కంటే ఎక్కువని అన్నిచోట్లా విడమరచి చెప్పి, అది అసాధ్యమనే సందేశాన్ని చేరవేసింది. ప్రధాని మోదీ, కేంద్ర మంత్రులు- అమిత్‌షా, రాజ్‌నాథ్ తదితరులు పలుమార్లు బిహార్‌ను చుట్టేశారు. యాదవేతరుల ఓట్లను, ముస్లింలలో ఒక వర్గాన్ని ఎన్డీయే ఆకట్టుకోగలిగింది. ప్రశాంత్ కిషోర్ స్థాపించిన జన్ సురాజ్, లాలూ తనయుడు తేజ్ ప్రతాప్ యాదవ్ ఏర్పాటుచేసిన పార్టీ, స్వతంత్రులు ప్రభుత్వ వ్యతిరేక ఓటును కొంతకొంత చొప్పున చీల్చేశారు.

- నేషనల్ డెస్క్

కారణాలు అనేకం

బిహార్‌లో కాంగ్రెస్, దాని భాగస్వామ్య పక్షాలకు గత 20 ఏళ్లకు పైగా అధికారం దక్కట్లేదు. నీతీశ్‌కుమార్ అప్రతిహతంగా రెండు దశాబ్దాల పాటు ప్రభుత్వాన్ని నడిపిస్తున్నా, సహజంగా వచ్చే వ్యతిరేకతను అధిగమించగలిగారనే చెప్పాలి.

- అంతర్గత విభేదాలు, వ్యూహాల్లో లోపాలు, ఓట్లచీలిక సహా పలు అంశాలు కలిసి మహాగఠ్‌బంధన్ గెలుపు అవకాశాలను గాలిలో కలిపేశాయి.
- ఎన్నికలకు ముందునుంచీ కూటమిలో ఐక్యత లోపం స్పష్టంగా కనిపిస్తూ వచ్చింది. ఆర్జేడీ వరకు చూసినా.. పార్టీ వ్యవస్థాపకుడు లాలూప్రసాద్ యాదవ్ రాత్రికిరాత్రి కొందరికి టికెట్లు ఇస్తే ఆ పార్టీ సీఎం అభ్యర్థి తేజస్వీ యాదవ్ కొన్ని గంటల్లో దిల్లీనుంచి వచ్చి కొన్నింటిని వెనక్కి తీసుకున్నారు.
- ఉమ్మడి మ్యానిఫెస్టో విడుదలకు కాంగ్రెస్ ప్రధాన నేత రాహుల్‌గాంధీ హాజరు కాలేదు.
- సీట్ల సర్దుబాటు ఒకపట్టాన తేలలేదు. చివరకు ఆర్జేడీ 143 స్థానాలతో పెద్దపార్టీ పాత్ర పోషించి, కాంగ్రెస్‌కు 61 ఇచ్చింది. మిగిలినవి ఇతర పక్షాలకు సర్దింది. ఎంతచేసినా అప్పటికే నామినేషన్లు వేసినవారి కారణంగా కూటమిలోని నేతలు డజనుకు పైగా స్థానాల్లో ఒకరిపై ఒకరు పోటీ పడాల్సి వచ్చింది. ఇది స్పష్టమైన ఓట్ల చీలికకు తావిచ్చింది.
- కేంద్ర మంత్రి చిరాగ్ పాస్వాన్ నేతృత్వంలోని ఎల్జేపీ (రాంవిలాస్) గతసారి ఒంటరిగా పోటీచేసింది. ఈసారి ఎన్డీయేలో చేరింది. ఇది కూడా మహాగఠ్‌బంధన్‌కు కొంత గండికొట్టింది.

ఇక బెంగాల్, తమిళనాడుపై గురి!

- కుదిరితే కేరళలోనూ పాగా
- బిహార్‌లో ఘన విజయంతో త్వరలో ఎన్నికలు జరిగే రాష్ట్రాల్లో భాజపా అనుకూల పరిస్థితులు



ఈనాడు, దిల్లీ: సర్వే సంస్థల అంచనాలను మించి బిహార్‌లో జైత్ర యాత్రను కొనసాగించిన ఉత్సాహంతో భాజపా నేతృత్వంలోని ఎన్డీయే...త్వరలో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న ఐదు రాష్ట్రాల్లో సమరనాదాన్ని మోగించనుంది. ఓటములను గెలుపుగా, గెలుపులను భారీ విజయాలుగా మార్చుకోవడంలో తమకు ఎవ్వరూ సాటిరారని బిహార్ ఫలితాల ద్వారా ప్రధాని మోదీ మరోసారి చాటిచెప్పారు. ఈ గెలుపు వర్తమాన రాజకీయాల్లో ఎవ్వరూ ఢీకొట్టలేని బాహుబలిగా మోదీని మార్చగా... ప్రత్యర్థి పార్టీలు, నాయకులను మరుగుజ్జులను చేసింది. తాజా భారీ విజయంతో భాజపా వచ్చే ఏడాది అసెంబ్లీ ఎన్నికలు జరిగే అస్సాం, కేరళ, పుదుచ్చేరి, తమిళనాడు, పశ్చిమబెంగాల్‌లోని రాజకీయ పరిస్థితులపై సగం పైచేయి సాధించినట్లు కనిపిస్తోంది. అస్సాం, పశ్చిమబెంగాల్‌లలో ఒంటరిగా, తమిళనాడు, పుదుచ్చేరిల్లో కూటమిగా భాజపా బలంగా ఉంది. కేరళలో ఇప్పటివరకూ అంతగా బలోపేతం కాలేకపోయినప్పటికీ ప్రతి ఎన్నికలోనూ కమలం పార్టీకి వచ్చే ఓట్ల శాతం పెరుగుతోంది. ఇది తమలో ఎవర్ని దెబ్బతీస్తుందోనన్న భయాన్ని ప్రత్యర్థుల్లో సృష్టించగలుగుతోంది. ప్రస్తుత బిహార్ ఘన విజయం.. 2029 సార్వత్రిక ఎన్నికలకు ముందు జరిగే అన్ని అసెంబ్లీ ఎన్నికలపైనా గట్టిపట్టు సాధించేందుకు భాజపాకు ఒక బలవర్ధినిగా పనిచేయడం ఖాయంగా కనిపిస్తోంది.

- 2026లో అస్సాం, పశ్చిమబెంగాల్, తమిళనాడు, పుదుచ్చేరి, కేరళలలో అసెంబ్లీ ఎన్నికలు జరుగనున్నాయి. అస్సాం ఇప్పటికే భాజపా పాలనలో ఉంది. పుదుచ్చేరిలో ఎన్డీయే ప్రభుత్వమే ఉంది.
- గత రెండు అసెంబ్లీ ఎన్నికల్లో గట్టిగా ప్రయత్నించినా పశ్చిమ బెంగాల్‌లో పాగా వేయలేకపోయిన భాజపా శ్రేణుల్లో బిహార్ విజయం సమరోత్సాహాన్ని నింపడం ఖాయం. పొరుగు రాష్ట్రమైన బిహార్‌లో ఎన్డీయే భారీ విజయం బెంగాల్ ప్రజలపై ప్రభావం చూపే అవకాశం ఎక్కువే. బిహార్‌లో ఇండియా కూటమి పార్టీలు ప్రచారాస్త్రంగా ప్రయోగించిన ఓటర్ల జాబితా ప్రత్యేక ముమ్మర సవరణ (సర్) అంశం విఫలమైన నేపథ్యంలో బెంగాల్‌లో ముఖ్యమంత్రి మమతా బెనర్జీ ఆ విషయంపై కొంత మెతకవైఖరి ప్రదర్శించి తన వ్యూహాన్ని మార్చుకొనే అవకాశం ఉంది.
- తమిళనాడులోనూ క్రమంగా బలపుంజుకుంటున్న భాజపా... ఏఐఏడీఎంకేతో సీట్ల విషయంలో బేరసారాలు సాగించి పైచేయి సాధించడానికి తాజా విజయం దోహదపడుతుంది. డీఎంకే ప్రభుత్వాన్ని ఓడించేందుకు కమలం పావులు కదుపుతోంది.
- అస్సాంలో చొరబాటుదారుల అంశాన్ని భాజపా మరింత విస్తృతంగా ప్రచారం చేసి ఎన్నికలకు ముందే కాంగ్రెస్‌ను కార్నర్ చేసి పైచేయి సాధించడానికి తాజా గెలుపు అవకాశం కల్పించనుంది.
- కేరళలో ఇప్పటివరకు ఎల్‌డీఎఫ్, యూడీఎఫ్‌ల మధ్యే ఉన్న అసెంబ్లీ ఎన్నికల పోరును త్రిముఖంగా మార్చేలా ప్రచారం చేయడానికి భాజపాకు తాజా ఫలితాలు బలాన్ని ఇచ్చినట్లు కనిపిస్తోంది.
- 2027లో ఎన్నికలు జరిగే గుజరాత్, హిమాచల్‌ప్రదేశ్, గోవా, మణిపుర్, పంజాబ్, ఉత్తర్‌ప్రదేశ్, ఉత్తరాఖండ్‌లలో; 2028లో కర్ణాటక, త్రిపుర, మేఘాలయ, నాగాలాండ్ అసెంబ్లీ ఎన్నికల్లో ప్రత్యర్థులు విజయం సాధించాలంటే ఎంత కష్టమన్నది తాజా ఫలితాలు నిరూపించాయి.
- ఆంధ్రప్రదేశ్, ఒడిశా, హరియాణా, మహారాష్ట్ర, బిహార్ ఎన్నికల్లో ..ఎన్డీయే పక్షాలు మహిళా ఓటర్లను లక్ష్యంగా చేసుకొని సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రకటించి ఘన విజయాలను సాధించాయి. వచ్చే ఏడాది జరగబోయే ఐదు రాష్ట్రాల ఎన్నికల్లోనూ ఇదే తరహా విధానంతో వెళ్లడానికి బిహార్ ఫలితాలు దారిచూపాయని చెప్పొచ్చు.
- రాబోయే రోజుల్లో ఎన్డీయే గూటికి మరిన్ని ప్రాంతీయ పార్టీలు రావడానికీ తాజా ఫలితాలు దోహదపడనున్నాయి.

తమ్ముడి గెలుపు.. అన్న ఓటమి



తేజ్ ప్రతాప్

పట్నా: ఆర్జేడీ అగ్రనేత, ఇండియా కూటమి ముఖ్యమంత్రి అభ్యర్థి తేజస్వీ యాదవ్.. రాఘోపుర్ నియోజకవర్గం నుంచి విజయం సాధించారు. ఆయన భాజపా అభ్యర్థి సతీశ్ కుమార్‌పై 14,532 ఓట్ల తేడాతో నెగ్గారు. మహువా స్థానం నుంచి పోటీ చేసిన తేజస్వీ సోదరుడు.. జనశక్తి జనతాదళ్ అధ్యక్షుడు తేజ్ ప్రతాప్ మాత్రం పరాజయం పాలయ్యారు. ఆయన మూడో స్థానానికి పరిమితమయ్యారు. ఈ స్థానం నుంచి లోక్ జనశక్తి పార్టీ (రామ్‌విలాస్) అభ్యర్థి సంజయ్ కుమార్ సింగ్.. తన సమీప ప్రత్యర్థి ఆర్జేడీకి చెందిన ముకేశ్ కుమార్‌పై 44,997 ఓట్లతో విజయం సాధించారు. భాజపా నుంచి గెలిచిన ప్రముఖుల్లో సామ్రాట్ చౌధరీ (తారాపుర్), విజయ్ కుమార్ సిన్హా (లఖిసరాయ్), మైథిలీ ఠాకూర్ (అలీ నగర్) ఉన్నారు. జేడీయూ నుంచి నెగ్గిన ముఖ్యుల్లో విజయ్‌కుమార్ చౌధరీ (సరాయ్‌రంజన్), శ్రావణ్ కుమార్ (నలంద), బిజేంద్ర ప్రసాద్ యాదవ్ (సుపౌల్) ఉన్నారు.

ఒకటి నుంచి.. 19 స్థానాలకు చిరాగ్



ఈటీవీ భారత్: బిహార్ శాసనసభ ఎన్నికల్లో అయిదేళ్ల కిందట ఒకే ఒక్క స్థానానికి పరిమితమైన లోక్ జనశక్తి పార్టీ (ఎల్జేపీ - రామ్ విలాస్) తాజా ఫలితాల్లో 19 స్థానాల్లో విజయంతో సత్తా చాటింది. ఈ విజయంలో పార్టీ అధినేత చిరాగ్ పాస్వాన్ కీలక భూమిక పోషించారు. 2020 ఎన్నికల్లో నీతీశ్ నాయకత్వాన్ని వ్యతిరేకించిన చిరాగ్ ఎన్డీయే కూటమిలోని భాజపాకు మద్దతిస్తూనే 135 నియోజకవర్గాల్లో అభ్యర్థులను నిలబెట్టారు. ఆ ఎన్నికల్లో ఒక్క సీటుకు పరిమితమై జేడీయూ ఓట్లకు గండి కొట్టడంలో ప్రధానపాత్ర పోషించారన్న విశ్లేషణలు వెలువడ్డాయి. 2015లో 71 సీట్లు సాధించిన జేడీయూ చిరాగ్ ప్రభావంతో 43 స్థానాలకే పరిమితమైంది. ఆ తర్వాత బాబాయి పశుపతి కుమార్ పారస్‌తో తలెత్తిన విభేదాల కారణంగా 2021లో ఎల్జేపీ (రామ్ విలాస్) పేరిట కొత్త పార్టీని చిరాగ్ ప్రారంభించారు. తండ్రి వారసత్వాన్ని పుణికిపుచ్చుకొని బిహార్ దళిత నాయకుడిగా ఎదిగారు. 2024 లోక్‌సభ ఎన్నికల్లో ఎన్డీయేతో కలిసి పోటీ చేసి 5 స్థానాల్లో విజయం సాధించి ఉనికి చాటుకున్నారు. ఆ తర్వాత మోదీ మంత్రివర్గంలో కేంద్ర ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమల శాఖ మంత్రిగా బాధ్యతలు కూడా చేపట్టారు. మోదీ పట్ల వీర విధేయత చిరాగ్‌కు బలంగా మారింది.

చతికిలపడిన చాణక్యుడు

- స్వరాష్ట్రంలో పనిచేయని పీకే నినాదం
- ఖాతా తెరవని జన్‌సురాజ్ పార్టీ

పట్నా: ఎన్నికల వ్యూహకర్తగా దేశ రాజకీయాల్లో తనదైన ముద్ర వేసిన ప్రశాంత్ కిశోర్ (పీకే).. సొంత రాష్ట్రమైన బిహార్‌లో మాత్రం తొలి ప్రయత్నంలోనే ఘోర పరాభవాన్ని చవిచూశారు. 'చాయ్ పే చర్చా, కాఫీ విత్ కెప్టెన్' వంటి నినాదాలు, సర్వేలు, సోషల్ మీడియా ప్రచార వ్యూహాలతో అనేక పార్టీలను అధికార పీఠమెక్కించడంలో కీలకంగా వ్యవహరించిన ఆయనకు.. స్వరాష్ట్రంలో మాత్రం సొంత నినాదం పని చేయలేదు. వలసలు, నిరుద్యోగం, అభివృద్ధిలో వెనకబడిపోయిన రాష్ట్రంలో.. రాజకీయ ముఖచిత్రాన్ని మారుస్తానని హామీ ఇచ్చే ప్రయత్నం చేసినా బిహారీలు కన్నెత్తి కూడా చూడలేదు. రాష్ట్రంలో దాదాపు అన్ని స్థానాల్లో పోటీ చేసినా బోణీ కొట్టని జన్‌సురాజ్ పార్టీ(జేఎస్పీ) అనేక చోట్ల మూడో స్థానానికే పరిమితమైంది.

వారి విజయాల్లో కీలక పాత్ర

రాజకీయ వ్యూహకర్తగా అవతారమెత్తిన ప్రశాంత్ కిశోర్.. కొన్నేళ్ల క్రితం ఇండియా పొలిటికల్ యాక్షన్ కమిటీ పేరుతో కన్సల్టెన్సీ ఏర్పాటు చేశారు. డేటా విశ్లేషణ ఆధారిత విధానాలు, బూత్‌స్థాయి నిర్వహణ, క్షేత్రస్థాయి సమస్యలు, సోషల్ మీడియా ప్రచారం వంటి సరికొత్త అస్త్రాలతో పలు పార్టీల విజయంలో కీలకంగా వ్యవహరించారు. చాయ్ పే చర్చా, అబ్ కీ బార్ మోదీ సర్కార్ వంటి నినాదాలతో 2014లో మోదీ ప్రచారాలను కొత్త పుంతలు తొక్కించారు. ఉత్తర్‌ప్రదేశ్‌లో యోగికి రోడ్ షోలు, బిహార్‌లో 'నీతీశ్ నాయక్', పంజాబ్‌లో అమరీందర్ సింగ్‌కు 'కాఫీ విత్ కెప్టెన్' ఏపీలో జగన్ 'నవరత్నాలు', కేజ్రీవాల్‌కు 'ఉచిత' సలహాలు, బెంగాల్‌లో దీదీకి 'బంగ్లా నిజేర్ మేయేకే చాయ్', స్టాలిన్‌కు సలహాలు అందించారు. వినూత్న విధానాలతో దాదాపు అందర్నీ గట్టెక్కించిన పీకే.. సొంత రాష్ట్రంలో మాత్రం చతికిలపడ్డారు.

పాదయాత్రలు చేసినా...

రెండు, మూడేళ్ల క్రితం నుంచే బిహార్‌పై దృష్టిసారించిన పీకే.. 'బిహార్ బద్లావ్' పేరుతో 2022లో పాదయాత్ర చేపట్టారు. వందల కిలోమీటర్లు ఇంటింటికీ తిరిగారు. బిహార్ రూపురేఖలను మార్చే ప్రయత్నం చేస్తానని చెప్పిన ఆయన జన్‌సురాజ్ పార్టీని స్థాపించారు. సామాజిక వేత్తలు, మేధావులు, మాజీ ఉన్నతాధికారులను ఏకం చేసే ప్రయత్నం చేశారు. రాజకీయ నేపథ్యం లేని కొత్త ముఖాలను పరిచయం చేశారు. ఉద్యోగాలు, విద్య, ఆరోగ్యం, వలసల కట్టడిపై వాగ్దానాలు ఇచ్చారు. అధికారంలోకి వస్తే మద్యపాన నిషేధాన్ని ఎత్తివేసి.. వచ్చే ఆదాయాన్ని అభివృద్ధి కోసం ఖర్చు పెడతానన్నారు. ఆయన సభలకు, రోడ్‌షోలకు భారీస్థాయిలో హాజరైనప్పటికీ వాటిని ఓట్లుగా మార్చడంలో వెనకబడ్డారు.



సంస్థాగతంగా బలంగా లేక..

జనాదరణ ఉన్న నేతలు లేకపోవడం, సంస్థాగతంగా పార్టీ బలహీనంగా ఉండటం, కొన్నిచోట్ల క్యాడర్ తిరుగుబాటు, చివరి క్షణంలో నేతలు పార్టీలు మారడం వంటివి జన్ సురాజ్‌కు ప్రతికూలంగా మారాయి. ప్రధాన పార్టీలు పీకే పార్టీని ప్రత్యర్థుల బీ-టీమ్‌గా ప్రచారం చేశాయి. పోటీకి దూరంగా ఉండి పార్టీ బలోపేతం పైనే ప్రశాంత్ దృష్టిపెట్టారు. పోలింగ్‌కు ముందే ఫలితాలను అంచనా వేసిన ఆయన.. వస్తే 150, లేదంటే పది సీట్లు వస్తాయని ముందుగానే చెప్పారు. గతంలో ప్రధాని మోదీ, నీతీశ్ కుమార్‌ల విజయానికి కృషి చేసి ఓటమి ఎరుగని కన్సల్టెంటుగా పేరు తెచ్చుకున్న ఆయన.. వారి వ్యూహాల ముందు గెలవలేకపోయారు.

ఆర్జేడీ.. హతవిధీ..

- 2010 తరహాలోనే తాజా ఫలితం
- కొన్ని వర్గాలనే నమ్ముకోవడంతో భంగపాటు

(ఈటీవీ భారత్, ఇంటర్నెట్ డెస్క్)

బిహార్‌లో రాష్ట్రీయ జనతాదళ్ (ఆర్జేడీ)కు ఎదురైన చేదు ఫలితం ఆ పార్టీ చరిత్రలో రెండో ఘోర పరాభవం. గత ఎన్నికల్లో అత్యధికంగా 75 సీట్లు గెలిచి ఆ రాష్ట్రంలో అతిపెద్ద పార్టీగా అవతరించి ఈసారి ఘోర పరాజయం పాలైంది. 2010 ఎన్నికల్లో ఆర్జేడీ దారుణమైన ఫలితం చవిచూసింది. ఆ ఎన్నికల్లో 22 సీట్లనే గెలుచుకుంది. ఇప్పుడు మళ్లీ అదే పరిస్థితి. ఒకదశలో ఆ పార్టీ నేత తేజస్వీ యాదవ్ విజయంపై కూడా నీలిమేఘాలు కమ్ముకున్నాయి. కంచుకోటలాంటి రాఘోపుర్‌లో ఒకానొక సమయంలో ఓటమి తప్పదనిపించింది. చివరకు విజయం సాధించారు. మార్పు కావాలి, యువ నాయకత్వం రావాలి అని చెప్పిన ఆర్జేడీకి గతంలో ప్రజల నుంచి ఆదరణ లభించింది. దీంతో 2020లో అతిపెద్ద పార్టీగా ఆవిర్భవించింది. తర్వాత సీన్ మారిపోయింది. ఉప ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో తేజస్వి నుంచి ప్రజలు ఆశించిన ఫలితాలు కనిపించలేదన్న అభిప్రాయం ఉంది. దీంతో ఈ ఎన్నికల్లో ఆయన ఎన్ని ప్రయత్నాలు చేసినా ఫలితం లేకుండా పోయింది. మొదటి నుంచి ఆర్జేడీకి ముస్లింలు, యాదవులు సంప్రదాయ ఓటుబ్యాంకుగా ఉన్నారు. ఇప్పుడూ వారినే నమ్ముకుని ఇతర వర్గాల్లోకి ఆ పార్టీ వెళ్లలేకపోవడంతో ఆర్జేడీ దారి పాతదేనన్న భావన ఓటర్లలో పెరిగిందని విశ్లేషకుల మాట. ఆ పార్టీ 52 చోట్ల టికెట్లను యాదవులకే ఇచ్చింది.



బలహీన కాంగ్రెస్‌తో నష్టం

బిహార్‌లో మహాగఠ్‌బంధన్ భాగస్వామి అయిన కాంగ్రెస్ చాలా బలహీన స్థితిలో ఉంది. అయినా ఆ పార్టీపై విశ్వాసం పెట్టి, స్థానిక సమస్యల కంటే ఓటుచోరీ వంటి రాజకీయ ఆరోపణలపై దృష్టి పెట్టడం ఆర్జేడీకి మైనస్‌గా మారిందనే విశ్లేషణలు వినిపిస్తున్నాయి. బిహార్‌లో మొదటి నుంచి దళితుల్లో కొన్ని వర్గాలవారు, వలస కూలీల్లో కొంత శాతం.. కాంగ్రెస్‌కు మద్దతుగా ఉన్నారు. అయితే ఆర్జేడీని అధికారంలోకి తీసుకొచ్చేంత స్థాయిలో వీరులేరు. ఒకవిధంగా చెప్పాలంటే బలహీన కాంగ్రెస్ పార్టీ.. ఆర్జేడీకే భారమైందంటున్నారు.

- ఈ ఎన్నికల్లో ప్రతిపక్ష ఓట్లను ఎక్కువగా చీల్చింది చిన్న పార్టీలే. అసదుద్దీన్ ఒవైసీ నేతృత్వంలోని ఏఐఎంఐఎం సీమాంచల్ ప్రాంతంలో ఆర్జేడీ ముస్లిం ఓటు బ్యాంకును నిలువునా చీల్చింది.

విద్యుత్తు ఇంజినీర్..

రాజకీయ విద్వత్తు

- ఎమ్మెల్యేగా ఒక్కసారే గెలిచినా 20 ఏళ్లుగా సీఎం!
- బిహార్ రాజకీయాలపై నీతీశ్‌కు సడలని పట్టు



పట్నా: నీతీశ్ కుమార్ పనైపోయింది.. ఆయన ఓ పల్టూరామ్.. అధికారం కోసం ఎవరితోనైనా కలిసి నడుస్తారు.. అనే విమర్శలను పటాపంచలు చేస్తూ బిహార్ ఓటర్లు తీర్పు ఇచ్చారు. 'సుశాసన్ బాబు'గా ఆయనకున్న ఇమేజ్ ఏమాత్రం చెక్కుచెదరలేదనడానికి తాజా అసెంబ్లీ ఎన్నికల ఫలితాలే నిదర్శనం. ఆయన ఇమేజ్ ముందు ప్రభుత్వ వ్యతిరేకత దూదిపింజల్లా తేలిపోయింది. ఫలితంగా జేడీయూ, కూటమి గతంలో కంటే అధికంగా సీట్లు గెలుచుకున్నాయి. దీంతో బిహార్‌ను సుదీర్ఘకాలం పాలించిన సీఎంగా ఆయన తన రికార్డును మరింత బలోపేతం చేసుకోవడానికి సిద్ధమయ్యారు.

పార్లమెంటు ఎన్నికలతో రాటుదేలిపోయి..

పట్నా సమీపంలోని భక్తియార్‌పుర్‌లో 1951లో నీతీశ్ కుమార్ జన్మించారు. తండ్రి కవిరాజ్ రామ్‌లఖన్ సింగ్ స్వాతంత్ర్య సమరయోధుడు, ఆయుర్వేద వైద్యుడు. తల్లి పరమేశ్వరి. నీతీశ్ బిహార్ ఇంజినీరింగ్ కాలేజ్ (ప్రస్తుతం పట్నా ఎన్ఐటీ)లో ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్ పూర్తిచేశారు. తర్వాత రాష్ట్ర విద్యుత్ బోర్డులో కొంతకాలం ఉద్యోగం చేశారు. ఆ తర్వాత రాజకీయాల్లోకి వచ్చారు. నిజానికి విద్యార్థి దశ నుంచే ఆయన రాజకీయాల్లో చురుగ్గా వ్యవహరించేవారు. జయప్రకాశ్ నారాయణ్ చేపట్టిన ఉద్యమంలో పాల్గొన్నారు. ఆ సమయంలోనే ప్రస్తుత ఆర్జేడీ అధినేత లాలూప్రసాద్, దివంగత భాజపా నేత సుశీల్‌కుమార్ మోదీ వంటి నేతలతో పరిచయం ఏర్పడింది.

జాతీయ రాజకీయాల్లో ముద్ర

1977, 80, 85 అసెంబ్లీ ఎన్నికల్లో బరిలోకి దిగారు. 1985లో మాత్రమే ఆయన అసెంబ్లీలో అడుగుపెట్టారు. ఆ తర్వాత జాతీయ రాజకీయాలపై దృష్టిపెట్టారు. 1989, 1991, 1996, 1998, 1999, 2004లో విజయవంతంగా ప్రజామోదం పొందుతూ ఎంపీగా ఎన్నికయ్యారు. అస్థిర సంకీర్ణ ప్రభుత్వాలు ఉండటంతో కేవలం 15 ఏళ్ల వ్యవధిలో ఆరు ప్రత్యక్ష ఎన్నికలు ఎదుర్కొని రాటుదేలారు. ఎన్డీయే సర్కారులో రైల్వే, వ్యవసాయశాఖ సహాయ మంత్రిగా పనిచేశారు. ఆయన హయాంలోనే ఇంటర్నెట్‌లో టికెట్ బుకింగ్స్, తత్కాల్, రైల్వే బుకింగ్ కేంద్రాల ఏర్పాటు వంటి నిర్ణయాలు తీసుకున్నారు. 1999లో బెంగాల్‌లో జరిగిన ఓ రైలు ప్రమాదానికి బాధ్యత వహిస్తూ రాజీనామా చేశారు. 2000 సంవత్సరం మార్చిలో ఒకసారి వారం రోజులు బిహార్ సీఎంగా పనిచేశారు. తిరిగి కేంద్ర రాజకీయాల్లో కొనసాగారు. 2004లో కేంద్రంలో ఎన్డీయే ఓటమి పాలవడంతో రాష్ట్ర రాజకీయాల్లోకి పునరాగమనం చేశారు.

అసెంబ్లీ ఎన్నికలకు రాంరాం

రాష్ట్ర రాజకీయాల్లో తిరిగొచ్చాక అసెంబ్లీ ఎన్నికల బరిలో నీతీశ్ నిలవలేదు. శాసన మండలి మార్గాన్ని ఎంచుకొన్నారు. ఒక స్థానంలో గెలవడం తనకు చాలా సులువని.. అన్ని స్థానాలపై దృష్టిపెట్టడానికి వీలవుతుందనే ఈ నిర్ణయం తీసుకున్నట్లు పలు సందర్భాల్లో ఆయన వెల్లడించారు. 2005లో ఆర్జేడీపై వ్యతిరేకతను ప్రజల్లోకి తీసుకెళ్లిన నీతీశ్-వాజ్‌పేయీ జోడీ ఎన్డీయేను అధికారంలోకి తెచ్చింది. దీంతో రెండోసారి సీఎం పదవి చేపట్టారు. నాటినుంచి 'జంగిల్‌రాజ్' మరక నుంచి బిహార్‌ను బయటపడేసేందుకు అన్నివిధాలా కృషి చేశారు. ప్రజా సంక్షేమ బడ్జెట్లు ప్రవేశపెట్టారు. గూండాలను ఉక్కుపాదంతో అణచివేశారు. అవినీతి మరకలు అంటుతాయనే భయంతో తన కుటుంబాన్ని రాజకీయాలకు దూరంగా ఉంచారు. ఇప్పటికీ ఆయన కుమారుడి పేరు చాలామందికి తెలియదు. మహాదళితులు, అత్యధిక వెనుకబడిన వర్గాల ఆసరాతో ఆర్జేడీ ఓటు బ్యాంక్‌ను తీవ్రంగా గండి కొట్టారు. ఎమ్మెల్యేగా ఒక్కసారే గెలిచినా.. 20 ఏళ్లుగా సీఎం కుర్చీపై కొనసాగడం నీతీశ్ ప్రత్యేకత.

ఎన్డీయేతో దాగుడుమూతలు

మోదీ రాకతో బిహార్ రాజకీయాల్లో కీలక మార్పులు చోటు చేసుకున్నాయి. ప్రధాని మోదీతో బిహార్ సీఎం నీతీశ్‌కు తొలినాళ్లలో గొప్ప స్నేహం లేదు. గుజరాత్ అల్లర్లలో ఆరోపణలు ఎదుర్కొంటున్న సమయంలో ఆ రాష్ట్ర సీఎంగా ఉన్న మోదీతో కలిసి 2010 ఎన్నికల ప్రచారంలో పాల్గొనడానికి కూడా నీతీశ్ ఇష్టపడలేదు. 2014 సార్వత్రిక ఎన్నికల్లో మోదీ నేతృత్వంలో భారీ విజయం సాధించడంతో.. బిహార్‌లో పార్టీ ఓటమికి బాధ్యత వహిస్తూ సీఎం పదవికి నీతీశ్ రాజీనామా చేశారు. జీతన్‌రామ్ మాంఝీని సీఎంగా చేశారు. 2015 ఎన్నికలకు ముందు తిరిగి సీఎంగా బాధ్యతలు చేపట్టారు. ఆ ఏడాది కాంగ్రెస్, ఆర్జేడీతో జేడీయూ ఎన్నికల బరిలోకి దిగి విజయం సాధించింది. కానీ ఆ తరవాత ఆ స్నేహాన్ని కాదనుకున్న నీతీశ్ తిరిగి ఎన్డీయే గూటికి చేరారు. 2022 తర్వాత మళ్లీ ఆర్జేడీతో జట్టు కట్టిన ఆయన 2024 సార్వత్రిక ఎన్నికలకు ముందు తిరిగి ఎన్డీయేలోకి వచ్చారు. ఏడాది క్రితం జరిగిన ఆ ఎన్నికలతో కేంద్రంలో కీలకంగా మారారు. ఇలా కూటములను మార్చడం వల్ల ఆయనను ప్రత్యర్థులు 'పల్టూ రామ్' అని ఎద్దేవా చేస్తుంటారు. అయితే నీతీశ్ ఇమేజ్‌తో పోటీపడే నేత భాజపాలో కూడా లేకపోవడంతో ముఖ్యమంత్రి అభ్యర్థి ప్రకటన చేయకపోయినా.. ఆయన నేతృత్వంలోనే ఎన్నికలకు వెళుతున్నట్లు ప్రధాని మోదీ ప్రకటించారు.

దిల్లీ పేలుడు.. బాంబర్ ఉమర్ నబీ ఇల్లు పేల్చివేత



శ్రీనగర్: దిల్లీ ఎర్రకోట వద్ద జరిగిన బాంబు పేలుడు ఘటనపై దర్యాప్తు కొనసాగుతోన్న వేళ కీలక పరిణామం చోటుచేసుకుంది. పేలుడుకు కారణమైన కారును నడిపిన ప్రధాన నిందితుడు డాక్టర్ ఉమర్ నబీ ఇంటిని భద్రతా దళాలు పేల్చివేశాయి. జమ్మూకశ్మీర్ పుల్వామాలోని అతడి ఇంటి వద్ద గురువారం అర్ధరాత్రి దాటిన తర్వాత ఈ కూల్చివేత ప్రక్రియను చేపట్టినట్లు అధికారిక వర్గాలు వెల్లడించాయి. దిల్లీ పేలుడుపై కొనసాగుతోన్న దర్యాప్తులో భాగంగా ఉమర్ ఇంటిని ధ్వంసం చేసినట్లు తెలిపాయి.

కోసం దర్యాప్తు కొనసాగుతోందని వివరించారు.

పోస్టులు పెట్టిన మరో ముగ్గురి అరెస్టు

గువాహటి: దిల్లీ పేలుడుకు మద్దతు తెలుపుతూ సామాజిక మాధ్యమాల్లో పోస్టులు పెడుతున్న మరో ముగ్గురిని అరెస్టు చేసినట్లు అస్సాం ముఖ్యమంత్రి హిమంత బిశ్వ శర్మ 'ఎక్స్' వేదికగా శుక్రవారం పేర్కొన్నారు. దీంతో వీరి సంఖ్య 20కి చేరింది. ఇలాంటి మరికొందరి

8 మంది సిబ్బందికి తీవ్ర గాయాలు

శ్రీనగర్: ఫరీదాబాద్ ఉగ్ర కుట్రకు సంబంధించి ఇటీవల స్వాధీనం చేసుకున్న పేలుడు పదార్థాల శాంపిల్ తీస్తుండగా విస్ఫోటం చోటుచేసుకుంది. జమ్మూ కశ్మీర్‌లోని నౌగాం పోలీస్ స్టేషన్ పరిధిలో శుక్రవారం రాత్రి జరిగిన ఈ ఘటనలో 8 మంది సిబ్బంది తీవ్రంగా గాయపడ్డారు.

జాతీయ వైద్య రిజిస్టర్ నుంచి ఆ వైద్యులకు ఉద్వాసన

దిల్లీ: దేశ రాజధాని దిల్లీలో కారు బాంబు పేలుడు నేపథ్యంలో చట్టవిరుద్ధ కార్యకలాపాల నిరోధక చట్టం (ఉపా) కింద అభియోగాలు ఎదుర్కొంటున్న వైద్యులు ముజఫర్ అహ్మద్, ఆదిల్ అహ్మద్ రాథర్, ముజమ్మిల్ షకీల్, షాహీన్ సయూద్‌లను జాతీయ వైద్య రిజిస్టర్ నుంచి తొలగించారు. ఈ మేరకు జాతీయ వైద్య కమిషన్ శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేసింది. దీంతో వీరు వైద్య ప్రాక్టీసు చేయడానికి లేదా వైద్యులుగా నియామకానికి అనర్హులు. కమిషన్ నుంచి తదుపరి ఉత్తర్వులు వచ్చేవరకూ ఇది అమల్లో ఉంటుంది. ఈ నెల 10న 2,900 కిలోల పేలుడు పదార్థాల స్వాధీనం, దిల్లీలోని ఎర్రకోట వద్ద 13 మందిని బలితీసుకున్న కారుబాంబు పేలుడు కేసులపై దర్యాప్తు జరుపుతున్న అధికారులు.. వాటితో ప్రమేయమున్న వైద్యులు సహా 8మందిని అరెస్టు చేశారు. ఇందులో ఆరోపణలు ఎదుర్కొంటున్న నలుగురు డాక్టర్ల తీరు.. వైద్యవృత్తికి సంబంధించిన నైతిక విలువలు, నిబద్ధతకు అనుగుణంగా లేదని ప్రాథమికంగా గుర్తించామని జాతీయ వైద్య కమిషన్ పేర్కొంది. అహ్మద్, రాథర్, షకీల్, సయీద్‌ల వైద్య రిజిస్ట్రేషన్‌ను నిలిపివేయాలని జమ్మూకశ్మీర్ మెడికల్ కౌన్సిల్ ఇప్పటికే ఆదేశించినట్లు తెలిపింది.



మానసిక ఆస్తులను సంపాదించుకోండి

వివిధ రంగాలు, అంశాలపై వచ్చిన పుస్తకాలు చదవండి. తరచూ కొత్త వ్యక్తులతో సంభాషించండి. పర్యటనలకు వెళ్లి విభిన్న సంస్కృతులను తెలుసుకోండి. ఇప్పటివరకూ చేయని సాహస కృత్యాలను చేయడానికి ప్రయత్నించండి. మీలో సృజనాత్మకత అడుగంటిపోకుండా చూసుకోండి. సాధ్యమైనన్ని ఎక్కువ అనుభవాలు, అనుభూతులను ప్రోది చేసుకోండి. వాటిని మీ మానసిక ఆస్తులుగా భావించండి.

– మనోజ్ అరోడా, రచయిత

కాంగ్రెస్‌కు బిహార్‌లో రెండో అతిపెద్ద దెబ్బ

- పోటీచేసిన 61 స్థానాల్లో గెలుపు ఆరుచోట్లే



దిల్లీ: బిహార్ శాసనసభ ఎన్నికల్లో ఎదురైన ఓటమి కాంగ్రెస్ పార్టీకి ఆ రాష్ట్రంలో రెండో అతిపెద్ద దెబ్బ. కూటమి భాగస్వామిగా 61 స్థానాల్లో బరిలోదిగిన ఆ పార్టీ కేవలం ఆరుచోట్ల గెలుపుతో సరిపెట్టుకోవాల్సి వచ్చింది. చాలాచోట్ల దారుణ ఓటమిని చవిచూడాల్సి వచ్చింది. ఓటుచోరీ ప్రచారం ఫలితాన్నివ్వలేదు. ఎంఐఎం, హిందుస్థానీ అవామ్ మోర్చాలకు చెరో ఐదు సీట్లు రాగా కాంగ్రెస్.. వాటికంటే మరోసీటు మాత్రమే ఎక్కువ సాధించింది. 2010లో కాంగ్రెస్‌కు నాలుగు సీట్లు వచ్చాయి. కోల్పోయిన పట్టును తిరిగి సాధించడం, అసమ్మతి స్వరాలను ఎదుర్కోవడం, శ్రేణులు చెదిరిపోకుండా కాపాడటం వంటి అనేక సవాళ్లు ఇప్పుడు పార్టీ ముందున్నాయి. దశాబ్దాలపాటు బిహార్‌ను ఏలిన పార్టీకి ఇప్పుడు ఇలాంటి పరిస్థితి రావడం శ్రేణులకు మింగుడుపడటం లేదు. 1952 ఎన్నికల్లో 239 స్థానాలు గెలుచుకున్న పార్టీ 2005 సరికి నామమాత్రంగా మిగిలింది. ఈసారి ఎన్నికల్లో పీసీసీ అధ్యక్షుడు కూడా ఎన్డీయే మిత్రపక్షమైన హిందుస్థానీ అవామ్ మోర్చా అభ్యర్థి చేతిలో ఓడిపోయారు. ఒకదాని తర్వాత ఒకటిగా రాష్ట్రాలను కోల్పోతుండటం, భాగస్వామ్య పక్షాలకు దన్నుగా నిలవలేకపోవడం పార్టీని ఇబ్బందికర పరిస్థితిలోకి నెట్టేసింది. వ్యూహాత్మక [illegible] మార్చుకోకపోతే మనుగడకే ప్రమాదమని పార్టీ శ్రేణులు అంటున్నాయి.

ఓటుచోరీకి విశ్వరూపం: ఖర్గే

ఓటుచోరీకి విశ్వరూపమే బిహార్ ఫలితాలని ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే వ్యాఖ్యానించారు. ప్రధాని మోదీ, కేంద్ర మంత్రి అమిత్ షా, ఎన్నికల సంఘం కలిసి ఓటుచోరీ చేస్తున్నట్లు ఆరోపించారు. ప్రజాతీర్పును గౌరవిస్తామని, ప్రజాస్వామ్య వ్యవస్థల్ని బలహీనపరుస్తున్న శక్తులపై పోరాటం కొనసాగిస్తామని చెప్పారు. క్షేత్రస్థాయి పరిస్థితులతో ఏమాత్రం సంబంధం లేని నేతల చేతికి అధికారం అప్పగించడం వల్లనే పార్టీకి వైఫల్యాలు ఎదురవుతున్నాయని పార్టీ దిగ్గజనేత.. దివంగత అహ్మద్ పటేల్ కుమార్తె ముంతాజ్ పటేల్ 'ఎక్స్' వేదికగా అభిప్రాయపడ్డారు. '[illegible]. ఇలాంటి నాయకులకే మళ్లీమళ్లీ ప్రోత్సాహకం లభిస్తుంది. ఎందుకంటే పార్టీలో వారి శక్తి, నియంత్రణ అలాంటిది. నెపాలు వద్దు. నిందలు వద్దు. అంతఃశోధన చేసుకుని, వాస్తవాలను స్వీకరించాల్సిన సమయం ఆసన్నమైంది' అని చెప్పారు. ఫలితాలను పార్టీ పరిశీలించి, లోతుగా ఆత్మవిమర్శ చేసుకుని ఓటమికి దారితీసిన సంస్థాగతమైన తప్పిదాలను సరిచేసుకుంటుందని కాంగ్రెస్ నేత శశిథరూర్ చెప్పారు.

శునకాల్ని ఇంటికి తెస్తోంది.. విడాకులిప్పించండి

- గుజరాత్ హైకోర్టును ఆశ్రయించిన భర్త



ఈటీవీభారత్: గుజరాత్ హైకోర్టులో విచిత్ర విడాకుల కేసు దాఖలైంది. భార్య (40)తరచూ ఇంటికి వీధి శునకాలను తీసుకువస్తోందని, ఎంత వారించినా తన మాట పట్టించుకోవడం లేదని.. విడాకులు ఇప్పించాలంటూ ఓ వ్యక్తి (41)హైకోర్టు తలుపు తట్టారు. శునకం ఒకసారి తనను కరిచినప్పటికీ భార్య ప్రవర్తనలో మార్పు రాలేదని వాపోయారు. [illegible] చేసుకుంటుంది. ఆమె వల్ల మానసిక వేదనకు గురవుతున్నాను, ఇక కలిసి జీవించలేనని పేర్కొన్నారు. దీనిపై తాజాగా విచారణ జరిపిన హైకోర్టు ఇరుపక్షాలకు నోటీసులు జారీ చేసి, తదుపరి విచారణను డిసెంబరు 1కి వాయిదా వేసింది. అసలేం జరిగిందంటే.. పిటిషనుదారుకు 2006లో వివాహం జరిగింది. ఆయన ఓ ప్రైవేటు సంస్థలో సీనియర్ ఉద్యోగిగా పనిచేస్తున్నారు. భార్య సైతం ప్రైవేటు ఉద్యోగినే. వీధి శునకాలపై ప్రేమతో వాటిని ఆమె ఇంటికి తీసుకురావడంతో ఇద్దరి మధ్య వివాదం మొదలైంది. [illegible] 2 కోట్లు కావాలని కోరింది.

పాక్‌లో 26 మంది తీవ్రవాదుల హతం

పెషావర్: ఖైబర్ పఖ్తుంఖ్వా ప్రావిన్సులో 26 మంది తీవ్రవాదుల్ని పాకిస్థాన్ భద్రతా బలగాలు శుక్రవారం హతమార్చాయి. బజౌర్, కోహాట్, కరక్ జిల్లాల్లో నిఘావర్గాల సమాచారంతో దాడులుచేసినట్లు భద్రతా అధికారి ఒకరు తెలిపారు.

స్వప్రయోజనాలకే తదుపరి దర్యాప్తు కోరుతున్నారు

వివేకా హత్య కేసులో సునీత తీరుపై నిందితుల వాదన

ఈనాడు, హైదరాబాద్: మాజీమంత్రి వై.ఎస్. వివేకానందరెడ్డి హత్య కేసుకు సంబంధించిన దర్యాప్తు పూర్తయిందని సీబీఐ కోర్టులో మెమో దాఖలు చేసిన అనంతరం ఆయన కుమార్తె ఎన్.సునీతారెడ్డి తిరిగి దర్యాప్తు కొనసాగించాలనడం స్వప్రయోజనాల కోసమేనని నిందితుల తరఫు న్యాయవాదులు వాదించారు. వివేకా హత్య కేసులో సందేహాస్పదంగా ఉన్న పలు అంశాలను వదిలేశారని, అసలు దోషులను పట్టుకునేందుకు దర్యాప్తును కొనసాగించేలా ఆదేశించాలంటూ సునీతారెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌పై సీబీఐ ప్రధాన కోర్టు న్యాయమూర్తి డాక్టర్ టి.రఘురాం శుక్రవారం విచారణ చేపట్టారు. ప్రధాన నిందితుడు గంగిరెడ్డి తరఫున సాయివంశీకృష్ణ, ఇ.ఉమామహేశ్వరరావులు వాదనలు వినిపిస్తూ సీబీఐ కోర్టులో కొనసాగుతున్న విచారణను అడ్డుకునేందుకే ఆమె ఈ పిటిషన్ వేశారన్నారు. 'ఒకవైపు సత్వర విచారణ చేపట్టేలా ఆదేశాలివ్వాలంటూ హైకోర్టులో పిటిషన్ వేసిన సునీత.. ఇక్కడ తిరిగి దర్యాప్తు కొనసాగించాలని కోరుతున్నారు. దర్యాప్తు కొనసాగితే విచారణ ముందుకెళ్లదన్న విషయం తెలిసీ పరస్పర విరుద్ధమైన పిటిషన్లు దాఖలు చేశారు. ఏ అంశాలపై దర్యాప్తు చేయాలో కూడా పిటిషనరే చెబుతున్నారు. అలా చెప్పే అధికారం, హక్కు ఆమెకు లేవు. దర్యాప్తు పూర్తయినట్లు సుప్రీంకోర్టుకు సీబీఐ నివేదించింది. తదుపరి దర్యాప్తునకు సుప్రీం కోర్టు ఆదేశాలు జారీ చేయలేదు. కేవలం కింది కోర్టుకు వెళ్లాలని మాత్రమే చెప్పింద'ని తెలిపారు. దీనిపై తదుపరి విచారణ ఈ నెల 17కు వాయిదా పడింది.

షీబా.. ఇక సెలవు!

అనారోగ్యంతో చనిపోయిన పోలీస్ జాగిలం



శిక్షకుడితో షీబా

విజయవాడ నేరవార్తలు, న్యూస్‌టుడే: స్నిఫర్ డాగ్‌గా ఎన్టీఆర్ పోలీస్ కమిషనరేట్‌లో 8 సంవత్సరాల పాటు విశేష సేవలు అందించిన షీబా(9) అనారోగ్యంతో శుక్రవారం చనిపోయింది. పోలీస్ కమిషనర్ ఎస్.వి.రాజశేఖరబాబు, సీఎస్ డబ్ల్యూ డీసీపీ ఎస్.వి.డి.ప్రసాద్, ఏసీపీ కృష్ణంరాజు తదితరులు షీబాకు నివాళులర్పించారు. అనంతరం అధికారిక లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించారు. లాబ్రడార్ రిట్రీవర్ జాతికి చెందిన షీబా 2016 డిసెంబరు 12న జన్మించింది. మంగళగిరి శిక్షణ కేంద్రంలో ఏఆర్ కానిస్టేబుల్ డి.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో పేలుడు పదార్థాలు గుర్తించడంలో శిక్షణ పొందింది. 8 సంవత్సరాల పాటు బందోబస్తులు, ప్రముఖుల పర్యటనల్లో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ముఖ్య పాత్ర పోషించింది.

నిర్లక్ష్యం.. నిర్వహణ లోపాలే కారణాలు!

- కాశీబుగ్గ ఘటనపై త్రిసభ్య కమిటీ నివేదిక



కాశీబుగ్గ ఆలయంలో తొక్కిసలాట జరిగిన ప్రదేశం

ఈనాడు డిజిటల్ శ్రీకాకుళం: శ్రీకాకుళం జిల్లా కాశీబుగ్గలోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఈ నెల ఒకటో తేదీన తొక్కిసలాట జరిగి 9 మంది భక్తులు మృతి చెందడానికి గల కారణాలను అధికారులు గుర్తించారు. కలెక్టర్ నియమించిన త్రిసభ్య కమిటీ (టెక్కలి ఆర్డీవో ఎం.కృష్ణమూర్తి, అదనపు ఎస్పీ కేవీ రమణ, దేవాదాయశాఖ సహాయ కమిషనర్ ప్రసాద్ పట్నాయక్) సమగ్ర విచారణ జరిపి నిర్లక్ష్యం, నిర్వహణ లోపాలు, తొందరపాటే ఘటన జరగడానికి కారణాలని నిర్ధారించారు.

తొందరపాటుతోనే తొక్కిసలాట

◆ ఆలయంలో దర్శనాలకు మధ్యాహ్నం 12 గంటల వరకు సమయాన్ని నిర్దేశించారు. ◆ లోపల ఎక్కువ మంది భక్తులు ఉండటంతో 11:30 గంటలకు బయట ఉన్న ప్రవేశ మార్గాన్ని మూసేశారు. ◆ ప్రవేశ మార్గానికి ముందు ఉన్న భక్తులు.. దర్శనం ముగించుకుని బయటకు వచ్చే మార్గంలోకి ఒక్కసారిగా వచ్చేశారు. ◆ దీన్ని గమనించిన అక్కడి సిబ్బంది బయటకు వచ్చే మార్గాన్ని మూసేశారు. ◆ దర్శనం పూర్తి చేసుకున్న వారిని బయటకు వదలాలని గేటు తీశారు. ◆ ఒక్కసారిగా లోపలికి వెళ్లడానికి అక్కడే వేచి ఉన్న భక్తులు బయటకు వచ్చే మార్గంలోకి ప్రవేశించారు. ◆ రాకపోకలకు ఒక్కటే మార్గం కావడంతో తొక్కిసలాట జరిగింది.

ఇష్టానుసారం నిర్మాణాలు

◆ ఆలయ నిర్మాణానికి సంబంధించి ఎలాంటి అనుమతులూ తీసుకోలేదు. ◆ భద్రతా ప్రమాణాలు పాటించకుండా ఇష్టానుసారం నిర్మాణాలు చేపట్టారు. ◆ బ్యారికేడ్లు, రెయిలింగ్ తక్కువ నాణ్యత కలిగినవి ఏర్పాటు చేశారు. ◆ భక్తులు పెద్దఎత్తున వచ్చారని పోలీసులకు సమాచారం ఇవ్వలేదు. ◆ ఉచిత బస్సు కారణంగా ఎక్కువ మంది మహిళలు వచ్చారు. ◆ సామాజిక మాధ్యమాల్లో ఆలయంపై ఎక్కువ ప్రచారం జరగడంతో అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు.

గిఫ్ట్ డీడ్‌పై ప్రకటన ఎందుకు ఇవ్వలేదు?

- తితిదే జేఈవో, పూర్వ వీజీవోలను ప్రశ్నించిన సీఐడీ

తిరుపతి (నేరవిభాగం), న్యూస్‌టుడే: 'పరకామణిలో చోరీ కేసు నిందితుడు రవికుమార్ నుంచి తితిదేకు గిఫ్ట్ డీడ్ తీసుకునే ముందు బహిరంగ ప్రకటన ఎందుకు ఇవ్వలేదు?' అని తితిదే జేఈవో వీరబ్రహ్మంను సీఐడీ బృందం ప్రశ్నించింది. తిరుమల పరకామణిలో చోరీ కేసును సీఐడీ డీజీ రవిశంకర్ అయ్యన్నార్ ఆధ్వర్యంలోని ప్రత్యేక బృందం దర్యాప్తు చేస్తోంది. శుక్రవారం తితిదే జేఈవో వీరబ్రహ్మం, నాటి వీజీవో బాలిరెడ్డి, తితిదే ఎఫ్అండ్‌సీవో బాలాజీ, తిరుమల వన్‌టౌన్ సీఐ చంద్రశేఖర్‌లతో పాటు ఐదుగురు పరకామణి సిబ్బందిని స్థానిక పద్మావతి వసతి గృహంలో విచారించారు. నిందితుడు రవికుమార్ తప్పును దిద్దుకునేందుకు రూ.14.43 కోట్ల విలువైన ఆస్తులను తితిదేకి గిఫ్ట్ డీడ్‌గా అందజేశారు. నిందితుడు ఇష్టపూర్వకంగా ఆస్తులు తితిదేకి ఇచ్చారా? ఎవరైనా ఒత్తిడి చేశారా? గిఫ్ట్ డీడ్‌కు సంబంధించిన ఆస్తుల గురించి ప్రజలకు బహిరంగ ప్రకటన ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నించినట్లు సమాచారం. దీనిపై ముక్తసరి సమాధానం ఇచ్చినట్లు తెలిసింది. చోరీ జరిగిన రోజు అందుబాటులో లేని ఏవీఎస్‌వో సతీష్‌కుమార్‌ను తర్వాత పిలిచి ఎందుకు ఫిర్యాదు చేయాలని చెప్పారని అప్పటి వీజీవో బాలిరెడ్డిని ప్రశ్నించినట్లు సమాచారం. నిందితుణ్ని పట్టుకున్నప్పుడు ఎన్ని నోట్లు దొరికాయని ఆరా తీసినట్లు తెలిసింది. తర్వాత తిరుమల వన్‌టౌన్ సీఐ చంద్రశేఖర్‌ను కేసు రాజీ చేయడంలో ఆయన పాత్ర గురించి ప్రశ్నించినట్లు సమాచారం. తర్వాత పరకామణిలో పనిచేసే సిబ్బందిని చోరీ జరిగిన రోజు ఏమి జరిగిందని ఆరా తీశారు.

పరకామణి డబ్బు లెక్కింపు పర్యవేక్షణకు ఇద్దరు భక్తులను ఆహ్వానిస్తారు. చోరీ జరిగిన రోజు లెక్కింపు పర్యవేక్షణకు వచ్చిన భక్తులెవరు..? చోరీ గురించి వారికి ఏం తెలుసనే విషయమై సీఐడీ దృష్టి పెట్టినట్లు తెలుస్తోంది.

చిన్న అప్పన్న కస్టడీకి కోర్టు అనుమతి

ఈనాడు, తిరుపతి: తిరుమల లడ్డూ తయారీకి కల్తీ నెయ్యి సరఫరా కేసులో తితిదే మాజీ ఛైర్మన్, వైకాపా రాజ్యసభ సభ్యుడు వైవీ సుబ్బారెడ్డి మాజీ పీఏ చిన్న అప్పన్నను ఐదు రోజుల సిట్ కస్టడీకి అప్పగిస్తూ నెల్లూరు ఏసీబీ కోర్టు న్యాయమూర్తి సరస్వతి శుక్రవారం తీర్పు ఇచ్చారు. చిన్న అప్పన్నకు ఈ కేసుతో సంబంధం లేదని, సుబ్బారెడ్డికి పీఏగా పనిచేసినందుకే అభియోగం మోపారని అతడి తరఫు న్యాయవాది యుగంధర్‌రెడ్డి వాదించారు. నిందితుడు తితిదేకు నెయ్యి సరఫరా చేసే వ్యక్తుల వివరాలు సేకరించారని, ప్రీమియర్ అగ్రిఫుడ్స్ సంస్థ ప్రతినిధుల నుంచి రెండు విడతల్లో హవాలా మార్గంలో రూ.50 లక్షల లంచం తీసుకున్నారని ఏపీపీ జయశేఖర్ కోర్టుకు నివేదించారు. గతంలో విచారణకు పిలిచినప్పుడూ సహకరించకపోవడంతో కస్టడీకి ఇవ్వాలని కోరగా జడ్జి ఏకీభవించారు. వచ్చే వారం అప్పన్న బెయిల్ పిటిషన్‌పై విచారణ జరగనున్న నేపథ్యంలో ఆ నిర్ణయం వచ్చిన తర్వాతే అతడిని కస్టడీలోకి తీసుకునే అవకాశం ఉన్నట్లు సమాచారం.

తుదిశ్వాస విడిచిన వృక్షమాత తిమ్మక్క

- 114 ఏళ్ల వయసులో కన్నుమూత



బెంగళూరు (మల్లేశ్వరం), న్యూస్‌టుడే: వృక్షమాతగా గుర్తింపు పొందిన 'సాలుమరద' తిమ్మక్క (114) శుక్రవారం తుదిశ్వాస విడిచారు. వృద్ధాప్య సమస్యలతో బాధపడుతున్న ఆమె.. బెంగళూరు జయనగరలోని అపోలో ఆసుపత్రిలో చికిత్స పొందుతూ కన్నుమూశారని ఆమె దత్తపుత్రుడు ఉమేశ్ వెల్లడించారు. వివాహమైన తర్వాత పాతికేళ్లయినా సంతానం లేకపోవడంతో మొక్కలనే బిడ్డలుగా భావించిన తిమ్మక్క.. దశలవారీగా కుదూరు నుంచి హులికల్ వరకు 4.5 కి.మీ. పొడవునా 385 మర్రి మొక్కలను నాటారు. అవి భారీ వృక్షాలుగా ఎదిగాయి. దీంతో పాటు తమ గ్రామంలో వృక్ష ఉద్యానవనాన్ని ఏర్పాటు చేశారు. ఇలా ఆమె రాష్ట్రంలో 8 వేలకు పైగా మొక్కలు మహావృక్షాలుగా ఎదిగేందుకు శ్రమించారు. వరుసగా (సాలు) చెట్లు (మర) పెంచుతూ వచ్చిన ఆమె.. సాలుమరద తిమ్మక్కగా గుర్తింపు పొందారు. కేంద్ర ప్రభుత్వం నుంచి పద్మశ్రీ సహా కర్ణాటక రాజ్యోత్సవ పురస్కారం, కేంద్రీయ విశ్వవిద్యాలయం నుంచి గౌరవ డాక్టరేట్‌తో పాటు అనేక పురస్కారాలు అందుకున్నారు. ప్రభుత్వం ఆమెను పర్యావరణ రాయబారిగా (2022) నియమించి, మంత్రివర్గ హోదాను కేటాయించింది. అమెరికాలోనూ ఆమె పేరిట అధ్యయన సంస్థలున్నాయి. ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, పర్యావరణశాఖ మంత్రి ఈశ్వర ఖండ్రే తదితరులు తిమ్మక్క భౌతికకాయానికి నివాళి అర్పించారు. మాజీ ప్రధాని హెచ్.డి.దేవేగౌడ తదితరులు తిమ్మక్క మృతికి సంతాపాన్ని ప్రకటించారు.

పవన్ సంతాపం

ఈనాడు, అమరావతి: సాలుమరద తిమ్మక్క మృతిపై ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ సంతాపం వ్యక్తం చేశారు. "కొందరు ఓ వైపు చెట్లను నరికి పర్యావరణానికి హాని చేస్తుంటే తిమ్మక్క లాంటి వాళ్లు పర్యావరణ పరిరక్షణకు జీవితాన్ని అంకితం చేసుకొన్నారు" అని కొనియాడారు.



తిమ్మక్క భౌతికకాయానికి నివాళులు అర్పిస్తున్న కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య

అభివృద్ధికి దక్కిన విజయం

బిహార్‌లో గెలుపుపై భాజపా నాయకులు



సంబరాల్లో భాజపా నాయకులు

విజయవాడ(భవానీపురం), న్యూస్‌టుడే: బిహార్‌లో ఎన్డీయే ఘనవిజయం సాధించడంతో విజయవాడలోని భాజపా రాష్ట్ర కార్యాలయం వద్ద ఆ పార్టీ నాయకులు సంబరాలు చేసుకున్నారు. నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో చేరుకుని బాణసంచా కాల్చారు. పార్టీ కార్యాలయ బాధ్యుడు ఉప్పలపాటి శ్రీనివాసరాజు మాట్లాడుతూ ప్రధాని మోదీ చేపట్టిన అభివృద్ధి, సంక్షేమాన్ని చూసి బిహార్‌లో ఎన్డీయేకు పట్టం కట్టారని తెలిపారు. పార్టీ అధికార ప్రతినిధి సాదినేని యామినీశర్మ మాట్లాడుతూ.. రాహుల్ గాంధీ ఎంత విషప్రచారం చేసినా ప్రజలు పట్టించుకోలేదని అన్నారు. భాజపా జిల్లా అధ్యక్షుడు అడ్డూరి శ్రీరాం తదితరులు పాల్గొన్నారు.

గంగిశెట్టి శివకుమార్‌కు బాలసాహిత్య పురస్కారం ప్రదానం



మాధవ్‌కౌశిక్ నుంచి బాలసాహిత్య పురస్కారం అందుకుంటున్న గంగిశెట్టి శివకుమార్

ఈనాడు, దిల్లీ: 'కబుర్ల దేవత' పుస్తక రచయిత డాక్టర్ గంగిశెట్టి శివకుమార్‌కు కేంద్ర సాహిత్య అకాడమీ అధ్యక్షుడు మాధవ్‌కౌశిక్ బాలసాహిత్య పురస్కారాన్ని ప్రదానం చేశారు. శుక్రవారం దిల్లీలో జరిగిన కార్యక్రమంలో 2025 సంవత్సరానికి బాలసాహిత్య పురస్కారానికి ఎంపికైన వివిధ భారతీయ భాషలకు చెందిన 24 మంది రచయితలకు అవార్డుతో పాటు రూ.50 వేల నగదు బహుమతి, తామ్రపత్రం అందించి సత్కరించారు. డాక్టర్ గంగిశెట్టి శివకుమార్ శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా రాపూరుకు చెందినవారు. 1970లో ఆయన రచించిన కబుర్ల దేవత కథ బాలానందం పుస్తకంలో ప్రచురితమైంది. అదే పేరుతో 2023లో చేసిన రచనలకు బాలసాహిత్య పురస్కారం లభించింది. ఇప్పటి వరకు తెలుగులో అన్ని బాలల పత్రికల్లో ఆయన రాసిన 400కు పైగా కథలు ప్రచురితమయ్యాయి.

దివ్యాంగుల పొదుపు సంఘాలకు జవసత్వాలు!

స్వయం ఉపాధి కల్పించేలా ప్రత్యేక కార్యాచరణ

ఈనాడు, అమరావతి: దివ్యాంగుల స్వయం సహాయక సంఘాల్లో నూతనోత్సాహం నింపేందుకు కూటమి ప్రభుత్వం యత్నిస్తోంది. సభ్యులకు స్వయం ఉపాధి, విద్య, వైద్యంతో పాటు పలు అంశాల్లో భరోసా కల్పించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. కార్పొరేట్ సామాజిక బాధ్యత కింద ప్రఖ్యాత ప్రైవేటు సంస్థల నుంచి సంఘాలకు సాయం లభించేలా వాటికి భాగస్వామ్యం కల్పిస్తోంది. పట్టణ ప్రాంతాల్లో 2,266 దివ్యాంగుల స్వయం సహాయక సంఘాలు ఉన్నాయి. వీటిలో మహిళలు, పురుషులు కలిపి మొత్తం 7,661 మంది సభ్యులు ఉన్నారు. సంఘాలు పొదుపు చేసిన మొత్తాలు రూ.16.50 కోట్లకుపైగా ఉన్నాయి. 2014-19 మధ్య తెదేపా ప్రభుత్వంలో దివ్యాంగుల స్వయం సహాయక సంఘాలు ఉత్సాహంగా పని చేశాయి. బ్యాంకుల నుంచి పెద్దఎత్తున రుణాలు తీసుకుని ఉపాధి యూనిట్‌లు విజయవంతంగా నిర్వహించాయి. వైకాపా ప్రభుత్వం స్వయం సహాయక సంఘాలపై పెద్దగా దృష్టి పెట్టలేదు.

పరకామణి కేసు ఫిర్యాదుదారు
సతీష్ అనుమానాస్పద మృతి

(మొదటి పేజీ తరువాయి)



సతీష్‌కుమార్ శరీరం వెనుకవైపు గాయాలు

ప్రాథమిక అంచనాకు వచ్చారు. తల వెనకభాగంలో పదునైన ఆయుధంతో కొట్టిన గాయాలున్నట్లు గుర్తించారు. ఆయన్ను రైలు నుంచి కిందకు తోసేసి చంపేసి ఉంటారని అనుమానిస్తున్నారు. ఈ కోణంలో దర్యాప్తు చేస్తున్నారు.

బయలుదేరిన గంటకే..

గతంలో తితిదేలో పనిచేసిన సతీష్‌కుమార్ 3 నెలల కిందటే గుంతకల్లు రైల్వేలో రిజర్వ్‌డ్ సీఐగా బదిలీ అయ్యారు. ఈ క్రమంలోనే పరకామణి కేసులో సీఐడీ విచారణకు హాజరయ్యేందుకు రాయలసీమ ఎక్స్‌ప్రెస్‌లో అర్ధరాత్రి 01:02 గంటలకు బయలుదేరారు. రైలు కోమలి సమీపంలోకి 2 గంటలకు చేరుకొని ఉంటుందని రైల్వే పోలీసులు భావిస్తున్నారు. అంటే.. బయలుదేరిన గంటకే సతీష్‌కుమార్ మృతిచెందారు. శుక్రవారం ఉదయం 10.30 సమయంలో రైల్వే కీమ్యాన్ పట్టాల పక్కన మృతదేహాన్ని గుర్తించి తాడిపత్రి రైల్వే పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు వచ్చి సతీష్‌కుమార్‌గా నిర్ధారించి, కుటుంబ సభ్యులకు తెలిపారు. అనంతపురం రేంజ్ డీఐజీ షిమోషి, ఎస్పీ జగదీశ్ ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. క్లూస్ టీం, డాగ్ స్క్వాడ్‌తో ఆధారాలు సేకరించారు. మధ్యాహ్నం 3.30 గంటలకు మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం అనంతపురం సర్వజనాసుపత్రికి తరలించారు. సతీష్‌కుమార్‌కు భార్య మమత, కుమార్తె తార, కుమారుడు రోహిత్ ఉన్నారు.

అంతా అనుమానాస్పదమే

● సతీష్‌కుమార్ వీపు, నడుముకు తీవ్ర గాయాలయ్యాయి. తల వెనుక భాగం పూర్తిగా చిట్లిపోయి మెదడు బయటపడింది. కుడికాలు విరిగిపోయింది. గాయాలను పరిశీలిస్తే వెనకగా రైలు నుంచి కింద పడిపోయినట్లు అర్థమవుతోంది. దీన్నిబట్టి ఆయన్ను రైలులో నుంచి ఎవరైనా తోసేశారా? అనే అనుమానాలు బలపడుతున్నాయి. ● ఆత్మహత్య చేసుకోవాలనుకుంటే అసలు విచారణకు ఎందుకు బయలుదేరతారు? ● ప్రయాణం మధ్యలో చనిపోవాలని అనుకుంటే ముందువైపు నుంచి దూకుతారు కదా? అనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. ● సతీష్‌కుమార్ మృతదేహాన్ని పరిశీలిస్తే శరీరం వెనుక భాగంలోనే బలమైన గాయాలున్నాయి. ముఖానికి తప్పితే ముందుభాగంలో గాయాల్లేవు. దీంతో పోలీసులు ఈ కోణంలోనే విచారణ జరుపుతున్నారు.

నిజాలు బయట పెడతారనే భయంతోనే?

సతీష్‌కుమార్ రాయలసీమ ఎక్స్‌ప్రెస్‌లో రిజర్వేషన్ చేసుకొని సెకండ్ ఏసీ బోగీలో ఎక్కినట్లు పోలీసులు చెబుతున్నారు. బోగీలో ఆ సమయంలో ఎవరెవరు ప్రయాణిస్తున్నారు? సతీష్‌కుమార్ కింద పడిపోవడం లేదా ఆయన్ను ఎవరైనా కిందకు తోసేయడాన్ని ప్రయాణికుల్లో ఎవరైనా చూశారా? ఏసీ బోగీల్లో తప్పనిసరిగా సహాయకులు ఉంటారు. సతీష్‌కుమార్ కింద పడిపోయినప్పుడు వారెవరైనా చూసి ఉండాలి కదా అనే కోణంలో గుత్తి రైల్వే పోలీసులు విచారిస్తున్నారు. సతీష్ ఆత్మహత్య చేసుకునేంత పిరికివాడు కాదని.. కుటుంబసభ్యులు అంటున్నారు. పరకామణి కేసులో నిజాలు బయట పెడతారనే భయంతోనే ఆయన్ని చంపేశారని ఆరోపణలున్నాయి. ఈ అనుమానాల నేపథ్యంలో కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు గుత్తి రైల్వే పోలీసులు కేసు నమోదుచేశారు.

ఇది హత్యే: హరి, సతీష్‌కుమార్ సోదరుడు

రైలులో నుంచి పడిపోయాక మృతదేహం 150, 200 మీటర్ల వరకు ఎలా ముందుకొస్తుంది? ఘటనాస్థలం చూస్తే హత్య చేసినట్లుగా ఉంది. పరకామణి కేసులో విచారణకు వెళ్తున్నప్పుడే ఘటన జరిగింది. ఆ సమయంలో కొద్దిసేపు రైలు ఆగిందని చెబుతున్నారు. ప్రమాదం జరిగితే శవం రైలు పట్టాల పక్కన పడుతుంది. పట్టాలకు 10 మీటర్ల దూరంలో మా అన్న శవం పడి ఉంది. రైలు ఆపి కిందకు లాగి కొట్టినట్లు కనపడుతోంది. ఉన్నతాధికారుల ఒత్తిడి వల్లే ఆ రోజు లోక్ అదాలత్‌లో కేసు రాజీ చేయించారు.

ప్రాణహాని ఉందని చెప్పారు

– రామాంజనేయులు, సతీష్‌కుమార్ స్నేహితుడు

సతీష్‌కుమార్ ఆత్మహత్య చేసుకునేంత అసమర్థుడు కాదు. సతీష్ వల్ల మిగతా అధికారుల పేర్లు బయటకు వస్తాయనే ఉద్దేశంతోనే హత్య చేశారు. తనకు ప్రాణహాని ఉందని ముందుగానే చెప్పారు. అయితే ఎవరి నుంచో చెప్పలేదు. పరకామణి కేసులో తాను తప్పేమీ చేయలేదు కాబట్టి ధైర్యంగా ఉన్నానని చెప్పారు.

విచారణ తర్వాతే పూర్తి వివరాలు

– శ్రీనివాస ఆచారి, రైల్వే డీఎస్పీ, గుంతకల్లు

ఉదయం 10 గంటలు దాటిన తర్వాత ఘటన గురించి తెలిసింది. రైలు ప్రయాణం, మరణం మధ్యలో ఏం జరిగిందనే దానిపై విచారిస్తున్నాం. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు విచారిస్తాం. విచారణ తర్వాతే పూర్తి వివరాలు తెలుస్తాయి.

గుట్టు బయటపడుతుందని భయపడ్డారా?

- సతీష్ అడ్డులేకుండా చేస్తే తప్పించుకోవచ్చని భావించారా?
- సీఐడీ విచారణకు వెళ్తున్న వ్యక్తి విగతజీవిగా ఎలా మారారు?
- తల వెనక భాగంలో బలమైన ఆయుధంతో కొట్టిన గాయాలు
- ఇది హత్యేనని పోలీసుల ప్రాథమిక అంచనా
- పరకామణి చోరీ కేసులో లబ్ధిదారులే కుట్ర చేశారా?
- సతీష్‌ది ఆత్మహత్యేనంటూ ప్రచారం మొదలుపెట్టిన వైకాపా

ఈనాడు, అమరావతి: 'ఓ ఉన్నతాధికారి ఒత్తిళ్లు, ఆదేశాల మేరకే పరకామణిలో చోరీ కేసును లోక్ అదాలత్‌లో రాజీ చేసుకున్నా' అంటూ ఈ కేసులో ఫిర్యాదుదారు, తితిదే అప్పటి అసిస్టెంట్ విజిలెన్స్ సెక్యూరిటీ అధికారి (ఏవీఎస్వో) సతీష్‌కుమార్ సీఐడీ అధికారుల ఎదుట ఇటీవల ఇచ్చిన వాంగ్మూలమే ఆయన ప్రాణాలు తీసిందా? ఈ కేసులో సతీష్ ఇంకా నోరు విప్పితే తమ బండారం బయటపడిపోతుందనే అనుమానంతోనే ఆయన్ను ఈ భూమ్మీద లేకుండా చేశారా? ఘటనా స్థలంలో పరిస్థితులు గమనిస్తే ఈ అనుమానం బలపడకమానదు. సతీష్‌కుమార్‌ది హత్యేనని పోలీసులు ప్రాథమిక అంచనాకు వచ్చారు. ఆయన్ను తల వెనక భాగంలో బలమైన, పదునైన ఆయుధంతో కొట్టిన గాయాలున్నట్లు గుర్తించారు. సీఐడీ అధికారుల ఎదుట శుక్రవారం విచారణకు హాజరయ్యేందుకు బయల్దేరిన ఆయన మార్గమధ్యలోనే ఇలా విగతజీవిగా మారటం వెనక ఎవరున్నారనేది ఇప్పుడు కీలకంగా మారింది. ఎవరి ఒత్తిడితో లోక్‌అదాలత్‌లో ఈ కేసు రాజీ చేశారు? నిందితుడైన రవికుమార్ పేరిట ఉన్న ఆస్తులు ఎవరెవరు రాయించుకున్నారు? దీని వెనుక చక్రం తిప్పిన పెద్దలెవరు తదితర అంశాలపై సీఐడీ ఈ నెల 6న సతీష్‌కుమార్‌ను విచారించగా.. ఆయన కీలక వివరాలు వెల్లడించినట్లు సమాచారం. ఆయన్ను మరింత లోతుగా ప్రశ్నించేందుకు సీఐడీ అధికారులు శుక్రవారం మరోమారు విచారణకు పిలిచారు. వారి ఎదుట హాజరవటానికి కొద్ది గంటల ముందు సతీష్ మృతి చెందటంపై సందేహాలు వ్యక్తమవుతున్నాయి. కుటుంబసభ్యులు కూడా సతీష్‌ది హత్యేనని, ఆయనకు ప్రాణహాని బెదిరింపులు కూడా వచ్చాయని చెబుతున్నారు. పరకామణిలో చోరీ కేసులో లబ్ధి పొందిన వారెవరైనా సతీష్‌ను అడ్డు తొలగించుకునే కుట్ర చేశారా అనే అనుమానాలూ వ్యక్తమవుతున్నాయి. గతంలో రాష్ట్రంలో అనేక సంచలన కేసుల్లో దర్యాప్తు కీలక దశకు చేరుకున్న తరుణంలో ప్రధాన సాక్షులు, నిందితులు ఇలాగే అనుమానాస్పద స్థితిలో మరణించారు. హత్యకు గురయ్యారు. ఇప్పుడు సతీష్ మృతీ అలాగే కనిపిస్తోంది.

పేర్లు బయటపడతాయనేనా?

వైకాపా హయాంలో పెద్దజీయర్ మఠం పర్యవేక్షకుడు రవికుమార్ పరకామణిలో చోరీ చేస్తూ 2023 ఏప్రిల్ 29న పట్టుబడ్డారు. సతీష్‌కుమార్ ఫిర్యాదుతో వెంటనే కేసు నమోదు చేశారు. పోలీసులు మే 30న ఛార్జ్‌షీట్ దాఖలు చేశారు. ఈలోపే అనూహ్యంగా రవికుమార్ ఆస్తులను తితిదేకి రాయించి 2023 సెప్టెంబరు 9న లోక్ అదాలత్‌లో రాజీ చేసుకున్నారు. తిరుపతి గ్రామీణ మండలంలో ఐదు, తమిళనాడులో రెండు ఆస్తులను తితిదే పేరిట రాయించారు. వీటి విలువ రూ.14.43 కోట్లు. రవికుమార్ అనే భక్తుడు వీటిని ఇచ్చారని బోర్డు సమావేశ ఎజెండాలో పేర్కొన్నారు. సాధారణంగా ఇలాంటి కేసుల్లో రాజీ కష్టం. ఇందుకు భిన్నంగా ఫిర్యాదు చేసిన సతీష్‌కుమారే రాజీకి వచ్చారు. ఈ రాజీ కుదర్చడానికి రవికుమార్ పేరిట ఉన్న రూ.పదుల కోట్ల విలువైన పలు ఆస్తులను నాటి వైకాపా ప్రభుత్వంలోని కొందరు ముఖ్యులు, వారి బినామీల పేరిట రాయించుకున్నారన్న ఆరోపణలున్నాయి. ఈ వివరాలన్నీ సతీష్‌కుమార్‌కు స్పష్టంగా తెలుసు. ఆయన వాంగ్మూలమిస్తే అవన్నీ వెల్లడయ్యేవి. అందుకే ఆయన్ను అడ్డు తొలగించుకున్నారని అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

ఉద్దేశపూర్వకంగానే ఆత్మహత్య అంటూ ప్రచారం

● సతీష్‌కుమార్‌కు కుటుంబపరంగా, ఆర్థికంగా ఎలాంటి సమస్యలు లేవు. ఆస్తి తగాదాలూ లేవు. ఎస్సైగా, సీఐగా దాదాపు 12 ఏళ్ల పనిచేసిన అనుభవముంది. అలాంటి వ్యక్తి ఆత్మహత్య చేసుకునే అవకాశాలు చాలా తక్కువ. పైగా పరకామణిలో చోరీ కేసులో ఆయన విచారణకు అన్ని విధాలా సహకరిస్తున్నారు. అలాంటి వ్యక్తి కేసుకు భయపడి ఆత్మహత్య చేసుకుంటారా?
● సతీష్ మృతి వార్త బయటకు రాగానే వైకాపా నాయకులు సాకే శైలజానాథ్, భూమన కరుణాకరరెడ్డి తదితరులు అది ఆత్మహత్యేనని, పోలీసుల వేధింపుల వల్ల ఆయన బలవన్మరణానికి పాల్పడ్డారంటూ ప్రచారం మొదలుపెట్టారు. అసలు విషయాన్ని పక్కదారి పట్టించేందుకే ఈ ప్రయత్నాలన్నీ అనే విమర్శలు వినిపిస్తున్నాయి.

సతీష్ మృతి విచారణకు 10 బృందాలు

ఈనాడు, అనంతపురం: సీఐ సతీష్‌కుమార్‌ది హత్యేనని పోలీసులు ప్రాథమిక నిర్ధారణకు వచ్చినట్లు తెలిసింది. ఆధారాల సేకరణకు 10 పోలీసు బృందాలను రంగంలోకి దింపారు. సతీష్‌కుమార్ ప్రయాణించిన రైలు బోగీలో ఉన్న వారిని ప్రతి ఒక్కరినీ విచారించేందుకు సన్నద్ధం అవుతున్నారు. సీఐడీ డీజీ రవిశంకర్ అయ్యన్నార్ రాత్రి అనంతపురం చేరుకొని సమీక్ష నిర్వహించారు. మృతదేహానికి పోస్టుమార్టం పూర్తి చేసి పత్తికొండకు పంపారు. ఆయన సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకొని డేటా ఆధారంగా విచారణ చేస్తున్నారు. రాయలసీమ ఎక్స్‌ప్రెస్ బోగీలో ప్రయాణించినవారి జాబితా ప్రకారం వివరాలు సేకరించి జల్లెడ పడుతున్నారు.

ఇది ప్రభుత్వ హత్యే: భూమన

తిరుపతి (జీవకోన), న్యూస్‌టుడే: పరకామణి కేసులో విచారణ ఎదుర్కొంటున్న సతీష్‌కుమార్ రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడని, ఇది పూర్తిగా ప్రభుత్వ హత్యేనని తితిదే మాజీ ఛైర్మన్ భూమన కరుణాకరరెడ్డి ఆరోపించారు. 'విచారణలో బెదిరించి, భయపెట్టి, అబద్ధాలు చెప్పించే ప్రయత్నంలో విచారణ అధికారులు ప్రవర్తించిన తీరు కారణంగా సతీష్‌కుమార్ ఆత్మహత్య చేసుకున్నట్లు తెలుస్తోంది' అని భూమన తెలిపారు.

అకారణంగా పొట్టన పెట్టుకున్నారు

- విలపించిన సతీష్‌కుమార్ తల్లి చితాంబరమ్మ



రోదిస్తున్న సతీష్‌కుమార్ తల్లి చితాంబరమ్మ

ఈనాడు, కర్నూలు, పత్తికొండ గ్రామీణం, న్యూస్‌టుడే: 'తన కుమారుడిని అకారణంగా పొట్టన పెట్టుకున్నారు. ఇది ముమ్మాటికీ హత్యే. నా బిడ్డ ఆత్మహత్య చేసుకునేంత పిరికివాడు కాదు' అని హత్యకు గురైన రైల్వే సీఐ సతీష్‌కుమార్ తల్లి చితాంబరమ్మ విలపించారు. నిజాయతీతో బతికితే చంపేస్తారా? అని ఆయన సోదరి రమణమ్మ కన్నీరుమున్నీరయ్యారు. నిరుపేద కుటుంబంలో పుట్టి ఎంతో కష్టపడి సీఐ స్థాయికి ఎదిగారని.. తిరుమల వేంకటేశ్వరస్వామి ఆలయ పరకామణిలో అక్రమాలు జరిగాయని ఫిర్యాదు చేశాడన్న కోపంతో చంపేశారంటూ విలపించారు. శుక్రవారం కర్నూలు జిల్లా పత్తికొండ కుమ్మరివీధిలోని నివాసంలో సతీష్‌కుమార్ తల్లి, సోదరి విలపించారు.

కష్టపడి చదివి..: సతీష్‌కుమార్ మరణంతో ఆయన స్వగ్రామమైన కర్నూలు జిల్లా పత్తికొండలో విషాదఛాయలు అలముకున్నాయి. అత్యంత నిరుపేద కుటుంబంలో జన్మించిన ఆయన కష్టపడి చదువుకున్నారు. తండ్రి బ్రహ్మయ్య వసతిగృహంలో వంట పనిచేసేవారు. తల్లి చితాంబరమ్మ గృహిణి. వీరికి నలుగురు సంతానం. సతీష్‌కుమార్ రెండో సంతానం. ఒకటో తరగతి నుంచి డిగ్రీ వరకు పత్తికొండలోనే చదువుకున్నారు. 2009లో ఏఆర్ కానిస్టేబుల్‌గా ఉద్యోగం సాధించారు. తర్వాత సివిల్ కానిస్టేబుల్‌గా అవకాశం దక్కించుకున్నారు. విధులు నిర్వర్తిస్తూనే.. 2011లో ఏఆర్ విభాగంలో ఎస్‌ఐగా ఉద్యోగం దక్కించుకున్నారు. కర్నూలుకు చెందిన మమతతో వివాహమైంది. కొవిడ్ సమయంలో ఆయన తండ్రి చనిపోయారు. స్వగ్రామంలో ఉంటున్న తల్లి, ఇతర కుటుంబ సభ్యులను చూసేందుకు సతీష్ అప్పుడప్పుడు వస్తుంటారు. 20 రోజుల క్రితమే వచ్చి అందరితోనూ సరదాగా గడిపి వెళ్లారు. పరకామణి చోరీ కేసులో కీలకంగా ఉన్నప్పటికీ ఎంతో ధైర్యంగా ఉన్నాడని పలువురు అభిప్రాయపడుతున్నారు. శుక్రవారం మధ్యాహ్నం సతీష్ మృతి వార్త తెలుసుకున్న తల్లి, కుటుంబ సభ్యులు, స్థానికులు.. సిట్ విచారణలో వాస్తవాలు చెబుతున్నారన్న కారణంగానే ఆయన్ను హత్య చేసి ఉంటారని అభిప్రాయపడ్డారు.

తాడేపల్లి ప్యాలెస్‌లోనే పథక రచన: తెదేపా

ఈనాడు, అమరావతి: తితిదే మాజీ ఏవీఎస్వో సతీష్‌కుమార్ హత్యకు తాడేపల్లి ప్యాలెస్‌లోనే పథక రచన జరిగిందని పలువురు తెదేపా నేతలు ఆరోపించారు. ఇది వైకాపా వాళ్లు చేసిన హత్యేనని ధ్వజమెత్తారు. సతీష్‌కుమార్ నోరు తెరిస్తే వాస్తవాలు బయటకొస్తాయనే భయంతోనే ఈ దారుణానికి ఒడిగట్టారని విమర్శించారు. ఈ ఘటనను తీవ్రంగా పరిగణించి సీబీఐతో విచారణ చేయించాలని డిమాండు చేశారు. జగన్ హయాంలో జరిగిన దారుణాలకు సాక్షులుగా ఉన్నవారికి భద్రత కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు.

సుబ్బారెడ్డి, కరుణాకరరెడ్డిలను విచారించాలి

సతీష్‌కుమార్ మృతిపై వైకాపా నేతలు వైవీ సుబ్బారెడ్డి, భూమన కరుణాకరరెడ్డిలను విచారించాలి. మాజీ ఎంపీ వివేకా హత్య కేసులోనూ వైకాపా నాయకులకు సాక్షులను ఇలాగే హతమార్చారు. ఇప్పుడూ పరకామణి కేసు సాక్షులను హతమార్చే పనిలో పడ్డారు. వైకాపా నేర ప్రవృత్తిలో ఇలాంటివి ఒక భాగంగా మారాయి. ఈ హత్య కేసును సీబీఐతో విచారణ చేయించాలి.

– ఎంఎస్ రాజు, మడకశిర ఎమ్మెల్యే, తితిదే బోర్డు సభ్యుడు

EENADU Vol: 52, Issue: 95 | Printed and Published by M Nageswara Rao on behalf of Ushodaya Publications, a division of Ushodaya Enterprises Pvt Ltd. Printed and Published at Ushodaya Publications, Eenadu Press, Survey No. 239/3, 240/3B & 240/4, Gudavalli Village, Vijayawada Rural Mandal, NTR District - 521 104, Andhra Pradesh. Editor: M Nageswara Rao. Phones: 0866-2494900, 2862111. Regd. No. VJ/013/2024-26. RNI No.32238/1978. Air Surcharge Extra. Mumbai, Kolkata, Goa. Re. 1.00, Portblair Rs. 10.00. | Founder Ramoji Rao

ఈనాడు బిజినెస్

అనిల్ అంబానీ.. 17న హాజరుకండి

ఫెమా కేసులో ఈడీ తాజా సమన్లు

దిల్లీ: రిలయన్స్ గ్రూప్ ఛైర్మన్ అనిల్ అంబానీకి ఫెమా కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) తాజా సమన్లు జారీ చేసింది. శుక్రవారం ఆయన విచారణకు హాజరుకాకపోవడంతో, ఈనెల 17న తమ ముందుకు రావాలని ఆదేశించింది. 'దృశ్యమాధ్యమ పద్ధతిలో (వర్చువల్) హాజరు' అవుతానన్న ఆయన అభ్యర్థనను ఈడీ తిరస్కరించినట్లు అధికార వర్గాలు తెలిపాయి. దర్యాప్తులో పూర్తి సహకారాన్ని అనిల్ అందిస్తారని ఆయన ప్రతినిధి ఒకరు పేర్కొన్నారు. ఫారెన్ ఎక్స్ఛేంజ్ మేనేజ్‌మెంట్ యాక్ట్ (ఫెమా) కింద అనిల్ స్టేట్‌మెంట్ రికార్డు చేయాల్సి ఉంటుందని.. శుక్రవారం వ్యక్తిగతంగా హాజరు కావాలని ఏజెన్సీ అంతక్రితం కోరినట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం. జయపుర-రీంగస్ రహదారి ప్రాజెక్టుకు సంబంధించి ఈ దర్యాప్తు జరుగుతోంది.

నాట్కో ఫార్మాకు రూ.518 కోట్ల లాభం

ఒక్కో షేరుపై రూ.1.50 డివిడెండ్

ఈనాడు, హైదరాబాద్: నాట్కో ఫార్మా లిమిటెడ్, సెప్టెంబరు త్రైమాసికానికి రూ.517.9 కోట్ల ఏకీకృత నికర లాభాన్ని ప్రకటించింది. 2024-25 ఇదే కాలం లాభం రూ.676.5 కోట్ల కంటే ఇది 23.44% తక్కువ. పరిశోధన-అభివృద్ధిపై ఖర్చు పెరగడం, ఉద్యోగులకు ఒకసారి ఇచ్చిన బోనస్ ఇందుకు కారణమని సంస్థ వెల్లడించింది. ఇదే సమయంలో ఆదాయం రూ.1,371.1 కోట్ల నుంచి రూ.1,363 కోట్లకు పెరిగింది. మొత్తం వ్యయాలు రూ.616.7 కోట్ల నుంచి రూ.849.3 కోట్లకు పెరిగాయి. ఫార్ములేషన్స్ ఎగుమతి ఆదాయం రూ.1,211.3 కోట్ల నుంచి రూ.1,147 కోట్లకు తగ్గింది. యాక్టివ్ ఫార్మాస్యూటికల్ ఇంగ్రేడియంట్స్ (ఏపీఐ) విభాగ ఆదాయం రూ.53.9 కోట్లుగా ఉంది. రూ.2 ముఖ విలువ ఉన్న ఒక్కో ఈక్విటీ షేరుపై రూ.1.50 చొప్పున మధ్యంతర డివిడెండ్‌ను సంస్థ ప్రకటించింది.

జీవీకే పవర్‌కు నష్టాలు

ఈనాడు, హైదరాబాద్: దివాలా ప్రక్రియను ఎదుర్కొంటున్న జీవీకే పవర్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, ప్రస్తుత ఆర్థిక సంవత్సరం సెప్టెంబరు త్రైమాసికంలో రూ.1.32 కోట్ల ఆదాయంపై రూ.1.21 కోట్ల ఏకీకృత నష్టాన్ని నమోదు చేసింది. క్రితం ఆర్థిక సంవత్సరం ఇదే కాలంలో రూ.412.80 కోట్ల ఆదాయాన్ని, రూ.811.19 కోట్ల నికర లాభాన్ని సంస్థ ప్రకటించింది. రుణాలు, వాటిపై వడ్డీ చెల్లింపుల్లో ఆలస్యం, విఫలం కావడంతో బ్యాంకులు/రుణదాతలు వివిధ రుణ ఖాతాలను నిరర్థక ఆస్తులుగా ప్రకటించినట్లు బీఎస్ఈకి ఇచ్చిన సమాచారంలో సంస్థ వెల్లడించింది.

శరత్ ఇండస్ట్రీస్ ఆదాయం రూ.150 కోట్లు

ఈనాడు, హైదరాబాద్: రొయ్యల సాగు, మేత, ప్రాసెసింగ్ లాంటి పలు విభాగాల్లో కార్యకలాపాలు కొనసాగిస్తున్న శరత్ ఇండస్ట్రీస్, సెప్టెంబరు త్రైమాసికంలో రూ.149.73 కోట్ల ఆదాయంపై రూ.5.74 కోట్ల నికర లాభాన్ని నమోదు చేసింది. 2024-25 ఇదే కాలంలో ఆదాయం రూ.100.34 కోట్లు, నికర లాభం రూ.3.73 కోట్లుగా ఉన్నాయి. వీటితో పోలిస్తే ఆదాయం 49%, నికర లాభం 54% పెరిగాయి. రష్యా, చైనాలకు ఎగుమతులు పెరిగిన నేపథ్యంలో ఆదాయంలో వృద్ధి కనిపించిందని ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ శరత్ రెడ్డి సబ్బెళ్ల తెలిపారు. మన ఉత్పత్తులపై అమెరికా సుంకాలు పెంచినా, అక్కడికి తమ ఎగుమతులు స్థిరంగా కొనసాగినట్లు వివరించారు.


వృద్ధాప్యం రాకముందే ధనవంతులు కావాలి

- యువత పింఛను పథకాలపై దృష్టి పెట్టాలి
- పీఎఫ్ఆర్‌డీఏ ఛైర్మన్ రామన్

ఈనాడు, హైదరాబాద్: పింఛను అంటే వృద్ధాప్యంలో ఆర్థిక భరోసానిచ్చేదే కాదని, సంపద సృష్టించుకునే విధానమని పింఛను నియంత్రణ, అభివృద్ధి ప్రాధికార సంస్థ (పీఎఫ్ఆర్‌డీఏ) ఛైర్మన్ శివసుబ్రమణియన్ రామన్ అన్నారు. వృద్ధాప్యం దరి చేరకముందే ధనవంతులుగా మారాలని యువతకు సూచించారు. శుక్రవారం హైదరాబాద్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. '25-40 ఏళ్ల వయసులో ఉన్న చాలామంది పింఛను గురించి మాట్లాడొద్దు అంటున్నారు. కానీ, గమనించాల్సిందేమిటంటే.. పింఛను నిధి అంటే సంపదను పోగేయడం. పనిచేయలేని వయసుకు చేరినప్పుడు, తమను తాము పోషించుకునేందుకు తగినంత డబ్బు ఉండాలి.

45 కోట్ల మంది దూరం

దేశంలో 55 కోట్ల కార్మిక శక్తి ఉంది. వీరిలో సంఘటిత రంగంలోని 10 కోట్ల మందికే పింఛను పథకాలు అందుబాటులో ఉన్నాయి. మిగిలిన 45 కోట్ల మందికి పైగా అసంఘటిత కార్మికులు క్రమానుగత పొదుపు పథకాలకు దూరంగా



ఉంటున్నారు. చాలామంది 'హామీతో కూడిన రాబడుల' పేరుతో అమలవుతున్న మోసపూరిత పథకాల వైపు ఆకర్షితులవుతున్నారు' అని ఆయన పేర్కొన్నారు. వీరిని కాపాడటం తమ బాధ్యత అన్నారు.

అందరికీ ఒకే విధంగా: జయేశ్ రంజన్

రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో పనిచేసే ఉద్యోగులకు రకరకాల పింఛను పథకాలున్నాయని, కొందరికి అలాంటి వెసులుబాటు లేదని తెలంగాణ రాష్ట్ర ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేశ్ రంజన్ అన్నారు. అందరినీ ఒకే పింఛను పథకంలోకి తీసుకొచ్చేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోందని, దీనికోసం పీఎఫ్ఆర్‌డీఏతో కలిసి పనిచేస్తామని తెలిపారు. ఫిన్‌టెక్, ఫండ్ సంస్థల నుంచీ సూచనలు స్వీకరిస్తామని వెల్లడించారు.

9 శాతానికి మించి..

జాతీయ పింఛను పథకం (ఎన్‌పీఎస్), అటల్ పెన్షన్ యోజన వంటి పథకాలు పీఎఫ్ఆర్‌డీఏ నియంత్రణ పరిధిలో ఉంటాయని రామన్ తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగులకు వర్తించే కాంపోజిట్ స్కీమ్ గత 13-14 ఏళ్లలో 9 శాతానికి మించి వార్షిక సగటు రాబడినిచ్చిందన్నారు. 100% ఈక్విటీ ఫండ్లలో కొన్ని 18-19% రాబడి అందిస్తున్నట్లు గుర్తు చేశారు. నెలకు రూ.3,000 మదుపుతో ప్రారంభించి, ఏటా 5-10% పెంచుకుంటూ వెళ్లినా.. పెద్ద మొత్తంలో పింఛను నిధి జమ అవుతుందని వెల్లడించారు. పింఛను ఖాతా ప్రారంభించడం ఎంతో సులువని, బ్యాంకు ఖాతా తర్వాత రెండోది ఇదే ఉండాలని కొత్తగా ఉద్యోగంలో చేరే వారికి సూచించారు.

రూ.2,500 తగ్గిన పసిడి రూ.5000 క్షీణించిన వెండి



ఈనాడు వాణిజ్య విభాగం: అమెరికాలో ప్రభుత్వ షట్‌డౌన్ పరిణామాల వల్ల తగిన ఉద్యోగ గణాంకాలు వెలువడకపోవడం, వడ్డీరేట్ల కోత వాయిదా పడుతుందనే అంచనాల మధ్య.. మదుపర్లు లాభాల స్వీకరణకు దిగడంతో శుక్రవారం బంగారం, వెండి ధరలు తగ్గాయి. గురువారం అంతర్జాతీయంగా ఔన్సు (31.10 గ్రాముల) బంగారం ధర 4202 డాలర్లు కాగా, శుక్రవారం 100 డాలర్లు తగ్గి, 4100 డాలర్లకు చేరింది. ఫలితంగా దేశీయంగానూ పసిడి ధర దిగి వచ్చింది. రాత్రి 11.30 గంటల సమయానికి హైదరాబాద్ బులియన్ విపణిలో 10 గ్రాముల మేలిమి (24 క్యారెట్ల) బంగారం ధర రూ.2,500 తగ్గి రూ.1,27,700కు వచ్చింది. వెండి ధర అంతర్జాతీయంగా 53.16 డాలర్ల నుంచి 51.35 డాలర్లకు తగ్గడంతో, హైదరాబాద్ బులియన్ విపణిలో కిలో రూ.1,66,180 నుంచి రూ.5,000కు పైగా క్షీణించి రూ.1,61,000కు పరిమితమైంది.

బ్యాంకుల విలీనం మంచిదే

ఎస్‌బీఐ ఛైర్మన్ చల్లా శ్రీనివాసులు శెట్టి



ప్రభుత్వ రంగ బ్యాంకుల విలీనానికి స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) ఛైర్మన్ శ్రీనివాసులు శెట్టి మద్దతు పలికారు. 'ఇంకోసారి విలీనం జరిగితే మంచిదే. అయినా చిన్న బ్యాంకులైతే ఉంటాయ'ని ఒక ఆంగ్ల వార్తా సంస్థకిచ్చిన ఇంటర్వ్యూలో పేర్కొన్నారు. గత దశాబ్దంలో జరిగిన విలీనాల వల్ల ప్రస్తుతం 12 ప్రభుత్వరంగ బ్యాంకులే ఉన్నాయి. 'అమెరికా అదనపు టారిఫ్‌ల వల్ల, మనదేశ ఎగుమతులపై ప్రభావం కనిపించింది. అయితే ఎస్‌బీఐకి ఏ రంగం నుంచీ సమస్యలు రాలేదు. అందుకే ఏ రుణాల్లోనూ కోత వేయడం లేదు. ఎగుమతిదార్లకు మద్దతు కొనసాగిస్తాం. తాత్కాలిక సర్దుబాట్లు, రుణాల పొడిగింపులు అవసరమైనా.. చేస్తామ'ని అన్నారు. 'కార్పొరేట్ పోర్ట్‌ఫోలియోలు ఏర్పాటు చేసుకోవాలని చాలా బ్యాంకులు భావిస్తున్నాయి. అయితే పెద్ద కంపెనీలు పరిమితంగా ఉన్నందున.. ఈ విభాగంలో పోటీ ఎక్కువగా ఉంద'ని వివరించారు.

దిగ్గజ బ్యాంక్ అయినా..: 'ఎస్‌బీఐ ఒక దిగ్గజమే. అయినా మార్కెట్ వాటా మరింత పొందే విషయంలో రాజీ పడడం లేదు. విదేశీ నిధులను పోటీగా ఏమీ చూడడం లేద'ని అన్నారు. బ్యాంకు మొత్తం ఆస్తులు రూ.69 లక్షల కోట్లుగా ఉండగా.. తదుపరి స్థానంలో హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ రూ.40 లక్షల కోట్లతో ఉంది. కంపెనీల విలీనాలు-కొనుగోళ్లకు రుణాలిచ్చేందుకు కేంద్రం ముసాయిదా మార్గదర్శకాలు జారీ చేసిన అంశంపై మాట్లాడుతూ 'ఈ రుణాలను సాధారణ బ్యాలెన్స్ షీట్ రుణాలుగా చూడరాదు. ప్రతి ఒప్పందానికి నిర్దిష్ట నష్టభయాలు ఉంటాయ'ని అన్నారు. వెల్త్ మేనేజ్‌మెంట్ విభాగానికి అంతర్జాతీయ కేంద్రంగా భారత్ మారుతున్న నేపథ్యంలో, తమ బ్యాంక్ గత 12 నెలల్లో 1,000 మంది వెల్త్ రిలేషన్‌షిప్ మేనేజర్లను నియమించుకున్నట్లు, వచ్చే రెండేళ్లలో క్లయింట్ల కోసం మరో 50-100 వెల్త్‌హబ్‌లు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు.

కోడి గుడ్లు

15న ఫారం వద్ద రైతు అమ్మకం ధరలు (నెక్) (100కు రూపాయలలో)

హైదరాబాద్	605
వరంగల్	607
విజయవాడ	625
తూ/ప గోదావరి	615
విశాఖపట్నం	600
చిత్తూరు	653

రూ.1000 లోపు ఉత్పత్తులపై కమీషన్ భారం ఉండదు: ఫ్లిప్‌కార్ట్



దిల్లీ: రూ.1000 లోపు ధర ఉన్న ఉత్పత్తులకు సున్నా కమీషన్ విధానాన్ని తీసుకొచ్చినట్లు ఫ్లిప్‌కార్ట్ తెలిపింది. ఈ కొత్త విధానాన్ని ఫ్లిప్‌కార్ట్‌కు చెందిన హైపర్‌వాల్యూ ప్లాట్‌ఫామ్ షాప్సీకి కూడా వర్తింపజేస్తున్నట్లు వెల్లడించింది. ఈ ప్లాట్‌ఫామ్‌పై ధరతో సంబంధం లేకుండా, ఉత్పత్తులన్నింటికీ సున్నా కమీషన్ వర్తిస్తుందని పేర్కొంది. 'ఈ కొత్త విధానంలో రూ.1000 లోపు ధర ఉన్న ఉత్పత్తులకు, అర్హులైన విక్రయదార్లపై ఎటువంటి కమీషన్ రుసుము ఉండదు. ఎంఎస్ఎంఈలకు తోడ్పాటు అందించడం దీని వెనక ఉద్దేశం. వ్యాపార నిర్వహణ వ్యయాలను సమర్థంగా నిర్వహిస్తూనే, వినియోగదారుకు మరింత అందుబాటు ధరలో ఉత్పత్తులు అందించేందుకు ఇది ఉపయోగపడుతుంద'ని ఫ్లిప్‌కార్ట్ వివరించింది.

27 నెలల కనిష్ఠానికి టోకు ద్రవ్యోల్బణం



అక్టోబరులో టోకు ద్రవ్యోల్బణం 27 నెలల కనిష్ఠమైన -1.21 శాతంగా నమోదైంది. పప్పులు, కూరగాయలు వంటి ఆహార వస్తువుల ధరలు భారీగా దిగిరావడం, చమురు-గ్యాస్, విద్యుత్తు వ్యయాలు, తయారీ వస్తువుల ధరలు తగ్గడం ఇందుకు కారణమైంది. 2024 అక్టోబరులో టోకు ధరల సూచీ (డబ్ల్యూపీఐ) ఆధారిత ద్రవ్యోల్బణం 2.75 శాతంగా ఉంది. ప్రభుత్వం విడుదల చేసిన అధికారిక గణాంకాల ప్రకారం..

- ఆహార వస్తువుల ప్రతి ద్రవ్యోల్బణం 8.31 శాతంగా నమోదైంది. సెప్టెంబరులో ఇది 5.22 శాతంగా ఉంది. కూరగాయల ద్రవ్యోల్బణం -24.41% నుంచి -34.97 శాతానికి చేరింది. పప్పులు, బంగాళదుంపలు, ఉల్లిపాయల ద్రవ్యోల్బణం వరుసగా -16.50%, -39.88%, -65.43 శాతంగా నమోదయ్యాయి. తయారీ వస్తువుల ద్రవ్యోల్బణం 2.33% నుంచి 1.54 శాతానికి తగ్గింది.

మిగిలిన కాలంలోనూ: ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో మిగిలిన కాలంలోనూ టోకు ధరల్లో ప్రతి ద్రవ్యోల్బణ స్థితి కొనసాగొచ్చని ఇండియా రేటింగ్స్ పేర్కొంది. అక్టోబరులో రిటెయిల్ ద్రవ్యోల్బణం 0.25 శాతంగా నమోదవ్వడం, టోకు ధరల సూచీ ఆధారితంగా ప్రతి ద్రవ్యోల్బణం నమోదు కావడం వల్ల, వడ్డీరేట్ల తగ్గింపునకు రిజర్వ్‌బ్యాంకుపై ఒత్తిడి వస్తుందని వివరించింది. వృద్ధికి ఊతం ఇచ్చేలా డిసెంబరులో 0.25-0.50% మేర రేట్ల కోత ఉండొచ్చని అంచనా వేసింది.

రూ.76,248 కోట్లకు టీఎమ్‌పీవీఎల్ లాభం

టాటా మోటార్స్ ప్యాసింజర్ వెహికల్స్ (టీఎమ్‌పీవీఎల్) ఏకీకృత ఖాతాల ప్రకారం సెప్టెంబరు త్రైమాసికంలో రూ.76,248 కోట్ల నికర లాభాన్ని నమోదు చేసింది. బ్రిటిష్ అనుబంధ సంస్థ జేఎల్ఆర్‌పై సైబర్ దాడి కారణంగా కార్యకలాపాలు ఆగడం ప్రధాన కారణం. 2024-25 ఇదే మూడు నెలల్లో లాభం రూ.3,521 కోట్లుగా ఉంది. ఈసారి జేఎల్ఆర్ కార్యకలాపాల నిలిపివేత వల్ల రూ.82,600 కోట్ల లాభం వచ్చిందని ఎక్స్ఛేంజీలకిచ్చిన సమాచారంలో కంపెనీ తెలిపింది. వాణిజ్య వాహనాల వ్యాపార విభజన, బదిలీ వల్ల వచ్చిన లాభం కూడా ఇందులో ఉంది. కార్యకలాపాల ద్వారా వచ్చిన మొత్తం ఆదాయం రూ.83,656 కోట్ల నుంచి రూ.72,349 కోట్లకు తగ్గింది.

తగ్గిన జేఎల్ఆర్ ఆదాయం : జేఎల్ఆర్ ఆదాయం 24.3% తగ్గి 4.9 బిలియన్ పౌండ్ల (దాదాపు రూ.57,200 కోట్ల)కు చేరుకుంది. సైబర్ దాడితో జేఎల్ఆర్ ఆర్థిక అంశాలపై ప్రభావం పడింది. ఎబిట్ మార్జిన్ -8.6 శాతంగా నమోదైంది.

- సమీక్షిస్తున్న త్రైమాసికంలో టాటా ప్యాసింజరు వాహన వ్యాపార ఆదాయం 15.6% వృద్ధితో రూ.13,500 కోట్లకు చేరుకుంది. ప్యాసింజరు వాహనాలు(పీవీ), విద్యుత్ వాహనాల(ఈవీ) అమ్మకాలు 10.8% పెరిగి 1,44,500 యూనిట్లకు చేరాయి.

జులై-సెప్టెంబరు త్రైమాసిక ఫలితాలు (రూ.కోట్లలో)

కంపెనీ	నికర లాభం/(నష్టం) 2025-26	నికర లాభం/(నష్టం) 2024-25	మొత్తం ఆదాయం 2025-26	మొత్తం ఆదాయం 2024-25
గ్లెన్‌మార్క్ ఫార్మా	610.43	354.49	6046.87	3433.8
సన్ టీవీ1	354.7	409.45	1299.87	935.7
సదరన్ పెట్రోకెమ్	61.22	35.17	842.82	761.22
బీజీఆర్ ఎనర్జీ	(62.54)	(192.79)	94.90	87.74
కాఫీడే గ్లోబల్	(6.18)	(5.48)	274.18	259.64
ఎక్సైడ్ ఇండస్ట్రీస్	173.6	233.4	4365	4450
డిష్ టీవీ	(132.65)	(37.38)	291.13	395.62
ఐనాక్స్ విండ్	121	84	1162	744
జెనెసిస్ ఇంటర్నేషనల్	12	11.23	76.94	72
జీఎండీసీ	466	128	636	655
మారికో	432	433	3482	2664
యునిటెక్	(739)	(767)	151	80
జాప్‌ఫ్రెష్	7	2.4	96	67
ఎంఆర్ఎఫ్	526	471	7379	6881
ఓస్వాల్ పంప్స్	97.5	66	546	311
జువారీ ఇండస్ట్రీస్	164	(14.77)	286	277

1) రూ. 5 డివిడెండ్

బీమాపై జీఎస్‌టీ ప్రయోజనాలను ప్రజలకు అందించాలి

ఐఆర్‌డీఏఐ సభ్యుడు దీపక్ సూద్ సూచన

వ్యక్తిగత జీవిత, ఆరోగ్య బీమా పాలసీలపై వస్తు, సేవల పన్ను (జీఎస్‌టీ)ను సున్నా శాతానికి తీసుకురావడంతో బీమా వ్యాపారంలో అద్భుత వృద్ధి కనిపిస్తోందని భారతీయ బీమా నియంత్రణ, అభివృద్ధి ప్రాధికార సంస్థ (ఐఆర్‌డీఏఐ) సభ్యుడు దీపక్ సూద్ అన్నారు. అసోచామ్ నిర్వహించిన ఓ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం బీమాను, నిత్యావసర వస్తువులతో సమానంగా పరిగణించిందని స్పష్టం చేశారు. దేశ ప్రజలకు బీమా రక్షణను మరింతగా పెంచే బాధ్యత ఇప్పుడు బీమా పరిశ్రమపై ఉందని ఆయన పేర్కొన్నారు. ఈ విప్లవాత్మక ప్రయోజనాన్ని తుది వినియోగదారుడికి అందించాలని బీమా సంస్థలకు సూచించారు. అక్టోబరులో వ్యక్తిగత జీవిత, ఆరోగ్య బీమా పాలసీల విభాగంలో ప్రజల్లో ఆసక్తి పెరిగిందని ఆయన వివరించారు. భవిష్యత్తు గణాంకాలు ఎలా ఉండబోతున్నాయన్న దానికి ఇది సూచన అని తెలిపారు. ఈ ఆర్థిక సంవత్సరం ద్వితీయార్ధంలో సాధారణంగా బీమా పాలసీలకు అధిక గిరాకీ ఉంటుందని, ఈ నేపథ్యంలో బీమా పరిశ్రమకు మంచి రోజులు ముందున్నాయని తెలిపారు.



జీడీపీలో బీమా రంగం వాటా పెరుగుతోందన్నారు. దీన్ని కొలమానంగా కాకుండా, ఎంత మంది ప్రజలకు బీమా కవరేజీ అందుతోందన్నది చూసుకోవాలన్నారు. ప్రకృతి వైపరీత్యాలు సృష్టిస్తున్న నష్టాలను పరిష్కరించేందుకు బీమా సంస్థలు ప్రత్యేక పాలసీలను రూపొందించాలని సూచించారు. బీమాను మరింత సరసమైనదిగా చేసేందుకు సాంకేతిక వినియోగాన్ని గరిష్ఠంగా వినియోగించుకోవాలన్నారు. 'మీ ఉత్పత్తులు, సేవలను తప్పుగా విక్రయించకుండా చూసుకోవాలని' బీమా సంస్థలకు చెప్పారు.

సరైన సమయంలో కోల్ ఇండియా విభాగాల లిస్టింగ్

కేంద్ర బొగ్గు శాఖ మంత్రి కిషన్ రెడ్డి



దిల్లీ: కోల్ ఇండియా విభాగాలైన భారత్ కోకింగ్ కోల్ లిమిటెడ్(బీసీసీఎల్), కోల్ మైన్ ప్లానింగ్ అండ్ డిజైన్ ఇన్‌స్టిట్యూట్(సీఎమ్‌పీడీఐ)లను స్టాక్ ఎక్స్ఛేంజీల్లో లిస్టింగ్ చేసేందుకు, మార్కెట్ పరిశోధన జరుగుతోందని కేంద్ర బొగ్గు శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి పేర్కొన్నారు. ప్రతిపాదిత పబ్లిక్ ఇష్యూ నిమిత్తం బీసీసీఎల్, సీఎమ్‌పీడీఐ కొద్ది నెలల కిందట సెబీకి ముసాయిదా పత్రాలు దాఖలు చేశాయి. శుక్రవారమిక్కడ ఇండియా ఇంటర్నేషనల్ ట్రేడ్ ఫెయిర్ (ఐఐటీఎఫ్) పెవిలియన్ ప్రారంభోత్సవం సందర్భంగా విలేకర్లతో మంత్రి మాట్లాడుతూ 'మా నిపుణులు, కన్సల్టింగ్ ఏజెన్సీలు మార్కెట్‌ను పరిశోధిస్తున్నాయి. అది పూర్తయ్యాక, సరైన సమయంలో లిస్టింగ్ ప్రక్రియ చేపడతామ'ని మంత్రి తెలిపారు. బొగ్గు రంగంలోని అన్ని ప్రభుత్వ రంగ సంస్థల పనితీరునూ సమీక్షిస్తున్నట్లు వివరించారు. అన్ని రంగాలకు సరిపడా బొగ్గు అందుబాటులో ఉందన్నారు. ఉత్పత్తి కూడా పెరిగిందనీ తెలిపారు. బొగ్గు రంగంలో పెట్టుబడుల ఉపసంహరణ వ్యూహంలో భాగంగా, ప్రతిపాదిత సంస్థల ఐపీఓలను చేపడుతున్నారు.

రూ.1.61 లక్షల కోట్ల వంట నూనెల దిగుమతులు

2024-25లో 22% వృద్ధి



గిరాకీకి తగ్గట్లు దేశీయంగా సరఫరా పెంచేందుకు, 2024-25 మార్కెటింగ్ సంవత్సరంలో (నవంబరు- అక్టోబరు) 16 మిలియన్ టన్నుల వంట నూనెలను భారత్ దిగుమతి చేసుకుంది. 2023-24లో ఇవి 15.96 మిలియన్ టన్నులుగా నమోదయ్యాయి. విలువపరంగా చూస్తే.. 2023-24లో వంట నూనెల దిగుమతులు రూ.1.32 లక్షల కోట్లుగా ఉండగా, 2024-25లో 22% పెరిగి రూ.1.61 లక్షల కోట్లకు చేరినట్లు సాల్వెంట్ ఎక్స్‌ట్రాక్టర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (ఎస్ఈఏ) గణాంకాల ద్వారా తెలుస్తోంది. అంతర్జాతీయంగా అధిక ధరల వల్లే, వంట నూనెల దిగుమతుల విలువ గణనీయంగా పెరిగిందని సమాచారం. పామాయిల్‌ను ఇండొనేషియా, మలేషియా నుంచి; సోయాబీన్ నూనెను అర్జెంటీనా, బ్రెజిల్ నుంచి మనదేశం దిగుమతి చేసుకుంటోంది. 'సరఫరా, గిరాకీ మధ్య అంతరాన్ని తగ్గించేందుకు.. 1990 నుంచి భారత్ వీటి దిగుమతులను పునరుద్ధరించింది. అయితే ప్రారంభంలో ఈ దిగుమతుల విలువ చాలా తక్కువగా ఉండేది. గత 20 ఏళ్లలో (2004-05 నుంచి 2024-25) దిగుమతుల పరిమాణం 2.2 రెట్లు పెరగ్గా, దిగుమతుల విలువ సుమారు 15 రెట్లు అధికం అయ్యింద'ని ఎస్ఈఏ వివరించింది.

- 2024-25లో సోయాబీన్ నూనె దిగుమతులు 54.70 లక్షల టన్నులుగా నమోదయ్యాయి. ఇది రికార్డు గరిష్ఠం. ఇంతకుముందు 2015-16లో నమోదైన 42.3 లక్షల టన్నులే గరిష్ఠంగా ఉంది.
- పామాయిల్ దిగుమతులు 9 మిలియన్ టన్నుల నుంచి గణనీయంగా తగ్గి 7.58 మిలియన్ టన్నులకు పరిమితమయ్యాయి.
- రిఫైన్డ్ ఆయిల్ దిగుమతులు 19,31,254 టన్నుల నుంచి 17,37,227 టన్నులకు తగ్గాయి.

ఒడుదొడుకులున్నా.. ముందుకే

ఎఫ్ఐఐ విక్రయాలు: రూ.4,968 కోట్లు
డీఐఐ కొనుగోళ్లు: రూ.8,461 కోట్లు

సెన్సెక్స్ ▲ 84 — 84563
నిఫ్టీ ▲ 31 — 25910



ఆరంభ నష్టాల నుంచి బలంగా పుంజుకున్న దేశీయ సూచీలు, స్వల్ప లాభాల్లో ముగిశాయి. తక్కువ ధరల వద్ద బ్లూచిప్ స్టాక్స్‌కు కొనుగోళ్లు రావడం ఇందుకు ఉపకరించింది. బిహార్ ఎన్నికల ఫలితాల నేపథ్యంలో శుక్రవారం ట్రేడింగ్ ఒడుదొడుకుల మధ్య సాగింది. డాలర్‌తో పోలిస్తే రూపాయి 4 పైసలు పెరిగి 88.66 వద్ద ముగిసింది. బ్యారెల్ ముడిచమురు 1.51% లాభంతో 63.93 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. ఆసియా మార్కెట్లు నష్టాల్లో ముగియగా, ఐరోపా సూచీలు అదే ధోరణిలో ట్రేడయ్యాయి.

- బీఎస్ఈలోని నమోదిత సంస్థల మొత్తం మార్కెట్ విలువ శుక్రవారం రూ.74,000 కోట్లు పెరిగి రూ.473.94 లక్షల కోట్లు (5.34 లక్షల కోట్ల డాలర్లు)గా నమోదైంది.
- సెన్సెక్స్ ఉదయం 418 పాయింట్ల (క్రితం ముగింపు 84,478.67) నష్టంతో 84,060.14 పాయింట్ల వద్ద ప్రారంభమైంది. రోజులో ఎక్కువ భాగం నష్టాల్లోనే ఉన్న సూచీ, ఇంట్రాడేలో 84,029.32 వద్ద కనిష్ఠాన్ని తాకింది. ఆఖర్లో కొనుగోళ్లతో లాభాల్లోకి వచ్చి, 84.11 పాయింట్లు పెరిగి 84,562.78 వద్ద ముగిసింది. నిఫ్టీ 30.90 పాయింట్ల లాభంతో 25,910.05 దగ్గర స్థిరపడింది. ఇంట్రాడేలో ఈ సూచీ 25,740.80- 25,940.20 పాయింట్ల మధ్య కదలాడింది.
- సెప్టెంబరు త్రైమాసికంలో లాభం 27% తగ్గడంతో ఎల్‌జీ ఎలక్ట్రానిక్స్ షేరు 3.31% నష్టపోయి రూ.1618.70 వద్ద ముగిసింది.
- సెన్సెక్స్ 30 షేర్లలో 19 పెరిగాయి. ఎటర్నల్ 1.97%, బీఈఎల్ 1.70%, ట్రెంట్ 1.56%, యాక్సిస్ బ్యాంక్ 1.46%, ఎస్‌బీఐ 1.34%, బజాజ్ ఫైనాన్స్ 1.30%, సన్‌ఫార్మా 1.19% లాభపడ్డాయి. ఇన్ఫోసిస్ 2.58%, టీఎంపీవీ 1.62%, టాటా స్టీల్ 1.39%, ఐసీఐసీఐ బ్యాంక్ 1.01%, టెక్ మహీంద్రా 0.87% నష్టపోయాయి. రంగాల వారీ సూచీల్లో.. టెలికాం, ఎఫ్ఎమ్‌సీజీ, మన్నికైన వినిమయ వస్తువులు, బ్యాంకింగ్, ఆర్థిక సేవలు, ఆరోగ్య సంరక్షణ రాణించాయి. ఫోకస్డ్ ఐటీ, టెక్, కమొడిటీస్, ఐటీ, వాహన, లోహ, చమురు-గ్యాస్ నిరాశపరిచాయి. బీఎస్ఈలో 1773 షేర్లు లాభపడగా, 2450 స్క్రిప్‌లు నష్టపోయాయి. 157 షేర్లలో ఎటువంటి మార్పులేదు.

ఐపీఓ సమాచారం

టెన్నెకో క్లీన్ ఎయిర్ ఇండియా రూ.3,600 కోట్ల ఐపీఓ ముగిసేసరికి 58.83 రెట్ల స్పందన లభించింది. ఇష్యూలో భాగంగా 6.66 కోట్ల షేర్లను జారీ చేయగా, 392 కోట్ల షేర్లకు బిడ్లు దాఖలయ్యాయి. క్యూఐబీ విభాగంలో 166.42 రెట్లు, ఎన్ఐఐ విభాగంలో 40.74 రెట్లు, రిటెయిల్ మదుపర్ల నుంచి 5.11 రెట్ల స్పందన వచ్చింది.

- ఫుజియామా పవర్ సిస్టమ్స్ ఐపీఓ రెండో రోజుకు 40% స్పందన లభించింది. ఇష్యూలో భాగంగా 2,63,47,221 షేర్లను ఆఫర్ చేయగా, 1,04,25,935 షేర్లకు బిడ్లు నమోదయ్యాయి.
- పైన్ ల్యాబ్స్ షేరు ఇష్యూ ధర రూ.221తో పోలిస్తే, బీఎస్ఈలో ట్రేడింగ్ 9.5% లాభంతో రూ.242 వద్ద ప్రారంభమైంది. ఇంట్రాడేలో రూ.283.70 వద్ద గరిష్ఠాన్ని తాకినా, చివరకు 13.71% లాభంతో రూ.251.30 దగ్గర స్థిరపడింది. కంపెనీ మార్కెట్ విలువ రూ.28,936.56 కోట్లుగా నమోదైంది.

2.7 బి.డాలర్లు తగ్గిన ఫారెక్స్ నిల్వలు

మన విదేశీ మారకపు (ఫారెక్స్) నిల్వలు నవంబరు 7తో ముగిసిన వారానికి 2.699 బి.డాలర్లు (దాదాపు రూ.23,750 కోట్లు) తగ్గి 687.034 బిలియన్ డాలర్ల (దాదాపు రూ.60.45 లక్షల కోట్ల)కు చేరాయని ఆర్‌బీఐ తెలిపింది. అంతక్రితం వారం ఫారెక్స్ నిల్వలు 5.623 బి.డాలర్లు క్షీణించి 689.733 బి.డాలర్లుగా నమోదయ్యాయి. సమీక్షిస్తున్న వారంలో విదేశీ కరెన్సీ ఆస్తులు 2.454 బి.డాలర్లు తగ్గి 562.137 బి.డాలర్లకు పరిమితమయ్యాయి.

సంక్షిప్తంగా..

- అమెరికా టారిఫ్‌ల నేపథ్యంలో ఎగుమతిదారులు ఎదుర్కొంటున్న ఒత్తిడిని దృష్టిలో ఉంచుకుని, షిప్‌మెంట్ల ఆదాయాన్ని తీసుకునేందుకు ప్రస్తుతం 9 నెలలుగా ఉన్న కాలపరిమితిని 15 నెలలకు పెంచుతున్నట్లు ఆర్‌బీఐ తెలిపింది.
- జపాన్ టైర్ల సంస్థ బ్రిడ్జ్‌స్టోన్ అనుబంధ **బ్రిడ్జ్‌స్టోన్‌ఇండియా**, తమ డిప్యూటీ మేనేజింగ్ డైరెక్టర్ రాజర్షి మొయిత్రాకు మేనేజింగ్ డైరెక్టర్‌గా పదోన్నతి కల్పిస్తున్నట్లు తెలిపింది. 2026 జనవరి 1న ప్రస్తుత ఎండీ హిరోషి యోషిజనే స్థానాన్ని రాజర్షి భర్తీ చేయనున్నారు.
- అట్‌మంతన్ బ్రాండ్‌ను నిర్వహించే **స్పర్శ్ ఇన్‌ఫ్రాటెక్‌**లో 51% వాటాను దాదాపు రూ.240 కోట్లకు కొనుగోలు చేయడానికి **ఇండియన్ హోటల్స్** కంపెనీ ఒప్పందం కుదుర్చుకుంది.
- పరస్పర విరుద్ధ ప్రయోజనాలను నిరోధించేందుకు, సెబీ సీనియర్ అధికారుల ఆస్తులను ప్రకటించాలని సిఫారసు చేసిన అత్యున్నత స్థాయి ప్యానెల్ నివేదికను డిసెంబరు 17న మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ బోర్డు పరిశీలించనుందని సంస్థ ఛైర్మన్ తుహిన్ కాంత పాండే వెల్లడించారు.

అక్టోబరులో కార్ల టోకు విక్రయాల్లో రికార్డు

ద్విచక్ర - త్రిచక్ర వాహనాల్లోనూ



జీఎస్‌టీ రేట్ల కోత వల్ల ధరలు తగ్గడానికి తోడు, పండగ ఆఫర్ల వల్ల గిరాకీ పెరిగి.. అక్టోబరులో కంపెనీల నుంచి డీలర్లకు రికార్డు స్థాయిలో ప్రయాణికుల వాహనాలు (పీవీలు- కార్లు, ఎస్‌యూవీలు, వ్యాన్లు), ద్వి, త్రిచక్ర వాహనాల సరఫరా జరిగింది. వాహన తయారీదార్ల సమాఖ్య (సియామ్) గణాంకాల ప్రకారం..

- అక్టోబరులో పీవీల టోకు విక్రయాలు 17% పెరిగి 4,60,739కు చేరాయి. 2024 అక్టోబరులో ఈ విక్రయాల సంఖ్య 3,93,238.
- ద్విచక్ర వాహన టోకు విక్రయాలు 21,64,276 నుంచి 2% పెరిగి 22,10,727 వాహనాలకు చేరాయి. స్కూటర్ల విక్రయాలు 14% పెరిగి 8,24,003 వాహనాలకు చేరగా.. మోటార్ సైకిల్ సరఫరాలు 4% తగ్గి 13,35,468కు పరిమితమయ్యాయి.
- త్రిచక్ర వాహనాల సరఫరా 6% పెరిగి 81,288 వాహనాలుగా నమోదైంది.
- 'అక్టోబరులో నమోదైన పీవీలు, ద్వి, త్రిచక్ర వాహనాల టోకు అమ్మకాలే ఇప్పటివరకు అత్యధికం. సరఫరాపరంగా కొన్ని అవరోధాలు ఎదురైనా.. పండగ సీజను గిరాకీ, జీఎస్‌టీ సంస్కరణల అండతో ఈ స్థాయిలో విక్రయాలు నమోదయ్యాయ'ని సియామ్ డైరెక్టరు జనరల్ రాజేశ్ మీనన్ తెలిపారు.

ఈనాడు సినిమా

'పాస్‌పోర్ట్' లేకుండా రావొద్దు.. వేడుకలు ఇంకా చాలా ఉన్నాయి!

- మహేశ్‌బాబు



మునుముందు వేడుకలు ఇంకా చాలానే ఉంటాయంటూ అభిమానులకి భరోసా ఇచ్చారు కథానాయకుడు మహేశ్‌బాబు. గ్లోబ్‌ట్రాటర్ వేడుకకి కంగారుపడి పాసులు లేకుండా ఎవ్వరూ రావొద్దని కోరారు. ఆయన కథానాయకుడిగా... ఎస్.ఎస్.రాజమౌళి దర్శకత్వంలో ఓ చిత్రం తెరకెక్కుతున్న సంగతి తెలిసిందే. గ్లోబ్ ట్రాటర్ అనే వర్కింగ్ టైటిల్‌తో రూపొందుతున్న ఆ సినిమాకు సంబంధించి శనివారం రామోజీ ఫిల్మ్‌సిటీలో ఓ భారీ వేడుకని నిర్వహిస్తున్నారు. అందులో సినిమా పేరుతోపాటు, టీజర్‌ని విడుదల చేయనున్నారు. ఇదివరకెప్పుడూ చూడని విధంగా వేడుక ఉంటుందని ఇప్పటికే చిత్రబృందం ప్రకటించిన సంగతి తెలిసిందే. గత కొన్ని రోజులుగా నిరంతరాయంగా ఈ వేడుకకి సంబంధించిన ఏర్పాట్లు జరుగుతున్నాయి. వేల సంఖ్యలో హాజరయ్యే ప్రేక్షకులు వేడుకని ప్రత్యక్షంగా ఆస్వాదించేందుకు వంద అడుగుల ఎల్ఈడీ స్క్రీన్‌ని వేదిక దగ్గర ఏర్పాటు చేశారు. జియోహాట్‌స్టార్‌లో ఈ వేడుక ప్రత్యక్ష ప్రసారం కానుంది. సినిమా విశేషాలు, ప్రదర్శనలు, ప్రసంగాలు ప్రధాన ఆకర్షణగా నిలవనున్నాయి. ఈ సందర్భంగా మహేశ్‌బాబు సామాజిక మాధ్యమాల వేదికగా ఓ వీడియోను పంచుకుంటూ... అందులో కీలకమైన సూచనలు చేశారు. ఎంత తక్కువ వాహనాలతో వస్తే అందరికీ అంత సులభంగా ఉంటుందని ఆయన చెప్పారు. "వేడుక జరిగే ఈ రోజు రామోజీ ఫిల్మ్‌సిటీ ప్రధాన ప్రవేశద్వారాలు మూసి ఉంటాయి. పాసులు ఉన్నవాళ్లే వేడుకకి రావాలి. ఇచ్చిన పాస్‌ల్లో క్యూఆర్ కోడ్ ఉంటుంది. స్కాన్ చేస్తే ఏ గేట్ ద్వారా వేడుకలోకి వెళ్లాలో చూపిస్తుంది. ప్రతి ఒక్కరూ సూచనలు పాటించండి. పోలీసులకీ, ఇతర సిబ్బందికీ అందరూ సహకారం అందించండి. ప్రత్యేకమైన వేడుకని అందరం గుర్తుండిపోయేలా మలుచుకుందాం. ఎవ్వరూ కంగారు పడి పాసులు లేకుండా రావొద్దు. మనకు ఇంకా చాలా వేడుకలు ఉంటూనే ఉంటాయ"ని వీడియోలో స్పష్టం చేశారు మహేశ్‌బాబు. అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో గ్లోబ్‌ట్రాటర్ చిత్రం రూపొందుతోంది. ఇప్పటికే ప్రతినాయకుడిగా నటిస్తున్న పృథ్వీరాజ్ సుకుమారన్, కథానాయికగా నటిస్తున్న ప్రియాంక చోప్రా పోస్టర్లని విడుదల చేసింది చిత్రబృందం. ఇక పేరు, టీజర్‌ని ఆస్వాదించడమే మిగిలి ఉంది. ఈ వేడుకకు వచ్చే అభిమానుల కోసం పాస్‌పోర్ట్ తరహాలో ప్రత్యేక పాస్‌లను సిద్ధం చేసింది చిత్రబృందం. వాటికి సంబంధించిన ఫొటోలు సామాజిక మాధ్యమాల్లో సందడి చేస్తున్నాయి.



గోపీ ఆచంట, బోయపాటి శ్రీను, బాలకృష్ణ, తమన్, హర్షాలి, ఆది పినిశెట్టి

ప్రతి ఒక్కరూ పిల్లలకు 'అఖండ 2' చూపించాలి

- బాలకృష్ణ

"హిందూ సనాతన ధర్మం శక్తి పరాక్రమాన్ని 'అఖండ 2: తాండవం'లో చూస్తార"న్నారు కథానాయకుడు నందమూరి బాలకృష్ణ. ప్రతి ఒక్కరూ తమ పిల్లల్ని తీసుకెళ్లి ఈ సినిమా చూపించాలని కోరారు. బాలకృష్ణ.. దర్శకుడు బోయపాటి శ్రీను కలయికలో రూపొందిన ఈ పాన్ ఇండియా సినిమాని రామ్ ఆచంట, గోపీ ఆచంట నిర్మించారు. సంయుక్తా మేనన్ కథానాయిక. ఆది పినిశెట్టి, జగపతిబాబు తదితరులు కీలక పాత్రలు పోషించారు. ఈ సినిమా డిసెంబరు 5న థియేటర్లలోకి రానుంది. ఈ నేపథ్యంలోనే శుక్రవారం ముంబయిలో ఈ చిత్ర గీతాన్ని విడుదల చేశారు. 'రంగ రంగ శంభు లింగ ఈశ్వర.. అంతరంగా హే భుజంగా శంకర" అంటూ సాగిన ఈ భక్తి పాటకు తమన్ స్వరాలు సమకూర్చారు. కల్యాణ్ చక్రవర్తి సాహిత్యమందించారు. శంకర్ మహదేవన్, కైలాశ్ ఖేర్ ఆలపించారు. ఈ సందర్భంగా బాలకృష్ణ మాట్లాడుతూ. "నాది.. బోయపాటిది విజయవంతమైన కలయిక. మేమిద్దరం కలిసి చేసిన గత మూడు చిత్రాలు విజయవంతమయ్యాయి. ఇది మాకు నాలుగో సినిమా" అన్నారు. "ఇది కేవలం సినిమా కాదు.. భారత దేశ ఆత్మ. ఇది మన ధర్మం. కుటుంబమంతా కలిసి చూసే సినిమా. దీన్ని మేము అత్యంత శీతల వాతావరణంలో చిత్రీకరించాం. అలాంటి చోట మేమంతా స్వెటర్‌లు వేసుకుని జాగ్రత్తలు తీసుకున్నాం. బాలకృష్ణ మాత్రం ఓ మామూలు పంచె కట్టుకుని ఉన్నారంతే. అది నటన పట్ల ఆయనకి ఉన్న నిబద్ధతకు నిదర్శనం. మా వెనుక శివయ్యే ఉండి దీన్ని పూర్తి చేయించాడు" అన్నారు దర్శకుడు బోయపాటి శ్రీను. ఈ కార్యక్రమంలో తమన్, ఆది పినిశెట్టి, కైలాశ్ ఖేర్, గోపీ ఆచంట, హర్షాలి తదితరులు పాల్గొన్నారు.



నితిన్, సాయిలు, వంశీ, తేజస్వినీ, బన్నీవాస్, అడివి శేష్, అఖిల్, వేణు, చైతు, సాయికృష్ణ

మనసుకి హత్తుకునేలా రాజు వెడ్స్ రాంబాయి

"నిజాయతీగా చేసిన ఓ అందమైన ప్రేమ కథా చిత్రం 'రాజు వెడ్స్ రాంబాయి'. ఇది మనసుల్ని హత్తుకునేలా ఉంటుంది" అన్నారు హీరో అడివి శేష్. ఈటీవీ విన్ ఒరిజినల్స్ ప్రొడక్షన్ నుంచి వస్తున్న ఈ చిత్రాన్ని దర్శకుడు వేణు ఊడుగుల.. నిర్మాత రాహుల్ మోపిదేవితో కలిసి నిర్మించారు. అఖిల్, తేజస్వినీ రావ్ జంటగా నటించారు. సాయిలు కంపాటి తెరకెక్కించారు. చైతు జొన్నలగడ్డ, శివాజీ రాజా తదితరులు కీలక పాత్రలు పోషించారు. ఈ సినిమా నిర్మాతలు బన్నీవాస్, వంశీ నందిపాటి ద్వారా ఈనెల 21న థియేటర్లలోకి రానుంది. ఈ నేపథ్యంలోనే ఇటీవల హైదరాబాద్‌లో ట్రైలర్‌ని విడుదల వేడుక జరిగింది. అడివి శేష్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. "వైరల్ కంటెంట్ ఎలా చేయాలని ఆలోచిస్తున్న ఈ సోషల్ మీడియా యుగంలో ఇలాంటి ఒక స్వచ్ఛమైన ప్రేమకథతో ప్రేక్షకుల ముందుకు రావడం మామూలు విషయం కాదు. నాకు ఈ కథ తెలుసు. దీంట్లోని కొన్ని సన్నివేశాల్ని చూశాను. దీన్ని వారం ముందు నుంచే వివిధ చోట్ల ప్రీమియర్స్ వేయండి. రిలీజ్ టైమ్‌కి ప్రేక్షకులే థియేటర్లకు వస్తారు. అంత మంచి చిత్రమిది" అన్నారు. "ఈ చిత్ర క్లైమాక్స్ చూసి ప్రేక్షకులు చలించకుంటే నేనిక సినిమాలు చేయను. ఇది అంత భావోద్వేగభరితంగా ఉంటుంది" అన్నారు నిర్మాత వంశీ నందిపాటి. ఈ కార్యక్రమంలో సాయికృష్ణ, నితిన్, వేణు ఊడుగుల, సాయిలు కంపాటి, బన్నీవాస్, శివాజీ రాజా, చైతు జొన్నలగడ్డ తదితరులు పాల్గొన్నారు.




సాహితీ, శ్రీనాథ్

ప్రేమ.. వినోదం.. యాక్షన్

శ్రీనాథ్ కటారి హీరోగా నటిస్తూ.. స్వీయ దర్శకత్వంలో ఓ చిత్రాన్ని తెరకెక్కించారు. దీన్ని బళ్లారి శంకర్ నిర్మించారు. సాహితీ అవాంచ కథానాయిక. తనికెళ్ల భరణి, గోపరాజు రమణ, దేవీప్రసాద్ తదితరులు కీలక పాత్రలు పోషించారు. ఈ సినిమా మైత్రీ మూవీ డిస్ట్రిబ్యూటర్స్, ప్రైమ్ షో ఎంటర్‌టైన్‌మెంట్ సంస్థల ద్వారా ఈ నెల 21న థియేటర్లలోకి రానుంది. ఈ విషయాన్ని శుక్రవారం ప్రకటించారు. "ఇదొక మంచి యూత్‌ఫుల్ ఎంటర్‌టైనర్. ప్రేమ, వినోదం, యాక్షన్.. ఇలా అన్ని రకాల వాణిజ్యాంశాలతో నిండి ఉంటుంది" అని చిత్ర బృందం తెలిపింది. ఈ సినిమాకి సంగీతం: ఆర్పీ పట్నాయక్, ఛాయాగ్రహణం: జగదీశ్ చీకటి.

నీతి లేదు.. బాధ్యత లేదు



అమితాబ్ బచ్చన్

నీతి లేదు.. బాధ్యత లేదు అంటూ బాలీవుడ్ అగ్రహీరో అమితాబ్ బచ్చన్ సామాజిక మాధ్యమాల వేదికగా అసహనం వ్యక్తం చేశారు. "కేవలం వ్యక్తిగత లాభం కోసం ఇదొక మార్గం. ఆ క్షణం, ఆ పరిస్థితి గురించి పరిశీలన అవసరం లేదు. ఇది చాలా అసహ్యకరమైంది" అంటూ ఎక్స్‌లో ఓ పోస్ట్ పెట్టారు. ఆసుపత్రి నుంచి డిశ్చార్జ్ అయిన సీనియర్ నటుడు ధర్మేంద్ర ఇంటి ముందు నిరంతరం మీడియా వేచి ఉండడమే అమితాబ్ పోస్టుకు కారణమని ప్రేక్షకులు అభిప్రాయపడుతున్నారు. ఇటీవలే ఈ విషయంలో మీకు సిగ్గు లేదంటూ మీడియాపై సన్నీ దేవోల్ కూడా ఆగ్రహం వ్యక్తం చేసిన సంగతి తెలిసిందే.

అలనాటి నటి కామినీ కౌశల్ కన్నుమూత

హిందీ చిత్రసీమ తొలితరం కథానాయికల్లో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న సీనియర్ నటి కామినీ కౌశల్ (98) కన్నుమూశారు. ఆమె గురువారం రాత్రి ముంబయిలోని తన నివాసంలో మరణించినట్లు కుటుంబ సన్నిహితులు వెల్లడించారు. కామిని దాదాపు ఏడు దశాబ్దాల పాటు నటిగా తనదైన ముద్రవేశారు. ఎలాంటి పాత్ర అయినా సరే అలవోకగా నటించి ప్రేక్షకుల్ని మెప్పించే ఈమె నటించిన తొలి సినిమానే ప్రతిష్ఠాత్మక కేన్స్ చిత్రోత్సవాల్లో నిలవడం విశేషం. విరామం లేకుండా అప్పట్లో ఏడాదికి ఐదారు సినిమాలతో తెరపై మెరిశారు కామిని.



1927 ఫిబ్రవరి 24న లాహోర్‌లో జన్మించారు కామిని. ఆమె అసలు పేరు ఉమా కశ్యప్. బాల్యం నుంచే ప్రతిభావంతురాలైన ఆమె ఆకాశవాణిలో రేడియో నాటికలు వేసేవారు. ఆమె గొంతుకు ముగ్ధుడైన దర్శకనిర్మాత చేతన్ ఆనంద్ తనను 1946లో 'నీచా నగర్' సినిమాతో వెండితెరకు పరిచయం చేశారు. చేతన్ తెరకెక్కించిన ఈ సినిమాలో ఆయన భార్య ఉమ కూడా నటించారు. దాంతో చేతన్ స్వయంగా తన పేరుని కామినిగా మార్చారని అప్పట్లో ఓ సందర్భంలో చెప్పారు కామిని. ధనిక, పేదల మధ్య అంతరాన్ని చూపిస్తూ రూపొందిన 'నీచా నగర్' కేన్స్ తొలి ఫిల్మ్ ఫెస్టివల్‌లో గ్రాండ్ ప్రిక్స్ (పామ్ డీఓర్)ను గెలిచి చరిత్ర సృష్టించింది.

దశాబ్దాలు దాటి కొనసాగిన నటన

సినీరంగంలోకి అడుగుపెట్టిన తక్కువ కాలంలోనే అగ్రహీరోల సరసన అవకాశాల్ని అందుకున్నారు కామిని. ఆమె సినీ ప్రయాణంలో.. 'జైల్ యాత్ర', 'దో భాయ్', 'అగ్', 'నదియా కే పార్', 'జిద్దీ', 'షబ్నం', 'పారాస్', 'నమూనా', 'అర్జూ', 'ఝంఝర్' లాంటి ఎన్నో చిత్రాలు బ్లాక్‌బస్టర్లుగా నిలిచాయి. హిందీ అగ్రకథానాయకులు దిలీప్ కుమార్, అశోక్ కుమార్, దేవ్ ఆనంద్, రాజ్ కపూర్‌ల సరసన నటించిన కామిని.. 1940లలో అత్యధిక పారితోషికం తీసుకునే నటీమణులలో ఒకరిగా గుర్తింపు పొందారు. ఆమె నటించిన 'బిరాజ్ బహు' జాతీయ స్థాయిలో ఉత్తమ చిత్రంగా ఆల్ ఇండియా మెరిట్ సర్టిఫికెట్‌ను సొంతం చేసుకుంది. 1946 నుంచి 1963 వరకూ కథానాయికగా రాణించిన ఆమె ఆ తర్వాత క్యారెక్టర్ ఆర్టిస్టుగానూ మెప్పించారు. 'దో రాస్తే', 'ప్రేమ్ నగర్', 'ఉపహార్', 'పురబ్ ఔర్ పచ్చిమ', 'రోటీ కపడా ఔర్ మకాన్' లాంటి హిట్ చిత్రాల్లో తల్లి పాత్రల్లో ఆకట్టుకున్నారు కామిని. షారుక్ ఖాన్ నటించిన 'చెన్నై ఎక్స్‌ప్రెస్'లో అమ్మమ్మ పాత్ర పోషించి అందరినీ అలరించారు. చివరగా ఆమిర్ ఖాన్ నటించిన 'లాల్ సింగ్ చద్దా'లో వృద్ధ మహిళగా అతిథి పాత్రలో తళుక్కున మెరిశారామె. వెండితెరపైనే కాకుండా.. బుల్లితెరపై కూడా 'ది జ్యువెల్ ఇన్ ది క్రౌన్', 'షన్నో కీ షాదీ', 'వక్త్ కీ రఫ్తార్' లాంటి పలు షోలలో మెప్పించారు.

చిరస్థాయిగా నిలిచే నక్షత్రం

చిన్న వయసులోనే తన అక్క మరణంతో ఇద్దరి పిల్లల బాధ్యత కామినిపై పడింది. ఆ సమయంలో తన అక్క భర్తనే ఆమె వివాహం చేసుకున్నారు. ఆ తర్వాత ఈ దంపతులకు రాహుల్, విదూర్, శ్రవణ్ అనే ముగ్గురు కుమారులు పుట్టారు. "నేను, సరోజా దేవీ, భానుమతి రామకృష్ణ, మలా సిన్హా, షర్మిలా ఠాగూర్.. లాంటి ఎంతో మంది తారలు పెళ్లి తర్వాత కూడా చిత్రపరిశ్రమలో విజయాలు సాధించాం.. సంతోషకరమైన వైవాహిక జీవితాన్ని గడిపాం" అంటూ పలు సందర్భాల్లో చెప్పుకొచ్చే కామినీ కౌశల్.. ఉత్తమ నటిగా పలు ఫిల్మ్ ఫేర్ పురస్కారాల్ని సొంతం చేసుకున్నారు. 2013లో కల్పనా చావ్లా ఎక్సలెన్స్ అవార్డు, 2015లో ఫిల్మ్‌ఫేర్ లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్ పురస్కారాన్ని గెల్చుకున్నారు. ఆమె నటన, వినయం, క్రమశిక్షణకు ఎన్నో తరాల ప్రేక్షకులు సాక్ష్యం... భారతీయ సినీ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయే నక్షత్రం ఈ రోజు అస్తమించింది అంటూ పలువురు సినీ ప్రముఖులు సామాజిక మాధ్యమాల ద్వారా సంతాపం వ్యక్తం చేశారు.

పిల్లల కోసం తోలుబొమ్మల కథలు

సినిమాల్లో తన నటనతో అదరగొట్టడమే కాదు.. పిల్లల కోసం ఎన్నో కథలు రాశారు కామిని. అవన్నీ పిల్లల పత్రిక పరాగ్‌లో ప్రచురితమయ్యాయి. తన బ్యానర్ గుడియా ఘర్ ప్రొడక్షన్స్‌పై చాంద్ సితారే, చాట్‌పానీ, చందమామ లాంటి తోలుబొమ్మ ఆధారిత టీవీ కార్యక్రమాలను నిర్వహించారు. ఆమె స్వయంగా తోలుబొమ్మలను తయారు చేసి, పాత్రలకు అనుగుణంగా తన గొంతుతో ప్రాణం పోశారు.

నిజంగా జరిగిన కథ.. 'దేవగుడి'



రామకృష్ణారెడ్డి, అభినవ్, అనుశ్రీ, శ్రీకాంత్

ఫ్యాక్షనిజం నేపథ్యంలో నిజంగా జరిగిన కథతో రూపొందిన సినిమా 'దేవగుడి' అని, ప్రేక్షకుల మెప్పు పొందుతుందని ఆశిస్తున్నానని చెప్పారు ప్రముఖ కథానాయకుడు శ్రీకాంత్. ఆయన ముఖ్య అతిథిగా ఇటీవల హైదరాబాద్‌లో 'దేవగుడి' టీజర్ ఆవిష్కరణ కార్యక్రమం జరిగింది. అభినవ్ శౌర్య, నరసింహ, అనుశ్రీ ప్రధాన పాత్రధారులుగా... బెల్లం రామకృష్ణారెడ్డి స్వీయ నిర్మాణంలో తెరకెక్కిన చిత్రమిది. డిసెంబరు 19న ప్రేక్షకుల ముందుకు రానుంది. టీజర్‌ని ఆవిష్కరించిన అనంతరం శ్రీకాంత్ మాట్లాడుతూ "2013లో నిర్మాతగా ప్రయాణం మొదలుపెట్టారు రామకృష్ణారెడ్డి. అప్పట్లో ఆయన సినిమా గురించి చెబుతుంటే మీరే దర్శకత్వం చేయవచ్చు కదా అనేవాణ్ని. సినిమా అంటే అంత ప్రేమ ఆయనకి. నేను అన్నట్టుగానే ఆయన దర్శకుడు అయ్యారు. ఈ కథ గురించి నాకు తెలుసు. కథ బాగుంటే తెలుగు ప్రేక్షకులు సినిమాని గొప్పగా ఆదరిస్తారు. మంచి కథ, కథనాలతో వస్తున్న ఈ చిత్రం ఘన విజయం సాధించాలని కోరుకుంటున్నా" అన్నారు. దర్శకనిర్మాత బెల్లం రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ "ప్రతిభ కలిగిన నటీనటులు, సాంకేతిక బృందం కలిసి చేసిన చిత్రమిది. వాస్తవ సంఘటనల ఆధారంగా తెరకెక్కించా. శ్రీకాంత్ చేతులమీదుగానే మా పుష్యమి ఫిలిం మేకర్స్ సంస్థ మొదలైంది. నా ప్రతి సినిమాకీ ఆయన సహకారం అందిస్తున్నారు. ఈ సినిమా టీజర్ ఆయన చేతుల మీదుగా విడుదల కావడం ఆనందంగా ఉంది" అన్నారు. ఈ కార్యక్రమంలో చిత్రబృందం పాల్గొంది.

కొరియన్ నిర్మాతతో అక్షయ్



జయాపజయాలతో సంబంధం లేకుండా వరుస సినిమాలతో ప్రేక్షకుల్ని అలరిస్తుంటారు బాలీవుడ్ హీరో అక్షయ్ కుమార్. ప్రస్తుతం సైఫ్ అలీఖాన్‌తో కలిసి 'హైవాన్' సినిమాతో బిజీగా ఉన్న ఆయన.. తన రాబోయే సినిమా కోసం కొరియన్ నిర్మాతతో చేతులు కలిపినట్లు తెలుస్తోంది. 'టెన్ 3', 'జానే జాన్' లాంటి హిందీ చిత్రాలను నిర్మించిన కొరియన్ నిర్మాత హ్యూన్‌వూ థామస్ కిమ్.. అక్షయ్ కోసం ఓ సినిమాను తీర్చిదిద్దుతున్నట్లు తెలిపారు. తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న కిమ్ మాట్లాడుతూ.. "ఇటీవలే లండన్‌లో ఉన్న అక్షయ్‌కి ఓ సినిమా గురించి చెప్పి సందేశాన్ని పంపించాను. దర్శకుడు సుజోయ్ ఘోశ్ కూడా ప్రస్తుతం ఈ చిత్ర పనిపైనే ఉన్నారు. మంచి హిట్ అందుకున్న కొరియన్ సినిమాను హిందీలో రీమేక్ చేయాలనే ఆలోచనలో ఉన్నాం. అక్షయ్ అంగీకరిస్తే.. త్వరలో దీనికి సంబంధించిన వివరాల్ని వెల్లడిస్తా" అని అన్నారు. భారతీయ చిత్రపరిశ్రమలో పనిచేసిన అనుభవాలను పంచుకుంటూ.. ఇండియాకి భారీ మార్కెట్ ఉందని, గొప్ప దర్శకనటులు, రచయితల వల్లే అది సాధ్యమైందని, కొరియాలో నైపుణ్యం కలిగిన రచయితలు లేకపోవడమే దీనికి కారణమని చెప్పారు కిమ్.

నవ్విస్తూ.. థ్రిల్ చేసే 'జెట్లీ'



సత్య

హాస్య నటుడు సత్య హీరోగా రితేశ్ రానా దర్శకత్వంలో ఓ చిత్రం రూపొందుతోంది. 'మత్తు వదలరా' సిరీస్ విజయాల తర్వాత వీళ్ల కాంబో నుంచి వస్తున్న కొత్త సినిమా ఇది. మైత్రీ మూవీ మేకర్స్ సమర్పణలో చెర్రీ, హేమలత పెదమల్లు నిర్మిస్తున్నారు. రియా సింఘా కథానాయిక. వెన్నెల కిశోర్, అజయ్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ చిత్రానికి 'జెట్లీ' అనే పేరును ఖరారు చేశారు. ఈ మేరకు శుక్రవారం టైటిల్ లుక్ విడుదల చేశారు. ఆ ప్రచార చిత్రంలో సత్య విమానంపై నాన్‌చాక్‌తో అభివాదం చేస్తూ ఫన్నీ లుక్‌లో కనిపించారు. "ఇదొక విభిన్నమైన యాక్షన్ కామెడీ ఎంటర్‌టైనర్. రితేశ్ మార్క్ ట్విస్ట్‌లు, మలుపులు, వినోదంతో నిండి ఉంటుంది. ఈ సినిమా రెగ్యులర్ చిత్రీకరణ హైదరాబాద్‌లో మొదలు కానుంది" అని చిత్ర వర్గాలు తెలిపాయి. ఈ చిత్రానికి సంగీతం: కాలభైరవ, ఛాయాగ్రహణం: సురేశ్ సారంగం.

అట్లీ నిర్మాణంలో విజయ్ చిత్రం?



విజయ్ సేతుపతి

'తలైవాన్ తలైవి' చిత్రంతో ఇటీవలే ప్రేక్షకుల్ని పలకరించారు విలక్షణ నటుడు విజయ్ సేతుపతి. ఇప్పుడాయన మరో కొత్త చిత్రానికి ఓకే చెప్పినట్లు తెలుస్తోంది. దర్శకుడు బాలాజీ తరణీధరన్ తెరకెక్కిస్తున్న ఓ చిత్రంలో విజయ్ హీరోగా నటిస్తున్నట్లు సమాచారం. దర్శకనిర్మాత అట్లీ ఈ ప్రాజెక్టును తన బ్యానర్‌పై నిర్మిస్తున్నారట. "బాలాజీ, విజయ్ సేతుపతి కలయికలో రాబోతున్న మూడో చిత్రమిది. ఇంకా పేరు ఖరారు కానీ ప్రాజెక్టులో లిజోమోల్ జోస్ కథానాయికగా నటిస్తుంది. ఇప్పటికే చిత్రీకరణ ప్రారంభమైంది. అట్లీ నిర్మాణంలో రూపొందడం ఈ ప్రాజెక్టుకు మరో ప్రధాన ఆకర్షణ. త్వరలో దీనిపై అధికారిక ప్రకటన వెలువడే అవకాశాలున్నాయ"ని చిత్ర సన్నిహిత వర్గాలు తెలిపాయి. ప్రస్తుతం విజయ్ నటించిన 'ట్రైన్' విడుదలకు సిద్ధంగా ఉంది.

అలా అనుకున్న రోజే మీకు ముగింపు!



సోనాక్షి సిన్హా

మీకు అన్నీ తెలుసని అనుకున్న రోజు.. అదే మీకు ముగింపు అవుతుందని అంటోంది బాలీవుడ్ నాయిక సోనాక్షి సిన్హా. ఇటీవలే విడుదలైన 'జటాధర' సినిమాతో తెలుగు ప్రేక్షకుల్ని పలకరించిందీమె. ఈ నేపథ్యంలో తాజాగా ఓ కార్యక్రమంలో పాల్గొన్న సోనాక్షి.. తప్పులను స్వీకరించడం గురించి మాట్లాడింది. "నేను ఎప్పుడూ తప్పులు, వైఫల్యాల గురించి భయపడను. తప్పులు చేయడం ద్వారానే కొత్త విషయాల్ని నేర్చుకుంటాం. పిల్లలు కూడా అంతే. ఒకసారి కిందపడితేనే.. ఏదైనా తెలుసుకుంటారు. అందుకే జీవితంలోని ప్రతి దశకు, ప్రతి వృత్తికి ఇది వర్తిస్తుందనేది నా అభిప్రాయం. కొన్నిసార్లు తప్పులు మంచే చేస్తాయి. ఎందుకంటే అవి మీకు తెలియని విషయాల గురించి అనుభవ పూర్వకంగా చెప్తుంటాయి. దీన్నొక అభ్యాస ప్రక్రియగా భావిస్తున్నా" అని అంది. పలు భిన్నమైన పరిశ్రమలలో నటించడం గురించి చెప్తూ.. భాషతో సంబంధం లేకుండా ఎంతో మంది అద్భుతమైన వ్యక్తులతో కలిసి పనిచేయడం గొప్ప అనుభవమని చెప్పుకొచ్చింది సోనాక్షి.

సంకల్ప్ సందేశం



శివాజీరాజా, సుధాకర్‌గౌడ్

పిల్లలు శారీరకంగానే కాదు... మానసికంగానూ సంపూర్ణ ఆరోగ్యంతో ఉండాలనే సందేశంతో తెరకెక్కిన సినిమానే 'మాస్టర్ సంకల్ప్' అన్నారు డా.భీమగాని సుధాకర్ గౌడ్. ఆయన దర్శకనిర్మాణంలో రూపొందిన చిత్రమిది. శ్రవణ్ నందా, సంకల్ప్, బేబి అక్షర, బేబీ లక్ష్మి, సుధాకర్ గౌడ్ ప్రధాన పాత్రధారులు. త్వరలోనే ప్రేక్షకుల ముందుకు రానున్న ఈ సినిమా ట్రైలర్ ఆవిష్కరణ వేడుక శుక్రవారం హైదరాబాద్‌లో జరిగింది. నటుడు శివాజీరాజా ముఖ్య అతిథిగా హాజరయ్యారు. "పరీక్షలు, కుటుంబ వాతావరణం, మొబైల్ వాడకం, సామాజిక నేపథ్యం కారణంగా పిల్లలు ఒత్తిడికి గురవుతున్నారు. వీటి నుంచి బయట పడటానికి యోగా, ధ్యానం మంచి మార్గాలు. వాటిపై తల్లిదండ్రులకు అవగాహన లేదు. చిన్నారులతోపాటు, తల్లిదండ్రుల్లోనూ చైతన్యం కలిగించేలా ఓ మంచి సందేశంతో చిత్రాన్ని తీర్చిదిద్దామ"ని తెలిపారు దర్శకనిర్మాత. ఈ కార్యక్రమంలో శ్రీమిత్ర చౌదరి, పెంచల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రాశి రంగుల ప్రపంచం



రాశీ ఖన్నా, ఫర్హాన్ అక్తర్

"నా ప్రియమైన వ్యక్తి వస్తున్నాడు.. ఆతిథ్యంగా నా ప్రేమనే ఇవ్వబోతున్నా" అంటూ తన ప్రియుడి రాకకై ఉవ్విళ్లూరుతుంది రాశీ ఖన్నా. ఆమె, ఫర్హాన్ అక్తర్ జంటగా నటించిన సినిమా '120 బహాదుర్'. రజనీశ్ ఘాయ్ దర్శకత్వం వహించారు. ఈ నెల 21న రాబోతుందీ చిత్రం. ఈ నేపథ్యంలోనే ప్రచార కార్యక్రమాల్లో భాగంగా ఈ సినిమా నుంచి ఓ గీతాన్ని విడుదల చేసింది చిత్రబృందం. 'నైనే రా లోభీ..' అంటూ సాగుతున్న ఈ గీతంలో రాశి, ఫర్హాన్‌ల జంట ఆకట్టుకునేలా ఉంది. హోలీ నేపథ్యంలో రూపొందిన ఈ పాట కొత్తగా పెళ్లైన దంపతుల ప్రేమను చూపిస్తూ ఆసక్తికరంగా సాగింది. రెజాంగ్ లా యుద్ధానికి నాయకత్వం వహించిన మేజర్ షైతాన్ సింగ్ భాటి జీవితం ఆధారంగా దీన్ని తీర్చిదిద్దారు. ఇందులో షైతాన్ సింగ్ పాత్రలో ఫర్హాన్, ఆయన భార్యగా రాశి కనిపించనున్నారు.

కరెంట్ అఫైర్స్



■ 2025 ఫీడే (FIDE) గ్రాండ్ స్విస్ టైటిల్ విజేతగా ఎవరు నిలిచారు? (మహిళల టైటిల్‌ను భారత గ్రాండ్ మాస్టర్ వైశాలి రమేష్ బాబు గెలుచుకుంది. ఉజ్బెకిస్థాన్‌లోని సమర్‌కండ్‌లో ఈ పోటీలను నిర్వహించారు.)
జ: అనిష్ కుమార్ గిరి (నెదర్లాండ్స్)

■ దేశంలోనే అతిపెద్ద, అత్యంత

మాదిరి ప్రశ్నలు

అధునాతన క్రీడా సముదాయాన్ని కేంద్ర హోంమంత్రి అమిత్ షా ఇటీవల ఏ నగరంలోని నరన్‌పురాలో ప్రారంభించారు? (రూ.825 కోట్లతో నిర్మించారు.)
జ: అహ్మదాబాద్

■ ప్రపంచ రోగి భద్రతా దినోత్సవం (డబ్ల్యూపీఎస్‌డీ వరల్డ్ పేషెంట్ సేఫ్టీ డే)ను ఏటా ఏ రోజున నిర్వహిస్తారు? (ప్రపంచ ఆరోగ్య సంస్థ నిర్వహించే ఈ దినోత్సవాన్ని 2025లో 'సేఫ్ కేర్ ఫర్ ఎవ్రీ న్యూబోర్న్ అండ్ ఎవ్రీ చైల్డ్' అనే థీమ్‌తో నిర్వహించారు.)
జ: సెప్టెంబరు 17

■ 2025-2028 కాలానికి భారత క్రికెట్ జట్టు ప్రధాన స్పాన్సర్‌షిప్‌ను రూ.579 కోట్లతో ఏ సంస్థ గెలుచుకుంది?
జ: అపోలో టైర్స్

మరింత సమాచారం

రాణించేవారి రూటే వేరు! లైఫ్‌స్కిల్స్



చురుకుదనం, తెలివితేటలతో చదువుల్లో రాణించే విద్యార్థులను గమనిస్తే వారిలో నిర్దిష్ట లక్షణాలు కనిపిస్తాయి. అనుకున్నది సాధించాలనే తపన, కొత్త విషయాలు నేర్చుకోవాలనే కుతూహలం ఉంటాయి. పెద్దలు, ఉపాధ్యాయులు చెప్పేది జాగ్రత్తగా వింటారు. సందేహాలను అడగడానికి మొహమాటం పడరు. చదివిన పాఠాన్ని, విన్న విషయాన్ని విశ్లేషించుకుని అవగాహన పెంచుకుంటారు. వాటితో పాటు జరిగిన పొరపాటు గురించి అతిగా ఆలోచించకుండా వర్తమానంలో ఉంటారు. ఈ విధమైన అలవాట్లు వారిని ప్రత్యేకంగా నిలబెడతాయి. వాటిని ఎలా అలవరచుకోవాలో తెలుసుకోవాలంటే క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.

విలువల్లో మార్పులను వివరించే పటాలు!

రేఖా చిత్రాలు

(దత్తాంశ విశ్లేషణ)

దత్తాంశ విశ్లేషణలో భాగంగా 'రేఖాచిత్రాలు' అధ్యాయం నుంచి తరచూ ప్రశ్నలు వస్తూ ఉంటాయి. X- అక్షంపై ఒక రాశి, Y- అక్షంపైన మరొక రాశి ఇస్తూ రేఖాచిత్రాన్ని నిర్మిస్తారు. దత్తాంశంలోని రాశుల పైన, వివిధ రకాల ప్రాథమిక గణితపరిక్రియలపై అవగాహన కలిగి ఉండటం ద్వారా ప్రశ్నలకు సమాధానాలను గుర్తించవచ్చు.




నెలవారీ పరీక్షల్లో విద్యార్థి ప్రదర్శించే ప్రతిభ తీరును, వాతావరణంలో ఉష్ణోగ్రతల హెచ్చుతగ్గులను, షేర్ మార్కెట్‌లో నిర్దిష్ట స్టాక్‌ల ధరల్లో తేడాలను చూడగానే తెలుసుకోడానికి రేఖాచిత్రాలు ఉపయోగపడతాయి. అంటే ఒక శ్రేణిలోని విలువలో వచ్చే మార్పులను ఆ చిత్రాలు సూచిస్తాయి. ఇవి రెండు అక్షాలతో డేటా పాయింట్లు, సరళరేఖల రూపంలో ఉంటాయి. దత్తాంశ విశ్లేషణలో విలువ ధోరణిని సులభంగా గుర్తించడానికి దోహదపడతాయి. ఉత్పత్తుల మధ్య పోలికలకు, భవిష్యత్తు విలువల అంచనాలకు సాయపడతాయి. రీజనింగ్‌లో భాగంగా వీటిపై తరచూ పరీక్షల్లో ప్రశ్నలు వస్తున్నాయి. వాటికి సమాధానాలను వేగంగా కనుక్కోవాలంటే శాతాల పెరుగుదల, తగ్గుదలను లెక్కించడం; సగటును గణించడం నేర్చుకుని ప్రాక్టీస్ చేయాలి. గరిష్ఠ, కనిష్ఠ విలువలను గ్రహించి అర్థం చేసుకోవాలి.



మాదిరి ప్రశ్నలు

I. (1 - 3): కింది పటం A, B, C, D, E అనే అయిదు పట్టణాలకు సహజ వాయువును సరఫరా చేసే పైపులైన్లను సూచిస్తుంది. పైపుల్లో వాయువు ఏకరీతిని ప్రవహించడంతోపాటు డిమాండ్‌కు సరిపడా సప్లై జరుగుతుందని భావించి ప్రశ్నలకు సమాధానాన్ని గుర్తించండి.



1. పట్టణం B లో ఉన్న సహజవాయువు డిమాండ్ ఎన్ని యూనిట్లు?

1) 350 2) 400 3) 450 4) 500

వివరణ: పట్టణం Bకు సరఫరా అయ్యే సహజ వాయువు = 1200 యూనిట్లు

B నుంచి C, E కు సరఫరా అయ్యే సహజ వాయువు = 550 + 250 = 800

పట్టణం B డిమాండ్ = 1200 - 800

= 400 యూనిట్లు **జ: 2**

2. ఒకవేళ C అనే పట్టణం డిమాండ్ 225 యూనిట్లు అయితే M విలువ ఎంత?

1) 1075 2) 875 3) 775 4) 850

వివరణ: పట్టణం C నుంచి సరఫరా అయ్యే మొత్తం.

వాయువు = 300 + 800 = 1100 యూనిట్లు

C డిమాండ్ 225 యూనిట్లు కాబట్టి C కు సరఫరా కావాల్సిన వాయువు = 1100 + 225

= 1325 యూనిట్లు

∴ కావాల్సిన M విలువ = 1075 యూనిట్లు **జ: 1**

3. పట్టణం E డిమాండ్, పట్టణం A డిమాండ్‌లో 80% అయితే A డిమాండ్ యూనిట్లలో?



1) 4500 2) 2400 3) 5000 4) 2500

వివరణ: పట్టణం E డిమాండ్

= 550 + 800 + 650 = 2000 యూనిట్లు

ఇది A డిమాండ్‌లో 80% కాబట్టి

80% —— 2000


100% —— ?

$2000 \times \frac{100}{800} = 2500$ యూనిట్లు **జ: 4**



II. (4 - 5): ఇచ్చిన రేఖా చిత్రంలో A అనే కంపెనీ 2006 నుంచి 2011 వరకు చేసిన ఉత్పత్తి, అమ్మకాలు టన్నుల్లో ఇచ్చారు. అంతే కాకుండా పట్టికలో ఆ కాలానికి A, B అనే రెండు కంపెనీలు చేసిన ఉత్పత్తి, అమ్మకాలను నిష్పత్తుల్లో ఇవ్వడమైంది. సమాచారం ఆధారంగా ప్రశ్నలకు సమాధానం గుర్తించండి.

2006	5 : 4	2 : 3
2007	8 : 7	11 : 12
2008	3 : 4	9 : 14
2009	11 : 12	4 : 5
2010	14 : 13	10 : 9
2011	13 : 14	1 : 1



4. 2006లో కంపెనీ B ఉత్పత్తి 2008లో కంపెనీ B ఉత్పత్తుల మధ్య నిష్పత్తి ఎంత?

1) 2 : 5 2) 4 : 5
3) 3 : 4 4) 3 : 5

వివరణ: 2006 లో కంపెనీ B ఉత్పత్తి

$= \frac{4}{5} \times 750$ టన్నులు = 600 టన్నులు

2008 లో కంపెనీ B ఉత్పత్తి $= \frac{4}{3} \times 600$ ట.

= 800 టన్నులు

కావాల్సిన నిష్పత్తి = 600 : 800

= 3 : 4 **జ: 3**

5. ఇచ్చిన అన్ని సంవత్సరాల్లో కంపెనీ B సగటు ఉత్పత్తి టన్నుల్లో ఎంత?

1) 574 2) 649
3) 675 4) 420

వివరణ: కంపెనీ B యొక్క ఉత్పత్తి

2006 లో $\rightarrow \frac{4}{5} \times 750 = 600$

2007 లో $\rightarrow \frac{7}{8} \times 800 = 700$

2008 లో $\rightarrow \frac{4}{3} \times 600 = 800$

2009 లో $\rightarrow \frac{12}{11} \times 550 = 600$




2010 లో $\rightarrow \frac{13}{14} \times 700 = 650$

2011 లో $\rightarrow \frac{14}{13} \times 650 = 700$

సగటు $= \frac{600+700+800+600+650+700}{6}$

$= \frac{4050}{6} = 675$ టన్నులు **జ: 3**

III. (6 - 8): A, B, C అనే మూడు కంపెనీలు 5 సంవత్సరాల్లో జరిపిన వ్యయాలను (రూ.లక్షల్లో) కింది రేఖాచిత్రం చూపుతుంది. సమాచారం ఆధారంగా ప్రశ్నలకు సమాధానాన్ని గుర్తించండి.



6. 2006, 2008 సంవత్సరాల్లో కంపెనీ B జరిపిన వ్యయం, 2007, 2009ల్లో కంపెనీ C జరిపిన వ్యయాల మధ్య భేదం ఎంత?

1) రూ. 1,00,000 2) రూ. 10,000
3) రూ. 10,00,000
4) రూ. 1,00,00,000

వివరణ: కావాల్సిన భేదం = (190 + 170) – (210 + 140)

= 360 – 350 = రూ. 10 లక్షలు **జ: 3**

7. 2006లో మూడు కంపెనీల వ్యయం అనేది ఇచ్చిన అన్ని సంవత్సరాల్లో కంపెనీ A యొక్క వ్యయంలో ఎంత శాతం?

1) 75% 2) 72% 3) 83% 4) 76%

వివరణ: 2006లో A, B, C ల మొత్తం వ్యయం = 100 + 190 + 250 = 540



A యొక్క మొత్తం వ్యయం = 80 + 100 + 130 + 200 + 210 = 720

కావాల్సిన శాతం $= \frac{540}{720} \times 100$

$= \frac{3}{4} \times 100 = 75\%$ **జ: 1**

8. 2005లో కంపెనీ B వ్యయం, 2008 లో కంపెనీ C వ్యయంలో ఎంత శాతం?

1) 100% 2) 125%
3) 110% 4) 25%

వివరణ: 2005 లో కంపెనీ B వ్యయం = రూ.125 లక్షలు

2008 లో కంపెనీ C వ్యయం = రూ.100 లక్షలు


$= \frac{\text{B వ్యయం}}{\text{C వ్యయం}} \times 100$

$= \frac{125}{100} \times 100 = 125\%$ **జ: 2**



రచయిత: గోలి ప్రశాంత్ రెడ్డి

అవరోధాలను తాకి.. అక్కడే వెనుదిరిగి!



శక్తి ప్రసారం, బదిలీ ప్రక్రియల్లో ప్రధానమైంది తరంగ చలనం. నీటిలో కనిపించే అలలు, అందరికీ వినిపించే ధ్వనులు, కంటికి కనిపించే కాంతి తదితరాలన్నీ తరంగాల రూపంలోనే ప్రసారమవుతాయి. అంటే యానకంలో పుట్టిన అలజడి ఒక చోట నుంచి మరో చోటికి రవాణా అవుతుంది. ఈ తరంగ చలనాల లక్షణాలు, రకాలు, వాటి స్వభావాలు, ఉపయోగాల గురించి పోటీ పరీక్షార్థులకు శాస్త్రీయ అవగాహన ఉండాలి. యాంత్రిక తరంగాలు, విద్యుదయస్కాంత తరంగాలకు ఉన్న భేదాలు, పౌనఃపున్యం, తరంగదైర్ఘ్యాల భౌతిక నియమాలు, సూత్రాలపై ప్రాథమిక పరిజ్ఞానాన్ని కలిగి ఉండాలి.

జనరల్ స్టడీస్ - భౌతిక శాస్త్రం


తరంగ చలనం

1. కింది వాటిలో సరైనవి?
ఎ) యానకంలో సృష్టించే అలజడిని తరంగం అంటారు.
బి) తరంగం ఎల్లప్పుడూ ఒకే దిశలో ప్రయాణిస్తుంది.
సి) తరంగంలో శక్తి మాత్రమే ప్రసారం అవుతుంది, కణాలు ప్రసరించవు.
1) ఎ, బి, సి 2) ఎ, బి
3) బి, సి 4) ఎ, సి

2. తరంగాల్లో ఈ రకమైనవి కణాల కంపన దిశకు తరంగ చలన దిశ సమాంతరంగా కదులుతూ ఉండే యానకపు అణువులు దగ్గరగానూ, దూరంగానూ చలిస్తూ ప్రయాణిస్తాయి?
1) తిర్యక్ తరంగాలు 2) అనుదైర్ఘ్య రంగాలు
3) తిరోగామి తరంగాలు 4) స్థిర తరంగాలు


3. కింది వాటిలో సరికానిది గుర్తించండి.
ఎ) పురోగామి తరంగాలు ఎల్లప్పుడూ ముందుకు ప్రయాణిస్తాయి.
బి) యాంత్రిక తరంగాలు యానకంలో, శూన్యంలో రెండింటిలో ప్రయాణిస్తాయి.
సి) కాంతి తరంగాలు యానకంలో, శూన్యంలో రెండింటిలో ప్రయాణిస్తాయి.
1) ఎ, సి 2) బి 3) బి, సి 4) ఎ, బి, సి

4. కింది వాటిలో సరికానిది గుర్తించండి.



ఎ) తిర్యక్ తరంగాల్లో శృంగాలు, ద్రోణులు ఏర్పడతాయి.
బి) అనుదైర్ఘ్య తరంగాల్లో సంపీడనాలు, విరళీకరణాలు ఏర్పడతాయి.
సి) విద్యుదయస్కాంత తరంగాల్లో అస్పందనాలు, ప్రస్పందనాలు ఏర్పడతాయి.
1) ఎ, బి, సి 2) ఎ, బి 3) సి 4) బి, సి


5. కింది వాటిలో స్థిర తరంగాలకు సంబంధించి సరికానిది?



ఎ) ఇవి ఒకే కంపన పరిమితి పౌనఃపున్యం ఉన్న రెండు తరంగాలు కలిసిపోయినప్పుడు ఏర్పడతాయి.
బి) వీటిలో శక్తి ప్రసారం జరుగుతుంది.
సి) వీటిలో అస్పందనాలు, ప్రస్పందనాలు ఏర్పడతాయి.
డి) సన్నాయి గొట్టంలో ఈ తరంగాలు ఏర్పడి శబ్దం వస్తుంది.
1) ఎ, బి 2) బి, డి 3) ఎ, సి, డి 4) బి

6. కింది వాటిని జతపరచండి.
1) తిర్యక్ తరంగాలు ఎ) ప్రతిధ్వని
2) అనుదైర్ఘ్య తరంగాలు బి) ధ్వని తరంగాలు
3) స్థిర తరంగాలు సి) కాంతి తరంగాలు
4) పరావర్తన తరంగం డి) గొట్టాల్లో తరంగాలు
1) 1-బి, 2-ఎ, 3-డి, 4-సి 2) 1-బి, 2-డి, 3-ఎ, 4-సి
3) 1-సి, 2-బి, 3-డి, 4-ఎ 4) 1-బి, 2-సి, 3-డి, 4-ఎ

7. విద్యుదయస్కాంత తరంగాలకు సంబంధించి సరికానిది?



ఎ) ఇవి విద్యుత్తు, అయస్కాంత క్షేత్రాలు ఒక దాంతో ఒకటి లంబంగా ఉన్నప్పుడు విడుదలవుతాయి.
బి) ఇవి తిర్యక్ తరంగాల రూపంలో ప్రయాణిస్తాయి.
సి) ఇవి శూన్యంలో మాత్రమే ప్రయాణిస్తాయి.
డి) ఇవి ఒక రకం రేడియో తరంగాలు.
1) ఎ, సి, డి 2) సి, డి 3) సి 4) బి, సి, డి

8. కింది వాక్యాల్లో సరైనవి?
ఎ) యానకంలో ప్రయాణించి అవరోధాలను తాకి, వెనుదిరిగి ప్రయాణించే తరంగాలను 'తిరోగామి తరంగాలు' అంటారు.
బి) విద్యుదయస్కాంత తరంగాలు కాంతి వేగానికి సమాన వేగంతో ప్రయాణిస్తాయి.
1) ఎ, బి సరైనవి. 2) ఎ సరైంది, బి సరికాదు.
3) ఎ సరికాదు, బి సరైంది. 4) ఎ, బి సరికావు.

9. కింది వాక్యాల్లో సరైనవి?
ఎ) విద్యుదయస్కాంత తరంగాలను కనుక్కున్నవారు మాక్స్ వెల్.
బి) విద్యుదయస్కాంత తరంగాలు సమాచార ప్రసార తరంగాలు.
1) ఎ 2) బి 3) ఎ, బి 4) ఏదీకాదు


10. కింది వాటిలో సరికానిది?
ఎ) తిర్యక్ తరంగాల్లో లోతైన ప్రదేశాలు - శృంగాలు
బి) అనుదైర్ఘ్య తరంగాల్లో అణువులు దగ్గర ఉన్న ప్రదేశాలు - సంపీడనాలు
సి) స్థిర తరంగాల్లో గరిష్ఠ స్థానభ్రంశం ఉన్న ప్రదేశాలు - అస్పందనాలు
1) ఎ, బి, సి 2) ఎ, బి 3) ఎ, సి 4) బి, సి

11. స్థిర తరంగాల్లో తరంగం ఫేజ్ భేదం దేనికి సమానం?
1) 90° 2) 180° 3) 360° 4) 60°

12. కింది వాటిలో సరికానిది?
ఎ) తిర్యక్ తరంగాలు - ధ్వని తరంగాలు
బి) అనుదైర్ఘ్య తరంగాలు - స్ప్రింగ్‌లో ఏర్పడే తరంగాలు
సి) స్థిర తరంగాలు - తీగల్లో ఏర్పడే తరంగాలు
1) ఎ, బి 2) బి, సి 3) ఎ, బి, సి 4) ఎ

13. కిందివాటిలో విద్యుదయస్కాంత తరంగాలు కానివి?
ఎ) అతినీల లోహిత కిరణాలు.
బి) పరారుణ కిరణాలు సి) కాంతి కిరణాలు
డి) X కిరణాలు ఇ) ధ్వని తరంగాలు
1) ఎ, బి, సి, డి, ఇ 2) ఎ, బి, డి
3) సి, ఇ 4) సి, డి, ఇ

14. కింది వాటిలో కంపన పరిమితి(A)కు సంబంధించి సరికానిది?




ఎ) వస్తువు/కణం విరామ స్థానం నుంచి గరిష్ఠంగా కంపించే దూరం.
బి) దీనికి ప్రమాణం - మీటర్
సి) ఘన పదార్థాల్లో కణాల మధ్య పీడనాన్ని కంపన పరిమితి అంటారు.
1) ఎ, బి, సి 2) బి, సి 3) సి 4) ఎ, సి

15. కింది వాటిలో పౌనఃపున్యం (n)కు సంబంధించి సరైంది?
ఎ) వస్తువు సెకను కాలంలో చేసే కంపనాలు/తరంగాల సంఖ్య.
బి) దీనికి ప్రమాణాలు - కంపనాలు/సెకను.
సి) వస్తువు పౌనఃపున్యం ఆ వస్తువు పొడవుకు విలోమానుపాతంలో ఉంటుంది.
1) ఎ, బి, సి 2) బి, సి 3) ఎ, సి 4) ఎ

16. ఒక వస్తువు 5 నిమిషాల్లో 1800 కంపనాలు చేసింది. అయితే ఆ వస్తువు పౌనఃపున్యం?
1) 60 Hz 2) 10 Hz 3) 18 Hz 4) 6 Hz

17. ఒక సామాన్య లోలకం చేసే పౌనఃపున్యం దేనిపై ఆధారపడదు?
1) లోలకం పొడవు 2) లోలకం బరువు
3) లోలకం డోలనావర్తన కాలం
4) కంపన పరిమితి

18. ఒక సామాన్య లోలకం పొడవు 2 రెట్లు పెరిగితే దాని పౌనఃపున్యం..



1) 2 రెట్లు పెరుగుతుంది
2) 2 రెట్లు తగ్గుతుంది
3) 4 రెట్లు పెరుగుతుంది 4) 4 రెట్లు తగ్గుతుంది

19. 200Hzల పౌనఃపున్యం ఉన్న వస్తువు డోలనావర్తన కాలం (సెకన్లలో)?
1) 0.2 2) 0.005
3) 0.05 4) 0.002

20. ఒక వస్తువు ఒక సెకనుకు 40 కంపనాలు చేసింది. అయితే దాని పౌనఃపున్యం?
1) 40 Hz 2) 80 Hz 3) 160 Hz 4) 20 Hz

21. కింది వాటిలో తరంగదైర్ఘ్యం/ తరంగ దూరానికి సంబంధించి సరికానిది?
ఎ) ఇది ఏదైనా తరంగంలో రెండు వరుస కణాల మధ్య దూరం
బి) దీనికి ప్రమాణం - ఆంగ్‌స్ట్రామ్, మి.మీ., సెం.మీ., మీటర్.
సి) తిర్యక్ తరంగాల్లో రెండు వరుస ద్రోణుల మధ్య దూరం - λ/2 (తరంగ దైర్ఘ్యంలో సగం)
1) ఎ, బి 2) ఎ, బి, సి 3) సి 4) బి, సి

22. కింది వాటిని పరిగణించండి.
ఎ) ఒక సెకను కాలంలో తరంగం ప్రయాణించే దూరం తరంగ వేగం.
బి) తరంగ వేగానికి ప్రమాణాలు - సెం.మీ./సె. లేదా మీ./సె.
1) ఎ, బి సరైనవి 2) ఎ సరైంది, బి సరికాదు
3) ఎ సరికాదు, బి సరైంది 4) ఎ, బి సరికావు

23. 2 KHzల పౌనఃపున్యం ఉన్న తరంగం వేగం 400 మీ./సె. గా ఉంది. అయితే ఆ తరంగానికి ఉన్న తరంగదైర్ఘ్యం?
1) 6 మీ. 2) 2 మీ. 3) 0.2 మీ. 4) 0.02 మీ.

24. 120 Hz ల పౌనఃపున్యం గల తరంగానికి ఉన్న తరంగదైర్ఘ్యం 15 సెం.మీ. అయితే ఆ తరంగ వేగం?
1) 1800 సెం.మీ./సె. 2) 18 సెం.మీ/సె.
3) 18 మీ./సె. 4) 180 మీ./సె.

25. ఒక వస్తువు చేసే కంపనాలకు దాని డోలనావర్తన కాలం 0.25 సెకన్లు అయితే ఆ వస్తువు పౌనఃపున్యం?
1) 25 Hz 2) 4 Hz 3) 250 Hz 4) 8 Hz

26. కింది వాటిలో సరికానివి గుర్తించండి.
ఎ) అనుదైర్ఘ్య తరంగాల్లో అణువులు దూరంగా ఉండే ప్రదేశాలు విరళీకరణాలు.
బి) విరళీకరణాలు ఏర్పడిన ప్రదేశంలో పీడనం, సాంద్రత అధికం.
సి) రెండు వరుస సంపీడనాల మధ్య దూరం తరంగ దైర్ఘ్యం.
1) ఎ, బి, సి 2) ఎ, సి 3) సి 4) బి

27. స్థిర తరంగాలు ఏర్పడినప్పుడు దానిలో ప్రధానంగా అస్పందన, ప్రస్పందనాలు ఏర్పడతాయి. రెండు వరుస అస్పందనాల మధ్య దూరం?
1) తరంగదైర్ఘ్యం (λ)
2) తరంగదైర్ఘ్యంలో సగం $\left(\frac{\lambda}{2}\right)$
3) తరంగదైర్ఘ్యంలో 3వ వంతు $\left(\frac{\lambda}{3}\right)$
4) తరంగదైర్ఘ్యంలో 4వ వంతు $\left(\frac{\lambda}{4}\right)$

28. ఒక స్థిరతరంగం ఏర్పడినప్పుడు దానిలో ఒక అస్పందనం మరొక ప్రస్పందనాల మధ్య దూరం 80 సెం.మీ. అయితే తరంగదైర్ఘ్యం?
1) 20 సెం.మీ 2) 40 సెం.మీ
3) 160 సెం.మీ 4) 320 సెం.మీ.

29. కింది వాటిలో సరైనవి గుర్తించండి.
ఎ) ఒక తిర్యక్ తరంగంలో ఒక శృంగం, ఒక ద్రోణి మధ్య దూరం $= \frac{\lambda}{2}$
బి) ఒక అనుదైర్ఘ్య తరంగంలో ఒక సంపీడనం, ఒక విరళీకరణం మధ్య దూరం $= \frac{\lambda}{2}$
సి) ఒక స్థిరతరంగంలో రెండు వరుస అస్పందనాలు, ప్రస్పందనాల మధ్య దూరం $= \frac{\lambda}{2}$
1) ఎ, బి, సి 2) ఎ, బి 3) బి, సి 4) ఎ, సి

30. కింది వాటిలో సరైనవి గుర్తించండి.
ఎ) గొట్టాల్లో స్థిరతరంగాలు ఏర్పడినప్పుడు వీటిలో గాలి పంపిస్తే శబ్దం విడుదలవుతుంది.
బి) ఈ గొట్టాలను అనునాద వాయుస్తంభాలు అంటారు.
సి) వీటిలో స్థిర తరంగం ఏర్పడి శబ్దం విడుదలవడం అనునాదం వల్ల జరుగుతుంది.
డి) వీటి నుంచి వచ్చే శబ్దం గాలిస్తంభం పొడవుపై ఆధారపడుతుంది.
1) ఎ, బి, సి, డి 2) ఎ, బి, డి
3) ఎ, సి, డి 4) బి, సి

31. కింది వాటిలో సరికానిది గుర్తించండి.
ఎ) స్థిర తరంగాలను మొదట కనుక్కున్నవారు - మైకేల్ ఫారడే
బి) స్థిర తరంగాల్లో తక్కువ స్థానభ్రంశం ఉన్న ప్రదేశాలు ప్రస్పందనాలు, ఎక్కువ స్థానభ్రంశం ఉన్నవి - అస్పందనాలు
సి) విద్యుదయస్కాంత తరంగం శక్తి ఉన్న ఫోటాన్‌లను కలిగి ఉంటుంది.
1) ఎ, బి, సి 2) బి, సి
3) బి 4) సి

సమాధానాలు

1-4; 2-2; 3-2; 4-3; 5-4; 6-3; 7-3; 8-1; 9-3; 10-3; 11-2; 12-4; 13-3; 14-3; 15-1; 16-4; 17-2; 18-2; 19-2; 20-1; 21-3; 22-1; 23-3; 24-3; 25-2; 26-4; 27-2; 28-4; 29-1; 30-1; 31-3.

జీవన నిర్మాణానికి పునాది హార్మోన్ సంశ్లేషణలో ప్రముఖం

పాలీపెప్టైడ్ గొలుసులు కలిగిన బృహదణువులను ప్రొటీన్ అంటారు. ప్రొటీన్‌లోని మోనోమర్ యూనిట్లను అమైనో ఆమ్లాలు అంటారు. ఆల్ఫా-అమైనో ఆమ్లాలు కనీసం ఒక అమైన్ సమూహం ($-NH_2$), ఒక కార్బాక్సిల్ సమూహాన్ని ($-COOH$) కలిగి ఉంటాయి. అమైనో ఆమ్లాలు జీవన నిర్మాణానికి పునాది. ఇవి ప్రొటీన్ నిర్మాణం, జీవక్రియలు, కణ వృద్ధి, కణ పునర్నిర్మాణం, ఎంజైమ్, హార్మోన్ సంశ్లేషణలో కీలకపాత్ర పోషిస్తాయి. అమైనో ఆమ్లాల ద్వంద్వ స్వభావం, జ్విట్టర్ అయాన్ నిర్మాణం వీటిని ఇతర సేంద్రియ సమ్మేళనాల కంటే ప్రత్యేకంగా నిలబెడుతుంది.

ఏపీపీఎస్సీ పరీక్షల ప్రత్యేకం
కెమిస్ట్రీ

అమైనో ఆమ్లాలు

ఆల్ఫా-అమైనో ఆమ్లాలు ఒక శృంఖలంగా పెప్టైడ్ బంధాల ద్వారా ఒకదానితో మరొకటి కలిసి ప్రొటీన్లను ఏర్పరుస్తాయి.

✦ సాధారణంగా ప్రతి ఆల్ఫా-అమైనో ఆమ్లం ఒక కేంద్ర కర్బన పరమాణువును (α-carbon) కలిగి ఉంటుంది. దీనికి ఒక హైడ్రోజన్ పరమాణువు ($-H$), ఒక అమైన్ సమూహం ($-NH_2$), ఒక కార్బాక్సిల్ సమూహం ($-COOH$), ఒక పార్శ్వ శృంఖలం ($-R$ సమూహం) బంధాలుగా ఉంటాయి. ఈ $-R$ సమూహం ఆధారంగానే ప్రతి అమైనో ఆమ్లం ప్రత్యేకమైన రసాయన, భౌతిక ధర్మాలను ప్రదర్శిస్తుంది.

ప్రొటీన్లలో లభించే అమైనో ఆమ్లాలు: ప్రొటీన్లలో 20 రకాల అమైనో ఆమ్లాలు లభిస్తాయి. అవి:

గ్లైసిన్, అలనైన్, వాలిన్, ల్యూసిన్, ఐసోల్యూసిన్, సెరిన్, థ్రియోనిన్, సిస్టీన్, మిథియోనిన్, ఆస్పార్టిక్ ఆమ్లం, గ్లుటమిక్ ఆమ్లం, అస్పారజిన్, గ్లూటమిన్, లైసిన్, అర్జినిన్, హిస్టిడిన్, టైరోసిన్, ఫినైల్ అలనైన్, ట్రిప్టోఫాన్, ప్రోలైన్.

ఆల్ఫా-అమైనో ఆమ్లాల వర్గీకరణ


స్వభావం ఆధారంగా వర్గీకరణ

స్వభావం/రసాయన నిర్మాణం ఆధారంగా అమైనో ఆమ్లాలను పలు రకాలుగా వర్గీకరించవచ్చు. అవి:

i. **అలిఫాటిక్ పార్శ్వ శృంఖలాల అమైనో ఆమ్లాలు:** ఇవి సరళ లేదా శాఖలుగా ఉన్న అలిఫాటిక్ శృంఖలాలను కలిగి ఉంటాయి.

ఉదా: గ్లైసిన్: అతి సరళ అమైనో ఆమ్లం, పార్శ్వ శృంఖలంగా కేవలం హైడ్రోజన్ అణువును కలిగి ఉంటుంది.

అలనైన్: పార్శ్వ శృంఖలంగా మిథైల్ సమూహాన్ని ($-CH_3$) కలిగి ఉంటుంది.


Alanine

▮ వాలిన్, ల్యూసిన్, ఐసోల్యూసిన్ - శాఖాయుత అలిఫాటిక్ అమైనో ఆమ్లాలు.

ii. **తటస్థ అమైనో ఆమ్లాలు:** ఈ అమైనో ఆమ్లాలు ఒక అమైన్ సమూహం ($-NH_2$), ఒక కార్బాక్సిల్ సమూహాన్ని ($-COOH$) కలిగి ఉంటాయి.


ఉదా: గ్లైసిన్, అలనైన్, వాలిన్, ల్యూసిన్, ఐసోల్యూసిన్, సెరిన్, థ్రియోనిన్

iii. **ఆమ్ల స్వభావపు అమైనో ఆమ్లాలు:** ఈ అమైనో ఆమ్లాలు ఒక అమైన్ సమూహం ($-NH_2$), రెండు కార్బాక్సిల్ సమూహాలను ($-COOH$) కలిగి ఉంటాయి.

ఉదా: ఆస్పార్టిక్ ఆమ్లం, గ్లుటమిక్ ఆమ్లం, అస్పారజిన్, గ్లూటమిన్

iv. **క్షార స్వభావపు అమైనో ఆమ్లాలు:** ఈ అమైనో ఆమ్లాలు రెండు అమైన్ సమూహాలు ($-NH_2$), ఒక కార్బాక్సిల్ సమూహాన్ని ($-COOH$) కలిగి ఉంటాయి.

ఉదా: లైసిన్, అర్జినిన్, హిస్టిడిన్


Threonine

v. **హైడ్రాక్సిల్ సమూహ అమైనో ఆమ్లాలు:** ఈ అమైనో ఆమ్లాల సైడ్ చెయిన్‌లో $-OH$ (హైడ్రాక్సిల్) సమూహం ఉంటుంది. ఇవి హైడ్రోజన్ బంధాలను ఏర్పర్చగలవు.

ఉదా: సెరిన్, థ్రియోనిన్, టైరోసిన్

vi. **సల్ఫర్ కలిగిన అమైనో ఆమ్లాలు:** ఈ అమైనో ఆమ్లాల పార్శ్వ శృంఖలాల్లో సల్ఫర్ మూలకం ఉంటుంది. ఇది ప్రొటీన్లలో డైసల్ఫైడ్ బంధాలను ఏర్పర్చడంలో ముఖ్యపాత్ర పోషిస్తుంది. ఈ డైసల్ఫైడ్ బంధాలు ప్రొటీన్ నిర్మాణాన్ని స్థిరపరుస్తాయి.

ఉదా: సిస్టీన్, మిథియోనిన్

vii. **అరోమాటిక్ అమైనో ఆమ్లాలు:** ఈ అమైనో ఆమ్లాల పార్శ్వ శృంఖలంలో బెంజీన్ లేదా ఇతర అరోమాటిక్ వలయ సమూహాలు ఉంటాయి. ఇవి అతినీలలోహిత కాంతిని శోషించగలవు.

ఉదా: ఫినైల్ అలనిన్, టైరోసిన్, ట్రిప్టోఫాన్

viii. **ఇమైనో (Imino) ఆమ్లాలు:** ఈ అమైనో ఆమ్లం పార్శ్వ శృంఖలంలోని వలయ నిర్మాణంలో ద్వితీయ అమైన్ సమూహాన్ని (>NH) కలిగి ఉంటుంది.

ఉదా: ప్రోలైన్

అమైనో ఆమ్లాల ధ్రువణత ఆధారంగా వర్గీకరణ

అమైనో ఆమ్లాల్లోని $-R$ సమూహం ధ్రువణత ఆధారంగా రెండు రకాలుగా వర్గీకరించవచ్చు. అవి:

ధ్రువ అమైనో ఆమ్లాలు: ఈ అమైనో ఆమ్లాలు ఆక్సిజన్, నైట్రోజన్ లాంటి రుణవిద్యుదాత్మక అణువులను, అంటే $-OH$ (హైడ్రాక్సిల్), $-NH_2$ (అమైన్) లేదా $-SH$ (థయోల్) లాంటి $-R$ సమూహాలను కలిగి ఉంటాయి.

▮ ధ్రువ అమైనో ఆమ్లాలు నీరు లేదా ఇతర ధ్రువ అణువులతో హైడ్రోజన్ బంధాలను ఏర్పర్చే సామర్థ్యాన్ని కలిగి ఉంటాయి. ఇవి హైడ్రోఫిలిక్ (నీటితో సులభంగా ఆకర్షణ చెంది, నీటిలో కరిగేవి) స్వభావాన్ని కలిగి ఉంటాయి. ప్రొటీన్ల ఉపరితలంపై ఉన్న అమైనో ఆమ్లాలకు ఈ లక్షణం చాలా ముఖ్యమైంది.


Serine

ఉదా: సెరిన్, గ్లూటామిన్, థ్రియోనిన్, టైరోసిన్, సిస్టీన్ మొదలైనవి.

అధ్రువ అమైనో ఆమ్లాలు: ఈ అమైనో ఆమ్లాల్లో రుణవిద్యుదాత్మక అణువులు కలిగిన $-R$ సమూహాలు ఉండవు. ప్రధానంగా కార్బన్, హైడ్రోజన్‌తో కూడిన $-R$ సమూహాలను కలిగి ఉంటాయి.

▮ అధ్రువ అమైనో ఆమ్లాలు హైడ్రోఫోబిక్ (నీటికి ఆకర్షితం అవ్వక, నీటిలో కరగనివి) స్వభావాన్ని కలిగి ఉంటాయి. ఇవి సాధారణంగా ప్రొటీన్ల లోపలి భాగంలో కనిపిస్తాయి.

ఉదా: అలనైన్, వాలిన్, ల్యూసిన్, ఐసోల్యూసిన్, ఫినైల్ అలనిన్ మొదలైనవి.

పోషక అవసరం ఆధారంగా వర్గీకరణ

పోషక అవసరం ఆధారంగా అమైనో ఆమ్లాలను రెండు రకాలుగా వర్గీకరించవచ్చు. అవి:

ఆవశ్యక అమైనో ఆమ్లాలు: ఇవి శరీరంలో తయారు కావు. ఆహారం ద్వారా మాత్రమే పొందాలి.

ఉదా: లైసిన్, ల్యూసిన్, ఐసోల్యూసిన్, మెథయోనిన్, ఫినైల్ అలనిన్, ట్రిప్టోఫాన్, థ్రియోనిన్, వాలిన్

అనావశ్యక అమైనో ఆమ్లాలు: ఇవి శరీరంలో స్వయంగా తయారవుతాయి.

ఉదా: గ్లైసిన్, అలనైన్, సెరిన్, ఆస్పార్టిక్ ఆమ్లం, గ్లూటామిక్ ఆమ్లం, అస్పారజిన్, గ్లూటమిన్, సిస్టీన్, టైరోసిన్, ప్రోలైన్.

అర్ధావశ్యక అమైనో ఆమ్లాలు: ఇవి కొన్నిసార్లు శరీరానికి అవసరం (ముఖ్యంగా ఎదుగుదల సమయంలో) అవుతాయి.

ఉదా: అర్జినిన్, హిస్టిడైన్


Histidine

అమైనో ఆమ్లాల ధర్మాలు

ఇవి సాధారణంగా స్ఫటిక ఘనపదార్థాలు. చాలా వరకు అమైనో ఆమ్లాలు రంగులేనివి.

▮ కొన్నింటికి తీపి లేదా చేదు రుచి ఉంటుంది (ఉదా: గ్లైసిన్ తీపి రుచిని కలిగి ఉంటుంది).

▮ అమైనో ఆమ్లాలు నీటిలో కరిగి అయానిక్ స్వభావాన్ని ప్రదర్శిస్తాయి.

జ్విట్టర్ అయాన్: అమైనో ఆమ్లాలు అంతర్గత అయనీకరణ చెంది, $-NH_2$ సమూహం ఒక ప్రోటాన్ (H^+) స్వీకరించి $-NH_3^+$ గా మారుతుంది. $-COOH$ సమూహం ఒక ప్రోటాన్‌ను కోల్పోయి $-COO^-$గా మారుతుంది. దీని ఫలితంగా అమైనో ఆమ్లం వద్ద ఒకే సమయంలో ధనావేశ (+), రుణావేశ (–) అయాన్లు ఉంటాయి. ఈ రకమైన అయానిక్ రూపాన్ని జ్విట్టర్ అయాన్ అంటారు. దీన్ని ద్విధ్రువ అయాన్ అని కూడా పిలుస్తారు.

ఉదా: $H_2N-CHR-COOH \rightleftharpoons H_3N^+-CHR-COO^-$

సమవిద్యుత్ స్థానం: ఆమ్ల మాధ్యమంలో (తక్కువ pH వద్ద) అమైనో ఆమ్లం ప్రధానంగా ధనావేశ అయాన్ రూపంలో ఉంటుంది. క్షార మాధ్యమంలో ఇది రుణావేశ అయాన్ రూపంలో ఉంటుంది.

◆ ఒక నిర్దిష్ట pH వద్ద అమైనో ఆమ్లం జ్విట్టర్ అయాన్ రూపంలో స్థిరంగా ఉంటుంది. ఆ pH విలువను సమవిద్యుత్ స్థానం (pl) అంటారు. అమైనో ఆమ్లం ద్రావణీయత ఈ pH వద్ద కనిష్ఠంగా ఉంటుంది.


Glycine

ఉదా: గ్లైసిన్ $pl \approx 6.0$

☛ అమైనో ఆమ్లాలు ద్వంద్వ స్వభావం కలిగి ఉంటాయి. అంటే ఇవి ఆమ్లంగా, క్షారంగా ప్రవర్తిస్తాయి.

☛ రెండు అమైనో ఆమ్లాలు కలిసినప్పుడు ఒక నీటి అణువును కోల్పోయి పెప్టైడ్ బంధం ($-CONH-$) ఏర్పడుతుంది. ఇది ప్రొటీన్ నిర్మాణానికి మూలం.


రచయిత
డా. పి. భానుప్రకాష్
అసిస్టెంట్ ప్రొఫెసర్

Word of the Day 831

Virulent

Telugu meaning: తీవ్రమైన, హానికరమైన

English meaning: The word virulent (విరులెంట్) is an adjective that describes something extremely harmful, dangerous, or full of hatred.

Synonyms: Toxic, Deadly

Antonyms: Harmless, Benign

Usage: **1.** The virus turned out to be highly virulent, spreading rapidly across the region.

2. He made virulent remarks that deeply offended the audience.

కరెంట్ అఫైర్స్



ఆసియా ఛాంపియన్‌షిప్‌లో జ్యోతి సురేఖ పసిడి 'డబుల్' సాధించింది. 2025, నవంబరు 13న ఢాకాలో జరిగిన మహిళల కాంపౌండ్ వ్యక్తిగత ఫైనల్లో జ్యోతి 147-145తో మరో భారత ఆర్చర్ ప్రీతిక ప్రదీప్‌ను ఓడించింది. అంతకుముందు సెమీస్‌లో జ్యోతి 149-143తో సి యు చెన్ (చైనీస్ తైపీ)పై నెగ్గింది. మహిళల టీమ్ తుదిపోరులో జ్యోతి, దీప్షిక, ప్రీతికలతో కూడిన భారత బృందం 236-234తో కొరియా (పార్క్ యెరిన్, యా హుయున్, జంగ్‌యూన్)ను ఓడించింది.



పార్లమెంటులో ఇటీవల ప్రవేశపెట్టిన 130వ రాజ్యాంగ (సవరణ) బిల్లును పరిశీలించేందుకు భాజపా ఎంపీ అపరాజితా సారంగి నేతృత్వంలో 31 మంది సభ్యులతో సంయుక్త పార్లమెంటరీ సంఘం (జేపీసీ) ఏర్పాటైంది. తీవ్రమైన నేరారోపణలతో అరెస్టయి వరుసగా 30 రోజులు నిర్బంధంలో ఉంటే ప్రధానమంత్రి/ముఖ్యమంత్రి/ కేంద్ర-రాష్ట్ర మంత్రులనైనా తొలగించేందుకు వీలు కల్పిస్తూ తీసుకొచ్చిన బిల్లు ఇది.



రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము బోట్స్‌వానాలో మూడు రోజుల పర్యటనలో భాగంగా 2025, నవంబరు 12న ఆ దేశ అధ్యక్షుడు డ్యూమా గిడియోన్ బోకోతో భేటీ అయ్యారు. భారత రాష్ట్రపతి బోట్స్‌వానాలో పర్యటించడం ఇదే మొదటిసారి. ఈ సందర్భంగా దక్షిణాఫ్రికా దేశం బోట్స్‌వానాతో భారత్ కీలక ఒప్పందాలు కుదుర్చుకుంది. ఆరోగ్యం, ఫార్మా రంగాలకు సంబంధించి పలు అవగాహన ఒప్పందాల(ఎంఓయూలు)పై సంతకాలు చేసింది.



అమెరికా విధించిన అధిక టారిఫ్‌ల ప్రభావాన్ని భారతీయ ఎగుమతిదార్లు తట్టుకునే నిమిత్తం రూ. 45,000 కోట్ల విలువైన రెండు పథకాలకు కేంద్ర మంత్రివర్గం 2025, నవంబరు 12న ఆమోదముద్ర వేసింది. ఎంఎస్ఎంఈలు, తొలిసారి ఎగుమతి చేసేవారు, కార్మికులు అధికంగా ఉండే రంగాల కోసం రూ. 25,060 కోట్లతో ఎక్స్‌పోర్ట్ ప్రమోషన్ మిషన్‌కు అనుమతినిచ్చింది. ఇందులో నిర్యత్ ప్రోత్సాహన్ (రూ. 10,401 కోట్లు), నిర్యత్ దిశ (రూ. 14,659 కోట్లు) అనే 2 ఉప పథకాలుంటాయి.

మరిన్ని కరెంట్ అఫైర్స్ కోసం క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.

ఐజాక్ న్యూటన్

శాస్త్రవేత్తలు విశేషాలు

న్యూటన్ గొప్ప గణిత, భౌతిక, ఖగోళ శాస్త్రవేత్త. ప్రపంచంలోని అత్యంత ప్రభావవంతమైన పరిశోధకుల్లో ఈయన ఒకరు. న్యూటన్ ప్రయోగాలు, వెల్లడించిన విషయాలు నేటికీ భౌతికశాస్త్రంలో ముఖ్యమైన సిద్ధాంతాలుగా ఉన్నాయి. ఈయన్ను గణిత - భౌతికశాస్త్ర పితామహుడిగా పేర్కొంటారు. న్యూటన్ కనిపెట్టిన నియమాలు, ప్రతిపాదనలు అప్పటి వరకు భౌతిక ప్రపంచంపై మానవాళికి ఉన్న అవగాహనలో విప్లవాత్మక మార్పులు తెచ్చాయి. సౌర వ్యవస్థ నిర్మాణం, గ్రహాల కదలికలను వివరించడం ద్వారా ఆధునిక ఖగోళశాస్త్రానికి పునాది వేశారు. పోటీపరీక్షల నేపథ్యంలో ఆయన గురించి మరిన్ని విషయాలు తెలుసుకుందాం..!

బాల్యం - వృత్తి జీవితం


న్యూటన్ ఇంగ్లండ్‌లోని వూల్‌థోర్స్‌లో ఉన్న మనోర్ హౌస్‌లో 1642లో జన్మించారు. గ్రాంథంలోని కింగ్స్ స్కూల్‌లో ఆయన పాఠశాల విద్య అభ్యసించారు.

✦ 1661లో కేంబ్రిడ్జ్‌లోని ట్రినిటీ కాలేజీలో చేరారు. గణితం, నేచురల్ ఫిలాసఫీ అధ్యయనం చేశారు.

✦ మ్యాథ్స్‌లో కాలిక్యులస్ అనే థియరీపై ఆయన అధ్యయనం చేశారు. ఆ సమయంలో లండన్‌లో ప్లేగు వ్యాధి ఎక్కువగా వ్యాప్తి చెందడంతో ముందుజాగ్రత్త చర్యగా కేంబ్రిడ్జిని మూసేశారు. దీంతో ఆయన వూల్‌థోర్స్ వెళ్లి, అక్కడే తన ఇంట్లో ప్రయోగాలు చేయడం ప్రారంభించారు.

✦ 1667లో న్యూటన్ తిరిగి కేంబ్రిడ్జికి వచ్చారు. అదే ఏడాది ఆయన ట్రినిటీ ఫెలోగా ఎన్నికయ్యారు. 1668లో ఎంఏ డిగ్రీ పొందారు.

✦ 1669లో కేంబ్రిడ్జిలో గణితశాస్త్ర ప్రొఫెసర్‌గా నియమితులయ్యారు.



చివరగా


న్యూటన్ ఒక అసాధారణ మేధావి. గణిత, భౌతిక శాస్త్రాలపై ఆయన చేసిన ప్రయోగాలు వాటి అభివృద్ధికే కాక తర్వాతి కాలంలో ఎంతో మందికి మార్గదర్శకంగా నిలిచాయి. ఆయన రచనల ద్వారా శాస్త్రీయ రంగంపై అవగాహన కలుగుతుంది.

న్యూటన్ చేసిన ప్రయోగాలు - ఆవిష్కరణలు, పొందిన గౌరవాలు లాంటి ముఖ్యమైన సమాచారం కోసం క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.

జనరల్ స్టడీస్ - బయాలజీ

శరీరధర్మ శాస్త్రం - నాడీ వ్యవస్థ

శరీరంలో జరిగే పలు విధులు, అంతర్గత, బాహ్య ఉద్దీపనలు, ప్రతిస్పందనలను నియంత్రించడం లేదా వాటిని సమన్వయపర్చడంలో నాడీ వ్యవస్థ పాత్ర కీలకం. ఇందులో నాడీ వ్యవస్థ నిర్మాణం, న్యూరాన్లు ముఖ్యమైన భాగాలు. కేంద్ర, పరిధీయ నాడీ వ్యవస్థలు, న్యూరాన్లు ఎప్పటికప్పుడు తమ విధులను నిర్వర్తిస్తూ శరీరంలోని వివిధ భాగాల నుంచి మెదడుకి, మెదడు నుంచి శరీర భాగాలకు సమాచారాన్ని ప్రసారం చేస్తుంటాయి.



నాడీ వ్యవస్థ నిర్మాణం

- కేంద్ర నాడీ వ్యవస్థ
- పరిధీయ నాడీ వ్యవస్థ

న్యూరాన్లు – రకాలు

- సెన్సరీ న్యూరాన్లు (అఫెరెంట్)
- మోటార్ న్యూరాన్లు (ఎఫెరెంట్)
- ఇంటర్ న్యూరాన్‌లు

నాడీ ప్రచోదన వ్యాప్తి

- రెస్టింగ్ మెంబ్రేన్ పొటెన్షియల్
- యాక్షన్ పొటెన్షియల్
- డీపోలరైజేషన్
- రీపోలరైజేషన్
- ప్రచోదనాల ప్రసారం

న్యూరాన్లు, న్యూరోప్లాస్టిసిటీ, రిఫ్లెక్స్ ఆర్క్, నాడీ వ్యవస్థలోని లోపాలు, మొదలైన అంశాలతోపాటు మాదిరి ప్రశ్నలతో సహా పూర్తి సమాచారం ఈ-బుక్ రూపంలో 'ఈనాడు ఈప్రతిభ జనరల్ స్టడీస్ ఈ-బుక్స్' కోర్సులో అందుబాటులో ఉంది. మరిన్ని వివరాలకు క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.

నోటిఫికేషన్స్

ప్రాజెక్ట్ సైంటిస్ట్ పోస్టులు

న్యూ స్పేస్ ఇండియా లిమిటెడ్ (ఎన్ఎస్ఐఎల్) బెంగళూరు తాత్కాలిక ప్రాతిపదికన ప్రాజెక్ట్ సైంటిస్ట్, ఇంజినీర్స్, అసిస్టెంట్ పోస్టుల భర్తీకి ఇంటర్వ్యూలు నిర్వహిస్తోంది. మొత్తం పోస్టుల సంఖ్య 47. అర్హులైన అభ్యర్థులు 2025 నవంబరు 30న ఇంటర్వ్యూకు హాజరుకావొచ్చు.

అప్రెంటిస్ పోస్టులు

గురుగ్రామ్‌లోని రైల్ ఇండియా టెక్నికల్ అండ్ ఎకనామిక్ సర్వీస్ లిమిటెడ్ (రైట్స్) 2025-26 సంవత్సరానికి వివిధ విభాగాల్లో గ్రాడ్యుయేట్, డిప్లొమా, ఐటీఐ ట్రేడ్ అప్రెంటిస్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది. మొత్తం పోస్టుల సంఖ్య 252. అర్హులైన అభ్యర్థులు 2025 నవంబరు 17 నుంచి డిసెంబరు 5 మధ్య ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.

దరఖాస్తు చేశారా..?

కింది ఉద్యోగాలకు నేడే (నవంబరు 15) చివరి తేదీ

▮ ఆంధ్రప్రదేశ్ ఆయుష్ డిపార్ట్‌మెంట్‌లో 107 ప్రభుత్వ ఉద్యోగాలు. డిగ్రీ, పీజీ ఉత్తీర్ణులు అర్హులు.

▮ ఎన్‌టీపీసీ మైనింగ్ లిమిటెడ్‌లో 21 ఎగ్జిక్యూటివ్ పోస్టులు. సీఏ/సీఎంఏ, డిప్లొమా, డిగ్రీ/పీజీ/ఎంఎస్సీ/ఎంటెక్ ఉత్తీర్ణతతో పాటు ఉద్యోగానుభవం ఉన్నవారు అర్హులు.

▮ పీజీఐఎంఈఆర్‌లో 13 డేటా ఎంట్రీ ఆపరేటర్ ఉద్యోగాలు. ఇంటర్, డిగ్రీ, పీజీ, ఎంబీబీఎస్ లేదా బీడీఎస్‌లో ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉన్నవారు అర్హులు.

▮ సెంట్రల్ వేర్‌హౌసింగ్ కార్పొరేషన్‌లో 22 ఉద్యోగాలు. డిగ్రీ ఉత్తీర్ణులు అర్హులు.

పూర్తి వివరాలు, మరిన్ని నోటిఫికేషన్ల కోసం క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.

Number System

1. A farmer plants saplings in rows in his field such that there are 8 rows with 15 saplings in each row. If he decides to increase the number of rows by 4 while keeping the total number of saplings the same, how many saplings will be there in each row now?
A) 10 B) 11 C) 12 D) 13

2. What is the total number of factors of 4900?
A) 18 B) 21 C) 27 D) 24

3. What is the sum of the digits of the smallest number which, when divided by 12, 20, and 30, leaves the same remainder 5 in each case and is also divisible by 11?
A) 9 B) 11 C) 12 D) 14

4. The sum of two numbers is 120 and their difference is 48. Find the smaller number.
A) 34 B) 36 C) 42 D) 40

5. The sum of two numbers 15428 + 20672 is divisible by:
A) 3 B) 6 C) 9 D) 5

6. The difference between two numbers is 1232. When the larger number is divided by the smaller, the quotient is 7 and the remainder is 8. What is the smaller number?
A) 176 B) 204 C) 176 D) 160



7. Find the sum of all numbers between 400 and 600 that leave a remainder 7 when divided by 10, 12, and 15.
A) 1200 B) 1214
C) 1221 D) 1461

8. If a positive integer N is divided by 9, the remainder is 5. Which of the following numbers will give a remainder 0 when divided by 9?
A) N + 3 B) N + 4
C) N + 5 D) N + 9

9. Which is the largest number that will divide 1548 and 972, leaving remainders 6 and 12, respectively?
A) 6 B) 18 C) 24 D) 15

Railway Exams
Mathematics

10. When a number is divided by 11, the remainder is 7. If the square of the same number is divided by 11, then the remainder will be:
A) 3 B) 4 C) 5 D) 7

11. The remainder when $45 \times 47 \times 50 \times 52$ is divided by 25 is:
A) 0 B) 10 C) 15 D) 20

12. When a number is divided by 17, the remainder is 8. If the square of the same number is divided by 17, then the remainder will be:
A) 10 B) 12 C) 13 D) 15

13. The sum of the first 96 natural numbers from 1 to 96 is divisible by:
A) 11 B) 5 C) 10 D) 12

14. The number 4286532 is divisible by which of the following numbers?
A) 2 and 3 only B) 4 and 9 only
C) 2, 3 and 4 only D) 2, 3, 4, and 9

15. In a division, the divisor is 8 times the quotient and 4 times the remainder. If the remainder is 36, find the dividend.
A) 3000 B) 2952
C) 3024 D) 2628

16. How many numbers between 300 and 800 are divisible by 4, 5, and 6?
A) 3 B) 4 C) 8 D) 6

17. If the sum of two positive numbers is 85 and the square root of their product is 36, then what is the sum of their reciprocals?
A) $\frac{17}{144}$ B) $\frac{17}{324}$ C) $\frac{85}{1296}$ D) $\frac{85}{324}$

18. The difference between a number and twice its square root is 15. What is the number?
A) 25 B) 64 C) 81 D) 100

19. When an integer m is divided by 9, the remainder is 4. What will be the remainder when 6m is divided by 9?
A) 3 B) 4 C) 6 D) 7

20. What will be the remainder when 35^{35} is divided by 36?
A) 0 B) 1 C) 35 D) 9

21. The difference of two numbers is 1365. On dividing the larger number by the smaller, we get 6 as quotient and the 15 as remainder. What is the smaller number ?
A) 270 B) 290
C) 350 D) 310

Scan the QR code for Key

These model questions were prepared by subject experts

ఇది మోదీ నాయకత్వం పట్ల విశ్వాసం



'అభివృద్ధి, సుపరిపాలనకే ప్రజలు ఓటేశారు. మోదీ నాయకత్వం, బిహార్‌ను అభివృద్ధి చేస్తానన్న ఆయన గ్యారెంటీ పట్ల విశ్వాసం చూపించారు. లాలు ప్రసాద్ హయాంలో జంగిల్‌రాజ్ పాలనను చూసిన ప్రజలకు ఎన్డీయే హయాంలో మార్పు కనిపించింది'
– భాజపా సీనియర్ నేత రవి శంకర్ ప్రసాద్

ఎన్నికల్లో సీఈసీ జ్ఞానేశ్ కుమార్‌ది కీలకపాత్ర

బిహార్ అసెంబ్లీ ఎన్నికల్లో సీఈసీ జ్ఞానేశ్ కుమార్‌ది కీలక పాత్ర ఉంది. ఎన్డీయే కూటమి భారీ విజయం సాధించబోతోందంటూ వచ్చే ఫలితానికి ఆయన బాధ్యత వహించారు. ఎన్నికల సంఘం ఎలా పనిచేస్తోందో దీంతో స్పష్టమైంది.
–భూపేశ్ బఘేల్ (ఛత్తీస్‌గఢ్ మాజీ సీఎం)

భాజపాతో ఈసీ కుమ్మక్కైంది



బిహార్‌లో అధికారంలో ఉన్న పార్టీతో ఎన్నికల సంఘం(ఈసీ) కుమ్మక్కైంది. ఎన్నికల ప్రవర్తనా నియమావళికి బదులు ఓటర్లకు డబ్బులు, ప్రయోజనాలు పంచారు. ఎన్నికల ప్రచారంలో డబ్బులు, పింఛన్లు నిరాటంకంగా కొనసాగాయి. ఇన్ని జరుగుతున్నా ఎన్నికల సంఘం నిశ్శబ్దంగా చూడడమేంటి?
– అశోక్ గహ్లోత్ (రాజస్థాన్ మాజీ సీఎం)

తక్కువ మార్కులు రావడంతో.. 17వ అంతస్తు నుంచి దూకి విద్యార్థిని ఆత్మహత్య

ఠాణె: పరీక్షల్లో తక్కువ మార్కులు రావడంతో తీవ్ర ఒత్తిడికి గురైన 14 ఏళ్ల వయసు ఉన్న ఆరో తరగతి విద్యార్థిని 17వ అంతస్తులో ఉన్న తన ఇంట్లోని కిటికీ లోంచి దూకి ఆత్మహత్యకు పాల్పడింది. ఈ ఘటన మహారాష్ట్రలోని ఠాణె జిల్లాలో శుక్రవారం చోటుచేసుకుంది. ఇటీవల నిర్వహించిన పరీక్షల్లో తక్కువ మార్కులు రావడంతో.. విద్యార్థిని ఫలితాలను మెరుగు పరుచుకోవాలని నిరంతరం టీచర్లు ఒత్తిడి చేశారని, దీంతో మనస్తాపానికి గురైన విద్యార్థిని ఆత్మహత్య చేసుకుందని పోలీసులు తెలిపారు. ఆమె పై నుంచి దూకగా కింద ఉన్న ద్విచక్రవాహనంపై పడటంతో తీవ్రంగా గాయపడింది. వెంటనే ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు.

సాగరాల్లో మందుపాతరలను పసిగట్టే సాధనం

- అభివృద్ధి చేసిన డీఆర్‌డీవో

దిల్లీ: నీట్లో మందుపాతర వంటి వస్తువులను అప్పటికప్పుడు గుర్తించి, వాటి తీరుతెన్నులను వర్గీకరించే కొత్తతరం జలాంతర వాహనాలను రక్షణ పరిశోధన, అభివృద్ధి విభాగం (డీఆర్‌డీవో) విజయవంతంగా అభివృద్ధి చేసింది. వీటిలో సైడ్ స్కాన్ సోనార్, కెమెరాలు వంటివి ఉంటాయి. మ్యాన్ పోర్టబుల్ అటానమస్ అండర్ వాటర్ వెహికిల్స్ (ఎంపీ-ఏయూవీ)గా పిలిచే ఈ సాధనాలను విశాఖపట్నంలోని డీఆర్‌డీవో పరిశోధనశాల.. నేవల్ సైన్స్ అండ్ టెక్నాలాజికల్ ల్యాబ్ (ఎన్ఎస్‌టీఎల్) అభివృద్ధి చేసింది. లక్ష్యాన్ని గుర్తించేందుకు ఇందులో డీప్ లెర్నింగ్ ఆధారిత అల్గోరిథమ్‌లను వాడారు. ఇది నీట్లో మందుపాతరలను సొంతంగా పసిగట్టగలదు. ఫలితంగా మానవ ఆపరేటర్‌పై పనిఒత్తిడి తగ్గుతుంది. సమయం కూడా ఆదా అవుతుంది. ఒక వ్యవస్థలో అనేక ఏయూవీలు ఉంటాయి. వీటి మధ్య ఎప్పటికప్పుడు డేటా బట్వాడా జరిగేందుకు సమర్థ జలాంతర కమ్యూనికేషన్ వ్యవస్థను శాస్త్రవేత్తలు ఏర్పాటు చేశారు.

అంగారకుడి శోధనకు 'ఎస్కపేడ్'

- జంట ఉపగ్రహాలను ప్రయోగించిన నాసా

ఇంటర్నెట్ డెస్క్: అంగారక గ్రహం గురించి లోతుగా శోధించేందుకు అమెరికా అంతరిక్ష సంస్థ-నాసా ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన 'ఎస్కపేడ్' ప్రయోగం విజయవంతమైంది. అమెజాన్ అధిపతి జెఫ్ బెజోస్‌కు చెందిన 'బ్లూ ఆర్జిన్'కు చెందిన భారీ న్యూగ్లెన్ రాకెట్.. ఈ వ్యోమనౌకను నింగిలో ప్రవేశపెట్టింది. ఫ్లోరిడాలోని కేప్ కెనావెరాల్ అంతరిక్ష కేంద్రం ఈ ప్రయోగానికి వేదికైంది. వాతావరణ సమస్యలు, సౌర తుపాను కారణాలతో కొన్ని రోజులుగా వాయిదా పడుతూ వస్తోంది. 'ఎస్కపేడ్' మిషన్‌లో బ్లూ, గోల్డ్ అనే రెండు ఉపగ్రహాలు ఉన్నాయి. ఇవి అంగారకుడి వాతావరణాన్ని పరిశీలించనున్నాయి. అరుణగ్రహం తన వాతావరణాన్ని కోల్పోయిన తీరును ఇవి శోధించనున్నాయి. అంగారకుడి నివాసయోగ్యతకు సంబంధించి అర్థం చేసుకోవడానికి ఈ ప్రయోగం ఉపయోగపడనుంది. ఆ గ్రహ అయస్కాంత క్షేత్రం, ప్లాస్మా వాతావరణాన్ని శోధించనున్నాయి. 'ఎస్కపేడ్'.. 2027 నాటికి అంగారకుడి కక్ష్యలోకి చేరనుంది. అనంతరం బ్లూ, గోల్డ్ ఉపగ్రహాలు పనిచేయడం ప్రారంభిస్తాయి. ప్రయోగం అనంతరం 'న్యూ గ్లెన్' తిరిగి భూమిని చేరింది. అట్లాంటిక్ సముద్రంలో జాక్లైన్ అనే ప్రత్యేక నౌకపై సురక్షితంగా దిగింది. ఇప్పటివరకు స్పేస్‌ఎక్స్‌కు మాత్రమే పునర్వినియోగ రాకెట్ పరిజ్ఞానం ఉంది. తాజాగా 'బ్లూ ఆర్జిన్' ఆ సత్తాను సాధించినట్లయింది.

సర్వేంద్రియాణాం చర్మం ప్రధానం?

దిల్లీ: తాము రకరకాల శబ్దాలకు, సంగీతానికి బలంగా స్పందిస్తామని వ్యక్తులు భావిస్తారు. కానీ నిజానికి మనుషుల నాడీమండలం స్పర్శకు తేలిగ్గా, బలంగా స్పందిస్తుందని న్యూయార్క్ విశ్వవిద్యాలయ పరిశోధనలో తేలింది. బాహ్య ఘటనలకు శరీరం వేగంగా స్పందించినపుడు గుండె కొట్టుకునే వేగం పెరుగుతుంది. అరచేతుల్లో చెమటలు పడతాయి. ఈ అసంకల్పిత చర్యలకు శరీరంలోని స్వయంచోదిత నాడీ మండలమే కారణం. ఇది ఎలక్ట్రిక్ సంకేతాలను పంపినపుడు చర్మం స్పందిస్తుంది. చెమట గ్రంథులు కొద్దిగా ఉద్దీపన చెందినా కూడా చర్మం ఎలక్ట్రిక్ సంకేతాలకు స్పందించే శక్తిలో తేడా వస్తుంది. బాహ్య ఘటనకు చర్మం కేవలం రెండు సెకన్లలో స్పందిస్తుందని పరిశోధకులు కనుగొన్నారు. తద్వారా ప్రతిచర్యకు శరీరం సిద్ధమవుతుంది.

అన్నయ్య వెంటే చెల్లెళ్లు

- బిహార్‌లో వరుసగా ఐదోసారి నీతీశ్‌కు పట్టం కట్టిన మహిళలు
- వనితా వికాస పథకాలది కీలకపాత్ర

'బడికి వెళ్లటానికి సైకిళ్లు ఇచ్చారు...స్థానిక సంస్థల్లో 50శాతం రిజర్వేషన్లు కల్పించారు... ఆర్థిక సాధికారతకు చేయూతనిచ్చారు... రేషన్ సరకులిచ్చారు...రహదారులు, వంతెనలు నిర్మించారు...మద్యపానంపై నిషేధం విధించారు... అక్షరాస్యతను పెంచారు...భద్రత కల్పించారు... ఇన్ని చేసిన మా అన్న(నీతీశ్‌కుమార్)కు మేమెందుకు ఓటు వేయకూడదు?'...ఎన్డీయే అభ్యర్థికి ఓటు వేసిన ఓ మహిళ సంధించిన ప్రశ్న ఇది.



బిహార్‌లో వరుసగా ఐదోసారి నీతీశ్‌కుమార్ నేతృత్వంలోని కూటమిని గెలిపించటంలో మహిళా ఓటర్లు అత్యంత కీలకపాత్ర పోషించారు. ఓటింగ్ కేంద్రాలకు పురుషుల(62.98%) కన్నా అధిక సంఖ్యలో మహిళలు (71.78%) తరలి వచ్చి ఓట్లతో ఆశీర్వదించారు. నీతీశ్‌ను ఆప్యాయంగా అన్న(దాదా)గా పిలుచుకుంటున్నారంటే గత ఇరవై ఏళ్లుగా రాష్ట్రంలో ఆయన నేతృత్వంలోని ప్రభుత్వాలు అమలు చేసిన వనితా వికాస, మహిళా సంక్షేమ పథకాలే కారణం.

✦ 2001 జనాభా లెక్కల ప్రకారం బిహార్‌లో మహిళల అక్షరాస్యత 33 శాతమే. 2011 జనాభా లెక్కల నాటికి ఇది 53 శాతం దాటింది. ఈ మార్పునకు ప్రధాన కారకుడు జేడీయూ అధినేత, సీఎం నీతీశ్. మహిళల జీవితాల్లో వెలుగులు నింపే ఈ మార్పు 2005 అక్టోబరులో మొదలైంది. ఆ ఏడాది జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో నీతీశ్‌కు చెందిన జేడీయూ, భాజపాతో కలిసి రాష్ట్రంలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. 2005 నవంబరులో నీతీశ్ కుమార్ ముఖ్యమంత్రి అయిన వెంటనే మహిళల అక్షరాస్యత పెంచడంపై దృష్టి సారించారు.

✦ 'ముఖ్యమంత్రి బాలిక సైకిల్ యోజన'ను ప్రారంభించి ప్రభుత్వ పాఠశాలల్లోని 9వ తరగతి బాలికలకు సైకిళ్లు కొనిచ్చారు. దీనివల్ల మారుమూల ప్రాంతాల బాలికలు స్కూళ్లకు రావడం సులభమయ్యింది. చదువులను అర్ధంతరంగా మానేయడం తగ్గిపోయింది.

✦ 2007లో బిహార్‌లోని ప్రభుత్వ స్కూళ్లలో 1.7 లక్షల మందే బాలికలు ఉండగా, 2011 నాటికి వారి సంఖ్య 6.5 లక్షలకు పెరిగింది. ప్రభుత్వ బడుల్లో ఏకరూప దుస్తుల పంపిణీ, పేద బాలికలకు స్కాలర్‌షిప్‌లు, పాఠశాలల్లో బాలికల అవసరాలకు అనుగుణమైన వసతుల కల్పన ద్వారా చదువులపై ఆసక్తి పెరిగింది. నాటి బాలికలే నేడు మహిళా ఓటర్లుగా సీఎం నీతీశ్ సారథ్యంలోని ఎన్డీయే కూటమిపై ఓట్ల వర్షం కురిపించారు.

✦ నీతీశ్ పాలనలో రాష్ట్రంలో మహిళలపై నేరాలు, హింస తగ్గాయి.

✦ 2006లో నీతీశ్ సర్కారు గ్రామ పంచాయతీలు, పట్టణ స్థానిక సంస్థల్లో మహిళలకు 50 శాతం రిజర్వేషన్ కల్పించి వాటి పాలనలో భాగస్వాములను చేశారు.

✦ 2007లో జీవికా దీదీ పథకం ద్వారా వనితల ఆర్థిక సాధికారతకు తోడ్పాటు. దాదాపు 1.3 కోట్ల మంది మహిళలు ప్రయోజనం పొందారు.

✦ 2016 ఏప్రిల్ 5 నుంచి రాష్ట్రంలో మద్యం తయారీ, విక్రయాలు, నిల్వ, సరఫరాలపై నిషేధం అమలు చేస్తున్నారు. పేద మహిళల జీవితాల్లో మార్పులకు ఇది దోహదపడింది.

✦ 2025 ఎన్నికలకు ముందు (సెప్టెంబరులో) 'ముఖ్యమంత్రి మహిళా రోజ్‌గార్ యోజన' పథకాన్ని సీఎం నీతీశ్ ప్రారంభించారు. వ్యాపారాన్ని ప్రారంభించాలని భావించే ప్రతీ మహిళకు రూ.10వేల ఆర్థిక సాయాన్ని అందించారు. దీని ద్వారా 1.21కోట్ల మంది మహిళలు లబ్ధిపొందారు. వ్యాపారాలు బాగా నిర్వహించిన వారికి అదనంగా రూ.2 లక్షల సాయం కూడా ఇస్తామని నీతీశ్ హామీ ఇచ్చారు.

✦ రాష్ట్రంలోని అన్ని కుటుంబాలకు ప్రతినెలా 125 యూనిట్ల దాకా ఉచిత విద్యుత్ ఇస్తానని సీఎం నీతీశ్ మాట ఇచ్చారు. తమ జీవితాల్లో మార్పు తెచ్చే సామర్థ్యం కలిగిన వారికే పట్టం కట్టేలా మహిళలు చైతన్యవంతం అయ్యారు.

- నేషనల్ డెస్క్

నాడిని పట్టాయి గానీ..

- ఫలితాల అంచనాల్లో ఎగ్జిట్ పోల్స్ ఓకే
- మెజారిటీలో మాత్రం తప్పాయి

దిల్లీ: బిహార్ ఎన్నికల్లో గెలవబోయేది ఎన్డీయే అని దాదాపు ఎగ్జిట్‌పోల్స్ అన్నీ ఈసారి కచ్చితంగానే అంచనా వేసినా ఏ కూటమికి ఎన్ని రావచ్చనే విషయంలో మాత్రం లెక్క తప్పాయి. అధికార కూటమికి 200 సీట్లు దాటుతాయని దాదాపు ఏ సర్వే సంస్థా అంచనా వేయకపోవడం గమనార్హం. పోల్ డైరీ అనే ఒకే ఒక్క సంస్థ మాత్రం ఎన్డీయేకు 184-209 మధ్యలో స్థానాలు వస్తాయని, మహాగఠ్‌బంధన్‌కు 32-49 రావచ్చని చెప్పింది. అన్ని సర్వేలను పరిగణనలోకి తీసుకుంటే ఎన్డీయేకు కనిష్ఠంగా 130 స్థానాలు గరిష్ఠంగా 167 స్థానాలు వస్తాయని పేర్కొన్నాయి. మహాగఠ్‌బంధన్‌కు కనిష్ఠంగా 70 స్థానాలు, గరిష్ఠంగా 108 స్థానాలు వస్తాయని చెప్పాయి. కానీ, వాస్తవ ఫలితం అందుకు భిన్నంగా వచ్చింది. ఎన్డీయే ఏకంగా 202 చోట్ల నెగ్గగా.. మహాగఠ్‌బంధన్ 34 స్థానాలకే పరిమితమైంది. ఎన్డీయేకు 121-141 సీట్లు, మహాగఠ్‌బంధన్‌కు 98-118 వస్తాయని యాక్సిస్ మై ఇండియా ఈసారి చెప్పింది. ఈ రెండు కూటములకు వరసగా 160, 77 రావచ్చని టుడేస్ చాణక్య లెక్కగట్టింది. ఎన్డీయేకి 147-167, మహాగఠ్‌బంధన్‌కు 70-90 రావచ్చని మ్యాట్రిజ్ ఎగ్జిట్‌పోల్ అంచనావేసింది.

అప్పుడు అలా..

2015 అసెంబ్లీ ఎన్నికల్లో జేడీయూ-ఆర్జేడీ-కాంగ్రెస్ నేతృత్వంలోని మహాగఠ్‌బంధన్‌కు, ఎన్డీయే మధ్య గట్టి పోటీ ఉంటుందని సర్వే సంస్థలు అంచనా వేశాయి. అందుకు భిన్నంగా 178 స్థానాల్లో మహాగఠ్‌బంధన్ ఘన విజయం సాధించింది.

✦ 2020లో ఆర్జేడీ నేతృత్వంలోని మహాగఠ్‌బంధన్ విజయాన్ని అన్ని సంస్థలూ అంచనా వేయగా.. జేడీయూ-భాజపా నేతృత్వంలోని ఎన్డీయే కూటమి 125 స్థానాల్లో విజయం సాధించి ప్రభుత్వాన్ని నెలకొల్పింది.

హత్య కేసులో జైలుకెళ్లి.. ఎన్నికల్లో గెలిచి..



అనంత్ సింగ్

పట్నా: ప్రశాంత్ కిశోర్ మద్దతుదారు దులార్‌చంద్ యాదవ్ హత్య కేసులో అరెస్టయిన జేడీయూ అభ్యర్థి అనంత్ సింగ్ బిహార్ ఎన్నికల్లో విజయం సాధించారు. మొకామా నియోజకవర్గం నుంచి బరిలోకి దిగిన అనంత్ సింగ్ 28,206 ఓట్ల ఆధిక్యంతో రాష్ట్రీయ జనతాదళ్ (ఆర్జేడీ) అభ్యర్థి వీణాదేవిపై గెలుపొందారు. అనంత్ సింగ్ ఇప్పటివరకు నాలుగుసార్లు మొకామా నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా గెలుపొందారు. ఇటీవల మొకామా నియోజకవర్గంలో జన్‌సురాజ్ పార్టీ అభ్యర్థిగా పీయూష్ ప్రియదర్శి ప్రచారం చేస్తుండగా..ఇరువర్గాల మధ్య ఘర్షణ చోటుచేసుకుంది. ఆ సమయంలో పీయూష్ మామ, పార్టీ కార్యకర్త దులార్ చంద్‌పై కొందరు దుండగులు కాల్పులు జరిపారు. దులార్ చంద్ హత్య నేపథ్యంలో అదే నియోజకవర్గం నుంచి జేడీయూ అభ్యర్థిగా పోటీ చేస్తున్న అనంత్ సింగ్‌పై పోలీసులు నిఘా ఉంచారు. అనంతరం ఆయనను అరెస్టు చేశారు. ఆయనపై 28 క్రిమినల్ కేసులు ఉన్నాయి.


కహా హై మేరే కిసలే?

- బిహార్ రాజకీయాల్ని మార్చిన వాజ్‌పేయీ ప్రశ్న
- ఓ కిడ్నాపు ఉదంతంతో ఆర్జేడీకి మచ్చ
- ఈసారి ఎంత ప్రయత్నించినా దక్కని ఫలితం

"కహా హై మేరే కిసలే? ముఝే మేరా కిసలే లౌటా దో".. తొమ్మిది పదాల ఈ అభ్యర్థన ఆనాడు బిహార్‌ను కదిలించింది.. ఆర్జేడీ అధినేత లాలూప్రసాద్ యాదవ్ 15 ఏళ్ల పాలనను అధికారం నుంచి తప్పించింది. ఆ తర్వాత నుంచి రాష్ట్రీయ జనతాదళ్ (ఆర్జేడీ) కోలుకుంది లేదు. నాడు ఎన్నికల సభలో ఈ అభ్యర్థన చేసింది భాజపా అగ్రనేత అటల్ బిహారీ వాజ్‌పేయీ! మరో ఐదేళ్లపాటు లాలూ కుటుంబాన్ని అధికారానికి దూరంగా నిలిపిన పిలుపు ఇది. ఇటీవల సమస్తీపుర్ సభలో ప్రధాని నరేంద్ర మోదీ తన 45 నిమిషాల ప్రసంగంలో 17 సార్లు ఈ వాక్యాన్ని వాడారంటే బిహార్‌ను ఇది ఎంతగా భయపెట్టిందో అర్థం చేసుకోవచ్చు. ఈ ఆందోళనే ఆర్జేడీని మొత్తంగా దాదాపు 20 ఏళ్ల నుంచి అధికారానికి దూరంగా ఉంచింది.

పట్నా హైకోర్టు వాడిన పదం జంగిల్ రాజ్

లాలూ కుటుంబ పాలనలో 1990 నుంచి 2005 వరకు చోటుచేసుకున్న భయానక దృశ్యాలు నేటికీ అక్కడి ప్రజల కళ్ల ముందుంటున్నాయంటే 'జంగిల్‌రాజ్' విధ్వంసం ఎలాంటిదో అర్థం చేసుకోవచ్చు. 1997లో ఓ విచారణ సందర్భంగా పట్నా హైకోర్టు రాష్ట్రంలో పరిస్థితులను ఆటవిక రాజ్యంతో పోలుస్తూ 'జంగిల్‌రాజ్' అనే పదాన్ని ఉపయోగించింది. లాలూ ఈసారి తెరవెనక్కే పరిమితమైనా.. ఆయన కుటుంబ సభ్యులను కూడా ప్రజలు పూర్తిస్థాయిలో విశ్వసించలేని పరిస్థితి నెలకొందని రాజకీయ విశ్లేషకులు పేర్కొంటున్నారు.



కిడ్నాపులే పరిశ్రమ

లాలూ పాలనలో బిహార్‌కు కిడ్నాప్‌లు పరిశ్రమలా ఎదిగాయి. బలవంతపు వసూళ్లు పెరిగాయి. ఆ కుటుంబ పాలన చివరిదశకు చేరేకొద్దీ వ్యాపారులు, వైద్యులు, పిల్లలు, ప్రభుత్వ ఉద్యోగుల అపహరణలు పతాక స్థాయికి చేరాయి. 2001-04 మధ్య 1,527 కిడ్నాప్ కేసులు నమోదయ్యాయి. ఒక్క 2004లోనే 411 కేసులు వచ్చాయి. పోలీసుల దృష్టికి రాకుండా సొమ్ములు చెల్లించి ఆత్మీయులను విడిపించుకొన్న వారెందరో. 1997-2005 మధ్య బిహార్‌లో మూడుసార్లు రాష్ట్రపతి పాలన విధించారు. దాణా కుంభకోణం ఆరోపణలతో లాలు జైలుకు వెళ్లడంతో ఆయన సతీమణి రబ్రీదేవి ముఖ్యమంత్రి పగ్గాలు చేపట్టారు. 1996-2001 వరకు కుల ఘర్షణల్లో 737 మంది ప్రాణాలు కోల్పోతే.. వీటిల్లో 1991-2001 మధ్య 566 మంది ఉన్నారు. పప్పూయాదవ్, మహమ్మద్ షాబుద్దీన్, అనంత్ సింగ్, ఆనంద్ మోహన్ సింగ్ వంటి ముఠా నాయకులు సమాంతర పాలనలు కొనసాగించారు. లాలూ కుమార్తె పెళ్లి కోసం కార్ల షోరూంల నుంచి కొత్త కార్లు ఎత్తుకుపోవడం మరో పెను సంచలనం.

పాలనకు అలా తెరపడింది

డీపీఎస్‌లో చదువుతున్న కిసలే అనే 15 ఏళ్ల బాలుడి అపహరణ.. లాలు పాలన ముగింపునకు పునాది వేసింది. 2005 జనవరి 19న స్కూల్ బస్సు ఎక్కాల్సిన ఆ విద్యార్థి అపహరణకు గురయ్యాడు. ఇది సంచలనం సృష్టించింది. జనవరి 27న వాజ్‌పేయీ భాగల్పుర్‌కు వచ్చారు. పత్రికల ద్వారా ఈ కిడ్నాప్ వ్యవహారం తెలుసుకుని, బహిరంగ సభలో 'కహా హై మేరే కిసలే' అంటూ ఆయన ప్రసంగించారు. ఇది ఆ రాష్ట్ర రాజకీయాలను, పోలీసు వ్యవస్థను కుదిపేసిందని నాటి పట్నా ఎస్ఎస్‌పీగా పనిచేసిన ఎన్.హెచ్. ఖాన్ వెల్లడించారు. వాజ్‌పేయీ ప్రసంగం తర్వాత 10 రోజులకు కిసలేను సమస్తీపుర్ నుంచి రక్షించి, ముగ్గురు కిడ్నాపర్లను ఎన్‌కౌంటర్ చేశారు. అప్పటికే ఆర్జేడీకి రాజకీయంగా కోలుకోలేని దెబ్బ తగిలింది. ఆ ఏడాది ఫిబ్రవరిలో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఆర్జేడీ 75 సీట్లకే పరిమితం అయింది. ఎవరికీ మెజార్టీ రాకపోవడంతో రాష్ట్రపతి పాలన విధించారు. అక్టోబరులో నిర్వహించిన ఎన్నికల తర్వాత జేడీయూ, భాజపా కలిసి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశాయి. దీంతో వాజ్‌పేయీ ప్రకటన లక్ష్యం నెరవేరినట్లయింది.

- ఇంటర్నెట్ డెస్క్

రోజుకు 78 నిమిషాలు ప్రయాణంలోనే ప్రజలు

- అధ్యయనంలో వెల్లడి

దిల్లీ: ప్రపంచవ్యాప్తంగా ప్రజలు రోజుకు దాదాపు 78 నిమిషాలు (గంట 18 నిమిషాలు) ప్రయాణంలో ఉంటున్నారని తాజా అధ్యయనం వెల్లడించింది. వారు ఏ దేశంలో నివసిస్తున్నారు, ఎంత ధనవంతులు అనే దానితో సంబంధం లేకుండా 43 దేశాల నుంచి సేకరించిన డేటా ఈ కొత్త విశ్లేషణను అంచనా వేసింది. రవాణా విధానం లేదా ప్రయాణించిన దూరంతో సంబంధం లేకుండా రోజూ 66 నుంచి 90 నిమిషాల మధ్య ప్రయాణానికి వెచ్చిస్తున్నారు. ఎన్విరాన్‌మెంటల్ రీసెర్చ్ లెటర్స్ జర్నల్‌లో ప్రచురించిన ఈ విశ్లేషణ.. ప్రపంచంలోని సగానికి పైగా జనాభా వ్యక్తిగత, పని సంబంధిత ప్రయాణాలకు సంబంధించిన డేటాను పరిశీలించింది. "ప్రజలు వేగం లేదా సామర్థ్యం పెరిగినప్పుడు ఎక్కువ దూరం ప్రయాణిస్తారు" అని స్పెయిన్‌లోని యూనివర్సిటీ ఆఫ్ బార్సిలోనా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎన్విరాన్‌మెంటల్ సైన్స్ అండ్ టెక్నాలజీ పరిశోధకుడు, రచయిత ఎరిక్ గాల్‌బ్రెయిత్ తెలిపారు. ప్రతి కిలోమీటరుకు ప్రయాణించే శక్తి కంటే ప్రతి గంట ప్రయాణంలో వినియోగించే శక్తి.. భవిష్యత్తు శక్తి వినియోగాన్ని నిర్ణయించే నిజమైన అంశమని పరిశోధనలు తెలుపుతున్నాయి.

ట్రంప్‌నకు బీబీసీ క్షమాపణలు

వాషింగ్టన్: అమెరికాలోని క్యాపిటల్ హిల్‌పై దాడి సందర్భంగా అధ్యక్షుడు ట్రంప్ చేసిన ప్రసంగాన్ని తప్పుడు అర్థం వచ్చేలా మార్చినందుకు గాను బీబీసీ గురువారం ఆయనకు క్షమాపణలు చెప్పింది. ఆ ప్రసంగాన్ని సవరించినందుకు తాను, బీబీసీ సంస్థ చింతిస్తున్నట్లు ఛైర్మన్ సమీర్ షా శ్వేతసౌధానికి వ్యక్తిగత లేఖ పంపారు. ట్రంప్ డిమాండు చేసిన బిలియన్ డాలర్ల పరిహారాన్ని ఇచ్చేందుకు నిరాకరించామని ఈ సందర్భంగా బీబీసీ ఓ కథనంలో పేర్కొంది. ఇప్పటికే తమ పొరపాటుకు బాధ్యత వహిస్తూ బీబీసీ డైరెక్టర్ జనరల్ టిమ్ డేవీ, న్యూస్ చీఫ్ టర్నెస్ డెబోరా రాజీనామా చేసిన విషయం తెలిసిందే.

సంద్రంలో ఉంటూ.. నేలపైనా యుద్ధం



షాంఘైలోని ఓ ఓడరేవు వద్ద సిచువాన్

- 'సిచువాన్' నౌకను రంగంలోకి దింపిన చైనా

బీజింగ్: నీటిపై ఉంటూ నేలపై యుద్ధం చేయగల యుద్ధనౌక సిచువాన్‌ను శుక్రవారం చైనా ట్రయల్ కోసం రంగంలోకి దింపింది. ప్రపంచంలోనే ఎలక్ట్రోమాగ్నెటిక్ ఎయిర్‌క్రాఫ్ట్ లాంచ్ సిస్టం (ఈఎంఏఎల్ఎస్) వ్యవస్థ ఉన్న తొలి యుద్ధ నౌక ఇదే కావడం విశేషం. ఇందులో యుద్ధ విమానాలు, హెలికాప్టర్లు, డ్రోన్‌లు, సముద్రం నుంచి భూమిపైకి నేరుగా వెళ్లిపోయే వాహనాలను, పెద్ద సంఖ్యలో సైనికులను ఒక చోటు నుంచి మరో చోటుకు చేరవేయవచ్చు. పూర్తి లోడ్‌తో 40 వేల టన్నుల బరువుండే సిచువాన్‌ను ఆధునిక వ్యవస్థల సాయంతో యుద్ధ విమానాల టేకాఫ్, ల్యాండింగ్‌లను చాలా వేగంగా చేయవచ్చని చైనా మీడియా చెబుతోంది. సముద్ర ట్రయల్‌లో భాగంగా ఇది షాంఘైలోని ఓ ఓడరేవు నుంచి బయలుదేరింది.



బిహార్‌లో ఎన్డీయే గెలుపుతో పట్నాలో తన తల్లి రీనాకు మిఠాయి తినిపిస్తున్న లోక్ జనశక్తి పార్టీ (రాం విలాస్) అధినేత చిరాగ్ పాస్వాన్

ఈవీఎంల భద్రత విధులకు గైర్హాజరు.. ఎనిమిది మంది సస్పెన్షన్

బిలాస్‌పుర్: హిమాచల్‌ప్రదేశ్‌లోని బిలాస్‌పుర్ జిల్లాలో ఈవీఎంలకు సెక్యూరిటీగా నియమించిన ఎనిమిది మంది పోలీసు సిబ్బందిని సస్పెండ్ చేశారు. ఆకస్మిక తనిఖీలో వారు విధులకు హాజరు కాలేదని గుర్తించిన కారణంగానే ఈ నిర్ణయం తీసుకున్నట్లు పోలీసులు తెలిపారు. బిలాస్‌పుర్‌లోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల, లఖన్‌పుర్‌లోని ఈవీఎం స్ట్రాంగ్ రూమ్‌లలో ఇద్దరు హెడ్ కానిస్టేబుల్స్‌ను, ఆరుగురు కానిస్టేబుల్స్‌ను నియమించగా వారు హాజరుకాలేదు. ఇది గమనించిన ఏఎస్పీ శివ్ చౌదరీ.. ఎస్పీ సందీప్ ధావల్‌కు సమాచారం అందించడంతో వారిని సస్పెండ్ చేశారు.

19న పీఎం కిసాన్ సమ్మాన్ నిధి విడుదల

దిల్లీ: అర్హులైన రైతులకు ఇచ్చే పీఎం కిసాన్ సమ్మాన్ నిధిని ప్రధాని మోదీ ఈ నెల 19న విడుదల చేయనున్నారు. ఏడాదికి మూడు దఫాల్లో రూ.2వేల చొప్పున మొత్తం రూ.6వేలను రైతుల ఖాతాల్లో కేంద్ర ప్రభుత్వం జమ చేస్తున్న విషయం తెలిసిందే. ఇప్పటి వరకు 20 విడతల్లో మొత్తం రూ.3.70లక్షల కోట్ల నగదును 11 కోట్ల మంది రైతుల బ్యాంకు ఖాతాల్లో నేరుగా జమ చేసినట్లు కేంద్ర వ్యవసాయ శాఖ ఒక ప్రకటనలో తెలిపింది.

ఆ దేశాల పౌరులకు ఇక్కడ ప్రాక్టీస్‌కు అవకాశం

- విదేశీయులకు నిబంధనలు జారీచేసిన బార్ కౌన్సిల్

ఈనాడు, దిల్లీ: విదేశీ పౌరులు భారత్‌లో న్యాయవాదులుగా ప్రాక్టీస్ చేసుకోవడానికి అవసరమైన నిబంధనలను ఖరారుచేస్తూ బార్‌కౌన్సిల్ ఆఫ్ ఇండియా శుక్రవారం నోటిఫికేషన్ జారీచేసింది. భారతీయులను న్యాయవాదులుగా ప్రాక్టీస్ చేసుకోవడానికి అవకాశం ఇచ్చిన దేశాలకు చెందిన పౌరులకు మాత్రమే ఇక్కడ ఆ అవకాశం కల్పించనున్నట్లు ఇందులో పేర్కొంది. ఏయే దేశాలతో భారత్‌కు ఇలాంటి అవకాశం ఉందో చెబుతూ బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా జాబితా విడుదల చేస్తుంది. భారత్‌లో న్యాయశాస్త్రం చేసిన వారికి, విదేశాల్లో చేసిన వారికి వేర్వేరు షరతులు విధించింది. భారత్‌లో లా డిగ్రీచేసిన విదేశీయులు నాన్-లిటిగేషన్ కేసులను మాత్రమే చేపట్టాలని పేర్కొంది. ముఖ్యంగా అడ్వయిజరీ, కన్సల్టెన్సీ, డాక్యుమెంటేషన్, ట్రాన్సాక్షనల్ వర్క్‌కు మాత్రమే పరిమితం కావాలని స్పష్టంచేసింది. కోర్టులు, ట్రైబ్యునళ్లు, అథారిటీలతోపాటు ఇతర క్వాసీజ్యుడిషియల్ సంస్థల ముందు హాజరుకావడం కుదరదని పేర్కొంది. భారత్‌లో న్యాయ డిగ్రీ పొందని విదేశీయులు దేశంలో ప్రాక్టీస్‌చేయడానికి అనుమతించబోమని స్పష్టంచేసింది. అలాంటివారు కేవలం విదేశీ, అంతర్జాతీయ చట్టాలు, అంతర్జాతీయ వాణిజ్యపరమైన ఆర్బిట్రేషన్ కేసులను మాత్రమే చేపట్టడానికి అనుమతివ్వనున్నట్లు పేర్కొంది. ఈ నిబంధనల కింద పేరు నమోదుచేసుకున్న విదేశీయులు ఎవ్వరికీ కేంద్ర, రాష్ట్ర బార్ కౌన్సిళ్లలో సభ్యత్వం పొందడానికికానీ, బార్‌అసోసియేషన్ ఎన్నికల్లో ఓటేయడానికి, పోటీచేయడానికికానీ వీలుండదని స్పష్టంచేసింది. రాష్ట్ర బార్ కౌన్సిళ్లు ఇలాంటి విదేశీయులకు ప్రత్యేక ఎన్‌రోల్‌మెంట్ నెంబర్ జారీచేయాలని సూచించింది.

సీజేఐ పరిశీలనలో హైకోర్టు జడ్జి ఒత్తిడి అంశం

దిల్లీ: చెన్నై నేషనల్ లా అప్పిలేట్ ట్రైబ్యునల్ (ఎన్‌క్లాట్) జ్యుడీషియల్ సభ్యుడిపై ఓ కేసు విషయంలో హైకోర్టు న్యాయమూర్తి ఒత్తిడి తెచ్చిన అంశం సుప్రీంకోర్టు దృష్టికి వచ్చింది. ఇందులో పాలనా పరమైన అంశాలను భారత ప్రధాన న్యాయమూర్తి(సీజేఐ) పరిశీలించనున్నారు. ఈ విషయాన్ని న్యాయవాది ప్రశాంత్ భూషణ్.. సుప్రీంకోర్టు దృష్టికి తీసుకొచ్చారు. "జ్యుడీషియల్ సభ్యుడికి సందేశం.. హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి నుంచి వచ్చింది" అని ఆయన తెలిపారు. దీన్ని తీవ్రంగా పరిగణించిన జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మాల్యా బాగ్చీల ధర్మాసనం.. చెన్నై ఎన్‌క్లాట్ నుంచి కేసును దిల్లీ ఎన్‌క్లాట్‌కు బదిలీ చేసింది. ఈ కేసులో లేవనెత్తిన విషయాలు కీలకమైనవని, అందులో పాలనాపరమైన అంశాలను సీజేఐ పరిశీలిస్తారని తెలిపింది. ఆగస్టు నెలలో ఓ కేసు విచారణ సందర్భంగా చెన్నై ఎన్‌క్లాట్ సభ్యుడు జస్టిస్ శరద్ కుమార్ శర్మ.. కోర్టులోనే తనకు ఓ హైకోర్టు న్యాయమూర్తి నుంచి వచ్చిన సందేశాన్ని చూపించారు. ఓ కంపెనీకి అనుకూలంగా తీర్పు చెప్పమని ఆయన నుంచి ఒత్తిడి వచ్చిందని చెప్పారు. కేసు నుంచి తాను తప్పుకుంటున్నట్లు కూడా ప్రకటించారు.

12 గంటలపాటు విమానంలోనే పాలస్తీనియన్లు

- దక్షిణాఫ్రికాలో ఘటన

జొహన్నెస్‌బర్గ్: ప్రయాణ పత్రాల సమస్య కారణంగా 150 మందికి పైగా పాలస్తీనియన్లు ఉన్న విమానాన్ని 12 గంటలపాటు దక్షిణాఫ్రికాలో నిలిపివేయడంతో అక్కడి అధికారులు శుక్రవారం తీవ్ర విమర్శలు ఎదుర్కొన్నారు. ప్రయాణికుల్లో 9 నెలల గర్భిణీ కూడా ఉన్నారు. పాలస్తీనియన్లు చార్టర్ విమానంలో కెన్యాలోని నైరోబీలో స్టాప్‌ఓవర్ తర్వాత గురువారం ఉదయం జొహన్నెస్‌బర్గ్‌లోని ఓఆర్ టెంబో అంతర్జాతీయ విమానాశ్రయంలో దిగారు. అయితే ఇజ్రాయెల్ నుంచి వీరికి ఎగ్జిట్ స్టాంపులు రాలేదని, దక్షిణాఫ్రికాలో ఎంత కాలం ఉండాలో పేర్కొనలేదని అధికారులు వివరించారు. వారి స్థానిక చిరునామాలను కూడా వెల్లడించలేదన్నారు. దీంతో వారి ప్రవేశాన్ని ఇమిగ్రేషన్ అధికారులు అడ్డుకున్నట్లు పేర్కొన్నారు. దీంతో అక్కడి హోం మంత్రిత్వ శాఖ జోక్యం చేసుకోవడంతో గిఫ్ట్ ఆఫ్ ది గివర్స్ అనే స్థానిక ప్రభుత్వేతర సంస్థ పాలస్తీనియన్లకు బస కల్పించడానికి ముందుకు రావడంతో వారికి విమానం నుంచి దిగేందుకు అనుమతిచ్చారు. గత రెండు వారాల్లో దక్షిణాఫ్రికాకు పాలస్తీనియన్ల విమానం రావడం ఇది రెండోసారి అని గిఫ్ట్ ఆఫ్ ది గివర్స్ వ్యవస్థాపకుడు ఇంతియాజ్ వెల్లడించారు.

మరో 15 మంది పాలస్తీనియన్ల మృతదేహాలను అప్పగించిన ఇజ్రాయెల్

ఖాన్ యూనిస్: అమెరికా కుదిర్చిన కాల్పుల విరమణ ఒప్పందంలో భాగంగా, ఇజ్రాయెల్ మరో 15 మంది పాలస్తీనియన్ల మృతదేహాలను గాజాకు శుక్రవారం పంపింది. ఈ విషయాన్ని ఖాన్ యూనిస్‌లోని నాసిర్ ఆసుపత్రి వర్గాలు ధ్రువీకరించాయి. గురువారం రాత్రి ఓ ఇజ్రాయెలీ బందీ మృతదేహాన్ని హమాస్ అప్పగించిన అనంతరం ఈ భౌతికకాయాలను ఇజ్రాయెల్ పంపింది. ఒప్పందంలో భాగంగా హమాస్ ఇంకా ముగ్గురు బందీల మృతదేహాలను అప్పగించాల్సి ఉంది.

భూమికి తిరిగొచ్చిన చైనా వ్యోమగాములు

బీజింగ్: వ్యోమనౌకను చిన్నపాటి అంతరిక్ష శకలం ఢీ కొట్టిన నేపథ్యంలో గతవారం పుడమికి తిరుగుప్రయాణాన్ని వాయిదావేసుకున్న ముగ్గురు చైనా వ్యోమగాములు ఎట్టకేలకు క్షేమంగా స్వదేశానికి చేరుకున్నారు. షెంఝౌ-21 వ్యోమనౌకలో వీరు ఇన్నర్ మంగోలియా ప్రాంతంలో దిగారు. నిజానికి వారు ఈ నెల 5న భూమికి తిరిగి రావాల్సింది. అయితే వీరు ప్రయాణించాల్సిన షెంఝౌ-20 వ్యోమనౌకను అంతరిక్ష శకలం ఢీ కొట్టడంతో.. చివరి నిమిషంలో వారు యాత్రను వాయిదా వేసుకున్నారు. ఈ ఘటన వల్ల ఆ స్పేస్‌షిప్‌లో పగులు ఏర్పడింది. ఈ నేపథ్యంలో షెంఝౌ-21లో వారు తిరుగుప్రయాణమయ్యారు.



వివిధ సంస్థలతో ఏపీ మారిటైం బోర్డు, ఏపీఏడీసీఎల్ ఎంవోయూలు చేసుకుంటున్న రాష్ట్ర అధికారులు. చిత్రంలో మంత్రి బీసీ జనార్దనరెడ్డి, పెట్టుబడులు, మౌలిక సదుపాయాల శాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి ఎంటీ కృష్ణబాబు, మారిటైమ్ బోర్డు ఛైర్మన్ దామచర్ల సత్య, ఏపీ ఇన్‌ల్యాండ్ వాటర్ అథారిటీ ఛైర్మన్ శివప్రసాద్, మారిటైం బోర్డు సీఈఓ అభిషేక్‌కుమార్ తదితరులు

21 రోజుల్లో అన్ని అనుమతులూ ఇస్తున్నాం

- పునరుత్పాదక ఇంధన వనరులు, డేటా సెంటర్లలో పెట్టుబడులు పెట్టండి
- 'వారీ' సంస్థ ప్రతినిధులతో నారా లోకేశ్

విశాఖపట్నం నుంచి 'ఈనాడు' ప్రత్యేక ప్రతినిధి



'స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్'లో భాగంగా రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టే సంస్థలకు 21 రోజుల్లోనే అన్ని అనుమతులు ఇస్తున్నట్లు రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ తెలిపారు. పునరుత్పాదక ఇంధన వనరులు, డేటా సెంటర్లు, బ్యాటరీ స్టోరేజి రంగాల్లో పెట్టుబడులు పెట్టాల్సిందిగా 'వారీ' సంస్థ ప్రతినిధుల్ని కోరారు. విశాఖ సీఐఐ భాగస్వామ్య సదస్సులో భాగంగా శుక్రవారం వారీ ఛైర్మన్ శ్యామ్‌సుందర్, సీఓఓ శ్యామ్‌సుందర్ రఘుపతితో లోకేశ్ సమావేశమయ్యారు. పెట్టుబడులు పెట్టేందుకు ఏపీ అత్యంత అనుకూల ప్రాంతమని వారికి వివరించారు. "సుదీర్ఘ తీరప్రాంతం, ఆపరేటింగ్ పోర్టులు, విమానాశ్రయాలు, రైల్వే లైన్లు అందుబాటులో ఉన్నాయి. చంద్రబాబు నేతృత్వంలో పారిశ్రామిక రంగం పరుగులు తీస్తోంది. త్వరలో విశాఖలో గూగుల్ డేటా సెంటర్ ఏర్పాటు కానుంది. దీంతో విశాఖ డేటా సెంటర్ హబ్‌గా అవతరిస్తుంది" అని తెలిపారు. దీనిపై సానుకూలంగా స్పందించిన వారీ ప్రతినిధులు.. త్వరలో శుభవార్త చెబుతామని మంత్రికి హామీ ఇచ్చారు.

ఎస్ఏఈఎల్ ఛైర్మన్ సుఖ్‌బీర్ ఆవ్లాతో భేటీ

అంతకుముందు ప్రముఖ పునరుత్పాదక ఇంధన వనరుల సంస్థ ఎస్ఏఈఎల్ ఛైర్మన్ సుఖ్‌బీర్ ఆవ్లాతో లోకేశ్ సమావేశమయ్యారు. రాయలసీమ, విశాఖల్లో పెట్టుబడులు పెట్టాల్సిందిగా ఆహ్వానించారు. చంద్రబాబు నేతృత్వంలో రాష్ట్రం భారీ పెట్టుబడులకు గమ్యస్థానంగా మారిందని వివరించారు. సానుకూలంగా స్పందించిన సుఖ్‌బీర్.. పునరుత్పాదక ఇంధన వనరులు, వేస్ట్ టు ఎనర్జీ ప్రాజెక్టుల్లో ఇప్పటికే తమ సంస్థ 500 మెగావాట్ల సామర్థ్యం ఉన్న పలు ప్రాజెక్టుల్ని ఏర్పాటు చేసినట్టు వివరించారు. "వ్యవసాయ, మున్సిపల్ వ్యర్థాల ఆధారిత విద్యుత్తు ప్లాంట్లను నిర్మిస్తున్నాం. హైవేలు, పారిశ్రామిక పార్కులు, సుస్థిర గృహకల్పన ప్రాజెక్టులను చేపట్టాం" అని వివరించారు. ప్రఖ్యాత సంస్థలు శ్యామ్ మెటాలిక్స్ ఎనర్జీ, కిర్లోస్కర్ బ్రదర్స్, యాక్షన్ టెసా ఎండీలు, ప్రతినిధులతోపాటు ఆస్ట్రేలియా కాన్సుల్ జనరల్ సిలాయ్ జాకి, జేమ్స్ కుక్ విశ్వవిద్యాలయ ప్రతినిధులను కలిసి రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టాలని లోకేశ్ కోరారు. ఆ వివరాలు..

స్టీల్ అనుబంధ పరిశ్రమల ఏర్పాటు అంశాన్ని పరిశీలించాలి

"ఏపీలో విలువ ఆధారిత డౌన్ స్ట్రీమ్ స్టీల్ ప్రొడక్షన్ యూనిట్ ఏర్పాటు చేసే అంశాన్ని పరిశీలించాలి. రాష్ట్రంలో పరిశ్రమల ఏర్పాటుకు పూర్తిస్థాయి అనుకూల వాతావరణం ఉంది. అనకాపల్లి సమీపంలో ఆర్సెలార్ మిత్తల్ సంస్థ రూ.1.35 లక్షల కోట్లతో దేశంలో అతి పెద్ద స్టీల్ ప్లాంట్ ఏర్పాటు చేస్తోంది. ఇక్కడ అనుబంధ పరిశ్రమలు ఏర్పాటు చేసే అంశాన్ని పరిశీలించాలి" అని శ్యామ్ మెటాలిక్స్ ఎనర్జీ సంస్థ ఎండీ షీజిత్ అగర్వాల్‌ని మంత్రి లోకేశ్ కోరారు. రాబోయే ఐదేళ్లలో రూ.2,500 కోట్లతో తమ సంస్థను విస్తరించాలని భావిస్తున్నామని, ఏపీ ప్రభుత్వ ప్రతిపాదనలు పరిశీలిస్తామని షీజిత్ అగర్వాల్ ఈ సందర్భంగా తెలిపారు.

ఐఓటీ ఆధారిత నీటి నిర్వహణ వ్యవస్థ ఏర్పాటు చేయాలి

"హైడ్రో టర్బైన్లు, సౌర పంపింగ్ వ్యవస్థల తయారీ యూనిట్‌ని ఏపీలో ఏర్పాటు చేయాలి. నీటిపారుదల, మున్సిపల్ నీటి సరఫరా, పారిశ్రామిక వినియోగానికి కీలకమైన వర్టికల్ టర్బైన్ పంపుల కోసం రాష్ట్రంలో ప్రత్యేక ప్లాంట్ స్థాపించండి. విశాఖపట్నం -చెన్నై పారిశ్రామిక కారిడార్‌లో ఐవోటీ ఆధారిత మురుగునీటి పంపింగ్, నీటి నిర్వహణ వ్యవస్థ ఏర్పాటు చేయండి. పారిశ్రామిక, పట్టణ మౌలిక సదుపాయాల కోసం యూఎల్/ఎఫ్ఎం-సర్టిఫైడ్ ఫైర్ పంపులు, పెద్ద వాల్వ్‌లు ఉత్పత్తి చేసే ఎస్‌పీపీ పంపుల సౌకర్యం కల్పించండి" అని కిర్లోస్కర్ బ్రదర్స్ లిమిటెడ్ (కేబీఎల్) ఎండీ అలోక్ కిర్లోస్కర్‌ను మంత్రి లోకేశ్ కోరారు. ప్రభుత్వ ప్రతిపాదనలు పరిశీలిస్తానని ఈ సందర్భంగా ఆయన అన్నారు.

ప్రజల ఆరోగ్య సంరక్షణకు ఉమ్మడి పరిశోధనలు..

"రాష్ట్ర యువత కోసం పర్యావరణ, ఆరోగ్య సంరక్షణ, పర్యాటక రంగాల్లో నైపుణ్యాభివృద్ధి శిక్షణ కార్యక్రమాలు నిర్వహించండి. ఫిషింగ్, ఆక్వాకల్చర్, తీర ప్రాంత పర్యావరణ వ్యవస్థ నిర్వహణపై మారిటైమ్, తీర ప్రాంత పరిశోధనలకు ఏపీ విశ్వవిద్యాలయాలతో కలిసి పని చేయండి. గ్రామీణ ప్రాంతాల్లో వ్యాధులు, ఆరోగ్య సంరక్షణపై ఉమ్మడి పరిశోధనలు చేపట్టండి. రాష్ట్ర గ్రీన్ ఎనర్జీ లక్ష్యాలకు అనుగుణంగా టెక్నాలజీ, పాలసీ పరిశోధనలకు సహకారం అందించండి. వ్యవసాయ, పట్టణ నీటి అవసరాలకు జలవనరుల నిర్వహణలో నైపుణ్యం కోసం ఏపీతో కలిసి ట్రాపికల్ వాటర్ రిసెర్చ్ గ్రూపు ఏర్పాటు చేయాలి" అని ఆస్ట్రేలియా కాన్సుల్ జనరల్ సిలాయ్ జాకి, జేమ్స్ కుక్ విశ్వవిద్యాలయ ప్రతినిధులకు లోకేశ్ విజ్ఞప్తి చేశారు.

సితార్‌గంజ్ తరహా శాటిలైట్ తయారీ యూనిట్ ఏర్పాటు చేయండి

"రాష్ట్రంలో సెకండరీ/శాటిలైట్ ఎండీఎఫ్ తయారీ యూనిట్ ఏర్పాటు చేయండి. సితార్‌గంజ్ తయారీ కేంద్రం 7.5 లక్షల సీబీఎం సామర్థ్యంలో పని చేస్తున్నందున.. ఏపీలోనూ సెకండరీ యూనిట్ ఏర్పాటు చేస్తే.. అదనపు తయారీ యూనిట్ల ఏర్పాటుకు మద్దతిచ్చినట్లవుతుంది" అని యాక్షన్ టెసా సీఈవో వివేక్ జైన్‌తో మంత్రి లోకేశ్ అన్నారు. "దిల్లీ ప్రధాన కేంద్రంగా తమ సంస్థలో 2,486 మంది ఉద్యోగులు పని చేస్తున్నారు. 2018లో మేం ఏడో తరం కాంటి రోల్ టెక్నాలజీని విజయవంతంగా ప్రారంభించాం. ఉత్పత్తి వైవిధ్యం కోసం డోమ్ టెక్నాలజీని ప్రవేశపెట్టాం. ఏపీ ప్రభుత్వ ప్రతిపాదనలు పరిశీలిస్తాం" అని వివేక్ జైన్ హామీ ఇచ్చారు.



వివిధ దేశాల నుంచి వచ్చిన మంత్రులు, ముఖ్య అతిథుల వద్దకు వెళ్లి పరిచయం చేసుకుంటున్న ముఖ్యమంత్రి చంద్రబాబు

ముఖ్యమంత్రి చంద్రబాబుతో జపాన్ దేశ రాయబారి ఓనో కెయిచి భేటీ





ఎస్ఏఈఎల్ ఛైర్మన్ సుఖ్‌బీర్ ఆవ్లా బృందంతో మంత్రి లోకేశ్ చర్చలు



వారీ సంస్థ ఛైర్మన్ అంకితా జోషి, సీఓఓ శ్యామ్‌సుందర్ రఘుపతితో మంత్రి లోకేశ్ చర్చలు

కర్నూలు నుంచి రిలయన్స్ కాంపా

- వచ్చే ఏడాది ఫిబ్రవరిలోనే ఉత్పత్తి ప్రారంభం
- విశాఖపట్నం సమీపంలోనూ ప్రాజెక్టు
- 'ఈనాడు'తో రిలయన్స్ కన్జ్యూమర్ ప్రొడక్ట్స్ ఈడీ కేతన్‌మోదీ

(విశాఖపట్నం నుంచి ఈనాడు ప్రత్యేక ప్రతినిధి)



కర్నూలు జిల్లాలో రిలయన్స్ ఆధ్వర్యంలో బెవరేజెస్‌తో పాటు బిస్కట్లు, నూడుల్స్ సహా వివిధ రకాల ఆహార ఉత్పత్తులు తయారు చేయనున్నట్లు రిలయన్స్ కన్జ్యూమర్ ప్రొడక్ట్స్ లిమిటెడ్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కేతన్ మోదీ తెలిపారు. కర్నూలులో ఏర్పాటుచేసే ప్లాంటు నుంచి వచ్చే ఏడాది ఫిబ్రవరిలోనే కాంపాకోలా ఉత్పత్తి ప్రారంభమవుతుందని వెల్లడించారు. సీఐఐ భాగస్వామ్య సదస్సులో భాగంగా విశాఖపట్నంలో శుక్రవారం ప్రభుత్వంతో ఒప్పందం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన 'ఈనాడు'తో మాట్లాడారు.

వేగవంతంగా అనుమతులు

"ప్రభుత్వ విధానాలు పారిశ్రామికవేత్తలకు అనుకూలంగా ఉన్నాయి. ఏపీలో ఇంటిగ్రేటెడ్ ఫుడ్‌పార్కు ఏర్పాటుకు ప్రతిపాదనలు ఇచ్చాం. ప్రభుత్వం ఎంతో సహకరించింది. భూమి కేటాయింపు, ఇతర అనుమతులు వేగంగా లభించాయి. మేమూ అంతే త్వరగా ప్లాంట్ నిర్మాణానికి కట్టుబడి ఉన్నాం.

కర్నూలు, విశాఖల్లో ప్రాజెక్టులు

170 ఎకరాల్లో రూ.4వేల కోట్ల పెట్టుబడితో కర్నూలు, విశాఖపట్నాల్లో ప్రాజెక్టులు చేపడుతున్నాం. వీటివల్ల 6,500 ఉద్యోగాలు లభిస్తాయి. ఉత్పత్తుల సేకరణతో రైతులకూ ప్రయోజనం. కర్నూలు ప్లాంట్ రెండుదశల్లో అభివృద్ధి చేస్తున్నాం. తొలుత కాంపాకోలా మార్కెట్లోకి తెస్తాం. తర్వాత దశలో వచ్చే ఏడాది చివరికి బిస్కట్లు, స్నాక్స్ ఇతర ఉత్పత్తులు వస్తాయి.

భవిష్యత్తులో మరిన్ని ప్లాంట్లు

ఆంధ్రప్రదేశ్ మాకు ఎంతో ప్రత్యేకం. మొదటి పైలట్ ప్రాజెక్టులనూ ఇక్కడే చేశాం. ఇది మొదటి అడుగు మాత్రమే. మరెన్నో ప్లాంట్లు భవిష్యత్తులో ఏర్పాటుచేసే అవకాశం ఉంది" అని కేతన్ మోదీ తెలిపారు.

18 నెలల్లో రూ.20 లక్షల కోట్ల పెట్టుబడులు రాబట్టాం

- ఆర్థికవ్యవస్థను గాడిలో పెట్టేందుకు ప్రయత్నిస్తున్నాం
- 'ఏపీ రీ ఇమేజినింగ్ పబ్లిక్ ఫైనాన్సింగ్' సదస్సులో సీఎం చంద్రబాబు

ఈనాడు-విశాఖపట్నం, వన్‌టౌన్, కార్పొరేషన్, న్యూస్‌టుడే: 'రాష్ట్ర విభజనతో ఆదాయం చాలా వరకు తగ్గిపోయింది. సంక్షోభం నుంచి అవకాశాలు వెతుక్కుంటూ ఆర్థిక వ్యవస్థను గాడిలో పెట్టేందుకు ప్రయత్నిస్తున్నాం. ప్రతికూల పరిస్థితుల్లోనూ 18 నెలల్లో రూ.20 లక్షల కోట్ల పెట్టుబడులు రాబట్టగలిగాం' అని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. శుక్రవారం నోవోటెల్ హోటల్‌లో రాష్ట్ర ఆర్థికమంత్రి పయ్యావుల కేశవ్ ఆధ్వర్యంలో జరిగిన 'ఏపీ రీ ఇమేజినింగ్ పబ్లిక్ ఫైనాన్సింగ్' సదస్సులో ఆయన మాట్లాడారు.


ఎస్క్రో ఖాతా తెరుస్తున్నాం: 'గత ఐదేళ్లలో ఏపీ ఇమేజ్ అంతర్జాతీయ స్థాయిలో దెబ్బతింది. కేంద్రం నుంచి ఆర్థిక సహకారం అందుతున్నా ఇంకా కొన్ని ఇబ్బందులున్నాయి. ఆర్సెలార్ మిత్తల్ వంటి భారీ ప్రాజెక్టు అనకాపల్లికి రావడంతో భారీగా పెట్టుబడులు రానున్నాయి. గూగుల్ డేటా సెంటర్ 15 బిలియన్ల డాలర్ల పెట్టుబడి పెడుతోంది. ప్రభుత్వ విధానాల వల్ల పారిశ్రామికవేత్తలు నష్టపోయే పరిస్థితులు రాకూడదనే భావనతో పనిచేస్తున్నాం. పరిశ్రమలకు ఇచ్చే ప్రోత్సాహకాల కోసం ఎస్క్రో ఖాతా తెరుస్తున్నాం. సావనీర్ గ్యారెంటీ కూడా ఇస్తాం' అని సీఎం స్పష్టం చేశారు.



మాట్లాడుతున్న ముఖ్యమంత్రి చంద్రబాబు. వేదికపై మంత్రి పయ్యావుల కేశవ్, ఇతర ప్రతినిధులు

'మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా విధానాలు మార్చుకోవాలి. సంస్కరణల వల్ల అభివృద్ధి జరుగుతుందనే దానికి హైదరాబాద్ అభివృద్ధి నిదర్శనం. 1999లో తీసుకున్న విద్యుత్తు సంస్కరణల వల్ల ఇప్పుడు విద్యుత్ వ్యవస్థకు ఎలాంటి ఇబ్బందులూ రావడం లేదని బలంగా చెప్పగలను. విభజన తర్వాత తెలంగాణ ఆ సంస్కరణల లాభాలను పొందుతోంది. చేసిన మంచి పనులు చెప్పుకోవడంలో కొంచెం వెనుకబడ్డా. దాంతో కొన్ని ఇబ్బందులు వచ్చాయి. విభజనతో అగ్రికల్చరల్, ఎలైడ్ సెక్టార్ ఏపీకి, సర్వీస్ సెక్టార్ తెలంగాణకు వెళ్లాయి. దీంతో రాష్ట్రానికి వచ్చే ఆదాయం చాలా వరకు తగ్గిపోయింది.'

– సీఎం చంద్రబాబు



రూ.54,000 కోట్ల పెట్టుబడులతో ఏర్పాటు చేయనున్న పరిశ్రమలకు సంబంధించి ఏఎం గ్రీన్ గ్రూప్‌తో అవగాహన ఒప్పందం కుదుర్చుకున్న రాష్ట్ర ప్రభుత్వం. చిత్రంలో ముఖ్యమంత్రి చంద్రబాబు, కేంద్ర మంత్రులు పీయూష్ గోయల్, రామ్మోహన్‌నాయుడు తదితరులు

రక్షణ రంగంలో పరిశోధనలు, పెట్టుబడులకు ఏపీ సురక్షితం

- మంత్రి టీజీ భరత్

ఈనాడు, విశాఖపట్నం: అంతరిక్ష, విమానయాన, రక్షణ రంగాల్లో పెట్టుబడులను ప్రోత్సహించేలా తీసుకొచ్చిన ప్రభుత్వ పాలసీలు సత్ఫలితాలను ఇస్తున్నాయని మంత్రి టీజీ భరత్ అన్నారు. రాష్ట్రంలో సుదీర్ఘ సముద్ర తీరంతో పాటు రాకెట్లు, శాటిలైట్ల ప్రయోగానికి వేదిక అందుబాటులో ఉందని.. అందువల్ల ఆయా రంగాల్లో పరిశ్రమలు నెలకొల్పేవారికి ఏపీ సురక్షితమైన ప్రాంతమని పేర్కొన్నారు. సీఐఐ భాగస్వామ్య సదస్సులో 'డిఫెన్స్, ఏరోస్పేస్, స్పేస్ ఎకోసిస్టమ్‌లో ప్రైవేట్ రంగం భాగస్వామ్యం' అనే అంశంపై జరిగిన చర్చా కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఆయుధాలు, శాటిలైట్లకు సంబంధించి పరిశోధనలు, డిజైన్, టెస్టింగ్, ప్రొడక్షన్, ఎగుమతులన్నీ రాష్ట్రం నుంచే జరగాలన్నదే ప్రభుత్వ లక్ష్యమన్నారు.



చర్చా కార్యక్రమంలో మంత్రి టీజీ భరత్. చిత్రంలో ఆయా రంగాల్లో ప్రభుత్వ సలహాదారులు డా.సోమనాథ్, డా.సతీష్‌రెడ్డి, హెచ్ఎఫ్‌సీఎల్ ఈపీ సంపత్‌కుమార్ తదితరులు

ఆయుధాల ఎగుమతికి విస్తృత అవకాశాలు

– డా.సతీష్‌రెడ్డి, ఏరోస్పేస్, డిఫెన్స్ రంగ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు

'రక్షణ రంగం ఉత్పత్తుల్లో ప్రైవేటు కంపెనీలు పెట్టుబడులు పెట్టడానికి ముందుకు వస్తున్నాయి. ప్రపంచంలోనే లాంగ్ రేంజ్‌లో షూట్ చేసే గన్ మన దేశానికి చెందిన భారత్ ఫోర్జ్ ఇదివరకే తయారుచేసింది. ఇప్పుడు అత్యాధునిక గ్రనేడ్లు, ఇతర ఆయుధాల తయారీకి హెచ్ఎఫ్‌సీఎల్ కంపెనీ రాష్ట్రంలో అడుగుపెట్టనుంది. ప్రపంచ దేశాలకు అవసరమైన ఆయుధ సంపత్తిలో 3 శాతం మనం ఎగుమతి చేసినా రూ.లక్ష కోట్ల ఆదాయం వస్తుంది. బెల్ కంపెనీ దొనకొండలో 1,200 ఎకరాల్లో ఆయుధ తయారీ చేపట్టనుంది'

అంతరిక్ష ప్రయోగాలకు ప్రోత్సాహం..

–డా.సోమనాథ్, అంతరిక్ష రంగం రాష్ట్ర సలహాదారు

'అంతరిక్ష రంగంలో పెట్టుబడులు పెట్టేవారికి మిగతా రాష్ట్రాల కంటే ఏపీ ఎక్కువ ప్రోత్సాహం ఇస్తుంది. శ్రీహరికోట రాష్ట్రానికి ఉన్న బలం. తక్కువ ఖర్చుతో ఇక్కడ రాకెట్లు, శాటిలైట్లను తయారుచేసి ప్రయోగించడానికి అవకాశాలున్నాయి. తిరుపతి, శ్రీసత్యసాయి జిల్లాల్లో స్పేస్ కార్యకలాపాలకు అనుకూల పరిస్థితులుండడంతో ఆ ప్రాంతాలను స్పేస్ సిటీలుగా అభివృద్ధి చేస్తున్నాం'

రూ.1,400 కోట్లు పెట్టుబడి పెడుతున్నాం..

– సంపత్‌కుమార్, ఎగ్జిక్యూటివ్ ప్రెసిడెంట్, హెచ్ఎఫ్‌సీఎల్

'మేం ఆయుధ కర్మాగారం పెడతామని రాష్ట్ర ప్రభుత్వానికి సమాచారం ఇచ్చాం. ఒక్కరోజు విజయవాడ వచ్చి సంబంధిత అధికారులను కలిశాం. రోజుల వ్యవధిలోనే మాకు అనుమతులిచ్చారు. మడకశిర సమీపంలో వెయ్యి ఎకరాలు కేటాయించారు. రూ.1,400 కోట్లు పెట్టుబడి పెడుతున్నాం. వెయ్యి మందికి ప్రత్యక్షంగా రెండు వేలమందికి పరోక్షంగా ఉపాధి లభిస్తుంది. ఏడాదికి నాలుగు మిలియన్ల హ్యాండ్ గ్రనేడ్లు తయారు చేస్తాం. యూరోపియన్ కంపెనీతో కలిసి 1.5 ఎంఎం గన్‌లు తయారుచేస్తాం. వీటిని మనదేశంతో పాటు ఇతర దేశాలకు ఎగుమతి చేస్తాం'.

మంత్రులు నారాయణ, కొండపల్లి శ్రీనివాస్, గొట్టిపాటి రవికుమార్‌ల సమక్షంలో వివిధ కంపెనీల ఒప్పందాలు













రూ.150 కోట్లతో జలరవాణా మార్గాల అభివృద్ధి

మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి వెల్లడి

ఈనాడు, విశాఖపట్నం: రాష్ట్రంలో అంతర్గత జలరవాణా మార్గాలను రూ.150 కోట్లతో అభివృద్ధి చేయనున్నామని పెట్టుబడులు మౌలిక సదుపాయాల శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి తెలిపారు. ఇటీవల ముంబయిలో జరిగిన మారిటైం వీక్‌లో ఏపీ సెషన్ వేదికపై ఇన్‌ల్యాండ్ వాటర్‌వేస్ అథారిటీ ఆఫ్ ఇండియాతో ఏపీ ఇన్‌ల్యాండ్ వాటర్ వేస్ అథారిటీ ఒప్పందం చేసుకుందని విశాఖలోని సీఐఐ భాగస్వామ్య సదస్సులో వెల్లడించారు.

సదస్సు ప్రతినిధులకు గాలా డిన్నర్

ఈనాడు, విశాఖపట్నం: విశాఖ భాగస్వామ్య సదస్సుకు హాజరైన విదేశీ ప్రతినిధులు, దిగ్గజ పరిశ్రమలకు చెందిన ప్రముఖులకు ముఖ్యమంత్రి చంద్రబాబు శుక్రవారం రాత్రి విందు ఇచ్చారు. బీచ్ రోడ్డులోని రాడిసన్ బ్లూ హోటల్‌లో గాలా డిన్నర్ ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి రాత్రి 9:30 గంటలకు హాజరైన సీఎం సుమారు గంటన్నర సేపు అతిథుల వద్ద ఉన్నట్లు సమాచారం.

గత మూడేళ్లలో విదేశీ పెట్టుబడుల ఆకర్షణలో ఏపీ స్తబ్దత

- జపాన్ బాహ్య వాణిజ్య సంస్థ(జెట్రో) చెన్నై డైరెక్టర్ జనరల్ కౌరు షిరైషి

విశాఖపట్నం నుంచి ఈనాడు ప్రత్యేక ప్రతినిధి: విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల(ఎఫ్‌డీఐ)ను ఆకర్షించడంలో గత వైకాపా ప్రభుత్వం విఫలమైంది. ఇదే సమయంలో తమిళనాడు విదేశీ పెట్టుబడులను భారీగా ఆకర్షించింది. విశాఖపట్నంలో జరుగుతున్న సీఐఐ భాగస్వామ్య సదస్సులో ఈ గణాంకాలు వెల్లడయ్యాయి. 2018-19లో విదేశీ పెట్టుబడులు సుమారు 3,500 మిలియన్ డాలర్లు రాగా.. 2019-20కి వచ్చే సరికి వెయ్యి మిలియన్ డాలర్లకు పడిపోయాయి. భాగస్వామ్య సదస్సులో భాగంగా రెండో హాల్‌లో శుక్రవారం జరిగిన 'భారతదేశం-జపాన్ విధానంపై ఐక్యరాజ్యసమితి అభివృద్ధి కార్యక్రమంతో చర్చలు, బాధ్యతాయుతమైన వ్యాపార పద్ధతులపై చర్చ'లో జపాన్ బాహ్య వాణిజ్య సంస్థ(జెట్రో) చెన్నై డైరెక్టర్ జనరల్ కౌరు షిరైషి మాట్లాడుతూ.. గత మూడేళ్లలో విదేశీ పెట్టుబడులను ఆకర్షించడంలో ఏపీ స్తబ్దుగా ఉండగా.. తమిళనాడులో పెరుగుదల కనిపించిందని పేర్కొన్నారు. మరోవైపు 80% జపాన్ కంపెనీలు ఏపీలోని శ్రీసిటీలోనే ఉన్నాయని వెల్లడించారు. "విదేశీ పెట్టుబడులను ఆకర్షించేందుకు ఉపాధి కల్పన, ఉద్యోగులకు క్రమబద్ధమైన ఆదాయం, సాంకేతికత బదిలీ, వినియోగదారులకు సరసమైన ధరకు మంచి ఉత్పత్తులు లభించాలి. కంపెనీలకు ప్రోత్సాహకాలను సకాలంలో చెల్లించాలి. మంచి మౌలికసదుపాయాలు, ప్రోత్సాహకాల విధానం ఉండాలి. విదేశీయులకు మంచి జీవన పరిస్థితులు ఉండాలి. భారత పెట్టుబడి వాతావరణంలో అనేక సవాళ్లు, ప్రయోజనాలు ఉన్నాయి. సమయం తీసుకునే పన్ను విధానాలు, అనుమతులు, లైసెన్సులకు ఎక్కువ సమయం తీసుకోవడం లాంటి సవాళ్లు ఉండగా.. మార్కెట్ స్థాయి, వృద్ధి సామర్థ్యం, తక్కువ కార్మిక ఖర్చులు ప్రయోజనంగా ఉన్నాయి" అని పేర్కొన్నారు.

విశాఖపట్నం విమానాశ్రయం హౌస్‌ఫుల్

విశాఖపట్నం (ఎన్ఏడీకూడలి), న్యూస్‌టుడే: విశాఖపట్నం అంతర్జాతీయ విమానాశ్రయంలో విమానాల రాకపోకలతో శుక్రవారం ట్రాఫిక్ నెలకొంది. సీఐఐ సదస్సు సందర్భంగా దేశ, విదేశాల నుంచి వివిధ కంపెనీల అధినేతలు, ప్రతినిధులు రావడంతో రద్దీ ఏర్పడింది. రోజూ దేశంలోని వివిధ నగరాల నుంచి వచ్చి వెళ్లే 60 విమానాలతో పాటు గురు, శుక్రవారాల్లో అదనంగా 20 నాన్‌షెడ్యూల్ ప్రైవేట్ చార్టెడ్ విమానాలు ఇక్కడికి చేరుకున్నాయి. ఇందులో 18 విమానాలు తిరిగి బయల్దేరగా.. ఇంకా రెండు విమానాలు రన్‌వేపై నైట హాల్ట్‌లో ఉన్నట్లు విమానాశ్రయ డైరెక్టర్ పురుషోత్తం తెలిపారు. శనివారం సైతం ప్రైవేట్ విమానాలు వచ్చే అవకాశం ఉండటంతో తగిన ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. రన్‌వేపై కొన్ని విమానాలకు పార్కింగ్ సదుపాయం లేకపోవడంతో ఆరు చార్టెడ్ విమానాలను మళ్లించేందుకు రాజమహేంద్రవరం విమానాశ్రయాన్ని సంప్రదించారు. అయితే రెండు విమానాలు మాత్రమే అటు మళ్లించారు. గురు, శుక్రవారాల్లో ఈ రెండు విమానాలు తిరిగి వెళ్లిపోయాయని రాజమహేంద్రవరం విమానాశ్రయ వర్గాలు తెలిపాయి.



ఆస్ట్రేలియా కాన్సులేట్ జనరల్ సిలాయ్ జాకి, జేమ్స్ కుక్ యూనివర్సిటీ ప్రతినిధులతో భేటీ అయిన మంత్రి లోకేశ్ ★ యాక్షన్ టెసా ఎండీ, సీఈఓ వివేక్ జైన్‌తో చర్చిస్తున్న లోకేశ్ ★ శ్యామ్ మెటాలిక్స్ ఎండీ షీజిత్ అగర్వాల్ బృందంతో లోకేశ్ ★ ఏపీలో డౌన్ స్ట్రీమ్ స్టీల్ ప్రొడక్షన్ యూనిట్ ఏర్పాటు చేయాలని కోరుతూ శ్యామ్ మెటాలిక్స్ ఎండీ షీజిత్ అగర్వాల్ బృందంతో చర్చిస్తున్న లోకేశ్ ★ కిర్లోస్కర్ ఎండీ అలోక్ కిర్లోస్కర్‌తో భేటీ అయిన లోకేశ్

నైపుణ్యాభివృద్ధి, కెపాసిటీ బిల్డింగ్‌కి గేట్‌వేగా ఏపీ

ముఖ్యమంత్రి చంద్రబాబు

విశాఖపట్నం నుంచి ఈనాడు ప్రత్యేక ప్రతినిధి

వివిధ రంగాల్లో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంతో కలిసి పని చేసేందుకు, రాష్ట్రంలో పెట్టుబడుల్ని ప్రోత్సహించేందుకు సింగపూర్ ప్రభుత్వం కీలక ఒప్పందం చేసుకుంది. విశాఖలో నిర్వహిస్తున్న పెట్టుబడిదారుల సదస్సులో ముఖ్యమంత్రి చంద్రబాబు, సింగపూర్ హోంమంత్రి కె.షణ్ముగం సమక్షంలో విద్య, ఐటీ, ఆర్టీజీ శాఖల మంత్రి లోకేశ్... సింగపూర్ వాణిజ్యం, విదేశీ వ్యవహారాలశాఖ మంత్రి గాన్ సో హాంగ్ ఒప్పందపత్రాల్ని శుక్రవారం ఇచ్చిపుచ్చుకున్నారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ.. 'నేను అధికారం కోల్పోయాక మిగతా మిత్రులెవరూ పట్టించుకోలేదు. సింగపూర్ మాత్రం మర్చిపోలేదు. అధికారంలో ఉన్నా, లేకపోయినా మీతో శాశ్వతంగా అనుబంధం కొనసాగిస్తామని చెప్పారు. 2014 ఎన్నికల సమయంలో ఆంధ్రప్రదేశ్‌లో మరో సింగపూర్ నిర్మిస్తానని హామీ ఇచ్చాను. నేను కోరిన వెంటనే సింగపూర్ ప్రభుత్వం అమరావతికి ఉచితంగా మాస్టర్‌ప్లాన్ తయారుచేసి ఇచ్చింది. 2024లో మేం అధికారంలోకి వచ్చాక మళ్లీ సింగపూర్ వెళ్లాను. 2019-24 మధ్య జరిగినదానికి విచారం వ్యక్తం చేశాను. ఏపీకి రావాలని కోరాను. రాష్ట్రాభివృద్ధికి సహకరించేందుకు సింగపూర్ ప్రభుత్వం ముందుకొచ్చింది. ఆంధ్రప్రదేశ్ నిర్దేశించుకున్న స్వర్ణాంధ్ర లక్ష్యానికి ఇది దోహదం చేస్తుంది. సింగపూర్‌లో ఆరు దశాబ్దాలుగా సుస్థిర ప్రభుత్వం ఉంది. ఇప్పుడు ప్రధాని నరేంద్రమోదీ సారథ్యంలో భారత్ కూడా ఆ దిశగా వెళుతోంది. ప్రతి సంవత్సరం చైనాకు చెందిన వేలమందికి సింగపూర్ శిక్షణనిస్తోంది. ఏపీతో సింగపూర్ చేసుకున్న ఒప్పందంతో... నైపుణ్యాభివృద్ధి, కెపాసిటీ బిల్డింగ్‌లో మొత్తం దేశానికే ఆంధ్రప్రదేశ్ గేట్‌వేగా మారుతుంది." అని తెలిపారు.

నిపుణులైన మానవ వనరుల్ని తయారుచేస్తాం

"సింగపూర్, చంద్రబాబు పాత మిత్రులు. ఆయనకు స్పష్టమైన విజన్ ఉంది. ఏపీలో పెట్టుబడులు పెట్టేలా మా కంపెనీలను ప్రోత్సహించడంతో పాటు, వారితో కలసి ఒక ఫ్రేమ్‌వర్క్‌ని రూపొందిస్తాం. మేం ప్రత్యేకంగా దృష్టిపెట్టిన ప్రాంతాల్లో ఆంధ్రప్రదేశ్ ఒకటి. మేం చంద్రబాబును, ఆయన మమ్మల్ని అర్థం చేసుకున్నారు. ప్రభుత్వోద్యోగులకు శిక్షణ ఇవ్వడాన్ని 30 ఏళ్ల క్రితం ప్రారంభించాం. వేలమందికి శిక్షణ ఇచ్చాం. ఇప్పుడు ఆంధ్రప్రదేశ్ ఉద్యోగులకు శిక్షణ ఇస్తాం. ఆంధ్రప్రదేశ్‌కి చెందిన నిపుణులు అమెరికా, సింగపూర్ సహా వివిధ దేశాల అభివృద్ధికి తోడ్పడుతున్నారు. వారు సొంత రాష్ట్రం అభివృద్ధికి తోడ్పడేలా చేయాలి. ఆ దిశగా 'హ్యూమన్ కేపిటల్'ని సిద్ధం చేసేందుకు ఈ ఒప్పందం దోహదం చేస్తుంది."

– షణ్ముగం, సింగపూర్ మంత్రి

రెండో అవకాశం ఇచ్చినందుకు కృతజ్ఞతలు

"ఆంధ్రప్రదేశ్-సింగపూర్ మైత్రికి ఇది 2.0 వర్షన్. ఇది ఇంకా బలమైంది. సింగపూర్‌తో కలసి పనిచేసేందుకు మాకు రెండో అవకాశం ఇచ్చినందుకు కృతజ్ఞతలు. ఇదంతా షణ్ముగం వల్లే సాధ్యమైంది. సింగపూర్, ఏపీ కలిసి ప్రయాణం చేయడం ఉభయులకూ ప్రయోజనకరం"

– నారా లోకేశ్, మంత్రి

ఏపీలో విస్తృత అవకాశాలు

"ఆంధ్రప్రదేశ్‌లో, అమరావతి ప్రాజెక్టులో పెట్టుబడులకు విస్తృత అవకాశాలున్నాయి. ఇప్పుడు చేసుకున్న ఒప్పందం ఉభయులకూ ప్రయోజనకరం. సుస్థిరమైన భౌతిక, సామాజిక, ఆర్థిక పరిస్థితులు ఏర్పడేందుకు ఇది దోహదం చేస్తుంది."

– గాన్ సో హాంగ్, సింగపూర్ మంత్రి

సింగపూర్‌కి ఏడు రోజులూ విమాన సర్వీసులు

"ముఖ్యమంత్రి జులై 30న సింగపూర్ వెళ్లారు. విజయవాడ-సింగపూర్ మధ్య త్వరలో విమాన సర్వీసు ప్రారంభిస్తామని చెప్పారు. శనివారం నుంచి సర్వీసు మొదలవుతోంది. ప్రస్తుతం వారానికి మూడుసార్లు నడుస్తోంది. డిమాండ్ పెరిగితే విమానయాన సంస్థలపై ఒత్తిడి తెచ్చి ఏడు రోజులూ నడిపేలా చేస్తాం."

– రామ్మోహన్‌నాయుడు, కేంద్ర మంత్రి

ముగ్గురు కమిషనర్లు, 43 మంది ఉద్యోగులపై చర్యలు

ప్రొద్దుటూరు మున్సిపాలిటీలో అక్రమాలపై ప్రభుత్వం ఉత్తర్వులు

ప్రొద్దుటూరు పట్టణం, న్యూస్‌టుడే: వైకాపా హయాంలో అక్రమాలకు పాల్పడిన ముగ్గురు పూర్వ పురపాలక కమిషనర్లు, వివిధ విభాగాల్లోని 43 మంది అధికారులపై అభియోగాలు నమోదు చేసి చర్యలు తీసుకుంటూ పురపాలక పట్టణ అభివృద్ధి శాఖ కమిషనర్ శుక్రవారం వేర్వేరుగా 63 ఉత్తర్వులు జారీచేశారు. 2019-24 మధ్య వైకాపా హయాంలో వైఎస్సార్ కడప జిల్లా ప్రొద్దుటూరు పురపాలక సంఘం కమిషనర్లు నిబంధనలకు విరుద్ధంగా భవనాలకు అనుమతులు ఇచ్చారు. కొర్రపాడు రోడ్డులో ప్రొద్దుటూరు మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి ఉచిత అన్నదాన కేంద్రానికి స్థలం కేటాయింపులో అక్రమాలకు పాల్పడినట్లు అధికారులు గుర్తించారు. వీటితో పాటు మరిన్నింటిపై ప్రస్తుత ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి ఫిర్యాదు మేరకు ప్రభుత్వం విచారణ కమిటీని నియమించింది. పరిశీలించిన బృందం ప్రభుత్వానికి సిఫారసులు పంపింది. ఈ మేరకు కమిషనర్లుగా పనిచేసిన చంద్రమౌళీశ్వరరెడ్డి, రాధా, వెంకటరమణయ్య, పట్టణ ప్రణాళిక విభాగం సహాయక కమిషనర్ మునిరత్నంతో పాటు ఇద్దరు విశ్రాంత అధికారులు, ముగ్గురు ఏఈలు, ఇద్దరు ఎకౌంట్ సెక్షన్ సిబ్బంది, 24 మంది సచివాలయ వార్డు కార్యదర్శులు, నలుగురు సీనియర్ అసిస్టెంట్లపై చర్యలు తీసుకుంటూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.



ఒప్పందాల వెల్లువ

మంత్రి లోకేశ్ సమక్షంలో రూ.27,909 కోట్ల మేర పెట్టుబడులు పెట్టేందుకు 17 ఎలక్ట్రానిక్ కంపెనీలతో ఒప్పందాలు కుదిరాయి. ఈ సందర్భంగా అధికారులు, సంస్థల ప్రతినిధులు ఒప్పంద పత్రాలు మార్చుకున్నారు.



రాష్ట్రం ఆర్థికంగా నిలదొక్కుకుంటోంది

• మంత్రి పయ్యావుల కేశవ్



విశాఖపట్నం(కార్పొరేషన్), న్యూస్‌టుడే: ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొన్న రాష్ట్రం, ముఖ్యమంత్రి చంద్రబాబు కృషితో ఇప్పుడిప్పుడే నిలదొక్కుకుంటోందని ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ అన్నారు. శుక్రవారం విశాఖపట్నం నోవోటెల్ హోటల్‌లో ఆర్థికశాఖ ఆధ్వర్యంలో 'ఆంధ్రప్రదేశ్ రీఇమేజినింగ్ పబ్లిక్ ఫైనాన్స్' పేరిట సదస్సు నిర్వహించారు. మంత్రి మాట్లాడుతూ 'ఏపీ పునర్నిర్మాణానికి చర్యలు చేపట్టి, పెట్టుబడిదారుల్లో నమ్మకం పెంచేందుకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తోంది. స్వర్ణాంధ్ర-2047 లక్ష్యసాధన వైపు అడుగులు వేస్తూ, 2.4 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థను సాధించేలా ముందుకెళ్తున్నాం. పారిశ్రామిక రంగాన్ని మరింత బలోపేతం చేస్తున్నాం. టెక్స్‌టైల్స్, అపెరల్, ఎలక్ట్రానిక్స్, ఐటీ, గ్లోబల్ కెపాసిటీ కేంద్రాలకు ప్రాధాన్యం ఇస్తున్నాం. 2030 నాటికి ప్రతి కుటుంబంలో ఓ వ్యాపారవేత్త ఉండేలా ప్రణాళికలు అమలు చేస్తున్నాం' అని పేర్కొన్నారు. అనంతరం కార్యక్రమంలో పాల్గొన్న రాష్ట్ర అధికారులు, దేశ, విదేశీ ప్రతినిధులు పలు అంశాలపై తమ అభిప్రాయాలు వెల్లడించారు. ఆ వివరాలు..

★ రాష్ట్రంలో నాలుగు పోర్టులు నిర్మాణంలో ఉన్నాయని, మూలపేట, మచిలీపట్నం, రామాయపట్నం త్వరలోనే వినియోగంలోకి వస్తాయని రోడ్లు, రహదారులు, భవనాల శాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి ఎంటీ కృష్ణబాబు తెలిపారు. వాటిని వినియోగించుకుంటూ రవాణా రంగంలో పీపీపీ (ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యం) విధానంలో పలు ప్రాజెక్టులకు పెట్టుబడులు పెట్టాలని కోరారు. ఆయా అంశాలపై హడ్కో సీఎండీ సంజయ్, హసన్ మంగుళూరు రైల్ డెవలప్‌మెంట్ కంపెనీ సీఈఓ గీతా మహాపాత్ర, జాతీయ రహదారుల సంస్థ ఫైనాన్స్ మెంబర్ రాజేంద్రకుమార్, ఐఐఎఫ్ఎల్ ప్రాజెక్ట్స్ సీఈఓ ఎంకే.కాంత్ చర్చలు జరిపి, అభిప్రాయాలు వెల్లడించారు.

★ రాష్ట్రంలోని మునిసిపాలిటీలు, కార్పొరేషన్లలో వరద నీటి కాలువలు, భూగర్భ మురుగునీటి వ్యవస్థ, నీటి సరఫరా ప్రాజెక్టులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆర్థికంగా సహకరిస్తున్నా... ప్రైవేటు పెట్టుబడులు అవసరమని మున్సిపల్ పరిపాలన, పట్టణాభివృద్ధిశాఖ ముఖ్య కార్యదర్శి సురేష్‌కుమార్ అన్నారు. మౌలిక వసతుల కల్పనకు రూ.66,523 కోట్ల నిధులు అవసరమవుతాయని, విశాఖలో రూ.556 కోట్లతో ఇటీవలే నీటి సరఫరా ప్రాజెక్టుకు కేంద్రం అనుమతి ఇచ్చిందన్నారు. ఆయా ప్రాజెక్టుల్లో భాగస్వాములు కావాలని పెట్టుబడిదారులను కోరారు. అనంతరం బ్యాంక్ ఆఫ్ బరోడా, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా చేపడుతున్న పలు కార్యక్రమాలను వివరించారు.

★ ఇన్నోవేటివ్ ఫైనాన్సింగ్ మోడల్స్. డిజైనింగ్ ఎఫెక్టివ్ పబ్లిక్ ఫైనాన్స్ స్ట్రాటజీస్‌పై నేషనల్ ఇండస్ట్రియల్ కారిడార్ డెవలప్‌మెంట్ సీఈఓ, ఎండీ రజత్‌కుమార్ సైనీ, ఎంఏయూడీ కార్యదర్శి సురేష్‌కుమార్, ఈఈఎస్ఎల్ సీఈఓ అఖిలేష్ కుమార్ దీక్షిత్, ఏఐఐబీ బ్యాంకు పబ్లిక్ సెక్టార్ క్లయింట్స్ ప్రతినిధి ఏ.పిజార్రో, జపాన్ బ్యాంక్ ఫర్ ఇంటర్నేషనల్ కో-ఆపరేషన్ ప్రతినిధి కురొకిసొట, ఏడీబీ రీజనల్ లీడ్ ఎకనమిస్ట్ రాణా హసన్, బ్యాంక్ ఆఫ్ బరోడా జనరల్ మేనేజర్ రితేష్‌కుమార్ చర్చించారు.

★ 'క్రెడిట్ వర్తీనెస్ అండ్ ఎసెట్ మోనిటైజేషన్ త్రూ ఫైనాన్షియల్ ఇన్నోవేషన్' అనే అంశంపై మిరాయ్ ఎసెట్ మేనేజ్‌మెంట్ వైస్ ఛైర్మన్ అండ్ సీఈఓ ఆనంద్ మహంతి, ఎక్యూట్ రేటింగ్స్ అండ్ రీసెర్చ్ లిమిటెడ్ హెడ్ హేతల్ కోటక్, ఇండియా రేటింగ్స్ గ్రూప్ చీఫ్ ఎకనమిస్ట్ దేవేంద్ర పంత్, వ్యూ ట్రేడ్ ఐఎఫ్ఎస్‌సీ సీఈఓ రోనిత్‌కర్ ప్రసంగించారు.

★ కేరళలో పెట్టుబడుల కోసం ఎన్ఆర్ఐలను సంప్రదించగా.. రూ.1200 కోట్లు సమకూరాయని కేరళ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఫండ్ మేనేజ్‌మెంట్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ కె.ఇలంగోవన్ తెలిపారు. ఏపీలో నిధులు సమకూర్చుకోవడానికి అనేక అవకాశాలు ఉన్నాయని పేర్కొన్నారు.

★ పర్యాటకంతోనే అనేక పెట్టుబడులు రానున్నాయని, భవిష్యత్తు అంతా పర్యాటక రంగానిదే అని పర్యాటక శాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి అజయ్‌జైన్ అన్నారు. విశాఖపట్నం, తిరుపతిలో రూ.500 కోట్లతో పర్యాటక రంగాన్ని అభివృద్ధి చేయడానికి కేంద్రం ముందుకొచ్చిందని, ప్రైవేటు భాగస్వామ్యం కలిసొస్తే మరింత ప్రయోజనం ఉంటుందన్నారు. అనంతరం 'ఫైనాన్సింగ్ ద ఫ్యూచర్ ఆఫ్ టూరిజం, కల్చర్, హెరిటేజ్ అండ్ సస్టెయినబుల్ గ్రోత్' అనే అంశంపై చర్చ నిర్వహించగా.... ఏపీ పర్యాటక అభివృద్ధి సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ఆమ్రపాలి, ఎట్మాస్ఫియర్ హోటల్స్ అండ్ రిసార్ట్స్ (శ్రీలంక, భూటాన్, నేపాల్) మేనేజింగ్ డైరెక్టర్ ఎస్.మొహాపాత్ర, సైవిన్ ప్రతినిధి సి.శ్రీనివాస్ మాట్లాడారు.



విశాఖపట్నంలో సీఐఐ భాగస్వామ్య సదస్సులో పాల్గొన్న వివిధ దేశాల మంత్రులు, పారిశ్రామికవేత్తలు, ముఖ్య అతిథులు

ప్రభుత్వ దృష్టి కోణం

వివరించేలా ఏపీ పెవిలియన్!

• సర్కారు సేవల్లో ఏఐ వినియోగంపై ఆకట్టుకున్న ప్రదర్శనలు
• ప్రత్యేకంగా ఏపీ సీఆర్‌డీఏ, భోగాపురం ఏరోసిటీల నమూనాలు

ఈనాడు, విశాఖపట్నం: విశాఖలో జరుగుతున్న సీఐఐ భాగస్వామ్య సదస్సులో ఏపీ పెవిలియన్ హాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. రాష్ట్ర ప్రభుత్వ సేవల్లో కృత్రిమ మేధ(ఏఐ) వినియోగం, సాంకేతిక పరిజ్ఞానంతో అందిస్తున్న సేవలను వివరించేలా చిట్టి రోబోలు సందడి చేశాయి. భవిష్యత్తు ఏపీని వివరించేలా ఏర్పాటు చేసిన నమూనాలు భళా అనిపించాయి. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కియోస్కులు విజ్ఞానదాయకంగా నిలిచాయి. ముఖ్యంగా పర్యాటకశాఖ ఆధ్వర్యంలో భారీ తెరలతో పది అడుగుల ఎత్తులో నిర్మించిన టవర్ చూపరులను కట్టిపడేసింది. దానిపై ప్రముఖ పర్యాటక ప్రాంతాల దృశ్యాలు, రాష్ట్రంలో చేపడుతున్న డ్రోన్ సిటీ, ఎలక్ట్రానిక్స్ సిటీ, క్వాంటమ్ వ్యాలీ నిర్మాణాల వివరాలు ప్రదర్శించారు.

రోబోలతో..

ఐటీ, కమ్యూనికేషన్‌శాఖ ఆధ్వర్యంలో రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్, వాటిల్లో అందిస్తున్న సేవలు, స్టార్టప్‌ల అంశాలను ఓ రోబో వివరిస్తూ అక్కడికొచ్చిన వారిని ఆకట్టుకుంది. అలాగే జీసీసీ ఎక్స్‌పీరియన్స్ సెంటర్లమీద వివరించేందుకు రెండు రోబోలు అటూ ఇటూ తిరుగుతూ పలకరించాయి.

ప్రత్యేకంగా ఏపీఐఐసీ వేదిక..

ఏపీఐఐసీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వేదికలో 'భవిష్యత్తు ఏపీలోకి అడుగు పెడదాం' అని తెరలు ఏర్పాటు చేసి వాటి ముందు కాళ్ల అడుగుల గుర్తులు ఉంచారు. సందర్శకులు వాటి మీద నిలబడితే 2047 నాటికి ఏపీ ఎలా అభివృద్ధి చెందుతుందో తెలిపే వివరాలు తెరమీద కనిపించేలా ఏర్పాట్లు చేశారు. ఈ సదస్సులో జరిగిన ఒప్పందాలు, పెట్టుబడుల వివరాలు కనిపించేలా చేశారు.

భారీ నమూనాలతో..: జీఎంఆర్ ఆధ్వర్యంలో నిర్మించనున్న ఏరోసిటీ, ఏవియేషన్ పార్క్ వివరాలతో భవిష్యత్తు భోగాపురం ప్రాంత అభివృద్ధిని తెలియజేసేలా భారీ నమూనా ఏర్పాటు చేశారు. విమానాశ్రయం పరిసరాల్లో ఎక్కడెక్కడ ఏమొస్తాయో కళ్లకు కట్టారు. ఏపీ సీఆర్‌డీఏ ఆధ్వర్యంలో భవిష్యత్తు అమరావతి ఎలా ఉండనుందో చూపెట్టారు. స్పోర్ట్స్ సిటీ, ఫైనాన్స్ సిటీ, ఏఐ వర్సిటీ, క్వాంటమ్ వ్యాలీ ఎక్కడెక్కడ వస్తాయో చూపించారు. పలువురు విదేశీయులు అమరావతి నిర్మాణ నమూనాను ఆసక్తిగా గమనించారు.



ఏపీఐఐసీ వేదిక వద్ద 'భవిష్యత్తు ఆంధ్రప్రదేశ్' వివరాలు తెలుసుకుంటున్న అతిథులు

★ క్వాంటమ్ వ్యాలీ టవర్లను ప్రతిబింబించేలా మూడు అడుగుల ఎత్తులో నిర్మించిన నమూనా టవర్లు అలరించాయి. ఏఐ సాంకేతికతతో బిడ్ డాక్యుమెంట్ల తయారీ, పరిశీలన, రిమోట్ సెన్సింగ్ ద్వారా ఆక్రమణల గుర్తింపు, వరద ముప్పును ముందుగా గుర్తించడం వంటి సేవల్లో ఎలా వినియోగిస్తున్నామో తెరల మీద చూపించారు.

★ సమ్మిట్‌లో ఏర్పాటు చేసిన ప్రదర్శనలో రాష్ట్ర ప్రభుత్వానికి చెందిన స్టాళ్లను మాత్రమే ఏర్పాటు చేశారు. జీసీసీ, పర్యాటకశాఖ, హస్తకళ ప్రదర్శనలకు చోటు కల్పించారు. ముఖ్యంగా అమరావతికి సంబంధించి ప్రత్యేక స్టాల్‌ను తిలకించేందుకు సందర్శకులు పోటీపడ్డారు. క్యూఆర్ కోడ్ స్కానింగ్‌తో అమరావతి మీద క్విజ్ పోటీలు నిర్వహించి స్కోరింగ్ ఆధారంగా బహుమతులు అందజేశారు.



విశాఖపట్నంలో సీఐఐ భాగస్వామ్య సదస్సులో రిజిస్ట్రేషన్ కోసం వచ్చిన వివిధ సంస్థల ప్రతినిధులు ★ కళాకారుల తప్పెటగుళ్ల ప్రదర్శన ★ అరబ్ దేశాల ప్రతినిధులు ★ పెవిలియన్ వద్ద ఏర్పాటు చేసిన అమరావతి నమూనాను పరిశీలిస్తున్న మంత్రి లోకేశ్, కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు, వివిధ సంస్థల ప్రతినిధులు



జూబ్లీహిల్స్‌లో ఫలించిన ముఖ్యమంత్రి రేవంత్ వ్యూహం

సవాల్ స్వీకరించి.. గెలుపు వైపు నడిపించి

ఈనాడు, హైదరాబాద్: జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వ్యూహం ఫలించింది. కాంగ్రెస్‌కు భారీ ఆధిక్యం లభించింది. హోరాహోరీగా జరిగిన ఉప ఎన్నికలో నిత్యం అప్రమత్తంగా ఉంటూ మంత్రులను, పార్టీ నాయకులను సిద్ధం చేస్తూ సవాల్‌గా తీసుకొని కాంగ్రెస్‌ను ఘన విజయం వైపు నడిపించారు. స్వయంగా పెద్ద ఎత్తున రోడ్‌షోలు నిర్వహించి ఉత్సాహం నింపారు. సాధారణ ఎన్నికల తర్వాత గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో రెండు స్థానాలకు ఉప ఎన్నికలు జరిగితే రెండింటినీ కాంగ్రెస్ హస్తగతం చేసుకొంది. ఈ ఉప ఎన్నిక ఫలితం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వాన్ని మరింత బలోపేతం చేస్తుందనే అభిప్రాయాన్ని కాంగ్రెస్ వర్గాలు వ్యక్తం చేస్తున్నాయి. అధికారంలోకి వచ్చి రెండేళ్లు పూర్తి కావస్తున్న సందర్భంగా వచ్చే నెలలో నిర్వహించనున్న ప్రజాపాలన విజయోత్సవాలకు ఈ ఉప ఎన్నిక ఫలితం మరింత ఉత్సాహాన్ని, ఊపును ఇవ్వనుంది. అభ్యర్థి ఎంపిక మొదలుకొని ప్రచార వ్యూహం వరకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అంతా తానై వ్యవహరించారు.


ప్రారంభం నుంచి పోలింగ్ రోజు వరకు..

2023 నవంబరులో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో గ్రేటర్ పరిధిలో కాంగ్రెస్‌కు ఒక్క స్థానం కూడా దక్కలేదు. జూబ్లీహిల్స్ నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసిన అజారుద్దీన్ 16 వేల ఓట్ల తేడాతో ఓడిపోయారు. ఇక్కడ భారాస నుంచి గెలుపొందిన మాగంటి గోపీనాథ్ మరణంతో ఉప ఎన్నిక రావడంతో, ఆయన సతీమణి సునీతను భారాస రంగంలోకి దించింది. ఆరునెల నుంచి గెలుపు కోసం భారాస వ్యూహాత్మకంగా పని చేయడం ప్రారంభించింది. ముందుగానే నాయకులను, కార్యకర్తలను రంగంలోకి దించింది. కాంగ్రెస్.. అభ్యర్థి ఎంపికకే చాలా సమయం తీసుకుంది. అజారుద్దీన్‌ను ఎమ్మెల్సీగా ఎంపిక చేసి నవీన్‌యాదవ్‌ను బరిలోకి దింపాలని నిర్ణయించినా, పోటీ ఎక్కువగా ఉండటంతో నామినేషన్ గడువు ముగుస్తుందనగా ప్రకటించింది. అప్పటికే ముగ్గురు మంత్రులకు నియోజకవర్గ బాధ్యతలు అప్పగించి కార్యక్రమాలు ప్రారంభించినా,

ఎన్నికల ప్రక్రియ ప్రారంభమైన తర్వాత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రత్యేక దృష్టి సారించారు. ఎప్పటికప్పుడు సర్వేలు చేయిస్తూ వ్యూహాత్మకంగా వ్యవహరించారు. ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కార్పొరేషన్ల ఛైర్మన్లను కూడా రంగంలోకి దించారు. మొత్తం పర్యవేక్షణను ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కకు, డివిజన్ల వారీగా మంత్రులకు బాధ్యతలు అప్పగించారు. బాధ్యతలు ఇవ్వడం వరకే పరిమితం కాకుండా, రోజువారీ పనితీరును అంచనా వేస్తూ లోటుపాట్లను వారి దృష్టికి తీసుకెళ్తూ అప్రమత్తం చేశారు. పోలింగ్‌కు వారం రోజుల ముందు బోరబండలో కొంత ఇబ్బందికర పరిస్థితి ఉందనే సమాచారం అందడంతో రహ్మత్‌నగర్ బాధ్యత చూస్తున్న రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డికి బోరబండ డివిజన్ అదనంగా అప్పగించారు. ఇలా ఎక్కడ ఎవరిని వినియోగించాలో, ఏ పని ఎవరికి అప్పగిస్తే ప్రయోజనం ఉంటుందో ఆ రకంగా వ్యవహరించారు. మంత్రులందరితో రెండుసార్లు ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఒక ఆదివారం లంచ్ మీటింగ్, ఇంకో ఆదివారం బ్రేక్‌ఫాస్ట్ సమావేశం పెట్టి ఎవరెవరు ఎలా పని చేస్తున్నారు.. ఎక్కడ వెనకబడి ఉన్నారో చెప్పడంతోపాటు ప్రతి ఒక్కరి పనితీరును అంచనా వేస్తున్నట్లు కూడా ముఖ్యమంత్రి చెప్పినట్లు తెలిసింది. డివిజన్ల వారీగా ఎంతెంత మెజార్టీ వస్తుందో మంత్రులను అడిగి తెలుసుకున్నారు. మొత్తం ఆధిక్యం 20 వేల వరకు ఉంటుందని వారు చెప్పగా.. చివరి వరకు ఇదే రీతిలో పని చేస్తే మరింత మెజార్టీ వస్తుందని చెప్పి ఆ దిశగా కసరత్తు చేయించినట్లు తెలిసింది. జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో మైనార్టీ ఓట్లు ఎక్కువగా ఉండగా, ఇందులో ఎక్కువ భాగం తమకే వస్తాయని కాంగ్రెస్ అంచనా వేసింది. అయినా మరింత దృష్టి కేంద్రీకరించాలని నిర్ణయించుకుని అజారుద్దీన్‌ను మంత్రివర్గంలోకి తీసుకున్నారు. అంతేకాకుండా వదిలిపెట్టకుండా చివరివరకు మైనార్టీలతో సహా అన్ని వర్గాలకు బాధ్యులను నియమించి పోలింగ్ బూత్‌లకు తీసుకొచ్చేవరకు జాగ్రత్తలు తీసుకున్నారు.

ప్రచారంలో ముందుండేలా...

ప్రచారంలో ఎక్కడా వెనకబడకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. స్వయంగా రంగంలోకి దిగి మూడు రోజులు భారీ రోడ్‌షోలు నిర్వహించి కార్నర్ మీటింగ్‌లలో మాట్లాడారు. కాంగ్రెస్ చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాల గురించి చెప్పారు. పదేళ్ల భారాస వైఫల్యాల గురించి మాట్లాడారు. భాజపాను వదిలిపెట్టలేదు. ప్రత్యేకించి కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి వివిధ ప్రాజెక్టులు రాకుండా అడ్డుకుంటున్నారని, కేటీఆర్ సూచనల మేరకు నడుచుకుంటున్నారంటూ తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. భాజపా.. భారాసకు సహకరిస్తోందని, లోక్‌సభ ఎన్నికల్లో చేసిన సాయానికి ప్రతిఫలంగా ఇప్పుడు అండదండలు అందిస్తోందంటూ విస్తృతంగా జనంలోకి తీసుకెళ్లే ప్రయత్నం చేశారు. ఈ ప్రచారం వల్లే భాజపా వెళ్లాల్సిన కొన్ని భారాస వ్యతిరేక ఓట్లు కూడా కాంగ్రెస్ వైపు మళ్లాయనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. జూబ్లీహిల్స్ పరిధిలో ఉన్న సినిమా కార్మికులతో సీఎం ప్రత్యేక సమావేశం పెట్టి వారి సమస్యల పరిష్కారానికి హామీ ఇచ్చారు. ఒక రోజు మీడియాతో చిట్‌చాట్, ఇంకో రోజు మీట్ ద ప్రెస్‌లో పాల్గొని జూబ్లీహిల్స్ ఎన్నిక కేంద్రంగానే మాట్లాడారు. ఇలా ఏ అవకాశాన్నీ వదలకుండా రేవంత్ రెడ్డి చేసిన ప్రత్యేక కృషి ఉప ఎన్నికలో కాంగ్రెస్ ఘన విజయానికి దోహదపడిందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.



పరస్పరం అభినందించుకుంటున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క. చిత్రంలో పొంగులేటి, ఉత్తమ్, వాకిటి శ్రీహరి, సీతక్క, మహేశ్‌కుమార్‌గౌడ్ తదితరులు

ప్రజలు, కార్యకర్తలు, సీఎం రేవంత్‌కు కృతజ్ఞతలు: నవీన్‌యాదవ్

జూబ్లీహిల్స్‌లో నన్ను గెలిపించిన ప్రజలు, కార్యకర్తలు, సీఎం రేవంత్‌కు కృతజ్ఞతలు. నన్ను ఓడించేందుకు రౌడీ అంటూ దుష్ప్రచారం చేశారు. కుటుంబసభ్యులపైనా ఆరోపణలు గుప్పించారు. నన్ను నమ్మి టికెట్ ఇచ్చిన కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే, అగ్రనేతలు సోనియాగాంధీ, రాహుల్‌గాంధీ, సీఎం రేవంత్‌రెడ్డిలకు ఎంతో రుణపడి ఉంటా. తమ్ముడిగా, అన్నగా భావించి ఓట్లు వేసిన ప్రజలకు, ప్రచారం చేసిన మంత్రులు, మద్దతు ప్రకటించిన మజ్లిస్ నేతలకు కృతజ్ఞతలు. ప్రజలను బెదిరించి ఓట్లు వేయించుకున్నారంటూ భారాస ఆరోపిస్తోంది. బెదిరిస్తే ఓట్లు వేసే కాలం పోయిందని వారు గుర్తించాలి. నిన్నటి వరకూ ఓటర్లు.. అటువైపు, ఇటువైపు ఉన్నారు. ఇకపై అందరూ మావాళ్లే.. కలిసి పనిచేద్దాం. నియోజకవర్గంలో జరగాల్సిన అభివృద్ధి పనులను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తా.



గజమాలతో నవీన్‌యాదవ్‌ను సన్మానిస్తున్న అభిమానులు

నవీన్‌యాదవ్‌కు ముఖ్యమంత్రి సన్మానం

ఈనాడు, హైదరాబాద్: జూబ్లీహిల్స్ ఉపఎన్నికలో గెలుపొందిన కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్‌ను సీఎం రేవంత్‌రెడ్డి, పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ మంత్రుల సమక్షంలో సన్మానించారు. జూబ్లీహిల్స్ పార్టీ కార్యాలయంలో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు ఉత్తమ్, పొంగులేటి, కోమటిరెడ్డి, సీతక్క, వివేక్, శ్రీహరి, పొన్నం, ఎంపీ అనిల్‌కుమార్ యాదవ్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ పాల్గొన్నారు.

మంత్రులకు అభినందనలు: ఫలితం వెలువడిన అనంతరం సీఎం రేవంత్‌రెడ్డి ఇంటి నుంచి బయలుదేరి జూబ్లీహిల్స్ పార్టీ కార్యాలయానికి వచ్చారు. అప్పటికే అక్కడికి చేరుకున్న ఉప ముఖ్యమంత్రి భట్టి, పలువురు మంత్రులు సీఎంకు అభినందనలు తెలపగా ఆయన సైతం ప్రచారంలో బాగా కష్టపడి పనిచేశారని వారిని ప్రశంసించారు.

భారాస పని అయిపోయినట్టే: మహేశ్‌కుమార్‌గౌడ్

నిజామాబాద్ అర్బన్, న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాలను చూసి జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో ప్రజలు కాంగ్రెస్‌కు పట్టం కట్టారని పీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేశ్‌కుమార్‌గౌడ్ అన్నారు. నిజామాబాద్‌లో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు షబ్బీర్ అలీ, సుదర్శన్‌రెడ్డితో కలిసి మాట్లాడారు. ఉప ఎన్నిక తీర్పుతో రాష్ట్రంలో భారాస పని అయిపోయినట్లేనని మహేశ్‌కుమార్ గౌడ్ వ్యాఖ్యానించారు. గత పార్లమెంటు ఎన్నికల్లో ఎదురైన అపజయం నుంచే భారాస పతనం మొదలైందన్నారు. బీసీ అభ్యర్థి నవీన్ విజయం వెనక సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులతోపాటు ప్రతి కార్యకర్త, నాయకుడి కృషి ఉందన్నారు. ఈ విజయం వారికి అంకితమని పేర్కొన్నారు. ప్రజాతీర్పును చూస్తే కాంగ్రెస్.. మరో పదేళ్లపాటు అధికారంలో ఉండటం తథ్యమన్నారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో వంద సీట్లు హస్తగతం చేసుకుంటామని ధీమా వ్యక్తం చేశారు. జూబ్లీహిల్స్ తీర్పే జీహెచ్ఎంసీ ఎన్నికల్లోనూ పునరావృతం అవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

హమ్మయ్య.. బతికిపోయాడు!

పట్టాల మధ్య పడుకొని ప్రాణాలు దక్కించుకున్న ప్రయాణికుడు

మహబూబాబాద్ జిల్లా కేసముద్రం రైల్వేస్టేషన్‌లో ఆగి ఉన్న గూడ్సు రైలు కింది నుంచి వెళ్లే క్రమంలో.. ఒక్కసారిగా అది కదలడంతో ఓ ప్రయాణికుడు పట్టాల మధ్యలో పడుకొని తన ప్రాణాలను కాపాడుకున్న సంఘటన శుక్రవారం చోటు చేసుకుంది. ఈ విషయం స్థానికంగా సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయింది. ప్రయాణికుల వివరాల ప్రకారం.. ఉదయం 10 గంటల సమయంలో రైల్వేస్టేషన్‌లోని రెండో లైనులో ఆదిలాబాద్ - తిరుపతి కృష్ణా ఎక్స్‌ప్రెస్ వస్తోంది. దాంట్లో ఎక్కేందుకు మూడో లైన్‌లో ఆగి ఉన్న గూడ్స్ కింద నుంచి వెళ్లేందుకు ఒక వ్యక్తి ప్రయత్నించారు. అదే సమయంలో రైలు కదలడంతో వెంటనే పట్టాల మధ్యన పడుకున్నారు. రైలు వెళ్లిపోయాక బయటకు వచ్చారు. ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మాణంలో జాప్యం అవుతుండడంతో ఇలా ఆగి ఉన్న రైళ్ల కింద నుంచి వెళ్లాల్సి వస్తుందని ప్రయాణికులు ఆరోపించారు. ఈ సంఘటనపై ఆర్పీఎఫ్ ఎస్సై శివను వివరణ కోరగా.. ప్రయాణికుడి వివరాల కోసం ఆరా తీస్తున్నట్లు తెలిపారు. —న్యూస్‌టుడే, కేసముద్రం,



రైలు వెళ్తుండగా పట్టాల మధ్య పడుకున్న ప్రయాణికుడు

హిందీ బెల్ట్‌పై ఎన్డీయే పట్టు నిలబెట్టుకుందిలా..

ఇంటర్నెట్ డెస్క్: హిందీ బెల్ట్ రాష్ట్రాలైన ఉత్తర్ ప్రదేశ్, మధ్యప్రదేశ్, బిహార్, రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్, ఝార్ఖండ్, హరియాణా, హిమాచల్ ప్రదేశ్, ఉత్తరాఖండ్‌లు కేంద్రంలో ఎన్డీయే ప్రభుత్వానికి ఇరుసులాంటివి. దాదాపు 200కుపైగా ఎంపీ సీట్లున్న ఈ బెల్ట్‌లోని రెండో పెద్ద రాష్ట్రం బిహార్ (40). ఈ బెల్ట్‌లో బలం తగ్గేకొద్దీ కేంద్రంలో అధికారంపై పట్టు సడలుతుందన్నది వాస్తవం. అందుకే భాజపా ఈ రాష్ట్రాలను సీరియస్‌గా తీసుకుంటుంది. ఇక్కడ ముఖ్యమంత్రుల ఎంపికలోనూ పలు జాగ్రత్తలు తీసుకుంటుంది. ఈ క్రమంలోనే ఎన్ని అభిప్రాయ భేదాలున్నా.. సుశాసన్ బాబుగా పేరున్న నీతీశ్‌తో జట్టుకట్టి ముందుకు సాగుతోంది.

2024 లోక్‌సభ ఎన్నికల్లో ఎన్డీయే అధికారం నిలబెట్టుకోవడంలో జేడీయూదే అత్యంత కీలక పాత్ర. ఈ నేపథ్యంలో బిహార్ ఎన్నికల ఫలితాల్లో తేడాలు వస్తే.. కచ్చితంగా అది కేంద్ర ప్రభుత్వ సుస్థిరతపై ప్రతికూల ప్రభావం చూపించే అవకాశాలున్నాయి. దీంతో ప్రధాని మోదీ నేతృత్వంలోని ఎన్డీయే సర్కారు బడ్జెట్ నుంచే ఈ రాష్ట్రంపై దృష్టి పెట్టి కీలక కేటాయింపులు చేసింది. ఆ రాష్ట్రానికి ఎంతో కీలకమైన మఖానా బోర్డు ఏర్పాటుకు హామీ ఇచ్చింది. దేశంలోని 90శాతం మఖానా ఉత్పత్తి ఇక్కడే జరుగుతుంది. దర్భంగా, మధుబని, సమస్తీపుర్, సీతామఢి, పూర్ణియా, కతీహార్ జిల్లాల్లో దీనిపై ఆధారపడి జీవించేవారు ఎక్కువ. మరోవైపు ఆహార ప్రాసెసింగ్ కోసం నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫుడ్ టెక్నాలజీని కేటాయించింది. ఐఐటీల విస్తరణ, సరికొత్త విమానాశ్రయాల నిర్మాణం వంటివి చేపడతామని హామీ ఇచ్చింది. ఈబీసీలకు రూ.10 లక్షల చేయూత, మహిళలు వ్యాపారాలు చేయడానికి రూ.2 లక్షల సాయం, రైతులకు రూ.9వేల పెట్టుబడి సాయం వంటివి ప్రజల్లోకి వెళ్లాయి. బిహార్‌లో రాహుల్-తేజస్వీ జోడీని ఓడించడం ఎన్డీయేకు చాలా కీలకం. భాజపా వ్యతిరేక కూటమి బలోపేతం కాకుండా చేయడంలో ఈ విజయం కీలక పాత్ర పోషించనుంది. ఇక 2026లో పశ్చిమ బెంగాల్‌లో, 2027లో ఉత్తర్ ప్రదేశ్‌లో ఎన్నికలు జరగనున్నాయి. ముఖ్యంగా పార్లమెంటు ఎన్నికల్లో దెబ్బతిని ఉండటంతో... అక్కడ రాహుల్-అఖిలేశ్ జోడీని ఎదుర్కోవడానికి బిహార్ విజయం పార్టీ శ్రేణుల్లో స్థైర్యాన్ని పెంచనుంది.

జమ్మూకశ్మీర్ ఉప ఎన్నికల్లో ఎన్‌సీకి షాక్

- రెండు స్థానాల్లోనూ ఆ పార్టీ ఓటమి
- నగ్రోటా సీటును నెగ్గిన భాజపా
- బడ్గాంలో పీడీపీ గెలుపు
- రాజస్థాన్‌లో కాంగ్రెస్ విజయం

దిల్లీ: బిహార్ అసెంబ్లీ ఎన్నికలతోపాటు.. దేశవ్యాప్తంగా ఉప ఎన్నికలు జరిగిన 8 నియోజకవర్గాల్లో అధికార పార్టీలు నాలుగు స్థానాల్లో ఓడిపోయాయి. భాజపా పాలనలో ఉన్న రాజస్థాన్‌లో అంతా నియోజకవర్గంలో కాంగ్రెస్ విజయం సాధించగా, జమ్మూకశ్మీర్‌లో అధికార నేషనల్ కాన్ఫరెన్స్ (ఎన్‌సీ) పోటీ చేసిన రెండు సీట్లలోనూ పరాజయం పాలైంది. ఎన్‌సీ కంచుకోటగా భావించే బడ్గాం సీటులో పీపుల్స్ డెమొక్రటిక్ పార్టీ (పీడీపీ) పాగా వేసింది.

■ రాజస్థాన్‌లోని అంతా స్థానానికి జరిగిన ఉప ఎన్నికలో కాంగ్రెస్ విజయం సాధించింది. ఆ పార్టీ అభ్యర్థి ప్రమోద్ జైన్ 15,612 ఓట్ల మెజార్టీతో భాజపా అభ్యర్థి మోర్పాల్ సుమన్‌పై గెలుపొందారు.

■ ఎన్‌సీ కంచుకోట బడ్గాం నియోజకవర్గంలో పీడీపీ తమ జెండాను రెపరెపలాడించింది. ఆ పార్టీ అభ్యర్థి అగా సయ్యద్ ముంతాజిర్ మెహదీ 4,478 ఓట్ల మెజార్టీతో ఎన్‌సీకు చెందిన అగా సయ్యద్ మహమూద్ అల్-మోసావిపై గెలుపొందారు. ఈ నియోజకవర్గంలో ఎన్‌సీకి ఇదే తొలి ఓటమి కావడం గమనార్హం. బడ్గాం స్థానాన్ని జమ్మూకశ్మీర్ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా ఖాళీ చేయడంతో ఇక్కడ ఉప ఎన్నిక నిర్వహించారు.

■ పంజాబ్‌లోని తరన్‌తారన్ స్థానాన్ని అధికార ఆమ్‌ఆద్మీ పార్టీ (ఆప్) నిలబెట్టుకుంది. ఆ పార్టీ అభ్యర్థి హర్మీత్ సింగ్ సంధు 12,091 ఓట్ల మెజార్టీతో శిరోమణి అకాలీదళ్ అభ్యర్థి సుఖ్వీందర్ కౌర్‌పై గెలుపొందారు. ఆప్ ఎమ్మెల్యే డాక్టర్ కశ్మీర్ సింగ్ సోహాల్ మరణంతో ఇక్కడ ఉప ఎన్నిక జరిగింది.



జమ్మూకశ్మీర్‌లోని నగ్రోటాలో భాజపా అభ్యర్థి దేవ్‌యానీ రాణా 24,647 ఓట్ల ఆధిక్యంతో జమ్మూ-కశ్మీర్ నేషనల్ పాంథర్స్ పార్టీ అభ్యర్థి హర్ష్ దేవ్ సింగ్‌పై గెలుపొందారు. ఎమ్మెల్యే దేవేందర్ సింగ్ రాణా మరణించడంతో ఇక్కడ ఉప ఎన్నిక నిర్వహించారు. దేవేందర్ సింగ్ రాణా కుమార్తె దేవ్‌యానీ రాణా.

■ మిజోరంలోని డంపా స్థానంలో ప్రతిపక్ష మిజోరాం నేషనల్ ఫ్రంట్ (ఎంఎన్ఎఫ్) విజయం సాధించింది. ఎంఎన్ఎఫ్ అభ్యర్థి లాల్తాంగ్లియానా 562 ఓట్ల తేడాతో మిజోరాం పీపుల్స్ మూవ్‌మెంట్ పార్టీ అభ్యర్థి వన్లాల్‌సైలోవాపై గెలుపొందారు. ఎమ్మెల్యే లాల్రింట్లుంగా సైలా మరణించడంతో ఇక్కడ ఉప ఎన్నిక జరిగింది.

■ తెలంగాణాలో అత్యంత ఉత్కంఠ రేపిన జూబ్లీహిల్స్ ఉపఎన్నికలో కాంగ్రెస్ ఘన విజయం సాధించింది. ఆ పార్టీ అభ్యర్థి నవీన్ యాదవ్ విజయం సాధించారు.

■ ఝార్ఖండ్‌లోని ఘాట్‌సిలా స్థానంలో ఝార్ఖండ్ ముక్తి మోర్చా (జేఎంఎం) అభ్యర్థి సోమేష్ చంద్ర సోరెన్ 38,500కు పైగా ఓట్లతో ఝార్ఖండ్ లోక్‌తాంత్రిక్ క్రాంతికారి మోర్చా అభ్యర్థి రామ్‌దాస్ ముర్ముపై గెలుపొందారు. ఎమ్మెల్యే రామ్‌దాస్ సోరెన్ మరణంతో ఇక్కడ ఉప ఎన్నిక జరిగింది.

■ ఒడిశాలోని నువాపడా ఉప ఎన్నికలో భాజపా అభ్యర్థి జయడోల్కియా 83,748 ఓట్లతో కాంగ్రెస్ అభ్యర్థి ఘసిరామ్ మాఝిపై భారీ విజయం సాధించారు. ఎమ్మెల్యే రాజేంద్ర డోల్కియా మరణంతో నువాపడాలో ఉప ఎన్నిక అనివార్యమైంది.

నెహ్రూ సేవలను మోదీ కించపరుస్తున్నారు

కాంగ్రెస్

దిల్లీ: భారత్‌ను ఆధునికంగా తీర్చిదిద్దేందుకు దేశ తొలి ప్రధానమంత్రి జవహర్ లాల్ నెహ్రూ చేసిన అపరిమితమైన సేవల్ని భారత ప్రధాని మోదీ తిరస్కరించి, కించపరిచి, వక్రీకరిస్తున్నారని కాంగ్రెస్ పార్టీ ఆరోపించింది. వారసత్వంపై జరుగుతోన్న ఈ దాడి నుంచి నెహ్రూ బయటపడతారని పేర్కొంది. దేశ 20వ శతాబ్ద చరిత్ర నుంచి ఆయన్ను తొలగించేందుకు తీవ్రంగా కృషి చేస్తోన్న వ్యక్తుల్లోని అభద్రతాభావం వారి చర్యలతో బయటపడుతోందని విమర్శించింది. జవహర్ లాల్ నెహ్రూ 136వ జయంతి సందర్భంగా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, పార్టీ అగ్రనాయకురాలు సోనియా గాంధీ శుక్రవారం నివాళులర్పించారు. శాంతివనంలోని నెహ్రూ మెమోరియల్ వద్ద అంజలి ఘటించారు. ప్రధాన మంత్రి మోదీ, కాంగ్రెస్ అగ్రనాయకుడు రాహుల్‌గాంధీ, కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్‌లు 'ఎక్స్' వేదికగా నెహ్రూకు నివాళులర్పించారు.

బిర్సా ముండా 150వ జయంతి.. సీఎం యోగి నివాళి

లఖ్‌నవూ: స్వాతంత్ర్య సమర యోధుడు బిర్సా ముండా 150వ జయంతి సందర్భంగా ఉత్తర్‌ప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ ఆయనకు నివాళులర్పించారు. ప్రజల్లో గౌరవం, సమానత్వం, స్వీయగౌరవానికి ఆయన స్ఫూర్తి అని 'ఎక్స్' వేదికగా కొనియాడారు.

కీవ్‌పై రష్యా భారీ దాడి

నలుగురి మృతి

కీవ్: ఉక్రెయిన్ రాజధాని కీవ్ సహా వివిధ ప్రాంతాలపై శుక్రవారం ఉదయం రష్యా భారీ స్థాయిలో విరుచుకుపడింది. ఈ దాడుల్లో నలుగురు పౌరులు ప్రాణాలు కోల్పోగా, 27 మందికి గాయాలయ్యాయి. దేశవ్యాప్తంగా రష్యా 430 డ్రోన్లు, 18 క్షిపణులు ప్రయోగించిందని ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ తెలిపారు. ఓ ఇస్కందర్ క్షిపణి శిథిలాలకు అజర్‌బైజాన్ రాయబారి కార్యాలయానికి స్వల్ప నష్టం కలిగిందని పేర్కొన్నారు.



రష్యా దాడులతో కీవ్‌లో ఎగిసిపడుతున్న మంటలు

రాజకీయ తోటలో రాగాల కోయిల



బిహార్ అసెంబ్లీ ఎన్నికల్లో సంచలన విజయం సాధించిన గాయని మైథిలి

ఇంటర్నెట్‌డెస్క్: ఆధ్యాత్మిక-జానపద గీతాలతో సోషల్ మీడియాలో పేరుగాంచిన గాయని మైథిలీ ఠాకుర్ బిహార్ శాసనసభ ఎన్నికల్లో విజయం సాధించి సంచలనం సృష్టించారు. 25 ఏళ్ల వయసులోనే అసెంబ్లీకి ఎన్నికైన అతిపిన్న వయస్కురాలిగా రికార్డు నెలకొల్పారు. అలీనగర్ నియోజకవర్గం నుంచి భాజపా తరఫున బరిలోకి దిగిన ఆమె స్థానిక ఆర్జేడీ దిగ్గజ నేత వినోద్ మిశ్రను సుమారు 11 వేల ఓట్ల తేడాతో మట్టికరిపించారు.

17 సార్లు ఇల్లు మారాల్సి వచ్చింది..

మైథిలి 2000 జులై 25న మధుబనిలోని బేనిపట్టిలో జన్మించింది. ఆమె తండ్రి రమేశ్ ఠాకుర్ శాస్త్రీయ సంగీత విద్వాంసుడు, టీచర్. తల్లి భారతీ గృహిణి. రమేశ్ చిన్నప్పటి నుంచే కుమార్తెకు శాస్త్రీయ సంగీతం నేర్పించారు. ఆమె సోదరులు అయాచీ, రిషబ్ కూడా సంగీతం నేర్చుకొన్నారు. ఆమె తన జానపద పాటలతో సోషల్ మీడియాలో భారీగా అభిమానులను సంపాదించుకొంది. ఇండియన్ ఐడియల్‌లో పాల్గొంది. ఆ తర్వాత ఐ జీనియస్ యంగ్ సింగింగ్ స్టార్‌లో విజేతగా నిలిచింది. రైజింగ్ సింగర్ పోటీల్లో రన్నరప్‌గా నిలిచింది. తమ పిల్లల సంగీత సాధన ఇతరులకు ఇబ్బందిగా మారుతుండటంతో 17 సార్లు అద్దె ఇళ్లు మారినట్లు మైథిలి తల్లి భారతీ ఓ సందర్భంలో మీడియాకు వెల్లడించారు. 2017లో ఎట్టకేలకు ఆ కుటుంబం సొంత ఇల్లు కొనుగోలు చేసింది. ఆ తర్వాత 2020లో ఓ అపార్ట్‌మెంట్‌లోకి మారారు. 2023లో ఎన్నికల కమిషన్ మథిలిని మధుబనికి బ్రాండ్ అంబాసిడర్‌గా ఎంపిక చేసింది. ఆ తర్వాత సంవత్సరమే ప్రధాని మోదీ నుంచి ఆమె అవార్డు అందుకొన్నారు.

2.5 కోట్ల మంది ఫాలోవర్లు


ఇన్‌స్టా, యూట్యూబ్‌లో కలిపి ఆమెకు 1.1 కోట్ల మంది ఫాలోవర్లు ఉన్నారు. ఫేస్‌బుక్‌లో 1.4 కోట్ల మంది ఆమెను అనుసరిస్తున్నారు. 2024లో శబరి మీద మైథిలి పాడిన పాట ప్రధాని మోదీని ఆకర్షించింది. ఈ విషయంలో ఆమె మోదీ నుంచి ప్రశంసలు అందుకున్నారు. ఆ నేపథ్యమే ఆమె రాజకీయాల్లోకి రావడానికి హేతువైంది. భాజపాలో చేరి అనూహ్యంగా టికెట్ సాధించిన మైథిలి అదే రీతిలో విజయ దుందుభి మోగించి ఔరా అనిపించారు.

ఈ ఫలితాలు ఎదురుదెబ్బే: వామపక్షాలు

దిల్లీ: బిహార్ ఫలితాలు మహాగఠ్ బంధన్‌కు పెద్ద ఎదురుదెబ్బ అని వామపక్షాలు పేర్కొన్నాయి. ఇలాంటి ఫలితాలను ఏమాత్రం ఊహించలేదని, విపక్ష కూటమిలో ఐక్యతకు మరిన్ని ప్రయత్నాలు జరగాల్సిన అవసరాన్ని ఇవి చాటుతున్నాయని సీపీఎం ప్రధాన కార్యదర్శి ఎం.ఎ.బేబీ పేర్కొన్నారు. నిరుద్యోగం, ఎన్నికల కమిషన్‌ను దుర్వినియోగం చేస్తున్న తీరు, ప్రజాస్వామ్య పాలన కొరవడటం వంటివి ఎండగట్టినందువల్ల కూటమిని విజయం వరిస్తుందని భావించినట్లు తెలిపారు. ప్రభుత్వ యంత్రాంగాన్ని దుర్వినియోగం చేసి, అనేక మతలబులకు పాల్పడి, భారీగా డబ్బు వెదజల్లి ఎన్డీయే నెగ్గిందని ఆరోపించారు. మహాగఠ్‌బంధన్ సభలకు ప్రజలు భారీగా వచ్చేవారని, అయినా ఎలా ఓడిపోయామనేది తీవ్రంగా అంతఃశోధన చేసుకోవాలని సీపీఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా అన్నారు. ఇండియా, ఎన్డీయే కూటముల మధ్య అంత తేడా ఎందుకు వచ్చిందో తెలుసుకోవాల్సి ఉందని చెప్పారు. వాస్తవ పరిస్థితులకు, ఎన్నికల ఫలితాలకు ఏమాత్రం పొంతనలేదని సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ ప్రధాన కార్యదర్శి దీపాంకర్ భట్టాచార్య అన్నారు. రెండు దశాబ్దాలు అధికారంలో ఉన్న ప్రభుత్వం 2010 నాటి ఫలితాలను పునరావృతం చేయడం అర్థం కావడం లేదని చెప్పారు.

బిహార్ సీఎం పీఠంపై జేడీయూ వరుస పోస్టులు.. తొలగింపు

ఇంటర్నెట్ డెస్క్: బిహార్ అసెంబ్లీ ఎన్నికల్లో ఎన్డీయే కూటమి విజయ దుందుభి మోగించిన నేపథ్యంలో సీఎం ఎవరనే అంశంపై చర్చ మొదలైంది. మరోసారి నీతీశ్ ప్రభుత్వం రాబోతోందని జేడీయూ ఉదయం వరుస పోస్టులు పెట్టింది. మరికొన్ని గంటలు వేచి ఉంటే రాష్ట్రంలో సుపరిపాలన తిరిగివస్తుందని.. అందుకు బిహార్ సిద్ధంగా ఉందని రాసుకొచ్చింది.



'నీతీశ్ కుమార్ సీఎంగా పనిచేశారు. పనిచేస్తున్నారు. భవిష్యత్తులోనూ కొనసాగుతారు' అని ఇంకో పోస్టులో పేర్కొంది. కాసేపటి తర్వాత.. ఈ లైను తొలగించడం చర్చకు దారితీస్తోంది. బిహార్ అసెంబ్లీ ఎన్నికల్లో ముఖ్యమంత్రి అభ్యర్థిని ప్రకటించని ఎన్డీయే కూటమి నీతీశ్ నాయకత్వంలో ముందుకు వెళ్తామని మాత్రమే చెప్పింది. మరోవైపు.. ఉప ముఖ్యమంత్రి సామ్రాట్ చౌధరీ 'బిగ్ మ్యాన్' అవుతారని భాజపా అగ్రనేత అమిత్ షా ఎన్నికల ప్రచారంలో భాగంగా వ్యాఖ్యలు చేసిన సంగతి తెలిసిందే. సామ్రాట్‌కు ఓటు వేసి గెలిపించాలని, రానున్న రోజుల్లో ఆయన్ను ప్రధాని మోదీ "బిగ్ మ్యాన్.. వెరీ బిగ్ మ్యాన్" చేస్తారని చెప్పారు. శుక్రవారం నాటి ఫలితాల వెల్లడి తర్వాత సీట్ల సంఖ్యలో మిత్రపక్షమైన జేడీయూ కంటే భాజపా కాస్త ముందున్న పరిస్థితుల్లో అమిత్ షా వ్యాఖ్యలు ఎటు దారితీస్తాయో చూడాలి.

మళ్లీ నీతీశే సీఎం : జీతన్‌రామ్ మాంఝీ

బిహార్ ఫలితాల్లో ఎన్డీఏ దూసుకెళ్తున్న వేళ హిందుస్థానీ ఆవామ్ మోర్చా అధ్యక్షుడు, కేంద్ర మంత్రి జీతన్‌రామ్ మాంఝీ కీలక వ్యాఖ్యలు చేశారు. నీతీశ్ కుమార్ మరోసారి బిహార్ ముఖ్యమంత్రి అవుతారని ఆయన వ్యాఖ్యానించారు.

సీఎంగా నీతీశ్ కొనసాగవచ్చు: చిరాగ్

పట్నా: బిహార్ ముఖ్యమంత్రిగా నీతీశ్ కుమార్ కొనసాగవచ్చని తాను గట్టిగా నమ్ముతున్నట్లు లోక్ జనశక్తి పార్టీ (రామ్ విలాస్) అధినేత చిరాగ్ పాస్వాన్ అన్నారు. శుక్రవారం ఫలితాల వెల్లడి అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ఎన్డీయే భాగస్వాముల ఐక్యతపై ప్రజలు చూపిన విశ్వాసానికి ఫలితమే ఈ విజయం అన్నారు. ప్రతిపక్ష నేతల అవమానకరమైన ఓటమికి, పతనానికి అహంకార ధోరణి ఒక్కటే కారణమన్నారు.

కీలక కేసుల్లో అనుమానాస్పద మరణాలు

పరిటాల రవి, వివేకా హత్యల నుంచి పరకామణి చోరీ వరకూ అదే తీరు

ఈనాడు, అమరావతి: రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం సృష్టించిన పలు కేసుల దర్యాప్తు కీలక దశకు చేరుకున్న తరుణంలో అందులోని నిందితులు, అనుమానితులు, సాక్షులు వరుస హత్యలకు గురైన, అనుమానాస్పద స్థితిలో మృతిచెందిన ఉదంతాలనేకం చూశాం. తాజాగా తితిదే పరకామణి చోరీ కేసు వ్యవహారంలో ఫిర్యాదుదారైన నాటి తితిదే ఏవీఎస్‌వో సతీష్‌కుమార్ అనుమానాస్పద స్థితిలో మృతిచెందారు. గతంలో తెదేపా నేత పరిటాల రవి, మాజీ మంత్రి వై.ఎస్.వివేకానందరెడ్డి హత్య కేసుల్లోనూ దర్యాప్తు కీలక దశకు చేరుకున్న తరుణంలోనే నిందితులు, అనుమానితులు, సాక్షులు హత్యలకు గురయ్యారు. అనుమానాస్పద స్థితిలో మృతిచెందారు. అప్పట్లో పరిటాల రవి హత్య వెనకున్న అసలైన సూత్రధారులు, కుట్రదారుల పేర్లు బయటకు రాకుండా అందులోని పాత్రధారులను అంతమొందించారనే ఫిర్యాదులున్నాయి. అందులో అత్యధిక హత్యలు, మరణాలు రాజశేఖర్‌రెడ్డి సీఎంగా ఉన్నప్పుడే జరిగాయి. వివేకా హత్య కేసులోనూ జగన్ హయాంలోనే ఎక్కువ మంది సాక్షులు మరణించారు. ఇప్పుడు పరకామణి కేసులోనూ ఇదే తరహా నేర విధానం కనిపించింది. అందుకే సతీష్‌కుమార్ అనుమానాస్పద మృతిపై మరింత లోతుగా విచారణ చేయాల్సిన అవసరముంది.

పరిటాల రవి హత్య కేసులో..

1. మొద్దు శీను: పరిటాల రవిపై కాల్పులు జరిపిన, హత్య కేసులో రెండో నిందితుడైన మొద్దు శీను 2008 నవంబరు 9న అనంతపురం జిల్లా జైల్లో దారుణ హత్యకు గురయ్యారు. శీనుతో పాటు జైలు గదిలో ఉన్న మరో ఖైదీ మల్లెల ఓంప్రకాశ్ అతడిని సిమెంట్ డంబెల్‌తో మోదీ చంపేశారు. అప్రూవర్‌గా మారి, తన పాపానికి ప్రాయశ్చిత్తం చేసుకుంటానని 2007 ఏప్రిల్‌లో అనంతపురం కోర్టులో విచారణకు హాజరైనప్పుడు మొద్దు శీను ప్రకటించాడు. ఆ తర్వాత కొన్నాళ్లకే అతడిని జైల్లో చంపేశారు. సూత్రధారులను బయటపెడతానని చెప్పడంతోనే దాని వెనకున్న నాటి ప్రభుత్వ పెద్దల సహకారంతో మొద్దు శీను హత్య జరిగిందన్న ఆరోపణలున్నాయి.

2. మద్దెలచెరువు సూరి: రవి హత్య కుట్రదారుల్లో ఒకరు, ఈ కేసులో ప్రధాన నిందితుడైన మద్దెలచెరువు సూరి 2011 జనవరిలో హైదరాబాద్ యూసఫ్‌గూడలో దారుణ హత్యకు గురయ్యారు. సూరికి అత్యంత సన్నిహిత అనుచరుడైన మలిశెట్టి భానుకిరణ్ అతడిని కాల్చి చంపాడు. రవి హత్య కేసులో బెయిల్‌పై బయటకొచ్చిన సూరి ఏడాది తర్వాత హత్యకు గురయ్యాడు.

3. అజీజ్‌రెడ్డి: రవి హత్యకు ఆయుధాలు సమకూర్చాడని, ప్రత్యక్షంగా ఘటనలో పాల్గొన్నాడని ఆరోపణలున్న గ్యాంగ్‌స్టర్ అజీజ్‌రెడ్డి 2008 మేలో జూబ్లీహిల్స్ పోలీసుస్టేషన్ పరిధిలో పోలీసు ఎన్‌కౌంటర్‌లో హతమయ్యాడు. అజీజ్‌రెడ్డి డబ్బులు కోసం బెదిరిస్తున్నాడంటూ ఓ సినీ నిర్మాణ సంస్థ మేనేజర్ సాయంత్రం ఫిర్యాదివ్వగా.. పోలీసులు అదేరోజు రాత్రి ఎన్‌కౌంటర్ చేసేశారు. వెంకటరెడ్డి అనే వ్యక్తి.. అజీజ్‌రెడ్డి ద్వారా తమకు ఆయుధాలు సమకూర్చాడంటూ విచారణలో మొద్దు శీను, అప్రూవర్ రామ్మోహన్‌రెడ్డిలు వెల్లడించారు. కొన్నాళ్లకు వెంకటరెడ్డి హత్యకు గురికాగా, అజీజ్‌రెడ్డిని ఎన్‌కౌంటర్‌లో చంపేశారు. దీంతో ఆయుధాల కొనుగోలుకు నిధులు సమకూర్చిందెవరు? అనేది తేలలేదు.

4. మల్లికార్జున: పరిటాల రవి హత్య కేసుపై సీబీఐ దర్యాప్తు చేపట్టిన తర్వాత ఆ మృతదేహానికి రీ పోస్టుమార్టం నిర్వహించిన బృందంలో సహాయకుడిగా ఉన్న మల్లికార్జున కొన్నాళ్ల తర్వాత అనుమానాస్పద స్థితిలో మృతిచెందారు. ఆయన రైల్లోంచి దూకి చనిపోయారంటూ ప్రచారం చేశారు. రీ పోస్టుమార్టంలో వెలుగుచూసిన విషయాలు బయటకు రాకుండా తొక్కిపెట్టాలనే కుట్ర ఈ మృతి వెనక ఉందనే ఆరోపణలున్నాయి.

5. డాక్టర్ సాంబశివరావు: పరిటాల రవి హత్య కంటే ముందు జూబ్లీహిల్స్ బాంబు పేలుడు కేసులో మద్దెలచెరువు సూరి చర్లపల్లి జైల్లో ఉండేవాడు. అప్పట్లో జైల్లో వైద్యుడు సాంబశివరావు అతనికి సెల్‌ఫోన్లు అందించేవారని, సూరి వాటితో మాట్లాడే రవి హత్యకు కుట్ర చేశాడన్న ఆరోపణలున్నాయి. రవి హత్య తర్వాత కొన్నాళ్లకు సాంబశివరావు అనుమానాస్పద స్థితిలో మృతిచెందారు. ఆయన కూడా రైల్లోంచి దూకి ఆత్మహత్య చేసుకున్నారంటూ ప్రచారం చేశారు. ఆయన బతికుంటే రవి హత్య కుట్రలో మరింత మంది సూత్రధారులు బయటపడే అవకాశం ఉండేది.

6. ఓంప్రకాశ్: మొద్దు శీనును అంతమొందించిన కేసులో జీవిత ఖైదు పడ్డ ఓంప్రకాశ్ విశాఖపట్నం కేంద్ర కారాగారంలో ఖైదీగా ఉండేవాడు. వైకాపా పరిపాలన కాలంలో 2020 జులైలో మృతిచెందాడు. మూత్రపిండాలు దెబ్బతినడంతో చనిపోయినట్లు జైలు అధికారులు ప్రకటించారు.

వివేకా హత్య కేసులోనూ.. అదే తరహాలో మరణాలు

1. నారాయణయాదవ్, డ్రైవర్: వివేకా అంత్యక్రియల్లో పాల్గొనేందుకు జగన్, ఆయన సతీమణి భారతిలను హైదరాబాద్ నుంచి రోడ్డు మార్గంలో పులివెందులకు తీసుకొచ్చిన వాహన డ్రైవర్ నారాయణ యాదవ్ 2019 డిసెంబరులో మృతిచెందారు. రాష్ట్ర పోలీసుల ఆధ్వర్యంలోని సిట్ విచారణ వేగవంతమవుతున్న తరుణంలో ఆయన మరణించడం సందేహాస్పదంగా మారింది. ఆయన్ను విచారణకు పిలుస్తారనే సమయంలో మృతిచెందారు. ఈ ఘటనపై కేసే నమోదు కాలేదు.

2. వాచ్‌మన్ రంగన్న: వివేకా హత్య కేసులో వాచ్‌మన్ రంగన్న ప్రత్యక్ష సాక్షి. ఎర్ర గంగిరెడ్డి, షేక్ దస్తగిరి, ఉమాశంకర్‌రెడ్డి, సునీల్‌యాదవ్‌లు వివేకాను హత్య చేసినట్లు ఆయన సీబీఐకి వాంగ్మూలమిచ్చారు. దాని ఆధారంగా ఈ హత్య కేసులో అవినాష్‌రెడ్డి, శివశంకర్‌రెడ్డి, భాస్కరరెడ్డి తదితర ముఖ్యుల ప్రమేయం బయటపడింది. ఆయన కొన్ని నెలల కిందట అస్వస్థతకు గురై మృతిచెందారు. రంగన్న మృతిపై కుటుంబ సభ్యులు అనేక అనుమానాలు వ్యక్తం చేశారు.

3. కల్లూరు గంగాధర్‌రెడ్డి: వివేకా హత్య కేసులో ప్రధాన సాక్షుల్లో ఒకరైన కల్లూరు గంగాధర్‌రెడ్డి 2022 జూన్‌లో అనుమానాస్పద స్థితిలో మృతిచెందారు. ఈ కేసులో ఆయన సీబీఐ ఎదుట కీలక వాంగ్మూలమిచ్చి ఆ తర్వాత మాట మార్చారు. పులివెందుల్లోని జగన్ క్యాంపు కార్యాలయం, వివేకా, అవినాష్‌రెడ్డి ఇల్లు, ఈసీ గంగిరెడ్డి ఆసుపత్రి పరిసరాల్లో సీబీఐ కొలతలు వేయడం, గూగుల్ కోర్డినేట్స్ తీసుకుంటున్న సమయంలో ఆయన మృతి చెందడం అనుమానాలకు తావిచ్చింది.

4. కటికరెడ్డి శ్రీనివాసులరెడ్డి: కడప జిల్లా సింహాద్రిపురం మండలం కసనూరుకు చెందిన కటికరెడ్డి శ్రీనివాసులరెడ్డి 2019 సెప్టెంబరులో అనుమానాస్పద స్థితిలో మృతిచెందారు. శ్రీనివాసులరెడ్డి మృతదేహంలో కాలేయానికి, కిడ్నీ మధ్య భాగంలో రక్తపు ఆనవాళ్లు ఉన్నట్లు ఫోరెన్సిక్ నివేదిక తేల్చింది. ఆ రక్తపు ఆనవాళ్లేమిటో దర్యాప్తు చేయకుండానే కేసు మూసేశారు.

5. డా.వైఎస్.అభిషేక్‌రెడ్డి: వివేకా హత్య కేసు కీలక సాక్షుల్లో ఒకరైన డా.వై.ఎస్.అభిషేక్‌రెడ్డి.. 2021 ఆగస్టులో సీబీఐకి వాంగ్మూలమిచ్చారు. వివేకా చనిపోయినట్లు దేవిరెడ్డి శివశంకర్‌రెడ్డి నుంచి తనకు ఫోన్ కాల్ వచ్చిందని, ఘటనా స్థలానికి వెళ్లి చూడగా.. మృతదేహం చుట్టూ రక్తపు మడుగు, ఆయన నుదుటిపై గాయాలున్నట్లు గుర్తించి, ఇది హత్యేనని భావించానని వాంగ్మూలమిచ్చారు. ఈ వాంగ్మూలం వెలుగుచూసిన కొన్ని రోజుల తర్వాత అభిషేక్‌రెడ్డి అనారోగ్యం బారిన పడి ఈ ఏడాది జనవరిలో మరణించారు.

6. ఈసీ గంగిరెడ్డి: వై.ఎస్.భారతిరెడ్డి తండ్రి, జగన్మోహన్‌రెడ్డి మామ అయిన ఈసీ గంగిరెడ్డి 2020 అక్టోబరులో అనారోగ్యంతో చనిపోయారు. వివేకా హత్య కుట్ర గురించి ఆయనకు తెలుసనే ఫిర్యాదులున్నాయి. వివేకా హత్యను కప్పిపుచ్చేందుకు ఈసీ గంగిరెడ్డికి చెందిన ఆసుపత్రి సిబ్బందే ఆయన మృతదేహానికి కట్లు కట్టి, బ్యాండేజీలు చుట్టారు. వివేకా హత్య తర్వాత నిందితులు గంగిరెడ్డి ఆసుపత్రికి వెళ్లి చేతులు శుభ్రం చేసుకున్నారనే ఫిర్యాదులు ఉన్నాయి. ఈ నేపథ్యంలో ఆయన మృతీ అనుమానాస్పదమే.



గోమాత సావనీర్, పోస్టర్ ఆవిష్కరిస్తున్న ప్రజ్ఞానంద్ సరస్వతి స్వామి, బలరాం దేవాచారి, నిరంజన్ వర్మ, డాక్టర్ కమల్, స్వామి శ్రీధరాచార్య మహారాజ్, పరమేశ్వరన్, తితిదే బోర్డు సభ్యుడు భానుప్రకాష్‌రెడ్డి, అఖిల భారత గో సేవ ఫౌండేషన్ బాలకృష్ణ, తదితరులు

గోమాతతో ఆరోగ్య భారత్

- పంచగవ్య విద్యాపీఠం గురుకులపతి గవ్యసిద్ధాచార్య నిరంజన్ వర్మ
- తిరుపతిలో ఘనంగా ప్రారంభమైన 13వ పంచగవ్య వైద్య మహాసమ్మేళనం

ఈనాడు డిజిటల్, తిరుపతి: గోమాత సంరక్షణ, గోసేవ, గోవైద్యం, గోమాత వేదం, శాస్త్రీయ ప్రయోగాలతోనే ఆరోగ్య భారత్ సాధ్యపడుతుందని పంచగవ్య విద్యాపీఠం గురుకులపతి గవ్యసిద్ధాచార్య నిరంజన్ వర్మ తెలిపారు. దేశవ్యాప్తంగా గోమాత రక్షణపై విస్తృతంగా అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. పంచగవ్య విద్యాపీఠం, పంచగవ్య డాక్టర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో తిరుపతిలో శుక్రవారం నుంచి మూడు రోజుల పాటు నిర్వహిస్తున్న 13వ పంచగవ్య జాతీయ వైద్య మహాసమ్మేళనంలో ఆయన మాట్లాడారు. పంచగవ్య వైద్యశాస్త్రంపై పనిచేస్తున్న శాస్త్రవేత్తలు, గవ్య ఉత్పత్తి, గోశాల నిర్వాహకులు, గో రక్షకులు సుమారు 200 మంది పాల్గొన్నారు. అలాగే గో విజ్ఞానానికి సంబంధించిన కొత్త విషయాలపై పరిశోధన జరిపిన విద్యార్థులు వారి పత్రాలు అందజేశారు. 'గోమాత సే నిరోగి భారత్' అనే నినాదంతో సదస్సును ప్రారంభించారు. గవ్యసిద్ధ అంబ పత్రికను విడుదల చేశారు. మొదటి రోజు 'గోసేవ శ్రీవేంకటేశ్వర స్వామి, నాలుగు వర్ణాల గృహస్థ పాలకుడు' అనే అంశంపై చర్చించారు. హేమంత్ శేటే శాఖాహార ప్రాముఖ్యాన్ని వివరించారు. డాక్టర్ సత్యపాల్ ప్రకాష్ వర్మ పంచగవ్యలో నానోటెక్నాలజీ, ఆధునిక శాస్త్రంలో దాని అద్భుతమైన అనువర్తనాలపై చర్చించారు. ఐసీటీ ఎమెరిటస్ సైంటిస్ట్, ఏసీఎస్ఐ ప్రొఫెసర్ డాక్టర్ వి.జయతీర్థరావు పంచగవ్య ఉప ఉత్పత్తులు, వాటి ఉపయోగాలను పంచుకున్నారు. పంచగవ్య నుంచి తయారైన ఎరువుల వినియోగం, రైతులకు లబ్ధి తదితర వివరాలను శ్రీవిజయ్ రామ్ జీ వివరించారు. ప్రపంచవ్యాప్తంగా గో-శాస్త్రీయ జ్ఞానాన్ని వ్యాప్తి చేయడంతో పాటు గో ఉత్పత్తులను ప్రోత్సహించాలని అంతర్జాతీయ జర్నలిస్ట్, పంచగవ్య విద్యాపీఠం ప్రో-వైస్ ఛాన్సలర్ డాక్టర్ కుమార్ రాకేష్ పిలుపునిచ్చారు. భారతీయ గో ఉత్పత్తి రంగంలో పెరుగుతున్న వ్యాపార అవకాశాలను మాజీ ఎంపీ ప్రదీప్ గాంధీ ప్రస్తావించారు. ఈ సదస్సులో పంచగవ్య విద్యాపీఠం ఉప-గురుకులపతి డా.కమల్ తావోరి, జగద్గురు పిపద్వార్చార్య బలరామ్ దేవాచార్య మహారాజ్, బృందావన్, పెనుగొండ పీఠాధిపతి ప్రజ్ఞానంద్ సరస్వతి స్వామి, శ్రీధరాచార్య మహారాజ్, తితిదే బోర్డు సభ్యుడు భానుప్రకాష్‌రెడ్డి, హిందూ మునాని వైస్ ప్రెసిడెంట్ బ్రహ్మచారి తిరు పరమేశ్వరన్, విజయ్ శేఖర్, మోహన్‌లాల్ బజాజ్ తదితరులు పాల్గొన్నారు.

పంచగవ్య నిపుణులు సిద్ధమవుతున్నారు

- కె.నిరంజన్‌వర్మ, పంచగవ్య విద్యాపీఠం వ్యవస్థాపకులు

పంచగవ్య వైద్యం 2000 సంవత్సరం నుంచి అందుబాటులోకి వచ్చింది. గత 13 ఏళ్లుగా పీఠం ద్వారా శిక్షణ ఇస్తున్నాం. ఇప్పటివరకు దేశవ్యాప్తంగా 23 శిక్షణ కేంద్రాల ద్వారా సుమారు 500 మంది నిపుణులు తయారయ్యారు. ఏడాది సర్టిఫికెట్ కోర్సులు, రెండేళ్ల కోర్సులు అందుబాటులో ఉన్నాయి. పంచగవ్య వైద్యానికి ప్రచారం కల్పించేందుకు ఏటా ఒక్కో రాష్ట్రంలో సమ్మేళనం నిర్వహిస్తున్నాం.

విచారణకు సహకరించి.. అంతలో అనుమానాస్పద మృతి!

- పరకామణి కేసులో ఈ నెల 6న సీఐడీ డీజీ ఎదుట హాజరైన సతీష్‌కుమార్
- మరోసారి శుక్రవారం వస్తూ మృత్యువాత
- నిజాలు బయటపడతాయని హత్య చేశారా?
- ఒత్తిడితో ఆత్మహత్యకు పాల్పడ్డారా అనే అనుమానాలు



వైకుంఠం క్యూకాంప్లెక్స్‌లో తితిదే మాజీ ఈవో ధర్మారెడ్డితో సతీష్‌కుమార్

ఈనాడు డిజిటల్-తిరుపతి, న్యూస్‌టుడే-తిరుపతి (నేరవిభాగం): తిరుమల పరకామణి చోరీ కేసులో నిందితుడైన రవికుమార్‌తో తితిదేకు ఆస్తులు రాయించిన కేసులో ఫిర్యాదుదారుడు తిరుమలలో ఏవీఎస్వోగా పనిచేసిన సతీష్‌కుమార్ అనుమానాస్పద మృతిపై అనేక సందేహాలు వస్తున్నాయి. కేసు కీలక దశకు చేరుకున్న తరుణంలో ఆయన అనంతపురం జిల్లా తాడిపత్రి సమీపంలోని కోమలి గ్రామం దగ్గర్లోని రైల్వేట్రాక్ సమీపంలో విగతజీవిగా కనిపించారు. ఈ నెల 6న ఆయన సీఐడీ డీజీ రవిశంకర్ అయ్యన్నార్ ఎదుట హాజరయ్యారు. శుక్రవారం మరికొందరితో పాటు విచారణకు రావాల్సి ఉంది. తొలిసారి విచారణలో.. ఓ ఉన్నతాధికారి ఆదేశాల మేరకు రాజీ చేసుకున్నానని ఆయన చెప్పినట్లు సమాచారం. సీఐడీ విచారణకు ఆయన సహకరించారని తెలుస్తోంది. మరోసారి అవసరమైతే రావాలని చెప్పగా ఆయన అంగీకరించారు. డిసెంబరు 2లోపు దర్యాప్తు పూర్తిచేయాలని అధికారులు భావిస్తున్న తరుణంలో సతీష్‌కుమార్ అనుమానాస్పద మృతితో విచారణలో జాప్యం జరుగుతుందా అనే చర్చ జరుగుతోంది.

పేర్లు బయటపెడతారా.. అని!

రవికుమార్ 2023 ఏప్రిల్ 29న పరకామణిలో చోరీ చేస్తూ పట్టుబడ్డారు. వెంటనే కేసు నమోదుచేశారు. 2023 మే 30న ఛార్జిషీట్ దాఖలుచేశారు. కానీ, అతని ఆస్తులను తితిదేకు రాయించి, 2023 సెప్టెంబరు 9న లోక్ అదాలత్‌లో రాజీ చేసుకున్నారు. సాధారణంగా ఇలాంటి కేసుల్లో రాజీ జరగడం కష్టం. ఫిర్యాదు చేసిన సతీష్‌కుమారే.. రాజీకి వచ్చారు. ఇందులో ఎవరెవరి ప్రమేయం ఉందనే దిశగా సిట్ విచారణ చేస్తోంది. ఈ క్రమంలోనే అప్పటి పెద్దల పేర్లు బయటపెడతారేమోనని భావించి హత్య చేశారా? అన్న అనుమానమూ లేకపోలేదు. తీవ్ర ఒత్తిడితో ఆయన బలవన్మరణానికి పాల్పడ్డారా అన్నదీ దర్యాప్తులోనే తెలియాలి.

2013లో విధుల్లో చేరి..

కర్నూలు జిల్లా పత్తికొండకు చెందిన సతీష్‌కుమార్ 2012 బ్యాచ్‌కు చెందినవారు. శిక్షణ పూర్తిచేసుకుని ఆర్ఎస్ఐగా 2013లో విధుల్లో చేరారు. చిత్తూరు, తిరుపతిలోని ఆర్మ్‌డ్ రిజర్వ్ విభాగంలో పనిచేశారు. ఏఆర్ నుంచి తిరుమలకు డిప్యుటేషన్‌పై సతీష్‌కుమార్ 2017లో విజిలెన్స్ ఇన్‌స్పెక్టర్‌గా వచ్చారు. అనంతరం తిరుమలలో ఉండగానే 2022లో ఏవీఎస్‌వోగా పదోన్నతి పొందారు. 2023 జూన్‌లో తిరుచానూరు శ్రీ పద్మావతి ఆలయానికి ఏవీఎస్‌వోగా బదిలీపై వెళ్లారు. ఈ ఏడాది జూన్‌లో మాతృసంస్థకు వెళ్లిపోయి ప్రస్తుతం గుంతకల్లు రైల్వేలో జీఆర్‌పీ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తున్నారు. ఆయనకు భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు.

ఘటనా స్థలానికి వెళ్లిన సీఐడీ డీజీ

పరకామణి కేసు దర్యాప్తు చేస్తున్న సీఐడీ డీజీ రవిశంకర్ అయ్యన్నార్ ఫిర్యాదుదారుడు సతీష్‌కుమార్ మృతి విషయం తెలుసుకుని.. గురువారం మధ్యాహ్నం తిరుపతి నుంచి ఘటనా స్థలానికి వెళ్లారు.



దిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద ధర్నా నిర్వహిస్తున్న వివిధ ఉపాధ్యాయ సంఘాల నాయకులు

సర్వీసులో ఉన్న టీచర్లకు 'టెట్' రద్దుచేయాలి

- దిల్లీలో ఉపాధ్యాయ సంఘాల ధర్నా

ఈనాడు, దిల్లీ: ప్రస్తుతం సర్వీసులో ఉన్న టీచర్లకు టెట్‌ను రద్దుచేయాలని కోరుతూ ఏపీకి చెందిన ఉపాధ్యాయ సంఘాల నాయకులు జంతర్‌మంతర్ వద్ద ధర్నా నిర్వహించారు. సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుపై రివ్యూ పిటిషన్ దాఖలుచేయాలని డిమాండ్ చేశారు. ఒకసారి పోటీ పరీక్ష ఉత్తీర్ణులై ప్రభుత్వ విధుల్లో చేరిన ఉద్యోగికి మళ్లీ అర్హత పరీక్ష నిర్వహించడం లేదని, అలాంటిది టీచర్లకే ఎందుకని ప్రశ్నించారు. విద్యార్థులకు బోధించే పాఠ్యాంశాలపై పూర్తి పట్టు సాధించి, దాదాపు 20-30 ఏళ్లుగా బోధిస్తున్న టీచర్లు మళ్లీ టీచర్ అర్హత పరీక్ష రాయాలని షరతు విధించడం వారిని అవమానించడమేనని పేర్కొన్నారు. అందువల్ల విధుల్లో ఉన్న టీచర్లకు టెట్‌ను రద్దు చేసేలా సుప్రీంకోర్టును కోరుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రివ్యూ పిటిషన్ దాఖలు చేయాలని డిమాండ్ చేశారు.

దివ్యాంగుల బ్యాక్‌లాగ్ ఖాళీల భర్తీ గడువు పొడిగింపు

ఈనాడు, అమరావతి: వివిధ శాఖల పరిధిలో ఖాళీగా ఉన్న దివ్యాంగుల బ్యాక్‌లాగ్ పోస్టుల భర్తీ గడువును ప్రభుత్వం పొడిగించింది. గతేడాది మార్చి 31తో ఈ గడువు ముగియగా.. తాజాగా దాన్ని 2026 మార్చి 31 వరకు పొడిగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

ఏపీఎండీసీకి.. పల్వరైజింగ్ మిల్లుల టోకరా!

- ముగ్గురాయి పొడిచేస్తామని చెప్పి.. నేరుగా ముడిరాయి విక్రయాలు
- మిల్లుల తనిఖీల్లో వెలుగుచూసిన నిబంధన ఉల్లంఘనలు
- నెరవేరని ఏపీఎండీసీ రాయితీల లక్ష్యం..
- స్థానికులకు ఉపాధి ఉత్తిమాటే!

ఈనాడు, అమరావతి: ఏపీ ఖనిజాభివృద్ధి సంస్థ (ఏపీఎండీసీ)కు పల్వరైజింగ్ మిల్లుల యజమానులు టోకరా వేస్తున్నారు. ముగ్గురాయిని పౌడర్‌గా మార్చి విక్రయిస్తామని ఒప్పందం చేసుకొని నేరుగా ముడిరాయినే అమ్మేస్తున్నారు. ఫలితంగా మిల్లులు నడవక స్థానికులకు ఉపాధి దొరక్కపోగా, ఏపీఎండీసీ ఇస్తున్న రాయితీనీ కొందరు మిల్లుల యజమానులు జేబులో వేసుకుంటున్నారు. ఏకంగా మూడింట రెండొంతుల మిల్లుల యజమానులు ఇలా ఉల్లంఘనలకు పాల్పడుతూ ఏపీఎండీసీని మోసం చేస్తున్నారు. సంస్థ అధికారులూ ఇదేమీ పట్టించుకోకుండా వదిలేస్తున్నారు. ఆకస్మిక తనిఖీల్లో ఈ దందా వెలుగుచూసింది.

ఏపీఎండీసీకి అన్నమయ్య జిల్లా ఓబుళవారిపల్లె మండలం మంగంపేట వద్ద ముగ్గురాయి గనులు ఉన్నాయి. ఆయిల్, గ్యాస్ నిక్షేపాల కోసం తవ్వకాలు జరిపే దేశాల్లో ముగ్గురాయికి డిమాండు ఉంది. దీంతో తవ్వి తీసి ఎగుమతిదార్లకు విక్రయిస్తుంది. వారంతా నేరుగా రాయిని ఎగుమతి చేస్తారు. మంగంపేట గనులకు దగ్గరలో కొందరు సూక్ష్మ, చిన్న, మధ్యతరహా సంస్థల కింద ముగ్గురాయి మిల్లులు ఏర్పాటు చేసుకున్నారు. వీరికి ఏపీఎండీసీ ప్రతినెలా ఎ-గ్రేడ్ ముగ్గురాయి 120 టన్నులు, బి-గ్రేడ్ 200-300 టన్నులు, సి, డి- గ్రేడ్స్ వెయ్యి టన్నులపైనే సరఫరా చేస్తోంది. ఇందులో 'ఎ' గ్రేడ్ ముడిరాయిని మాత్రమే నేరుగా విక్రయించుకోవచ్చు. మిగిలినవి మిల్లుల్లో పొడిగా చేసిన తర్వాతే విక్రయించాలి. దీనివల్ల మిల్లుల్లో స్థానికులకు ఉపాధి లభిస్తుంది. కానీ, ఎక్కువ మంది మిల్లర్లు కొందరు ఎగుమతిదార్లతో మాట్లాడుకొని బి, సి, డి గ్రేడ్స్‌నూ ముడిరాయిగానే అమ్మేస్తున్నారు.

మిల్లులకు విద్యుత్తు కనెక్షన్లే లేవు..

◆ కొందరు పల్వరైజింగ్ మిల్లుల యజమానులు అక్రమాలు చేస్తున్నారని ఫిర్యాదులు రావడంతో.. ఏపీఎండీసీ ఎండీ ప్రవీణ్‌కుమార్ తనిఖీలకు ఓ బృందాన్ని ఏర్పాటు చేశారు.

◆ ఏప్రిల్ నుంచి అక్టోబరు వరకు ముగ్గురాయి తీసుకున్నట్లు రికార్డుల్లో ఉన్న 91 మిల్లుల్లో తనిఖీలు చేయించారు.

◆ ఇందులో 26 నిబంధనలు పాటించగా, మిగతా 65 మిల్లుల్లో పెద్దఎత్తున ఉల్లంఘనలు గుర్తించారు.

◆ బి, సి, డి గ్రేడ్‌ల ముగ్గురాయిని నేరుగా విక్రయించినట్లు తేలింది.

◆ ఆయా మిల్లుల విద్యుత్తు బిల్లుల వివరాలు చూస్తే ఈ దందా బయటకొచ్చింది.

◆ కొన్నింటికి విద్యుత్తు కనెక్షన్ లేకున్నా.. ముగ్గురాయిని పొడి చేస్తున్నట్లు యజమానులు నమ్మబలికారు.

రాయితీ స్వాహా.. ఉపాధి ఉత్తమాట!

ఎంఎస్ఎంఈలను ప్రోత్సహించాలని ఎగుమతిదార్లకు ఇచ్చే ధర కంటే పల్వరైజింగ్ మిల్లులకు 10% రాయితీపై ముగ్గురాయి ఇస్తుండగా.. మిల్లర్లు నిబంధనలు ఉల్లంఘించి అదే రాయిని అధిక ధరకు విక్రయించి, సొమ్ము చేసుకుంటున్నారు. మిల్లులు నడవకపోవడంతో స్థానికులకు ఉపాధి అనేది ఉత్తమాటే అవుతోంది. ఈ తనిఖీల నివేదిక ఏపీఎండీసీ ఎండీకి చేరింది. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై ఎటువంటి నిర్ణయం తీసుకుంటారనేది తెలియాల్సి ఉంది.

'పదోన్నతులకు క్రమశిక్షణ చర్యల నుంచి మినహాయించాలి'


ఈనాడు, అమరావతి: ఆర్టీసీ ఉద్యోగుల్లో నాలుగు కేటగిరీల వరకే క్రమశిక్షణ చర్యల నుంచి మినహాయించి పదోన్నతులు కల్పిస్తున్నారని, మిగిలిన వారికి అన్యాయం జరగకుండా ఇతర కేడర్లలో కూడా ఈ మినహాయింపు వర్తింపజేయాలని నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ (ఎన్ఎంయూఏ) కోరింది. ఈ మేరకు సీఎం చంద్రబాబుకు శుక్రవారం లేఖ రాసినట్లు ఎన్ఎంయూఏ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పీవీ రమణారెడ్డి, వై.శ్రీనివాసరావు ఓ ప్రకటనలో తెలిపారు.

నర్సరీ, సీడ్ గార్డెన్‌ల ఏర్పాటుకు రూ.2.40 కోట్లు

ఈనాడు, అమరావతి: కృషోన్నతి యోజన పథకం కింద రాష్ట్రవ్యాప్తంగా నర్సరీలు, సీడ్ గార్డెన్‌లు ఏర్పాటు చేయడానికి రూ.2.40 కోట్ల నిధుల విడుదలకు ప్రభుత్వం పరిపాలన అనుమతులిచ్చింది. ఈ మేరకు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది.

రాజ్‌భవన్‌లో నెహ్రూ జయంతి, బాలల దినోత్సవం

- పాల్గొన్న గవర్నర్ అబ్దుల్ నజీర్



ఈనాడు, అమరావతి: దేశ తొలి ప్రధాని పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ 136వ జయంతి, బాలల దినోత్సవాలను శుక్రవారం రాజ్‌భవన్‌లో నిర్వహించారు. గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్ వేడుకల్లో పాల్గొని నెహ్రూ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. "పిల్లలంటే నెహ్రూకు అమితమైన ప్రేమ. 'నేటి బాలలే రేపటి పౌరులు. వారే దేశ భవిష్యత్తు, అసలైన బలం, సమాజానికి పునాది' అని నెహ్రూ తరచూ చెప్పేవారు. దేశ విద్యారంగాన్ని రూపొందించడంలో ఆయన కీలక భూమిక పోషించారు. అన్ని అభ్యాసాలకు ఆధారం శాస్త్రీయ జ్ఞానం, తార్కికం, హేతుబద్ధత అని నెహ్రూ బలంగా విశ్వసించేవారు" అని గవర్నర్ గుర్తుచేశారు.

పిల్లలకు సంస్కృతి, సంప్రదాయాలు తెలియజేయాలి

- ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్



ఈనాడు, అమరావతి: చిన్న పిల్లలకు నైతిక విలువలు, దేశ సంస్కృతి సంప్రదాయాలతో కూడిన విద్యను అందించే బాధ్యత కూటమి ప్రభుత్వం తీసుకుంటుందని ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ అన్నారు. శుక్రవారం బాలల దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేస్తూ ఓ ప్రకటన విడుదల చేశారు. 'కల్మషం లేని మనసులు చిన్నారులకే సొంతం. మంచి ఆలోచనలు పెంపొందేలా వారి చుట్టూ ఆరోగ్యకర వాతావరణం ఉండాలి. పాఠశాల స్థాయి నుంచే మనోవికాసం కలిగేలా స్వేచ్ఛాయుత, ఆహ్లాదకర పరిస్థితులు తీసుకురావాలి' అని పేర్కొన్నారు.

అప్పినపల్లి గ్రామస్థుల్ని అభినందించిన పవన్

ఈనాడు, అమరావతి: ఎర్రచందనం అక్రమ రవాణాను అడ్డుకొని వారిని పోలీసులకు పట్టించిన చిత్తూరు జిల్లా అప్పినపల్లి గ్రామస్థుల్ని ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ ఎక్స్ వేదికగా అభినందించారు.

నాణ్యమైన విద్య.. పిల్లల పెద్ద కలలను ప్రేరేపిస్తుంది

- మాజీ ముఖ్యమంత్రి జగన్



ఈనాడు, అమరావతి: నాణ్యమైన విద్యతో పాటు ప్రపంచం పట్ల అవగాహన కల్పించడం (ఎక్స్‌పోజర్ టు ది వరల్డ్) ద్వారా పిల్లలు పెద్ద కలలు కనేలా ప్రేరేపిస్తాయని, మనం వారిని ఆ మార్గంలో నడిపించాలని మాజీ ముఖ్యమంత్రి జగన్ పేర్కొన్నారు. 'శక్తిమంతమైన, ప్రగతిశీల భారతదేశం కోసం పిల్లలు తమ కలలను సాకారం చేసుకోవాలి. పూర్తి సామర్థ్యాన్ని వినియోగించుకునేలా వారికి సాధికారతను కల్పించాలి' అని శుక్రవారం 'ఎక్స్'లో పోస్ట్ చేశారు.

● ఏసియన్ ఆర్చరీ ఛాంపియన్‌షిప్-2025 రికర్వ్ విభాగంలో ఏపీకి చెందిన బొమ్మదేవర ధీరజ్ బంగారు పతకం సాధించడం ఎంతో గర్వకారణంగా ఉందని మాజీ సీఎం జగన్ పేర్కొన్నారు. ధీరజ్ ఇలాంటి విజయాలు మరెన్నో సాధించాలని శుక్రవారం ఎక్స్ వేదికగా ఆకాంక్షించారు.

సతీష్‌కుమార్ మరణ కారకులను కఠినంగా శిక్షించాలి

- భాజపా ముఖ్య అధికార ప్రతినిధి జయప్రకాశ్

ఈనాడు, అమరావతి: పరకామణి చోరీ కేసులో ఫిర్యాదుదారుడు సతీష్‌కుమార్ అనుమానాస్పద మృతి అత్యంత ఆందోళనకరమని భాజపా రాష్ట్ర ముఖ్య అధికార ప్రతినిధి వల్లూరు జయప్రకాశ్ నారాయణ పేర్కొన్నారు. రైలు పట్టాలపై ఆయన విగతజీవిగా పడిఉన్న తీరు చూస్తే దర్యాప్తు మరింత నిశితంగా చేయాల్సిన అవసరముందని శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ కేసులో సాక్షులకు రక్షణ కల్పించాలని, ఆయన మరణం వెనక ఎవరున్నా, ఎంత పెద్ద శక్తులున్నా కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. తితిదేలో జరిగిన అక్రమాల వ్యవహారంపై నమోదైన కేసులో ఈ తరహా ఘటన సరి కాదని, ప్రభుత్వం వాస్తవాలు వెలుగులోకి తేవాలన్నారు.

పరకామణి కేసులోని దొంగలే హత్య చేసి ఉండొచ్చు

- సామాజిక సంక్షేమ మండలి ఛైర్మన్ బాలకోటయ్య

ఈనాడు, అమరావతి: పరకామణి కేసులోని దొంగలే సీఐ సతీశ్‌కుమార్‌ని హత్య చేసి ఉండొచ్చని రాష్ట్ర సామాజిక సంక్షేమ మండలి ఛైర్మన్ పోతుల బాలకోటయ్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆర్థిక పరిస్థితులు, కుటుంబ పరిస్థితులు అన్నీ సవ్యంగా ఉన్నప్పుడు సతీశ్‌కుమార్ ఆత్మహత్యకు ఎలాంటి ఆస్కారం లేదని పేర్కొన్నారు. పరకామణి కేసులో కీలక ఫిర్యాదుదారుడి మరణంతో పరకామణి హంతకులు ఎంతటి బలవంతులో అర్థమవుతోందని, డీజీపీ తక్షణమే విచారించి నిజానిజాలు ప్రజలకు తెలియపర్చాల్సిన అవసరముందని పేర్కొన్నారు.

పరిటాల రవి, వివేకా హత్య కేసుల్లోనూ ఇలానే..

గతంలో పరిటాల రవి, వివేకానందరెడ్డి హత్య కేసుల్లోనూ కీలక సాక్షులను ఇలానే హత్య చేశారు. పరకామణి చోరీ కేసులో ఫిర్యాదు చేసిన తితిదే బోర్డు సభ్యుడు భానుప్రకాశ్‌ను బెదిరించడం, ఇప్పుడు సతీష్‌ను చంపడం వైకాపా నేతల ప్రమేయాన్ని స్పష్టంగా తెలియజేస్తోంది. ఈ హత్యకు తాడేపల్లి ప్యాలెస్‌లోనే పథకరచన చేశారు.

– జ్యోతుల నెహ్రూ, జగ్గంపేట ఎమ్మెల్యే, తితిదే బోర్డు సభ్యుడు

నాడు గుండెపోటు.. నేడు ఆత్మహత్య డ్రామా

నాడు వివేకాను చంపి గుండెపోటన్నారు. ఇప్పుడు సతీష్‌కుమార్‌ను హత్య చేసి ఆత్మహత్యగా చిత్రీకరిస్తున్నారు. సతీష్ నిజంగా భయపడి ఉంటే.. సిట్ ముందుకొచ్చి నిజాలు చెబుతానని ఎందుకు అంటారు? ఈ హత్య వెనక వైవీ సుబ్బారెడ్డి, కరుణాకరరెడ్డిల ముఠా హస్తం ఉంది.

– కొమ్మారెడ్డి పట్టాభిరామ్, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఛైర్మన్

ఆత్మహత్య అని భూమన ఎలా అంటారు?

సతీష్‌కుమార్ ఎలా చనిపోయారో స్పష్టత రాకముందే ఆత్మహత్య అని భూమన కరుణాకరరెడ్డి ఎలా ప్రకటించారు. నేరాలు చేయడం, అందులో భాగస్వాములైన వారిని, కీలక సాక్ష్యుల్ని చంపడం, కేసును ముందుకు సాగనివ్వకపోవడంలో వైకాపా వాళ్లు సిద్ధహస్తులు. – రవినాయుడు, శాప్ ఛైర్మన్

అసెంబ్లీ సచివాలయ ఉద్యోగుల సంఘ కార్యవర్గం ఎన్నిక

ఈనాడు, అమరావతి: రాష్ట్ర అసెంబ్లీ సచివాలయ ఉద్యోగుల సంక్షేమ సంఘానికి నూతన కార్యవర్గం ఎన్నికైంది. వివరాలను నూతన కార్యవర్గం శుక్రవారం వెల్లడించింది. అధ్యక్షుడిగా బీవీఎన్ వరప్రసాద్, ఉపాధ్యక్షుడిగా కె.విజయ్ సతీష్, కార్యదర్శిగా తలారి తిరుపతయ్య, సంయుక్త కార్యదర్శులుగా కాశిరెడ్డి, బి.వనకుమారి, కోశాధికారిగా టీఎన్‌కే చంద్రిక ఎన్నికయ్యారు. అసెంబ్లీ సచివాలయ ఉద్యోగుల సంక్షేమం కోసం పనిచేస్తామని నూతన కార్యవర్గం ప్రకటించింది. నూతన కార్యవర్గ సభ్యులు అసెంబ్లీ సెక్రటరీ జనరల్ సూర్యదేవర ప్రసన్నకుమార్‌ను కలవగా, ఆయన వారికి అభినందనలు తెలిపారు.

తమిళనాడులో కూలిన శిక్షణ విమానం

- పైలట్ సహా ముగ్గురు క్షేమం



మహాబలిపురం, న్యూస్‌టుడే: తమిళనాడులోని చెంగల్పట్టు జిల్లా మహాబలిపురం సమీపాన శిక్షణ విమానం కూలిపోయింది. ఎయిర్‌ఫోర్స్‌కు చెందిన పిలాటస్ పీసీ 7 చిన్న విమానం శుక్రవారం తాంబరం వైమానిక దళ స్థావరం నుంచి బయల్దేరింది. కొద్ది సేపటికే తిరుపోరూర్ ఉప్పళం ప్రాంతంలోని ఉప్పు తయారు చేసే పరిశ్రమ వద్ద కూలిపోయింది. అందులోని పైలట్ సహా ముగ్గురు పారాచూట్ సహాయంతో క్షేమంగా బయటపడ్డారు. ప్రమాదంపై విచారణకు ఆదేశించినట్లు వైమానిక దళ అధికారులు తెలిపారు.